రామాయణం

# వాల్మీకి రామాయణం శాపములు-వరములు



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org    Mobile App: Free Gurukul    email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul    Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# వాల్మీకిరామాయణము శాపములు-వరములు

మరాఠీ మూలగ్రంథమునకు ఆంధ్రానువాదము


రచయిత

శ్రీపాద రఘునాథ భిడే ఎమ్.ఏ.

పూర్వ ప్రాధ్యాపకులు

సంగన బసవేశ్వర మహావిద్యాలయము

బీజాపూర్ (కర్ణాటక)

ఆంధ్రానువాదకులు

డా. ముట్నూరి సంగమేశం ఎమ్.ఏ.పిహెచ్.డి.

సంపాదకుడు

చలమచర్ల వేంకట శేషాచార్యులు



శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్సు

హైదరాబాదు

1996

# తెలుగుసంస్కరణాన్ని గూర్చి రెండుమాటలు

మిత్రవరులు డా.గ.న.సాఠేగారు తమంతటతామే, ఏ అపేక్షా లేకుండా, నాకు చేసిన సహకారం వల్ల నా మూల మరాఠీగ్రంథం 'వాల్మీకి రామాయణ్: శాప్ ఆణి వర్' ప్రచురించటం సాధ్యపడింది. రామాయణంలో లభించే శాపాలు, వరాలకు సంబంధించి ఇటువంటి పరిశీలనం తమకు తెలిసినంతవరకు ఎక్కడా జరగలేదనీ, ఇది కేవలం మరాఠీభాషకే పరిమితం కాకుండా సకలభారతీయులకు చేరాలనీ వారు భావిస్తూ ఉండేవారు. దీని అనువాదాన్ని హిందీ, ఇంగ్లీషు వంటి భాషల్లో అనువదింపచేసి ప్రచురించటం చాలా అవసరమని ఆయన అనేక పర్యాయములు నాతో చెప్పారు. అయితే, ఇది నాకు అసాధ్య మనిపించినా ఒక సుందరస్వప్నంగా భాసించింది. ఈ స్వప్నం వాస్తవరూపమై కనిపిస్తుందని నే నెన్నడూ ఊహించనైనా లేదు. అనుకోని విధంగా దీనికి కన్నడ, హిందీ భాషల్లో అనువాదాలు వెలువడ్డాయి. వీనికి పాఠకుల ఆదరణా, కేంద్ర సాహిత్యఅకాడమీ వంటి సంస్థల పురస్కారాలూ కూడా లభించాయి.

*'సంపత్ సంపద మనుబధ్నాతి'* అన్నట్లు నా సౌభాగ్యపరంపరగా భావించదగిన సన్నివేశం తెలుగులో కూడా ఈ గ్రంథం ప్రచురితం కావటం. దీనికి కూడా డా. సాఠేగారే చొరవచూపటం విశేషం. అప్పటికే తెలుగులో వాల్మీకి రామాయణానికి తాత్పర్యం రచించి, ప్రచురింపజేస్తున్న తమ మిత్రులు శ్రీ.సి.వి.శేషాచార్యులుగారితో సాఠేగారు కలిగించిన పరిచయం నా గ్రంథం తెలుగు అనువాదానికి నాంది పలికింది.

శ్రీ శేషాచార్యులుగారు నా కృషిపట్ల ఆసక్తితో దీనికి హిందీ ద్వారా తెలుగు అనువాదం చేయించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర కళాశాలలో హిందీ విభాగాధ్యక్షులుగా పదవీవిరమణచేసిన డా. ముట్నూరి సంగమేశంగారు దీనికి చక్కని ఆంధ్రానువాదం రచించారు. అందుకు వారికి నా కృతజ్ఞతాభి నందనలు తెలియజేస్తున్నాను. శ్రీ జయలక్ష్మి పబ్లికేషన్సు, హైదరాబాదు వారు దీన్ని ప్రచురించారు. ఈ విధంగా తెలుగులో ఈ గ్రంథప్రచురణకు కావలసిన అన్ని హంగులనూ శ్రీ శేషాచార్యులుగారు తమ సారథ్య, సంపాదకత్వాల ద్వారా సమకూర్చారు. వారికి నా హార్దికధన్యవాదాలు.

నా గ్రంథం ఆంధ్రసోదరుల కరకమలాలను అలంకరిస్తున్నందుకు ఈనాడు నా కెంతో ఆనందంగా ఉన్నది. మహారాష్ట్ర - ఆంధ్ర ప్రాంతాలు, మరాఠీ - తెలుగు భాషలూ, సాహిత్యం - సంస్కృతీ ప్రేమానుబంధంతో ఉభయులనీ సన్నిహితం చేస్తున్నవి. ఈ బాంధవ్యం ఈ నాటిది కాదు. తరతరాలుగా శతాబ్దాలుగా వస్తూ ఉన్నది. నానాటికీ ప్రవర్ధమానం అవుతున్నది కూడా. తెలుగుపాఠకులు నా ప్రయత్నాన్ని ఆదరిస్తారనీ, నా తక్కిన గ్రంథాలను కూడా తెలుగులో అనువదించి, ప్రచురింపజేసి నన్ను ప్రోత్సహిస్తారనీ ఆశిస్తున్నాను.

శ్రీ.ర.భిడే
27.11.1995

# సంపాదకుని తొలిపలుకు

శ్రీమద్వాల్మీకిరామాయణము ఆంధ్రతాత్పర్యసహితంగా ప్రచురించమని పలువురు మిత్రులు ప్రోత్సహించగా, అందులో 6 సంపుటాలు ముద్రితమై యుద్ధకాండ మొదటిభాగం ముద్రణలో ఉన్న సందర్భంలో అంతలో అనుకోకుండా నేను పూనాలో నెలరోజులు ఉండవలసివచ్చింది. అంతవరకు నా రామాయణ ప్రచురణలకై పూర్వవిరాళం పంపి, ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ ఉన్న ప్రా.డా.జి.యన్.సాఠేగారిని నేరుగా దర్శించే అవకాశం అప్పుడు తొలిసారిగా లభించింది. ప్రపంచవ్యాప్తంగా ముద్రితాలైన రామాయణ ప్రతులు, వానికి సంస్కృతవ్యాఖ్యానాలు, భాషానువాదాలు, గద్యపద్యకృతులన్నీ ఆయన తమ ఇంట్లో సాక్షాత్కరింపజేశారు. ఆయన మహాసంపన్నులేమీ కారు. అయితే నేమి? వజ్రసంకల్పులు. ఏ భాషలోనైన క్రొత్తగా రామాయణం, లేదా రామకథ గ్రంథంగా వెలువడిందీ అంటే అది సాఠేగారికి చేరిందన్నమాటే. వారికి రామాయణంతో కల అనుబంధం అటువంటిది. ఏ దేశవిదేశీయ గ్రంథాలయంలోను లభించనన్ని రకాల రామాయణాలను వారు సేకరించారు, పరిశీలించారు, సమీక్షించారు. వారే ఈ గ్రంథం ఇలా వెలువడటానికి ప్రథమకారణం.

ప్రా. సాఠేగారు ఒకసారి నాకు ఈ 'వాల్మీకిరామాయణం: శాపాలు - వరాలు' అనే గ్రంథానికి మూలగ్రంథమైన 'వాల్మీకి రామాయణ్: శాప్ ఆణి వర్' అనే మరాఠీగ్రంథాన్ని గూర్చి వ్రాస్తూ దాని 'సంగ్రహ విషయ ప్రదర్శిక'ను పంపటం జరిగింది. అది చదవగానే 'ఇట్టి గ్రంథం తెలుగులో వెలువడితే ఎంత బాగుంటుంది' అనిపించింది. వెంటనే సాఠేగారికి వ్రాసాను. వారిద్వారా ప్రా.శ్రీ.ర.భిడే గారి పరిచయభాగ్యం లభించింది. వారితో చిరకాలం కొనసాగిన పత్రవ్యవహారం కార్యరూపం ధరించి ఆంధ్రానువాదగ్రంథానికి అంకురార్పణం జరిగింది.

ప్రా.భిడే గారిని నేను నేటివరకు దర్శించుకొనలేకపోయాను. వారినీ వారి స్వభావాన్నీ వారి సువర్ణాక్షరాలవల్ల కొంతవరకు తెలుసుకోగలిగాను. మహావిద్యాలయంలో ప్రాధ్యాపకులుగా పనిచేసి ఆయన ఏ పరిస్థితుల్లో ఈ గ్రంథం ఎంత శ్రద్ధతో, అంతకుమించిన శ్రమతో రచించారో రాబోయే పుటల్లో వారి మాటల్లోనే తెలుసుకోవచ్చు. కార్యసాధనలో వారు అపరభగీరథులని ఈ గ్రంథం చదివాక మీకు అనిపించక మానదు. ఈ గ్రంథం ప్రచురణ సందర్భంలో ఆయన చూపిన ఆత్మీయత మరపురానిది. అనువాదప్రచురణలో

అసాధారణవిలంబం జరిగినా అత్యంతసహనంతో సహకరించిన సహృదయశిరోమణులు వారు.

అప్పటికే మూలగ్రంథానికి కన్నడఅనువాదం వెలువడింది. ఇంతలో శ్రీజగతాప్ గారు అనువదించిన హిందీసంస్కరణం కూడా వెలువడింది. ఈ మూడుభాషల్లోనూ, ఈ గ్రంథం అభినందనపరంపరలు అందుకుంది. కేంద్రసాహిత్య అకాడమి అవార్డులు దీనికి లభించాయి. తెలుగుసీమలో ఈ గ్రంథానికి ఎటువంటి ఆదరం లభించనున్నదో కాలమే తెలియజేస్తుంది.

ఈ గ్రంథాన్ని హిందీ అనువాదం ఆధారంగా తెలుగుచేసే భారం మాన్యమిత్రులు డా.ముట్నూరి సంగమేశం (విశ్రాంత హిందీ విభాగాధ్యక్షులు, శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, తిరుపతి) గారికి అప్పగించటం జరిగింది. అనువాదప్రక్రియలో వారు అందెవేసిన చేయి. కోరిన విధంగా వారి అనువాదం రెండు నెలల్లోనే చేరింది. ఈ గ్రంథం ఒక అనువాదమే అయినా, వీలయినంతవరకు ఇది ఒక స్వతంత్రగ్రంథంలా భాసించాలనే సదాశయంతో నేను అవసరమనిపించినచోట్ల సంస్కరించటం జరిగింది.

తెలుగువారు సామాన్యంగా చదివేది తెలుగులిపిలో, తెలుగుతాత్పర్యంతో ఉన్న వాల్మీకిరామాయణం కాబట్టి చాలావరకు నా ఆంధ్రతాత్పర్యంతో కూడిన రామాయణ ప్రతుల శ్లోకసంఖ్యనే ఈ గ్రంథంలోని శ్లోకాలవద్ద సూచించాను.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు ధార్మిక గ్రంథ ప్రచురణను ప్రోత్సహిస్తూ రెండు భాగాలలో ఈ గ్రంథం వెలువడటానికి ముప్పదివేల రూపాయలు - ఆర్థికసహాయం మంజూరు చేయటం జరిగింది. దురదృష్టవశాత్తూ నాకు కలిగిన నేత్రరోగం కారణంగా, వ్యాధినివారణం అయ్యేవరకు పని చేపట్టలేకపోయాను. సకాలంలో అవకాశాన్ని ఉపయోగించుకోని కారణాన ఆ సహాయం నిలిపివేయబడింది.

అనంతరం నేను కూకట్‌పల్లిలో శ్రీవివేకానంద సేవా సమితి అధ్యక్షుల వారిని కలిసి పరిస్థితి వివరించాను. ఆయన ఎంతో సహృదయతతో పరిస్థితిని గమనించి శ్రీ వివేకానంద సేవాసమితి పక్షాన పదివేలరూపాయిలు ఆర్థిక సహాయానికి వాగ్దానం చేశారు. ఇదికాక, వారు ఏర్పాటు చేసిన సమావేశంలో అశ్విని హోమియో&ఆయుర్వేదిక్ ప్రోడక్ట్స్ అధినేతలు శ్రీ బచ్చు సుబ్బారావు గారు ఐదువేల రూపాయల ఆర్థికసహాయాన్ని ప్రకటించారు. ఇంకను మరికొందరి సహకారం కూడా లభించునని విశ్వసిస్తున్నాను.

ఈ గ్రంథం ఈ రూపంలో వెలుగుచూడటానికి తోడ్పడుతున్న సహృదయు లందరికీ నా హార్దిక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

*శ్రియఃకాంతాయ కల్యాణనిధయే నిధయేఽర్థినామ్,*
*శ్రీవేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళమ్.*

-చ. వేం. శేషాచార్యులు

# నేను నేడు శాపవిముక్తుడ నయ్యాను
[మరాఠీ మూలానికి భూమిక]

గత నాలుగు, నాలుగున్నర సంవత్సరాలనుంచీ నా కెవరూ శాప మీయకపోయినా నిశ్చయంగా నేను శాపగ్రస్తుడనే. 'ముద్దేబిహాళ్' బీజాపూరు జిల్లాలోని ఒక తాలూకాలో ముఖ్యగ్రామం. అక్కడి 'మాతోశ్రీ గంగవ్వా మహావిద్యాలయం' లో గ్రంథాలయాధికారి, యుపకుడు, పండితుడూ అయిన శ్రీ సిద్దప్ప కన్నడీ ఒకసారి నా వద్దకు వచ్చి 'శాపం' ఇచ్చినంతపని చేశారు. శాపాలు, వరాల కల్పన బహుప్రాచీనమై, రామాయణ, మహాభారతాది గ్రంథాలలో అవి అధికసంఖ్యలో ప్రయోగింపబడినప్పటికీ కన్నడంలో ఎక్కడా వాటి సమగ్ర పరిచయం లభించటం లేదని వారు ఖేదం వెలిబుచ్చారు. మరాఠీలో ఇటువంటి గ్రంథమేదైనా ఉన్నదా? లేకుంటే ఆ లోటు తీర్చవలసినదంటూ నన్ను ఆయన కోరారు. వారికి నాయెడ ఉన్న ఆదరానికీ, విశ్వాసానికీ నాకెంతో సంతోషం కలిగింది. విషయంలోని నూతనత్వం నన్నెంతో ఆకట్టుకుంది. అంతలోనే నా రామాయణ మహాభారతాది ప్రాచీనగ్రంథాల అధ్యయనం శూన్యప్రాయ మనే విషయం తలచుకొని సిగ్గుపడ్డాను. ఆయన ప్రార్థనకు నా అంగీకారం గానీ, తిరస్కారంగానీ వ్యక్తం చేయకుండానే కొంత గడువు అడిగి, ఈ దిశలో ఏదో కొంత ప్రయత్నిస్తానని ఆయనకు ఊరట కలిగించాను. కొన్నాళ్లకు పని పడి పూనా వెళ్లినప్పుడు అక్కడ పండిత మహాదేవశాస్త్రి జోశీగారిని కలిసికొని ఆయనకు నా 'శాప' కథనూ, మనోవ్యథనూ తెలియజేశాను. అప్పటివరకు నేను వాల్మీకిరామాయణం పూర్తిగా చదవనైనా లేదు. మరాఠీలో ఇటువంటి గ్రంథం లేదని చెప్పటమే కాక శాస్త్రిగారు నన్నటువంటి గ్రంథం వ్రాయమని పట్టుబట్టారు. వరాల పరిశీలన లేకుండా శాపాల అధ్యయనం అసమగ్రమే అవుతుంది కాబట్టి, కేవలం శాపపరిశీలన కాక శాపవరాలు రెంటినీ పరిశీలన చేయమని వారు సూచించారు. ఈ విధంగా నాకు పండిత మహాదేవశాస్త్రి జోశీ గారినుండి వరం లభించింది. నాకు ఇద్దరు పండితులనుండి శాపము, వరమూ లభించాయి. అయితే రామాయణంలో తృణబిందుకన్య విషయంలో జరిగినట్లు నాకు శాపం కూడా వరంగానే పరిణమించింది.

నేను నా విద్యార్థిదశనుండి గత ఏభై ఏళ్లుగా శాస్త్రిగారి మార్గదర్శనం వల్ల లాభం పొందుతూనే వచ్చాను. వారి ప్రేరణలో నేను అధ్యయనం మొదలుపెట్టాను. శాపాలు, వరాలకోసం వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు,

రామాయణం, మహాభారతం, భాగవతం వంటి ప్రాచీనగ్రంథాలన్నీ పరిశీలించటం తప్పనిసరి అని నాకు అవగతమయింది. ఇది నా శక్తిసామర్థ్యాలకు మించిన పని. కాబట్టి నేను నా దృష్టిని కేవలం ఒకే గ్రంథం - ఆదిమహాకావ్యం - పై కేంద్రీకరించాను. విషయవైపుల్యం, నా అసమర్థతలు అనుభవానికి వచ్చేసరికి ఈ కార్యం నావల్ల చక్కబడదని అనిపించసాగింది. నే నీ పని విడిచి పెట్టేవాడినే, అంతలోనే నాకు విద్వాంసు లిద్దరితో పరిచయం కలిగింది. అనతికాలంలోనే ఆ పరిచయం స్నేహంగా మారింది. వారి ప్రోత్సాహంతోనే నే నింతవరకూ రాగలిగాను.

ఉడిపి క్షేత్రంలోని శ్రీ పూర్ణప్రజ్ఞ సంస్కృత మహావిద్యాలయంలో పూర్వం ప్రాచార్యులైన శ్రీ కవలగీ శేషాచార్యులు గారి సాంగత్యంవల్ల నాకు రామాయణసౌందర్యం దర్శించే భాగ్యం కలిగింది. సంస్కృతసాహిత్యాన్ని విస్తృతరూపంలో వ్యాఖ్యాదిసహితంగా అధ్యయనం, విభిన్నభాషల్లో పాండిత్యం, అవధిసీమ నధిరోహించిన సౌజన్యం, లాభాపేక్ష లేకుండానే సహాయపడాలనే ఆసక్తి, ఇటువంటి దుర్లభాలైన గుణాలన్నీ కలబోసుకొన్న ఆ మహనీయునిపై నా ఆదరం ప్రవర్ధమానమయింది. ఆయన ప్రోత్సాహము, సహాయము లేకుంటే నా చేతులమీదుగా ఈ లేఖనం పూర్తి అయ్యేది కాదు. పుస్తక ముద్రణం పూనాలో జరుగుతూ ఉండగా, ఆయన మైసూరునుండి తప్పొప్పుల పట్టిక వ్రాసి పంపారు. డెబ్భైఐదు సంవత్సరాలవయసు పైబడిన ఆయన పరిశ్రమా, ఉత్సాహం, మనోబలం, కార్యదక్షతా చూచి ఆయన ముందు వినమ్రుడ నవుతూ ఉంటాను.

రెండవవిద్వాంసులు బొంబాయిలోని పోద్దార్ మహావిద్యాలయంలో పూర్వం హిందీవిభాగాధ్యక్షులూ, కనిష్ఠమహావిద్యాలయం (జూనియర్ కాలేజి) ప్రిన్సిపాలూ అయిన డా.గ.న.సాఠేగారు. ఆయన పరిచయం ఒక్క లేఖతోనే జరిగింది. అయితే ఆయన వ్రాసిన ఆ లేఖ నా ఎదుట నిలబడి ఆయన మాట్లాడుతున్నట్లే ఉంది. డా.సాఠే రామాయణంలో విశేషజ్ఞానం కలవారు. ఆయన విభిన్న భారతీయభాషల్లోని రామాయణాల తులనాత్మక అధ్యయనం చేసినవారు. మాతృభాష మరాఠీతో సమానంగా హిందీభాషపై వారికి గల పట్టూ, నిరంతరాధ్యయనవ్యగ్రతా కారణంగా వారి పరిచయము, స్నేహము నాకు వరమిచ్చినట్లయింది. నా లేఖనాన్ని సమగ్రంగా పరిశీలించి, వారు అమూల్యములైన సూచన లివ్వటమే కాక, నేను బీజాపూరులో ఉండటంవల్ల అక్కడ ముద్రణ

ఏర్పాట్లు చేయటం సులభం కాదని గమనించి, తామే స్వయంగా నాకు సహకరిస్తామని మాట యిచ్చి, దీన్ని తమ గ్రంథంలా ముద్రించటానికి తగు ఏర్పాట్లు చేశారు. ఆయన నాకై అంతులేని శ్రమ పడ్డారు. అమూల్యసమయం వెచ్చించారు. వారి ఈ ఋణం నుంచి నేనెలా బయట పడగలను? ప్రస్తుతం ఆయన సంత్ ఏకనాథుని భావార్థరామాయణాన్ని హిందీలో అనువదిస్తున్నారు. వా రా పని ప్రక్కకు పెట్టి నా పుస్తకముద్రణానికి చేయూత నిచ్చారు. నా యీ పుస్తకపు లోరూపు తీర్చిదిద్ది దాన్ని ఉపాదేయంగా చేసిన సౌభాగ్యం ఈ ఇద్దరు ప్రాచార్యులకే దక్కవలసిఉన్నది.

పూనాలోని కాంటినెంటల్ ప్రకాశన్ వంటి పరమ మాననీయ ప్రకాశన సంస్థ ఈ గ్రంథ ప్రచురణ చేపట్టటం నాకు గొప్ప గౌరవమనే చెప్పాలి. మిత్రవరులైన శ్రీ అనంతరావు కులకర్ణి గారికి గ్రంథాలపై గల ప్రీతి, అభిరుచి, సౌందర్యదృష్టి, నిర్మలమూ, నిర్మోగమూటమూ అయిన వ్యవహారం, అలసటలేమి మొదలైన గుణాలూ, ప్రచురణరంగంలో ఏబదిసంవత్సరాల ఎడతెగని వ్యాసంగం కారణంగా ఈ ప్రకాశనసంస్థకు ప్రతిష్ఠ లభించింది. శ్రీ అనంతరావు పాల్ కర్ పుస్తకానికి ముఖపత్రచిత్రం నిర్మించి యిచ్చారు. ఈ విధంగా అనంతహస్తాలనుంచి ఈ గ్రంథానికి సౌందర్యం, సౌష్ఠవం లభించినవి.

వీరే కాక నా ధార్వాడ్ మిత్రులు శ్రీ వి.వా. గోఖలే, బీజాపూర్వారైన శ్రీ మధుకృష్ణజోశీ, పూనావాసులైన శ్రీ అమరేంద్ర గాడ్గిల్, బీజాపూర్ వారైన ప్రొ.గోపాలన్ గార్లు వ్రాతప్రతి చదివి ఎన్నో ఉపయుక్తసూచన లిచ్చారు. వీరితో బాటు నా పరివారసభ్యులు నన్ను ప్రోత్సహించటమే కాకుండా నేను విడిచివేసిన ఎన్నో విషయాలు నా దృష్టికి తెచ్చారు. నా చిన్న మనుమడు చి.అమేయుడు నాకు సమయపాలనాన్ని గుర్తుచేస్తూ వచ్చారు. గాయత్రీ ముద్రణాలయపు శ్రీ శాం.దే.జోశీ గ్రంథం చక్కగా ముద్రించారు. వీరందరకీ నా ధన్యవాదాలు.

పాఠకుల కీ గ్రంథం సమర్పిస్తూ నేడు నిజంగా నేను శాపముక్తుడిని అవుతున్నాను.

ది. 26 జనవరి 1987

-శ్రీ.ర.భిడే. బీజాపూర్

# ఋణం కృత్వా.....

ఎక్కడినుండైనా కానీ, ఎంతైనా కానీ ఋణం పొందటం నాకు ఇష్టం. ఇందులో తల్లి, తండ్రి, గురువుల ఋణాలతో సమానంగా గ్రంథాల ఋణాలూ, మిత్రుల ఋణాలూ కూడ అతివిలువైనవి, ఆశపడదగినవీకూడా. నేను ఎవరెవరివద్ద చేయి చాచి సహాయ మర్థించానో వారందరూ నాకు వెంటనే ఎంతో ప్రసన్నులై నిండు చేతులతో సహాయపడిరి. ఎవరూ విముఖత చూపించలేదు. ఎవరి ఇంటినుండీ నేను రిక్తహస్తాలతో వెనుదిరగలేదు. కొన్ని ఋణములు తీర్చాలనిపించదు. కొన్ని ఋణాలు తీరేవి కావు. గ్రంథముల మరియు మిత్రుల ఋణము ఈ రెండవజాతికి చెందినదే. దీనికి ప్రతిఫలాపేక్షే ఉండదు. మరి దీనికై నే నెందుకు చింతించాలి?

ఈ గ్రంథము తయారుచేయుటలో నాకు ఎంతోమంది సహాయం కావలసివచ్చింది; అదంతా నేను పొందాను కూడా. ఈ గ్రంథము వ్రాత, ముద్రణ, ప్రచురణ దశల్లో ఎవరెవరు నాకు సహాయపడ్డారో, వారందరి సూచికా కడుజాగ్రత్తతో తయారుచేయుటకు లక్షప్రయత్నాలు చేసినప్పటికీ ఆ పని సమగ్రం కానేరదు. పొరపాటుగా ఏ వ్యక్తినైనా, ఏ సంస్థనైనా మర్చిపోయినట్లయితే అది వారిపట్ల అన్యాయమే అవుతుంది. కేవలము ఇదే కారణం వల్ల నేను కావాలనే ఆ శ్రేయోనామావళిని ఇవ్వాలనుకోవటంలేదు. ఇందుకు నేను క్షమించగోరుచున్నాను. నాకు ఎవరెవరినుండి, ఏ సంస్థలనుండి సహాయము లభించిందో వారికి సదా నేను ఋణపడి ఉండా లనుకుంటాను. మరియు కృతజ్ఞతతో చేతులు జోడించటం ఇష్టపడతాను.

ఋణకర్త అవటం చాలా తేలిక. నేను యథాశక్తిగా అవసరమైనంత ఋణం చేశాను. నేను నా ఈ గ్రంథంద్వారా శీర్షికలో పేర్కొన్న పూర్వార్థం యథార్థం చేశాను. ఉత్తరార్థం కూడా సిద్ధించాలని కోరుకుంటున్నాను. అయితే అది సిద్ధించటం నా చేతుల్లో లేదు. ఆ అధికారం పూర్తిగా పాఠకులూ, పండితులూ, విమర్శకులదే. 'నాకు వరమివ్వండి' అని ఇంతమాత్రమే నేను వారిని ప్రార్థించగలుగుతున్నాను.

- శ్రీ.ర.భిడే

# లేఖనానికి పరిమితులు

ఇది శాపాలు, వరాలకు సంబంధించి రామాయణం అధ్యయనానికి చేయబడ్డ ఒక ప్రయత్నం మాత్రమే. ఇది కేవలం ఒక సంకలనం (కూర్పు), రామాయణంపైన రచింపబడ్డ పరిశోధనగ్రంథం (థీసిస్) కాదు. అధ్యయనానికి అవధులు నిర్ణయింపబడ్డాయి. వివరణ మంతా ఆ అవధులకు లోబడే సాగింది.

ఇది కేవలం వాల్మీకి రామాయణాన్ని మాత్రమే పరిశీలించే ప్రక్రియ. వాల్మీకిరామాయణం తప్ప, వేరే రామాయణాలు కాని, వాల్మీకి రామాయణంలోనివి కూడా శాపాలు-వరాలతో సంబంధం లేని ఇతరవిషయాలు కానీ ఇందులో ప్రస్తావించబడలేదు.

వాల్మీకి రామాయణంలో లభించే శాపాలూ, వరాలూ సమగ్రంగా సేకరించేందుకు సకలజాగ్రత్తలూ తీసికొన్నప్పటికీ ఒకటి రెండు శాపాలో, వరాలో ఎక్కడైనా వదలివేయబడే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేను.

ఇందులో వాల్మీకిరామాయణంలోని 61శాపాలూ, 82 వరాలూ విస్తృత రూపంలో వివరించే ప్రయత్నం జరిగింది. ప్రతి ఒక్క శాపానికీ, వరానికీ పూర్వసందర్భం, సంస్కృతమూలం, హిందీ అనువాదం ఇవ్వబడింది. అవసరాన్ని బట్టి విశేషవివరణకూడా ఇవ్వబడింది. దానితోబాటే శపథం, సత్యప్రతిజ్ఞ, ఆశీర్వాదం, మొక్కుబడి, ఆకాశవాణి, పుష్పవృష్టి వీని వివరణ కూడా శాపాలతో లేదా వరాలతో వీటికి గల పోలికనో, తేడానో స్పష్టంచేయటానికి కావలసినంతవరకే పరిమితం చేయబడింది. దీనికి సంబంధించి ఇవ్వబడ్డ ఉదాహరణలు సమగ్రాలు కావు. శాపాలు, వరాలను వివరించే సందర్భంగా ఏ యే వ్యక్తులు, స్థానాలు ప్రస్తావించబడినాయో, వాని సంక్షిప్తపరిచయం అకారాదిక్రమంలో వేరే అధ్యాయంలో ఇవ్వబడింది. అంతేకాక సందిగ్ధశాపాలూ వరాలుకూడా మరో అధ్యాయంలో వివరించబడ్డాయి. 'శాపాదపి వరాదపి' అనే సుదీర్ఘప్రస్తావనలో శాపాలకూ, వరాలకూ సంబంధించి అనేకవిషయాలు చర్చించబడ్డాయి. శాపసూచి, వరసూచి ఇవ్వటంద్వారా గ్రంథానికి సమగ్రత ఇచ్చే ప్రయత్నం జరిగింది.

వాల్మీకిరామాయణం మూలం (శ్లోకం)తో కూడిన అనేక సంస్కరణాలు వివిధ సమయాల్లో ప్రచురింపబడ్డాయి. అందులో కొన్నింటిలో సంస్కృతటీక, భారతీయభాషల్లో చేయబడ్డ అనువాదాలూ లభిస్తున్నాయి. బొంబాయికి సంబంధించిన నిర్ణయసాగర్ ముద్రణాలయం, గుజరాతీ ప్రింటింగ్ ప్రెస్సు, గోరఖ్‌పూరులోని

గీతా ప్రెస్సు, పూనాలోని శ్రీరామకోశ మండల్ వార్ల సంస్కరణాలతో బాటు, మద్రాసు, కుంభకోణం, కలకత్తా, బరోడాలనుండి ప్రకాశితమైన సంస్కరణాలు కూడా విశేషించి చెప్పుకోదగ్గవే. బరోడాలోని ఓరియంటల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో వాల్మీకిరామాయణం సంశోధిత శుద్ధపాఠం ముద్రితమై ఉన్నది. కాబట్టి ఆ సంస్కరణపు మూలానే ఆధికారికంగా స్వీకరించటం జరిగింది. ఈ సంస్కరణకు సంబంధించిన మూలాన్ని స్వీకరించటమే సముచిత మయినప్పటికీ ఈ సంస్కరణప్రతులు అత్యంత ధనసంపన్నమైన పెద్ద పెద్ద గ్రంథాలయాలలో మాత్రమే లభిస్తున్నవి. చాలా కళాశాలల్లో, విశేషించి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే సంస్థల్లో ఈ సంస్కరణప్రతి చూడటానికి కూడా లభ్యం కాదు. ఈ గ్రంథం ఇప్పుడు దుర్లభం కావటం వల్ల సామాన్య పాఠకులకు లభించటంలేదు. 'వాల్మీకిరామాయణం: శాపాలు-వరాలు' అనే ఈ గ్రంథం సామాన్యపాఠకులకోసం కాబట్టి, సులువుగా లభించే వాల్మీకిరామాయణం మూలప్రతిని సంపాదించటం వారికి అవసరం. కేవలం ఈ ఉద్దేశ్యంతోనే గీతాప్రెస్, గోరఖ్‌పూర్ వారి ప్రతిలోని మూలగ్రంథాన్నీ, అందులో కనిపించే లోపాలను కూడా దృష్టిలో పెట్టుకొని కూడా, స్వీకరించటం జరిగింది.

వాల్మీకిరామాయణానికి అయిదు మరాఠీ అనువాదాలు లభిస్తున్నవి. వాటిలో స్వ. కాశీనాథ్ శాస్త్రీ లేలే గారి అనువాదం అన్నింటిలోనూ ప్రాచీనం (క్రీ.శ. 1897-1901) అవటంవల్ల వివరణకు దాన్ని ఆధారం చేసికోవటం జరిగింది.

వ్యక్తిపరిచయం, స్థలపరిచయం సిద్ధంచేసే సమయంలో స్వ.సిద్ధేశ్వరశాస్త్రీ చిత్రావ్‌గారి 'ప్రాచీన చరిత్రకోశ్' (మరాఠీ), శ్రీ అమరేంద్ర గాడ్గిల్‌గారు సంపాదకత్వం వహించిన శ్రీరామకోశ్ (మరాఠీ) గ్రంథాల సహాయం తీసికొనటం జరిగింది. కొన్నిచోట్ల మూలశ్లోకాలు యథాతథంగా స్వీకరిస్తే, మరికొన్ని చోట్ల వాటిలో కొద్దిగొప్పో మార్పు చేయబడింది. ప్రస్తావనకై ఏ గ్రంథాల సహాయం తీసికోబడిందో వాటి సూచిక వేరేచోట ఇవ్వబడింది. ఈ సకలగ్రంథాలూ, వాని రచయితల ఋణం నుంచి విముక్తి పొందటం సాధ్యమయ్యేది కాదు. వారికి నా కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను.

శాపాలు, వరాలను వివరించే సందర్భంలో > గుర్తు వాడటం జరిగింది. ఈ గుర్తు గణితంలోనూ కనుపిస్తుంది. అయితే ఇందులో ఆ గణితానికి సంబంధించిన అర్థం అభిప్రేతం కాదు. ఏవ్యక్తి నోటినుండి శాపంగాని, వరం గాని వెలువడిందో ఆవ్యక్తి పేరుకు ముందు > గుర్తు ప్రయోగించబడింది.

# కృతజ్ఞతలు

ఈ గ్రంథప్రచురణకు అమోఘమైన ఆశీస్సు లందించిన మిత్రపుంగవులు డా.జి.యన్.సాఠే గారికీ-

ఆత్మీయతతో తెలుగులో ఈ గ్రంథప్రచురణానికి అనుమతించిన రచయిత ప్రొ. శ్రీపాద రఘునాథ భిడే గారికీ-

అనుకున్న అవధిలోపలనే తెలుగులో అనువాదం అందించి, మమ్మల్ని ఆనందింపజేసిన డా. ముట్నూరి సంగమేశం గారికీ-

"అంతా ఆయనే, అన్నీ ఆయనవే" కాగా ఈ గ్రంథానికి .తా నీయదలచిన ఆర్థికసహకారాన్ని, 'దైవం మానుషరూపేణ' అన్నట్లు సహృదయులు పలువురి మదిలో ప్రవేశించి, తద్వారా ఆ సహకారం అందించిన మా ఇలవేల్పు ఏడుకొండల శ్రీనివాసస్వామికీ, అలా సహకారం అందించిన భగవత్స్వరూపులు, సహృదయశేఖరులకూ-

స్వయంగా గ్రంథానికి సంపాదకత్వం వహించి సర్వాంగసుందరంగా గ్రంథాన్ని తీర్చిదిద్దిన శ్రీ శేషాచార్యులుగారికీ-

కంప్యూటర్ ద్వారా చక్కని అక్షరాలతో గ్రంథాన్ని ముద్రించిన డిజిటల్ గ్రాఫిక్స్ వారికీ- ఆఫ్‌సెట్ ద్వారా ముద్రించి యిచ్చిన శ్రీ కళాంజలి గ్రాఫిక్స్ అధినేతలు శ్రీ గోపీనాథరెడ్డి గారికీ-

నాల్గురంగుల్లో అట్టను అందంగా ముద్రింపజేసిన మిత్రుడు శ్రీ మురళీధర్ గారికీ-

కడుశ్రద్ధతో బుక్ బైండింగ్ నిర్వహించిన శ్రీ వేణుగోపాల్‌కూ-

దీని పంపిణీ బాధ్యతలు స్వీకరించిన M/s. శ్రీ గోపాల్ పబ్లికేషన్సు వారికీ మా హృదయపూర్వకకృతజ్ఞతలు.

-ప్రకాశకులు

# విషయసూచిక


| విషయము | | పుట |
|---|---|---|
| 1. | శాపాదపి వరాదపి | 1 |
| 2. | శాపములు | 85 |
| 3. | శపథములు | 161 |
| 4. | వరములు | 169 |
| 5. | ఆశీస్సులు - మొక్కుబడులు | 299 |
| 6. | వ్యక్తి పరిచయము | 309 |
| 7. | స్థల పరిచయము | 409 |
| 8. | పరిశిష్టము | 421-440 |
| | 1. అస్పష్టశాపవరములు | 422 |
| | 2. శాపములకు విభిన్నకారణములు | 431 |
| | 3. శాపపరిణామములు | 432 |
| | 4. శాపముల పరిష్కరణము | 433 |
| | 5. వరములకు విభిన్నకారణములు | 434 |

# శాపాదపి వరాదపి

భారతీయుల సాంస్కృతిక జీవన నిర్మాణమున వేదములు, ఉపనిషత్తులు, పురాణములు, రామాయణము, మహాభారతము, భగవద్గీత, భాగవతము మున్నగు గ్రంథము లందించిన సహకారసంపద అమూల్యము. ఈ గ్రంథములు భారతీయసంస్కృతికి అభిన్నమైన అంగములు. పై వానిలో భగవద్గీత స్వతంత్ర గ్రంథము కాదు. అది మహాభారతములోని భీష్మపర్వమునం దొక భాగము. అయినను, దానిని ప్రత్యేకగ్రంథముగనే ఆదరించుచున్నారు. అందుకు కారణము, దానిలో అభివ్యక్తమైన భావనాసంపద. శతాబ్దులు గడచిపోయినను, ఆ గ్రంథమునకు గల క్రొత్తదనము, లోకప్రియతయు ఆవంతయు తరిగిపోలేదు. ఈ గ్రంథములు నిర్మింపబడినది మొదలు, నేటివరకును అత్యుత్తమ ధార్మిక గ్రంథములుగనే పరిగణింపబడుచు పూజనీయములై వెలుగుచున్నవి. అయితే ఇంతమాత్రముచేతనే అవి భారతీయ ప్రజాహృదయమున శాశ్వతస్థాన మందుకొన్నవని అనలేము. ఈ గ్రంథములలో చిత్రించిన మానవజీవన దృశ్యములు, సమాజము కట్టెదుట అవి నిర్దేశించిన ఆదర్శములు, నిరూపించిన ధార్మికతత్త్వములు, జీవనవిధానములు, మానవస్వభావమును వర్ణించు పట్ల అవి ప్రదర్శించిన బహుముఖ చిత్రకాంతులు సమాజమును ప్రభావిత మొనర్చినవి. దానికి కారణము అవి సత్యముపై ఆధారపడియుండుటయే. ఈ గ్రంథములను ధార్మికగ్రంథము లనుటచే ఇవి దేవతల గుణగాన మొనర్చునవి యని, వారి ఉత్కర్షను చాటి చెప్పినవి యని, దైవీశక్తిపూరితము లని అనుకొనుట సహజము. కాని అది ఆంశికసత్యము. వాస్తవమునకు, ఈ గ్రంథములు సర్వవిధములా మానవులకు సంబంధించినవి. వీటిలో దేవతల లీలావర్ణనముకంటె, ఎక్కువగా మానవుల కార్యములు, గుణములు, వీరత్వము వంటివే ప్రశంసింపబడెను. వీనిలో దేవతావిషయము లెంతగా నున్నను, మానవులు నిర్వహించిన కార్యము లత్యంత మనోహరములుగా గోచరించును. ఈ గ్రంథములలో వర్ణించిన కథలు, పాత్రలు, తత్త్వములు,

సంపూర్ణముగా మానవులకు సంబంధించినవే. ఇందు వర్ణింపబడిన సుఖదుఃఖములు, కీర్తి-అకీర్తులు, గుణాపగుణములు మన స్వంతములు. ఈ గ్రంథములలోని మానవాసాధారణములైన (Superhuman) కృత్యములు, వాస్తవమునకు మహామానవీయములు. సాహిత్యపరముగా కూడ నీ గ్రంథములకు గల విలువ అసామాన్యము. కాలమే వీని చిరస్థాయిని నిర్ధారణ చేసినది. రత్నాకరమువలె ఈ గ్రంథములు ఉదాత్తగుణ సంపన్నములు. ఎందరో విద్వాంసులు, వేర్వేరు సమయములలో ఈ గ్రంథముల సౌందర్యపు విభిన్నరీతులను మన కెరిగించిరి. అధ్యేతృగణమును, అనుసంధానకర్తలును ఎంతగనో శ్రమించి, ఈ గ్రంథములకు శుద్ధప్రతులు నిర్మించిరి. ఎన్నో కావ్యనాటకాదులు లలితకళాకృతులు ఈ గ్రంథము లాధారముగ ఉద్భవించినవి. ప్రజల కీ గ్రంథములపై గల ప్రేమాదరము లెన్నటికిని తరుగవు. వీటి గొప్పదనమును వర్ణించుటకు శబ్దములు చాలవు.

అదికవి వాల్మీకి వ్రాసిన రామాయణము, వందలకొలది సంవత్సరముల నుండి దీపస్తంభమువలె నిల్చి మానవులకు మార్గదర్శన మొనర్చుచున్నది. దీని శ్రేష్ఠత వర్ణనాతీతము. "భూతలమున నెంతకాలమువరకు నదీపర్వతములు నిలిచియుండునో అంతవరకు రామాయణకథ ప్రజలలో ప్రచారమున నుండు నని బ్రహ్మగారి భవిష్యవాణి. సమయ మీ వాణి సత్యమని ఋజువు చేసినది. 'వాల్మీకిమహర్షి లేకున్నచో రామాయణ మెట్లు లభించెడిది?' అని మహారాష్ట్రసంత్ కవి రామదాసు ప్రశ్నించెను. ఈ కథ బ్రహ్మాండమును భేదించి బయటకు కొనసాగవలె నని అతని ఉత్కటాశయము. రామాయణమునకున్న విశిష్టత ఏమనగా- ప్రజలకు తమ స్వీయసోదరుడు వాస్తవ మనిపించడు; భరత లక్ష్మణులు నిజమైన సోదరు లనిపింతురు. తన భార్య వాస్తవ మనిపించదు. సీత వాస్తవ మనిపించును. తన పతి నిజ మనిపించదు. రాము డెక్కువ సత్యమని తోచును. ఈ విధముగా మూడు కాలములయందును చెక్కుచెదరని సంస్కృతి రామాయణమందు చిత్రింపబడెను. 'రామాయణము భారతీయసంస్కృతి కాదర్శము. అది భారతీయసంస్కృతిని తదుచితదిశాముఖముగా త్రిప్పి నడుపుచు భారతీయజీవనమును ఉదాత్త మొనర్చెను' అని స్వర్గీయ రవీంద్రనాథ ఠాగోరుగారు ప్రశంసించిరి. మరాఠీ శ్రీరామకోశ సంపాదకులు శ్రీ అమరేంద్ర గాడగీల్ గారు ఈ గ్రంథమాహాత్మ్యమును వర్ణించుచు 'రామాయణము వాస్తవికసంఘటనను మహాకావ్యముగా మలిచిన ఐతిహాసికమహాకావ్య మనియు, అది మన ప్రాచీన రాష్ట్రీయ ఇతిహాస' మనియు పలికిరి. రామాయణవిశేషజ్ఞులైన డా.గ.న.సాఠేగారు

వాల్మీకిరామాయణము భారతీయసంస్కృతిని, భారతీయ జీవనాదర్శమును ప్రదర్శించు చిత్తరు' వని వచించిరి. వాల్మీకి దీనిని కావ్యరూపమున రచించెను. ఈ కావ్యము ఆదర్శమహాకావ్యముగా స్వీకరింపబడెను. దండి మున్నగువారు దీనినే ఆధారముగా గ్రహించి మహాకావ్యతత్త్వములు నిర్ధారణ మొనర్చిరి. ప్రపంచములోని అయిదు వరిష్ఠమహాకావ్యములలో దీనికి పరిగణన మబ్బినది. కనుకనే భారతీయకావ్యమర్మజ్ఞులు దీని కావ్యరూపమును సర్వశ్రేష్ఠమైనదిగా మన్నించిరి. పైగా విదేశీయకావ్యప్రియులు కూడ ఇందలి రసము నాస్వాదించి దీని నెంతగానో గౌరవించిరి.

రామకథ వాల్మీకికి పూర్వమే కలదు. నారదు డీ కథను వాల్మీకి కెరింగించెను. ఈ విన్నదాని ననుసరించి రామచరిత్రను వ్రాయుమని బ్రహ్మ ప్రేరేపించెను. రామాయణరచనలో శాపములకు, వరదానములకు గల స్థానము అతివిశిష్టమైనది. నారదుని సంక్షిప్త రామచరిత్రలో శాపము లంతగా వినబడవు; కాని వరదానములు తప్పక గోచరించును. వాల్మీకి నిషాదుని కిచ్చిన శాపము రామాయణరచనకు కారణము కాగా, దుర్వాసుని శాపనిరోధము రామాయణ సమాప్తికి కారణమైనది. దుర్వాసునియొక్క షరతులను కాదని శాపమునకు పాల్పడి రఘువంశమే నశించునేమో అన్న భయముచే లక్ష్మణుడు ఆత్మత్యాగ మొనర్చి వంశనాశమును నివారించెను. బ్రహ్మదేవుని వరబలముచే వాల్మీకి రామాయణము రచించెను. కాని దశరథుడు కైక కిచ్చిన వరము ప్రత్యక్షముగా కథ నడిపించెను. రావణునికి లభించిన అమరత్వమునకు అవధులు ఉన్నను అతని అత్యాచారములు హద్దులు దాటిపోయినవి. మేఘనాదుడు దేవతలపై విజయము సాధించెను. కాని కుంభకర్ణుడు నిద్రావశుడయ్యెను. హనుమంతుని సహజశక్తి అష్టదిక్పాలకు లిచ్చిన వరములచే అసాధ్యమునే సాధ్య మొనర్చి చూపెను. ఈ గ్రంథమున పలుమార్లు వరశాపముల ప్రసక్తిని బట్టి దీనిని శాపకథ అని గాని, వరకథ అని గాని చెప్పినను అతిశయోక్తి కాదు. రామాయణములోని కథ లెన్నిటికో శాపమో, వరమో అధారముగా గోచరించును. పాత్రల శీలచిత్రణమునందును వీటి ప్రభావము కనిపించును. శాపములకు గాని, వరములకు గాని స్వతంత్రాస్తిత్వము లేకున్నను కథావస్తువున కివి అభిన్నాంగములై, విడదీయుటకు వీలు కలిగించవు. వీటిని విడివినచో కథాసూత్రము తిరిగి జోడింపబడుట అసంభవము. దాని అల్లికగాని, సందర్భముల అమరికగాని చక్కగా నిర్వహింపబడజాలదు. ఈ వరశాపముల కల్పన అతిప్రాచీనమైనను

వాల్మీకి తన ప్రతిభాకౌశలములచే గ్రంథమును కూర్చి దానిని సుందరము, సమగ్రము, సంగతముగా నొనర్చెను. ఇది ఎంతయు ప్రశంసార్హము

వేదములు, ఉపనిషత్తులు, విశేషముగా రామాయణ, మహాభారత, భాగవతములు, తక్కిన ప్రాచీన పురాణ కావ్యభండారము మున్నగువాటిలో పలుచోట్ల శాపములో, వరములో పేర్కొనబడుచుండును. వాటినన్నిటిని శ్రద్ధగా చదివి సంగ్రహించినచో అత్యంతశ్రేష్ఠమైన గ్రంథ మొకటి నిర్మింపబడగలదు. వరశాపముల అధ్యయనమువలన, తంత్సబద్ధగ్రంథముల స్వరూపము, వాటిలో పేర్కొనబడిన సామాజిక సాంస్కృతిక ధార్మిక నైతిక జీవనప్రణాళిక, చారిత్రకవిశిష్టతలు మున్నగువాటిచే ఉపయుక్తమగు జ్ఞాన మెంతయో లభింపగలదు. వ్యాసవాల్మీకులవంటి ప్రజ్ఞావంతులు తమ గ్రంథములలో వరశాపముల కేల తావు కల్పించిరి? ఈ శాపములు గాని, వరములు గాని ఎప్పుడు జనించినవి? ఇవి ఈ గ్రంథముల కభిన్నాంగములు కాకున్నచో వీనికేల ఈ ఆకర్షణ? సాహిత్యరచనాదృష్టిలో ఈ వరశాపముల కున్న మహత్త్వమేమి? వీటి ప్రభావ మెంత? శాపముగాని, వరముగాని ఇవ్వగల శక్తి ఎవరికి, ఎట్లు ఎంతమాత్రము లభించును? వీటికి నాశమున్నదా? ఇట్టి ప్రశ్న లెన్నో ఈ గ్రంథములను చదువుచున్నప్పుడు మదిలో మెదలును. వీనికి సమాధానములు వెదకుటకు ముందు, వీటి స్వరూపస్వభావము లెట్టివో తెలిసికొనుట పరమావశ్యకము.

మానవశక్తికి గల పరిధి పరిమితము. కాని ఈ శక్తితో పోల్చినపుడు అతని ఆకాంక్షాభిలాషలు అపరిమితముగా నుండును. తరచుగా అత్యావశ్యకములైన మౌలికావసరములను, సామాన్యావశ్యకములను సాధించుటకును మానవశక్తిప్రయాసలు చాల వనిపించును. ఈ స్థితిలో మానవుడు మానవశక్తికి మించిన, బలమైన, ప్రభావజనకమైన శక్తికొరకై ప్రయత్నించి, దాని మూలమున నిశ్చితమైన సాఫల్యము నందజూచును. ప్రాచీనకాలమున మానవుని అవసరములు చాల పరిమితములుగా నుండెను. అన్నవస్త్రములు, ఆవాసగృహము, సంతానము అనునవియే ముఖ్యావసరములుగా నుండెను. కాని మానవునకు లభించిన శక్తిసామర్థ్యములు ఆ అవసరపూర్తికి చాలకుండెను. కనుక ప్రభావజనకములైన శక్తిసామర్థ్యములకై అతడు వెదుక నారంభించెను. ప్రతివస్తువునందును ఏదో ఒక సుప్తశక్తి కలదను విశ్వాసము పెరుగుటతో, ఆ శక్తిని జాగృతమొనర్చి అభిలాషలు సాధింపవచ్చునను నమ్మకముతో, దానిని జాగృత మొనర్చుటకు వలయు సాధనములు, మార్గములు తెలిసికొను యత్నము మొదలయ్యెను.

మంత్రతంత్రములను ప్రయోగించియు, దేవీశక్తులను ఆవాహన చేసియు కోరికలు తీర్చుకొనవచ్చు నను నమ్మకము ప్రబలజొచ్చెను. 'సాధనములను ఉపయోగించుట-అభిలాషలు సిద్ధించుట' ఈ కార్యకారణభావము అస్పష్టమగుటచేత, ఈ ప్రయత్నము లన్నియు గూఢములని, అద్భుతములని, చమత్కారపూర్ణములని, అతీంద్రియశక్తి సంపన్నములని యెంచబడసాగెను. ఈ ప్రయత్నము లన్నియు ఐహికసుఖాభివృద్ధికే వినియోగపడజొచ్చెను. వైజ్ఞానికుల ప్రయత్నము లన్నిటికి గూడ మూలభూతమగు ఉద్దేశ్య మిదియే కాని రెంటి నడుమ గొప్పభేద మున్నది. వైజ్ఞానికుల ప్రయాస కార్యకారణసంబంధము నన్వేషించుటకై కొనసాగును. ఆవశ్యకములగు కారణము లెరిగి, వాటిని తగుస్థాయిలో ప్రయోగించినచో, వాని సుయోగ్య సంగతి ఫలించి, అపేక్షితార్థములు సిద్ధించగలవను సిద్ధాంతమున వారికి విశ్వాసము మెండు. వైజ్ఞానికులు పరిశోధన చేసి కనుగొన్న నూతనవిషయము లెన్నియో మానవుని ఆశ్చర్యచకితునిగా జేయగల అద్భుతచమత్కారములుగా వెలయుచున్నవి. గోడ కావల నున్న దృశ్యముగాని, ధ్వనిగాని మానవునికి గోచరింపదు. కాని నేటి వైజ్ఞానికులు క్షణకాలములో సప్తసముద్రముల కావలి తీర దేశములను చూపగలుగుచున్నారు. మాటలు వినజేయుచున్నారు. ఇది ఎంతో అద్భుతము గదా! వైజ్ఞానికు లెంత ప్రచండబలసంపన్ను లైరి!! తమ ప్రయాస ఫలించినందున వైజ్ఞానికులు సంతుష్టి జెందుచున్నారు. కాని దానిని వారు చమత్కార మని అంగీకరింపరు. కార్యకారణభావము నెరిగినవా రగుటచే వారి కిది చమత్కార మనిపించదు. కాని సామాన్యమానవుని కీ కార్యకారణభావము పరిచితము కాదు, కనుక అత డిది చూసి ఆశ్చర్యచకితు డగుచుండును.

కామ్యపూర్తికి గల సాధ్య-సాధనములకు మధ్యనున్న కార్యకారణ భావమునుగూర్చి తెలియకుండుటచేత ప్రాచీనకాలమున, ఈ విధమైన సాఫల్యము లన్నిటిని చమత్కారము లనియే భావించుచుండిరి. మానవశక్తికి సాధ్యముగాని కార్యము లెన్నో సుసాధ్యము లగుటలో ఈ చమత్కారముల వెనుక నేదో దివ్య, దైవీ, అద్భుత, విచిత్రశక్తి యున్న దను విశ్వాసము దృఢమై, అట్టి శక్తిని సంపాదింపవలెనను ప్రయత్నములు ప్రారంభమై కొనసాగిజొచ్చెను. ఆ ప్రయత్నములే యాతు-యజ్ఞ-దాన-తపస్యాది రూపము పొందినవి. వర-శాపముల ప్రయోగ మీ యాతువిద్యచే జనించినందున, మొదట ఈ యాతు స్వరూప మెట్టిదో తెలిసికొనదగును.

## యాతువిద్య

యాతు శబ్దమున కర్థము మాయ. వస్తువునందున్న సుప్తశక్తికే యాతుశక్తి

అని పేరు. అది గుర్తించుట యాతువిద్య. దాని నెరిగినవారు యాతుధానులు. రాక్షసుల కీ జ్ఞాన మబ్బుటచే వారు యాతుధాను లనబడిరి. ఈ శక్తివలన వారు తమకు కావలసిన రూపము బడయుచుండిరి. మారీచు డీ విద్య నెరుగును. కామరూపమున సువర్ణహరిణమై సీతను మోహింపజేసెను. తరువాతి రామాయణకథ కంతకును యిదే కారణమైనది. కాగా, యాతుక్రియకు గల మూలతత్త్వ మేమనగా, ప్రతివస్తువునందును సుప్తశక్తి యుండుననియు, దానిని విశుద్ధమైన మంత్రోచ్చారణచే మేల్కొలుపవచ్చుననియు, తద్వారా కోరికలు సాధింపవచ్చుననియు గల విశ్వాసము. ఆదిమమానవుని జీవితమున కీ యాతువిద్య మూలాధారముగా నుండెను. గూఢ అగమ్య శక్తిపై అతనికి పరిపూర్ణవిశ్వాస ముండెను. అతని కల్పనకు ఈశ్వరు డందలేదు. కనుక భక్తిచే నతనిని వశపరచుకొను ప్రశ్నయే లేదు. ఈశ్వరుడు, పూజ, ఆవాహన, యజ్ఞము వంటి కల్పన లన్నియు సాంస్కృతికవికాసమునకు ఫలముగా నీ వెనుక ఏర్పడినవి. ఆదిమమానవుడు విశుద్ధముగా మంత్రము నుచ్చరించి ఇచ్ఛాశక్తిని పెంచుకొనవచ్చునని, దాని కింకొకరి ఇచ్ఛాకృపాద్వేషములతో నిమిత్తము లేదని విశ్వసించెను. కనుకనే యాతుధారణలో ఈశ్వరప్రసన్నతకు గాని, క్రోధమునకు గాని చోటు లభింపలేదు. నైతికతకును దీనిలో స్థానము లేకుండెను. *What is ritually correct is ethically right.*

ధర్మభావన కీ యాతుశక్తి పూర్వావస్థ. ఫ్రేజర్ ననుసరించి యిది విజ్ఞానశాస్త్రమునకు పూర్వస్థితి. ఈ రెంటికిని కామ్యపూర్తియే లక్ష్యము. వస్తువులం దిమిడియున్న మూలశక్తిపై ఇరువురికిని ప్రగాఢవిశ్వాసము. భేదము కేవలము సాధనాగతము. వైజ్ఞానికుని కార్యభారమంతయు అనుభవమును, పరీక్షణమును కాగా యాతుక్రియలోని కార్యభారమంతయు మంత్రతంత్రప్రయోగము. వైజ్ఞానికులు బౌద్ధికాధారమున ముందుకు సాగుదురు. రహస్యము, అజ్ఞానము, అంధశ్రద్ధ యాతుక్రియకు సహాయకారులు. ఫ్రేజర్ పండితు డీ రెండింటికి గల అంతరము నిట్లు విశదపరచెను. *Legitimately applied they yield science, illegitimately applied they yield magic, the bastard sister of science.* విశిష్టమైన మంత్రమును, దాని విశిష్టమైన ప్రయోగపద్ధతియు చేరి తంత్ర మనబడును. ఈ యాతురూపక్రియవలన ఆదిమావస్థలో మానవుడు తన కామనలు పూర్తి చేసుకొనుచూ వచ్చెను. తంత్రవిద్యలో శివ-శక్తి, ప్రకృతి-పురుష సంయోగమునకు విశేషమహత్త్వ మివ్వబడును. అదియే శివపూజ,

లింగపూజ, శక్తిపూజ, పశుబలి, నరబలి వంటి కల్పన లెన్నిటినో జనింపజేసెను. దీనివల్లనే శక్తిపూజలో వామాచారము, స్వైరాచారము వంటి అవాంఛనీయ ప్రవృత్తు లెన్నియో ప్రారంభింపబడెను.

## యజ్ఞకర్మ

భారతదేశమున గల ఆర్యేతరజాతులవారు తమ ప్రాథమిక ఆవశ్యకతలను, కామ్యపూర్తిని తంత్రవిద్యద్వారా సిద్ధింపజేసికొనుచుండిరి. వైదికార్యులు వీనికై అనుసరించిన సాధనములను యజ్ఞములని పేర్కొనుచుండిరి. యజ్ఞవిధి కూడ యాత్వాత్మకకల్పన నుండియే ప్రభవించినది. ప్రసిద్ధ మానవ వంశవిజ్ఞాని ఎమ్‌డ్యూలైంగ్ యజ్ఞవిధిని గూర్చి ఇట్లు వ్రాసెను-[1]

*On the whole the religion of the Rishis is practical; it might also be said, is magical. They desire temporal blessings, rain, sunshine, long life, power, wealth in flocks and herds. The whole purpose of the sacrifices, which occupy so much of their time and the thought is to obtain good things. The sacrifice and the sacrificer came between gods and men. On the man's side is faith, munificence, a compelling force of prayer and intenseness of will; the sacrifice invigorates the gods to do the will of the sacrificer.*

మొత్తము మీద ఋషుల ధర్మస్వరూపము కూడ వ్యావహారిక మనియు, యాత్వాత్మక మనియు చెప్పదగినదే. కాలానురూపముగా వారు వరాశీర్వాదముల వలన వర్షాతపములు, దీర్ఘాయుసామర్థ్యములు, పశుసంపదభివృద్ధియు ఆకాంక్షించుచుండిరి. వారికి తమ జీవితసమయములో అధికభాగమున ఆలోచనాశక్తిని వెచ్చించి ఆ యా యజ్ఞవిధులను నిర్వహించుటకు మేలివిషయములు సంపాదించుటయే ముఖ్యోద్దేశ్యముగా నుండెను. యజ్ఞమును, యజ్ఞకర్తయు దేవతకు-మానవునికి మధ్య మాధ్యస్థ్య మొనర్చుచుండెను. శ్రద్ధ, ఉదారత, ప్రార్థన, సామర్థ్యము, ఉత్కటేచ్ఛ అనునవి మానవగుణములై యుండెను. యజ్ఞకర్త కామనలను పూరించుటకై దేవతలను అనుకూలించుకొను సాధనము యజ్ఞము.

యజ్ఞశబ్దము యజ్ ధాతువునుండి నిష్పన్నమైనది. యజ్ఞ మనగా

---

1. వైదిక యజ్ఞ-తంత్ర సాధనా-భక్తియోగ్, పు.52 (మరాఠీ)

దేవపూజా-సంగతికరణ-దానము లని నిర్వచించబడెను. యజ్ఞశబ్దమునకు అర్థము నిర్వచించుటలో గల ఆశయ మేమనగా, తనకన్న శ్రేష్ఠులైనవారిని దేవతలుగా మన్నించి వారిని పూజించుటయు, తన సాటివారి నందరిని ఒకే ప్రేమసూత్రమున బంధించి ఐక్యత సంపాదించుటయు, తనకన్న తక్కువ స్థాయి వారికి ఏదో కొంత యిచ్చుటయు. అనగా యజ్ఞకర్మ సమ్మానము, ఏకీకరణ, దానము అను మూడు తత్త్వములతో కూడినదని స్పష్టము. వ్యక్తి తన కర్తవ్యముతో పాటు సామాజికబాధ్యతలపట్ల కూడ ధ్యాన ముంచవలె ననుట యజ్ఞశబ్దముచే సూచింపబడుచున్నది.[2] యజ్ఞము ముఖ్యముగా త్యాగమయమైన కర్మ. అది మొదట అసురుల వద్ద నుండెడిది. తర్వాత దేవతల వద్ద చేరినది. ఆ మీద ఋషులు, మానవులు దానిని వారినుండి గ్రహించిరి. కాని ఈ విషయమున మతభేదము లున్నవి. యజ్ఞమందు గల యాచనవలన దీనిని యాచ్ ధాతువునుండి నిష్పన్నమని కూడా చెప్పుదురు. అగ్నికి గల ప్రచండశక్తిని గుర్తించుటతో మానవజీవనమున అత్యద్భుతమగు క్రాంతి ఉదయించెను. అగ్నికి దేవత్వమబ్బెను. అతనికి సంతుష్టి కలిగించుటకై ఎన్నో ఉపాసన లారంభమాయెను. అగ్ని ప్రసన్నుడైనచో కామనలు పూర్తికాగల వను విషయమున విశ్వాసము బలపడెను. తోడనే అగ్ని కోపించినచో అమంగళ మగు నను భయము కూడ పెరిగెను. ఇట్లు ఆరాధ్యదేవతను సంతోషపెట్టుటకు సరిక్రొత్త మాధ్యమముగా రూపించినదే యజ్ఞము. అగ్నిలో ఆహుతులు వ్రేల్చినచో అవి ఆరాధ్యదేవతకు చేరునను నమ్మక మంతకంతకు ప్రబలమయ్యెను. దానితో కామ్యపూర్తిపట్ల దృఢవిశ్వాసము నెలకొనెను. ఇందులో కేవలము ఇచ్చిపుచ్చుకొను భావమే కాక యాత్వాత్మక క్రియలచే దేవతల శక్తిని కూడ పెంపుజేయునట్టి భావము కూడ నుండెను.

*దేవాన్ భావయతానేన తే దేవా భావయంతు వః,*
*పరస్పరం భావయంతః శ్రేయః పర మవాప్స్యథ. (భగవద్గీత 3-11)*

ఇందులో 'భావయత్' శబ్దమున కర్థము శక్తిమంతునిగా, బలవంతునిగా చేయుట. ఋగ్వేదమం దంతటను ఇచ్చిపుచ్చుకొనుటలలో ఈ భావితుల నొనర్చు ధారణ యున్నది. ఆహుతి యిచ్చి దేవతను సంతోషపరచినచో ఆశించిన కార్య మవశ్యము జరుగు నను మాటపై విశ్వాసము పెరుగుట వల్లనే త్రిశంకుడు సదేహస్వర్గ మాశించి అనుచితమని తెలిసియు అందుకొరకై

---

2. భారతీయ సంస్కృతి కోశ్, ఖండ్ 7, పు. 599 (మరాఠీ)

యజ్ఞ మారంభించెను.

కర్తవ్యబుద్ధిచే ప్రేరేపించబడి, ఫలాకాంక్ష విడిచి కర్మ యొనర్చుటయే భగవద్గీతలో యజ్ఞ మని చెప్పబడెను. యజ్ఞ మనగా పూజ్యవ్యక్తికై చేయు త్యాగము. ధర్మకల్పన కూడ యజ్ఞముతో సంబంధించినదే. యజ్ఞములో ఈశ్వరాధిష్ఠాన మావశ్యక మగును. ఈశ్వరునికృపచే సృష్టిచక్రము పరిభ్రమించుచుండును.

*అన్నాద్ భవంతి భూతాని పర్జన్యాదన్నసంభవః,*
*యజ్ఞాద్ భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః.* 14
*కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్,*
*తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్.* 15
*(భగవద్గీత అధ్యా. 3)*

విశ్వనిర్మాణమునందు ప్రథమకర్మ యజ్ఞము. ఈ క్రియలో సమాజపు భరణపోషణ లిమిడియున్నవి. *'యజ్ఞేన యజ్ఞమయజంత దేవాస్తాని ధర్మాణి ప్రథమాన్యాసన్'* అని ఋగ్వేదమున చెప్పబడెను.

ఐహికసుఖప్రాప్తికై యజ్ఞము లాచరింపబడుచుండెను. కొన్ని యజ్ఞములు సమాజకళ్యాణార్థమును జరిగెడివి. వానివలన ఒకనికంటె ఎక్కువ మందికి లాభ మబ్బెడిది. కుటుంబము, సమాజము, దేశము, రాజ్యము, విశ్వము మున్నగు వాని శ్రేయస్సుకొఱకై యజ్ఞము లాచరింపబడుచుండెను. అట్లే అతివృష్టి, రోగముల నివారణము, శత్రుబాధలనుండి సంరక్షణ, సంఘవినాశమునుండి భద్రత, రాష్ట్రాభ్యుదయము, రాజ్యరక్షణ వంటి వెన్నిటినో సాధించుటకు యజ్ఞారంభము చేయుచుండిరి.

డా.స.రా. గాడగీల్ గారి మతమున యజ్ఞవిధి విశిష్టమంత్రములను, యథోక్తకర్మలను తంత్రశుద్ధముగా ప్రయోగించుటచేత ప్రాకృతికశక్తిపై విజయము సాధింపవచ్చు నను యాతురూపసంకల్పముపై ఆధారపడియున్నది. కామ్యపూర్తికి ఈశ్వరుని వంటి దయామయవ్యక్తిరూపము గు శక్తి యాతువిద్యలో గాని, యజ్ఞమందుకాని ఆవశ్యకము కాదు. యజ్ఞమునందలి మంత్రయుక్తవిధానము సహజసామర్థ్యపూర్ణము. కోరినవాని కోరిక తీర్చుటకు గాని, తీర్చకపోవుటకు గాని దేవతల ఇచ్ఛాద్వేషములతో పనిలేదు. అత్యంతవిశుద్ధమైన కర్మాచరణము

వలన ఫలప్రాప్తి నిశ్చితము. మంత్రములు విశుద్ధముగా నుచ్చరించుట, యథావిధిగా కర్మాచరణ మొనర్చుట అన్నవాటికే ఇచ్చుట సర్వాధికమహత్త్వము. వాటిలో ఏ మాత్రము దోషము గాని, లోటుగాని కలుగరాదు. ఇట్టి లోటుపా ట్లేర్పడినప్పుడు యజ్ఞవేదికకు దక్షిణమున నాసీనుడై యుండు బ్రహ్మ యను ఋత్విక్కు వాటిని నివారించుచుండును. యజ్ఞకర్మ విధ్యుక్తముగా జరుగుచున్నదో లేదో చూచుటయే ఈ ఋత్విజుని కార్యము. యజ్ఞవిధిలో దోష మేర్పడినచో యజ్ఞకర్తకు ఇష్టఫలప్రాప్తికి బదులు మరణభీతియు నేర్పడును. ఇందుచేతనే మృత్యువు దిశయైన దక్షిణమున కూర్చుండి ఆ ఋత్విక్కు దానిని సంభాళించుచుండును. భక్తిభావమున కిందులో స్థాన మెట్టిదియు లేదు. అందుకు కారణము ఫలప్రదానకార్య మిచ్చుట దేవతల అధీనములో లేకుండుటయే. ఇచ్చుట దేవత పేరునకు మాత్రమే.[3] తన యీ అభిప్రాయమునకు బలముగా ఆయన డా.రా.నా. దాండేకర్‌గారి మత మిట్లుద్ధరించెను-

*Sacrifice is regarded as possessing a mystical potence superior even to gods who, it is sometimes stated attained to their Divine rank by means of sacrifice.* యజ్ఞమువల్లనే దేవతలకు దేవత్వ మబ్బిన దను భావము సర్వత్ర వ్యక్తముగ కన్పట్టును.

తర్కతీర్థ లక్ష్మణశాస్త్రి జోషీగారికి డా. గాడగీల్ గారి అభిప్రాయము సరిపోలేదు. వారి మతమున, భక్తి యనునది ప్రేమభావమున కొక విశిష్టరూపము. ఈ విశిష్టరూపమును నిష్ఠ అని అందురు. ఋగ్వేదమునందలి యజ్ఞవిధిలో ఈ నిష్ఠావిధులు పలుమార్లు పేర్కొనబడెను. మానవశాస్త్రము ననుసరించి వైదికయజ్ఞవిధి యాతువిధి మాత్రమే అని సిద్ధింపదు. ఏలయన, యాతుక్రియలో వలె అలౌకికశక్తిని సంపూర్ణముగా వశములోనికి తెచ్చుకొనునట్టి ప్రక్రియ ఏదియు వైదికయజ్ఞవిధిలో లేదు. దేవతలను శరణు జొచ్చుట ఇందులో ప్రధానభావము. యజ్ఞమువలన దేవతలు ప్రసన్ను లగుదురు. అందుకు హేతువు యజ్ఞము సమర్పణవిధి యగుటయే. కాని యాతుక్రియ ఇందులో నిమిడియున్న దనుటలో సందేహము లేదు. యాతుక్రియ కొంచెమో అధికమో లేని ధర్మము లోకమున లేనే లేదు. మానవుని ఇచ్ఛ సర్వశక్తిసంపన్న మగుటయే యాతుతత్త్వము. వ్యక్తిరూపమున భగవత్కల్పన దీనికి లభించిన ఉత్తమరూపము. యాతువునుండి వికసించిన రూపమే భక్తిప్రధానమైన ధర్మము.

---

3. వైదిక యజ్ఞ-తంత్ర సాధనా-భక్తియోగ్, పు.47 భూమికా పు. 15

తపస్సు

భారతీయసంస్కృతికి గల మూడు ప్రధానాంగములలోను తపస్సు ఒకటి.[4] శబ్దకల్పద్రుమము తపస్ శబ్దమునకు *'తపతి తాపయతి వా'* అని వ్యాఖ్యానించెను. అనగా తపించునట్టిది లేదా తపింపజేయునట్టిది తప మని అర్థము. సర్వలక్షణసంగ్రహము తపస్సును వివరించుచు *'క్షుత్పిపాసాశీతోష్ణాది ద్వంద్వసహనమ్'* అని ఆకలిదప్పులు, శీతోష్ణముల వంటి ద్వంద్వములను సహించుట తప మనబడు ననెను. ధర్మార్థకామమోక్షము లను పురుషార్థ చతుష్టయమును తపముతో సంబంధించును. మానవజీవితమును నిర్మలముగా నిష్కళంకముగా నుంచవలె నన్నచో తపోగ్నిచే తపింపజేయవలెను. ఉపనిషత్కారుల మతము ననుసరించి తపస్సు వానప్రస్థాశ్రమమున కభిన్నాంగము.

*తపఃశ్రద్ధే యే హ్యుపవసంత్యరణ్యే*
*శాంతా విద్వాంసో భైక్ష్యచర్యాం చరంతః,*
*సూర్యద్వారేణ తే విరజాః ప్రయాంతి*
*యత్రామృతః స పురుషో హ్యవ్యయాత్మా.*

-ముండకోపనిషత్ 1-11

శాంతులును, విద్వాంసులునై వనమందు నిల్చి భిక్షావృత్తి నిర్వహించుచు శ్రద్ధాపూర్వకముగా తప మాచరించునట్టి పురుషులు పాపరహితులై సూర్యద్వారమున అమర్త్యుడు, అవ్యయుడైన పురుషుని చేరుకొందురు. మహానారాయణీయోపనిషత్తులో ఈ క్రింది విధముగ తపస్సుయొక్క వ్యాపకస్వరూపము వర్ణింపబడెను-

***ఋతం తపః సత్యం తపః శ్రుతం తపః శాంతం తపో దమస్తపః***
***శమస్తపో దానం తపో యజ్ఞం తపో భూర్భువస్సువర్ బ్రహ్మైతదుపాస్వైతత్తపః.***

ఋతము, సత్యము, శ్రుతము, శాంతము, దమము, శమము, దానము, యజ్ఞము తపములు. సచ్చిదానందస్వరూపుడైన బ్రహ్మ నారాధించుట కూడ తపమే. *'తపసి సర్వం ప్రతిష్ఠితం తస్మాత్తపః పరమం వదంతి.'* సర్వమును తపస్సునందు ప్రతిష్ఠితమై యున్నది. కనుకనే తపము శ్రేష్ఠమని యీ ఉపనిషత్తునందు చెప్పబడెను. ధర్మసూత్రకారులు పాపనిష్కృతికై తపశ్చరణము విధించిరి.

---

4. భారతీయ సంస్కృతి కోశ్, ఖండ్ 4 పు.35-37 ఆధారంగా

దేవద్విజగురుప్రాజ్ఞపూజనం శౌచమార్జవమ్,
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే. 14

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్,
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే. 15

మనఃప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః,
భావసంశుద్ధిరిత్యేతత్తపో మానసముచ్యతే. 16

(గీత. అధ్యా. 17)

భగవద్గీతలో తప మిట్లు వివరింపబడెను- దేవతలు, బ్రాహ్మణులు, గురువులు, విద్వాంసులను పూజించుట, శుద్ధి, ఋజుత్వము, బ్రహ్మచర్యము, అహింస అనునవి శారీరకతపములు. క్షోభ కలిగింపనట్టి వాక్కు, సత్యము ప్రియమునైన భాషణము, స్వాధ్యాయము వాచికతపములు. మనఃప్రసన్నత, సౌమ్యత, మౌనము, ఆత్మనిగ్రహము, భావసంశుద్ధియు మానసికతపములు. ఫలాశ వీడి మనోవాక్కాయములతో చేయు తపము సాత్త్వికము. సత్కార పూజాసమ్మానాది ఐహికోద్దేశ్యములతో దాంభికముగా నొనర్చునట్టి తపస్సు రాజసము. మూర్ఖత వహించి తనను తానే హింసించుకొనుచు, ఇతరులను బాధించునట్టి కోరికతో చేయు తపస్సు తామసము.

యద్దుస్తరం యద్దురాపం యద్దుర్గం యచ్చ దుష్కరమ్,
సర్వం తత్తపసా సాధ్యం తపో హి దురతిక్రమమ్.

-మనుస్మృతి

తపఃసామర్థ్యమును వర్ణించుచు మను విట్లనెను - 'ఏది దుస్తరము, దుష్ప్రాపము, దుర్గమము, దుష్కరము నగునో అదంతయు తపస్సుచే సాధింపబడగలదు. కాని తపము నతిక్రమించునట్టి దేదియు లేదు.' తపస్సుచే సామర్థ్యశీలచింతనములు లభించును. జ్ఞానము వర్ధిల్లును. వ్యాసు డిట్టి అత్యధికపరిశ్రమవల్లనే ప్రాచీనసాహిత్యసంగ్రహీతు డయ్యెను. ప్రాచీనగ్రంథములలో పేర్కొనబడిన వ్యక్తు లెందరి జీవితములలోనో తపఃసామర్థ్యము వ్యక్తమగుచుండును.

మానవశక్తిచే సాధింపజాలని విషయము లెన్నియో తపస్సుచే సంపాదింపవచ్చును. మానవులవలెనే దేవదానవులు కూడ తపము నాశ్రయించిరి. బ్రహ్మకు లోకసృష్టి చేయు శక్తి తపమువల్లనే లభించెను. విశ్వామిత్రుడు

బ్రహ్మర్షి యగుటకొరకై ఘోరమైన తపమాచరించెను. రావణుడు మహోగ్రమైన తపస్సు చేసి అమరత్వ మార్జించెను. శివుని ప్రసన్నతను కోరియే పార్వతి తపమొనర్చెను. అనసూయ తపముచే శివుని ప్రసన్ను నొనర్చుకొనుటయే కాక, క్షామనివారణ మొనర్చుటకై స్వర్గమునుండి గంగను రప్పింపగలిగెను. పతివ్రతాధర్మపరీక్షార్థము వచ్చిన బ్రహ్మవిష్ణుమహేశ్వరులను అనసూయ బాలకులుగా మార్చి గర్వభంగ మొనర్చెను. ఇదంతయు తపోబలముననే సాధ్యమయ్యెను. మాండవ్యుని శాపకారణమున ఒక సఖికి ప్రాప్తించిన వైధవ్యము తపోబలముననే నిలుపరింపబడెను. కాని సశరీర స్వర్గ ప్రాప్తి కోరి ప్రారంభించిన శంబూకుని తపస్సు వ్యర్థమాయెను. అతడు తన అధికారము నతిక్రమించి చరించుటయే దానికి కారణము.

తపస్సులో కాయక్లేశమునకు విశేషమహత్త్వ మున్నది. కాయక్లేశ మెంత అధికమో, ఎంత అధికాపధికమో, ఎంత తీవ్రమో, అంతగనే తపోబలమును అధికమగును. గ్రీష్మకాలమున పంచాగ్నిసాధన మొనర్చుట, శిశిరకాలమున శరీరముపై పలుచనివస్త్రము ధరించుట, వర్షాకాలమున ఆరుబయట ఆసనము వేసి, బాహుద్వయ మెత్తి చిరకాలము నిల్చి యుండుట, ఒంటి కాలిపై నిలచుట, అగ్గి త్రొక్కుచూ నడచుట, నీటిలో నిల్చియుండుట, మౌనము వహించుట, కట్టె వలె పడియుండుట, తీర్థయాత్రలు చేయుట, వాయుభక్షణ మొనర్చుట, ఉంఛవృత్తిచే (పక్షులవలె నేల రాలిన గింజ లేరి తినుట) చరించుట వంటి తపఃసాధన లెన్నో విధములుగా ఆచరింపబడుచున్నవి. స్త్రీ-పురుషు లిరువురికిని తపఃసాధన కధికార మున్నను, శంబూకుని కథవలన శూద్రుల కీ అధికారము లేదని స్పష్టమగుచున్నది. కాని వైదికకాలమున శూద్రుల కిట్టి అధికార ముండెను. వారు వేదాధ్యయన మొనర్చుచుండిరి. కొందరు మంత్రద్రష్టలు శూద్రులు. కాలగతిలో శూద్రులపై అనేకప్రతిబంధము లేర్పడినవి. వానితోనే వారికి తపఃసాధనాధికారము కూడ తొలగింపబడి యుండును.

తప మెంత ఉపయుక్తమో అంతగనే అది ఉపద్రవకరము కూడ. తపములో సంరక్షక-సంహారక శక్తులు రెండునూ ఇమిడియున్నవి. తపశ్చరణమును బట్టి వాటి బలమున హెచ్చుతగ్గు లేర్పడును. అట్లే అవి హెచ్చుతగ్గులుగా నిల్చును. తపస్వులు చాల జాగరూకులై విజ్ఞతతో వ్యవహరింతురు. కానిచో తపఃక్షయ మేర్పడును. ఈ తపఃక్షయ మనునది అనేకవిధముల సంభవించును.

విశ్వామిత్రుని తపఃక్షయము కోరి ఇంద్రు డతనికడకు రంభను పంపి తపోభంగ మాచరింపజేసెను.

ఐహికసుఖాభివృద్ధి, శత్రువినాశము, కష్టనివారణము వంటి ప్రయోజనము లాశించి, మానవశక్తికి మించిన ప్రభావపూర్ణమైన వేరొక శక్తి నార్జించు నుద్దేశ్యముతో యాతు, యజ్ఞ, తపము లవలంబింపబడుచుండెడిది. ఇవి గాక మరికొన్ని ఉద్దేశ్యములతో కూడ వీటి ప్రయోగము జరుగుచుండెడిది. కాని అట్టివి చాల తక్కువగా- గౌణముగా- జరిగెడివి. యాతుక్రియలో మంత్ర తంత్రముల సహాయమునను, యజ్ఞక్రియలో దేవతాప్రసాదసిద్ధివల్లను, తపఃక్రియలో కాయక్లేశముతోను లక్ష్యము సాధింపబడుచుండెడిది. ఈ మూడింటికిని గల ముఖ్యోద్దేశ్యము లౌకికాభివృద్ధియే. యాతుక్రియలో ఎదుట గల వస్తువునందు సుప్తమైయున్న శక్తిని మేల్కొలుపకుండగాని, యజ్ఞక్రియలో ఇష్టదేవతలను ప్రసన్న మొనర్చుకొనకుండగాని లక్ష్యసిద్ధి కలుగదు. యాతు-యజ్ఞ మార్గములు కొంతవరకు పరాధీనములు. తపస్సులో కూడ దేవతా ప్రసన్నత అపేక్షణీయమును, ఆవశ్యకమును అయినను, అట్టి ప్రసన్నతను సాధించునట్టి సాధనములు, దానిని కోరునట్టి తపస్వియందే అధికముగా నెలకొని యుండును. కామ్యపూర్తి యగువరకు సాధన చేయబడుచుండును. యజ్ఞములో దైహికతకు ప్రాచుర్య ముండును. ద్రవ్యము, దేవత, విధానము అనునవి ఇందు మహత్త్వము వహించును. తపస్సులో మానసికక్రియ మెండు. ఈ రెండును సిద్ధికి సాధనములు. భగీరథుడు ఉగ్రతప మొనర్చి ఆ బలమున గంగను భూమిపైకి తెచ్చి, సగరపుత్రులకు ఉదకక్రియ లొనర్చి వారికి అక్షయస్వర్గసుఖములు ప్రాప్తింపజేసెను.

**శాపము - వరము; సంకల్పస్వరూపములు**

శాపమును, వరమును యాతుక్రియ, యజ్ఞకర్మ, తపస్సు లను వాటితో అత్యంతనికటసంబంధము కలవి. శాప-వరముల సంకల్పమునకు మూలము యాతుక్రియ. దాని కట్లు శాపవరదాన శక్తి తపస్సుచే కలుగును. యజ్ఞమువలనకూడ వరశాపముల నివ్వగల శక్తి ప్రాప్తించును. కాని అది చాల స్వల్పము. *A curse or blessing is a wish expressed in words that evil or good may befall a certain person.*[5] ఎవరికైననూ మంచియో చెడ్డయో కలిగించుటకై మంత్రోచ్చారణరూపమున వ్యక్తమగు కోరిక లేదా కామనయే వరముగాని

5. *Encyclopaedia of Religion and Ethics. p. 367.*

శాపము గాని అనబడును. ఈ వరశాపము లిచ్చు ప్రక్రియలో, వీటి నిచ్చునట్టి వ్యక్తియొక్క ఇచ్ఛాశక్తికి గల ప్రాబల్యము, దాని అభివ్యక్తి అనగా శబ్దోచ్చారణము, అతనికి గల అధికారము అను మూడు నియమములు ముఖ్యమైనవి. శాపముగాని, వరము గాని ఇచ్చునట్టి ఇచ్ఛాశక్తి ఎంత ప్రబలమైనను అవి యిచ్చునట్టి వ్యక్తికి గల అధికార మెంత గొప్పదైనను, శబ్దరూపమున నుచ్చరించి వ్యక్తము చేయనంతవరకు అది తన ప్రభావము చూపజాలదు. కనుక అభివ్యక్తి అనగా శబ్దోచ్చారణమునకు ప్రముఖస్థాన మివ్వబడును. శబ్దోచ్చారణము ద్వారా ఇచ్ఛాశక్తి ప్రకటమైనచో చాలు దానిని తిరిగి వెనుకకు మరలించుటకు గాని, మార్చుటకు గాని వీలుపడదు. అట్లే దాని ప్రభావము నిగ్రహింపబడజాలదు. శబ్దోచ్చారణప్రభావ మేనాడును అసత్యము కాజాలదు. అట్లయినచో అది శాపమని గాని, వరమని గాని చెప్పబడదు. కామాతుర క్రౌంచపక్షిద్వయములో మగపక్షిని కూల్చిన నిషాదు నుద్దేశించి వాల్మీకినోట ఏ శాపవాణి వెలసినదో దానినిగూర్చి ఆ మహర్షి పిదప నెంతగానో పరితపించెను. శాప మివ్వకుండినచో బాగుండు నని తలంచెను. కాని వాల్మీకిమహర్షి ఆ శాపమును మరలింపలేకపోయెను. దానిని మార్చను లేకపోయెను. రామాయణములో రెండు సందర్భములలో వరదాన మసత్య మగునేమో యను పరిస్థితులు సంభవించినవి. యమరావణ సంగ్రామములో యముడు రావణుని సంహరించుటకు కాలదండ మెత్తెను. కాలదండము బ్రహ్మాగా రిచ్చినది. అది ప్రయోగింపబడినచో రావణునికి చావు తప్పదు. కాని ఆ బ్రహ్మదేవుడే స్వయముగా రావణునికి మానవేతరులచేత మృత్యువు కలుగదని వరమిచ్చెను. ఇప్పుడు రావణుడు గతించినచో బ్రహ్మ యిచ్చిన వర మసత్యమగును. కనుకనే బ్రహ్మ స్వయముగా మాధ్యస్థ్యము వహించి యమునిచే కాలదండప్రయోగము కాకుండ నిల్పి తానిచ్చిన వరమును సత్యముగా నిలుపుకొనెను. రెండవ సందర్భము నివాతకవచులతో రావణుని యుద్ధమునాటిది. ఇరువురికిని వరములు లభించినందున యుద్ధము చిరకాలము జరిగినప్పటికిని జయాపజయములు నిశ్చయము కాలేదు. ఎవరు జయించినను లభించిన వర మసత్యమని తేలును. బ్రహ్మదేవుడే వచ్చి ఇరుపక్షముల వారికిని సంధి చేసి తానిచ్చిన వరముల సత్యత్వము కాపాడుకొనెను. (ఉత్తరకాండము సర్గ. 22, 23)

మనసులో కోరిక ఉదయించినను, అది వ్యక్తము కాకున్నను, శబ్దోచ్చారణము జరుగకున్నను, దానిని శాపమని గాని, వరమని గాని అనరు. ప్రబలమైన కోరిక మాత్రమే వరము గాని శాపము గాని కాజాలదు.

కోరిక లేదా ఇచ్ఛ శబ్దరూపమున ప్రకటితమైనప్పుడే అది శాపమనియో వరమనియో చెప్పబడును. ఒక్కొక్కప్పుడు మనసులో నిచ్ఛ జనించినను, ఫలిత మాలోచించి దానిని శబ్దరూపమున వ్యక్తము చేయు ప్రయాస విరమించుట కూడ కనిపించును. శాప మిచ్చుటవలన తపోవ్యయ మగుననియు, పుణ్యక్షయ మగు ననియు భావించుటచేత కూడ ఇచ్ఛోదయమైనను అది శబ్దోచ్చారణముద్వారా వ్యక్తము చేయబడదు. రామాయణములో ఇట్టి సందర్భము లెన్నో ఉన్నవి. వాటిని గూర్చి ముందు ముందు విస్తారముగా చర్చించెదము. మనసులో భావ ముత్పన్నమైనను వేదవతియు, కుశకన్యలును రావణవాయుదేవులను శపింపలేదు. కాని మనసులో ఇచ్ఛోత్పత్తి జరిగిన పిదప వరమీయకుండ నిలిచిన దాని కుదాహరణము లభింపకున్నది.

ప్రబలమయిన ఇచ్ఛ, శబ్దమూలముగా దానిని అభివ్యక్తము చేయుట ఇంతమాత్రము చాలదు; అట్లు వరశాపము లిచ్చుట కధికారము కూడ తప్పనిసరి. తపస్సు, కొన్ని యజ్ఞవిధులును అట్టి అధికార మొసగును. అత్యధికమగు కోపము కలిగినపుడు మామూలు వ్యక్తి ముఖమున వెడలు వచనములు శాపము కాజాలవు. కారణము, వాటిలో శబ్దోచ్చారణమునకు చెప్పిన ప్రభావముగాని, క్షమత గాని ఉండవు. ఆ వచనములు హాహాకృతులే. 'కాకి శాపమునకు గోవు చావ' దని సామెత. అధికారాభావమే దీనికి కారణము. మిక్కిలి సంతోషము కలిగి సామాన్యవ్యక్తి వేరొకని మేలు కోరవచ్చును. వాని ఈ కోరిక శుభకామన, లేదా ఆశీర్వాదమగునే కాని వరము కాదు. హాహాకారము, ఆశీర్వాదము, శబ్దోచ్చారణచేయబడినను ప్రభావసంపన్నములు కావు. అట్టి విశ్వాసమును కలిగింపవు. తరచుగా అవి ప్రభావరహితము లయి పొల్లు పోవును. ఒకప్పుడు ప్రభావకారు లయినను అది యాదృచ్ఛికమో, కాకతాళీయమో అనిపించుకొనును. శాపమునకు గాని, వరమునకు గాని ప్రభావము అమోఘముగా నుండును. సంతప్తుడైన గౌతముడు ఇంద్రుని విషయమునను, విశ్వామిత్రుడు రంభ విషయమునను పల్కిన వచనములు శాపము లయినవి. వారు తపస్సుచే నట్టి అధికారము బడయగలిగిరి. వారి వాక్కునకు సత్యత్వము సిద్ధించినది. పాదప్రణామ మొనర్చు కన్యను *'అష్టపుత్రా సౌభాగ్యవతీ భవ'* అనియు, పురుషుని *'ఆయుష్మాన్ భవ'* అనియు ఒట్టి మాటలు సాధారణజను లందరును పలుకుదురు. ఇవి కేవలము శుభాకాంక్షలే. వానికి తగినంత ప్రభావముగాని, అట్టి విశ్వాసమునకు తావుగాని యుండదు. కాని భృగు

విచ్చిన వరబలమున సగరపత్ని సుమతి అరువది వేలమంది పుత్రులను బడసెను. దానికి కారణ మిత డట్టి అధికారము బడసియుండుటయే. సోమదాగాంధర్వికి వివాహ మాడకయే ఎవరికిని భార్య కాకయే, పుత్రప్రాప్తికై కోరిక కలిగెను. అధికారి చూళీఋషి ఆమె కోర్కె ఫలించునట్లు వరమిచ్చెను.

దేవతల కిట్టి అధికారము జన్మసిద్ధము కావచ్చునేమో కాని, మానవుల వలె వారికిని తపస్సుచేసి ఈ శక్తిని పెంచుకొనవలసినట్లున్నది. శాపముగాని వరముగాని ఇవ్వగల శక్తి తపస్సువల్లనే లభించును. దేవతలు, దానవులు, మానవులు - అందరూ తపస్సు చేయక యీ శక్తిని పెంచుకొనజాలరు. రాక్షసులు మహోగ్రముగా తపస్సు చేసి వరములు బడయుచుండిరి. కాని వేరొకరికి శాపముగాని వరముగాని యివ్వగల శక్తి వారి కబ్బినట్లు లేదు. రామాయణములో రాక్షసు లిచ్చిన శాపమునకు గాని వరమునకు గాని ఉదాహరణ మొకటియైనా లభింపదు. హిరణ్యకశిపుదు మరీచిమహర్షిపుత్రులకు శాపమిచ్చినట్లు 'హరివంశము' లో నున్నది. రాక్షసులకు కూడ శాపమివ్వగల శక్తి ప్రాప్తించెడిదేమో అనిపించునట్టి సందర్భములు రామాయణములో రెండు గోచరించును. కాని ప్రత్యక్షముగా నవి రూపుగొనలేదు. బ్రాహ్మణవేషమున వచ్చిన అతిథి రావణుని చూసిన సీతకు అతని ప్రశ్నలకు సమాధాన మీయకున్నచో శాపమిచ్చునేమో అని భయమాయెను. కాని యిది భయము మాత్రమే. సీత సముచితరీతిని సమాధానము లిచ్చెను. కాగా, శాపమిచ్చునట్టి అవకాశమే లేకపోయెను. ప్రాణసంకటము వచ్చినపుడు రావణుని దూత శుకుడు 'నా శాపము నిన్ను జీవితాంతము బాధింపగలడు' అని రాముని బెదిరించెను. కాని రాము డతని కభయమిచ్చుటచే బెదిరింపు నిష్ఫలమాయెను. పుష్పకవిమాన మపహరించిన సందర్భమున కుబేరుడు రావణుని ఎంతగానో శాపతుల్యములగు వాక్కులచే నిందించెను. కాని అవి అంతగా గణనీయములు కావు. కుబేరుడు రావణుని తోడబుట్టినవాడే, కాని రాక్షసుడు కాదు. పైగా అతడు దిక్పాలుడు. కనుక అతని కట్టి శక్తి ప్రాప్తించెను. అతడు తొండకు, హనుమంతునికి వరము లిచ్చెను. తుంబురునకు శాపమిచ్చెను.

దేవతలును, మానవులును కూడ పరశాపము లివ్వగల శక్తి లభింపజేసికొనిరి. కాని దేవతలు వరమిచ్చుటకే ఉత్సుకు లగుచుండగా మానవులు శాపమిచ్చుటకే మొగ్గు చూపుచున్నట్లు కాన్పించును. రాక్షసులు శాపము గాని, వరముగాని,

ఇచ్చినట్లే లేదు. దీనివల్ల సత్త్వరజస్తమోగుణములను బట్టి వరశాపశక్తులు వర్తిల్లునని తెలియుచున్నది. రామాయణములో 84 వరదానములు పేర్కొనబడినవి. వాటిలో 60 వరకు దేవత లిచ్చినవి. మానవు లిచ్చినవి 19 మాత్రమే. మొత్తము ప్రవర్తించిన 61 శాపములలో 7 మాత్రమే దేవత లిచ్చినవి. కాగా మానవు లిచ్చినవి 54. వారిచ్చిన శాపఫలములు దేవతలకును అనుభవింపనైనవి. సృష్టికర్తయు, సర్వాధికారియు నైనందున బ్రహ్మగా రిచ్చిన వరము లత్యధికముగా అనగా 20 కి మించినను అది స్వాభావికమే అనిపించును.

తపస్సువలెనే సచ్చరిత్ర, సత్యసంధత (మాట నిల్పుకొనుట), కర్తవ్యపాలనము, పతివ్రతాధర్మము మున్నగు సద్గుణముల మూలమున వాటిని పాటించు వ్యక్తుల విషయమున వారి కిట్టి శాపదాన, వరదానశక్తులు ప్రాప్తించినట్లు భావింతురు. దశరథమహారాజునకు, శ్రీరామునికి ఇట్టి అధికారము లభించెను. దశరథుడు కైకకు వరము నిచ్చెను. ఇట్టి వరములను గూర్చియు, పతివ్రతాధర్మమును గూర్చియు ముందు చర్చింపబడును. శ్రీరాముడు తన వరదానశక్తి నంతగా ప్రయోగింపలేదు. ప్రస్రవణపర్వతమునకును, నదికిని (ప్రత్యక్షరూపమున గాకున్నను) యిచ్చిన శాపము షరతులతో కూడి, వాటిని పాటించినందున ప్రభావమును గూర్చిన ప్రశ్నకే తావివ్వలేదు. శ్రీరాముడు మరుప్రదేశమునకు, అచ్చటి ప్రజలకు వరమిచ్చెను. శంబూకుడు వరమునకై యాచించినను దానిని అంగీకరింపలేదు. సీత కిచ్చిన వర మామె పాలిట శాపముగనే పరిణమించెను.

శాపము, వరము అనునవి ఒకే నాణెమునకు రెండు ప్రక్కలు. ఒకటి సంహారకస్వరూపము, రెండవది సంరక్షకము. శాపమునకు గల ప్రధానలక్ష్యము శత్రునాశము, మృత్యువు, వధ, పీడ, ఉపద్రవమువంటివి. వరమునకు మూలము మంగళభావ మగుటచే దాని పరిణామము మాంగళ్యము, శుభకామన, ఉపకారము, వంటివిగా రూపించును. ఇట్లు చూచినచో మృత్యువు శాపమునకు విషయము. వరమట్లు కాదు; కాని రామాయణములో ఒకచోట వరము మృత్యువుతో సంబంధించెను. (చూ. వరదానములు క్ర. 65). ఈ వరదాన మపవాదస్వరూపము. మేఘనాదుడు తనకు సంపూర్ణామరత్వము సిద్ధింపదని గ్రహించెను. అప్పుడు తన కెట్టి పరిస్థితిలో మృత్యువు రావలెనో కోరుకొనెను. దానికి బ్రహ్మ అనుమతించెను.

శాపముగాని వరముగాని ఇచ్చునట్టి ప్రక్రియలో శబ్దోచ్చారణమునకు వాడు మరికొన్ని సాధనములు కూడ ప్రయుక్తమగుచుండును. శాపమిచ్చు వ్యక్తి, దానిని పొందునట్టి వ్యక్తి, అను ఇద్దరు సంఘటికులకు గలిగిన ప్రత్యక్ష శారీరకసంబంధ మత్యంతప్రభావకారిగా నెంచబడును. *Physical contact is the most efficacious means of transmission*[6]. శరీరస్పర్శలో వాహకశక్తి మిక్కుటముగా నుండును. ఆశీర్వదించునపుడు తలపై చేయి నుంచుట, వీపున చేతితో నిమురుట వంటి క్రియలు గమనింతుము. శాప మిచ్చునపుడు చేతులు మీది కెత్తుదురు. స్పర్శవలెనే 'జలము' కూడ యీ సందర్భములలో మాధ్యమ మగుచుండును. సాయణాచార్యుని మతమున ఋగ్వేదములో 'జల' శబ్దమునకు 'శాప' మనియే అర్థము. దేవతలను అభిషేకించిన జలము 'తీర్థ' మనబడును. సూర్యోపాసనలో అర్ఘ్యము విడువబడును. శ్రాద్ధవిధిలో తర్పణము లిచ్చునపుడు జల ముపయోగింపబడును. శాపమిచ్చునపుడు చేతిలో జలము గ్రహించెదరు. రాజు సౌదాసుడు వసిష్ఠునికి ప్రతిశాపమిచ్చుటకు చేతిలో జలము గ్రహించెను.

*తతః క్రుద్ధస్తు సౌదాసస్తోయం జగ్రాహ పాణినా,*
*వసిష్ఠం శప్తుమారేభే భార్యా చైనమవారయత్.*
*తతః క్రోధమయం తోయం తేజోబలసమన్వితమ్,*
*వ్యసర్జయత ధర్మాత్మా హ్యతః పాదౌ సిషేచ చ.*

రాజు సౌదాసుడు కోపించి వసిష్ఠునిని శపించుటకై చేతిలో జలము గ్రహించెను. (ఉత్తరకాండ 65/29-39) కాని అతని భార్య అతనిని నివారించెను. పిదప తేజోబలపూర్ణమైన ఆ జలమును, ఆ ధర్మాత్ముడు తన పాదములపైననే విడిచెను. ఫలితముగా అతడు కల్మాషపాదు డాయెను. చాలసారులు వ్యక్తి తన యెదుట లేకున్నను శాపమివ్వబడెడిది. శ్రీమహర్షి కుమారుడు శృంగి పరీక్షితుని 'నాటి కేడవ దినమున మృత్యువువా' లగునట్లు శపించెను. కాని ఆ సమయమున పరీక్షిత్తు అతని యెదుట లేడు. భరతుడు యువరాజపద మందినచో అత డొనర్చు శ్రాద్ధాదివిధులు తనకు చెందవని దశరథుడు శపించెను. ఆ సమయమున భరతుడు మాతామహుని యింటివద్ద నుండెను. శాపమో వరమో ఇవ్వదలచినపుడు ఆ వ్యక్తి సమ్ముఖమున లేనిచో ప్రతీకము ద్వారా వాటి నొసగవచ్చునని కూడ

6. *Encyclopaedia of Religion and Ethics.p. 369*

విశ్వసించుచుండిరి. ప్రతీకద్వారమున నిచ్చిన వరశాపములు ఉద్దేశించిన వ్యక్తికి చెందుచుండెడివి. ప్రతీకరూపమున అన్నము, పానీయము, ఫలము, బొమ్మ వంటి వస్తువులు వాడబడుచుండెడివి.

శపింపబడిన వ్యక్తికి ఆ శాపమును స్వీకరింపవలసినదే. కాని కాదనుటకు స్వాతంత్ర్యము లేదు. అందువలన, శాపములన్నియు అంగీకరింపబడుచుండెడివి. కాని వరము నిచ్చినపుడు స్వీకరించుటకు గాని వలదనుటకు గాని ప్రాప్తవరుని కధికారము కలదు. అత డా వర మనుచితమని భావించినచో దాని నంగీకరింపడు. అడిగి పుచ్చుకొన్న వరము కాదనుటకు వలనుపడదు. కాక, దాని వలన నతనికి కామ్యపూర్తి కలుగుచున్నది. కాని అపవాదరూపమున నొక చోట ఇట్లడిగి పుచ్చుకొనిన వరము యాచకునిచే నస్వీకృతమయ్యెను. స్థానమహాత్మ్యమునకు ఫలముగా నొక విశిష్టక్షేత్రమున ఇళమహారాజునకు స్త్రీత్వము ప్రాప్తించెను. అతడు శివుని సన్నిధిని వరము యాచించెను. శివుడు పుంస్త్వము తప్ప వేరేదైన వరము కోరుమనెను. ఇళుడు తన కా వరము వలదనెను. ఏలయన, అతడు పురుషత్వమే ఆవశ్యకమని యెంచుచుండెను. శరభంగమహర్షి ఇవ్వదలచిన వరమును శ్రీరాముడును, అనసూయ ఈయదలచిన వరమును సీతయు స్వీకరింపలేదు. రామాయణములో నిట్లస్వీకృతములైన వరము లెన్నో యున్నవి. వరములు రెండు విధములు - యాచితములు, అయాచితములు. వీటిని గూర్చి మీద చర్చింపబడినది. శాపము నెవ్వరూ కోరరు. కనుక శాపములన్నియు అయాచితములే. యాచితశాపము లుండవు. దుశ్శాపము యాచితము, అయాచితము కూడ కావచ్చును. సామాన్యముగా నమస్కరించిన వారి నాశీర్వదింతురు. కనుక అవి అయాచితములును ఔపచారికములు నగును. వలు తడవులలో ఆశీర్వాద మడుగబడును. అప్పు డవి యాచితములగును. కాని వాటి రూపము అయాచితముల వంటిదే కాని వేరు కాదు. శుభాకాంక్ష స్వయంస్ఫూర్తిమంతము. కనుక అది ఎప్పుడూ అయాచితమే.

శాపప్రయోగ వరప్రదాన క్రియలలో భావోద్రేకము హెచ్చుగా నుండును. కాని ఆ రెండింటి స్వరూపము గతి, అభివ్యక్తి, ఫలము అనునవి వేర్వేరుగా నుండును. శాపము కోపకారణముచే నుద్భవించును. వలుచోట్ల మనఃక్షోభ మధికమై, మనసు నివారింపబడజాలక, పరిజ్ఞాన మంతరించి, సంతులితస్థితి భగ్నమగును. కోపమెంత అధికముగా నుండునో అంతగానే మనోనియంత్రణ మణగిపోవును. కోపకాలమున మనకు కార్యముపైగాని వచనములపైగాని

ధ్యానముండదు. ఈ కారణమువలన మననోట అనుకోని (అనరాని) మాటలెన్నో వెడలును.

"క్రోధాద్భవతి సంమోహః సంమోహాత్ స్మృతివిభ్రమః"
(గీత 2-63)

క్రోధమువలన సంమోహము జనించును. సంమోహముచే స్మృతివిభ్రమము కలుగును. శబ్దములు క్రోధమువలన ఎంత తీవ్రముగా వెడలుననగా వాటిపై నియంత్రణము శక్యము కాదు. నోట వెడలిన మాటల పరిణామ మెట్లుండునో అని కూడ యోచించలేము. భావావేశమున ఆలోచనకు తావుండదు. శబ్దములు వెంటవెంటనే నోటి నుండి అత్యంతతీవ్రగతిలో వెడలును. సమయాపవ్యయము జరుగదు.

వరమిచ్చునప్పుడు మనసు ప్రసన్నమై తుష్టిచెంది యుండును. కనుక భావోద్రేకము శాంతమై నెమ్మదిగా నుండును. మాటలు పలుకుటకు ముందు ఆలోచించుట కవకాశ ముండును. ఉచ్చారణకు పూర్వము, జరుగనున్న పరిణామము లూహింపవీలగును. మనస్సు సంయమితమై యుండును. ఇట్లు శాపవరప్రదాన సమయములలో మానసికావస్థ భిన్నరీతులలో నుండుటవలన వాని రూపము, పరిణామముకూడ భిన్నరీతుల నుండును. వాస్తవమునకు, అయాచితమైన వర మాలోచించి ఈయదగియుండును. కాని రాక్షసులకు వరము నిచ్చునపుడు బ్రహ్మకు అట్టి ఆలోచన ఉండినట్లు లేదు. కనుకనే కుంభకర్ణునికి వరమిచ్చు సందర్భమున మిగిలిన దేవతలు అతనికి వరమీయవద్దని బ్రతిమిలాడిరి. రావణుని కిచ్చిన వరముల ఫలితముగా ఉపద్రవములు హెచ్చి, బ్రహ్మకే తిరిగి పరిహారోపాయము ఆలోచింపవలసివచ్చెను.

శాపములో శిక్షించుట అభిప్రేతమై యుండును. వరములో శుభకామన గోచరించును. వరమందు శబ్దము లధికశక్తివంతములై యుండును. శాపములో ఇచ్ఛ ప్రబలముగా నుండును. *Blessing by words is more powerful; but the curse by thought is more powerful than that by words.*[7] శాపములో ఆలోచనకు ఎంతో ప్రాధాన్య ముండును. కాని శాప మిట్లు ఆలోచించి ఇవ్వబడునా అనినచో అది చెప్పుట కష్టము.

---

*7. Encyclopaedia of Religion and Ethics, P. 368.*

శాపము

ఎవడైనా అల్లరి పెట్టినా, అకారణముగా విసిగించినా లేక అపకృతి యొనర్చినా వానిని శిక్షించుటకై ఉచ్చరించిన బెట్టపలుకులు శాప మనబడును. శాపము కోపమువలన కలుగుటచే దానియందు ఆక్రోశ మధికముగా నుండును. శాపములు రెండు విధములు - ఒకటి, యాతు విద్యాబలమున నివ్వబడునవి, అనగా యాత్వాత్మకములు - అంధవిశ్వాసపూర్వకముగా నిచ్చు అభిచారాత్మక శాపములు. రెండవవిధము ధార్మికశాపములు. కొన్ని శాపములు షరతులతో కూడియుండును. ఆ షరతులు యథోక్తముగా పాటించినచో శాపప్రభావమునుండి తప్పించుకొనవచ్చును. ధార్మికశాపములలోను, షరతులు లేక నియమము లున్న శాపములలోను శాపమిచ్చు వ్యక్తిని సంస్కరించుబుద్ధియు, పీడింపనెంచని సహానుభూతియు నుండును. శాపమిచ్చువాని మనసులో శప్తునిపై ప్రేమ, సహానుభూతి యుండును. అతనికి నైతికజ్ఞాన ముండును. కనుకనే ఇట్టి ధార్మిక, నియమాంచితశాపము లివ్వబడును. స్వీయలౌకికసుఖప్రాప్తి, కామ్య పూర్తి వంటివాని నాశించి వినాశ, మరణ, వధ, పరాజయాదిలక్ష్యములతో అభిచారాత్మకశాపము లివ్వబడుచుండును. క్రోధావిష్టులైన ఋషిమునీశ్వరుల శాపములు తరచుగా అభిచారాత్మకములుగా నుండును. వసిష్ఠుడు సౌదాసునికి, నిమిమహారాజునకు ఇచ్చిన శాపములును, విశ్వామిత్రుడు తన కుమారులకు, వసిష్ఠపుత్రులకు ఇచ్చిన శాపములును అభిచారాత్మకములు. దీనికి విరుద్ధముగా భృగ్వంగిరసవంశీయులైన మునులు హనుమంతుని కిచ్చిన శాపము సహానుభూతి సంపన్నము. హనుమంతునిచే ఆశ్రమములోని యజ్ఞపాత్రలు, వస్త్రములు మున్నగునవి ధ్వంసమగుచుండుటచే ఆ మునులకు కోప మవశ్యము కలిగినది. కాని వారు శాపమును సౌమ్య మొనర్ప నెంచిరి. వారి మనఃస్థితిని వర్ణించుచు వాల్మీకి యిట్లు వ్రాసెను - *'శేపురేనం రఘుశ్రేష్ఠ నాతికుద్ధాతిమన్యవః'* అనగా అతని వినాశమును విశేషించి కోరనివారై, ఎక్కువ సంతాపము చెందకుండ వారు శాపమిచ్చిరి. అంతేకాదు, శాపము నందలి రెండవభాగమున శాపపరిహారము కూడ పలికిరి.

శాపమిచ్చునట్టి ప్రక్రియలో కామనాశక్తి లేదా ఇచ్ఛాశక్తి మాధ్యమముగా నుండుటచే సంపూర్ణమహత్త్వముండును. జలము మిక్కిలి ప్రభావశీలమైన వాహకమాధ్యమముగా గ్రహింపబడుచుండెను. శ్రీవేస్టర్ మార్క్ మాటలలో - *The efficacy of a wish or a curse depends not only upon the potency*

*which it possesses from the beginning owing to certain qualities in the person from whom it originates but also on the vehicle by which it is conducted just as the strength on an electrical shock depends both on the original intensity of the current and on the condition of the conductor or particularly efficient conductors are regarded blood, oily contact, food and drink.*[8] రక్తము, శారీరికస్పర్శ, అన్నజలములు ప్రభావపూర్ణములైన మాధ్యమములు.

శాపమునకు గల ప్రభావము తిరుగులేనిది. నిస్సందేహముగా శాపావిష్కారమెట్లు వెడలెనో అట్లే అది ఫలించును. అట్లు కానిచో అది శాపమనబడదు (శాపమే కాదు). ఉచ్చరించిన మాటలు వెనుకకు తీసికొనబడజాలవు. వాటిలో మార్పుచేర్పులు చేయబడజాలవు. శాపశాంతి పలికి, లేదా వేరొక వరమిచ్చి శాపతీవ్రతను దాని అవధిని తగ్గించుటకు వీలుండును. నియమపూర్వక శాపములు, నియమ (షరతు) పాలనముపై ఆధారపడియుండును. శాపఫల మెప్పుడును భావికాలమునకే చెందును. ఒకప్పుడు ఇట్టి భావిఫలము సమీపకాలములోనే జరుగును. వేరొకప్పు డది రాగల జన్మములో అనుభవమునకు వచ్చును. గౌతముని శాపమువలన ఇంద్రుని వృషణములు తత్కాలముననే తెగిపడెను. వసిష్ఠపుత్రుల శాపమువలన త్రిశంకుడు రాత్రికి రాత్రియే చండాలుడాయెను. భార్గవుడు దండునికి, దండకారణ్యమునకు ఇచ్చిన శాపము వారము దినముల మీదట ఫలించెను. విశ్వామిత్రుడు వసిష్ఠపుత్రుల కిచ్చిన శాపము ఏడువందల జన్మల వరకు వదలకుండ వెంటాడునట్టి దయ్యెను. శాపారంభము శాపమిచ్చిన నాటి నుండియే జరుగును.

*అద్యతే కాలపాశేన నీతా వైవస్వతక్షయమ్,*
*సప్తజాతిశతాన్యేవ మృతపాః సంభవంతు తే. (బాలకాండ 59)*

దుర్వాసుడు శపించినచో అది సంతతిని బాధించును. శాపమిచ్చు నట్టి బలీయమైన శక్తిని గూర్చి శ్రీవేస్టర్ మార్క్ ఇట్లు వ్రాసెను - *Purely magical power, independent of any superhuman will.... is rooted in the close association between the wish, more particularly the spo-*

---

8, *Encyclopaedia of Religion and Ethics, p. 369.*

*ken wish and the idea of its fulfilment. The wish is looked upon in the light of energy which may be transferred by material contact or by the eye or by means of speech to the person concerned and then becomes a fact.*[9] శాపమీయగల శక్తి తపస్సువలన నెట్లో, అట్లే సచ్చరిత్రవలన కూడ లభించును. పతివ్రతల వాక్కు పొల్లు పోదని విశ్వసింతురు. కారణము, అది యొక వ్రతమగుటయే. వ్రతపాలనముచే ఆత్మబలము వర్ధిల్లును. ప్రాచీన భారతీయ సమాజవ్యవస్థలో బ్రాహ్మణులకు శ్రేష్ఠతయు, పూజ్యతయు ప్రాప్తించినవి. వారు భూదేవతలుగా మన్నింపబడుచుండిరి. వారిమాట లెప్పుడును అసత్యములు కాకుండెడివి. నృగమహారాజును ఇద్దరు బ్రాహ్మణులు శపించిరి. దానికి కారణము బ్రాహ్మణ్యమే. తల్లి, తండ్రి, గురువు, జ్ఞాని వంటి పెద్దలు, శ్రేష్ఠులు నైన వ్యక్తుల పల్కులలో శాపపు తేజముండవచ్చును. ఆసన్నమరణుడైన వాని నోట వెడలిన మాటలు శాపమువలె ఫలించవచ్చును. శ్రవణఋషి దశరథుని, అనరణ్య మహారాజు రావణుని సంబోధనపూర్వకముగా చెప్పిన మాటలు మరణ ఆసన్న స్థితిలో చెప్పినవి. వేదవతి చనిపోవుటకు ముందు, అగ్నిప్రవేశమునకు పూర్వము, ప్రతిజ్ఞావాక్యములు పలికెను.

పలుచోట్ల శాపఫలము వరముగా కూడ నుండును. ఈ ప్రాంతమున కనిపించిన కన్య గర్భవతి యగును అని పులస్త్యుడు పలికెను. ఇది యెరుగక పులస్త్యుని దృష్టిపథమున పడినందున తృణబిందుని కుమార్తె గర్భవతి అయ్యెను. కాని కొద్దికాలమునకే ఆమె పులస్త్యుని భార్య అయ్యెను. వాల్మీకిశాపమునకు పరిణతియే రామాయణకావ్యరచనము. అందువలన ఆ శాపము లోకమున గౌరవభాజనమయ్యెను. భవభూతి *'హంత త్వార్షి మండితః సంసారః'*[10] అని ఆ శాపమును గౌరవించెను. బ్రహ్మ సంతోషించి వాల్మీకికి వరమిచ్చి రామాయణ రచనను ప్రోత్సహించెను. భృగువు శపించుటచే విష్ణువు మానవుడాయెను. అతడు దుష్టసంహారమొనర్చి తన మహోజ్జ్వల నిష్కళంకచరిత్రముచే మానవుని ముం దొక ఆదర్శముంచి విశ్వకళ్యాణ మొనర్చెను.

శాపమిచ్చుట మంచిదికాదు. వైదికార్యులు శాపమును నిషేధించిరి. అథర్వణవేదమం దొకచోట సకారణముగనో అకారణముగనో శాపమిచ్చువాడు విద్యుద్గ్రస్తమైన వృక్షమువలె దహించుకొని పోవుగాక అనినట్లు పేర్కొనబడెను.[11]

---

9. *Encyclopaedia of Religion and Ethics, p. 368.*
10. *ఉత్తరరామచరితమ్. అం. 2*
11. *భారతీయ సంస్కృతి కోశ్, ఖండ్ 9, పు.247*

శాపమిచ్చువానిపైననే అదొకప్పుడు వికసించి అనర్థకారి యగుననను భయము కూడ శాపకర్తను కొంతవరకు నిలపరించుచుండెను. శ్రీ గ్రిస్‌గారి మతమున *-Courses like chiken come home to roost. They turn home as birds to the nest.*[12]

శాపకారణములు

శాపమిచ్చునట్టి సందర్భములలో కొన్ని సంకేతము లగపడును. ధర్మ పాలనము, అధర్మనియంత్రణము, సామాజికవ్యవస్థను రక్షించుట వంటి ఉద్దేశ్యములతో ధార్మికశాపములును, వ్యక్తిగతభౌతికవాంఛాపూర్తికి అభిచారాత్మక శాపములు ఇవ్వబడెడివి. సామాజిక స్వాస్థ్య రక్షణముకొరకే బ్రహ్మ కుంభకర్ణునికి ఘోరనిద్ర కలుగవలెనను శాపమిచ్చెను. ఈ విధముగా వాని రాక్షసకృత్యములను నివారింపగల్గెను. భారతయుద్ధమునకు పూర్వము కుంతి కర్ణుని జన్మరహస్యము నెరిగించి యుండినచో, ఆ మహాసంగ్రామమున జరిగిన మహామానవమారణహోమ మాగిపోయి యుండును. తగిన సమయమున రహస్యమును వెలిబుచ్చక పోవుటచే నట్టి హాని జరిగిపోయినది. కనుకనే యుధిష్ఠిరుడు కుంతిని శపించెను.[13]

రామాయణములో 61 శాపములు గోచరించును. వాటికి గల కారణములు విభిన్నములు. వధ, వినాశము, ఆక్రమణము, హద్దుమీరిన ఆచరణము, ఉద్దండత, అకారణముగా భయపెట్టుట, అనుచితమైన కోరిక, పరస్త్రీ నభిలషించుట, సంభోగయాచన, బలాత్కారము, కామక్రీడలో బాధించుట, మాతాపితృగురుజనమును, శ్రేష్ఠులు పూజ్యనీయులు నైన పెద్దల ననాదరించుట, అనుచితమైన భోజనము, అనుచితసమయము వంటి ఎన్నో కారణములు శాపకారణము లగుచుండెను. తక్కిన కారణము లెట్లున్నను క్రోధము శాపమునకు ముఖ్యకారణముగా నుండెడిది. కామాతుర క్రౌంచమిథునమునందు మగపక్షిని చంపిన నిషాదునిపై వాల్మీకి శాపవాణి ప్రసరించెను. అగస్త్యు నడ్డగించి, అతనిని తినబోవునట్టి ప్రయత్నమే తాటకకు గలిగిన శాపమునకు హేతువు. తన ఏకైకపుత్రుని వధను గూర్చి విని, అత్యంతదుఃఖపీడితుడై శ్రవణముని దశరథుని శపించెను. దుందుభి రక్కసుని చంపిన వాలి వాని శరీరమును

---

12. *Encyclopaedia of Religion and Ethics, p. 372.*
13. *మహాభారతమ్, స్త్రీపర్వ.*

తీవ్రముగా త్రిప్పి విసిరి నందున అతని రక్తబిందువులు మతంగుని ఆశ్రమభూమిలో పడుటచే నా ఋషి కోపించి వాలికి శాపమిచ్చెను. బలాత్కరించి, ప్రియభర్తలను సంహరించినది కారణముగా పతివ్రత లెందరో రావణుని శపించిరి. భృగుపత్నిని వధించుటచే విష్ణువునకు శాపము కలిగెను. కైకను నిందించుచు భరతు డాడిన మాటలు, తీవ్రతలో శాపమువంటివే అనిపించును. ఆ పరుషవచనములకు కారణము దశరథుని మరణము.

పుంజికస్థల, రంభ, పతివ్రతాజనము రావణుని కిచ్చిన శాపములకు హేతువు అతడు వారిపై జరిపిన బలాత్కారము. వేదవతి ప్రత్యక్షముగా రావణుని శపింపకున్నను, అత డామె కొనర్చిన అగౌరవమును, ఆమెపై చేయి వేయుటయు ననువాటివలన, శాపమును మించగల ప్రతిజ్ఞచేసి ఆమె మరణించెను. అహల్య ఇంద్రునితోను, ఊర్వశి వరుణునితోను భోగించి, గౌతమునిచే నొకతెయు, మిత్రునిచే వేరొకతెయు శప్తులైరి. ధర్మరతి నాటంకపరచిన దేవతలకును, పరోక్షముగా వారికి సహాయపడిన భూమికిని ఉమాదేవి శాపము లిచ్చెను. కన్ను కేడించి చూచిన దానికి ఫలముగా పార్వతివలన కుబేరుని కండ్లు పింగళవర్ణము కలవయ్యెను.

యజ్ఞకార్యములయందును, తపస్సునందును విఘ్నము లొనర్చినవారిని ఋషు లెన్నడును క్షమింపలేదు. విశ్వామిత్రుడు రంభను శపించుటకు కారణము, ఆమె ఇంద్రుడు పంపగా తపోభంగము చేయుటకై వచ్చుటయే. ఆశ్రమములోని యజ్ఞపాత్రాదులను ధ్వంసమొనర్చినందున హనుమంతునికి మునీశ్వరులు శాపమిచ్చిరి. పులస్త్యుని తపమునకు విఘ్నములు కల్గుచుండెను. ఆ కోపమున నతడు తన దృష్టిపథమున పడిన కన్యక గర్భవతి కాగలదని శపించెను. తపోవ్యయము కారా దను తలంపుతోనే విశ్వామిత్రుడు మారీచసుబాహులను, వేదవతి రావణుని, దండకావనవాసులైన మును లచ్చటి రాక్షసులను శపింపలేదు. ఇట్టి కారణముననే కుశకన్యలు వాయువును శపించలేదు.

స్వేచ్ఛావిహారమునకు ఫలితముగా విశ్వావసు గంధర్వునకు శాపమబ్బెను; అతడు దేవేంద్రునిపై దండెత్తెను. శంకరునిగూర్చి అగౌరవముగా మాట్లాడిన దానికి బదులుగా నందీశ్వరుడు రావణునకు తగిన బుద్ధి చెప్పెను. బ్రాహ్మణుల ననాదరించి నృగమహారాజు శాపగ్రస్తుడాయెను. తండ్రిమాట మన్నింపక విశ్వామిత్ర పుత్రులును, అతని యజ్ఞాహ్వానమును మన్నింపక వసిష్ఠపుత్రులును శాపముల పాలయిరి. తండ్రి యాజ్ఞను కాదని యదువు శాపము పొందెను. గురువు

నవమానించి, అతని యాజ్ఞను ధిక్కరించినందున నిమికి వసిష్ఠుడు శాపమిచ్చెను. ఋషులను బెదిరించి, వారిని బాధించుటచే అగస్త్యునివలన మారీచుడును, స్థూలశిరునివలన విశ్వావసుగంధర్వుడు శాపగ్రస్తులు కావలసివచ్చెను.

విశ్వామిత్ర వసిష్ఠ మతంగాది ఋషీశ్వరుల శాపములకు వారి అనివార్యమైన క్రోధమే ముఖ్యకారణము. మూర్ఖపు పట్టుదల వహించుటచే కైకను దశరథుడు శపించెను. సదేహస్వర్గగమన మను అనుచితకాంక్షకు ఫలముగా త్రిశంకునికి శాపము కలిగెను. తాటక వసించుటచే తాటకావనము, దండుని సంపర్కముచే దండకావనము, రావణుని కారణమున లంకయు శాపగ్రస్తము లాయెను. బ్రాహ్మణుని శపింపరాదను నియమమున్నను, కుక్కను కట్టెతో కొట్టినందున బ్రాహ్మణునికి కూడ శాపమిచ్చిన ఉదాహరణ మొకటి రామాయణమున లభించుచున్నది.

వాల్మీకిరామాయణములోని కొన్ని శాపములకు కారణములు స్పష్టముగా తెలియకున్నవి.

## శాపప్రభావము

శాపప్రభావము మిక్కిలి దూరముపరకు వ్యాపించి దారుణముగా నుండును. మరణము, వధ, వినాశము, వియోగము, సౌందర్యహాని, నీచయోనియందు జన్మము, హైన్యమైన జీవనము, నికృష్టాహారము, శారీరికదౌర్బల్యము, సంతాననష్టము, వంశనాశము, యుద్ధములో అపజయము వంటి వివిధములైన ఫలము లెన్నో శాపప్రభావమున ననుభవింపవలసి వచ్చుచుండెను.

దశరథుని అకాలమరణము శ్రవణముని యిచ్చిన శాపమునకు ఫలము. బ్రహ్మ, నలకూబరుడు, ఎందరో పతివ్రతలు ఇచ్చిన శాపములకు ఫలితముగా రావణునికి మరణము సంభవించెను. బ్రహ్మయు, నలకూబరుడును ఇచ్చిన శాపములు షరతులతో కూడినవి. రావణు డా షరతులను పాలించుటకు బదులు వాటి నుల్లంఘించుటకే పూనుకొనెను. కాని వాని కా విషయమున భయముండెను. కనుక అవి పాటింపబడుచూ వచ్చెను. వేదవతి రావణుని వధించుటకే పునర్జన్మ మందుటకై ప్రతిజ్ఞ చేసెను. అనరణ్యమహారాజు మరణాసన్నకాలమున శపించి రావణుని చావునకు కారణమయ్యెను. రావణుని మృత్యు వెన్నో శాపముల పంట. వసిష్ఠుడును నిమియు పరస్పరము శపించుకొని చైతన్యహీనులైరి.

వసిష్ఠపుత్రులకు, విశ్వామిత్రపుత్రులకు, మారీచునికి, దనువునకు మరుజన్మమున కూడ శాపఫల మనుభవించవలసివచ్చెను. వారికి హీనయోని ప్రాప్తించెను. నికృష్టాహారము గ్రహింపనాయెను. నీచమైన జీవనము సాగింపవలసి వచ్చెను. స్వర్గవాసులైన అప్సరసలకు, దేవతలకు కూడ శాపఫల మనుభవింపక తప్పలేదు. విష్ణువు, ఊర్వశి, పుంజికస్థల మర్త్యలోకమున నివసింపవలసివచ్చెను. రాజవంశీయులైన బ్రహ్మదత్త, నృగులకు నక్కగాను, ఊసరవిల్లిగాను మారి బ్రతుకవలసివచ్చెను. ఇంద్రుడు మేషవృషణు డయ్యెను. కుబేరుని కొక కన్ను కాలి బూడిద కాగా, రెండవది పింగళవర్ణ మందెను. కుక్కను కట్టెతో కొట్టినందుకు ఫలముగా బ్రాహ్మణునికి మీదటి జన్మములో కులపతిగా ప్రత్యక్షనరక మనుభవింపవలసివచ్చెను. అహల్యకు గల సౌందర్యము నశించెను. ఆమె ధూళిలో బ్రుంగవలసివచ్చెను. విశ్వావసుగంధర్వునికి, తుంబురునకు పతనమేకాదు, పైగా విరూపముకూడ పొందనయ్యెను. ఇది వారి కిచ్చిన శాపములకు ఫలము. దుష్టసంగతికి ఫలితముగా తాటకావని, దండకావన, లంకానగరములకు దుర్దశ వాటిల్లెను. అహల్యకు వాయుమాత్రము ఆహారమయ్యెను. పృథ్వికి ఎందరికో భార్యకావలసివచ్చుటే కాక, నిస్సంతుగా కూడ నుండవలసివచ్చెను. నందీశ్వరుని శాపఫలితముగా రావణుని కులము సంహరింపబడెను. పులస్త్యుని దృష్టిపాతమాత్రముననే తృణబిందుని కుమార్తెకు గర్భము కలిగెను.

వాల్మీకి రామాయణమున గోచరించు కొన్ని శాపముల ప్రభావము స్పష్టముగా తెలియకున్నది.

## నియమపూర్వక (లేదా షరతులతో కూడిన) శాపములు

నియమపూర్వక శాపము *(Conditional curse)* అను శబ్దము మొదట శ్రీవేస్టర్‌మార్కు చే ప్రయోగింపబడెను. ఈ రీతి శాపములో తక్కిన శాపములకంటె నైతికప్రభావ మధికముగా నుండును. ఏ వ్యక్తిని శపించుచుండెనో ఆ వ్యక్తిని గూర్చి శాపమిచ్చు నతనికి కొంత సానుభూతి యుండును. వానికి శుభము కలుగవలెనను భావనయుండును. శాపప్రదాత తానిచ్చిన శాపఫల మనుభవమునకు రాకూడదనియే తలచును. అందుకని శాపమువలన కలుగు ఫలము ముందుగనే తెలియజేయుచు, దాని నుండి తప్పించుకొను నుపాయ మెరిగించును. జాగ్రత్తగా మెలగి, శాపనియమములు పాటించినచో శాపపు దుష్ఫలము తగ్గక పోయినను తప్పించుకొనవచ్చునని చెప్పును. కాగా యీ శాపము నిజానికి

శాప మనబడదు. శ్రీవేస్టర్ మార్క్ వచనములలో - *Conditional curse is an important development of the principle of cursing and blessing and has had considerable influence in the making of morality, especially in the sphere of good faith, honesty and faithfulness... The energy of a conditional curse is the Supernatural energy of an ordinary curse or of its embodiment in a latest state. This is discharged by the act if or when it takes place, against which the curse is directed.*[14]

నియమపూర్వకశాపములో సామాజిక నైతిక నియమము లుండును. శాపఫలము తప్పకపోయినను, నియమములవలన శాపము పూర్తిగా ఇపుడు శప్తుని వశమున నుండును. ఇట్టి శాపశాంత్యుపాయములవలన శాపతీవ్రతయు, కాలావధియు తగ్గిపోవును. కాని ఇదంతయు శాపప్రదాత ఇష్టముపై నాధారపడియుండును. శప్తుని కాతని కృపపై నాధారపడవలసియుండును. శాపశాంతిగాని, శాప మోక్షణముగాని సూచింపబడినను, అట్టిది కోరినప్పుడు కూడ శప్తునికి శాపకర్త కృపకై నాధారపడక తప్పదు. నియమపూర్వక శాపమువలెనే నియమపూర్వక వరము కూడ నుండును. కాని వీనితో పోల్చినవు డివి చాల తక్కువ.

వాల్మీకి రామాయణములో పదిశాపములు నియమములతో కూడినవి. దశరథుడు కైకకు తనతో గల పత్నీత్వసంబంధమును తెంపుజేయునట్టి తలంపు సూచించెను. ఇది నియమములపై నాధారపడియుండెను. ఆమె తన పట్టుదల వదలినచో ఆమె కా ఫలము చెందదు. అట్లే దశరథుడు తాను గతించిన వెనుక, భరతుడు యువరాజుపదవి చేపట్టినచో తన కుత్తరక్రియ లతడు చేసినను తనకు చెందవని శపించెను. కాని భరతుడు యువరాజపదవి నందలేదు. కావున ఆ శాప మతనికి వర్తింపలేదు. ప్రస్రవణగిరికిని, నదికిని శ్రీరాముడిచ్చిన శాపములో గల నియమ మేమనగా అవి అతని ప్రశ్నములకు ఉత్తర మిచ్చుట. సంకేతములద్వారా పర్వత మతని ప్రశ్నలకు సమాధాన మిచ్చెను. అంతటితో ఆ శాపము శమించెను. మతంగమహర్షి పెట్టిన షరతులు పాలించుటచే వాలి కతని శాపము తగలలేదు. రావణుడు సీతను ఆమె ఇష్టమునకు విరుద్ధముగా ఎరిగి ముట్టలేదు. కనుక నలకూబర, బ్రహ్మ లిచ్చిన శాపము లతనికి చెంది అతని తల పగిలిపోలేదు.

---

14. Encyclopaedia of Religion and Ethics, p. 372.

యజ్ఞారంభ మొనర్పక ఆజ్ఞాభంగ మొనర్చినచో విశ్వామిత్రుడు కోపించి శపించు నేమో అను భయముచే ఋషు లందరు తగురీతిని సావధానులై వ్యవహరించిరి. అతని ఆజ్ఞకు భంగము వాటిల్లలేదు. శ్రీరాముడు తల్లి యిష్టమును కాదని అడవి కేగినచో అతనికి నరకవాస మబ్బునను మాట కౌసల్య నోట వెడలెను. ఇది నియమపూర్వకశాపమే. కాని రాము డా షరతు పాలించలేదు. అయినను అతని కా శాపఫల మంటలేదు. రాముడు నరక మేగలేదు. రామాయణములో ఈ శాప మొక్కటియే షరతు పాలింపకున్నను ఫల మివ్వనిది కనుక ఈ శాపమునుగూర్చి కొంత సూక్ష్మముగా విచారింపవలెను. శ్రీరాముడు వనవాస మేగుట స్పష్టము. కనుక నియమోల్లంఘనము జరిగినది. కాగా శాపవాక్యములోని ఉత్తరార్థమునుగూర్చి విచారించి రామునికి నరకవాస మబ్బెనా లేదా అని చూడవలెను. వాల్మీకిరామాయణములో అతనికి స్వర్గమున భవ్యమైన స్వాగతము లభించినట్లు ప్రబలమైన ప్రమాణ మున్నది. కనుక అతనికి నరకవాసము కలుగలేదనుట స్పష్టము. స్వయముగా కాలపురుషుడే రామునికడకు వచ్చి, అవతారసమాప్తి కవసరమాయె ననియు, బ్రహ్మ యీ సందేశమును తన ద్వారా పంపెననియు ఏకాంతమున నివేదించెను. దాని ననుసరించి శ్రీరాముడు లక్ష్మణుని వెనుక మహాప్రస్థాన మొనర్చెను. అతడు సరయూనదీజలములలో మునుగుచున్నప్పుడు అంతరిక్షమున నిల్చి బ్రహ్మ *'ఆగచ్ఛ విష్ణో భద్రం తే దిష్ట్యా ప్రాప్తోఽసి రాఘవ'* - 'రమ్ము మహావిష్ణూ! రాఘవా! నీకు శుభము. స్వర్గమునకు నీవు రాదలచినందున మిక్కిలి సంతోషము' అని పలికెను.[15] అంతేకాదు. రామునికి స్వేచ్ఛగా కావలసిన శరీరము ధరించుట కవకాశముకూడ కల్పింపబడినది. శ్రీరాముడు వైష్ణవతేజ మందిన పిదప దేవతలందరూ చేరి యిట్లు పలికిరి.

*సర్వం పుష్టం ప్రముదితం సుసంపూర్ణమనోరథమ్,*
*సాధు సాధ్వీతి తై ర్దేవై స్త్రిదివం గతకల్మషమ్.*

నీ రాకవలన స్వర్గమంతయు పరిపుష్టము, సంతుష్టము, కృతార్థము, పాపరహితము నైనది. నీవు ధన్యుడవు.[15] దేవతల మాటలలో గల ఈ స్వీకృతి వలన రామునికి స్వర్గావాసము లభించిన దనుటలో సందేహములేదు. కాగా, వెనుకటి శాపమును, తత్ఫలములను గూర్చి విచారించినచో కౌసల్యకు శాపమిచ్చునట్టి అధికారము లేదేమో అని అనిపించును. కాన ఆమె మాటలు బాధించునవియేకాని

---

*15. ఉత్తరకాండ స. 110 శ్లో. 8, 15.*

శాపము లగుటకు తగినంత బలమైనవి కావు. అవి శాపతుల్యములు, అంతేకాని శాపము వలె అమోఘమైన ప్రభావము చూపదగినవి కావు.

## నిరుద్ధ శాపములు

శాప మిచ్చినచో పుణ్యక్షయము, తపోవ్యయము జరుగునను విశ్వాసముచే పలుతడవలు, శాపమీయవలెనని తలచియు, బుద్ధిపూర్వకముగనే శాపమివ్వక వెడలినట్లు కాన్పించును. మనసులోని సంకల్పము, మాటలద్వారా ఉచ్చరింపబడి ప్రకటము కాకున్నచో అది శాపరూపము ధరింపదు. కాని మనసులో అట్టి ఇచ్ఛ జనించుట అనుచితమని చెప్పబడదు. వరశాపములు వాక్శక్తులు. వాటి ప్రభావము అవి ఉచ్చరింపబడిన పిమ్మటనే వ్యక్తమగును. ఇందువల్లనే ఋషులు,మునులు, రాజులు, వ్రతులు మున్నగువారు చాల సావధానులై శాపప్రయోగ మొనర్చుచుండిరి. అనియంత్రితమైన క్రోధమెప్పుడు శబ్దోచ్చారణ మూలమున ప్రకటమగునో తెలియదు. అప్పుడు దాని నాపుటకు వలయు నుపాయముండదు. కాని శాపమిచ్చుట నిందనీయమని గమనించినచో, శాపవిచారము కలిగినను అది శబ్దరూపమున ప్రకటము కాదు. రామాయణములో ఇట్లు నిలవరించిన శాపావకాశములు పదివరకు కలవు.

తన స్వశక్తితో మారీచసుబాహులను దండించుట విశ్వామిత్రునకు సాధ్యమే కాని వ్రతస్థుడైనందున అతడు తన శక్తిని ప్రయోగింపక దశరథుని శ్రీరామ సహాయ మర్థించెను. తపోవ్యయము నంగీకరింపక వేదవతి రావణుని శపించుటకు బదులు, వేరే ప్రతిజ్ఞచేసెను. దండకాటవిలో మునులును, మునికన్యకలును, బుద్ధిపూర్వకముగా శాపాక్షరములు పలుకలేదు. ఈ విధముగా ఇవ్వక విడిచిన కొన్ని శాపముల సందర్భములలో శాపప్రదాత మనసులో నెట్టి విచారములు పొడసూపినవో స్పష్టముగా తెలియదు. కాని శాపగ్రహీతల కట్టి భయ ముండకపోదు. అతిథివలె వచ్చిన రావణునిగూర్చి సీతకును, త్రిశంకుయజ్ఞమున పాల్గొనవచ్చిన మునులకు విశ్వామిత్రునివలనను, శాపభీతి యుండెను. గురునకు శాపమిచ్చుట తగదను బుద్ధితో, ఉద్యుక్తుడయ్యును సౌదాసుడు శాపమీయలేదు. లక్ష్మణుడు దుర్వాసుని అనురోధ మంగీకరించెను. కనుక మనసున నెంచియు అతడు శాపమీయలేదు. అట్టి అవసరమే కలుగలేదు. శ్రవణకుమారుడు ఏకైక పుత్రుడైన తన వధను గూర్చి విన్నచో తన తండ్రి దశరథుని శపించునని భయపడెను. కాని రాజునకు శాపమిచ్చుట అత డిచ్ఛగింపలేదు. కనుకనే

అతడు శాపాఘాతము నుండి తప్పించుకొనుటకు దశరథున కుపాయము చెప్పెను.

*పితు స్త్వమేవ మే గత్వా శీఘ్రమాచక్ష్వ రాఘవ*
*తం ప్రసాదయ గత్వా త్వం న త్వాం స కుపితః శపేత్.*

ఓ రఘువంశనాయకా! నీవు వెంటనే పోయి మా తండ్రి కీ వార్త తెలుపుము. నీ వతని నట్లు ప్రసన్నుని చేసికొనుము. అట్లయినచో అతడు కోపించి నిన్ను శపింపడు.[16]

ప్రతిశాపము

శాప మిచ్చుటకు గల అనేకానేకకారణములలో ఒక శాపమునకు కారణముగా వేరొక శాపము ప్రయోగింపబడుటయు కాననగును. శాపమునకు బదులుగా ప్రతిశాప మివ్వబడును. రామాయణములో రెండు చోట్ల ప్రతిశాపముల కవకాశము కలిగినది. ఒక చోట ప్రతిశాప మివ్వబడినది. కాని రెండవచోట అది నిలుపరింప బడినది. ఈ రెండును వసిష్ఠుడిచ్చిన శాపములకు సంబంధించినవి.

నిమిమహారాజు తా నాచరింపదలచిన దీర్ఘసత్రమునకు మొదట బ్రహ్మర్షి యైన వసిష్ఠుని పిలిచి ఋత్విగ్వరణ మొసగెను. కాని ఈ సమాచారమందు కొనుటకు ముందే వసిష్ఠుడు ఇంద్రుని యజ్ఞమునకై ఋత్విగ్వరణ మందుకొనెను. ఆ కారణమున నతడు నిమిప్రార్థనమును వెంటనే అంగీకరింపజాలకపోయెను. అందుకని, కొన్ని దినములు వేచి ప్రతీక్షింపవలసినదిగా సలహా యిచ్చెను. కాని నిమి గౌతముని పిల్చి యజ్ఞము జరిపించెను. ఇది తెలిసి వసిష్ఠుడు క్రోధావిష్టుడై సమాధాన మడుగదలచి నిమివద్ద కేగెను. ఆ సమయమున నిమి నిద్రించుచుండెను. కనుక వసిష్ఠున కతనిని చూచు నవకాశము చిక్కలేదు. ఇందుపై మరింత కుపితుడై వసిష్ఠుడు 'నన్నవజ్ఞపరచి గౌతముని ఋత్విక్కుగా వరించి యజ్ఞమొనర్చితివి కావున నీ దేహ మిట్లే అచేతనమగుగాక' అని శపించెను. మేల్కొనిన పిదప నిమికి వసిష్ఠుడిచ్చిన శాపమును గురించి తెలిసెను. అంతలో అతడు కూడ కోపించి - మీరాక నాకు తెలియని సమయమున, నేను నిద్రలో నుండగా, మీరు కోపించి యమదండతుల్యమయిన శాపము నాపై ప్రయోగించినందున ఓ బ్రహ్మర్షీ, మీ మనోహరశరీరముకూడ

---

*16. అయోధ్యాకాండ స. 63. శ్లో. 43, 45*

నిస్పందేహముగా అచేతనమై పడియుండును' అని మరుశాప మిచ్చెను.[17]

వేటకై వెళ్లి అడవిలో సంచరించుచు, సౌదాసమహారాజు అక్కడ నొక రాక్షసుని వధించెను. ఇది యెరిగి రక్కసుని మిత్రుడొకడు రాజుపై బదులు తీర్చుకొనుటకు ప్రతిన బూనెను. రాక్షసులకు కామరూపము గ్రహించు శక్తి సహజము. కనుక అతడు వసిష్ఠుని రూపము ధరించి రాజును కలిసి భోజన మర్థించెను. రాజు వల్లె యని తగినట్లు వంట చేయుమని ఆదేశించెను. అప్పుడా రాక్షసుడు వంటవాని రూపము ధరించి నరమాంసము వండి రాజుచేత దానిని నిజవసిష్ఠునికి పెట్టించెను. భోజనసామగ్రిని చూచుటతోడనే వసిష్ఠు డాగ్రహించెను. రాజునకు తన అపరాధ మేమో అర్థము కాలేదు. అకారణముగా తనకు శాపము కలిగినందుకు, కోపించి అతడు వసిష్ఠుని శపించుటకై జలము గ్రహించెను. ఆతని రాణి అతని నాపి గురువుకు శాపమీయ తగదని అనునయించి చెప్పెను. దానిపై ప్రతిశాపమిచ్చు ప్రయత్నము విరమించెను.[17]

శాపపరిహారము

శపింపబడిన వ్యక్తికి మేలెంచి, దోషమునకు శిక్ష కలిగినను, తప్పు సవరించుకొను నవకాశము కలిగించుటకై, శాపఫలము తప్పదు కనుకను, మార్చుటకు వీలులేదు కనుకను, శాపమీయగల శక్తి కలిగియు క్షుద్రకారణములపై కోపించి శపించుట నిందనీయమని యెంచుటచేతను, శాపమిచ్చినను పరిహారము కూడ చెప్పబడుచుండెను. అనియంత్రితమైన క్రోధమునకు ఫలముగా కలుగు శాపప్రభావమును గూర్చి లెస్సగా చింతింపకయే చాలసార్లు ఘోరమైన శాపము లివ్వబడుచుండెను. కాని తర్వాత పశ్చాత్తాపము కల్గుచుండెను. శాపప్రభావమును తగ్గించుటయే శాపపరిహార ప్రయోజనము. వేరొక శాపమిచ్చి కూడ ఇట్టి ప్రయోజనము సాధింపవచ్చును. శాపపరిహారము పలికి, శాపావధిని తగ్గించి, స్తిమితమొనర్చుటకూడ కలదు. శప్తుడైనవాడు తన తప్పు గుర్తించి శాపప్రభావమును, దాని కాలావధిని, సౌమ్యమొనర్చి తగ్గించుటకు ప్రార్థించిన సందర్భములో శాప పరిహారము వచింపబడుచుండెను. కాని ఒకప్పుడు శాపప్రయోక్తచే పశ్చాత్తాపము కల్గి కాని, వేరు కారణములచే గాని మనసు మారి శాపప్రభావమును, దాని తీవ్రతను తగ్గించుటకు శాపపరిహారము తెలుపబడుచుండెను. ఇది అయాచితము. ఏవిధమైనదైనను శాపపరిహారమును సూచించుటగాని, సూచింపక పోవుటగాని,

---

*17. చూ. శాప.క్ర. 50, 57.*

మార్పుచేయుటగాని శాపప్రదాత ఇష్టానిష్టములపై నాధారపడియుండును. ప్రతిశాపమునకు శాపపరిహారము చెప్పబడదు. రామాయణములోని 61 శాపములలో 11 శాపములకు మాత్రమే పరిహారము చెప్పబడెను. శాపపరిహారమునకు ప్రత్యేకాస్తిత్వ ముండదు. అది యిచ్చిన శాపముపైననే ఆధారపడియుండును. శాపముతో పోల్చి చూచినపుడు అది గౌణ మనిపించును. అయినను అది మహత్త్వపూర్ణమైనదని చెప్పక తప్పదు.

స్థూలశిరోమహర్షిశాపముచే విశ్వావసుగంధర్వునికి కబంధరాక్షసుడుగా మారవలసివచ్చెను. కాని అతని ప్రార్థనపై శాపశాంతి చెప్పబడెను. శ్రీరాముడు ఈ నిర్జనాటవిలో సంచరించుచూ వచ్చి, నీచేతులు ఖండించి, దహనమొనర్చుటతో నీకు నీ మొదటి దివ్యరూపము తిరిగి లభించునని ఆ ఋషి శాపశాంతిని సూచించెను. ఈ గంధర్వునికి ఇంద్రు డిచ్చిన శాపముకూడ నుండెను. కాని అతడు దానికిని శాపశాంతిని వేడి గ్రహించెను. ఇట్టివి యాచించి గ్రహించినవి. అప్సరసయైన పుంజికస్థలకు శాపకాలములో ఇచ్ఛానుసారముగా, మానవరూపముగాని, వానరరూపముగాని పొందుట కవకాశ మీయబడెను. కుంభకర్ణునిపరముగా రాముడు యాచించిన దానికి ఫలముగా అతనికి ఆరుమాసములు నిద్రించి మేల్కొనిన పిదప ఒకరోజు మాత్రము స్వేచ్ఛగా చరించుటకు సంహార మొనర్చుటకు అనుమతి లభించెను. కైకసి కోరికపైననే పితృకులానురూపుడైన పుత్రుడొకడు (విభీషణుడు) కల్గునని శాంతి చెప్పబడెను. గౌతమునికి అనుచితమైన భోజనమిచ్చిన దానికి ఫలితముగా శృగాలజన్మము కల్గునట్టి శాపమును, శ్రీరాముని దర్శించుటతో శాపవిముక్తిరూపపరిహారమును వచింపజేసెను.

రామాయణములో అహల్య కథ రెండుమారులు వచ్చును. కాని రెండింటిలోను కొంత భేద మున్నది.[18] శాపపరిహారము రెండింటిలోను సమానమే కాని దాని స్వరూపము భిన్నము. బాలకాండలో చెప్పిన శాపశాంతి అయాచితము. ఉత్తరకాండలో చెప్పినది యాచితము. బాలకాండకథ ననుసరించి చూచినచో అహల్యకు గౌతమరూపమున ఆశ్రమములోనికి వచ్చిన వ్యక్తి ఇంద్రుడని తెలియును. అంతేకాదు; దేవేంద్రు డంతటివాడు తనపై అభిలాష వహించినా డన్న విషయమున నామె గర్వించినది కూడ. ఇట్లామె దోషము చాల పెద్దది. తగినట్లుగా ఘోరమైన దండమిచ్చుటయే సరి. గౌతము డామెను పరులకు కనబడకుండ వేలకొలది సంవత్సరములు, కేవలవాయుభక్షణముపై జీవించి

*18. బాలకాండ స. 48, 49: ఉత్తరకాండ స. 30.*

యుందునట్లు శపించెను. కాని వెంటనే శ్రీరాముని దర్శనముతో నామె శుద్ధురా లగుననియు, అప్పు డామెకు పూర్వపు రూపము తిరిగి లభింపగలదనియు శాపమోక్షమునుగూర్చి వచించెను. అంత ఘోరమైన తప్పిదమునకు గౌతము దయాచితముగా శాపశాంతి వచించుట నిజముగా ఆశ్చర్యకరము. ఉత్తరకాండము లోని కథ ప్రకారము, ఆశ్రమములోనికి మారువేషమున వచ్చిన వ్యక్తి ఇంద్రుడని అహల్యకు తెలియదు. ఇదెంతవరకు నిజమో తెలిసికొనదగు మార్గము లేదు. ఈ విషయమున వాల్మీకియే మన కాధారము. శాపశాంతిని గూర్చి అహల్య గౌతముని ప్రార్థించెను. తా నెరిగి యెరిగి తప్పు చేయలేదని చెప్పి శాపమును కొంత సౌమ్య మొనర్చుమని వేడుకొనెను. కాగా ఈ పట్టున గౌతముడు వచించిన శాపశాంతి యాచితము. 'మహావీరుడైన విష్ణువు మానవరూపము ధరించి బ్రాహ్మణుల కార్యమున వనమునకు వచ్చును. అప్పుడు నీవు పవిత్రురాల వగుదువు. ఈ దుష్కర్మమునుండి నీకు శుద్ధి ప్రసాదింపగలశక్తి కేవల మతనికే కలదు. నీ వాతనికి ఆదరపూర్వకముగా ఆతిథ్యమిచ్చినచో, తిరిగి నాపద్దకు రాగలవు. మరల నాతో నుండగలవు' - అని గౌతము డామెకు శాపవిమోచనమును గూర్చి తెలియజేసెను.

తపోభంగ మొనర్పదలచి వచ్చిన రంభను విశ్వామిత్రుడు వేయి సంవత్సరములు పాషాణముగా పడియుండు మని శపించెను. కాని వెంటనే ఆమె నోదార్చి ఒకానొక తేజస్వియైన బ్రాహ్మణునిచే తిరిగి నీ వుద్ధరింపబడగలవని పల్కెను. యజ్ఞబాధాకరముగా ప్రవర్తించుచున్న హనుమంతునికి మునీశ్వరులు శాప మిచ్చిరి. వెన్వెంటనే 'వేరొకరివలన స్మృతి కలుగజేయగా నీకు నీ స్వశక్తి తిరిగి స్ఫురించును' అని శాపశాంతి వచించిరి. బ్రాహ్మణశాపమున నృగమహారాజు దీర్ఘకాలము ఊసరవెల్లిగా పడియుండవలసివచ్చెను. కాని పాపనిష్కృతి కలిగినంతనే శాపవిముక్తికూడ కలుగునని ధైర్య మొసగబడెను. ఈ చెప్పిన శాపములును, బాలకాండలో అహల్య కిచ్చిన శాపమును, వీటి శాంతులును శాపమునకు ఉత్తరార్థముగా పేర్కొనబడినవి. సౌదాసమహారాజు వసిష్ఠునికి పెట్టదలచిన భోజనములో అతడెరిగి చేసిన దోష మేమియు లేదు. ఇది తెలిసిన వెంటనే వసిష్ఠుడు, తాను తొందరపడి శాపమిచ్చినట్లును, పొరపాటు జరిగినట్లును గ్రహించెను. కాని శాపము మరల్పబడదు. అతడు శాపశాంతికూడ వచింపలేదు. కాని వేరొక వరమిచ్చి తన్మూలమున శాపావధిని పన్నెండుసంవత్సరములకు తగ్గించెను. అంతేకాదు, ఆ అవధి గడిచిన పిదప అతని కా పూర్వస్మృతి యుండదని కూడ చెప్పి ఓదార్చెను.

ఈ శాపశాంతులలో శ్రీరాముని దర్శన, స్పర్శనములకు మహత్త్వ మీయబడినది. రామకథ కనుక శ్రీరాముని కట్టి గుణగౌరవ మధికముగా నిచ్చి వర్ణించుట సహజమే అనదగును.

**శపథము - ప్రతిజ్ఞ**

శాపము, శపథము అను రెండు శబ్దములు శప్ ధాతువునుండియే నిష్పన్నములు. శపథము ప్రతిజ్ఞాసూచకమైన శబ్దము. తాను చెప్పినది నిజమని నమ్మకము కలిగించుటకు, 'నామాట లసత్యములైనచో నాకు ఘోరమైన అరిష్టము కల్గుగాక' అని చెప్పుచూ పలికెడి మాట శపథ మనబడును.[19] శపథమున కిచ్చిన ఈ పరిభాష శపథక్రియకు గల కొన్ని సంఘటకముల నవశ్యము తెల్పుచున్నది. కాని ఇది అవ్యాప్తిదోషముతో కూడినది. చాల శపథము లీ పరిభాషతో చెప్పి నిర్వచింపబడజాలవు. శ్రీరాముడు సీతను వాల్మీకిముని ఆశ్రమమునకు సమీపమున గల నిర్జనారణ్యమున విడిచిరావలసినదని లక్ష్మణుని ఆదేశించెను. అట్లే లక్ష్మణు డామెను వనమునకు తీసికొని వెళ్లెను. కాని రాముని ఆజ్ఞను గూర్చి చెప్పుట కతడు సాహసింపలేక పోయెను. ఎప్పటివలె మాట్లాడకుండుట చూసి లక్ష్మణునిపై సీతకు సందేహము కలిగెను. దీనిలో నేదో కొంత మర్మమున్నదని ఆమె తలంచెను. నేడు నీవు స్వస్థచిత్తునివలె లేవు. నిజము చెప్పుము. మహారాజునకు కుశలమా! *'శాపితోఽసి నరేంద్రేణ యత్త్వం సంతాపమాగతః'*[20] మహారాజుపై శపథము. నీవేల ఇంత సంతాపము వహించుచుంటివి? అని ఆమె పలికెను. ఈ శపథములో సత్యమునుగూర్చి, విశ్వాసము జనింపజేయుటకుగాని అసత్యమైనచో తన కరిష్టము కలుగవలెనను సూచనగాని ఏమియూ లేదు. అయినను ఇది శపథమే. శపథపరిభాషను గూర్చి శ్రీ ఓడ్ గారిట్లు చెప్పిరి - ఏ దేవీదేవతలనో లేక ఏ పవిత్రవస్తువునో పేర్కొనుచూ తన వచనములు సత్యములని దృఢవిశ్వాసము కలిగించునట్టి వాక్యము శపథమనబడును. శ్రీవెస్టర్ మార్క్ ననుసరించి - *An oath may be regarded as essentially a conditional self-inprecation, a curse by which a person calls down upon himself some evil in the event of what he says not being true.*[21] నేను చెప్పినది అసత్యమైనచో నాపై నీ యా

---

19. *భారతీయ సంస్కృతి కోశ్, ఖండ్ 9, పు.215*
20. *ఉత్తరకాండ స. 47 శ్లో.9*
21. *Encyclopaedia of Religion and Ethics, p. 373.*

విధములైన విపత్తు లాపెహింపుగాక - ఈ విధముగా తనను తానే శపించుకొనుట శపథ మనబడును.[22] భారతీయ సంస్కృతి కోష్, ఖండము పు. 215) ఈ పరిభాషలో దేవీదేవతలు లేదా పవిత్రవస్తువులు పేర్కొనబడుట లేదు. తన స్వీయాచరణముపై సత్యము పణముగా నుంచి చెప్పబడెను. సీత యొక్క విశుద్ధశీలమునుగూర్చి విశ్వాసము కలిగించుచూ వాల్మీకి ఇట్లనెను.

*బహువర్షసహస్రాణి తపశ్చర్యా మయా కృతా.*
*నోపాశ్నీయాం ఫలం తస్యా దుష్టేయం యది మైథిలీ.*
*మనసా కర్మణా వాచా భూతపూర్వం న కిల్బిషమ్,*
*తస్యాహం ఫలమశ్నామి అపాపా మైథిలీ యది.*[23]

మైథిలి దోషయుక్తురాలైనచో నేను చేసిన వేయి సంవత్సరముల తపము ఫలము నా కందకుండు గాక. మైథిలి పాపయుక్త కానిచో నేను మనోవాక్కాయకర్మలచే నొనర్చిన దానికి ఫలము నా కందుగాక. ఇక్కడ వాల్మీకిమహర్షి ఆచరణముపై తనకు గల నమ్మకమునే ఈ శపథరూపమున వ్యక్తమొనర్చెను.

కొన్ని శపథములలో దేవీదేవతల ప్రస్తావనముండదు. అట్లే తనపై శాపమునకుగాని, అభిచారమునకు గాని తావు కల్పింపబడదు. ఇట్టి శపథములలో వ్యక్తిగతప్రతిష్ఠ, నైతికముగా గల బాధ్యత, భావాత్మకమైన సంబంధములు, గోచరించును. భరతుడు వచ్చి కలిసిన మీదట అతనిని సాగనంపుచూ శ్రీరాముడు శత్రుఘ్నునితో నిట్లనెను --

*మాతరం రక్ష కైకేయీం మా రోషం కురు తాం ప్రతి,*
*మయా చ సీతయా చైవ శప్తోఽసి రఘునందన.*[24]

తల్లి కైకను రక్షించుచుండుము. ఆమెపై కోపము చూపవలదు. ఇది నాయొక్కయు, సీతయొక్కయు శపథము. ఇదే విధముగా రామునిపై గల తన అపారప్రేమనుగూర్చి విశ్వసింపజేయుచు లక్ష్మణుడు కౌసల్యతో నిట్లు పల్కెను-

---

*22. భారతీయ సంస్కృతి కోశ్, ఖండ్ 9, పు.215.*

*23. ఉత్తరకాండ స.96 శ్లో.20,21.*

*24. అయోధ్యాకాండ స.112 శ్లో.27.*

*అనురక్తోఽస్మి భావేన భ్రాతరం దేవి తత్త్వతః,*
*సత్యేన ధనుషా చైవ దత్తేనేష్టేన తే శపే.*[25]

దేవీ! సత్యము, ధనువు, దానము, యజ్ఞభాగములు శపథములుగా, అన్న రాముని నేను మనసార ప్రేమించుచున్నాను. ఈ రెండు ఉదాహరణములలో మిక్కిలి ప్రీతిపాత్రులైన వ్యక్తులను గూర్చి చెప్పబడినది. తల్లి, తండ్రి, గురువు, పత్ని, పుత్రుడు, పుత్రిక, సఖుడు, దేవీదేవతలు, భక్తులు, ధార్మికగ్రంథములు, ప్రియవస్తువులు, జీవనాధారములు పేర్కొని చేయు శపథములు మిక్కిలి ప్రభావకారులుగా నుండును.

విభీషణునికి మాట ఇచ్చుచూ శ్రీరాముడు తన ముగ్గురు తమ్ములను పేర్కొనుచు నిట్లు శపథమొనర్చెను.

*అహత్వా రావణం సంఖ్యే సపుత్రజనబాంధవమ్,*
*అయోధ్యాం న ప్రవేక్ష్యామి త్రిభిస్తైర్భ్రాతృభిః శపే.*[26]

నా ముగ్గురు తమ్ములు శపథముగా, రావణుని సపుత్రజనబాంధవముగా యుద్ధములో సంహరింపకుండ నే నయోధ్యలో ప్రవేశింపను. తన మాటలోని సత్యము, తన శీలము బలము మున్నగునవి ప్రమాణింపదలచి, తన్నే సంబోధించుచు, ఇట్టి శపథములు చేయబడుచుండును. న్యాయమిచ్చు సందర్భము లలో నేడును ఇట్టి శపథములకు ప్రముఖమైన స్థాన మివ్వబడుచున్నది. ధర్మగ్రంథముపై చేయి వేసి, *'I speak the truth, the only truth and nothing but the truth'* అని శపథము చేయించు నాచార మున్నది. అధికార గ్రహణ సందర్భమున కూడ ఇట్టి శపథములు గ్రహింపబడును.

ప్రాయః శపథములు రెండు విధములుగా నుండును - శపథము చేయుట, శపథము గ్రహించుట. మీది ఉదాహరణములలో ఏ వస్త్వాదికమునో పేర్కొని శపథములు చేయబడినవి. తన ప్రాణములపైనచో తన కిష్టులైన వారిపైననో, ఆదరణీయులగు వారి పేరుననో శపథములు చేయబడుచుండును. అట్లే అవి గ్రహింపబడుచుండును కూడ. ఇట్లే శపథములలో శరీరావయవములు కూడ పేర్కొనబడుచుండును. అవయవములలో తరచుగా పాదములు పేర్కొన

25. *అయోధ్యాకాండ స.21, శ్లో.16.*
26. *యుద్ధకాండ స.19, శ్లో.21*

బడును. పాదములు పేర్కొని చేయు శపథములలో జ్యేష్ఠ కనిష్ఠ సంబంధము ముఖ్యముగా గోచరించును. ఎవరైనను శపథము చేయవచ్చును. అట్లే ఎవరిచేతనైనను శపథము చేయించి గ్రహింపవచ్చును. కాని పాదశపథము పెద్దవారే చిన్న వారి పట్ల చేయుదురు. చిన్నవాడు పెద్దవారి పాదములపై శపథగ్రహణము చేయడు. కారణము ఆయువు, జ్ఞానము, అధికారము, వంటివానిలో ఏదో ఒకదానిలో పెద్దతనము దీనికి ఆవశ్యకము. శ్రీరాముడు సీతను వాల్మీకిముని ఆశ్రమము చెంత దిగవిడచి రమ్మని లక్ష్మణునితో చెప్పెను. కాని లక్ష్మణుడు విరోధించునేమో అని అతనికి భయమాయెను. అందుకని *'శాపితా హి మయా యూయం పాదాభ్యాం జీవితేన చ'*[27] అని తన పాదములపైనను జీవితముపైనను ఒట్టిడుకొని చెప్పెను. ఖరదూషణాదు లాక్రమింప వచ్చినపుడు లక్ష్మణుడు వారిని వారింపగల శక్తిసంపన్నుడే అయినను రాముడు స్వయముగా వారిని శిక్షింపదలచెను. ఆ సమయమున లక్ష్మణున కేమియు నోరాడనీయక రాము డిట్లనెను.

*ప్రతికూలితుమిచ్ఛామి న హి వాక్యమిదం త్వయా,*
*శాపితో మమ పాదాభ్యాం గమ్యతాం వత్స మా చిరమ్.*[28]

'నీవు నా మాటలకు విరుద్ధముగా చరింపవలదు. నీకు నా పాదములపై శపథము'. శపథము, ప్రతిజ్ఞ అనునవి సమానార్థకములు కావు. శపథములో స్పష్టముగా గాని అస్పష్టముగాగాని ప్రతిజ్ఞ యుండును. కాని ప్రతిజ్ఞలో శపథ ముండనక్కరలేదు. శపథములో శాపతేజ ముండును. కాని ప్రతిజ్ఞలో అది యుండదు. శపథప్రతిజ్ఞల యీ అర్థనైజము, అర్థవ్యాప్తి వాల్మీకికి చక్కగా తెలియును. కనుకనే అతడు వీటిని ఏ మాత్రము పొరపాటు పడక ప్రయోగించుచు వచ్చెను. రామాయణములో ఎన్నో ప్రతిజ్ఞ లున్నవి. వేదవతి ప్రతిజ్ఞ సర్వవిదితము.

*యస్మాత్తు ధర్షితా చాహం త్వయా పాపాత్మనా వనే*
*తస్మాత్తవ వధార్థం హి సముత్పత్స్యే హ్యహం పునః*[29]

'దురాత్ముడవైన నీ వీ వనములో నాపై చేయి వేసితివి. కనుక నిన్ను

27. ఉత్తరకాండ స.45, శ్లో.21
28. అరణ్యకాండ స.24, శ్లో.13
29. ఉత్తరకాండ స.17, శ్లో.32

వధించు నిమిత్తము నేను తిరిగి జన్మింతును' అని ఆ ప్రతిజ్ఞ. చిత్రకూటమున రామసమాగమమునకు పిమ్మట భరతుడు రాము నయోధ్యకు రాపలసినదని చెప్పెను. కాని రాముడు పట్టుదల వహించి అతని అభ్యర్థనను త్రోసి పుచ్చుచూ వచ్చెను. అతడు భరతునితో నిట్లనెను-

*పురా భ్రాతః పితా నః స మాతరం తే సముద్వహన్,*
*మాతామహే సమాశ్రౌషీద్రాజ్యశుల్కమనుత్తమమ్.*[30]

'నీ తల్లిని వివాహమాడునప్పుడు మన తండ్రి ఆమెకు కల్గిన పుత్రునికి రాజ్య మివ్వబడునని మీ తాతగారి ముందు ప్రతిజ్ఞ చేసెను.' దండకావన నివాసకాలమున రామలక్ష్మణులు మునివ్రత మవలంబించిరి. అప్పట మునీశ్వరుల కోరికపై రాక్షసులను శిక్షించుటకు రాముడు పూనుకొనెను. అప్పుడు సీత రామునితో ఆ రాక్షసహింస అనుచిత మని పల్కెను. రాక్షసులు మున కేమియు అపకారము చేయలేదు. కనుక వారిని శిక్షింపవలదని ఆమె రాముని ప్రార్థించెను. అప్పుడు రాము డామెతో నిట్లనెను-

*ఋషీణాం దండకారణ్యే సంశ్రుతం జనకాత్మజే,*
*సంశ్రుత్య చ న శక్ష్యామి జీవమానః ప్రతిశ్రవమ్.*
*మునీనామన్యథాకర్తుం సత్యమిష్టం హి మే సదా,*
*అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే సలక్ష్మణామ్,*
*న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః*[31]

'సీతా! ఋషులు చెప్పిన మీదట నే నీ దండకావనములో వారిని పూర్తిగా రక్షించుటకు ప్రతిజ్ఞ చేసితిని. ఒకసారి మునుల ఎదుట ప్రతిజ్ఞ చేసి తిరిగి దానిని నేను నా జీవితములో ఎన్నడును విడువలేను. సత్యము నాకు ప్రియము. సీతా, నేను నా జీవితము నైనను, నిన్ను, లక్ష్మణుని ఐనను విడువగలను గాని నే చేసిన ప్రతిజ్ఞను విడువలేను. అది కూడ, బ్రాహ్మణుల సమ్ముఖమున నొనర్చిన ప్రతిజ్ఞ; దానిని విడువతగదు.'

పశుగ్రాసము, వివాహము, బ్రాహ్మణసంరక్షణము, ప్రియపత్నితో సంభాషణము వంటి సందర్భములలో అసత్యశపథము అనుచిత మనిపింపదు.

---

30. అయోధ్యాకాండ స.107, శ్లో.3
31. అరణ్యకాండ స.10, శ్లో.17-19

కాని అన్యవేళలలో అసత్యశపథము నిషిద్ధము. అట్లే క్షుద్రకారణములపై శపథము చేయుట కూడ నిషిద్ధమే. శపథ మెప్పుడు చేయవలెను, ఎప్పుడు చేయరాదు అను విషయము అందరును ఎరిగినదే. సాధారణముగా శీలము పాతివ్రత్యముల పట్ల విశ్వాసము జనింపజేయుటకు, ఆపత్కాలమున, అపరాధ ప్రతిశోధమున, స్నేహము చేయునప్పుడు, చెప్పినది రహస్యముగా నుంచుటకు, గోసంరక్షణకు, రాజ్యారోహణాది సందర్భములలో, శపథము చేయబడుచుండును. రామాయణ మహాభారతాదిగ్రంథములలో శాపములవలె శపథములు కూడ ఎక్కువగా వినిపించును. రామాయణములో దాదాపు ప్రముఖపాత్ర లందరును ఏదో యొక కారణమున శపథము చేసినవారుగనే కనుపింతురు.

శాపమును, శపథమును, అభిచారాత్మకములు. వీనిలో యాతుక్రియా విశేషములు గోచరించును. ఎన్నో చోట్ల ఈ రెండు శబ్దములను సమానార్థకములుగా ప్రయోగింపబడుచుండును. కాని ఇవి సమానార్థకములు కావు పైగా, వీటిలో వాల భేదమున్నది. శపథ మొకవిధమైన ప్రతీతి, లేదా విశ్వాసము. శాపము శిక్ష. శపథములో శాపముండును. కాని శాపములో శపథముండదు. శపథములో నిహితమై యున్న శాపదండము శాపగ్రహీతవరకే పరిమితమై యుండును. కాని శాపములోని దండ మితరులకు కూడ వర్తించును. శాపమిచ్చుగల శక్తి ఎక్కువ తపముచేసిన గాని లభింపదు. శపథమునకు తపస్సుతో నిమిత్తము లేదు. శాపమునకు శాంతి చెప్పబడవచ్చును. కాని శపథమున కట్టి భయము లేదు. శపథము వర్ణభేదమును బట్టి వేర్వేరు విధముల నుండును. కాని శాపమునకు వర్ణభేదముతో నిమిత్తము లేదు. శపథము వాహకమాధ్యమము ననుసరించి ప్రభావకారి యగును. శాపము తపఃకారణమున ప్రభావశీల మగును.[32]

## సత్యక్రియ

సత్యక్రియ, దివ్యత, శపథము చేయించుటకే రెండు పద్ధతులు. ప్రాచీన భారతీయ సాహిత్యములో దీని కెన్నో ఉదాహరణములు లభించును. మరాఠీ సాహిత్యకారుడు డా.రా.చి.ఢేరే తాను వ్రాసిన 'సంత్ సాహిత్యము, సత్యక్రియ' అను వ్యాసములో ఈ విషయమునుగూర్చి విస్తృతోదాహరణములతో విపులముగా చర్చించెను. అతని మాటలలో 'సత్యక్రియ, లేదా దివ్య మనునది ఈ క్రింది

32. భారతీయ సంస్కృతి కోశ్. ఖండ్ 9, పు..218.

రూపమున నుండును.[33]

'ప్రాచీనపరంపరాశీలురైన జనుల మానసమున సత్యము పలికి, ఆశించిన చమత్కారము ప్రదర్శింపవచ్చు నను విశ్వాసము ప్రబలముగా నుండెను. తనకు గాని, ఇతరులకు గాని కలిగిన విపత్తును తొలగించుకొనుటకు, లేదా తన నిర్దోషిత్వమును ఋజువు చేయుటకు, జనులు సత్యోక్తిని ప్రయోగించి చూపుచుండెడివారు. సత్యము నుచ్చరించి, ఇచ్చు పరీక్షకే సత్యక్రియ అని పేరు. ప్రాయః ఇది జలములు ముట్టి, లేదా జలసాక్షికముగా చేయబడుట ఆచారములో నుండెడిది. జలదివ్యప్రథను సృష్టించుటలో గల రహస్యము, బహుశః ఈ సందర్భములో దివ్యము చూపువారు ముందుగా జలదేవతయగు వరుణుని ప్రార్థించవలసియుండుట కావచ్చును. వరుణుడు నీటిలో నుండి 'ఋతము' ను రక్షించుచుండును. ఇట్లు సత్యరక్షకుడు జల నివాసి యగుటచే వరుణుడు శపథదేవతగా మన్నింపబడుచుండెను. అట్లే ప్రాచీనకాలమునుండి నీరు ముట్టి అనగా జలసాక్షిగా శపథము చేయునట్టి ఆచారము వచ్చుచున్నది.

యజ్ఞవిధిలో జలసన్నిధిని శపథము చేయు నాచారమున్నది. వరుణుడు జలములలో నుండును. అసత్యమాడినవానిని, లేక అసత్యశపథగ్రహీతను అతడు తన లోకమునుండి, అనగా జలములనుండి తరిమివేయును. జలదివ్యము చేసి నట్టి వానిని వరుణుడు తన లోకములో నుండనిచ్చె నన్నచో అత డతని నిర్దోషత్వమును వెల్లడించినట్లు భావింపబడుచుండెను. సత్యక్రియలో జలదివ్యము వలె అగ్నిదివ్యము కూడ గ్రహింపబడుచుండెను. దివ్యము, సత్యక్రియకు సంబంధించిన విధి. కనుక వీని పరస్పరసంబంధము కూడ స్వాభావితము. సత్యక్రియకు దివ్యత్వముతో సామాన్య సంబంధము కాక ఘనిష్ఠసంబంధము ఉండవలెను. దివ్యత్వ మొక దైవీపరీక్ష. అందుత్తీర్ణుడైనవాడు నిరపరాధి, నిర్దోషి, నిష్పాపిగా భావింపబడును. సత్యక్రియకు సత్యముతో గల సంబంధ బలమున దానికి సత్యనిష్ఠతో సంబంధమేర్పడి అందలి శ్రద్ధాధిక్యము కారణముగా సాహిత్యములో కూడ ఎన్నో సార్లు కల్పనాబంధముగా (motif) ప్రయోగింప బడుచున్నది. శపథము కేవలము వాచ్యము. సత్యక్రియలో ఉచ్చారణతో పాటు క్రియకూడ నుండును.'

సీతకు తన జీవితములో రెండుసార్లు సత్యక్రియ నెరవేర్పవలసి వచ్చెను. లవకుశులద్వారా రామాయణకథను వినిన పిదప రాముడు ప్రభావితుడై,

*33. సంత్ సాహిత్య ఆణి లోకసాహిత్య (మరాఠీ) పు.177, 182, 183, 185*

వాల్మీకి మునికి సందేశమంపుచూ, సీతశీలము యథార్థముగా శుద్ధమైనదని, ఆశ్రమములో నివసించుటచే ఆమె శుద్ధురాలైనదని, ఆమె యిక్కడకు రావచ్చునని తెలిపెను-

*శ్వః ప్రభాతే తు శపథం మైథిలీ జనకాత్మజా,*
*కరోతు పరిషన్మధ్యే శోధనార్థం మమైవ చ.*[34]

రేపు ప్రాతఃకాలమున జనకపుత్రి మైథిలి సభలోనికి వచ్చి, తనపైనను, నాపైనను వచ్చిన అపవాదును తొలగించుటకు శపథము చేయుగాక! ఈ సందేశము ననుసరించి వాల్మీకి సీతను తీసికొని వచ్చెను. అతడు స్వయముగా సీత శీలమును గూర్చి తన తపస్సుపై శపథము చేసి ఆమె నిర్దోషురాలని నమ్మకము కలిగించుటకు ప్రయత్నించెను. సీత తన విశుద్ధచరిత్రమును ప్రమాణీత మొనర్చుటకు సత్యక్రియ నెరపినది. ధరిత్రిని సంబోధించుచు ఆమె యిట్లు పలికినది-

*యథాహం రాఘవాదన్యం మనసాపి న చింతయే,*
*తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి.*
*మనసా కర్మణా వాచా యథా రామం సమర్చయే,*
*తథా మే మాధవీ దేవీ వివరం దాతు మర్హతి.*
*యథైతత్ సత్యముక్తం మే వేద్మి రామాత్పరం న చ,*
*తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి.*[35]

'రాముని తప్ప వేరొక పురుషు నెవనినీ ఏనాడును నేను తలపనిచో, విష్ణుపత్ని అయిన భూదేవి నాకు వివర మొసగగలదు. మనోవాక్కాయముల నేను శ్రీరాము నారాధించుచున్నట్లయినచో విష్ణుపత్ని భూదేవి నాకు వివర మొసగగలదు. నా యీ మాటలు సత్యములై, రాముని తప్ప వేరొక పురుషుని పరిచయము నే నెరుగనినాడు విష్ణుపత్ని భూమాత నాకు వివర మొసగగలదు.'

హనుమంతుని తోకకు నిప్పు పెట్టిన సందర్భములో కూడ సీత యిట్లే సత్యక్రియ నెరపెను. అపు డామె హనుమంతుని కంటిన అగ్ని చల్లనై అతడు రక్షింపబడవలెనని కోరెను.

---

*34. ఉత్తరకాండ స.95, శ్లో.8*
*35. ఉత్తరకాండ స.97, శ్లో.15-17*

*యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః,*
*యది వాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః*[36]

'నేను పతిశుశ్రూష నొనర్చినదానను, తపమాచరించినదానను, పతివ్రతను అగుదునేని ఓ అగ్నిదేవా! నీవు హనుమంతునికి చల్లనగుము.'

సీతాదేవి 'అగ్నిదివ్యము' రామాయణములో అనుపమానమైన ఘటనము. దీనినిగురించి విశ్లేషించి విమర్శించుట అనవసరము కాని సీతకు గల ఆత్మవిశ్వాసమును ప్రశంసింపకుండ నుండజాలము. ఆమె తన సచ్చరిత్ర బలమున నెట్టి విపత్తులో నైనను నిర్భయముగా నిల్చి, పరీక్ష కాగి, సురక్షితముగా బయటకు రాగలదు. అట్టి విశ్వాస మామెకు గలదు. ఆమె అగ్నిని పేర్కొని ఒక విధముగా పురి కొల్పినది. ఆమె తన విశుద్ధతను నిరూపించు భారము అగ్ని కప్పగించెను-

*యథా మే హృదయం నిత్యం నాపసర్పతి రాఘవాత్,*
*తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః.*
*యథా మాం శుద్ధచారిత్రాం దుష్టాం జానాతి రాఘవః,*
*తథా లోకస్య సాక్షీ మాం సర్వతః పాతు పావకః.*
*కర్మణా మనసా వాచా యథా నాతిచరామ్యహమ్,*
*రాఘవం సర్వధర్మజ్ఞం తథా మాం పాతు పావకః.*[37]

'నా చిత్త మేక్షణమును శ్రీరాముని బాసి చరింపకున్నచో లోక సాక్షియగు అగ్నిదేవుడు నన్ను రక్షించును. నా ఆచరణము విశుద్ధమై యున్నను రాముడు నన్ను దుశ్చరిత్రగా తలచుచున్నాడు. నా సదాచారము సత్యమైనచో అగ్ని నన్ను సర్వవిధములా రక్షించును. మనోవాక్కాయములచే నేను రాము నతిచరించనిచో జగత్సాక్షియగు అగ్నిదేవుడు నన్ను రక్షించును.' అని ఆమె సత్యక్రియ నెరపెను.

వరదానము

ప్రసన్నసంతుష్టమైన మనముతో పలికిన శబ్దముల ఉద్దేశ్యమును వరదానమని, ఆశీర్వాదమని, శుభాకాంక్ష అనీ చెప్పుదురు. కాని ఈ మూడు శబ్దములును

---

*36. సుందరకాండ స.53, శ్లో.29*
*37. యుద్ధకాండ స.119, శ్లో.24-26*

సమానార్థకములు కావు. వానికి గల అర్థవ్యాప్తి, స్వరూపము, ప్రభావము కూడ వేర్వేరుగా నుండును. శాపములో వలె వరదాన మిచ్చు వ్యక్తికి కూడ అట్టి అధికార మావశ్యకము. దేవతలకు జన్మసిద్ధముగనే ఇట్టి అధికారము కొద్దిగనో గొప్పగనో సిద్ధించు నని యుందురు. అయినను, వారును తపస్సు చేసి ఆ అధికారశక్తిని వృద్ధి చేసికొనుచుందురు. అట్లే ఆ శక్తివలన తమ అధికారమును విస్తరించుకొనుచుందురు. జగన్నిర్మాత యగు బ్రహ్మయు, జగత్సృష్టిసంహర్త యగు శంకరుడును కూడ తపస్సు చేసిరి.

వరశబ్దము 'వృ' ధాతునిష్పన్నము. దీనికి కృప, ప్రసాదము, ఇష్టము, ఎంపిక, అనుగ్రహము, శుభకామన వంటి అర్థము లెన్నో ఉన్నవి- *'వ్రియతే ఇతి వరః. మనాక్ అభీష్టే వరః. తపోభిరిష్యతే యస్తు దేవేభ్యః స వరో మతః'.*

కామ్యపూర్తి కేవ్యక్తినో ప్రసన్నునిగా జేసికొనుట సంతుష్టి నొంది వారి మేలెంచి ఉపకారమొనర్చుటయే వరదానప్రక్రియలోని అభిప్రాయము. ఈ ప్రసన్నత తపస్సు, ప్రార్థన, స్తుతి, పూజ, యజ్ఞము, సద్గుణములు, సత్కార్యము వంటి కారణము లెన్నిటివల్లనో ప్రాప్తించవచ్చును. ఆ ప్రసన్నతకు వ్యక్తరూపమే వరదానము. ఎక్కువ స్ఫూర్తి గల్గి, లేక స్వయం స్ఫూర్తిమంతమై ప్రసన్నతాఫలముగా కలుగు వరదానము అయాచితమే యగును. తపస్సు, యజ్ఞము వంటివానిచే సాధించు ప్రసన్నతవలని వరదానము తదనురూపమై యుండును. అడుగని వరము అడిగి పుచ్చుకొనుదానికంటె నిస్సంశయముగా ఉత్తమశ్రేణికి చెందును. యాచితమైనను, అయాచితమైనను వరము వరప్రదాత స్వేచ్ఛపై నాధారపడి, అతని నిర్ణయము ననుసరించి యుండును. యాచకుడు తన కోరికను మాత్రము వెల్లడింపగలడు. కాని అతని కోర్కె ననుసరించియే వర మీయవలసిన ఆవశ్యకత లేదు. యాచకుని కోర్కె పూర్తిగా కాని, ఆంశికముగాకాని అంగీకరింపవచ్చును. అట్లే పూర్తిగా తిరస్కరింపవచ్చును కూడ. రావణమేఘనాదులు శాశ్వతామరత్వమునే కోరిరి. కాని బ్రహ్మ వారు కోరినది పరిమితముగనే ప్రసాదించెను. శంబూకుని సదేహస్వర్గగమనకాంక్ష అతని తపస్సువలన స్పష్టమైనను, అది లభింపలేదు. పైగా అతడు వధింపబడెను. మధుదైత్యునికి వరరూపమున లభించిన శూలము నతడు శాశ్వతముగా తన వంశములో నుండునట్లు వేడినను, ఆ కోర్కె అంగీకరింపబడలేదు. కాని పరిమితరూపమున స్వీకరింపబడెను. అయాచితవరములో, వ్యక్తికి తన కోర్కెను వ్యక్తము చేయుట కవకాశముండదు.

పరదాత ఇష్టమే ప్రధానముగా నుండును. కాని పరదాత యిచ్చిన పరమును స్వీకరించుట గాని, తిరస్కరించుటగాని పుచ్చుకొనువాని స్వేచ్ఛపై ఆధారపడి యుండును. వరమును స్వీకరించియే తీరవలెనను బలవంతము లేదు. కనుకనే కొన్ని వరములు గ్రహింపబడలేదు. వరము లిట్లు రెండు విధములు-స్వీకృతములు, అస్వీకృతములు. అస్వీకృతములు కేవలము అయాచితవరముల సందర్భముననే గోచరించును. యాచితవరములలో అస్వీకృతికి అవసరమే కల్గదు. అనసూయ ఇవ్వదలచిన వరములను సీత అందుకొనలేదు. శరభంగుడు తాను తపస్సుచేసి సాధించిన స్వర్లోకబ్రహ్మలోకములను శ్రీరాముని కీయనెంచెను. కాని రాముడు వినమ్రతతో తానే స్వయముగా తపస్సు చేసి వాటిని సంపాదింపనెంతు నని చెప్పి అతని వరమును కాదనెను. శాపము నంగీకరింపకుండుటకు అవకాశముండదు. కనుక శాపములన్నియు స్వీకృతములే యగుచుండును. శాపప్రయోగ మొకప్పుడు మనసులో నెంచినను, ప్రకటముగా జరుగదు. కాని వరము లట్లెంచి విడిచినట్టి ఉదాహరణములు లేవు. శాపములో వలె వరదానములో తపోవ్యయ పుణ్యక్షయాదిక సంభావనయుండదు. కనుక వరము నిగ్రహింపబడదు. దీనిలో విపరీతప్రభావమును గూర్చి భయముండదు. కాని ఇచ్చిన వరమును గురించియు, అడిగిన వరమును గురించియు ఒక్కొక్కప్పుడు పశ్చాత్తాపము కలుగుచుండును. రావణునికి పరిమితముగా నైనను అమరత్వము వరముగా నిచ్చినందున బ్రహ్మగారి కా వెనుక పెద్ద సమస్య అయినది. కుంభకర్ణుడు నిద్రావర మడిగి పుచ్చుకొని దుఃఖితు డాయెను.

వరమివ్వ వలె నను ఉత్కటేచ్ఛకంటె శబ్దోచ్చారణరూపమున గలుగునట్టి, దాని అభివ్యక్తి ఎక్కువ ప్రభావసంపన్నముగా నుండును. *Blessing by words is more powerful than blessing by thought.* మరణాసన్నవ్యక్తి మాటలు ప్రభావసంపన్నములుగా నుండు నందురు. దశరథుడు మరణింపకముందు శ్రీరాముని సంబోధించి చెప్పిన మాటలు వరములు కాకున్నను వరతుల్యములు.[38] పాతివ్రత్యబలమున పతివ్రత లాడు మాటలకు వరదాన తుల్యమగు తేజ ముండు నందురు. వాల్మీకిరామాయణములో పతివ్రత లిచ్చిన వరములు అయిదువరకు ఉన్నవి. అప్సరస హేమకును, కైకకును వరమిచ్చు శక్తి ఎట్లు కల్గెనో స్పష్టముగా తెలియదు. కాని వారివల్ల స్వయంప్రభయు మంథరయు

---

*38. అయోధ్యాకాండ స.64.*

వరము లందిరి. మిగిలినవాటిలో ఒకటిన్నర వరములు పార్వతియు, ఒకటి అనసూయయు ఇచ్చినవి. అనసూయ ఇచ్చిన వర మామె పాతివ్రత్యబలముననే యిచ్చిన దనుట కవకాశము తక్కువ. ఆమె పాతివ్రత్యమునకు తోడుగా, *'నియమై ర్వివిధైరాప్తం తపో హి మహదస్తి మే'* అని తానే చెప్పిన దానిని బట్టి ఆమెకు తపోబలముకూడ నున్నట్లు స్పష్టము.[39] పార్వతి యిచ్చిన వరముల కామె తపశ్శక్తియు, దేవయోనియు కారణములు కావచ్చును. ఆమె రాక్షసస్త్రీల కొకటియు, ఇళరాజునకు సగము వరము లిచ్చెను.[40]

వరదాత వరగ్రహీత కన్న జ్యేష్ఠుడుగను, శ్రేష్ఠుడుగను నుండును. భారతీయులు తపస్సు చేసి ఇష్టదేవతను మెప్పించి ఇష్టకామ్యములు వరముగా గ్రహింపవచ్చునని విశ్వసించుచుండిరి. అందువలన కామ్యపూర్తికై వారెట్టి కాయక్లేశమైనను ఎంతకాలము వరకైనను సహించి తప మాచరించుచుండిరి. తపఃసాధన మహోగ్రముగను, కఠినముగను నుండెడిది. తపస్సువలెనే యజ్ఞ యాగములు, పూజార్చనలు వంటి ఉపాయములు కూడ ఈప్సితార్థసిద్ధికై స్వీకరింపబడుచుండెడివి. ఈ విధముగా చేసి గడించిన వరములన్నియు యాచితములే యగును. రామాయణములోని 84 వరదానములలోను 15 వరకు తపస్సువల్లను, యజ్ఞమువల్లను ప్రాప్తించినవి. వీటివల్ల రాక్షసుల కెక్కువ లాభము కలిగెను. రావణ, కుంభకర్ణ, మేఘనాద, విభీషణులును, మారీచ, సుమాలి, మాల్యవంతులును ఘోరముగా తపస్సుచేసి వరము లందిరి. విరాధుడును, దుందుభియు కూడ తపస్సు చేసిరి. రాక్షసులవలెనే విశ్వామిత్ర, వసిష్ఠ, శరభంగ, కశ్యప మహర్షులు కూడ తపస్సు చేసి అభీష్టములు గడించిరి. పితరులకు స్వర్గప్రాప్తి కలిగింప నెంచి భగీరథుడు మహోగ్రతప మొనర్చెను. వర మందవలె ననియే మాంధాత తపస్సు చేసెను. యజ్ఞమొనర్చి సదేహస్వర్గయాన మాశించిన త్రిశంకుని ప్రయాస విఫలమయ్యెను. దశరథునకు పుత్రకామేష్టి ఫలముగా పాయసప్రాప్తియు, దానివలన సంతానప్రాప్తియు కలిగినవి. కాని ఈ పాయసప్రాప్తి వరదానము కాదు. అనుగ్రహ మనదగినది. దీనినిగురించి వేరొకచోట చర్చింపబడును.[41] ఏడు యజ్ఞములు చేసి ఇంద్రజిత్తు వరమితామరత్వ మందగల్గెను. అతనికి లభించిన వరము యాచితము. నిమిమహారాజు ఆరంభించిన

---

*39. అయోధ్యాకాండ స.118, శ్లో.14*

*40. ఉత్తరకాండ స.4 మరియు 87*

*41. పరిశిష్టము-1 / పాయసప్రాప్తి*

యజ్ఞమును, అయన మరణానంతరము కూడ అన్యఋషులు కొనసాగించినందున నిమి ఆత్మకు వరము లభించినది. ఈ వర మయాచితము.

సంతానప్రాప్తికై సుకేతువు, సగరుడు, దితి, కాళింది, మున్నగువారు చేసిన తపములలో దితి తప్ప తక్కినవారందరు సఫలులైరి. దితి కిచ్చిన వరము షరతులతో కూడినది. ఆమె ఆ షరతులు సరిగా పాలింపలేదు. ఈ వరములన్నియు యాచితములే. దౌహృదవతి సీతను వర మడుగుమని కోరి రాము డామెకు వరమిచ్చెను. ఇది అయాచితము. సీత కా వరము శాపముగా పరిణమించెను. భవిష్యమున సిద్ధించునట్టి వరము లిచ్చిన ఉదాహరణము లెక్కువగా నున్నవి. సంపాతి విషయ మొక్కటి విడిచినచో, హనుమంతుని కిచ్చిన వరము లన్నియు ఫలించినవి. సంపాతితో పాటుగా ఈ యిచ్చిన వరములన్నియు భావికాలమున రామకార్యము సుగమ మగుటకే.[42] మైనాక పర్వతమునకు లభించిన వరము సముద్రలంఘనవేళ హనుమంతునికి సహాయపడుటకైనది. హనుమంతు డా సహాయ మంతగా ఉపయోగించకొన లే దన్న విషయము వేరు. నిషాదునికి శాపమిచ్చి వాల్మీకి దుఃఖించెను. అతని నోదార్చుట, రామకథ వ్రాయుమని ప్రోత్సహించుట అను రెండు ఉద్దేశ్యములతో బ్రహ్మ వాల్మీకికి వరము లిచ్చెను. సౌదాసుని కిచ్చిన శాపమునకు మోక్షరూపమున వసిష్ఠ డతనికి వరమిచ్చెను.

సదాచారము, సద్వార్తాకథనము, శ్రేష్ఠసేవ, సత్పురుషదర్శనము, బాధాహరణము, అనుగ్రహము, ప్రార్థన, ఉత్కటప్రేమ, దుష్టనిగ్రహము, శిష్టరక్షణ వంటి విషయములలో సంతసించి దేవతలును మునులును వరములను అనుగ్రహించిరి. శ్రీరాముని కిచ్చిన వరములు అతని సదాచారమువలన వచ్చినవి. శ్రీరాముడు దుష్టులను సంహరించి మానవజాతిని రక్షించెను. అందువలన రావణవధానంతరము దేవత లతని నెంతగనో ప్రశంసించిరి. లవకుశులు పాడిన రామాయణకథ విని ముని లెంతయో సంతసించి వారికి వరము లిచ్చిరి. శ్రీరాముని వంటి మహాపురుషుని దర్శించుటకై శరభంగుడు, తనను స్వర్గమునకు కొనిపోవ నెంచి వచ్చిన ఇంద్రుని కొంత సమయము వేడెను. సీతయొక్క సదాచారమునకు సంతసించి అనసూయయు, రాముని అలౌకికత్వమునకు మెచ్చి భరద్వాజుడును వారికి వరము లివ్వ నెంచిరి.

---

*42. చూ. హనుమంతునికి వరములు-శాపములు.*

శ్రీరాముని యువరాజుగా చేయనెంచిరన్న శుభవార్తను తొలుత చెప్పినందుకు మంథరకు కైకేయి వరమీయదలచెను. కాని ఆమె దానిని స్వీకరింపలేదు. సోమదకును, శబరికిని వారి విశిష్టసేవకు ఫలము లభించెను. సోమదకు ఎవనికిని పత్ని కాకయే వరప్రసాదమున పుత్రప్రాప్తి కలిగెను. తృణబిందుని కుమార్తెకు పులస్త్యుని శాపము వరముగనే పరిణమించెను. ఆమె అతని పత్ని ఆయెను. నిస్స్వార్థసేవ స్త్రీధర్మ మగుటచేత శ్రేష్ఠమైన సేవకు ఫలముగా మహిళ లెందరికో సహజముగనే వరములు లభించెను. లక్ష్మణుని విశిష్టసేవను, హనుమంతుని సేవను విడిచి, మరెవ్వరి సేవతోను పోల్చలేము. కాని అతని కే వరమును లభింపకుండుట విచారకరము.

వాల్మీకిరామాయణములోని వరదానములలో చాలవాటికి గల కారణములు స్పష్టముగా తెలియకున్నవి.

## వరదానప్రభావము

మానవలోకమున అప్రాప్యమగు అమరత్వమును సంపాదించుటకు మానవు లెంతగానైనను శారీరక, మానసిక కష్టము లనుభవించుటకు సంసిద్ధు లగుదురు. పార్థివజీవితము క్షణభంగురము, నశ్వరము. ఈ సంగతి తెలిసియు ఇక్కడ సాధ్యమైనంత ఎక్కువ కాలము నివసించుటకును, ఇక్కడే సుఖముగా జీవించుటకును వా రెడతెగక ప్రయత్నశీలు లగుచుందురు. శుక్రాచార్యుని శాపమువలన మరణసూచన ముందుగానే యిచ్చునట్టి ముసలితనము ప్రాప్తించిన యయాతి తన కుమారుని యౌవనభిక్ష వేడి కోరిక తీర్చుకొనెను. జీవితముపైగల ఉత్కటాసక్తి. అమరత్వమునకై తపస్సు నవలంబింపజేయును. రావణమేఘనాదులు శాశ్వతామరత్వమునకై ప్రయత్నించిరి. దీనికొరకు వీరు ఘోరముగా తపమొనర్చి యజ్ఞయాగములు చేసిరి. ఈ ప్రయాసకంతకు ఫలము వరప్రాప్తిమూలమున అసాధారణమైన అత్యధికబలము సంపాదించి శేషజీవితమును యథేచ్ఛగా గడుపుకొనుట. తక్కిన రాక్షసులు కూడ ఇట్టి ప్రయత్నము చేసి చాలవరకు సఫలులైరి. అమరత్వమువలెనే దీర్ఘాయువు కొరకును మానవులు ప్రయత్నించు చుందురు. తరచుగా తనకు దీర్ఘాయువు, అమరత్వమూ కలుగవలెనను స్వార్థమే ఈ ప్రయత్నములలో కాన్పించును. కాని యీ పట్టున శ్రీరాముని ఉదాహరణ మొకటి అపవాదరూపమున గోచరించును. అతడెవరిని వర మడుగలేదు. ఎవరైనను వరమిచ్చెద మన్నను అత డందుల కిష్టపడలేదు. అయాచితముగా

యజ్ఞమును, అయన మరణానంతరము కూడ అన్యఋషులు కొనసాగించినందున నిమి ఆత్మకు వరము లభించినది. ఈ వర మయాచితము.

సంతానప్రాప్తికై సుకేతువు, సగరుడు, దితి, కాళింది, మున్నగువారు చేసిన తపములలో దితి తప్ప తక్కినవారందరు సఫలులైరి. దితి కిచ్చిన వరము షరతులతో కూడినది. ఆమె ఆ షరతులు సరిగా పాలింపలేదు. ఈ వరములన్నియు యాచితములే. దౌహృదవతి సీతను వర మడుగుమని కోరి రాము డామెకు వరమిచ్చెను. ఇది అయాచితము. సీత కా వరము శాపముగా పరిణమించెను. భవిష్యమున సిద్ధించునట్టి వరము లిచ్చిన ఉదాహరణము లెక్కువగా నున్నవి. సంపాతి విషయ మొక్కటి విడిచినచో, హనుమంతుని కిచ్చిన వరము లన్నియు ఫలించినవి. సంపాతితో పాటుగా ఈ యిచ్చిన వరములన్నియు భావికాలమున రామకార్యము సుగమ మగుటకే.[42] మైనాక పర్వతమునకు లభించిన వరము సముద్రలంఘనవేళ హనుమంతునికి సహాయపడుటకైనది. హనుమంతు డా సహాయ మంతగా ఉపయోగించకొనలే దన్న విషయము వేరు. నిషాదునికి శాపమిచ్చి వాల్మీకి దుఃఖించెను. అతని నోదార్చుట, రామకథ వ్రాయుమని ప్రోత్సహించుట అను రెండు ఉద్దేశ్యములతో బ్రహ్మ వాల్మీకికి వరము లిచ్చెను. సౌదాసుని కిచ్చిన శాపమునకు మోక్షరూపమున వసిష్ఠు డతనికి వరమిచ్చెను.

సదాచారము, సద్వార్తాకథనము, శ్రేష్ఠసేవ, సత్పురుషదర్శనము, బాధాహరణము, అనుగ్రహము, ప్రార్థన, ఉత్కటప్రేమ, దుష్టనిగ్రహము, శిష్టరక్షణ వంటి విషయములలో సంతసించి దేవతలును మునులును వరములను అనుగ్రహించిరి. శ్రీరాముని కిచ్చిన వరములు అతని సదాచారమువలన వచ్చినవి. శ్రీరాముడు దుష్టులను సంహరించి మానవజాతిని రక్షించెను. అందువలన రావణవధానంతరము దేవత లతని నెంతగనో ప్రశంసించిరి. లవకుశులు పాడిన రామాయణకథ విని మును లెంతయో సంతసించి వారికి వరము లిచ్చిరి. శ్రీరాముని వంటి మహాపురుషుని దర్శించుటకై శరభంగుడు, తనను స్వర్గమునకు కొనిపోవ నెంచి వచ్చిన ఇంద్రుని కొంత సమయము వేడెను. సీతయొక్క సదాచారమునకు సంతసించి అనసూయయు, రాముని అలౌకికత్వమునకు మెచ్చి భరద్వాజుడును వారికి వరము లివ్వ నెంచిరి.

---

*42. చూ. హనుమంతునికి వరములు-శాపములు.*

వరము లభించినను, దాని నంగీకరించుటలో గల భావము, తనకు గాకున్నను ఇతరులకు దానివలన మేలు చేకూర్పవలెననియే. మరణించిన బ్రాహ్మణబాలకుని బ్రతికించుటకు, యుద్ధరంగమున మరణించిన వానరులను జీవింపజేయుటకు, వారికై అయోధ్యామార్గమున గల చెట్టు చేమలన్నియు పుష్పఫలభరితములు కావలెననియు, జను లందుమూలమున సుఖింపవలెననియు, నదులు నీరభరత ములై యుండవలెననియు అతడు వరము లంగీకరించెను. విభీషణుడు ఎట్టి పరిస్థితిలో నైనను తన బుద్ధి ధర్మబద్ధమై యుండునట్లు వర మడిగెను. బ్రహ్మయు, దిక్పాలకులును ఇచ్చిన వరములవలన హనుమంతుని శక్తి పెంపొందెను. మైందద్వివిదులకు బ్రహ్మగా రిచ్చిన వరము పరిమితము. అయినను దానిచే వారి కష్టములు తీరినవి. ఇంద్రుని వరముచే నెమలిపింఛములకు నేత్రత్వ మబ్బుటయే కాక, సర్పములనుండి అభయముకూడ సిద్ధించినది.

రామాయణములో పది వరములు సంతానప్రాప్తికై వరించినవి. జయ, సుప్రభ, కేశిని, సుమతి, కాళింది అనువారందరికి వరబలముననే సంతతి కలిగెను. ఆ సంతానముకూడ ఒకటినుండి అరువది వేలవరకు సిద్ధించెను. సోమదకు వివాహ మక్కరలేకయే సంతతి కల్గెను. సుకేతువు పుత్రు నాశించినను పుత్రికనే పొందగల్గెను. ఈ కన్యకయే తాటక. ఆమెకు సహస్రగజసమానశక్తి లభించెను. విశ్రవసుడు కైకసి కోరిన పుత్రలాభము నిచ్చెను. కాని ఆమె అకాలముగ కోరుటచే క్రూరులగు పుత్రులను బడసెను. ఆమె ప్రార్థనపై వారిలో నొకడు మాత్రము- విభీషణుడు సద్గుణశీలు డయ్యెను. దితి కిచ్చిన వరము షరతులతో కూడినది. ఆమె వాటిని పాటింపనందున గర్భావస్థలోనే ఇంద్రు డామెగర్భములోని శిశువును ఏడు ముక్కలుగా నరికెను.

బ్రహ్మవరమువలన విశ్వామిత్రునికి బ్రహ్మర్షిత్వ మబ్బెను. అట్లే వైశ్రవణునికి దిక్పాలకత్వము లభించెను. విశ్వామిత్రుని కోర్కెకు వసిష్ఠుడు కూడ ఔననెను. త్రిశంకు, శంబూకుల సశరీరస్వర్గారోహణవాంఛ పూర్తిగా విఫలమయ్యెను. ఇంద్రుని వరముచే మలద-కరూశ క్షేత్రములు సమృద్ధిసంపన్నము లాయెను. శబరి కక్షయలోక ప్రాప్తి కలిగెను. ఆమె జీవనము సఫలమాయెను. ఒకానొక అంధుని వరబలమున నొక రాజు నేత్రలాభ మందెను. సూర్యుని దయవలన మేరువు సువర్ణమయ మయ్యెను. కుబేరుని వరముచే ఊసరవెల్లికి బంగారు చాయ కలిగెను. ఇంద్రుని సంతోషమునకు ఫలముగా హంసకు అగ్నివంటి తేజము, చంద్రునివంటి కాంతి లభించెను. యముడిచ్చిన వరమువలన కాకికి

పరిమితావధ్యత ప్రాప్తించెను. వసిష్ఠుని వరముచే కల్మాషపాదునకు శాపవిమోచనము కల్గెను. బ్రహ్మగారిచ్చిన వరబలమున హనుమంతుడు అస్త్రబంధనమునుండి విడువబడెను.

మానవప్రయత్నముచే లభింపజాలని అభిలాషలు వరమూలకముగా లభించుచున్నట్లు రామాయణములో ఎన్నో ఉదాహరణములు సూచించుచున్నవి. కేకయరాజు ఒకానొక ముని యిచ్చిన వరబలమున పశుపక్షికీటకాదుల భాష తెలిసికొనగలిగెను. మయాసురుని కట్లే శిల్పశాస్త్రజ్ఞాన మబ్బెను. సురసకు తన ఎదుట గల వ్యక్తిని మ్రింగివేయగల శక్తి లభించెను. మరుప్రదేశము వరబలమున ఫలపుష్పసుగంధభరిత మయ్యెను. సీతకు ఇంద్రుని వలన హవిష్యాన్న ప్రాప్తియు, నిమికి జీవుల నేత్రాంచలమున నివసించు శక్తియు, బ్రహ్మహత్యకు నాలుగాశ్రయ స్థానములును, రాముడేగినచోటి కెల్ల తామును పోగల సౌకర్యము ప్రజలకును వరముల మూలముననే సిద్ధించినవి. మానవావతారుడైన రాముడు పృథ్వీపాలన మొనర్చుటకు దేవతలు వరమిచ్చిరి. ఉమాదేవి యిచ్చిన వరములు రెండునూ తక్కినవాటికి భిన్నములు. ఒక వర మేమనగా రాక్షసస్త్రీలకు సమాగమముతోనే గర్భసిద్ధి, గర్భముతోడనే ప్రసవము, ప్రసవించిన తోడనే బిడ్డకు తల్లితో సమానమైన ఆయుర్బలములు ప్రాప్తించునని యిచ్చినది. రెండవది అర్థవరము. అది ఇళరాజున కిచ్చినది. దీనిచే నతడు ఒక మాసము స్త్రీగను, మరియొక మాసము పురుషుడుగను మారుచుండును. అంతేగాక, పురుషత్వ మున్నపుడు గర్భధారణముగాని, స్త్రీత్వకాలమున పురుషత్వస్మృతిగాని కలుగవని కూడ వరము లభించెను.[43]

భరతునికి యువరాజపట్ట మిప్పించవలెనను కైకేయి కోరికను దశరథు డిచ్చిన వరములు చిగురింపజేసినవి. లంకిణికి రాక్షసవినాశకాలసూచన వరమువలననే లభించెను. ఒకే వ్యక్తివలన ఒకే ఫల మీయదగిన వరశాపములు కుంభకర్ణునికి లభించెను. స్వయముగా బ్రహ్మదేవుడే అతనికి నిద్రాశాపమును, తోడుగా వరమును ప్రసాదించెను. రామాయణమం దిది యొక్కటే ఇట్టి విలక్షణమైన ఉదాహరణము.[44] నలవానరునకు కోరిన వస్తువు నిర్మించ గలిగిన శక్తియు, స్వయంప్రభకు రక్షాబలమును, హనుమంతునికి సూర్యతేజమున శతాంశము, వాక్శక్తి, శాస్త్రజ్ఞానములును వరదానఫలములుగనే సిద్ధించెను.

---

*43. ఉత్తరకాండ స.4 మరియు 87*

*44. శాప క్ర.సం. 37 మరియు వర క్ర.సం. 56*

రామాయణములోని కొన్ని వరముల ఫల మంత స్పష్టముగా తెలియదు.

## నియమాంచిత వరములు

శాపముల వలెనే వరములు కూడ ఒకప్పుడు నియమములు లేదా షరతులతో కూడి యుండును. కాని అవి చాల తక్కువ. వాల్మీకిరామాయణములో నియమాంచితవరములు మూడు మాత్రమే కనిపించుచున్నవి. అమృతప్రాప్తికై జరిగిన యుద్ధములో అదితిపుత్రులు (దేవతలు) దితిపుత్రులను (దైత్యులు) వధించిరి. దానిపై దితికి దుఃఖము కలిగెను. ఆమె తన పతి కశ్యపుని కలిసి తపస్సుచేసి ఇంద్రఘాతి యగు పుత్రుని కనవలెనను తన కోర్కె నెరిగించెను. కశ్యపు డామెకు శుభము కోరుచు, ఆమె కోరినట్టి పుత్రు డామెకు కల్గునని వరమిచ్చెను. కాని అందుకొర కామె వేయి యేండ్లు శుచివ్రత మాచరింపవలెనని చెప్పెను. ఆమె అందుల కంగీకరించెను. తపోవనము చేరి ఆమె తప మాచరింప దొడగెను. 990 సంవత్సరములు శుచిగా నుండి, అచిరకాలములో తపము పూర్తి చేయనుండెను. ఈ కాలావధిలో ఇంద్రు డామెకు సపర్యలు చేయసాగెను. ఒకనాటి మధ్యాహ్న మామె తలవైపు కాళ్ళు పెట్టి నిద్రించినందున శుచిత్వము భగ్నమాయెను. ఇంద్రు డది చూచి మిక్కిలి సంతసించెను. అత డామె గర్భములో ప్రవేశించి గర్భములో నున్న శిశుపిండమును ఏడు ముక్కలుగా ఖండించెను. ఇట్లు దితి చివరివరకు నియమపాలన మొనర్పలేకపోయినది. ఫలితముగా వరప్రాప్తి లేకపోయినది. (బాలకాండ స.46) తపోబలమున మేఘనాదుడు బ్రహ్మను సంతుష్టిపరచెను. బదులుగా బ్రహ్మ అతనికి షరతుతో కూడిన వరమిచ్చెను- 'నికుంభిల కేగి హోమ మొనర్చుటకు ముందుగనే శస్త్రము ధరించి నిన్ను యుద్ధమునకు పురికొల్పునట్టి శత్రువుచే నీవు వధింపబడుదువు.' (యుద్ధకాండ స.85) ఈ వర మింకొక విధముగా కూడా వర్ణింపబడెను. ఇంద్రుని విడిపింపవలెనని బ్రహ్మ మేఘనాదునికి వరమిచ్చెద ననెను. అత డమరత్వము వేడెను. మర్త్యలోకమున సంపూర్ణామరత్వము కల్గదని బ్రహ్మ చెప్పగా అతడు తన కెప్పుడు ఏ పరిస్థితిలో చావు మూడునో అది తప్పగల పరిస్థితి యేదో చెప్పవలసినదని వేడెను. బ్రహ్మ అపు డీ నియమాంచితవర మనుగ్రహించెను. తిరిగి మేఘనాదుడు తనకు యుద్ధభూమిలో అగ్ని వ్రేల్వగా అశ్వయుక్తమగు రథము లభింపవలెననియు దానిపై నుండగా తనకు మృత్యువు కల్గరా దనియు కోరెను. (ఉత్తరకాండ స.30) మధు

దైత్యునిపై ప్రసన్నుడై శివు డతనికి శూలమిచ్చెను. ఆ శూలము చేత ధరించి అతడు శత్రువులను ఓడింపగలడని వరమిచ్చెను. కాని ఒక నియమ మునుంచెను. 'నీవు ఎంతవరకు దేవబ్రాహ్మణవిరోధ మాచరింపకుందువో అంతవరకు ఈ శూలము నీవద్ద నుండును. అట్లు కాని నాడిది మాయమగును.' తిరిగి రక్కసుని ప్రార్థనపై అది అతని అనంతర మతని పుత్రునివద్ద నుండునని చెప్పెను. ఆ ప్రకారము ఆ శూలము లవణాసురునికి లభించెను. అతడు దానిని ఋషీశ్వరులపై ప్రయోగించుచు వచ్చెను. ఋషులు వేడగా రాముడు శత్రుఘ్నుని పంపి లవణుని సంహరింపజేసెను. (ఉత్తరకాండ స.77)

అనుగ్రహముతో కూడిన వరములు

అనుగ్రహము వరము వంటిదే. అనుగ్రహయుక్తమైన వరము సానుగ్రహవర మనబడును. అనుగ్రహమునకు, వరమునకు, కూడ సాధన అవసరము. ఇతరుల శుభము కోరుటయును సమానమే. కాని యీ రెంటికిని కొంత భేదమున్నది. వరము కేవలము వాక్శక్తి అగుటచేత, శుభేచ్ఛను వ్యక్తము చేయుటకు ఏకైకసాధనము శబ్దోచ్చారణము. అందువల్ల వరములో అవ్యక్తత ఉండును. అనుగ్రహములో శబ్దోచ్చారణముతో పాటు ఇచ్చివుచ్చుకొను వస్తువునకు కూడ ప్రాముఖ్యముండుట చేత అది వ్యక్తమై యుండును. సదిచ్ఛాసూచకముగా వస్తువును ప్రత్యక్షముగనే ఇచ్చుటగాని పుచ్చుకొనుటగాని జరుగును. వరప్రభావము నికటభవిష్యములో గాని దూరభవిష్యమున గాని గోచరింపవచ్చును. కాని అనుగ్రహములో శబ్దోచ్చారణముతోబాటు వస్తువు కూడ ప్రత్యక్షముగా ఇవ్వబడును. 'దృష్టదాన మనుగ్రహః', 'అదృష్టదానం వరః' అను నిర్వచనములే రెంటికీ గల భేదమును స్పష్టముగా తెలియజేయుచున్నవి. అనుగ్రహ మనగా కృపాప్రసాదము. 'అభీష్టసంపాదనేచ్ఛారూపః ప్రసాదః' మనోభీప్సితవస్తువు ఈశ్వర కృపచే ప్రాప్తించుట. గీతలో శ్రీకృష్ణుడు అర్జునునకు ప్రసాదరహస్యమును విశదపరచెను. 'మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్' భాగవత్పరా యణుడైన కర్మయోగి నా కృపాప్రసాదమున శాశ్వతపదవి నందుకొనును.[45]

వాల్మీకిరామాయణములో సానుగ్రహవరము లెన్నో యున్నవి. అనసూయ సీతకు వరమిచ్చెద ననగా సీత సవినయముగా వలదనెను. తరువాత అనసూయ ఆమెకు దివ్యస్రగ్వస్త్రాభరణానుగంధములను, విలువైన అనులేపనము నొసంగెను.

---

45. భారతీయసంస్కృతి కోశ్, ఖండ్ 1, వు.160 (ద్వి.సం)

ఈ వస్తువులు సీతకు అనుగ్రహరూపమున లభించినవి. ఇక్కడ వరానుగ్రహముల భేదము స్పష్టము. అశోకవనములో నున్నప్పుడు బ్రహ్మమాటపై దేవేంద్రు డామెకు హవిష్యాన్న మందజేసెను. నిశాకరముని అనుగ్రహమున సంపాతికి కాలిన రెక్కలు తిరిగి మొలిచెను. మేఘనాదునికి లభించిన దివ్యరథాస్త్రములు తామసీమాయయు అనుగ్రహఫలములే. రావణునితో యుద్ధ మొనర్చునప్పుడు రామునికై ఇంద్రు డంపిన సారథిసహిత దివ్యరథమును, విశాలమైన ధనువు, దేదీప్యమానమగు కవచము, తేజోవంతములగు బాణములు, నిర్మలశక్తియు, అనుగ్రహలబ్ధములే. కుబేరునకు బ్రహ్మవలన ప్రాప్తించిన దిక్పాలకత్వమును, నిధీశత్వమును అనుగ్రహరూపములే. శంకరుడు రావణుని కిచ్చిన చంద్రహాసఖడ్గము, మేఘనాదునికి లభించిన కామగామి రథము, అక్షయతూణీరములు, ప్రచండా స్త్రమును అనుగ్రహార్జితములే. మధుదైత్యునికి, తర్వాత నతని పుత్రుడు లవణునికి ప్రాప్తించిన శూలము రుద్రుని అనుగ్రహఫలమే. ఈ చెప్పినవన్నియు సానుగ్రహవరములకే ఉదాహరణములు. అనుగ్రహములో వర ముండితీరును. అదియు ప్రత్యక్షముగా నుండును. వరములో అనుగ్రహ ముండనక్కరలేదు. ఉన్నచో అది సానుగ్రహవర మగును.

### ఆశీర్వాదము-శుభకామన

వరము, ఆశీస్సు, శుభకామన - ఇవన్నియు సద్భావనకు, సంతుష్టికి ఫలములు. వరమో, ఆశీర్వాదమో యిచ్చునప్పుడు గ్రహీతయెడ శుభాకాంక్ష స్ఫుటమగును. అతనిపై గల ప్రేమ, దయ, ఆదరము, సానుభూతి దీనికి ముఖ్యకారణములు. అందువల్లనే శుభకామన శబ్దోచ్చారణమాత్రమున జరుగును. సద్భావము కూడ సమానధర్మమేకాని, అది వరాశీర్వాదశుభాకాంక్షలవలె వ్యాపకత్వము గాని, అట్టి స్వరూపముగాని, ప్రభావము గాని లేనిది.

ఆశీర్వాదము ఆశీః+వాదః రెండు సంస్కృతశబ్దములతో ఏర్పడును. *'ఇష్టార్థావిష్కరణమ్'* అనగా ఇష్టమైన అర్థమును ప్రకటించుట అనే అర్థంలో ఈ పరిభాష ఏర్పడినది. శబ్దకల్పద్రుమములో ఆశీర్వాదమున కిచ్చిన వివరణ ఇట్లున్నది-

*వాత్సల్యాద్యత్ర మాన్యేన కనిష్ఠస్యాభిధీయతే,*
*ఇష్టావధారకం వాక్యమాశీః సా పరికీర్తితా.*

మాన్యుడైనవాడు తనకన్న చిన్నవానిపై గల వాత్సల్యముచే వాని

కిష్టసిద్ధి కలుగుటకు సహాయకమగు వాక్యము నుచ్చరించుట ఆశీర్వాదము.[46]

ఆశీర్వాదమునకు వైదికముగా వినిపించు మంత్ర మీ క్రిందిది-

*ఆశిషః సఫలాః సంతు పూర్ణాః సంతు మనోరథాః,*
*శత్రూణాం నాశనం చాస్తు మిత్రాణాముదయస్తవ.*

ఋగ్వేదములోని ఈ క్రింది మంత్రము అందరికినీ పరిచితమైనదే.

*శతం జీవ శరదో వర్ధమానశ్శతం హేమంతాన్ శతము వసంతాన్,*
*శతమింద్రాగ్నీ సవితా బృహస్పతిః శతాయుషా హవిషేమం పునర్దుః.*
*ఆహార్షం త్వా విదం త్వా పునరాగాః పునర్నవ,*
*సర్వాంగ సర్వం తే చక్షు స్సర్వమాయుశ్చ తే విదమ్.*

'నీవు నూరు శరదృతువులు, నూరు హేమంతములు, నూరు వసంతములు జీవించియుందువు గాక. నీవు ఉత్తరోత్తరోత్కర్ష గాంచి ఇంద్రాగ్నిబృహస్పతులను హవిస్సులచే ప్రసన్నులను చేసికొందువు గాక. వారు నీకు నూరు సంవత్సరములు సంపూర్ణజీవన మిచ్చిరి. కనుకనే మానవులకు నూరేండ్లాయువు సిద్ధించుచున్నది. నేను స్వాస్థ్యమయస్థితిలో నిన్ను పొందితిని. నేను నీ స్థితి నంతను ఎరుగుదును. తిరిగి నూతనదేహము నొందునట్టి ఓ పురుషుడా! నీవు తిరిగి ఇప్పు డట్టి ఉత్తమస్థితికి వచ్చితివి. పూర్ణస్వాస్థ్యయుక్తా! నీ చక్షురాది యింద్రియములను అనగా నీ రాగల జీవితమును నేను పూర్తిగా నెరిగితిని.'

వరము గాని, ఆశీర్వాదము గాని ఇచ్చుటకు ఆయువు, స్థానము, అధికారము, జ్ఞానము మున్నగువాటివలన ప్రాప్తించిన జ్యేష్ఠత్వశ్రేష్ఠత్వము లావశ్యకములు. శుభకామన కీ విధమైన విశేషము లక్కరలేదు. ఎవడైనను నిర్భయముగా శుభకామన వెల్లడింపవచ్చును. చిన్నవారు పెద్దవారికి వరాశీర్వాదము లీయజాలరు. వరరూపమున పల్కిన శబ్దముల ప్రభావము సునిశ్చితము, నిశ్చలమునై యుండును. ఆశీర్వాదము ప్రభావకారి కావచ్చును, కాకపోవచ్చును కూడ. ప్రభావకారి యైనదా సంయోగవశమున లేదా కాకతాళీయముగ నగును. ఆశీర్వాదకర్తకుగాని, గ్రహీతకుగాని ఈ విషయమున నిశ్చితమైన విశ్వాసముండదు. వరాశీర్వాదముల కున్న యీ భేదమును కాళిదాసు చక్కగా గుర్తించెను. కశ్యపునకు నమస్కరింప వచ్చిన శకుంతలతో అత డిట్లనెను-

---

*46. భారతీయసంస్కృతి కోశ్. ఖండ్ 1. పు.496.*

*యయాతేరివ శర్మిష్ఠా భర్తుర్బహుమతా భవ,*
*సుతం త్వమపి సమ్రాజం సేవ పూరుమవాప్నుహి.*

'శర్మిష్ఠ యయాతికి ప్రియురాలు, ఆదరణీయురాలును అయినట్లే నీవును నీ పతికి ప్రియురాలును, ఆదరణీయవును అగుము. ఆమె సమ్రాట్టు కాగల పూరుని కనినట్లే నీవును సమ్రాట్టగునట్టి పుత్రుని గాంచుము.' వాస్తవమున కీ మాటలు ఆశీర్వచనములు. కాని యీ మాటలు కశ్యపుని ముఖమున వెడలినవి కనుక వరతుల్యములే యగునని గౌతమి భావించెను. *"భగవన్, వరః ఖల్వేషః నాశీః"* 'ఇది వరము; ఆశీస్సు కాదు' అని ఆమె పలికెను.[47] ఆశీర్వాదవరములలో కొంత భేదమున్నది. పురోహితుడో, బ్రాహ్మణుడో తన యజమానిని, పెద్దలైనవారు తమ పుత్రపౌత్రులను, సంబంధించినవారిని, గురువులు, సత్పురుషులు అయినవారు తమ సచ్ఛిష్యులను సంబోధించి ఇష్టార్థప్రాప్తిని గూర్చి పలుకు వచనములన్నియు ఆశీర్వాదములే అనబడును. ఈశ్వరుడు, దేవీదేవతలు లేదా అవతారపురుషులు తమ భక్తుల ఇష్టసిద్ధి నెంచి పలికిన వచనములు వరదానము లనబడును.[48] మీద చూపిన ఉదాహరణమున గల ఉత్తరార్థము పాక్షికముగా సత్యమైనది. ఇందులో వరదానాధికారము గల మునీశ్వరులు పేర్కొనబడకపోవుటచే దీని కవ్యాప్తి కలిగినది. రామాయణములో అత్యంత ప్రముఖమైనదియు, రామాయణకథకే కారణమునైన వరము దశరథుడు కైకేయి కిచ్చినది. కాని అది ఈ వివేచనలో చేరదు. దానినిగూర్చి వేరొకచోట విస్తృతముగా చర్చింపబడినది.

వర మిచ్చుటకు దైవగుణము, పుణ్యసంచయము, తపోబలము కావలెను. ఆశీర్వాదమునకు కేవలము ఆయువులో అధికుడైనచో చాలును. మిగిలిన సాధనము లనవసరము. నిత్యవ్యవహారమున నెన్నో ఆశీర్వాదము లివ్వబడుచుండును. వానిలో శుభకామన యున్నను, అవి ఔపచారికములుగనే యుండును. కొన్నాళ్ళకు అవి అర్థరహితోక్తులుగా సిద్ధమగును. చిన్నవారు కూడ పెద్దవారి విషయమున శుభకామన వ్యక్తము చేయవచ్చును. శిష్యుడు గురునిగూర్చి మంగళ మాశింపవచ్చును. షష్టిపూర్తి వంటి శుభావసరములలో చిన్నవారు పెద్దవారికి శుభకామన

---

*47. శాకుంతలం అం. శ్లో.4*

*48. భారతీయసంస్కృతి కోశ్, ఖండ్ 1, పు.496 (ద్వి.సం)*

లందజేయుదురు. వాల్మీకిరామాయణములోని కొన్ని ఆశీస్సులను గూర్చి వేరుగా వర్ణింపబడినది.[49]

## మ్రొక్కులు

మ్రొక్కులు యాచితపరములలో నొక విధము. ఈ రెండింటిలోను ఇష్టార్థసిద్ధికి దేవీదేవతలను కొలిచి యాచించుట జరుగును. కృపాప్రాప్తి నాశించి ఇష్టదేవతకు ఏదో ఒక వస్తు వర్పింపబడును, లేదా వ్రత మాచరించుటకో విశేషమైన పూజావిధి నాచరించుటకో ప్రతిజ్ఞ చేయబడును. ఈ ప్రతిజ్ఞ షరతులతో కూడినదై యుండును. కామ్యపూర్తి అయిన మీదటనే ప్రతిజ్ఞాను సారము ఆచరించుటగాని, వస్తు వర్పించుటగాని జరుగును. కామ్యపూర్తి కానినాడు ప్రతిజ్ఞాపాలనమున కావశ్యకత లేదు. కాని కామ్యపూర్తి జరిగిన పిదపకూడ ప్రతిజ్ఞ పాలింపకున్నచో దేవతాక్రోధము కలుగును. దానివలన అమంగళము జరుగవచ్చును. లేదా కష్టములు రావచ్చును. వరప్రాప్తికై తపస్సు, యజ్ఞము వంటివి చేయుదురు. వాటితో పోల్చినపుడు మ్రొక్కులు చాల సౌమ్యమైనవి. మ్రొక్కులో ఇచ్చిపుచ్చుకొను భావముండును. అది పూర్తిగా వ్యావహారికము. కోర్కె తీరిన పిదప దేవతాకృపచే మ్రొక్కు తీరినదని చెప్పుదురు. అడిగి పుచ్చుకొన్న వరమునకు, మ్రొక్కునకు వేరొక భేద మేమనగా, వరమునకై యాచకుడు మొదటనే ప్రయత్నించును. కాని మ్రొక్కులో అది తీరిన పిదపనే ప్రయాస కలుగును. కామ్యపూర్తి కానినాడు ప్రయాసప్రశ్నమే లేదు. సత్యనారాయణ పూజనము, దేవికి ఒడికట్టు నింపడము వంటి పూజలు, తులాదానము, ఉపవాసము, వ్రతపాలనము, వస్తుసమర్పణ వంటి మ్రొక్కు లెన్నియో యున్నవి. మ్రొక్కులు పురుషులకంటె స్త్రీలలో ఎక్కువగా గోచరించును.

వాల్మీకిరామాయణములో రెండు మ్రొక్కులు వర్ణింపబడినవి. ఈ రెండును సీత చేసిన మ్రొక్కుబడులే. దండకావనమున కేగుచున్నప్పుడు గంగాయమునలను దాటునప్పుడు సీత ఈ రెండు నదులకు మ్రొక్కులు చేసెను. రెండింటికిని ఆశయ మొకటే. ప్రయాణము, వనప్రవాసము సుఖముగా గడిపి శ్రీరాముడు తిరిగి అయోధ్య చేరవలెనని. యమునకంటె గంగ పెద్దదగుటవల్లనో యేమో మ్రొక్కుబడిలో చెప్పిన వస్తువులు రెండింటికి సమా

---

49. ఆశీర్వాదములు, మ్రొక్కులు

నముగా లేవు. గంగకు లక్షగోవులు, వస్త్రములు, బ్రాహ్మణుల కన్నదానము, అయోధ్య తిరిగి చేరగానే వేయి ఘటముల మద్యము, మాంసోపేతమైన ఆహారము ఇచ్చెద నని ప్రతిజ్ఞచేసెను. యమునకు కేవలము వేయి గోవులు, నూరు మద్యఘటములు మాత్ర మిచ్చెద ననెను. వాస్తవమునకు గంగ దాటునప్పుడు గుహుని సహాయముచే నౌకాయాత్ర సురక్షితమైనది. యమున దాటుతరి నౌక లేదు. రామలక్ష్మణులు కట్టెలు తెచ్చి కట్టి మంచెవడవ నేర్పాటు చేసిరి. దానిపై నదిని దాటుట కష్టమే. కనుక యమునను సంతృప్తిపరచవలసిన అవసర మధికము. కనుక గంగకన్న యమునకే ఎక్కువ వస్తువు లర్పించుటకు సంకల్పింపవలసినది.

## ఆకాశవాణి - పుష్పవృష్టి

ఆకాశవాణియు, పుష్పవృష్టియు అయాచితవరములకు సన్నిహితమైనవి. వీటిలో సద్భావము, శుభేచ్ఛ కూడ నుండును. ఆకాశవాణి పల్కులకు గల ప్రాముఖ్యము శబ్దోచ్చారణమున నభివ్యక్తమగును. పుష్పవృష్టిలో అది పువ్వుల మూలమున వ్యక్తమగును. ఆకాశవాణీ పుష్పవృష్టులు నింగి నున్న దేవతలవలన జరుగును. వరమునకు, ఆకాశవాణికి కొంత భేదమున్నది. వరమిచ్చునపుడు వరప్రదాత ఎదుట కనిపించును. ఆకాశవాణిలో అత డదృశ్యముగా నుండును. ఏ వ్యక్తికైనను అతని సదాచార, సమాజోపయోగకృత్యములవలన సంతసించి ఆకాశవాణి వినిపించును. ప్రత్యక్షముగా వచ్చి చెప్పు నవకాశము లేని విషయములు ఆకాశవాణిద్వారా చెప్పబడును. ఆకాశవాణి మూలమున వరశాపములే కాక భవిష్యసూచన కూడ చేయబడుచుండును. జాగ్రత్తగా నుండవలె నను ఉపాయము సూచింపబడును. విపత్తులు సూచింపబడును. కథాసూత్రమును నడిపించుటలో ఇది యొక సాహిత్యిక ప్రక్రియ *(Literary device)*. వాల్మీకిరామాయణములో ఆకాశవాణులు కొద్ది మాత్రమే యున్నవి. (చూ.శావ.క్ర.సం. 56) సీత భూదేవిని ప్రార్థించి తన్నామెలో చేర్చుకొనుమని వేడెను. వెంటనే భూమి రెండు ప్రక్కలై, అందుండి ఒక సింహాసనము బయటకు వచ్చెను. దానిపై భూదేవి కూర్చొనియున్నది. ఆమె సీత నెత్తుకొని సింహాసనముపై కూర్చుండ బెట్టెను. అప్పుడు స్వర్గమునుండి దేవతలు పూలవాన కురిసిరి. అంతరిక్షమున-

*సాధుకారశ్చ సుమహాన్ దేవానాం సహసోత్థితః,*
*సాధు సాధ్వీతి వై సీతే యస్యాస్తే శీల మీదృశమ్.*

*ఏవం బహువిధా వాచో హ్యంతరిక్షగతాః సురాః,*
*వ్యాజహ్రుర్ హృష్టమనసో దృష్ట్వా సీతాప్రవేశనమ్. (ఉత్తరకాండ స.97)*

ఒక్కపెట్టున దేవత లుచ్చైస్స్వనమున సాధువాదము చేసిరి. 'సీతా! నీవు చేసిన యీ కృతివలన ధన్యురాలవైతివి.' అను నర్థ మిచ్చునట్టి శబ్దము లెన్నో వినిపించెను. పుష్పవృష్టి ఆకాశవాణికి అభిన్నమైన అంగము కాదు. సద్భావప్రకటనమునకు పుష్పవృష్టి ఒక మాధ్యమము మాత్రమే. మాటలతో బదులు పూలతో సద్భావము వెల్లడింపబడును. ఒక్కొక్కప్పు డీ కార్యము మంగళవాద్యధ్వనులు, నృత్యగానముల వంటి మాధ్యమములతో కూడి జరుగును. శ్రీరామజన్మ (బాలకాండ స.18) రామలక్ష్మణుల వివాహము (బాలకాండ స.75) వేదవతి అగ్ని ప్రవేశము (ఉత్తరకాండ స.17) శంబూకవధ (ఉత్తరకాండ స.75) శ్రీరాముని మహాప్రస్థానము అను నవసరములలో పుష్పవృష్టి చెప్పబడెను. రావణవధానంతరము (యుద్ధకాండ స.108) కూడ పుష్పవృష్టి కురిసెను.

రామాయణము - మానవకథ

వాల్మీకిరామాయణము పూర్తిగా మానవుల కథ. దేవతల కథ కాదు. విష్ణువు దేవుడైనను, భృగుశాపమునకు ఫలితముగా, *'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్'* అను తన తత్త్వమున కనురూపముగా మానవావతారము గ్రహించి పూర్తిగా మానవునివలెనే వ్యవహరించెను. భూమిపై నవతరించునపు డతడు తన దైవీగుణసంపద నంతను స్వర్గముననే వదలెను. భూమిపై మానవునిగా నవతరించుటతో, అతడు దానికి కట్టుబడి పూర్తిగా తన్మయుడై చరించెను. అతడు తన వెనుకటి దేవత్వమును విస్మరించెను. మానవజీవితముపై గల అతని దృష్టికోణ మతనిని సామాన్యమానవులకంటె వేరుగా చూపినది. అతడు తన జీవితమంతయు మానవజీవనమున గల ఉత్తమమాదర్శములు రక్షించుచు వచ్చెను. అతడు తన ఆచరణమున, వచనమున కూడ మానవీయదర్శనమును స్ఫుటముగా ప్రకటించెను. ఇట్లతడు మానవులలో ఉత్తముడై, మహామానవు డయ్యెను. కాని ఏనాడును అతడు తన అతి మానవత్వమును ప్రదర్శింపలేదు. రామాయణములో చమత్కారములకు తావు లేదు. రాక్షసుల కామరూపములు, హనుమంతుడు పర్వత మెత్తి తెచ్చుట, యజ్ఞకుండమునుండి యజ్ఞపురుషుడు వచ్చుట, అగ్నినుండి సీత సురక్షితముగా బయటపడుట వంటివి చమత్కారములు కావు. వాటిలో దైవగుణము లేదు.

మానవశక్తికి దురూహ్యమైన కార్యము మాయాశక్తిచే సమకూరవచ్చును. రాక్షసుల కీ శక్తి జన్మసిద్ధము; పైగా గడించినది కూడ. అట్లనుకొనినను కామరూపము చమత్కార మనిపించుకొనదు. హనుమంతుడు పర్వతమెత్తి తెచ్చుటలో గల అర్థము, నాటికి పరిచితమైన ఓషధుల నత్యధికముగా తెచ్చుట మాత్రమే. సీత అగ్నిప్రవేశమును అగ్నిదివ్యమని చెప్పదగదు. దాని లక్షణార్థ మేమనగా- అత్యంతవికటమైన పరిస్థితిలో తన శీలము నిష్కళంకమని ఋజువు చేయుట కామె ఆ మార్గ మందుకొని, పరీక్షకు నిల్చినది.

రామాయణము ఆదిమహాకావ్యము. మహాకావ్య మెప్పుడును మానవీయమే యగును. రైట్ ఆనరబుల్ శ్రీ వి.యస్ శ్రీనివాసశాస్త్రి గారి మాటలలో - *The fundamental postulate is that an epic is a great work of art which is intended expressly, for the edification of man --- The epic is to be read with a view to benefit by its teaching, to draw at every turn lessons of supreme value for the conduct and regulation of ourselves.*[50] ఈ మాటలు స్పష్టార్థములు. వాటిని సమీక్షించుట అనవసరము. రామాయణములో వర్ణించిన వ్యక్తుల స్వభావము, గుణావగుణములు, ఆచరణము, కృతి, వ్యవహారము - అన్నియూ మానవోచితములు. మానవస్వభావమునకు గల వేర్వేరు రూపములను చిత్రించిన వాల్మీకి నేర్పు ప్రశంసనీయము. శ్రీరామునితో పాటు సీతకూడ వనమున కేగదలచినప్పుడు అదింకనూ నిశ్చయముకాని తరి, రాము డామెకు తాను లేనప్పు డామె ఆచరింపవలసిన విధులను కూర్చి చెప్పెను. 'వైభవసంపన్నుడైనవాడు ఇతరుల ప్రశంస నోర్వడు. కనుక నీవు భరతుని వద్ద నన్ను ప్రశంసింపవలదు' అని చెప్పెను. ఈ నిర్దేశము వ్యావహారికముగా నగుపించినను మానవస్వభావమును వాల్మీకి ఎంత సూక్ష్మముగా గుర్తించెనో తెలియజేయుచున్నది. దశరథుని ఆజ్ఞను కౌసల్య కెరిగించునపుడు రాముడు తన దుఃఖము నెంతగనో దిగమ్రింగెను. కాని ఆ పిమ్మట సీతాలక్ష్మణుల యెదుట అత డా దుఃఖము నాపుకొనలేకపోయెను. తాను లేనితరి లక్ష్మణ సుమంత్రుల కయోధ్యలో నుండవలసిన అవసరమును గూర్చి చెప్పుచున్నప్పుడు, రాముని మనసులో నెట్టి కల్లోల మేర్పడెనో వాల్మీకి చక్కగా ధ్వనించెను. విరాధుడు రాముని ఎదుటనే సీత నెత్తుకొని, చంక నిడుకొని రామునితో నాడిన మాటలు రాముని హృదయమున గాఢముగా నాటినవి. ఆ సమయమున

50. Lectures on Ramayana

నతనికి కల్గిన దుఃఖాతిరేకము, సీతకొరకై విలాపము, సీతను వెదకుటలో ప్రయత్నము, ఆమె లభించిన పిదప శుద్ధిపరీక్షకై చేసిన నిర్ణయము, తిరిగి ఆమెను విడుచుట, సుగ్రీవుడు తన కర్తవ్యము నిర్వహించుటలో చూపిన అలసత్వముపై అతని కంపిన సందేశము, శూర్పణఖను హాస్యమాడుట, అవసర మెరిగి అసత్యమాడవలసిన దని సుమంత్రునితో చెప్పిన మాటలు, లక్ష్మణునిపై గల అపారమైన ప్రేమ, లక్ష్మణుని తిరుగులేని నిష్ఠ, లక్ష్మణునిపై సీత అనుచితముగా చేసిన నిందారోపణము, హనుమంతుని నిష్ఠాపూర్ణభక్తి, రావణుని కౌర్ధ్వదేహికక్రియలు యథావిధిగా నొనర్పవలెనని విభీషణునికి నచ్చచెప్పుట - ఇట్టి వెన్నో ఘట్టములలో మానవస్వభావ మెన్నెన్ని రూపములలోనో రామాయణమున చిత్రింపబడినది. మహిళలో గోచరించు మహోజ్జ్వలమగు పతినిష్ఠ, అసమానత్యాగము, వాత్సల్యము, ప్రేమ, భక్తి, రాగానురాగములు, కపటము, ఈర్ష్య, అసూయ - మానవస్వభావములో రూపించు నిట్టి విశేషము లెన్నో రామాయణములో కాననగును. రాముడు, లక్ష్మణుడు, సీత, హనుమంతుడు ఉన్నతాదర్శముల కంకితులైన కఠోరకర్తవ్యనిష్ఠులైన మానవులు. వారి జీవననిష్ఠ కడు శ్రేష్ఠమైనది. ఈ ఆదర్శమువల్లనే వారు సామాన్యజనులకంటె భిన్నముగా కనిపించుచున్నారు. మనము వారి నంతగా ఎంచి విలువ గుర్తింపలేకపోవచ్చును. కాని వారు పూర్తిగా మానవులు. ఉన్నత స్థాయి కెదిగిన మహామానవులు. దైవగుణోపేతులు కారు.

రామాయణము మానవునిచే మానవులకొరకే నూటికి నూరు పాళ్ళును రచింపబడిన గ్రంథము. రామాయణము 'మానవజీవిత మెట్టిది?' అనుటకు మారు 'మానవజీవిత మెట్లుండవలెను?' అని అడిగినచో సమాధానము చూపుటలో సఫలమైన గ్రంథము. రామాయణకథారచనలో ఆశీః-శపథ-శకున-వర-శాపము లెన్నో యున్నవి. తన దివ్యప్రతిభా, దివ్యకల్పనాశక్తులవలన వాల్మీకి నారదుడు చెప్పిన కథను సౌందర్యోపేత మొనర్చి దానికి నూతన చైతన్య మిచ్చి, దానిని అజరామరముగా చేసెను. వేల సంవత్సరములు గడిచిపోయినను ఆ కథ కున్న ఆకర్షణ ఆవంతయు తరుగలేదు. కథాసూత్రములో వరశాపములు కథ కభిన్నములగు అంగములుగనే కూర్చబడెను. వాటిని వేరుగా తీసి చూచినను, అవి కథకు దూరముగా విడివడియుండవు. అవి కథలో ఐక్య మందినవి. వరశాపముల నెంచి చూచి రామాయణమును వరకథ అనియో, శాపకథ అనియో చెప్పినను అత్యుక్తికాదు.

## రామాయణము: శాపకథ - వరకథ

రామాయణమం దాద్యంతమును కథను ప్రభావిత మొనర్చిన ముఖ్య ఘటనయు, కథలో అల్లుకొనినట్లున్న వరశాపములును నొక ప్రత్యేకత గడించుకొన్నవి. పాత్రలస్వభావముపై కూడ వాటి ప్రభావ మగపడును. వాల్మీకి నిషాదుని కిచ్చిన శాపముతో రామకథారంభ మయ్యెను. బ్రహ్మ యిచ్చిన వరముచే రచన సాగెను; రచనకు తగిన ప్రోత్సాహము లభించెను. బ్రహ్మగారి భవిష్యవాణియైన 'భూతలమున నదీపర్వతము లున్నంతవరకు రామాయణము ప్రజలలో ప్రచలితమగుచూ నిల్చును' అను మాటను కాలమే సత్యమని ఋజువు చేసెను. ఆరంభము వలెనే రామాయణములో కథాంతము కూడ శాపయుక్తమై దీపించెను. కాని ఆ శాపము ప్రత్యక్షముగా నిచ్చినట్టిది కాదు. బ్రహ్మ నిర్దేశించినందున కాలపురుషుడు స్వయముగా శ్రీరాముని వద్దకు సందేశవాహకుడై వచ్చెను. ఆ సందేశము అవతారసమాప్తినిగూర్చి తెలియచేయునది. వారిరువురు మాటలాడు చున్నంతవరకు ఇతరు లెవరును లోనికి ప్రవేశింపరాదు. ఆ కార్యము నిర్వహించు భారము లక్ష్మణునిపై బడినది. ఎవరినైన లోనికి రానిచ్చినచో మృత్యుదండము విధింపబడునని శాసింపబడినది. అట్టి సమయములో అకస్మాత్తుగా వచ్చి దుర్వాసుడు శ్రీరాముని చూడగోరెను. లక్ష్మణు డతనితో పరిస్థితి నెరిగించినను అతడు వినలేదు, సరికదా - 'నీవు తక్షణమే పోయి రామునికి నా రాక నివేదింపుము, లేకున్నచో నీకు, అయోధ్యకు ఈ దేశమునకు, శ్రీరామునికి కూడ శాప మిచ్చెదను' అని పలికెను. లక్ష్మణుడు విడదీయరాని చిక్కులో పడెను. ఋషిని పంపి రాముని చూడనిచ్చినచో రామాజ్ఞను మీరినట్లగును, మృత్యుదండము తప్పదు. అతనిని లోనికి పంపకపోయినచో రఘుకులమునకే ఘోరశాప మబ్బును. చివరి కిట్లెంచి, 'ఒకని మృత్యువుతో నైన, రఘుకులము రక్షణీయ' మనుకొని లక్ష్మణుడు రామాజ్ఞను మీరి దుర్వాసుని ఆగమనమునుగూర్చి రామున కెరిగించెను. తర్వాత స్వేచ్ఛగా ఆజ్ఞోల్లంఘన మొనర్చినదానికి శిక్షగా అతడు సరయూనదిలో జలసమాధి పొందెను. లక్ష్మణుని వియోగము సహింపజాలక అతని వెనుకనే రాముడు మహాప్రస్థాన మరిగెను. దుర్వాసుడు ప్రత్యక్షముగా శపింపలేదు కాని అతడు వచ్చి చెప్పిన మాట ప్రత్యక్షశాపమునకు మించి కరుణాజనకముగా మహాదారుణముగా పరిణమించెను.

రామలక్ష్మణులును, సీతయు రామాయణములో ముఖ్యపాత్రలు. వారెవరికిని

శాప మిప్పలేదు. శ్రీరాముడు ప్రస్రవణగిరికిని, నదికిని శాపమీయ నెంచి షరతులతో బెదిరించెను. ఆ షరతులు పాలింపబడినందున శాప మిచ్చుటకు అవసరము కలుగలేదు. అతని కెవ్వరును శాపమీయలేదు. రామాయణ మంతయు వెదకినను లక్ష్మణుని కెవ్వరును వర మిచ్చినట్లు లేదు. సీతారాములు వరము లిచ్చినను అంగీకరింపలేదు. అపవాదాత్మకముగా గ్రహించిన వరములనైనను రాముడు తన స్వీయలాభమునకు గాక సమాజకల్యాణము నెంచి గ్రహించెను.

## దశరథుడు కైక కిచ్చిన వరములు

దశరథుడు కైక కిచ్చిన రెండు వరములు రామాయణములో నసాధారణమైన మహత్త్వము గలవి. ఈ రెండు వరములపైననే రామాయణకథ నడచినది. కైక కీ వరము లందక పోయినచో రామాయణమున కిప్పటి రూప ముండియుండదు. రామాయణకథలో అల్లకల్లోల మేర్పరచి, దాని కొక వంపు నిచ్చిన శక్తి ఈ వరములది. కైకేయికి ఇవి వరములు కావచ్చును. రామాయణములోని అన్యవ్యక్తుల కివి శాపముల కన్న భయంకరములై రూపించినవి. రావణునికి బ్రహ్మగా రిచ్చిన పరిమితామరత్వవరము, కైక కిచ్చిన వరములకు పూరకమును, ఉపకారకమునూ నైనది.

రావణకథ మానవరూప మందిన రాముని అవతారమునకు లక్ష్యము. లక్ష్యపూర్తికై రామరావణుల కొకరికొక రెదురుపడక తప్పదు. శ్రీరాముడు అయోధ్యలోనే నిల్చినచో అది అసంభవము. అయోధ్యనుండి రాముని బయటకు పంపుటకు తగినంత కారణమేదియు లేదు. అతడు దశరథుని జ్యేష్ఠపుత్రుడు. కనుక ప్రవర్తనచే నందరిని కైకేయిని కూడ - మోహింపజేసెను. అందుచే నీతనిని తొలగించుట అసంభవ మనిపించినది. అట్టి స్థితిలో దీర్ఘకాలమువరకు రాముని అయోధ్యనుండి పంపి బయట నుండునట్లు చేయగల చాతుర్యము కైకేయి కిచ్చిన వరములలో నెలకొన్నది. అంతేగాక, ఆ వరము లీ సమయములో నిచ్చినా రను అపవాదుకు కూడ అవకాశము లేనట్లు కూర్చబడినది. కైకేయిని వివాహమాడునప్పుడు దశరథుడు ఆమె తండ్రితో, కైకేయికి జన్మించిన పుత్రుడే యువరాజు కాగలడని చెప్పెను. ఇట్లీ వరములు లోతుగా వ్రేళ్లూనినవి. కైకేయికి వరము లిచ్చునట్టి కారణ మొకటి కావలెను కదా. అందులకు ఘోరయుద్ధము, దశరథుని సంకటస్థితి, కైకేయి ద్వారా అతనికి లభించిన సహాయము, ప్రాణము రక్షించినందుకు బదులుగా దశరథు డామెకు వరము లిచ్చుట ఇవన్నియు సహజములుగనే సంభవించినవి. కైకేయి ఆ వరములను

వెన్వెంటనే స్వీకరింపక, వాటిని సమయము వచ్చినప్పుడు గ్రహింతునని, రాజువద్దనే దాచుకొనెను. బహుశా, అప్పు డామె ముందు ముం దీ వరము లడుగవలసివచ్చునని అనుకొని యుండదు. శ్రీరాముని యౌవరాజ్యాభిషేకవార్త విని ఆమె ఎంతగానో సంతోషించెను. పూర్వనిశ్చయానుసారము రామాభిషేకము జరుగుట కే ఆటంకమును లేదు. అట్టి స్థితిలో కైకేయికి మత్సరము జనింపజేసి, ఆమెకు రాజు పూర్వమిచ్చిన వరములను జ్ఞప్తికి తెచ్చుటలోను, వానిద్వారా కథ కొక అనుకోని వంపు స్వాభావికముగనే గిడించిపెట్టుటకును ఈ వరములు యోజింపబడిన వనిపించును. మంథర దీనికొక సాధనము. అయినను కైకేయికి మనఃపరివర్తనము కలిగించుట సామాన్యము కాదు. ఆమె భరతుని వలెనే రాముని కూడ ప్రేమించుచుండెను. వరకథాయోజన మిట్లు నిరాటంకమగు రీతి నెంచి జరుపబడినది. కైకేయి మనుష్యస్వభావ మెరుగును. కనుక వరములు నిశ్చయముగా ఉపయోగింపబడగల వను ధైర్య మామెకు కల్గెను. దశరథుని వరము లడుగుటకు ముందుగా ఆమె నేర్పుగా అతనిని మాటలలో బంధించినది. దేవతల పేరున శపథము గ్రహించినది. కాని ఇదంతయు శ్రీరాముని స్వభావముపై నాధారపడిన విషయము. ఆమె గుర్తించిన దేమనగా రా జొకప్పుడైన తానిచ్చిన వరములను మరచిపోయి కాదనవచ్చునేమో కాని శ్రీరాముడు నిస్సంశయముగా ఆజ్ఞాపాలన మొనర్చును. ఈ ధైర్యముతోనే ఆమె ఆ వరము లడుగుటకు సాహసించెను. తన సాఫల్యము విషయమున నామె కెంతగానో నిబ్బరముండెను. కారణము, రాముడు తండ్రి చెప్పినచో అగ్నిలో దూకుటకైనను వెనుదీయడు; విషము త్రాగుమన్నను త్రాగును; సముద్రములో దిగుమన్నను దిగును; కాని ఆజ్ఞాభంగ మొనర్చడు. రామునికి జన్మసిద్ధముగా స్వయంప్రాప్తమైన రాజ్యాధికారమను మరే కారణమునైనను చూపి కాదనుటకు వీలులేదు. అది కృత్రిమ మగును. అందువలన చతురతతో ఈ వరములు యోజింపబడిన వనుట తథ్యము. కైకేయిని తన పట్టు విడువుమని చెప్పి ఒప్పించుటకు దశరథుడు సామదానాది ఉపాయము లన్నియు ప్రయోగించెను. తన ఓటమి నంగీకరించెను. ఆమె పాదములపై పడి వేడుకొనెను. బెదిరించెను. ఆమెను విడిచివేయుదు నన్నంతవరకు కఠినముగా చెప్పి చూసెను. కౌసల్య, లక్ష్మణుడు, సుమంత్రుడు, వసిష్ఠుడు - అందరును ప్రయత్నించి విఫలులైరి. కైకేయి తన పట్టు వీడలేదు. పైగా, వరములు పాలింపబడకున్నచో తాను ప్రాణత్యాగ మొనర్తునని బెదిరించెను. ఎవ రెంత

కఠినముగా చెప్పినను ఆమె చలింపలేదు. ఆమె నాపగల శక్తి భరతునిలో మాత్రమే కలదు. అతడు యువరాజు పదవి తనకు వలదన్నచో ఆమె పట్టు సడలిపోవును. ఈ ఆటంకమును వాల్మీకి మంచి నేర్పుతో నివారించెను. రామాయణములోని యీ మీది ఘటన లన్నిటికిని మూల మీ వరములలో నున్నది. రామాయణకథకు నిజమైన ఆరంభము రామవనవాసము, భరతుని యౌవరాజ్యపట్టాభిషేకము అను వరములతోనే జరిగినది. దశరథుడు సంతసించి కైక కిచ్చినవి వరములు కావనియు, కేవలవచనములనియు చెప్పవచ్చునేమో కాని అట్టి తర్క మనుచితము. దాని కాధారము కూడ లేదు. రామాయణములో ఈ వరములు 15-20 సార్లు ప్రస్తావింపబడినవి. అన్నిచోట్లను వాల్మీకి వీటిని వరము లనియే చెప్పెను. వచనములని అనలేదు. కొన్ని చోట్ల వరములని శబ్దతః స్పష్టముగా చెప్పకపోయినను సందర్భమును బట్టి అదే అర్థము వచ్చును. వీటినిగూర్చి మొదట నారదుడు సంక్షిప్త రామకథాసందర్భముననే బాలకాండలో మొదటిసర్గలోనే *'పూర్వం దత్తవరా దేవీ'* అని సూచించెను. దాసి మంథర *'దత్తౌ తే ద్వౌ వరౌ'* అని కైక కా వరములను జ్ఞప్తికి తెచ్చెను. వరము-వచనము అనునవి సమానార్థకశబ్దములు కావు. వరప్రభావము సునిశ్చితము, అపరివర్తనీయము. వచనభంగము నిషిద్ధ మందురు కాని దానిని మార్పుచేయ వచ్చును. చెప్పి, ఒప్పించి, బ్రతిమాలి మనసు మార్చి వచనపరివర్తన సాధింపవచ్చును. దశరథుడు సత్యసంధుడు కనుక కైకేయికి వరములు గాక వచనము మాత్ర మిచ్చి యుండినచో వాటిని పాటింపవలసిన నైతికబాధ్యత అతని కుండియుండదు. వరమే యిచ్చెను. కనుకనే అతడు కైకను బ్రతిమాలెను. కాని కైకేయి నిశ్చలముగా నిల్చినందున వరప్రభావము అపరిహార్యమై, అతని ప్రయత్నము విఫలమయ్యెను.

దశరథుడు విషయలంపటుడుగా రామాయణములో ననేకపర్యాయములు చెప్పబడెను. అయిననూ, కైకేయి సౌందర్యమునకు ముగ్ధుడై అత డీ వరము లిచ్చెనని అనలేము. కైకేయి రూపమున కాతడు ముగ్ధుడు కావచ్చును. కాని యీ వరములకు దానితో సంబంధము లేదు. పైగా అత డీ పట్టున కైకను నిందించుటలోను, ఆమెతో గల ధార్మికసంబంధమును తిరస్కరించి పలుకుటలోను, అతని విషయలంపటత ఏమాత్రమును గోచరింపదు. తాను గతించిన వెనుక తన శరీరము నామె ముట్టరాదని పలుకుటయు, రామునితో నసత్యమాడి నందుల కామెను నిందించుటయు, అతని నీ విషయములో సంశయింపజేయవు.

అతడు కైక యిట్టి విచిత్రమైన వరము అడుగునని ఎన్నడును ఊహింపలేదు. ఆ విషయ మాతడు స్పష్టముగా చెప్పెను కూడ. *'ధర్మబంధేన బద్ధోఽస్మి, నష్టా చ మమ చేతనా'*[51] నేను ధర్మబంధమున కట్టుబడితిని. నాకేమియు స్ఫురింపకున్నది. రాముని అడవి కేగుమనుటకు గల వాస్తవికకారణ మెరిగించినచో లోకులు తన మాట నమ్మరనియు, అసత్యవాది అనెద రనియును దశరథు డెంతో పరితపించెను.

రావణునికి రెండే రెండు వరములు లభించినవి. బ్రహ్మ ప్రసాదించిన పరిమితామరత్వ మను వరము కైకేయి కిచ్చిన వరములకు సహాయపడినది. దురాక్రమణశీలత, ఉద్దండత, అధికారదాహము, కామాంధత, మర్యాదారహిత వర్తనము వంటి దుర్గుణము లన్నిటికిని బీజము లీ వరములోనే నెలకొన్నవి. అతని పాపములు పండుట కీ వరము లవసరమయ్యెను. అడిగినదిగదా అని రాముడు సీతను తనతో అడవికి వచ్చుట కనుమతింపలేదు. కథాలక్ష్యము ననుసరించి, ఆమె వనమున కేగుటలోనే ఆనుకూల్య మెక్కువ. మహిళాపహరణము యుద్ధమునకు ప్రబలకారణముగా నుండును. సీతావనగమన మిట్లు కార్యసాధక మగును. ఇందులో వాల్మీకికథాశిల్పము స్పష్టమగుచున్నది. రావణునికి శివుని వలన కూడ ఒక వరము లభించెను. దానివలన నతని బలము పెరిగెను. మేఘనాదునకు కూడ ఇట్టి వరము లభించెను. దాని ప్రకారము లక్ష్మణుని కతనిని వధించుట సుకరమాయెను. ఒకే ఫలమిచ్చు వరశాపములు, అవి కూడ ఒకనినుండియే- బ్రహ్మనుండి- పొందనైన విచిత్రస్థితి కుంభకర్ణున కేర్పడెను. ఇవి అతనిని శక్తిహీనుని చేయుటకే యివ్వబడినవి. రాక్షసులలో నెవరు వర మందినను, ఆ వరములోనే అతని వినాశబీజము కూడ చేరియుండెను.

## హనుమంతునికి లభించిన వరములు

హనుమంతుడు జన్మతః బలవంతుడు. అట్లుకానిచో నతడు పుట్టగనే సూర్యుని పట్టుకొన నెంచి ఎగురు టెట్లు? కాని ఆ బల మతని ఉత్తరోత్తర కార్యసిద్ధికి చాలదని యెంచి బ్రహ్మ అతనికి అష్టదిక్పాలకులచేతనూ వరము లిప్పించెను. ఒకేసారి ఎనమందుగురుచే ఎనిమిది వరము లందిన వ్యక్తి రామాయణములో హనుమంతు డొక్కడే. శ్రీరాముని దిగ్విజయమున

---

51. అయోధ్యాకాండ 14.

హనుమంతుని సహాయ మెంతయో కలదు. సీతను వెదకుటకు లంక కేగుటకై అతడు సముద్రము లంఘించెను. అందు కనువైన బలము చేకూర్చుటయే యీ వరము లిచ్చుటలో గల ఉద్దేశ్యము, ఒకేసారి ఇన్ని వరము లిచ్చుటకు తగిన అవకాశముగా ఇంద్రహనుమత్ యుద్ధము. వాయుదేవుని నిరోధము, అతని తుష్టికై దేవతల ప్రయత్నము వంటి కథ అంతయు కల్పింపబడినది. ఇది వాల్మీకి సాహిత్యకకౌశలమున కనుపమానమైన దృష్టాంతము. హనుమంతునికి వరమిచ్చుచు బ్రహ్మ చెప్పిన మాటలు చాల ముఖ్యమైనవి. అతడు దేవతలతో నిట్లనెను --

*జానతామపి వః సర్వం వక్ష్యామి శ్రూయతాం హితమ్,*
*అనేన శిశునా కార్యం కర్తవ్యం వో భవిష్యతి,*
*తద్ దదధ్వం వరాన్ సర్వే మారుత స్యాస్య తుష్టయే.*[52]

'మీరందరూ ఎరిగినదే. అయినను మీ హితార్థము నేనిది చెప్పుచున్నాను, వినుడు. మీ రీ బాలకునివలన మీ కార్యము సాధించుకొనవలసియున్నది. కనుక వాయువునకు సంతుష్టి కలుగునట్లు వీనికి వరములు ప్రసాదింపుడు.' దీనివలన హనుమంతునికి వరము లిచ్చు కార్య మెంత చక్కగా, పూర్వనిశ్చితమై సాగినదో స్పష్టపడుచున్నది. వరము లిచ్చునప్పు డీ విషయమున తగిన జాగ్రత్త తీసికొని లంకాయాత్రలో హనుమంతుని కెట్టి ఆపద రాని విధ మాలోచింపబడినది. ఇంద్రుని వజ్రము, వరుణుని పాశము, యముని దండము, కుబేరుని గద, శంకరుని ఆయుధములు, బ్రహ్మదండము కూడ అతనిని చంపజాల వని వరము లనుగ్రహింపబడెను. ఇది కాక దూతకార్యమున కావశ్యకమైన వాక్పటుత్వము, నిర్విఘ్నయాత్ర కనుకూలించు శక్తి, అజేయత కూడ ప్రసాదింపబడినవి. హనుమంతునికి పదకొండువరకు వరములు ప్రాప్తించినవి. వాటిలో మూడు బ్రహ్మ యిచ్చినవి. లంకలో నతనిని అస్త్రబంధమున బంధించు ప్రయత్నము జరిగినది. బ్రహ్మ యిచ్చిన వరబలమున నతడా బంధమునుండి విముక్తుడాయెను.[53] ఇంద్రు డిచ్చిన రెండు వరములలోను ఒకదానివలన నతనికి ఇచ్ఛామరణము సిద్ధించెను. విశ్వకర్మ వరముచే చిరజీవిత మబ్బెను. యమ, కుబేర, విశ్వకర్మ, శంకర, వరుణ, అగ్ని,సూర్య, బ్రహ్మ, ఇంద్రు లిచ్చిన వరములవలన అతని లంకాయాత్ర, అచటి

---

*52. ఉత్తరకాండ స. 36, శ్లో. 8,9.*

*53. సుందరకాండ స. 48*

ప్రవాసము సానుకూలమైనది. యుద్ధకాలమున లంకలో నెట్టి వ్యవస్థ నెరపవలెను? ఏ ఉపాయమున నడుపవలెను? అనునట్టి విషయములలో రామునికి కావలసిన విషయములన్నియు తెలిసికొని రాగలుగుటలో హనుమంతుని లంకాయాత్రకు దేవత లిచ్చిన యీ వరము లెంతో సహకరించినవి. హనుమంతునికి కలిగిన శాప మొకే ఒకటి. అది కథాగతిలో విశేషమైన మహత్త్వ మున్నట్టిది కాదు.

## బ్రహ్మ యిచ్చిన వరశాపములు

రామలక్ష్మణులకు జన్మతోనే శాపము, వరము కూడ కలిగినవి. భృగువిచ్చిన శాపఫలితముగా విష్ణువునకు మానవావతార మెత్తవలసివచ్చెను. దేవతలు తమను బాధించుచున్న రాక్షసులను, అవధ్యుడైన రావణుని చంపవలసినదిగా అతనిని ప్రార్థించిరి. అప్పు డతడు రావణుని పుత్రపౌత్రబంధుమిత్రసహితముగా వరిమార్చి, ఆ మీద 11 వేల సంవత్సరములు మానవలోకమును పాలించుదు నని చెప్పి, దేవతలకు వరమిచ్చి రాముడై జన్మించెను. ఇది కేవలవచనము కాదు. *'ఏవం దత్త్వా వరం దేవో దేవానాం విష్ణురాత్మవాన్'* ఇది వరము.[54] దశరథు డొనర్చిన పుత్రకామేష్టి, అందు లభించిన పాయసముతో కూడ అతని జన్మకు సంబంధమున్నది. పాయసప్రాప్తి వరము కాదు. అది యజ్ఞఫలము.

బ్రహ్మ సకలసృష్టికి మూలము, విధాత, సర్వశ్రేష్ఠుడు, సర్వాధికారి, కనుక అతని నెవరును శపించలేదు. అతనికి వరము లావశ్యకములు కావు. అత డితరుల కిచ్చిన శాపములను పరిశీలించవలెను. బహుశా దేవతలు శాపము లివ్వగోరరు. కనుక మార్గాంతరము లేనపుడు బ్రహ్మ శాపము లిచ్చెను. ఆ శాపములు రావణకుంభకర్ణుల కిచ్చినవి రెండే రెండు. రావణుని నిరాతంక కామవ్యసనము నరికట్టుటకు బ్రహ్మ అతనికి మరపురాని శాపమిచ్చెను. కథాదృష్టి ననుసరించి దానికి చాల మహత్త్వమున్నది. దానినిగూర్చి ముందు విస్తృతముగ చర్చింపబడును. ఈ శాపము కథకు అభిన్నమైన అంగము. కుంభకర్ణుడు మిక్కిలి బలవంతుడు. అద్భుతకృత్యము లాచరింపగలడు. అందువలన అతనికి నిద్రాశాప మిచ్చి అతని బలము నణచివేసెను. అతనిని బలహీనునిగా చేయుట పరోక్షముగా రావణుని బలము తగ్గించుటయే అగుటచే ఇది అత్యంతావశ్యక మాయెను. రావణుని కిచ్చిన శాపము షరతులపై ఆధారపడినదగుటచే అతనికి

---

*54. బాలకాండ స. 15 శ్లో. 30*

తన ప్రవర్తన మార్చుకొనుట కవకాశ మీయబడినది. రావణకుంభకర్ణులకు కఠినమైన శిక్ష యీయదగినదే. కాని వారి కిచ్చిన శాపములు చాల సౌమ్యములు.

శాప మిచ్చునెడల బ్రహ్మ చాల జాగ్రత్త వహించుచుండును. కాని వరమిచ్చునపుడు అత డంత సావధానముగా యోచించినట్లు లేదు. ఫలమును గూర్చి ఆలోచింపకుండ అడిగినదే తడవుగా వరమిచ్చుచుండును. బ్రహ్మయే కాదు. మిగిలిన దేవతలు కూడ వరము లిచ్చునపుడు ఉదారులుగనే కాదు, నిశ్చింతులుగా నున్నట్లు గోచరింపుదురు. బ్రహ్మ కుంభకర్ణునికి వరమీయ నున్నప్పుడు దేవత లతనిని నివారించిరి. రావణుని కిచ్చినట్లే వర మిచ్చినచో సర్వనాశన మగునని చెప్పిరి. రావణుని కిచ్చిన 84 వరములలో 60 దేవత లిచ్చినవి. వాటిలో బ్రహ్మ యిచ్చినవి 20 మాత్రమే. బ్రహ్మగారి వరములవల్ల అత్యధికముగా లాభపడినది రాక్షసులు. వారు గాక దేవతలు, మానవులు, పశుపక్షులు కూడ బ్రహ్మవరములచే లాభపడిరి.

బ్రహ్మ మేఘనాదుని కిచ్చిన వరముల[55] గురించి వేరొకచోట ప్రస్తావించబడినది. అయినను వాటినిగూర్చి విచారించుట అవసరము. మేఘనాదునికి లభించిన వరములు విలక్షణమైనవి. 'వధ' వరము కాదు. అది యాచిత మసలే కాదు. షరతులతో కూడినను వరము యాచితమే యగును. వధను వరముగా బహుశా ఎవరూ కోరరు. ఎవరూ ఇవ్వరు కూడ. ఈ విషయములు వరయాచన సందర్భమున గమనింపదగినవి. మేఘనాదుడు ఇంద్రుని జయించి అతనిని లంకకు బందీగా కొనిపోయెను. దేవతల ప్రభువు ఇంద్రుడు రాక్షసులకు బందీ అయ్యెను. ఇది దేవతలకు, బ్రహ్మకు కూడ ప్రతిష్ఠాభంగకర మాయెను. ఏదో ఉపాయమున ఇంద్రుని విడిపించవలసి వచ్చెను. నేటి భాషలో చెప్పినచో లంచమో, మారుదలయో యిచ్చియైన విడిపించు నవసరము కలిగెను. బ్రహ్మ యీ భారము వహించి మేఘనాదునితో నిట్లనెను-

*తన్ముచ్యతాం మహాబాహో మహేంద్రః పాకశాసనః,*
*కిం చాస్య మోక్షణార్థాయ ప్రయచ్ఛంతు దివౌకసః.*[56]

మహేంద్రుని విడిపిపుచ్చుటకు దేవతలు నీకేమి యీయవలెను? ఇది

---

*55. ఉత్తరకాండ స. 14 మరియు యుద్ధకాండ స. 85*
*56. మూ. వర క్ర.సం. 65*

సూటిగా ఇచ్చివుచ్చుకొను ప్రశ్నము. అతడు ఇంద్రుని విడచుటకు మారుగా తన కమరత్వ మివ్వవలె ననెను. మర్త్యలోకమున నెవరికిని అమరత్వము లభింపదు. దాని హద్దులు ముందే నిర్ధారింపబడినవి. అప్పు డింద్రజిత్తు తన కే పరిస్థితిలో మృత్యువు కల్గునో, ఎట్లున్నస్థితిలో కలుగదో తెలుపుమనెను. అప్పుడు బ్రహ్మ అతని కీ వరమిచ్చెను

*నికుంభిలామసంప్రాప్త మకృతాగ్నిం చ యో రిపుః,*
*త్వామాతతాయినం హన్యాదింద్రశత్రో స తే వధః.*
*వరో దత్తో మహాబాహో సర్వలోకేశ్వరేణ వై. (యుద్ధకాండ స.85)*

'ఇంద్రజిత్తా! నీవు నికుంభిల కేగి హోమ మొనర్చుటకు పూర్వమే ని న్నెదిరించి యుద్ధము చేయు వీరుని చేతిలో నీవు మరణింతువు.' అని చెప్పెను. అనగా ఈ ఒక్క ఘటనను విడిచి, మరే పరిస్థితిలోను మేఘనాదునికి చావులేదని వర మిచ్చినట్లయినది. ఇట్లా వరము షరతు గలది. కనుక విభీషణుడు మేఘనాదు డా షరతును పాలించుటకు పూర్వమే వానిని కడతేర్చవలెనని రామునితో చెప్పెను.

వర మిచ్చునపుడు నిశ్చింతుడై యున్నను, బ్రహ్మ తన మాట పొల్లు పోరా దను విషయమున శ్రద్ధ వహించును. ఎప్పుడైనను తా నిచ్చిన వరమునకు భంగ మేర్పడునట్లు కనిపించినచో అతడు వెంటనే మధ్యస్థుడై వచ్చి, అవసరమైనచో తన విశేషాధికారము కూడ ప్రయోగించి వరమును కాపాడును. నివాతకవచ రావణులకు మధ్యవర్తిగా వచ్చి అతడు వారికి సంధి చేసెను. యమరావణుల యుద్ధములో కూడ ఇదే విధముగా వచ్చి యముని వెనుకకు మరలించెను.[57]

దశరథునకు శ్రవణఋషి యిచ్చిన శాపము, రావణునికి బ్రహ్మయు నలకూబరుడును ఇచ్చిన శాపములు వారికి భయాస్పదములుగనే యుండెను. శ్రీరాముని మహత్త్వమును స్పష్టపరచుటకు అహల్యా-కబంధ-విరాధుల శాపములకు నిష్కృతి కల్గింపబడెను. లంక కిచ్చిన శాపము రావణవధ సామీప్యమును సూచించున దాయెను.

## సీత పాతివ్రత్యము

సీత పతివ్రతశీల. ఆమె పవిత్రత రామాయణమునకు గౌరవకారణము.

---

57. చూ వర్ర.క.సం. 62 మరియు ఉత్తరకాండ స. 22

రామకథ ననుసరించి దీని కసాధారణమహత్త్వమున్నది. పాతివ్రత్యము స్వతః ఒక మహాతపస్సు. ఫలితముగా పతివ్రతల వాక్కులు బలసంపన్నములు. పతివ్రత వరశాపములు రెండునూ ఇవ్వగలదు. సీత పాతివ్రత్యమును గూర్చి చర్చించుటకు ముందు స్త్రీపవిత్రత, శీలము వంటి విషయములలో ప్రాచీనకాలము నుండి సమాజములో గల విశ్వాసములు, కట్టుబాట్లు తెలిసికొనుట ఆవశ్యకము. మనువిచ్చిన పరిభాష ననుసరించి మనోవాక్కాయకర్మములా అవ్యభిచారనిష్ఠతో పతి ననుసరించుచుండు వర్తనము గల పత్ని పతివ్రత యనబడును.

*పృథివ్యాం యాని తీర్థాని సతీపాదేషు తాన్యపి,*
*తేజశ్చ సర్వదేవానాం మునీనాం చ సతీషు వై.* [58]

పతివ్రతలను గౌరవించుచు బ్రహ్మవైవర్తపురాణములో 'పృథ్విలో గల తీర్థములన్నియు పతివ్రతల పాదములం దున్నవి. అట్లే సర్వదేవతాతేజమును, మునిప్రభావమును పతివ్రతలలో నెలకొని యుండును.' అని చెప్పబడెను. అనసూయ పాతివ్రత్యమును పరీక్షింప నెంచి వచ్చిన బ్రహ్మవిష్ణుమహేశ్వరు లామెను వివస్త్రయై తమకు భిక్ష యిమ్మని కోరిరి. ఆమె వారిని శిశువులుగా మార్చి వా రడిగినట్లు చేసెను. చూడవలె నని వచ్చిన ఉత్తంకునికి పౌష్యుని రాణి అదృశ్యమాయెను. భర్తను గురించి ఏ విధమైన అనుచితపు టూహయు మనసులో రాకూడదని పతి ధృతరాష్ట్రుడు గ్రుడ్డివా డని తెలిసిన గాంధారి తన నేత్రములపై నెల్లకాలము బంధము ధరించినది.

పతివ్రతయైన నారి పరపురుషుని కంట బడకూడదు - ఈ భావము తరువాతి కాలములో నుండినట్లున్నది. కనుకనే యేమో ఋగ్వేదములో *'సుమంగళీయం వధూరిమాం సమేత పశ్యత'* అని చెప్పబడినది. శ్రీరామునితో కలిసి వనవాస మేగుచున్న సీతను వాల్మీకి యిట్లు వర్ణించెను-

*యా న శక్యా పురా ద్రష్టుం భూతైరాకాశగైరపి,*
*తామద్య సీతాం పశ్యంతి రాజమార్గగతా జనాః.* [59]

---

58. భారతీయ సంస్కృతి కోశ్. ఖండ్. 5 పృ. 359-60 మరియు 368-375 ఆధారంతో.

59. అయోధ్యాకాండ స. 33, శ్లో.8

ఆకాశసంచారులకు సైతము చూడరాని సీతను నేడు రాజవీథిలో జను లందరు చూచుచున్నారు. మహాభారతములో కౌరవస్త్రీలను గూర్చి యిట్లే వర్ణింపబడెను.

*యా నాపశ్యచ్చంద్రమసం న సూర్యం రామాః కదాచిదపి తస్మిన్ నరేంద్రే,*
*మహావనం గచ్ఛతి కౌరవేంద్రే శోకేనార్తా రాజమార్గం ప్రపేదుః.*[60]

మునుపు చంద్రసూర్యులకు కూడ కనరాని స్త్రీలు నేడు కౌరవశ్రేష్ఠులు వన మేగుచుండగా శోకాతురులై రాజమార్గమునందు నడచుచున్నారు. ఇట్లున్నను రామాయణభారతకాలము నాటి స్త్రీలు పరపురుషుల కంటబడకుండిరని చెప్పజాలము. పై వర్ణనలు రాణివాసపు స్త్రీలను గూర్చియే. అయినను ప్రాచీనసాహిత్యములో పతివ్రతలను 'అసూర్యంపశ్య' లని చెప్పుట కనిపించును.

యాజ్ఞవల్క్యస్మృతితో పతియాజ్ఞ లేనిదే ఇల్లు విడిచి బయటకు పోవుట, వేగముగా నడచుట, వ్యాపారులు, సంన్యాసులు, వృద్ధులు, వైద్యులు ననువారు తప్ప తక్కిన పురుషులతో మాటాడుట, ముసుగుదీసి బయట కేగుట, తొడలు, పిక్కలు, వక్షోజములు కప్పకుండనుంచుట, బిగ్గరగా నవ్వుట, ధూర్తులు ఉంపుడుకత్తెలు, దుశ్శీలురు నైన స్త్రీలతో పొత్తుచేయుట వంటి విషయములు గృహస్థులైన స్త్రీలకు త్యాజ్యము లని చెప్పబడినవి. ఆనాటి పతివ్రతాధర్మములలో పరపురుషునిగూర్చి ఆలోచించుట, అతనిని దర్శించుట, స్పృశించుట వంటివి నిషిద్ధము. హనుమంతుడు లంకలో సీతను చూచి మాటాడినపుడు ఆమెను తాను స్వశక్తితో సముద్రము దాటించి రాముని కడకు చేర్చెదనని పలికెను. కాని సీత అందు కంగీకరింపలేదు. దానిని కారణము లిట్లు పేర్కొనెను-

*భర్తుర్భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర,*
*నాహం స్ప్రష్టుం స్వతో గాత్ర మిచ్ఛేయం వానరోత్తమ,*
*యదహం గాత్రసంస్పర్శం రావణస్య గతా బలాత్,*
*అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ.*[61]

నా పతిపై భక్తికారణమున నేను శ్రీరాముని తప్ప వేరొకనిని స్వయముగా స్పృశింప దలంచను. రావణుడు నన్ను బలాత్కారముగా ముట్టుకొనెను.

---

60. మహాభారతము-ఆశ్రమవాసపర్వ. అధ్యా. 15
61. సుందరకాండ స. 37-62, శ్లో. 62

అది నా యిచ్ఛకు విరుద్ధమే. కాని అనాథను, స్వయముగా అసమర్థురాలను, పరాధీనను నైన నే నేమి చేయగలను. కోరకున్ననూ సీతను రావణుడే కాక విరాధుడు, కాకరూపియై జయంతుడు ముట్టుకొనిరి. ఈ విషయము రామాయణములో స్పష్టముగా నున్నది. కాని ఆ యా విషయములు చూచినచో పతివ్రతలకు పరపురుషస్పర్శ నిషిద్ధమని తెలియును.

## స్త్రీల వరశాపములు

సీత పాతివ్రత్యమును గూర్చి విచారించునపుడు రామాయణములోని స్త్రీ లిచ్చిన వరశాపములను గూర్చి చర్చించుట అవసరము. రామాయణములో స్త్రీ లిచ్చిన శాపములు 7, వరములు 5. పంచపతివ్రతలలోను లెక్కింపబడిన అహల్య, మండోదరి, సీత వీ రెవరికిని శాపముగాని, వరముగాని యివ్వలేదు. దీనివలన మహిళలకు పాతివ్రత్యబలమున వరశాపము లిచ్చు శక్తి కలుగుచున్నదా? అను సంశయ మేర్పడుచున్నది. కుశనాభకన్యలును, వేదవతియు, (వేదవతి ప్రతిజ్ఞ రావణవధనుగూర్చి శాపతుల్యమే) అవివాహితలు కనుక వారి కిట్టి శక్తి పాతివ్రత్యమున సిద్ధింప నవకాశము లేదు. పైగా వారు ప్రత్యక్షముగా శపింపలేదు. కాని వారి కట్టి శక్తి కలదని పేర్కొనబడెను. రాముని యౌవరాజ్యపట్టాభిషేకవార్త ముందుగా తెలిపినందుకు మంథరకు కైక వరమీయ దలచెను. కాని ఆమె దానిని స్వీకరింపలేదు. కైకేయి వర్తన మరసినచో ఆమె నట్టి పతివ్రతగా ఎంచుట కష్టము. ఉమాదేవి దేవతలకు, భూదేవికి, కుబేరునికి శాపము లిచ్చెను. రక్కసికి, ఇలునికి (అర్థ) వరము లిచ్చెను. ఆమె దేవయోనికి చెందినది. ఇట్లెంచి చూచినచో ఆమె కేవలపాతివ్రత్యబలముననే వరశాపము లివ్వగల్గిన దనలేము. వాల్మీకియు అట్లు చెప్పలేదు. హేమ తన సఖి స్వయంప్రభకు వర మిచ్చినట్లు చెప్పబడినది.[62] కాని ఆమె తపస్సు చేసినట్లుగాని చేయనట్లుగాని చెప్పలేదు. బహుశః అప్సరసయై ఉచ్చయోనికి చెందినది గనుక ఆమె కా శక్తి లభించెనేమో.

అనసూయ మహాపతివ్రత. సీతను కలిసినపు డామె పాతివ్రత్యమును గూర్చి ఇట్లు చెప్పెను - 'అనుకూలుడైనను, ప్రతికూలుడైనను, స్త్రీలకు భర్తయే ప్రియుడు. అట్లెంచు స్త్రీలకు మహాఫలప్రదులైన భర్తలు లభింతురు. భర్త శీలవర్జితుడైనను, స్వేచ్ఛాచారియైనను, నిర్ధనుడైనను, ఉత్తమస్వభావముకల

---

*62. కిష్కింధాకాండ*

స్త్రీకి అతడే ముఖ్యదేవత. నాకు భర్తకు మించిన ఇష్టబంధువు వేరొకడు కన్పించడు. తరుగులేని తపోనుష్ఠానము ఇహపరములలో ఇష్టప్రాప్తికి సాధనమగునట్లే భర్త సేవ కూడ యోగ్యమైనది..... లోకములోని మంచి చెడ్డ లెరిగిన గుణవంతులైన స్త్రీలు పుణ్యాత్ములవలె స్వర్గమున విహరింతురు.' ఇట్లు చెప్పి, తిరిగి ఆమె సీతతో నిట్లనెను-

*నియమైర్వివిధైరాప్తం తపో హి మహదస్తి మే,*
*తత్సంశ్రిత్య బలం సీతే ఛందయే త్వాం శుచివ్రతే.*[63]

నే నెన్నో నియమములు పూని పెద్ద తపస్సు చేసితిని. ఆ తపోబలమున నీకు వరమిచ్చెదను; వేడుకొనుము. అనసూయ ఇయ్యనెంచిన వరము తపోబలముననే కాని పాతివ్రత్యబలమున కాదు. లేనిచో తపమునుగూర్చి ప్రత్యేకించి చెప్ప నవసరము లేదు. సీత వర మందుకొనలేదు. అది వేరు విషయము. ఈ ఉదాహరణము లన్నియు చూచినచో కేవలము పాతివ్రత్యబలమున వరశాపము లిచ్చు శక్తి ఎవరికినీ సిద్ధించినట్లు లేదు. వరశాపము లిచ్చిన మహిళలు దేవయోనులు లేదా పాతివ్రత్యముతో బాటు తపోబలమున్నవారు మాత్రమే.

## అన్యపతివ్రతలు

పంచ పతివ్రతలలోను ముగ్గురు - అహల్య, మండోదరి, సీత - రామాయణములో వచ్చు పతివ్రతలు. వీరిలో పతివ్రతగా అహల్య నెంచుటకు సాధ్యము కాదు. వాల్మీకిరామాయణములో అహల్యకథ రెండుసార్లు వచ్చును. ఆ రెండింటిలోను వివరణలో కొంత భేదమున్నది. ఉత్తరకాండ ప్రక్షిప్త మనుకొన్నను బాలకాండ నిశ్చయముగా వాల్మీకి వ్రాసినదే కనుక ఆ కాండములోని కథను ఆధికారిక మని గ్రహింపదగును. ఆ కథలో ఇంద్రుడు అహల్యను బలాత్కరించలేదు. మారు రూపు ధరించి వచ్చిన ఇంద్రుడు గౌతముడు కాడను విషయము అహల్యకు తెలియును. అంతేగాక ఆమె యింద్రుని కామించినది కూడ. ఆ విషయ మామె స్వేచ్ఛగా నతనిని కలియుట కుద్యమించుటలోనే స్పష్టమగుచున్నది. *'కృతార్థాస్మి సురశ్రేష్ఠ'* - సురశ్రేష్ఠా! నేను కృతార్థురాల నైతిని. ఇంద్రుడును *'సుశ్రోణీ! పరితుష్టోఽస్మి'* - సుందరీ! నేను సంతుష్టి నందితిని.' అని పలికెను. సమాగమమున కామె అంగీకరించినది.

---

63. *అయోధ్యాకాండ స. 118*

కనుక ఆమె యాచరణము వ్యభిచారాత్మక మనుట నిస్సంశయము. ఆమె చేసినది ఘోరమైనదియు, క్షమింపరానిదియు నైన అపరాధము. కాని గౌతము డామెను శపించి వెంటనే శాపమోక్షణ మెరింగించెను. ఇది ఆశ్చర్యకరము.[64] అహల్యను గురించి ఎక్కువగా పరిశీలించుట అనవసరము.

మండోదరి మిక్కిలి దుర్భాగ్యురాలైన పతివ్రత. రామాయణములో నామెకు గౌణస్థాన మియ్యబడినది. ఆమె చరిత్ర మస్పష్టముగా అర్ధార్ధముగా చిత్రింపబడినది. రావణవధానంతర మామె విలాపములో ఆమె విశిష్టతలు వ్యక్తమగుచున్నవి. రావణుని భార్యగా తన పాతివ్రత్యబలమున నతని పతనము నాపగల శక్తి బహుశా ఆమెకు కలదు. ఆమె అట్టి ప్రయత్న మొనరించెను కూడ. కాని సఫలీకృతురాలు కాలేకపోయెను. సావిత్రి తన పాతివ్రత్యమాహాత్మ్యమున పతిని బ్రతికించుకొనెను. కాని మండోదరి అటుల చేయలేకపోయినది. సావిత్రి యము నడ్డగించి పతిప్రాణములు విడిపించుకొనెను. ఇందులో బుద్ధికౌశల మున్నదనుకొనవచ్చు కూడ.

శ్రీరాముడు ఆదర్శపుత్రుడు, పతి, భ్రాత, శాసకుడు, పిత్రాజ్ఞాకారి, సత్యసంధుడు, మాట తిరుగులేనివాడు, ఏకపత్నీవ్రతుడు, విశుద్ధచరిత్రుడు. అతనిలో నిట్టి విశిష్టత లెన్నో యున్నవి. అట్లే సీతలో సత్యవాదిత, సంకటసమయమున సాహసము చూపగల ధైర్యము, అలోభము, త్యాగశీలత, ధర్మైకనిష్ఠ వంటి విశేషగుణము లున్నవి. ఆమె నిష్కళంకచరిత్రము, రామునియం దవ్యభిచారినిష్ఠగల ప్రీతి రామాయణకథకు వెన్నెముక వంటివి. వాల్మీకి తన చిరకాలతపస్సు వణముగా సీతచారిత్రశుద్ధిని ఋజువుచేయనెంచెను. రావణు డామె నపహరించిన క్షణమునుండి అతని వధవరకు గల కాలమున నామె భ్రష్టురాలు కావచ్చును. పరిస్థితు లట్టివి. అవి రావణున కనుకూలములు. ఆమెకు ప్రతికూలములు. ఆ పరిస్థితిలో సీతకు తన శీలరక్షణ మెంత కష్టమో అంతగానే ఆమె నా విధముగా నిల్పుటకూడ రామకథ కవసరము. సీత శీల మేమాత్రము చెడినట్లున్నను రామకథకు గల నైతికమూలమునకే భంగము. వాల్మీకి దీని నెరుగును. కథాగతన్యాయ *(Poetic justice)* మెంచి చూచినచో ఆమె శీలభ్రష్ట కారాదు. రాముడైనను అట్టి సీతను గ్రహింప నిష్టపడడు. అపరాధికి శారీరకశిక్ష నిచ్చి శ్రీరాము డామెను విడిపించవచ్చును. కాని కథ నిష్ప్రాణ మగును. సీత శీలముపై రామునికి విశ్వాసమున్నది. కాని

---

*64 మా. శాప క్ర.సం. 12, 13*

లోకాపవాదమునకు వెరచి అత డామెను అగ్నిపరీక్ష ఇమ్మనెను. సీత ఒంటరిగా నిరాధారయై, నిస్సీమబలపరాక్రమశాలియు, కామాంధుడు నైన రావణుని వద్ద బందీగా నుండెను. అతడేమైన చేయగలడు గదా. దీనికి మార్గాంతర మెంచి వాల్మీకి సీతాశీలరక్షణము గావించెను.

రావణుని కిచ్చిన శాపములు

సీతను బలాత్కరించుటకు రావణు డామెను లంకవరకు తీసికొని పో నక్కరలేదు. నడివీధి నడిచిపోవుచున్న స్త్రీలను సైతము బలాత్కరించగల లజ్జాహీను డతడు. మహాపార్శ్వునితో అత డీ సత్య మంగీకరించి చెప్పెను.

*పితామహస్య భవనం గచ్ఛంతీం పుంజికస్థలామ్,*
*సా ప్రసహ్య మయా భుక్తా కృతా వివసనా తతః.*

'ఆకసమున నగ్నిజ్వాల వలె తోచు పుంజికస్థల అను అప్సరస, నా భయముచే ఒదిగి ఒదిగి బ్రహ్మలోక మేగుచుండగా నే నామెను బలవంతముగా ననుభవించి, వివస్త్రగా విడిచితిని.[65] అతడు రంభను కూడ ఇట్లే దారి కాచి బలాత్కరించెను.

*ఏవ ముక్త్వా స తాం రక్షో నివేశ్య చ శిలాతలే,*
*కామభోగాభిసంరక్తో మైథునాయోపచక్రమే.*

అప్పుడు రావణు డామె నొక శిలాతలమున చేర్చి కామోత్సుకుడై అనుభవించెను.[66] రావణు డెప్పుడైనను ఏచోటనైనను సీతను బలాత్కరింపగలడు. అందు కతని కాటంకము లేదు. అయినను అత డామెను లంకకు తీసికొనిపోయెను. కారణ మాత డామెను పత్నిగా వరించి నిరంతరము భోగింపనెంచెను. తన వైభవము చూపి ఆమె నాకర్షింపదలచెను. అందుచేత నామె నన్యస్త్రీలను వలె బలాత్కరింపలేదు. రావణవధ కనుకూలపరిస్థితిని కల్పించుటకు సీత లంకలో నుండుట సహాయకారి యయ్యెను. సీతను లంక కెత్తుకొనిపోవుటయే రామరావణయుద్ధమునకు తగిన కారణము.

తనను పతిగా స్వీకరింపుమని చెప్పి ఒప్పించుటకు రావణుడు చేసిన

---

*65. యుద్ధకాండ 13*

*66. చూ. శాప క్ర.సం 46*

ప్రయత్న మేదియు సీతపద్ద ఫలించలేదు. పైగా ఆమె అతని నత్యంత కఠోరముగా నిందించెను. రావణు డామెను దుష్టరాక్షసీగణమునడుమ బంధించి యుంచెను. సీత నెపరును చూచుటకైన వీలులేనంతగా కట్టడిచేసెను. అయినను ఇంద్రుడు, హనుమంతుడు ఆమెను కలిసి ధైర్యము చెప్పి సహాయపడిరి. రావణుని కీ విషయమే తెలియలేదు. అట్టి స్థితిలో సీత కాత్మహత్యయో, రావణునికి లొంగుటయో తప్ప వేరు మార్గము లేదయ్యెను.

ఆత్మహత్యాప్రయత్నము

రావణుడు తనను చంపునేమో యని సీతకు భయముండెను. వాని చేతిలో చనిపోవుటకంటె ఆత్మహత్యయే మేలని ఆమె తలచెను. జీవితముపై విసిగి రెండుసారు లామె ఆత్మహత్యాప్రయత్నము చేసెను.

*శోకాభితప్తా బహుధా విచింత్య సీతాథ వేణీగ్రథనం గృహీత్వా,*
*ఉద్బుధ్య వేణ్యుద్గ్రథనేన శీఘ్రమహం గమిష్యామి యమస్య మూలమ్.*

ఇట్లు శోకాతురయై సీత తన జటాబంధమును చేత నందుకొని ఈ బంధముతో నేను శీఘ్రముగా యమలోక మేగుదు నని పలుకుచూ సంకల్పపూర్తికై తరుశాఖ నందుకొనెను.[67] తాని రామకథకును సీతకును గల అదృష్టవిశేషమున నామె కప్పుడు శుభశకునములు పొడగట్టెను. అంతలో నామెకు ధైర్యము కలిగెను. ఆ ప్రయత్నము నిల్చిపోయెను. రామకథాదృష్టితో రావణవధ జరుగువరకు సీత జీవించియుండుట, శీలము కాపాడబడుటయు నావశ్యకములు కనుక నామెకు ప్రాణభయము కలిగింపరా దనియే వాల్మీకి ఈ శకునకల్పన చేసి ఔచిత్యము నెరపెను. బందీగా నున్నప్పుడు భోజనము గ్రహింపరాదని నిశ్చయించి సీత వేరొకసారి ఆత్మహత్యాప్రయత్న మొనర్చెను. కాని బ్రహ్మ ఆమెకు ఇంద్రునిద్వారా హవిష్యాన్న మంపెను. హవిష్యాన్న మాహాత్మ్యమెట్టిదనగా, దాని నేమాత్రము గ్రహించినను అనంతకాలమువరకు జీవించియుండవచ్చును. సీత ఆ అన్నము గ్రహించుటతో ఆత్మహత్యాప్రయత్నము విఫలమాయెను.

---

*67. సుందరకాండ 28*

## పాతివ్రత్యమున కున్న శక్తి

రావణుని మాట కాదనదగిన ఉపాయ మేదియు సీతకడ లేదు. వాల్మీకి కిది జటిలసమస్య అయినది. రావణవధ జరుగువరకు సీత శీలమును కాపాడుకొనుట ఎట్లు? భారతీయ జీవనవిధానములో పతివ్రతల కసాధారణ మహత్త్వమున్నది. తమ పాతివ్రత్యకారణమున వా రసాధ్యమునైనను సాధ్యము గావింపగలరు. ఇట్టి విశ్వాసముతో సీత తన పాతివ్రత్యప్రభావముచేత మాత్రమే శీలభ్రష్ట కాకుండ లంకలో నిల్చిన దని భావించుట భ్రమ, నిరాధారమును.

పంచ మహాపతివ్రతలలో ముగ్గురికి సీత, అహల్య, ద్రౌపది - అనువారికి శీలభ్రష్టు లగుటకు వలసిన సంకటము లెదురైనవి. అహల్య ఓడిపోయినది. సీతాద్రౌపదులు విజయమందిరి. కాని ఈ విజయము వారి పాతివ్రత్యబలముననా లేక అన్యకారణముల వల్లనా, అనునది చూడదగిన విషయము. ఉత్తరకాండ కథలో అహల్యకు దేవేంద్రుడే గౌతమరూపమున వచ్చినట్లు తెలియదు. ఆమె గౌతమునితో నిట్లనెను - *అజ్ఞానాద్ధర్షితా విప్ర త్వద్రూపేణ దివౌకసా* (ఉత్తర 30-40) ఇది సత్యమని నమ్మినచో, ఇంద్రుని ముట్టిన విదపకూడ ఆమె కెట్లు తెలియలే దనిపించును. తాత్పర్య మేమనగా ఆమె పాతివ్రత్య మింద్రునికి ప్రతిబంధకము కాలేదు. ఆమె యింద్రు నేమియు దండింపలేదు. తర్వాత గౌతము డతనిని శిక్షించెను. అది అతని తపోబలము కాని ఈమె పాతివ్రత్యము కాదు. ఇది సత్య మన్నచో ఉత్తరకాండ కథ అసత్యమగును. బాలకాండ కథను సత్యమన్నచో అహల్య ఇంద్రు నెరిగి వ్యభిచరించిన దనక తప్పదు. ముందు నిర్ణయించుకొన్న ప్రకారము భీముడు నృత్యశాలలో ముందుగనే వచ్చి కూర్చొని యుండనిచో ద్రౌపదికి కీచకుని చేతిలో పడక తప్పదు. లేదా ఆమె కాత్మహత్యయో, హత్యాప్రాప్తియో అగును. భీముని బుద్ధిచాతుర్యము, బలసంపత్తి ద్రౌపదిని రక్షించినవి. కాని ఆమె పాతివ్రత్యము కాదు. అహల్యాద్రౌపదులలో పతివ్రతా తేజమున్నదని ఎంచినను, అది వారి శీలరక్షణ కుపకరింపలేదనుట తథ్యము.

బహుశా సీతకు పాతివ్రత్యమువలన స్త్రీ తనశీలమును కాపాడుకొన జాలదని తెలియునేమో. అందుకనియే ఆమె శీలభ్రష్టకాకుండ ఆత్మహత్య చేసికొన నెంచినది. ఆమె చేసిన ఆత్మహత్యాప్రయత్నములు రెండును వ్యర్థమైన వనుట వేరు విషయము. సీతయం దసాధారణ పాతివ్రత్య తేజ మున్నదని మండోదరి అభిప్రాయము. రావణవధానంతరము విలపించుచు ఆమె ఇట్లన్నది-

*అప్రాప్య తం చైవ కామం మైథిలీసంగమే కృతమ్,*
*పతివ్రతాయాస్తపసా నూనం దగ్ధోऽసి మే ప్రభో.*
*తదైవ యన్న దగ్ధస్త్వం ధర్షయంస్తనుమధ్యమామ్*
*దేవా బిభ్యతి తే సర్వే సేంద్రాః సాగ్నిపురోగమాః. (యుద్ధ. 111)*

మైథిలీ సంగమమును కామించినది వ్యర్థమైనది. ఆ పతివ్రతయొక్క తపోజ్వాలలో దగ్ధమైతివి. ప్రభూ, వాస్తవమునకు నీ వా సుందరిని ముట్టదలచిన నాడే భస్మమైయుండువు. కాని ఇంద్రాగ్నిపూర్వకముగా దేవతలందరు ఏ మహత్త్వ మెంచి నీకు భయపడుచుండిరో ఆ మహత్త్వమే అప్పటికి నిన్ను నిల్పినది. ఒక పతివ్రత వేరొక పతివ్రతను గూర్చి పల్కిన ఈ ప్రశంసావాక్యములు మెచ్చదగినవి. కాని ఇందలి సత్యమెంత? మండోదరి చెప్పినట్లు పతివ్రతలలో కొంత తేజమో, శక్తియో యుండునని నమ్మినచో, అది రావణుని పతన మేల నివారింపలేకపోయెను? ఆమె పాతివ్రత్య మిట్లు వాదాతీతమైనది. వాల్మీకి రామాయణములో ఆమె పాతివ్రత్యమును శంకింపజేయునట్టి వాక్య మొకటియూ లేదు. వాదముకొరకు రావణుడు తన మహత్త్వము వల్లనే సీతను ముట్టినను దగ్ధముకాలే దన్ననూ, రాముని ఎదుటనే సీత నెత్తికొని చంక నిడుకొన్న విరాధు డేల దగ్ధము కాలేదు? వానిలో ఏ మహత్త్వమున్నది? విరాధు డింతమాత్రమే చేసి ఊరుకోలేదు.

*కథం తాపసయోర్వా చ వాసః ప్రమదయా సహ,*
*అధర్మచారిణౌ పాపౌ కౌ యువాం మునిదూషకౌ.*
*ఇయం నారీ వరారోహా మమ భార్యా భవిష్యతి.*

'మీరు తపస్వులై వనమందు యువతీసహాయులై ఎట్లుందురు? ముని వేషమునకు విరుద్ధముగా ఆయుధములు ధరించి, ఒకే స్త్రీతో కలిసి, అధర్మచారులు, పాపులునైన మీరు మునివృత్తికే కళంక మాపాదించుచున్నారు. ఎవరు మీరు? ఈ సుందరి నాకిపుడు భార్య కాగలదు' అని పలికెను (అరణ్య 2-11,13) ఈ అసత్యాలాపములు పతివ్రతయైన సీత చెవులలో పడినప్పటికిని, ఆమె తేజము బయటపడలే దేమి? ఇంకొక ఆశ్చర్యము, కాకిరూపమున వచ్చిన ఇంద్రపుత్రుడు సీత వక్షోజములపై పొడవ నెంచెను. అప్పుడును ఆమె పతివ్రతాతేజము ప్రకటము కాలేదు.

ఇంద్రపుత్రుని శృంగారచేష్టలను స్వయముగా సీతయే హనుమంతునితో వివరించినది. ఇవి నమ్మరాని మాటలు కావుగదా?[69] విరాధుని వంటి రాక్షసుని దండింపజాలకపోయె నన్ననూ, ఏదో వచ్చిన మామూలు కాకిని ఆమె తొలగింపలేక పోయినది, కనుక మండోదరి చెప్పిన పాతివ్రత్యతేజమును గూర్చి ఎక్కువగా ఆలోచించుట అనవసరము.

సీత తన పాతివ్రత్యమును గురించి స్వయముగా చెప్పిన మాటలలో గల సత్యాసత్యములు కూడ పరీక్షింపదగినవి.

*అసందేశాత్తు రామస్య తపసశ్చానుపాలనాత్,*
*న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హతేజసా.*

శ్రీరాముని ఆజ్ఞ లేనందుచేతను, తపఃపాలనమందలి కర్తవ్యతచేతను, రావణా, నిన్ను భస్మము చేయగల పతివ్రతాశక్తి కలిగియు అట్లు చేయకున్నాను.[70] (సుందర. 22) స్వ. కాశీనాథశాస్త్రి లేలేగారి మరాఠీ అనువాదములో, 'పతివ్రత' శబ్ద మనుచితముగా పడినది. మూలములో ఆ శబ్దములేదు. పైగా, తపస్సు గూర్చి స్పష్టముగా చెప్పబడినది. గీతాప్రెస్, గోరఖ్‌పూర్ వారి ప్రతిలోను, శ్రీనివాస అయ్యంగారి కన్నడ అనువాదములోను కూడ 'పతివ్రత' శబ్దము కానరాదు. రావణుని భస్మము చేయగల ననుమాట ఓజోభరితమే కాని అట్టి కార్య మేదియు జరుగలేదు. కాక, సీత కట్టి తేజ మున్నదనుకొన్ననూ ఆమె చెప్పినట్లే అది తపోలబ్ధ మని యెంచవలెను.

రావణుని బలాత్కారము

స్త్రీలను బలాత్కరించుటలో రావణుడు చతురుడు, అలవాటు పడినవాడు. లంకలోని స్త్రీలను, అన్యప్రదేశములలో స్త్రీలను కూడ అతడు విచ్చలవిడిగా ననుభవించెను. ఈ కార్య మతనికి అనుచిత మనిపించలేదు. సీతను ఒప్పింప దలచి చెప్పుచూ అత డిట్లనెను.

*స్వధర్మో రక్షసాం భీరు సర్వదైవ న సంశయః,*
*గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా.*

---

*69. సుందరకాండ 38*

*70. సుందరకాండ 22*

బలవంతముగా పరస్త్రీల నెత్తుకొని పోయి అనుభవించుట రాక్షసుల కెప్పుడునూ ధర్మమే[71]. ఈ రకమైన ధర్మ మనుమతించు రావణుని కామాంధత, అతని క్రౌర్యమునకు తోడై స్త్రీల కెంతగనో బాధాకరమైనది. ఆడువారిని అపహరించునప్పుడు అతడు వారి పతులను గూర్చి గాని, బంధువులను గూర్చి గాని చింతించి యెరుగడు. వారిని విధవలుగా చేసి బంధువులను హతమార్చి, నిరాధారలుగా నొనర్చును. అతనిచే భ్రష్టలైన స్త్రీ లెందరో పతివ్రతలు. వారినిగూర్చి మండోదరి మాటలే సాక్ష్యము-

*యాస్త్వయా విధవా రాజన్ కృతా నైకాః కులస్త్రియః,*
*పతివ్రతా ధర్మరతా గురుశుశ్రూషణే రతాః,*
*తాభిః శోకాభితప్తాభిః శప్తః పరవశం గతః.*

'పతివ్రతలును గురుశుశ్రూషాపరులు నైన స్త్రీల నెందరినో నీవు విధవల నొనర్చితివి. మహారాజా! శోకసంతప్తలైన ఆ స్త్రీల శాపమే నిన్నిట్లు హతమార్చినది.'[72] ఆ సాధ్వీమణులు శపించినపుడెల్ల దేవదుందుభులు మ్రోగి పుష్పవృష్టి గురిసెడిదట[73]. ఆ స్త్రీల శ్రేష్ఠతను గూర్చి వేరే చెప్పనక్కరలేదు.. కాని వారు తమ శీలమును కాపాడుకొనలేక పోయి రనక తప్పదు. తేలిన దేమనగా పాతివ్రత్య సదాచారాదులవలన కొంత తేజముగాని బలముగాని ప్రాప్తించినను, అది చాల పరిమితమనియే. మీది ఉదాహరణములవలన, అట్టి బలము వారి శీలరక్షకు చాలలే దనుటయు స్పష్టము. కాగా, పాతివ్రత్య మెంత గొప్పదైనను, శీలరక్షణ కది పనికి రాదనుట నిశ్చయము.

### వరశాపముల కల్పనలోని చాతుర్యము

సీత పూర్తిగా ఆధారరహితయై అసహనీయస్థితిలో నుండుట గమనించియే వాల్మీకి నేర్పుగా రావణునికి శాపములు కల్పించి సీతాశీలరక్షణమున కుపాయ మల్లెను. సీతను శీలభ్రష్ట కాకుండ కాపాడుటకు, శాపమే సరళము, సమర్థమునైన ఉపాయము. ఇది యెరిగిన వాల్మీకి రావణునకు పూర్వమే శాపములు కల్పించెను. వాల్మీకిరామాయణములో రావణునికి అన్నియుచేరి

---

*71. సుందరకాండ 20*

*72. సుందరకాండ 111*

*73. ఉత్తరకాండ 24*

ఏడు శాపములు కలిగినవి. వాటిలో నాలుగు పరస్త్రీల నభిలాషించి బలాత్కరించుట వలన నేర్పడినవి. పైన చూపిన పతివ్రతల శాపములకు తోడు బ్రహ్మయు, నలకూబరుడును ఇచ్చిన రెండు శాపములు చాల బలీయములు. వేదవతి ప్రతిజ్ఞ రావణుని మార్చలేకపోయినను నీరసపరచినది. కాగా సీత అతనికి దగ్గరగా నున్నను దూరముగా నున్నట్లే అప్రాప్యగనే నిల్చినది. తపఃక్షయమునకు వెరచి శాపమివ్వకున్నను వేదవతి చేసిన ప్రతిజ్ఞ అగ్నిప్రవేశసమయమున, మృత్యుముఖమున జరిగినది. కనుక దాని బలము విశిష్టమైనది. పుంజికస్థలను బలాత్కరించినందున బ్రహ్మయు, రంభను బలాత్కరించినందున నలకూబరుడును రావణు నొకే విధముగా శపించిరి.[74] వివరణములో మాత్రమే కించిద్భేద మగుపించును. రెండు శాపములును షరతులతో కూడినవే. రావణు డీ శాపము లన్నిటిలో బ్రహ్మగా రిచ్చిన శాపమున కెక్కువ భయపడెను. మహాపార్శ్వుడు రావణునకు కుక్కుటన్యాయమున సీత ననుభవింపుమని సలహా యిచ్చెను. 'రాగల పరిణామములకు వెరువపగవలదు. వాటి నెదిరింపగల శక్తిసామర్థ్యములు నీకున్నవి' అని కూడ చెప్పెను. అప్పుడు రావణు డతనితో పుంజికస్థల విషయమున బ్రహ్మ తన కిచ్చిన శాపమును గూర్చి చెప్పెను.[75]

*ఇత్యహం తస్య శాపస్య భీతః ప్రసభమేవ తామ్,*
*నారోహయే బలాత్ సీతాం వైదేహీం శయనే శుభే.*

'ఇట్లు బ్రహ్మగారి శాపముచే నేను సీతను బలాత్కరింపలేకున్నాను.' అని స్వయముగానే చెప్పినందున లంకలో నున్నప్పటికిని సీత శీలభ్రష్ట కాలేదనియును దాని కామె పాతివ్రత్యబలము కాక, రావణుని కబ్బిన శాపములే కారణము లనియు స్పష్టము.

**ఉపసంహారము**

ఐహిక సుఖాభివృద్ధికి, దుఃఖనివృత్తికి స్వాభావికముగనే నిరంతరప్రవృత్తి గోచరించుచుండును. అభిలాషసిద్ధికై మానవుడు తన శక్తియుక్తు లన్నిటిని పణముగా నుంచును. ఉద్దేశ్యపూర్తి కలుగక, అపేక్షించినది లభింపక ప్రయత్నము వ్యర్థమైనప్పుడు అతడు మానవేతరశక్తులైన, అతిమానవీయ లేదా మహామానవీయ శక్తుల నాశ్రయించును. నేటి విజ్ఞాన మెన్నో అసాధ్యములను సాధ్యములుగా

---

*74. చూ. శాప.క్ర. 35,43,46*
*75. యుద్ధకాండ 13*

జేసిచూపెను. వాటిని సులభసాధ్యములుగా జేసెను. మానవుని లౌకికజీవనము సుఖసమృద్ధ మయ్యెను. కాని ఇంకను మానవేతరశక్తులపై నున్న విశ్వాసము తగ్గలేదు. శిక్షాసంస్కృతిపూర్ణులైన ఏ కొద్దిమంది బుద్ధివాదులనో విడిచి పెట్టినచో సమాజములోని బహుసంఖ్యాకులు మానవేతరశక్తులను విశ్వసింతురు. ఐహికేచ్ఛాపూర్తికి సత్యనారాయణ వ్రతము చేయుదురు. మ్రొక్కులు మ్రొక్కెదరు. వ్రతోపవాసములు పాటింతురు. దేవతామూర్తులపై పుష్పాదులు చల్లి భగవదాను కూల్య ప్రాతికూల్యములు తెలిసికొనుచుందురు. మతాలయములలో చేరిన భక్తి సమూహము ప్రముఖముగా ఐహికకారణములవల్లనే అట్లు చేరుచుండును, కాని ఆత్మోన్నతి నాశించి ఆ మార్గమెంచినవారి సంఖ్య స్వల్పము.

వ్యాసవాల్మీకులవంటి మహర్షుల గ్రంథములలో వరశాపముల ప్రసక్తి ఎక్కువగా నుండుటకు కారణము, అవి మానవప్రవృత్తికి సంబంధించి యుండుటయే. ఋషులు మంచి నేర్పుతో ఈ వరశాపములను కథ కవినాభావములుగా కూర్చిరి. ఉద్దేశ్యపూర్వకముగా జోడించినట్లు గాక, కృత్రిమ మగునట్లు గాక, ఈ వరశాపములు కథలో చేరి వాటిని విడిచినచో కథయే తే దనిపించును. శ్రీ.మ.ర. శిర్వాడ్కర్‌గారు మహాభారతమును గూర్చి వ్రాయుచు - 'వరశాపములు, రచయిత కల్పనాప్రసూతములు. అవి ఒక విధమగు అలంకారములు. కర్మవాదసిద్ధాంతము ననుసరించి ఇవి ప్రభవించినవి' అని చెప్పిరి.[76]

ఈ మాటలు సాకల్యముగా చూడదగినవి. కల్పనాసృష్టి, అలంకారరచనలవలన కావ్యసౌందర్యము తప్పక వృద్ధియగును. అవి లేనినాడు సౌందర్యము కొరవడును. కాని అవి కథకు అభిన్నమైన అంగములు కాజాలవు. అవి బయటివే, కావలసినచో వాడవచ్చును. లేనిచో విడువవచ్చును కావున, అవి కృత్రిమములే కాని కథకు గల సహజావయవములు కావు. వరశాపము లీరీతివేనా? దశరథుడు కైక కిచ్చిన వరములను రామాయణము నుండి తొలగింపగలమా? వాటిని తొలగించినచో ఇక మిగిలెడి దేమి? బ్రహ్మ యిచ్చిన శాపమునకు రావణుడు భయపడెనని మనము గ్రహించితిమి. ఆ శాపమును, నలకూబరశాప, వేదవతీ ప్రతిజ్ఞలును లేనిచో సీత శీల మెంతవరకు రక్షింపబడెడిది?

---

76. హస్తినాపుర

రామకథలో వరశాపములు లేనిచో రామాయణమున కిప్పటిరూపమే ఉండియుండదు. వరశాపములు కర్మవాదసిద్ధాంతమాత్రముననే ప్రభవించినవి కావు. అవి సమాజప్రవృత్తి ననుసరించి, మానవస్వభావమున కనుగుణముగనే వెలసినవి. మానవేతరశక్తులపై విశ్వాసము లేనినాడు వరశాపముల కల్పన అవిశ్వసనీయ మగును. కర్మవాదసిద్ధాంతమైనను సంపూర్ణముగా తిరస్కరింప బడజాలదు కాని అది మానవుని విశిష్టప్రవృత్తి ననుసరించి పోషింపబడుచుండును.

వరశాపములను యథోచితముగా సుయోగ్యముగా సహజముగా ప్రయోగించి వాల్మీకి రామకథ కొక ఔన్నత్యము కలిగించెను. నారదు డీ కథను వాల్మీకి కంటె ముందుగనే ఎరుగును. అతడే వాల్మీకి కీ కథ వినిపించెను. నారదుని కథకు ప్రచారము విరళము. నారదుడు చెప్పిన కథలో మూడుచోట్ల వరప్రస్తావన లున్నవి.[77] కాగా, వరశాపముల కల్పన రామాయణమునకు పూర్వమే కలదని తెలుచున్నది. వాల్మీకి స్వీయప్రతిభాబలమున వీటిని యథోచితముగా ప్రయోగించి రామకథ కపూర్వమైన సౌందర్య మాపాదించెను. వేలాది ఏండ్లుగా వాల్మీకి రామాయణము భక్తులను, కావ్యమర్మజ్ఞులను సామాన్యజనులను ఆకర్షించుచున్నది. ప్రజాహృదయమున అది ఎంతలోతుననో నాటుకొన్నది. నారదుడు చెప్పిన దానికి వాల్మీకి తన ప్రజ్ఞాబలమున నూతనచైతన్య మిచ్చి దానిని శాశ్వత మొనర్చెను.

రామాయణమునకు గల వివిధసౌందర్యాధాయకములలో వరశాపములు కూడ ఎన్నదగినవే. ఆ విషయము స్పష్టపరచుటకే ఈ 'శాపాదపి...వరాదపి' ఉద్దేశింపబడినది.

-శ్రీ.ర.భిడే

---

*77. బాలకాండ స.1 శ్లో. 22,76,86*

# శాపములు

## 1. వాల్మీకి > నిషాదుడు  బాలకాండ 2

ఒకసారి వాల్మీకి తన శిష్యుడు భరద్వాజునితో కలిసి స్నాన సంధ్యానుష్ఠానములకై తమసానది కేగి అచ్చట అనువైన రేవు వెదకుచుండెను. అప్పు డతని కచ్చట ఆరోగ్యవంతములై కామాసక్తిలో నున్న క్రౌంచపక్షులతో జంట కనిపించెను. అదే సమయమున ఒక నిషాదు డా జంటలోని మగ పిట్టను తన బాణమున కెర జేసెను. దారుణమైన ఆ బాణఘాతమున కా పిట్ట తత్క్షణమే నేల గూలెను. దాని శరీరము రక్తసిక్తమయ్యెను. ప్రాణాంతకవ్యథతో అది గిలగిల కొట్టుకొనుచుండెను. దాని నట్టి స్థితిలో చూచి రెండవ పిట్ట కారుకారుమని విలపింపదొడగెను. శిరమున నెర్రని పింఛముతో, తన నెప్పుడును విడపక తోడుగా నుండునదై, ప్రస్తుతము సంభోగావస్థలో నున్న తన ప్రియుని పాటు చూచి దీనాతిదీనయై అత్యంతవికలస్వనముతో ఆడుపిట్ట విలపింపదొడగెను. దానికి ప్రియవియోగ మతిదుర్భరమాయెను. ఆ దృశ్యమును కన్నార చూసిన వాల్మీకి హృదయము కరుణాభరితమయ్యెను. ఉచ్చైఃస్వనమున నరచి విలపించుచున్న పిట్ట నాతడు చూచెను. కామమోహితమైన పక్షిని వధించుట అధర్మమని యెరిగినందున అతని ముఖమున అప్రయత్నముగా ఈ మాటలు వెలువడెను.

*మా నిషాద, ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః,*
*యత్క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితమ్.* 15

'ఓరి నిషాదుడా, నీ కెన్నటికి శాంతి లభింపకుండుగాక! నీ వీ క్రౌంచమిథునమునం దొకదానిని, కామమోహితమై యుండగా అకారణముగా వధించితివి.' కాని యీ మాట లుచ్చరించిన పిదప అతడు చింతాక్రాంతు డాయెను. తపోవిఘాత మొనర్చునట్టి శాపవాణి తననోట వెడలినందుల కతడు మిక్కిలి చింతించెను. అతడు తన శిష్యునితో నిట్లనెను- 'శోకాకులుడనైన

నా ముఖమునుండి వెడలిన వాక్యము, నాల్గుచరణములలో నిబద్ధమైయున్నది. ప్రతిచరణమందును సమానముగా ఎనిమిదేసి అక్షరము లున్నవి. ఇది లయబద్ధమై వీణపై పాడదగినట్లున్నది. ఇట్టి వాక్యము శ్లోకరూపము (శ్లోక మను ఛందముతో నిబద్ధమైన కావ్యరూపము) కాని వేరు కాదు.

శిష్యు డీతని మాటలను సమర్థించుచు ఇట్లు పలికెను- 'నిజమే, ఈ మీ వాక్యము శ్లోకరూపమే యగును. శిష్యుని మాటలకు మహర్షి సంతసించెను. అయినను అత డా శ్లోకమును గూర్చి యింకను ఆలోచింపసాగెను. అతని మనోవికలత కూడ తగ్గినట్లు లేదు. ఇంతలో బ్రహ్మ అతనిపద్దకు వచ్చెను. అతడు వాల్మీకితో - 'నీ ముఖమున వెలువడిన ఈ వాక్యము ఛందోబద్ధమై శ్లోకరూపమున నున్నది. నీవు విచారింపవలదు. నా సంకల్పమువల్లనే నీ ముఖమున ఈ సరస్వతి వెలసినది. కనుక, నీవు శ్రీరాముని కథను సంపూర్ణముగా వర్ణింపుము. మహాబుద్ధిశాలియు, భగవంతుడునైన శ్రీరాముడు లోకములో సర్వశ్రేష్ఠుడైన ధర్మాత్ముడును, ధీరపురుషుడును. నీవు నారదుని వలన విన్న ప్రకారము అతని చరిత్రము వ్రాయుము. శ్రీరాముని బహిరంతర్వృత్తులును అట్లే లక్ష్మణుడు, సీత, రాక్షసులు మున్నగువా రందరి బహిరంతఃప్రవృత్తులును నీకు స్పష్టముగా తెలియగలవు. నీ యీ కావ్యములో ఏదియు అసత్యముండదు. కనుక నీవు శ్రీరాముని పవిత్రచరిత్రమును శ్లోకబద్ధమగు సుందరకృతిగా నిర్మింపుము. ఈ భూమిపై నదీపర్వతము లెంతవరకు నిల్చునో అంతవరకు రామాయణకథ లోకములో ప్రచారమం దుండును. అంతవరకు నీవును స్వేచ్ఛగా స్వర్గమర్త్యలోకములలోను నా లోకములోను నివసింపగలవు.

వాల్మీకిమహర్షి ముఖమున వెలువడిన శాపమే ఇట్లు రామాయణమహాకావ్య రచనకు మూలమైనది. కనుక ఈ శాప మనన్యసాధారణమైన మహత్త్వము గడించినది.

## 2,3. విశ్వామిత్రుడు > మారీచసుబాహులు బాలకాండ 19

ఒకనాడు దశరథమహారాజు పురోహితులు, బాంధవులతో కూడి తన పుత్రుల వివాహమును గూర్చి ఆలోచించుచుండెను. ఆ సమయమున విశ్వామిత్రు డతనిని చూడవచ్చెను. రాజు వెంటనే లేచి ఎదురేగి మునీశ్వరునకు యథావిధిగా స్వాగతసత్కారము లాచరించెను. ముని సంతసించి అతనిని

కుశలప్రశ్న లడిగెను. పిదప అతడు వసిష్ఠాదులను కలిసి వారి కుశల సమాచారము అడిగెను. విశ్వామిత్రుని రాకకు రాజు మిక్కిలి సంతోషించెను. అతడు చేతులు జోడించి మునీశ్వరునితో సవినయముగా నిట్లు చెప్పెను- 'మీ యీ రాకకు గల ఉద్దేశ్య మెరిగించినచో కోరిన దెంత కష్టమైనను యిచ్చెదను.'

రాజు మాటలకు విశ్వామిత్రుడు సంతోషించెను. 'రాజా! నా మనసులో నున్న మాట విని, ఆ మీద నా కార్యమును పూర్తి చేయుటకు నిశ్చయింపుము. నాకు మాట యిచ్చితివి గదా, అది సత్యమని రూఢి చేయుము. నేను సిద్ధి నాశించి ఒకానొక యజ్ఞ మనుష్ఠించుచుంటిని. కాని కామరూపధరులైన మారీచసుబాహు లను రాక్షసులు దానికి విఘ్న మొనర్చుచున్నారు. నియమ పూర్తియగు సమయమున వచ్చి వారు యజ్ఞవేదికను రక్తమాంసములతో నింపి పాడుచేయుచుండుటచే నా ప్రయత్నము సమాప్తి నొందకున్నది. నేను నిరుత్సాహపడి ఆ చోటు విడిచి వచ్చితిని.

*న చ మే క్రోధముత్స్రష్టుం బుద్ధిర్భవతి పార్థివ,* 7
*తథాభూతా హి సా చర్యా న శాపస్తత్ర ముచ్యతే.* 8

ఆ వ్రతనియమము ననుసరించి, ఆరంభమైనది మొదలు కడవరకు శాప మీయకూడదు. కనుక నేను శపింపకుంటిని. వారిని సంహరించుటకు శూరవీరాగ్రణియైన నీ జ్యేష్ఠపుత్రుడు రాముని నా కప్పగించుము. అతడు వారిని నిగ్రహింప సమర్థుడు. నే నతనిని రక్షించి అనేక శ్రేయము లందించెదను' అని విశ్వామిత్రు డెరిగించెను. విశ్వామిత్రునికి ముందుగా మాట యిచ్చినను రా జప్పు డేదో చెప్పి తప్పించుకొనజూచెను. విశ్వామిత్రునకు కోపము వచ్చెను. అపుడు వసిష్ఠమహర్షి రాజునకు నచ్చజెప్పగా అతడు విశ్వామిత్రునితో శ్రీరాముని పంప సిద్ధపడెను.

విశ్వామిత్రముని స్వీయసామర్థ్యముతో శపించి రాక్షసుల నంతమొందింప గలడు. కాని యజ్ఞదీక్షితు డగుటచే నియమము తలచి శపించలేదు. కాగా ఆ శాపస్వరూప మెట్టిదో స్పష్టము కాలేదు.

## 4. అగస్త్యుడు > మారీచుడు — బాలకాండ 25

విశ్వామిత్రముని రామునికి తాటకావృత్తాంత మెరిగించుచుండెను.

చూ: శాప క్ర. 6 - అగస్త్యుడు > తాటక.

అగస్త్యుని శాపముచే తాటక భర్త సుందుడు మరణించెను. అప్పుడు మారీచు డగస్త్యునిపై నురికెను.

*...................... .... ....... .....యక్షీ పుత్రం వ్యజాయత,*
*మారీచం నామ దుర్ధర్షం యః శాపాద్రాక్షసోఽభవత్.* 8

యక్షిణియైన తాటక మారీచు డను నొక దుర్జయుడైన పుత్రుని కనెను. అతడు అగస్త్యముని శాపముచే రాక్షసు డాయెను.

## 5. అగస్త్యుడు > సుందుడు బాలకాండ 25

విశ్వామిత్రుడు రామునికి తాటక వృత్తాంత మెరిగించుచున్నప్పు డీ శాపవిషయము సూచించెను.

చూ. శాప క్ర. 6 - అగస్త్యుడు > తాటక

సుందుని అపరాధమునకు కోపించి అగస్త్యుడు వానిని శపించెను.

*సుందే తు నిహతే రామ అగస్త్యమృషిసత్తమమ్.* 9

సుందుని అపరాధ మేదో గాని, ఇచ్చిన శాప మెట్టిదో గాని స్పష్టముగా తెలియకున్నది.

## 6. అగస్త్యుడు > తాటక బాలకాండ 25

తాటకావనములో ప్రవేశించుచున్నపుడు రామునకు విశ్వామిత్రు డామె జన్మము, వివాహము, శాపము మున్నగు విషయములన్నియు చెప్పి వినిపించెను.

సుకేతు వను నొక ప్రసిద్ధుడైన యక్షు డుండెను. వాడు బలవంతుడు, సన్మార్గుడు కాని అతనిని సంతతి లేదు. తపస్సు చేయగా బ్రహ్మ అతని తపస్సునకు మెచ్చి పుత్రునకు మారు పుత్రికావర మిచ్చెను. ఆ పుత్రికయే ఈ తాటక. ఆమె మిక్కిలి రూపసి. యౌవనమున నామెకు జంభుని పుత్రుడు సుందునితో వివాహము జరిగెను. అగస్త్యముని శాపఫలముగా సుందుడును మరణింపగా తాటక తన కుమారునితో కలిసి అగస్త్యుని చంపదలచెను. అగస్త్యు డామె పుత్రుని 'రాక్షసుడ వగుము' అని శపించి, తాటక నిట్లు శపించెను.

*పురుషాదీ మహాయక్షీ విరూపా వికృతాననా,*
*ఇదం రూపం విహాయాశు దారుణం రూపమస్తు తే.* 12

'నీ యీ రూపము నాశమై నీకు శీఘ్రమే వికృతము, భయంకరమునైన రూప మేర్పడుగాక. నీ వా వికృతరూపముతో నరభక్షిణి యగు రాక్షసి వయ్యెదవుగాక.'

ఈ విధముగా శపింపబడిన తాటక మరింతగా కోపించి అగస్త్యాశ్రమ మున్న ఆ వనము నంతటిని ధ్వంస మొనర్చసాగెను.

## 7. ? > తాటకావనము బాలకాండ 26

విశ్వామిత్రుడు రామునకు తాటకావృత్తాంతము చెప్పుచుండెను. అగస్త్యమునిచే శాపమందిన తాటక ఆ పవిత్రవనమును నాశమొనర్పదొడగెను. విశ్వామిత్రుడు రాముని కిది చెప్పి, 'ఆ దుష్టురాలు బలవంతురాలు, కామరూపిణి, భయంకరి, దురాచారిణి. దానిని వధింపుము' అని ఆజ్ఞాపించెను. 'ఆమెను వధించుటకు నీవు తప్ప వేరెవ్వరును సమర్థులు కారు. స్త్రీవధ అని చూడవద్దు. దయ చూపదగదు. రాజపుత్రునికి చాతుర్వర్ణ్యహితార్థము క్రూరమా, అక్రూరమా, పాపమా, కాదా అను శంక విడిచి వర్తింపదగును. ఇది సనాతన ధర్మము. మహాపాపవతి యగు తాటకయందు ధర్మ మణుమాత్రమైనను లేదు. కనుక ఆమెను సంహరింపుము. పాపచారిణియైన స్త్రీని వధించుట దోషముకాదు. పూర్వము విరోచనపుత్రి మంథరను ఇంద్రుడు వధించెను. శుక్రాచార్యుని తల్లియైన భృగుపత్నిని విష్ణువు సంహరించెను' అని కూడ చెప్పి సమర్థించెను. రాముడు ముని యాజ్ఞను పితృాజ్ఞగనే భావించెను. కాని మాయాబల సంపన్నురాలైన తాటక అజేయగా నిలచి, గర్వించుచు రామునిపై నురికెను. స్త్రీవధ కిచ్చగింపక రాము డామె ముక్కుచెవులు ఖండించెను. కాని ఆమె శిలావృష్టి కురిపించదొడగెను. రామలక్ష్మణు లామె చేతులు ఖండించిరి. రామునిపై నామె పడబోవుతరి అత డామె వక్షమును చీల్చివేసెను. అంతతో ఆ రక్కసి గతించెను. ఆ భయానకరాక్షసి మరణించినందున దేవతలును, దేవేంద్రుడును రాము నెంతయో శ్లాఘించిరి.

*ఉవాస రజనీం తత్ర తాటకాయా వనే సుఖమ్.* 34
*ముక్తశాపం వనం తచ్చ తస్మిన్నేవ తదాహని,*
*రమణీయం విబభ్రాజ యథా చైత్రరథం వనమ్.* 35

మునియు, రామలక్ష్మణులును తాటకావనమున ఆ రాత్రి సుఖముగా గడిపిరి. ఆ దినమే ఆ వనము శాపముక్తమై చైత్రరథమువలె శోభాయమానముగా వెలసెను. శాపగ్రస్తురాలైన తాటకవలన ఆమె నివాసమైన ఆ వనము కూడ శాపగ్రస్తమాయెను. తాటకవధతో ఆ వనముకూడ శాపమోక్ష మందెను. కాని ఆ వనమునకు శాపమిచ్చిన దెవరో అదెట్టి శాపమో స్పష్టముగా తెలియరాకున్నది.

## 8. కుశనాభకన్యలు > వాయువు బాలకాండ 32

మిథిలానగరమార్గమున పోవుచున్నప్పుడు రాముడు మార్గమందలి ప్రదేశములను గూర్చి తెలియగోరెను. అప్పు డతనితో విశ్వామిత్రుడు కుశనాభకన్యల కథ చెప్పెను.

ధర్మాత్ముడైన కుశనాభునికి నూర్గురు కుమార్తె లుండెరి. వారందరును రూపయౌవనసంశోభితలై యుండెరి. వారొకసారి శుభ్రముగా అలంకరించుకొని ఉద్యానవనములో ఆటపాటలతో విహరించుచుండెరి.

ఆ పట్టున వారిని చూచి వాయుదేవుడు ముగ్ధుడై వారితో నిట్లనెను- 'నేను మీరందరను మోహించుచున్నాను. మీరు నా భార్యలు కండు. మానవయౌవనము చంచలము. క్షణక్షణమును క్షీణించుచుండును. న న్నంగీకరించి మీరు మానవత్వమును వీడి దేవాంగనల వలె చిరయౌవన, దీర్ఘాయువు లనుభవింపుడు.' వాయుదేవుని మాటలు విని అపహాస్యముగా వా రిట్లనిరి-

*అంతశ్చరసి భూతానాం సర్వేషాం త్వం సురోత్తమ,*
*ప్రభావజ్ఞాః స్మ తే సర్వాః కిమస్మా నవమన్యసే.* 19

*కుశనాభసుతాః సర్వాః సమర్థాస్త్వాం సురోత్తమ,*
*స్థానాత్ చ్యావయితుం దేవం రక్షామస్తు తపో వయమ్.* 20

*మా భూత్స కాలో ధుర్మేధః పితరం సత్యవాదినమ్,*
*అవమన్య స్వధర్మేణ స్వయం వరముపాస్మహే.* 21

*పితా హి ప్రభురస్మాకం దైవతం పరమం చ నః,*
*యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి.* 22

'హే సురశ్రేష్ఠా ! నీవు ప్రాణవాయువుగా సమస్తప్రాణికోటియందును చరించుచుంటివి. మే మందరము నీ శక్తి యెరుగుదుము. అట్టిచో అనుచితమాడి మమ్మ వమానపరచుట న్యాయమా? మేము రాజర్షియైన కుశనాభుని కుమార్తెలము. దేవతవైనను మేము శపించి నిన్ను దేవత్వమునుండి తొలగింపగలము. కాని తపఃక్షయ మంగీకరింపము. కనుక నిన్ను శపింపదలచలేదు. మూర్ఖుడా! సత్యవాదియైన మా తండ్రి నవమానించి, కామవశులమై గాని లేక అధర్మముగ కాని మేము స్వయముగా వరాన్వేషణ మొనర్చు కాల మెన్నటికిని రాకుండుగాక. మేము తండ్రిచాటువారము. అతడే మా దైవము. అతడు మమ్మెవరి కిచ్చునో అతడే మాకు భర్త.'

వారి మాటలకు వాయువు మిక్కిలి కోపించెను. అతడు వారి శరీరములలో ప్రవేశించి, అవయవములు వంచి, వారిని మరుగుజ్జులుగా జేసెను. ప్రత్యక్షముగా శాప మీయకుండుటచే శాపస్వరూపము స్పష్టముగా తెలియకున్నది.

## 9. ఉమాదేవి > దేవతలు బాలకాండ 36

శ్రీరాముడు హిమవంతుని జ్యేష్ఠపుత్రియగు ఉమాదేవికి దివ్యలోకముతోను, మానవలోకముతోను ఏర్పడిన సంబంధమును గూర్చి ప్రశ్నింపగా విశ్వామిత్రు డతనితో నిట్లు చెప్పెను. మహాదేవుడైన శంకరుడు ఉమాదేవితో క్రీడించుచు నూరు దివ్యవర్షములు గడపెను. కాని ఉమాదేవి గర్భము ధరించలేదు. అప్పుడు బ్రహ్మ ఆదిగా గల దేవత లందరును ఇంతకాలము గడిచిన పిదప వీరికి కలుగు సంతాన మెంత తేజోభరితమగునో అని భయపడిరి. ఈ భయముతో వారు పరమేశ్వరుని వద్దకు వచ్చి యిట్లు ప్రార్థించిరి - 'మహాత్మా! నీవు లోకహితైకతత్పరుడవు. నీకు నమస్కారము. మాయందు దయజూపుము. నీ యీ తేజము బ్రహ్మతేజోభరితము. దాని నీ లోకము భరింపలేదు. కనుక నీవు నీ తేజమును (వీర్యమును) నీయందే నిలిపి లోకములను రక్షింపుము. లోకవినాశ మొనర్పకుము!

శివుడు వారి ప్రార్థన నంగీకరించెను. 'నేను ఉమాసహితముగా ఈ తేజమును నాయందే ధరించెదను. కాని క్షుబ్ధమైన ఈ వీర్యము నెవరు ధరింతురు?' అని ఆయన ప్రశ్నించెను. భూదేవి ఆ ప్రస్ఖలితవీర్యము ధరించుట కంగీకరించెను. అంతతో ఈశ్వరుడు తన వీర్యమును విడిచెను. అది వనపర్వత

పూర్ణమైన ధరిత్రియం దంతటను నిండెను. అప్పుడు దేవతలు అగ్నితో- 'నీ వీ వీర్యమును భరింపు' మని చెప్పిరి. అగ్నిలో నుంచిన ఆ తేజము శ్వేతపర్వతముగా మారెను. తోడనే అచ్చట నొక శరవనము సూర్యాగ్నితేజములతో సమానముగా వెలుగుచు బయటపడెను. ఆ వనమధ్యమున అగ్నిసంభవుడును, మహాతేజస్వియు నైన కార్తికేయు డుదయించెను. దేవతలు సంతసించి ఉమామహేశ్వరులను ప్రస్తుతించిరి. కాని సమాగమమున కీ విధముగా కలిగిన విఘ్నమునకు ఉమాదేవి క్రోధారుణనేత్రయై ఇట్లు పలికెను-

*సమన్యు రశపత్ సర్వాన్ క్రోధసంరక్తలోచనా,*
*యస్మాన్నివారితా చాహం సంగతా పుత్రకామ్యయా, 21*

*అపత్యం స్వేషు దారేషు నోత్పాదయితుమర్హథ,*
*అద్యప్రభృతి యుష్మాకమప్రజాః సంతు పత్నయః. 22*

'పుత్రప్రాప్తిని కోరిన నాకు సమాగమమునకు విఘ్న మొనర్చినందున దేవతల కిక తమ తమ భార్యలయందు సంతానము కలుగదు. నేటినుండి దేవతాస్త్రీలు సంతానరహితలు కాగలరు.'

ఉమాదేవి యిచ్చిన శాపమువలన దేవతలు మిక్కిలి దుఃఖితులైరి.

## 10. ఉమాదేవి > భూదేవి                బాలకాండ 36

విశ్వామిత్రుడు రామునకు ఉమాదేవి చరిత్ర మెరిగించుచుండెను.
చూ. శాప క్ర. 9 - ఉమాదేవి > దేవతలు.

దేవతల ప్రార్థనపై శివుడు తన తేజమును విడువగా, దానిని పృథ్వి గ్రహించెను. ఇట్లు ఉమామహేశ్వరుల సంగమమునకు విఘ్న మేర్పడెను. అందుపై ఉమాదేవి దేవతలను శపించెను.

*ఏవ ముక్త్వా సురాన్ సర్వాన్ శశాప పృథివీమపి,*
*అవనే నైకరూపా త్వం బహుభార్యా భవిష్యసి. 23*

*న చ పుత్రకృతాం ప్రీతిం మత్క్రోధకలుషీకృతా,*
*ప్రాప్స్యసి త్వం సుదుర్మేధే మమ పుత్ర మనిచ్ఛతీ. 24*

'అట్లే ఆమె భూదేవిని కూడ శపించెను. 'పృథ్వీ! నీవు ఏకరూపమున నుండజాలవు. ఎందరికో భార్య వగుదువు. దుర్బుద్ధితో నాకు పుత్రులు లేకుండ జేసితివి కనుక నా శాపముచే నీకు పుత్రసుఖానుభవము కలుగకుండుగాక.'

## 11. ? > ? బాలకాండ 43

విశ్వామిత్రముని రామునికి గంగావతరణకథ చెప్పుచుండెను.

మహాశివుని జటాజూటమున పడిన గంగ, ఆ జటలలో చిక్కుకొని బయటకు రాలేక చిరకాల మక్కడనే తిరుగుడుపడుచుండెను. గంగకు దాపురించిన ఈ పరిస్థితికి వగచి భగీరథుడు తిరిగి మహోగ్రతప మాచరించి, తద్వారా శివుని మెప్పించెను. శివుడప్పుడు గంగను బిందుసరోవరములో విడిచెను. ఆ సమయమున భూలోకవాసులైన ఋషులును, గంధర్వులును మహేశ్వరుని మస్తకము నుండి జారి వచ్చిన గంగాజలమును పవిత్రమని యెంచి, వచ్చి ఆచమించిరి.

*శాపాత్ ప్రపతితా యే చ గగనాద్ వసుధాతలమ్,* 17
*కృత్వా తత్రాభిషేకం తే బభూవుర్గతకల్మషాః.* 18

శాపభ్రష్టులై ఆకాశమునుండి భూమి కొరిగినవారు, ఆ గంగాజలములలో స్నానముచేసి పాపములు పోగొట్టుకొనిరి. అట్లు పవిత్రులై వారు తిరిగి ఆకసమున తమ లోకములకు చేరుకొనిరి. ఇచ్చట కేవలము శాపమని చెప్పబడినదే కాని ఆకాశమునుండి పడినవా రెవరో, వారేల భ్రష్టులైరో, వారి కెవ రెట్టి శాపమిచ్చిరో, కారణమేమో, ఏదియు స్పష్టముగా చెప్పబడలేదు.

## 12. గౌతముడు > ఇంద్రుడు బాలకాండ 48

విశ్వామిత్రునితో కలిసి రామలక్ష్మణులు మిథిలానగరము చేరుకొనిరి. అక్కడ ఉపవనములో నొక చోట మిక్కిలి పురాతనమై, పాడుపడియును రమణీయముగా నున్న ఆశ్రమ మొకటి కనిపించెను. అప్పుడు రాముడు విశ్వామిత్రుని చూసి- 'ఇదేదో ఆశ్రమముపలె కనిపించుచున్నది. కాని మును లెవరును కానరారు. ఇది పూర్వ మెవరి ఆశ్రమము?' అని అడిగెను. అతనితో విశ్వామిత్రు డిట్లు చెప్పెను.

*హంత తే కథయిష్యామి శృణు తత్త్వేన రాఘవ,*
*యస్యైతదాశ్రమపదం శప్తం కోపాన్మహాత్మనః.* 14

'రాఘవా! పూర్వ మిది ఏ మహాత్ముని ఆశ్రమమో, ఎవని కోపమున నిదియిట్లు శపింపబడినదో ఆ వృత్తాంత మంతయు చెప్పెదను. శ్రద్ధగా వినుము' అని విశ్వామిత్రమహాముని యిట్లు చెప్పదొడగెను.

స్వర్గములోని ఆశ్రమములకు దీటుగా పూర్వ మొకప్పుడు వెలసిన యీ ఆశ్రమము గౌతమమహర్షిది. అతడు తన భార్య అహల్యతో కలిసి ఇక్కడ తప మాచరించుచుండెను. అతడు చిరకాల మట్లు తపస్సు చేసెను. ఒకనాడు గౌతము డాశ్రమములో లేని సమయమున, అవకాశము చూచి శచీపతి దేవేంద్రుడు గౌతముని రూపమున వచ్చి అహల్యతో నిట్లు పలికెను-

*ఋతుకాలం ప్రతీక్షంతే నార్థినః సుసమాహితే,*
*సంగమం త్వహమిచ్ఛామి త్వయా సహ సుమధ్యమే.* 18

*మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన,*
*మతిం చకార దుర్మేధా దేవరాజకుతూహలాత్.* 19

*అథాబ్రవీత్ సురశ్రేష్ఠం కృతార్థేనాంతరాత్మనా,*
*కృతార్థాస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్రమితః ప్రభో.* 20

*ఆత్మానం మాం చ దేవేశ సర్వదా రక్ష గౌతమాత్,*
*ఇంద్రస్తు ప్రహసన్వాక్యమహల్యామిదమబ్రవీత్.* 21

*సుశ్రోణి పరితుష్టోఽస్మి గమిష్యామి యథాగతమ్.* 22

'సుందరీ! సమాగమాకాంక్ష గల పురుషులు ఋతుకాలమున కెదురుచూడరు. ఓ సుశ్రోణీ! నేను నీ సమాగమ మాశించుచున్నాను. ఈ మాటలు విన్న అహల్య, అతడు గౌతమవేషమున వచ్చిన ఇంద్రుడని తెలిసియు దుర్బుద్ధియై 'దేవేంద్రు డంతవాడు నన్ను కోరుచున్నాడు.' అని కుతూహలముతో యుప్పొంగి అతనితో పొందున కంగీకరించెను. అనంతర మామె 'సురశ్రేష్ఠా! నీ సమాగమముచేత నేను కృతార్థురాలనైతిని. నీవు శీఘ్రముగా నిచ్చటనుండి వెడలిపొమ్ము. గౌతముని కోపమునుండి నిన్ను, నన్నును కూడ రక్షింపుము.' అని పలికెను. ఇంద్రు డందుకు నవ్వుచూ 'సుందరీ! నేను కూడ సంతుష్టుడనైతిని. ఇక వచ్చినట్లే వెళ్ళిపోవుదును.' అని చెప్పెను.

ఇంద్రు డహల్యను విడిచి ఆ కుటీరము దాటుచుండగనే గౌతముడు వచ్చుచున్నట్లు తోచి, గాభరాపడి వేగముగా పరుగిడిపోజొచ్చెను. కాని యింతలో దేవదానవదుర్ధర్షుడు, తపోబలసంపన్నుడు, అగ్నిసమానతేజస్కుడు నైన గౌతమమహాముని ఆశ్రమములోనికి వచ్చెను. ఇంద్రు డతనిని చూచి భయకంపితు డాయెను. ముఖము వెలవెల బోయెను. తన వేషము దాల్చివచ్చిన యింద్రుని చూచి గౌతముడు జరిగినదంతయు గ్రహించెను. వెంటనే మహాకోపముతో అత డింద్రునితో నిట్లనెను-

*మమ రూపం సమాస్థాయ కృతవానసి దుర్మతే,*
*అకర్తవ్యమిదం యస్మాద్ విఫలస్త్వం భవిష్యసి.* 27

'ఓరి దుర్మతీ, నా రూపము ధరించి వచ్చి నీ వీ అకృత్య మొనరించితివి. కనుక నీవు వృషణహీనుడ వగుము.'

రోషపూర్ణమైన గౌతమవచనము వెడలినదే తడవుగా ఇంద్రుని వృషణములు తెగి పడెను.

ఆ తరువాత వృషణరహితుడైన యింద్రుడు అగ్ని మున్నగు దేవతలను, సాధ్యులను, గంధర్వచారణాదులను పిల్చి వారితో నిట్లు చెప్పెను - 'గౌతమ మహర్షి తపమునకు విఘ్నము కన్పింపనెంచి నే నతనికి క్రోధము కల్గించితిని. అట్లు చేసి నేను దేవతలకే హిత మాపాదించితిని. లేనిచో గౌతముడు తపోబలమున దేవరాజ్యమునే గ్రహింపగలడు. అతడు శాపమిచ్చి నన్ను వృషణహీనునిగా చేసెను. తన భార్యను కూడ పరిత్యజించెను. కనుక ఓ దేవతలారా! మీరును, ఋషిసమూహము, చారణగణములు కలిసి నాకు వృషణము లమర్చుటకు ప్రయత్నింపుడు.' (బాలకాండ 49)

ఇంద్రుని మాటపై మరుద్గణముతో చేరి అగ్ని మున్నగు దేవతలందరూ కవ్యవాహనుడు మున్నగు పితృదేవతల వద్ద కేగి వారితో నిట్లనిరి- 'పితరులారా! మీ వద్దగల మేషము అండకోశసహితమై యున్నది. ఇంద్రు డండకోశరహితుడుగా నున్నాడు. మీ రీ మేషాండములను శీఘ్రమే యింద్రుని కర్పింపుడు. ఈ మేషము అండకోశ రహితమయ్యును మిమ్ము సంతోషపరచును. అండకోశ రహితమైన మేషమును మీకు సమర్పించు మానవులకు మీరు సంపూర్ణ యజ్ఞఫలము ప్రసాదింపుడు.' అగ్ని మాటలకు పితృదేవత లంగీకరించి, మేషాండ ములను ఇంద్రుని కతికించిరి. అది మొదలుగా ఇంద్రుడు మేషవృషణు డాయెను. (బాలకాండ 49)

బ్రహ్మ ఇంద్రునితో వైష్ణవయాగ మొనర్చుమని చెప్పెను. ఈ వృత్తాంతమును అగస్త్యుడు శ్రీరామున కెరిగించు సందర్భమున, గౌతముడు ఇంద్రుని కిచ్చిన శాపమును గురించి వివరించెను. బ్రహ్మ రూపగుణసంపన్నురాలైన అహల్యను సృజించెను. అత డామెను గౌతమునివద్ద దాచియుంచెను. తర్వాత గౌతముని యింద్రియసంయమనము, తపోనిష్ఠయు చూచి సంతసించి బ్రహ్మ అహల్యను గౌతమునికే పత్నిగా నిచ్చెను. ఇది చూచి ఇంద్రాదిదేవతలు నిరాశులైరి. ఇంద్రుడు మనసారా ఆమెను తన పత్నిగా నెంచెను. అతడు కామాధీనుడై గౌతముడు ఆశ్రమమున లేని సమయమున వచ్చి అహల్యను బలాత్కరించెను. కాని ఆశ్రమమున నతనిని చూచిన మహాతేజస్వి గౌతముడు కోపించి అతని నిట్లు శపించెను-

*యస్మాన్మే ధర్షితా పత్నీ త్వయా వాసవ నిర్భయాత్,*
*తస్మాత్ త్వం సమరే శక్ర శత్రుహస్తం గమిష్యసి.* 32

*అయం తు భావో దుర్బుద్ధే యస్త్వయేహ ప్రవర్తితః,*
*మానుషేష్వపి లోకేషు భవిష్యతి న సంశయః.* 33

*తత్రార్ధం తస్య యః కర్తా త్వయ్యర్ధం నిపతిష్యతి,*
*న చ తే స్థావరం స్థానం భవిష్యతి న సంశయః.* 34

*యశ్చ యశ్చ సురేంద్రః స్యాద్ ధ్రువః స న భవిష్యతి,*
*ఏష శాపో మయా ముక్త ఇత్యసౌ త్వాం తదాబ్రవీత్.* 35

'వాసవా, నీవును నిర్భయముగా నా భార్యను బలాత్కరించితివి. ఫలితముగా, నీవు యుద్ధములో శత్రువుల చేతిలో పడెదవు. కాని 'ఓరి దుర్బుద్ధీ! నీ వంటి రాజు చేసిన యీ దోషమువలన మానవలోకమున కూడ ఈ దోషము ప్రవర్తించకమానదు. దీనికి నీ విట్లు ఉపక్రమ మొనర్చితివి. 'జారుడై పాప మొనర్చునో వానికి ఆ పాపములో సగభాగ మంటును. మిగిలిన సగము నీకు చెందును. ఏలయన నీవే దీనికి ప్రవర్తకుడవు. నిస్సందేహముగా నీ కీ పదవి శాశ్వతము కాదు. ఎవడు దేవరాజైనను వానికి స్థిరత్వముండదు. ఈ శాపము నేను ఇంద్రమాత్రునికి (ప్రతి ఇంద్రునికి) నిచ్చుచుంటిని.

పై రెండు చోట్లను ఇచ్చిన శాపములు భిన్నముగా నున్నవి. ఇంద్రునికి మేషవృషణము లమరెను. అది పితృదేవతలను ప్రార్థించిన దానికి ఫలము కాని శాపమోచనము కాదు. ఇంద్రుడు శాపమోచన మడుగలేదు. గౌతము డివ్వనూ లేదు.

## 13. గౌతముడు > అహల్య బాలకాండ 48-49

చూ. శాప క్ర. 12. గౌతముడు > ఇంద్రుడు.

ఇంద్రుని శపించిన పిదప గౌతము డహల్య నిట్లు శపించెను-

*ఇహ వర్షసహస్రాణి బహూని నివసిష్యసి.* 29

*వాతభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ,*
*అదృశ్యా సర్వభూతానామాశ్రమేఽస్మిన్ వసిష్యసి.* 30

*యదా త్వేతద్వనం ఘోరం రామో దశరథాత్మజః,*
*ఆగమిష్యతి దుర్ధర్షస్తదా పూతా భవిష్యసి.* 31

*తస్యాతిథ్యేన దుర్వృత్తే లోభమోహవివర్జితా,*
*మత్సకాశం ముదా యుక్తా స్వం వపుర్ధారయిష్యసి.* 32

'నీ విక్కడ ఎన్నో వేల సంవత్సరములు వాయుమాత్రాహారవై ఉపవాసకష్ట మనుభవించుచు, రాయిపై పడియుందువు. నీ వితరులకు కానరావు. ఈ ఆశ్రమములో బూడిదలో పడియుండగలవు. దశరథరాజపుత్రుడు, వీరుడైన శ్రీరాము డీ వనమునకు వచ్చినపుడు నీవు తిరిగి పవిత్రురాల వగుదువు. అతని కాతిథ్యమిచ్చి నీవు లోభమోహములు తొలగి, తిరిగి ప్రసన్నతాపూర్వకముగా నన్ను చేరుకొందువు. అప్పుడు నీ పూర్వరూపము నీకు తిరిగి లభించును.'

విశ్వామిత్రముని ఆదేశముపై రాముడు లక్ష్మణసహితుడై ఆ ఆశ్రమమున ప్రవేశించెను. అతని కా మహాసౌభాగ్యశాలిని అహల్య కనిపించెను. ఆమె తపస్తేజముచే దేదీప్యమానయై వెలుగుచుండెను. రాముని రాకకు పూర్వ మామె, గౌతముని శాపకారణముగా, ఎవ్వరికిని కానరాకుండెను. శ్రీరాముని దర్శనముతో ఆమె శాపము తీరిపోయెను. అంతతో ఆమె అందరికిని కనిపించెను. రామలక్ష్మణులు ప్రసన్నచిత్తులై ఆమె చరణములు స్పృశించిరి. అహల్య ఆ సోదరద్వయమున కాతిథ్య మొసగెను. రాము డామె యిచ్చిన

ఆతిథ్యము స్వీకరించెను. గౌతముడు వచ్చి అహల్యను తిరిగి గ్రహించెను. వారి ఆదరము బడసి శ్రీరాముడు విశ్వామిత్రుని వెంట మిథిలానగర మేగెను.

ఉత్తరకాండ 30

ఇంద్రునికి శాపమిచ్చిన పిదప మహాతపస్వి గౌతముడు తన పత్ని అహల్యను చీవాట్లు పెట్టి ఆమెతో నిట్లనెను.

*దుర్వినీతే వినిధ్వంస మమాశ్రమసమీపతః.* 36

*రూపయౌవనసంపన్నా యస్మాత్ త్వమనవస్థితా,*
*తస్మాద్ రూపవతీ లోకే న త్వమేకా భవిష్యసి.* 37

*రూపం చ తే ప్రజాః సర్వా గమిష్యన్తి న సంశయః.* 38

'దుష్టురాలా! నా ఆశ్రమము చెంతనే నీవు అదృశ్యురాలవై రూప సౌందర్యములు బాసి పడియుందువు. నీవు రూపసౌందర్యసంపన్నురాలవై నందున మర్యాద మించి చరించితివి. ఇక లోకములో నీ వొక్కతెవే రూపసివి కావు. ఇంద్రుని మోహింపజేసిన నీ యీ రూపమును లోకములో నందరును పొందగలరు. ఇందులో సందేహము లేదు.'

అహల్య సవినయముగా ప్రార్థించి గౌతముని ప్రసన్నునిగా చేసికొని ఇట్లు చెప్పెను-

*అజ్ఞానాద్ధర్షితా విప్ర త్వద్రూపేణ దివౌకసా,*
*న కామకారాద్విప్రర్షే ప్రసాదం కర్తుమర్హసి.* 40

'విప్రశ్రేష్ఠా! దేవేంద్రుడు నీ రూపమున వచ్చి నన్ను చెరచెను. నే నతని నెరుగలేకపోయితిని. అజ్ఞానముచే నావల్ల ఈ అపరాధము జరిగినది. కామించి కాదు. కనుక ఓ బ్రహ్మర్షీ! నాయందు కరుణింపుము.' అహల్య మాటలు విని గౌతము డిట్లు పలికెను-

*ఉత్పత్స్యతి మహాతేజా ఇక్ష్వాకూణాం మహారథః.* 41

*రామో నామ శ్రుతో లోకే వనం చాప్యుపయాస్యతి,*
*బ్రాహ్మణార్థే మహాబాహుర్విష్ణు ర్మానుషవిగ్రహః.* 42

తం ద్రక్ష్యసి యదా భద్రే తతః పూతా భవిష్యసి,
న హి పావయితుం శక్తస్త్వయా యద్దుష్కృతం కృతమ్. 43

తస్యాతిథ్యం చ కృత్వా వై మత్సమీపం గమిష్యసి,
వత్స్యసి త్వం మయా సార్ధం తదా హి వరవర్ణిని. 44

'సౌభాగ్యవతీ, ఇక్ష్వాకువంశమున మహాతేజస్వియు, మహారథుడు నైన పురుషుడవతరించును. అతడు లోకములో శ్రీరాము డని ప్రసిద్ధి వహించును. అతడు మనుష్యరూపమున నవతరించిన మహావిష్ణువు. విశ్వామిత్రాది బ్రహ్మర్షుల కార్యముపై అత డీ వనమునకు వచ్చును. అతనిని దర్శించి నీవు పవిత్రురాల వగుదువు. నీవు చేసిన పాపమునకు నిష్కృతి జూపగలవా డత డొక్కడు మాత్రమే. అతనికి అతిథ్యమిచ్చి, నీవు నాచెంత చేరి, తిరిగి నాతో కలిసియుండగలవు.

పైన చూపిన రెండుచోట్లను శాపములలో నెంతో భేదమున్నది. బాలకాండలోని శాపమున ఉత్తరకాండలోని మోక్షము గర్భితమైనది. అహల్య వేడకున్నను గౌతము డామెకు శాపమోక్ష మెరిగించెను. అది అయాచితము. ఉత్తరకాండలో అహల్య వేడుకొనిన మీదట గౌతముడు శాపశాంతి విపరించెను. ఇది యాచిత శాపశాంతి.

## 14. వసిష్ఠుని పుత్రులు > త్రిశంకుడు బాలకాండ 58

శతానందుడు రామునికి విశ్వామిత్రుని పూర్వచరిత్రము చెప్పుచుండెను. బ్రహ్మర్షిపదప్రాప్తికై విశ్వామిత్రుడు ఘోరముగా తప మొనర్చెను. అతని తపమునకు సంతసించి బ్రహ్మ అతనిని 'రాజర్షి' అని గౌరవించెను. బ్రహ్మర్షి పదవి లభింపనందున దుఃఖించి విశ్వామిత్రుడు మరల తపస్సుచేయ నారంభించెను. ఆ సమయమున ఇక్ష్వాకువంశదీపకుదు, సత్యవాది, జితేంద్రియుడు నైన త్రిశంకు డుదయించి రాజ్యమేలుచుండెను. అతడు సశరీరముగా స్వర్గ మేగదలచెను. ఈ విషయము వసిష్ఠునితో చెప్పగా అత డది అసంభవ మనెను. అంతలో త్రిశంకుడు, దక్షిణదిశలో సుదీర్ఘతప మొనర్చుచున్న వసిష్ఠపుత్రుల వద్ద కేగి తన రాకకు గల ఉద్దేశ్య మెరిగించెను. వసిష్ఠు డంగీకరింపలేదనియు, కనుక వారెట్లయిన తన అభీష్టసిద్ధికి తోడ్పడవలెననియు చెప్పెను. వసిష్ఠు డంగీకరింపనందున తనకు గురుపుత్రులను వేడుకొనుట తప్ప వేరొక మార్గము

లేదనియు విన్నవించెను. వసిష్ఠపుత్రు లతని కోర్కెను మన్నించలేదు. పైగా, వసిష్ఠుడు అసంభవమని చెప్పినదానిని ఆచరించుటకు పూనుకొని మే మతని నవమానింతుమా? అని త్రిశంకునిపై వారు కోపించిరి. అప్పుడు త్రిశంకుడు 'గురుడును, గురుపుత్రులు కూడ కాదనుచున్నారు కనుక నే నిక వేరొకరిని చేరి వేడుకొందును' అని పలికెను.

*ఋషిపుత్రాస్తు తచ్ఛ్రుత్వా వాక్యం ఘోరాభిసంహితమ్,* 8
*శేపుః పరమసంక్రుద్ధాశ్చండాలత్వం గమిష్యసి.* 9

త్రిశంకుని మాటలు విని వసిష్ఠుని పుత్రులు మిక్కిలి కోపించి 'చండాలుడ వగుము' అని అతనికి శాపమిచ్చిరి.

రాత్రి గడచునప్పటికి త్రిశంకుడు చండాలు డాయెను. అతని శరీర వర్ణము నల్లగా మారిపోయెను. వస్త్రములు నీలవర్ణము లాయెను. అవయవము లన్నియు కరకువారెను. శిరమున జుట్టు పొట్టిపొట్టి వెంట్రుకలుగా మారెను. ఒడలంతయు చితాభస్మ మంటెను. ఆ యా అవయవములలో అక్కడ తగినట్లు లోహాభరణములు వెలసెను. ఈ రూపమున అతడు విశ్వామిత్రుని చేరి శరణువేడి, జరిగిన దంతయు విన్నవించెను. విశ్వామిత్రుడు దయార్ద్రహృదయుడై అతని కభయమిచ్చి, అతని కోర్కె సాధించుటకు మాట యిచ్చెను.

## 15. విశ్వామిత్రుడు > వసిష్ఠపుత్రులు, మహోదయుడు బాలకాండ 59

శతానందుడు శ్రీరామునితో విశ్వామిత్రుడు వసిష్ఠపుత్రుల కిచ్చిన శాపములను గూర్చి చెప్పుచున్నాడు.

కులగురువైన వసిష్ఠునిచేతను అతని నూర్గురు పుత్రులచేతను యజ్ఞకర్మ తిరస్కరింపబడినందున త్రిశంకుడు విశ్వామిత్రుని శరణువేడెను. గురువును, తత్పుత్రులును యజ్ఞకర్మ నిరాకరించిరనియు, తాను సశరీర స్వర్గయాత్ర కోరుచుంటి ననియు చెప్పి, అతడు విశ్వామిత్రుని తన యజ్ఞమున కాధ్వర్యము వహించి కృతార్థుని చేయవలెనని ప్రార్థించెను. అతని స్థితిపై కనికరించి విశ్వామిత్రు డతని ప్రార్థన నంగీకరించెను. 'నేను నీకు శరణ మిచ్చుచున్నాను. నీ యజ్ఞములో పాల్గొనుటకు పుణ్యాత్ములైన ఋషులందరిని పిలిచెదను. నీవు యజ్ఞము చేయుము. నీకు సదేహస్వర్గము ప్రాప్తించును.' అని చెప్పి విశ్వామిత్రుడు తన పుత్రులను

యజ్ఞసంభారములు సంగ్రహింపుడని చెప్పెను. శిష్యులను పిల్చి 'మీరు వసిష్ఠపుత్రులతో కూడ సమస్త మునిగణమును నామాటగా ఈ యజ్ఞమున కాహ్వానింపుడు మీరు పిల్చునప్పు డెక్కడైనా, ఎవరైనా నా యీ ప్రయత్నమును గూర్చి మంచిగాని, చెడ్డగాని ఏమన్నను, అది నాతో నిస్సంకోచముగా చెప్పుడు.' అని అజ్ఞాపించి పంపెను విశ్వామిత్రుని ఆహ్వానముపై దేశ మందలి బ్రహ్మవేత్త లందరూ వచ్చిరి. వసిష్ఠపుత్రులైన మహోదయఋషి మున్నగువారు మాత్రము రాలేదు. వా రా సందర్భమున పలికిన మాటలు విశ్వామిత్రుని శిష్యు లతని కిట్లు వినిపించిరి. 'చండాలుడు యజ్ఞకర్త, క్షత్రియుడు యాగాధ్వర్యుడుగా గల ఈ యజ్ఞమున దేవర్షులుగాని, బ్రహ్మర్షులుగాని హవిష్యాన్న మెట్లు స్వీకరింపగలరు? చండాలాన్నము తిని విశ్వామిత్రునిచే మన్నింపబడిన యీ బ్రాహ్మణులు స్వర్గ మెట్లేగగలరు?' ఈ మాటలు విన్నదే తడవుగా విశ్వామిత్రుడు క్రోధావేశపూరితుడై కఠోరముగా నిట్లు పలికెను-

*యద్దూషయంత్యదుష్టం మాం తప ఉగ్రం సమాస్థితమ్,* 17
*భస్మీభూతా దురాత్మానో భవిష్యంతి న సంశయః.*

*అద్య తే కాలపాశేన నీతా వైవస్వతక్షయమ్,* 18
*సప్తజాతిశతాన్యేవ మృతపాః సంభవంతు తే.*

*శ్వమాంసనియతాహారా ముష్టికా నామ నిర్ఘృణాః,* 19
*వికృతాశ్చ విరూపాశ్చ లోకాననుచరంత్విమాన్.*

*మహోదయశ్చ దుర్బుద్ధిర్మామదూష్యం హ్యదూషయత్,* 20
*దూషితః సర్వలోకేషు నిషాదత్వం గమిష్యతి.*

*ప్రాణాతిపాతనిరతో నిరనుక్రోశతాం గతః,* 21
*దీర్ఘకాలం మమక్రోధాద్దుర్గతిం వర్తయిష్యతి.* 22

ఉగ్రతపోనిష్ఠుడను, నిర్దోషినైన నన్ను నిందించినందున, ఈ దురాత్ములు భస్మీభూతు లగుదురుగాక. నేడే కాలపాశమున చుట్టబడి వీరు యమలోక మేగుదురుగాక. ఈ పైన ఏడువందల జన్మములవరకు వీరు ముష్టికులను చండాలజాతిలో పుట్టి కుక్కలను తినువారు కాగలరు. వికృతాచారులు, విరూపులై

లోకమున సంచరింపగలరు. ఆ దుర్బుద్ధియైన ఋషి మహోదయుడు దోషరహితుడనైన నన్ను దూషించినందున నా క్రోధమువలన సుదీర్ఘకాలమువరకు ప్రాణిహింస చేయు నిర్దయాత్మక మగు నిషాదయోని నంది దుర్గతి ననుభవించును.'

## 16. విశ్వామిత్రుడు > (త్రిశంకుని యజ్ఞమున కాహూతులైన) ఋషులు బాలకాండ 60

త్రిశంకునికొరకు విశ్వామిత్రు డొనర్చిన యజ్ఞమునుగూర్చి శతానందుడు రామునకు వివరించుచున్నాడు.

మహోదయాదులైన వసిష్ఠపుత్రులను శపించి, విశ్వామిత్రుడు ఆమంత్రితులైన ఋషులతో, త్రిశంకునికి సదేహస్వర్గప్రాప్తి కలుగునట్టి యజ్ఞకార్యములను అనుష్ఠింపుడని చెప్పెను. విశ్వామిత్రుని ఆదేశము గ్రహించి ఆ ఋషులు తమలో తా మిట్లు పరామర్శ చేసిరి- 'ఈ కౌశికుడు మహాకోపి. కనుక ఇతడు చెప్పినట్లు చేయవలసినదే. లేనిచో,

*అగ్నికల్పో హి భగవాన్ శాపం దాస్యతి రోషతః.* 6

అగ్నికల్పుడైన ఈ మహర్షి కోపించి మనలను శపించును త్రిశంకు డెట్లును విశ్వామిత్రుని ప్రభావమున సదేహస్వర్గ మందగలడనియు, యజ్ఞారంభ మనివార్యమనియు భావించి వా రా యజ్ఞకార్య మారంభించిరి.

విశ్వామిత్రుడు ప్రత్యక్షముగా శాప మీయకున్నను, ఇచ్చునేమో అను భయముతో ఋషులు అతని యాదేశమును పాలించిరి. కనుక వారికి శాప మబ్బలేదు. ఇది షరతుతో కూడినట్టిది. శాప మివ్వలేదు కనుక దాని స్వరూపము తెలియదు.

## 17. విశ్వామిత్రుడు > (అతని) పుత్రులు బాలకాండ 62

శతానందుడు శ్రీరామునితో శునఃశ్శేఫుని వృత్తాంతము చెప్పుచుండెను.

ఒకప్పుడు అయోధ్యలో అంబరీషమహారాజు యజ్ఞ మొనర్చుచుండెను. ఆ సమయమున ఇంద్రుడు యజ్ఞపశువు నపహరించెను. పురోహితులు రాజు తగినంతగా శ్రద్ధ వహించలేదనియు, తత్కారణమున పశు వపహరింపబడినదనియు

చెప్పి, దానికి బదులు నరపశుపును తెచ్చి యజ్ఞపూర్తి చేయుమనిరి. అంబరీషుడు వేయి గోవు లిచ్చి ఒక పురుషుని కొని తెచ్చుట కంగీకరించి వెడలెను. అత డెన్నో దేశ, జనపద, నగర, తపోవన ఆశ్రమభూములలో వెదకి, చివరకు భృగుతుంగపర్వతము చేరెను. అచ్చట పత్నీపుత్రసహితముగా కూర్చొనియున్న ఋచీకమునిని దర్శించి, తనకు యజ్ఞపశువుగా నొక పుత్రు నిచ్చినచో బదులుగా లక్షగోవు లిచ్చెదనని చెప్పి ప్రార్థించెను. ఋచీకుడు తన జ్యేష్ఠ పుత్రుని విక్రయించుట కిష్టపడలేదు. మునిపత్ని కనిష్ఠుని విక్రయించుట కంగీకరింపలేదు. అప్పుడు మధ్యమపుత్రుడైన శునఃశేఫుడు స్వయముగా అందుల కంగీకరించెను. అంబరీషుడు సంతోషించి కోటి స్వర్ణముద్రలు, రత్నరాశి, లక్షగోవులు ఇచ్చి శునఃశేఫుని గ్రహించి యింటికి తెచ్చుచుండెను. దారిలో పుష్కరతీర్థమున తప మాచరించుచున్న తన మేనమామ యగు విశ్వామిత్రుని చూడగోరి శునఃశేఫు డతనిపద్ద కరిగెను. అతడు విశ్వామిత్రునితో 'మహామునీ, నాకు తల్లి లేదు, తండ్రి లేడు, సోదరులు లేరు, బంధువులు లేరు. నీవు ధర్మముతో నన్ను రక్షింపుము. అంబరీషుని యజ్ఞము సఫలమగునట్లును, నేను దీర్ఘాయువు కల్గి తపస్సు చేసి దివ్యలోకములు గడింపగల్గునట్లును అనుగ్రహింపుము. తండ్రి పుత్రుని రక్షించునట్లు నన్ను విపత్తు నుండి రక్షింపుము.' అని వేడుకొనెను. శునఃశేఫుని కథ విని విశ్వామిత్రుడు తన పుత్రులను పిల్చి ఇట్లు చెప్పెను- 'నాయనలారా! శుభాభిలాషి యగు తండ్రి ఏ పారలౌకికహితము కోరి పుత్రులను బడయునో, అది పూర్తిచేయు సమయ మాసన్నమైనది. ఈ మునిబాలకుడు రక్షింపుమని నన్ను వేడుచున్నాడు. మీరందరు ధర్మాత్ములు, పుణ్యవంతులు, కనుక రాజొనర్చు యజ్ఞములో పశువగుట కంగీకరించి అగ్నిదేవుని సంతృప్తి పరచుడు. అట్లు చేసినచో శునఃశేఫుడు రక్షింపబడును. రాజు యజ్ఞము నిర్విఘ్నముగా సాగును. దేవతలు సంతసింతురు.' విశ్వామిత్రుని యీ మాటలు విని మధుచ్ఛందాదులైన అతని పుత్రులు అభిమానపడి, అపహాళన చేయుచు నతనితో నిట్లనిరి- 'మహాత్మా, నీవు నీ పుత్రు లందరిని విడిచి వేరొకరి పుత్రు నొక్కనిని రక్షింప నెంచుచుంటివి. ఇది న్యాయమా? పవిత్రమైన ఆహారమున కుక్కమాంస మంటినచో అది అగ్రాహ్య మయినట్లు తన పుత్రులను రక్షించుట కర్తవ్యమై యుండగా వేరొకరి పుత్రుని రక్షించుటకై మీరు మమ్ము విడుచుట మాకు అకర్తవ్యముగా తోచుచున్నది.' పుత్రులమాటలు విన్న విశ్వామిత్రుడు కను లెఱ్ఱచేసి ఇట్లు పలికెను -

*నిఃసాధ్వసమిదం ప్రోక్తం ధర్మాదపి విగర్హితమ్,*
*అతిక్రమ్య తు మద్వాక్యం దారుణం రోమహర్షణమ్. 16*

*శ్వమాంసభోజినః సర్వే వాసిష్ఠా ఇవ జాతిషు,*
*పూర్ణం వర్షసహస్రం తు పృథివ్యామనువత్స్యథ. 17*

'మీరు భయము లేక, ధర్మరహితము, నింద్యమునైన మాట చెప్పుచున్నారు. నా ఆజ్ఞను మీరి దారుణముగా రోమాంచ మగునట్లు మీ నోట ఈ మాటలు వచ్చినవి. ఈ అపరాధఫలముగా మీరు వసిష్ఠపుత్రులవలెనే కుక్కమాంసము తిని బ్రదుకు ముష్టికుల జాతిలో జన్మించి వేయి సంవత్సరము లీ భూమిపై సంచరింపుడు.'

## 18. విశ్వామిత్రుడు > రంభ బాలకాండ 64

శతానందుడు రామునకు విశ్వామిత్రుని ఘోరతపమును గూర్చియు, తత్ఫలితముగా అతనికి లభించిన అమోఘమగు శక్తినిగూర్చియు చెప్పుచున్నాడు.

విశ్వామిత్రమహర్షి బ్రహ్మర్షి కాగోరి తీవ్రమగు తపము చేయదొడగెను. అందువలన దేవతలకు, ఇంద్రునికి ఎంతో భయమాయెను. అతని తపమును భగ్నమొనర్చుటకై దేవేంద్రుడు రంభ యను అప్సరసను పిలిచి యిట్లు చెప్పెను- 'నీవు విశ్వామిత్రు నెట్లయినను కామమోహితునిగా నొనర్చి అతని తపమును భగ్నము చేయుము. దేవతలకు మిక్కిలి కఠినమైన ఈ కార్యమును నీ వెట్లయినను సాధింపవలెను.' రంభ యీ మాటలు విని లజ్జించుచు, భయభీతయై ఇంద్రునితో నిట్లు పలికెను - 'ఆ ఋషి మహాభయంకరుడు. క్రోధావేశమున కఠోరముగా శపించును. కనుక నా కీ కార్య మప్పగించ వలదు. నాకు భయముగా నున్నది' అని యిట్లు వడవడ వణకుచు చెప్పుచున్న రంభ నోదార్చుచు ఇంద్రు డిట్లనెను- 'నీవు భయపడవద్దు. కోయిలల గుంపును, మన్మథుని నీ వెంట పంపెదను.' ఆమె చిరునవ్వుతో అట్లే యని అతి మనోహరమగు రూపము ధరించి విశ్వామిత్రుని ఆశ్రమము చేరి, అతని తపమును చెడగొట్టుటకు నిశ్చయించెను. కోకిలస్వరము మధురముగా వినిపించెను. విశ్వామిత్రు డా వంక చూచెను. ఎదురుగా రంభ కనిపించెను. కోకిలస్వరము, రంభ గానస్వరము, అకస్మాత్ సందర్శనము, విశ్వామిత్రుడి మనమున సందేహము

కలిగించెను. దేవేంద్రుని ఆగిడ మాత డపరీలగా గ్రహించెను. వెంటనే క్రోపఘూర్ణమానారుణాక్షుడై రంభను శపించుచు నిట్లు పలికెను-

*యన్మాం లోభయసే రంభే కామక్రోధజయైషిణమ్,*
*దశవర్షసహస్రాణి శైలీ స్థాస్యసి దుర్భగే.* 12

*బ్రాహ్మణః సుమహాతేజాస్తపోబలసమన్వితః,*
*ఉద్ధరిష్యతి రంభే త్వాం మత్క్రోధకలుషీకృతామ్.* 13

'ఓసి దుష్టురాలగు రంభా! కామక్రోధములను జయింపనెంచిన నన్ను నీవు లోభపెట్ట నెంచుచుంటివి. ఈ అపరాధకారణమున, నీవు పదివేల సంవత్సరములు రాయివై పడియుందువు. శాపావధి ముగిసిన పిదప ఒక మహాతేజస్వియైన బ్రాహ్మణతపస్వి (బ్రహ్మపుత్రుడైన వసిష్ఠుడు) నిన్ను నా శాపము నుండి ఉద్ధరించును.'

ముని యిచ్చిన శాపమువలన రంభ తత్క్షణమే శిలారూప మందెను. విశ్వామిత్రముని తన క్రోధావేశమును నిగ్రహించుకొనలేకపోయెను. దాని కాత డెంతో సంతాపమందెను.

శాపములోని ఉత్తరార్ధము పశ్చాత్తాపమువలెనే యున్నది. శాపశాంతి సామాన్యముగా ప్రార్థించి గ్రహింపదగినది. కాని రంభ అట్లు ప్రార్థించుటకు పూర్వమే ముని శాపశాంతి పలికినందున ఈ శాపశాంతి అయాచితము.

## 19. కౌసల్య > శ్రీరాముడు అయోధ్యాకాండ 21

కైకకు దశరథు డిచ్చిన వరముల ననుసరించి రాముడు వన మేగుటకు నిశ్చయించెను. దానికై తల్లి అనుమతిని వేడదలచి అతడు లక్ష్మణసహితుడై ఆమె వద్ద కేగెను. కౌసల్య ఎన్నో విధములుగా చెప్పి, అతని నిశ్చయమును మరల్ప యత్నించెను. కాని ఫలితము లేకపోయెను. చివర కామె రాముని దృఢనిశ్చయము గాంచి సాశ్రునయనయై గద్గదస్వరమున నిట్లనెను-

'రామచంద్రా! నీవు ధర్మ మెరుగుదువు. ధర్మిష్ఠుడవు. ధర్మపాలన మొనర్పదలచినచో ఇచటనే నిల్చి నన్ను సేవింపుము. ఈ ఉత్తమమైన పరమధర్మ మాచరింపుము. వత్సా! నియమపూర్వకముగా తన యింట నుండి మాతృసేవ చేసి కాశ్యపుదు ఉత్తమతపఃఫల మంది స్వర్గలోక మేగెను.

గురుభావమున రాజెట్లు నీకు పూజ్యుడో అట్లే నేనును పూజ్యురాలను. నేను నీ వనవాసమున కనుమతింపను. కనుక నీవు వనమున కేగవలదు. నీతో కలిసియుండి తృణభోజనమైనను గ్రహించుట నాకు శ్రేయస్కరము. కాని నిన్ను విడిచి నా కీ జీవితములో ఏ ప్రయోజనము గాని, ఎట్టి సుఖముగాని లేదు. నన్ను దుఃఖమున దిగవిడిచి నీ వరణ్య మేగినచో నే నుపవాసము చేసి ప్రాణములు విడిచెదను. జీవించి యుండజాలను.

*తతస్త్వం ప్రాప్స్యసే పుత్ర నిరయం లోకవిశ్రుతమ్,*
*బ్రహ్మహత్యామివాధర్మాత్ సముద్రః సరితాం పతిః. 28*

అప్పుడు నీకు లోకప్రసిద్ధమై బ్రహ్మహత్యాసదృశమై నరకతుల్యమగు బాధ కలుగును. మునుపు బ్రహ్మహత్యాదోషముచే సరిత్పతియైన సముద్రుడిట్టి బాధనే తన అధర్మమునకు ఫలముగా ననుభవించెను.

ఈ మాటలు శాప మనిపించుకొనునా? ప్రత్యక్షముగా శాపమివ్వలేదు. కాని అభిప్రాయము స్పష్టము. అయినను షరతుతో కూడినది. ఆ షరతు పాటింపబడలేదు. శాపమును ఫలించలేదు. బహుశా కౌసల్యకు శాపమిచ్చు నధికారము లేదనుకొనవలెను. లేదా పుత్రవియోగ మసహ్యమై ఆమె శాపతుల్యములైన యీ కఠినోక్తులు పలికి, తన మనోగతము వెల్లడించె నని యెంచవలెను.

## 20. దశరథుడు > కైక, భరతుడు — అయోధ్యాకాండ 42

అరణ్యమున కేగుచున్న రాముని రథధూళి ఎంతవరకు కనిపించుచుండెనో అంతవరకు దశరథుడు తన చూపు లా వంకనుండి మరల్చలేదు. తరువాత నత డత్యంతదుఃఖితుడై విషాదభారమున మూర్ఛిల్లెను. ఆ సమయమున నతనికి చేయూత నొసగి తోడ్పడుటకై కౌసల్య కుడిప్రక్కను కైక ఎడమప్రక్కను పట్టి నిలిచిరి.

కనులు తెరచిన రాజు కైకేయిని చూచి వ్యథితుడై ఇట్లు పలికెను-

*కైకేయి మామకాంగాని మా స్ప్రాక్షీః పాపనిశ్చయే,*
*న హి త్వాం ద్రష్టుమిచ్ఛామి న భార్యా న చ బాంధవీ. 6*

*యే చ త్వామనుజీవంతి నాహం తేషాం న తే మమ,*
*కేవలార్థపరాం హి త్వాం త్యక్తధర్మాం త్యజామ్యహమ్. 7*

*అగృహ్ణాం యచ్చ తే పాణిమగ్నిం పర్యణయం చ యత్,*
*అనుజానామి తత్సర్వమస్మిన్ లోకే పరత్ర చ.* 8

*భరతశ్చేత్ప్రతీతః స్యాద్రాజ్యం ప్రాప్యైతదవ్యయమ్,*
*యన్మే స దద్యాత్ పిత్రర్థం మా మాం తద్దత్తమాగమత్.* 9

'ఓసీ పాపబుద్ధీ, కైకేయీ! నీవు నా శరీరము ముట్టకుము. నేను నిన్ను చూడదలంచను. నీవు నా భార్యవు కావు. బంధువు కూడ కావు. నీ ఆశ్రయములో జీవించుచున్నవారికి నేను ప్రభువును కాను. వారు నా పరిజనులు కారు. నీవు కేవలము ధనము కోరినదానవై ధర్మము విడిచితివి. అందుచే నేను నిన్ను విడుచుచుంటిని. నేను నీ పాణిగ్రహణ మొనరించి, అగ్నిప్రదక్షిణములు చేసి నెలకొల్పిన బంధమంతయు ఈ లోకముపరకే కాదు; ఇటు పైన ఇక్కడగాని, పరలోకమున గాని నా కా సంబంధము వలదు. విడిచిపెట్టుచున్నాను. నీ కొడుకు భరతుడు నిర్విఘ్నముగా నిక ఈ రాజ్యమందుకొని సంతోషించెనా, అతడు నాకు శ్రాద్ధక్రియలు చేసి పిండోదకములు విడువరాదు. అవి నాకు చెందవు'.

దశరథుని ఈ మాటలను వాల్మీకి శాపము అని పేర్కొనలేదు. కాని ఇవి శాపవచనములే. మహాదేవుని ఆజ్ఞపై స్వర్గమునుండి విమానముపై వచ్చి, రామలక్ష్మణులను కలిసినప్పుడు, దశరథునితో రాముడు పలికిన మాటలలో, ఇవి శాపములనియే పేర్కొనబడినవి.

యుద్ధకాండ 119

*కురు ప్రసాదం ధర్మజ్ఞ కైకేయ్యా భరతస్య చ.* 25

*సపుత్రాం త్వాం త్యజామీతి యదుక్తా కేకయీ త్వయా,*
*స శాపః కేకయీం ఘోరః సపుత్రాం న స్పృశేత్ ప్రభో.* 26

'ధర్మజ్ఞుడవగు ప్రభూ! కైకేయీభరతులయెడ ప్రసన్నుడ వగుము. వారిని కరుణింపుము. నిన్ను పుత్రసహితముగా విడిచిపెట్టుచుంటి నని కైకేయి కిచ్చిన మీ శాపము వారికి చెందకుండుగాక.'

దశరథు డీ ప్రార్థన మంగీకరించెను. ఈ శాపము నియమాంచితము.

## 21. మునికుమారుడు > దశరథుడు అయోధ్యాకాండ 63

సీతాలక్ష్మణసహితుడై రాముడు వనమున కరిగిన పిదప దుఃఖపీడితుడైన దశరథుడు కౌసల్యతో తన పూర్వజీవితములోని వృత్తాంత మొకటి ఈ విధముగా చెప్పెను.

వృద్ధులైన తన తల్లిదండ్రులకు నీరు తేదలచి మునికుమారు డొకడు నదీతటమునకు వచ్చెను. నీటిలో ఘటమును ముంచుచున్నపుడు పుట్టిన శబ్దమును విని దశరథుడు ఏను గేదో వచ్చి తొండముతో నీరు గ్రహించుచున్నట్లు భావించెను. ఆ శబ్దమును లక్ష్యించి అతడు వెంటనే బాణము విడిచెను. అది ఆ మునికుమారునికి తగిలి ప్రాణాంతకమైన వేదన కలిగించెను. అతని ఆర్తస్వరము విని దశరథుడు చెంత కేగెను. మునికుమారుడు నేలబడి గిలగిల కొట్టుకొనుచుండెను. అత డట్లుండియు రాజును చూచి యిట్లనెను- 'నా తల్లిదండ్రులు దప్పిగొని, ఎంతగానో నా కొరకు కెదురుచూచుచుందురు. కనుక వారికి వేగముగా నీ వీ నీ రందింపుము. పిమ్మట నే నిట్లు మృత్యుముఖమున పడియుంటినని తెలుపుము. ఈ సమాచారము నీవు స్వయముగా చెప్పనిచో, ప్రజ్వలించుచున్న అగ్ని వనము నెట్లు దహించివేయునో అట్లే వారి క్రోధాగ్ని నిన్ను దహించి భస్మము చేయును.' ఇట్లు చెప్పి తన తల్లిదండ్రులున్న ఆశ్రమమునకు త్రోవ నెరిగించి అత డిట్లనెను-

*తం ప్రసాదయ గత్వా త్వం న త్వా సంకుపితః శపేత్.* 45

'నీవు పోయి మా తండ్రిని ప్రసన్నుని చేసికొనుము. లేనిచో అతడు కుపితుడై నిన్ను శపించును.' ఇట్లు చెప్పిన పిదప దశరథు డా కుమారుని శరీరమున గ్రుచ్చుకొనిన బాణమును వెలికిదీసెను. కొద్దిసమయమున నా మునికుమారుడు ప్రాణములు విడిచెను.

ఇక్కడ ప్రత్యక్షముగా శాప మీయబడలేదు. కాని శాపభీతి కలిగెను. కనుక శాపస్వరూపము తెలియరాలేదు. ఈ శాపము నియమాంచితము..

## 22. శ్రవణముని > దశరథమహారాజు అయోధ్యాకాండ 64

దశరథుడు కౌసల్యతో మునికుమారుని వధానంతరవృత్తాంతము చెప్పుచున్నాడు.

మునికుమారుని వచనములపై దశరథుడు అతని తల్లిదండ్రులున్న ఆశ్రమమున కేగెను. మిక్కిలి దుఃఖముతో అతడు వారికి జరిగినదంతయు చెప్పి వినిపించెను. తమ ఏకైకపుత్రుని మరణవార్త విని ఆ వృద్ధులు మూర్ఛిల్లిరి. తర్వాత మహాతేజస్వి యైన ఆ ముని రాజుతో నిట్లనెను - 'రాజా, నీవు చేసిన యీ పాపకృత్యమును నీవే వచ్చి ఎరిగింపకున్నచో నీ శిర మీపాటికి వేయి ముక్కలై యుండును. క్షత్రియుడు తెలిసి తెలిసి, అందును వానప్రస్థులను వధించినచో, అతడు వజ్రధారియైన ఇంద్రుడైననూ సరే, స్థానభ్రష్టు డగును. తపోవ్రతమున నున్న బ్రహ్మవాదియైన మునిపై బాణము నెరిగి ప్రయోగించినవాని తల ఏడు ప్రక్కలై పడును. కాని నీవు ఎరుగకయే ఈ పాపకృత్య మాచరించితివి. కనుకనే నీ వింకను జీవించియుంటివి. తెలిసి చేసితివా, యీ పాటికి మీ రఘువంశమే నాశమై యుండును. నీ వొక్కడవే కాదు' ఆ పిదప తిరిగి అత డిట్లు పల్కెను. 'మమ్మిద్దరిని, మా కుమారుడు పడియున్నచోటికి తీసికొని పొమ్ము.' దశరథు డట్లు చేయగా, కుమారుని శరీరస్పర్శచేసి ఆ ముని దారుణముగా శోకించెను. అతని గుణగణములు తలచి కరుణాభరితముగా విలపించెను. తర్వాత పత్నీసహితముగా అతడు మునికుమారునికి జలాంజలి యిచ్చి, దశరథునికి నమస్కరించి యిట్లనెను- 'రాజా, నీవు నన్నుకూడ నేడు చంపివేయుము. నాకున్న దీ కొడు కొక్కడే. వానిని బాణముతో కొట్టి నీవు నన్ను పుత్రహీనుని జేసితివి. ఇప్పుడు నాకు మరణము కష్టముకాదు. నీ వెరుగక నా పుత్రుని వంపినావు. కనుక నేను నీ కత్యంతభయానకము, దుఃఖదాయకమును అగు శాప మిచ్చుచున్నాను-

*పుత్రవ్యసనజం దుఃఖం యదేతన్మమ సాంప్రతమ్,*
*ఏవం త్వం పుత్రశోకేన రాజన్ కాలం కరిష్యసి.* 54

*అజ్ఞానాత్తు హతో యస్మాత్ క్షత్రియేణ త్వయా మునిః,*
*తస్మాత్ త్వాం నావిశత్యాశు బ్రహ్మహత్యా నరాధిప.* 55

*త్వామప్యేతాదృశో భావః క్షిప్రమేవ గమిష్యతి,*
*జీవితాంతకరో ఘోరో దాతారమివ దక్షిణామ్.* 56

*ఏవం శాపం మయి న్యస్య విలప్య కరుణం బహు,*
*చితామారోప్య దేహం తన్మిథునం స్వర్గమభ్యయాత్.* 57

'రాజా, నా కీ సమయమున నెట్టి పుత్రవియోగకష్టము కలిగినదో, అట్టిదే నీకును కలుగును. నీవు కూడ పుత్రశోకముచే కాలపాశవశుడ వగుదువు. క్షత్రియుడవై, తెలియక, నీవు వైశ్యజాతివాడైన యీ ముని కుమారుని వధించితివి. అందువలన వెంటనే నీకు బ్రహ్మహత్యాపాప మంటదు. కాని శీఘ్రముగనే నీ కిట్టి ప్రాణాంతకారిణియైన స్థితి సమకూరగలదు. దక్షిణ యిచ్చిన దాతకు తదనురూపమగు ఫలము వలెనే నీ కిది ప్రాప్తమగును. ఇట్లు శపించి, చిరకాలము విలపించి, ఆ వృద్ధదంపతులు చితాగ్నిలో బడి స్వర్గమేగిరి.

దశరథుడు అజ్ఞానముచే మునికుమారుని వధించెను. అందువలన శాపము కొంత సౌమ్యరూపమున నుండెను. కాని తెలిసి తెలిసి ఈ ఘోర మొనర్చినచో శాపఫల మత్యంతఘోరముగ నుండెడిదని స్పష్టముగా చెప్పబడెను.

## 23. భరతుడు > కైకేయి అయోధ్యాకాండ 74

భరతుడు కైకేయిని నిందించుచున్నాడు.

కైకేయి దశరథుని వరము లడిగి రాము నడవి కంపెను. ప్రియపుత్రుని వియోగముచే నత్యంతశోకాకులమానసుడై దశరథుడు ప్రాణములు విడిచెను.

ఈ విషయమంతయు తెలిసి భరతుడు మిక్కిలి దుఃఖించెను. కైకయే యీ విపత్తి కంతటికి కారణమని తెలిసి అతడు మరింతగా శోకాకులు డాయెను. "నీ మూలముగా మా తండ్రి గతించెను. శ్రీరాముని కరణ్యావాసము ప్రాప్తించెను, నా కీ లోకమున అపకీర్తి నెలకొనెను. నీవు మాతృరూపమున నున్న నా శత్రువవు. కులఘాతిని యగు రక్కసివి. నీవు ధర్మాత్ముడును, ధీశాలియునైన అశ్వపతి కుమార్తెవు కావు! అని ఏకపుత్రవతి యగు కౌసల్యకు దాపురించిన పుత్రవియోగదుఃఖమునుగూర్చి చెప్పుచూ భరతుడు కైకకు కామధేనువు కథ వినిపించి ఆమె నెంతగనో నిందించెను. పైగా 'నీవు మండుచున్న అగ్నిలో నురుకుము, లేదా స్వయముగా దండకావన మరుగుము, లేదా కంఠమున కురిబోసుకొని మరణింపుము' అని కూడ పల్కెను.

*భ్రూణహత్యామసి ప్రాప్తా కులస్యాస్య వినాశనాత్,*
*కైకేయి నరకం గచ్ఛ మా చ తాతసలోకతామ్.* 4

'కులవినాశన మొనర్చి నీవు భ్రూణహత్యాపాపము కూడ నెత్తి కెత్తుకుంటివి. నీవు నరకమునకు పొమ్ము. మాతండ్రిగారు పొందిన లోకము నీ కెన్నడును లభింపదు.'

*ఏకపుత్రా చ సాధ్వీ చ వివత్సేయం త్వయా కృతా,*
*తస్మాత్ త్వం సతతం దుఃఖం ప్రేత్య చేహ చ లప్స్యసే.* 29

ఏకపుత్రవతియు, మహాసాధ్వియు నైన కౌసల్యకు నీవు పుత్రవియోగము కలిగించితివి. ఆ కారణమున నీ కీ లోకమున పరలోకమునను కూడ దుఃఖమే ప్రాప్తించును.

భరతుని యీ మాటలు శాపములవలె నున్నవి. కాని ఇవి మహోగ్రసంతాపమునే వ్యక్తము చేయుచున్నవి. శాపములు కావు. అదియును కాక, భరతునికి శాపమివ్వగల శక్తి ఎట్లు కల్గెను.? ఎప్పుడు కలిగెను? అను ప్రశ్న ఉండనే ఉన్నది.

## 24. వైశ్రవణుడు (కుబేరుడు) > తుంబురుడు (విరాధుడు)

అరణ్యకాండ 4

మరణించుటకు పూర్వము విరాధుడు రామునకు తన పూర్వవృత్తాంత మును చెప్పెను.

దండకారణ్యమున సంచరించుచున్న రామలక్ష్మణులను, సీతను చూచి పర్వతాకృతి గల్గి నరభక్షకుడై తిరుగు విరాధరాక్షసుడు మిగుల కోపఘూర్ణితు డయ్యెను. వా డుచ్చైఃస్వరమున భయంకరముగా గర్జించుచూ పరుగిడుచు వచ్చి ఉన్మత్తుడై రామునితో నిట్లనెను- 'నేను విరాధు డను పేరుగల రాక్షసుడను. ప్రతిదినమును ఋషీశ్వరులను చంపి తినుచు నే నీ దుర్గమారణ్యమున తిరుగుచుందును. ఈ స్త్రీ చాల చక్కనిది. కనుక నాకు భార్య కాగలదు. పాపాత్ములైన మీ యిరువురిని చంపి నేను రక్తపాన మొనర్తును.' అని పలికి అతడు సీత నవలీలగా చంకనెత్తుకొని కొంత దూర మేగి నిలిచెను. సీతను వేరొకడు గ్రహించుట కన్న అధికమగు దుఃఖము రామున కింకొకటి లేదు. విరాధుని మాటలు వినిన రాముని నేత్రములు క్రోధారుణితములైనవి. బ్రహ్మ యిచ్చిన వరమువలన విరాధుడు ఖండింపబడడు, చీల్చబడడు. వాడు

రామలక్ష్మణుల పరిచయ మడిగి తెలిసికొన్న పిదప కూడ శూలహస్తుడై వారి నెదిరించెను.

రాముడు రెండు బాణములతో వాని శూలమును ఖండించెను. తర్వాత రామలక్ష్మణుల బాణములచే అత్యధికముగా పీడింపబడి వా డా యిరువురిని తన భుజములపై నిలిపి వేరొకచోటికి పోదొడగెను. అది చూచి సీత మిక్కిలి భయాక్రాంతయై ఆక్రోశించుచుండెను. రామలక్ష్మణు లా రాక్షసుని రెండు బాహువులను ఖండించిరి. తర్వాత వానిని భుజములతోను, మోకాళ్లతోను, మోది బాధించుచూ, మీదికెత్తి విసరుచూ, నేల రాపాడజేయుచూ నొప్పించిరి. కాని వాడు చావలేదు. అప్పుడు రాముడు లక్ష్మణునితో ఒక పెద్ద గోయి త్రవ్వమనెను. తాను స్వయముగా ఒక కాలితో విరాధుని పీకనొక్కుచు నిలబడెను. అప్పు డా రాక్షసుడు శ్రీరామునితో నిట్లనెను - 'నరశ్రేష్ఠా! మోహవశమున నేను నిన్ను ముందుగా ఎరుగలేకపోయితిని. నీవలన కౌసల్య సుప్రజ యైనది. నాకు నీవు శ్రీరాముడ వని తెలిసెను. ఈమె విదేహరాజనందిని సీత. ఇతడు నీ తమ్ముడు లక్ష్మణుడు! ఇట్లు పలికి ఆ మీద అతడు తన పూర్వవృత్తాంతము రామునితో నిట్లు చెప్పెను-

*అభిశాపాదహం ఘోరాం ప్రవిష్టో రాక్షసీం తనుమ్,*
*తుంబురుర్నామ గంధర్వః శప్తో వైశ్రవణేన హి.* 16

*ప్రసాద్యమానశ్చ మయా సోఽబ్రవీన్మాం మహాయశాః,*
*యదా దాశరథీ రామస్త్వాం వధిష్యతి సంయుగే.* 17

*తదా ప్రకృతిమాపన్నో భవాన్ స్వర్గం గమిష్యతి.*
*అనుపస్థీయమానో మాం స క్రుద్ధో వ్యాజహార హ.* 18

*ఇతి వైశ్రవణో రాజా రంభాసక్త మువాచ హ,*
*తవ ప్రసాదాన్ముక్తో ఽహమభిశాపాత్ సుదారుణాత్.* 19

"నాకు శాపమువలన ఈ భయంకరమైన రాక్షసరూపు కలిగినది. నేను తుంబురు డను గంధర్వుడను. కుబేరుడు నన్నిట్లు శపించెను. నే నతనిని ప్రార్థింపగా అత డిట్లు చెప్పెను- 'దశరథరాజపుత్రుడైన రాముడు యుద్ధములో నిన్ను వధించును. అప్పుడు తిరిగి నీకు నీ పూర్వరూపము లభించి నీవు స్వర్గలోక మరిగెదవు. నేను రంభయం దాసక్తుడనై ఒకనాడు సమయమునకు

రాజసేవ కేగలేదు. అందుపై కోపించి రాజు (కుబేరుడు) నన్నిట్లు శపించెను. కాని నా ప్రార్థనపై శాపావధి వచించెను. 'రఘువీరా, నేడు నీ దయచే నాకు శాపవిముక్తి కల్గినది.'

ఈ శాపశాంతి యాచితము.

## 25. (దండకవనవాసులైన) మునులు > (అచ్చటి) రాక్షసులు
అరణ్యకాండ 10

దండకారణ్యమున వసించుచున్న సమయమున శ్రీరాముడు రాక్షస సంహారమునకు నిశ్చయించుట సీతకు నచ్చలేదు. ఆమె తన మతము రామునకు స్పష్టముగా నెరిగించెను. 'శస్త్రధారణ మేమి, వనవాసమేమి? మన మిప్పుడు తపోవనములో వసించుచున్నాము కనుక ఇక్కడ అహింసావ్రతమే మన ధర్మము'. ఈ మాటలకు శ్రీరాము డిట్లు బదులు చెప్పెను-

శ్రీరాముడు జన్మతః క్షత్రియుడు, అయినను పరిస్థితివశమున నతడు వల్కలములు ధరించెను. అట్లే మునివృత్తి నవలంబించి వనములో నుండెను.అట్టిచో శస్త్రధారణము ఆత్మరక్షకైనను, మునిరక్షణకైనను అనుచిత మనియే సీత భావము. 'శస్త్రధారణము శస్త్రధారి మనసును వికృత మొనర్చును.' అని ఆమె ఒక కథ చెప్పెను. పూర్వ మొకప్పు డొక మునీశ్వరునకు దేవేంద్రు డొక ఖడ్గమును దాచుమని యిచ్చెను. అతడు దానిని నిత్యము తనతోడనే యుంచుకొనుచూ వచ్చి చివరకు క్రూరకర్ము డయ్యెను. కనుక రాముని కీ రాక్షసవధ నిశ్చయముగా తగదని ఆమె చెప్పెను. అంతయూ విని రాము డిట్లనెను- 'క్షత్రియుల కులధర్మ మెరిగి నీవు చెప్పినదంతయు నా హితమెంచియే అనుట తథ్యము. క్షత్రియుడు శస్త్రధారణము చేయుట దుఃఖితుల దుఃఖమును తొలగించుటకు. ఈ దండకావనములో కఠోరతపోవ్రతనిష్ఠులై యుండి, రాక్షసులచే చంపబడుచున్న మునులు నాపద్దకు వచ్చి రక్షింపుమని కోరిరి. వారిమాట నేనెటులు కాదనగలను? బ్రాహ్మణరక్షణము క్షత్రియులకు పరమధర్మము. వారే స్వయముగా వచ్చి రక్షింపుమని కోరుచున్నప్పుడు, కాదనుట క్షత్రియుడనైన నాకు సిగ్గుచేటు. కామరూపులైన రాక్షసులచే వా రెంతగానో బాధింపబడుచున్నారు. అగ్నిహోత్రము నిర్వర్తించునపుడు, పర్వకాలపు అవసరములందు, ఈ మాంసాశనులు వారి నణచివేయుచున్నారు. ఈ మునులు నేను వారిని రక్షింపగలనని

నమ్ముచున్నారు.

*కామం తపఃప్రభావేణ శక్తా హంతుం నిశాచరాన్.* 13

*చిరార్జితం న చేచ్ఛామస్తపః ఖండయితుం వయమ్,*
*బహువిఘ్నం తపో నిత్యం దుశ్చరం చైవ రాఘవ.* 14

*తేన శాపం న ముంచామో భక్ష్యమాణాశ్చ రాక్షసైః.* 15

'మేము మా తపోబలమున ఈ కామరూపులైన రాక్షసులను (శపించి) నివారింపగలము. కాని చిరకాలార్జితమైన తపఃశక్తి నావిధముగా వెచ్చించుట కిష్టపడము. తపఃశక్తిసంపాదన మత్యంతకఠినము, అందుచే రాక్షసులచేత భక్షింపబడుచున్నను మేము వారిని శపింపకున్నాము.'

ఇదంతయు చెప్పి రాముడు సీతను సమాధానపరచి మునిరక్షణకు ప్రతిజ్ఞ పూని నెరవేర్చెను.

ఇక్కడ ప్రత్యక్షరూపమున శాప మీయబడలేదు. శక్తి కలిగియు మునులు శాప మీయలేదు. కాని ఆ శాపమెట్టిదో స్పష్టము కాలేదు.

## 26. (సంన్యాసిరూపమున) రావణుడు > సీత అరణ్యకాండ 47

సీతకోర్కె నెరిగి, దానిని తీర్చుటకై శ్రీరాముడు స్వర్ణమృగము వెంట నడవిలోనికి పోయెను. పోవుచున్నప్పుడు లక్ష్మణునితో ఆశ్రమములో నుండి సీతారక్షణమున నేమరక రాక్షసుల నొక కంట కనిపెట్టియుండవలెనని చెప్పెను. మారీచుడు శ్రీరాముని కంఠస్వరమును పోలిన స్వరముతో 'హా సీతా, హా లక్ష్మణా' అని అరచెను. ఆ ఆర్తస్వరము విని సీత భయార్తయై లక్ష్మణునితో- 'నీవు వేగముగా పోయి మీ అన్నను రక్షింపుము' అని పలికెను. కాని లక్ష్మణు డామె కెంతగనో ధైర్యము చెప్పుచు, 'నాగాసుర గంధర్వదేవదానవరాక్షసాదులెవరును అందరూ కలిసియైనను రాముని కపాయ మొనర్పజాలరని చెప్పి, ఆమె నిశ్చింతగా నుండదగు' నని పల్కెను. కాని ఆమె కీ మాటలు సంతృప్తి నీయలేదు. పైగా కోపము కలిగించెను. ఆమె లక్ష్మణుని శీలమునే శంకించి నిందించినది. లక్ష్మణు డా మాటలు విని దుఃఖించి రాముని యాజ్ఞ మీరి, సీతను ఒంటరిగా విడిచి పోవజాలకున్నను, ఆమె మరల నిందించి పల్కుటచే విధిలేక ఆమెను విడిచి రామునికడ

కరిగెను. ఇప్పుడు రావణునకు చక్కని అవకాశము లభించెను. సీత నపహరించు ఉద్దేశ్యముతో నతడు వచ్చెను. బ్రాహ్మణవేషము ధరించిన రావణుని నిజరూపము సీత గుర్తింపలేకపోయెను. ఆమె అతనికి ఆసనార్ఘ్యపాద్యాదులిచ్చి అభ్యాగత సత్కార మొనర్చెను.

*బ్రాహ్మణశ్చాతిథిశ్చాయ మనుక్తో హి శపేత మామ్. 2*

'బ్రాహ్మణుడు, నతిథియైన ఈతడు తన మాటలకు బదులివ్వకున్నచో నన్ను శపించును' అని ఆమె తలచెను. ప్రత్యక్షముగా శాప మివ్వబడలేదు. శాప మిచ్చునేమో యను భయము వ్యక్తము చేయబడెను. కాన ఈ శాపస్వరూప మెట్టిదో తెలియదు.

## 27. శ్రీరాముడు > ప్రసవణగిరి, గోదావరి     అరణ్యకాండ 64

రామలక్ష్మణులు సీతను వెదకుచుండిరి. వారి కా మార్గమున నెన్నో నదులు, వనములు, పర్వతములు నెదురైనవి. వారు గోదావరీనదిని 'సీత ఎక్కడున్నది?' అని అడిగిరి. నది బదు లియ్యలేదు. రాముడు వనచారి మృగములను చూచి, సీత ఎక్కడున్నదో చెప్పుడని అడిగెను. అప్పుడవి మీదికి చూచుచూ, ఆకసమున లక్ష్యముంచి దక్షిణదిశగా పర్వెత్తెను. అది చూచి సీత ఆకాశమార్గమున దక్షిణదిశగా పోయియుండు నని లక్ష్మణుడు భావించెను. అత డా దిశగా నడువ జొచ్చెను. మరికొంత ముందుకు పోగా వారి కక్కడ నేలపై విరజల్లిన పూలు కన్పించెను. రాము డా పుప్పులు చూచి గుర్తించెను. అవి వనములో కోసి రాముడు స్వయముగా సీతకిచ్చిన పువ్వులు. వాటి నామె జడలో ధరించెను. అప్పుడతడు ప్రస్రవణగిరి చెంత కరిగి 'సీత ఎక్కడున్నది?' అని అడిగెను. బదులు లేక పోవుసరికి రాముడు కోపించి గర్జించుచూ 'నీ శిఖరములను నేల గూల్చెదను. స్వర్ణకాంతి గల సీత ఎక్కడున్నదో చెప్పుము' అని అరచెను. అంతతో ఆ పర్వతము సీతను చూపించుచున్నట్లుగా కొన్ని చిహ్నములు ప్రకటించెను. కాని సీతను చూపలేకపోయెను. అప్పుడు రాముడా పర్వతముతో నిట్లనెను-

*మమ బాణాగ్నినిర్దగ్ధో భస్మీభూతో భవిష్యసి,*
*అసేవ్యః సర్వతశ్చైవ నిస్తృణద్రుమపల్లవః. 33*

'నీవు నా బాణాగ్నిలో కాలి బూడిద వగుదువు. నీ యందున్న ఈ తృణవృక్షపల్లవాదులన్నియు నశింపగా నీ వన్ని విధముల సేవింపదగకుందువు.' తర్వాత అతడు లక్ష్మణునితో నిట్లనెను-

*ఇమాం వా సరితం చాద్య శోషయిష్యామి లక్ష్మణ.* 34

*యది నాఖ్యాతి మే సీతామద్య చంద్రనిభాననామ్.* 35

'చంద్రముఖియైన నా సీతను గూర్చి చెప్పకున్నచో నే నిప్పు డీ నదిని శుష్కింపజేయుదును.'

ఈ శాపము నియమాంచితము.

28. స్థూలశిరుడు > కబంధుడు అరణ్యకాండ 71

కబంధుడు రామునికి తన పూర్వవృత్తాంతము చెప్పుచున్నాడు.

'సూర్యుడు, చంద్రుడు, దేవేంద్రాదుల శరీరము లెంత తేజోవంతములో నా శరీర మంత తేజోవంతమై యుండెడిది. అట్లయ్యును నేను జనులకు భీతిగొల్పు భయంకరాకృతితో రాక్షసరూపము దాల్చి వనసంచారులగు ఋషులను భయపెట్టుచుండెడివాడను. ఒకనాడు స్థూలశిరు డను ముని నిట్లే బెదిరింప బోయితిని. అప్పు డాయన వనములో పండ్లు, పూవులు కోసి సంగ్రహించుచుండెను.

*తేనాహముక్తః ప్రేక్ష్యైవం ఘోరశాపాభిధాయినా.* 4

*ఏతదేవం నృశంసం తే రూపమస్తు విగర్హితమ్,*
*స మయా యాచితః క్రుద్ధః శాపస్యాంతో భవేదితి.* 5

*అభిశాపకృతస్యేతి తేనేదం భాషితం వచః,*
*యదా ఛిత్త్వా భుజౌ రామస్త్వాం దహేద్విజనే వనే.* 6

*తదా త్వం ప్రాప్స్యసే రూపం స్వమేవ విపులం శుభమ్.* 7

న న్నీ వికృతరూపముతో నుండగా చూచి, కోపించి, ఆ ముని నన్ను ఘోరముగా శపించుచు 'నేటినుండి నీ కిదే క్రూరరూపము స్థిరమగును' అని పలికెను. ఆపైన నే నతనిని ప్రార్థించి అపచారమూలకశాపమునకు శాంతి నెరిగింపకోరితిని. దాని కతడు బదులిచ్చుచూ 'రాముడు (లక్ష్మణుడును) నీ

బాహువులు ఖండించి నిన్ను దహించిన పిదప నీకు తిరిగి పూర్వపు శోభాసంపన్నమైన రూపము లభింపగలదు' అని చెప్పెను. ఈ విధముగా నేను నేడు నీచే శాపమోక్ష మందితిని.

## 29. ఇంద్రుడు > కబంధుడు అరణ్యకాండ 71

రామునితో కబంధుడు తనకు దేవేంద్రు డిచ్చిన శాపమును గూర్చి చెప్పుచున్నాడు. 'నేను రాక్షసుడ నగుటకు పూర్వము తీవ్ర తపస్సు చేసి బ్రహ్మను మెప్పించితిని. అతడు నాకు దీర్ఘాయుపు వరముగా నిచ్చెను. దానితో నాకు బుద్ధిభ్రమయు, నహంకృతియు కలిగి, యింతగా దీర్ఘాయువు గడించిన నన్ను ఇంద్రు డేమి చేయగలడు?' అను భావన యేర్పడినది. ఈ భావము వహించి నే నొకనాడు దేవేంద్రు నెదిరించి యుద్ధము చేసితిని. అప్పు డింద్రుడు నాపై సహస్రధారాపూర్ణమైన వజ్రాయుధమును ప్రయోగించెను. ఆ వజ్రాఘాతముచే నా తొడలు విరిగినవి. శిరస్సు కుక్షిలో దిగబడిపోయినది. ఆ మీద నేనెంతో వేడుకొనగా అతడు నన్ను యమలోకమునకు పంపకుండా అనుగ్రహించి, 'బ్రహ్మ నీ కిచ్చిన దీర్ఘాయురూప వరము స్థిరమగు గాక' అని పల్కెను. నే నంతతో 'దేవరాజా, నీవు నా తొడలు, శిరస్సు, ముఖము మున్నగు వాని నన్నిటినీ భేదించితివి. ఇక నే నాహార మెట్లు గ్రహింతును? నిరాహారినై దీర్ఘకాలము జీవించియుండు టెట్లు?' అని పలికితిని. అప్పుడు-

*............శక్రో మే బాహూ యోజనమాయతౌ* 13

*తదా చాస్యం చ మే కుక్షౌ తీక్ష్ణదంష్ట్రమకల్పయత్,*
*సోఽహం భుజాభ్యాం దీర్ఘాభ్యాం సంక్షిప్యాస్మిన్వనేచరాన్.* 14

*సింహద్విపమృగవ్యాఘ్రాన్ భక్షయామి సమంతతః,*
*స తు మామబ్రవీదింద్రో యదా రామః సలక్ష్మణః.* 15

*ఛేత్స్యతే సమరే బాహూ తదా స్వర్గం గమిష్యసి.* 16

'ఇంద్రుడు నా భుజములను యోజనము పొడవుగా చేసి, నా కడుపులో తీక్ష్ణదంష్ట్రయుక్తమైన నో రేర్పరిచెను. ఇట్లు విశాలబాహువునై నేను వనచారులైన సింహవ్యాఘ్రద్విపమృగాదులను పట్టి భుజించుచున్నాను. ఇంద్రుడు నాతో 'రామలక్ష్మణులు నీ భుజములు ఖండింతురు. అప్పుడు నీవు

తిరిగి స్వర్గము చేరుకొందువు' అని చెప్పెను. నే నిక్కడ పడియుండి వనములో కనిపించిన వన్నిటిని గ్రహించుచుంటిని. ఇంద్రుడును, మునియు చెప్పిన మాటలవలన నేను శ్రీరాముని తప్పక తెలిసికొనగలనను విశ్వాసముతో నుంటిని. ఇప్పుడు నీవు రాముడవని తెలిసి సంతసించుచున్నాను.' ఇట్లు చెప్పి అతడు సూర్యాస్తమయమునకు ముందుగనే తన శరీరమును దహించి శాస్త్రీయవిధి ననుసరించి సంస్కరింపుమనియు, అట్లైనచో తనకు తన పూర్వరూపము తిరిగి లభించుననియు చెప్పెను. 'దహనసంస్కారమైన పిదప నా పూర్వరూప మంది నేను మీకొక మంచి మిత్రు నెరిగించెదను. అతడు మీకు సహాయకారి యగును. నేను మీచే తప్పు మరెవరిచేతను చంపబడజాలను. కనుక నన్ను చంపి ఉద్ధరింపుము'. అని రామునికి చెప్పెను.

ఇంద్రుడు కబంధుని శరీరమును వికృతమొనర్చెను. అది వజ్రప్రహారఫలము. శాపఫలము కాదు. కనుక దీనిని శాప మనరాదు. ఇంద్రుని శాపవచనములు తెలియవు. కాని శాపమోక్షము స్పష్టముగా చెప్పబడినది.

## 30. ? >' దనువు కిష్కింధాకాండ 4

రామలక్ష్మణులను కలిసిన పిదప హనుమంతునికి వారి సహాయమున సుగ్రీవునకు రాజ్యప్రాప్తి యగునను విశ్వాసము జనించెను. వారితో చెలిమి చేయుట సముచితమని అతడు భావించెను. అతడు రామునితో- 'తమ్మునితో కలిసి ఈ దుర్గమారణ్యములలో, క్రూరమృగములు సంచరించుచోట, ఏ కారణమున తిరుగుచున్నావని అడుగగా రాము డతనికి లక్ష్మణునిచే బదులు చెప్పించెను. లక్ష్మణుడు 'మేము మహావ్రతాపుడైన దశరథమహారాజు పుత్రులము. ధర్మానుగాములమై యిచట సంచరించుచున్నాము' అని చెప్పి, పిదప హనుమంతునితో నతడు రామునికి వనవాసకారణమాదిగా గల సమస్త వృత్తాంతమును వినిపించెను. తిరిగి అతడు 'మా అన్నగారి భార్య నొక కామరూపి యగు రాక్షసు డపహరించెను. ఆ రాక్షసు డెవరని కాని అత డెక్క డుండునని కాని మాకు స్పష్టముగా తెలియదు. మేము సీతను వెదకుచూ ఇచటకు వచ్చితిమి.

*దనుర్నామ దితేః పుత్రః శాపాద్రాక్షసతాం గతః,*
*ఆఖ్యాతస్తేన సుగ్రీవః సమర్థో వానరాధిపః.* 15

న జ్ఞాస్యతి మహావీర్యస్తవ భార్యాపహారిణమ్,
ఏవముక్త్వా దనుః స్వర్గం భ్రాజమానో దివం గతః. 16

'దను అను దైతేయు డొకడు శాపకారణమున రాక్షసుడయ్యెను. అతడు సుగ్రీవుని పేరు చెప్పి, అతడు సమర్థుడైన వీరుడనియు, అతనివలన సీతాపహర్తయైన రాక్షసుని గుర్తింపనగు ననియు చెప్పెను. ఈ విషయము మా కెరింగించి దనువు దివ్యతేజోవంతుడై స్వర్గమున కరిగెను.' అని లక్ష్మణుడు చెప్పెను.

ఇక్కడ శాప మెవ రిచ్చిరో, ఎందుకిచ్చిరో, శాపస్వరూప మెట్టిదో అను విషయము లేవియు స్పష్టముగా లేవు. కేవలము శాపము మాత్ర ముల్లేఖింపబడినది. (చూ. అరణ్య. 71)

## 31. మతంగముని > వాలి, వానరులు కిష్కింధాకాండ 11

సుగ్రీవుడు రామునికి వాలి బలపౌరుషధైర్యాదులను గూర్చి చెప్పుచున్నాడు.

వరములు గడించి, మదోన్మత్తుడైన దుందుభి యను రాక్షసునికి తన బలముపై విశేషమైన గర్వ ముదయించెను. వాడు కైలాసమంత ఎత్తైన శరీరము గలవాడు. వానికి వేయి ఏనుగుల బల ముండెను. వాడు తా నజేయుడ నని తలచెను. అట్లు తలచి వాడు సరిత్పతి యగు సముద్రుని యుద్ధమునకు పిలిచెను. సముద్రుడు తన అసమర్థత వెల్లడించి పర్వతరాజు హిమవంతుడు నీతో యుద్ధము చేయగలడని చెప్పెను. వా డంతట హిమవంతునితో పోరాడ నరుగగా, అతడు 'నాకు యుద్ధకౌశలము లేదు. నేను తపస్విజనుల నివాసస్థానము మాత్రమే. నీవు కిష్కింధ కరిగి మహాపరాక్రమశాలి యైన వాలి నెదిరింపుము. అతడు నీతో పోరగల సమర్థుడు' అని చెప్పెను. అది విని దుందుభి కిష్కింధాద్వారమునకు వచ్చి ఘోరముగా గర్జింపసాగెను. వాడు మహిషరూపము ధరించి వచ్చెను. చుట్టుప్రక్కలనున్న వృక్షములను నేలగూల్చుచు, భూమిని గిట్టలతో త్రవ్వుచు, మహాగర్వష్ఠియైన వాడు పురీద్వారమును కొమ్ములతో ఢీకొనుచుండెను. వాని గర్జన విని వాలి వానిని చూడవచ్చెను. వాని ఉన్మత్తప్రలాపము లన్నియు విని, వాలి వాని కొమ్ములు రెండును పట్టి యెత్తి గిరగిర త్రిప్పి వానిని నేలపై కొట్టి తన్ని, గుద్ది, శిలావృక్షాదులతో నొప్పించెను. తిరిగి వానిని నేలతో మోది, తన శరీరము క్రింద నణచివేసెను.

అంతతో ఆ రాక్షసుడు నలిగి ముద్దాయెను. వాని ముక్కున, నోట, చెవుల నుండి, శరీరమున గల సర్వరోమకూపములనుండియు రక్తము కారుచుండెను. చివరకు వాడు గతించగా వాలి వాని శరీరమును మీది కెత్తి ఒక యోజనము దూరము విసిరివేసెను. అట్లు విసరగా ఆ రాక్షసుని రక్తబిందువులు గాలిలో నెగిరి మతంగమునీశ్వరుని ఆశ్రమమున పడెను. ముని బయటకు వచ్చి చూడగా నతనికి పర్వతాకారుడై మహిషరూపమున చచ్చి పడియున్న రాక్షసుడు కనిపించెను. తపోబలమున సమస్తము తెలిసికొని ఆ ముని యిది వాలి యకృత్యమని గ్రహించి, ఈ విధముగా శపించెను-

*ఇహ తేనాప్రవేష్టవ్యం ప్రవిష్టస్య వధో భవేత్,*
*వనం మత్సంశ్రయం యేన దూషితం రుధిరస్రవైః.* 53

*క్షిపతా పాదపాశ్చేమే సంభగ్నాశ్చాసురీం తనుమ్,*
*సమంతా దాశ్రమం పూర్ణం యోజనం మామకం యది.* 54

*ఆగమిష్యతి దుర్బుద్ధిర్వ్యక్తం స న భవిష్యతి,*
*యే చాస్య సచివాః కేచిత్సంశ్రితా మామకం వనమ్.* 55

*న చ తైరిహ వస్తవ్యం శ్రుత్వా యాంతు యథాసుఖమ్,*
*తేఽపి వా యది తిష్ఠంతి శపిష్యే తానపి ధ్రువమ్.* 56

*వనేఽస్మిన్ మామకే నిత్యం పుత్రవత్పరిరక్షితే,*
*పత్రాంకురవినాశాయ ఫలమూలాభవాయ చ.* 57

*దివసశ్చాద్య మర్యాదా యం ద్రష్టా శ్వోఽస్మి వానరమ్,*
*బహువర్షసహస్రాణి స వై శైలో భవిష్యతి.* 58

'నా నివాసస్థానమైన యీ ఆశ్రమమును రక్తబిందువులు చల్లి అపవిత్రమొనర్చిన దెవడో, అతడీ వనమునకు రారాదు. వచ్చినచో తత్క్షణమే మరణించును. ఈ రాక్షసకళేబరము నిచ్చటకు విసిరి, యీ చెట్ల నిట్లు నాశమొనర్చిన ఆ దుర్బుద్ధి ఈ ఆశ్రమమునకు చుట్టును ఒక యోజనము వరకు గల నేలపై కాలిడరాదు. వచ్చెనా చచ్చిపడును. ఆ వాలి సచివులైన వారందరును ఇక మీద ఈ ఆశ్రమమును విడిచి పోవలెను. అట్లు పోనిచో వారికిని శాపమిచ్చెదను. ఈ వనము నాకు పుత్రప్రాయము, నాచే రక్షితము. ఇక్కడ పత్రాంకురములుగాని, ఫలమూలములు గాని నశింపజేయుచు నిచ్చట

నిల్చిన వారందరు నాచే శాప మందగలరు. ఈ దినము వా రిచ్చట తిరుగుటకు అంతిమదినము. ఈ దినము మాత్రము వారికి నే నవకాశమిచ్చుచున్నాను. రేపు నా కంటబడినవా రెవరైనను వెయ్యేండ్లవరకు శిలలై పడియుందురు.'

ఈ శాపము విని వాలి మతంగుని కడ కరిగి క్షమాభిక్ష వేడెను.కాని ఆ ముని చలింపలేదు. ఆ కారణమున వాలి యీ ఋష్యమూకప్రాంతమునకు రాడు.

కిష్కింధాకాండ 46

సుగ్రీవుని చంపుటకై వాలి వానిని వెన్నంటినపుడు సుగ్రీవు డాత్మరక్షార్థము నాల్గు దిక్కులకు పరుగెత్తి ఆశ్రయమునకై వెదకెను. హిమాలయము, మేరువు, ఉత్తరసముద్రముపర కేగినను వాలి అతనిని వెన్నాడెను. సుగ్రీవుడు శరణ్యా మేదో తెలియక ఉద్విగ్నుడై యుండగా హనుమంతు డతనికి మతంగుడు వాలిని శపించిన తీరు జ్ఞప్తిచేసెను.

*ఇదానీం మే స్మృతం రాజన్ యథా వాలీ హరీశ్వరః,*
*మతంగేన తదా శప్తో హ్యస్మిన్ ఆశ్రమమండలే.* 21

*ప్రవిశేద్యది వై వాలీ మూర్ధాఽస్య శతధా భవేత్.* 22

*తత్ర వాసః సుఖోఽస్మాకం నిరుద్విగ్నో భవిష్యతి.* 23

'రాజా! నా కిప్పుడు వెనుకటి సంఘటన జ్ఞప్తికి వచ్చుచున్నది. మతంగుడు వాలిని శపించుచు అత డీ చెంతకు వచ్చినచో, తల నూరు ప్రక్కలై మరణించునని పలికెను. కనుక మతంగాశ్రమములో నివసించుట మనకు శ్రేయస్కరము. అది మొదలు సుగ్రీవుడు ఋష్యమూకపర్వతముపై నిర్భయముగా నివసింపదొడగెను.

ఈ శాపము నియమాంచితము. నియమ ముల్లంఘించిన మాత్రమే శాపము ప్రభావము చూపును. లేనిచో లేదు.

32. కండుముని > వనము కిష్కింధాకాండ 48

తారాంగదాదులతో కలిసి హనుమంతుడు వింధ్యపర్వతము చేరి, అచ్చటి గుహలు, అడవులు, పర్వతశిఖరములు,నదులు, దుర్గమస్థానములు,

సరస్సులు, మహావృక్షములు, పొదలు మున్నగు స్థలములం దంతటను సీతను వెదకెను. కాని ఫలితము లేకపోయెను. అచ్చట గల నానావిధఫలములను భుజించుచు వారందరు వేరొకచోటి కేగిరి. ఆ చోట గల చెట్లు పత్రపుష్పఫలశూన్యములు. అచ్చటి నదులలో జలములు లేవు. అక్కడ మహిషమృగదంతివ్యాఘ్రాదులు గాని, పక్షులుగాని, వనచరులైనవా రెవరూగాని లేరు. పూర్వ మక్కడ కండుమహర్షి నివసించుచుండెడివాడు. అతని పుత్రుడు పదివర్షములు ప్రాయమువాడు మరణించెను. ఋషి కోపించి వనమునకు శాపమిచ్చెను.

> *తేన ధర్మాత్మనా శప్తం కృత్స్నం తత్ర మహద్వనమ్,* 14
> *అనరణ్యం దురాధర్షం మృగపక్షివివర్జితమ్.* 15

ధర్మాత్ముడైన ఆ మహర్షి ఆ వన మంతటినీ శపించినందున అక్కడ పశుపక్షులకు నివాసయోగ్యత లేక, అది ఆశ్రయహీనము దుర్గమమునై యుండెను.

హనుమదాదులు ఆ ప్రదేశమునందు కూడ శ్రద్ధతో సీతాన్వేషణము గావించిరి. ఆమె నపహరించిన రావణుని కూడ వెదకిరి. కాని ప్రయోజనము లేకపోయెను.

ఈ వన మేదో పేరు చెప్పబడలేదు.

### 33. ఋషి > పుంజికస్థల — కిష్కింధాకాండ 66

జాంబవంతుడు హనుమంతునికి అతని జన్మవృత్తాంతము చెప్పుచుండెను.

వానరరాజు కేసరి భార్య అంజన. ఆమె పూర్వజన్మమున పుంజికస్థల యను అప్సరస. ఆమె అతిలోకసుందరి.

> *విఖ్యాతా త్రిషు లోకేషు రూపేణాప్రతిమా భువి,*
> *అభిశాపాదభూత్తాత కపిత్వే కామరూపిణీ.* 9

రూపసౌందర్యమున భూలోకమున నెవ్వరును ఆమెకు సాటి లేరు. ఆమె ముల్లోకములయందును ఖ్యాతి వహించినది. ఒకసారి ఒక మునిని అవమానించిన కారణమున అతని శాపముచే ఆమెకు వానరజన్మము కలిగినది.

ఆమె వానరరాజు కుంజరుని పుత్రిక అయినది. కాని కోరిన రూపము ధరింపగల శక్తి కలిగియుండెను. ఒకసారి ఆమె రూపయౌవనశోభితయై మానవస్త్రీరూపమున పర్వతశిఖరమున విహరించుచుండెను. అప్పు డామె అంగప్రత్యంగసౌందర్యమునకు ముగ్ధుడై వాయుదేవుడు ఆమెను కౌగలించుకొనెను. ఆమె కలవరపడి, పాతివ్రత్యము భగ్నమైన దని యెంచునంతలో వాయు వామెతో నిట్లనెను - 'నేను నీ పాతివ్రత్యమును భంగపరచలేదు. నేను అవ్యక్తరూపమున నిన్నాలింగనము చేసి, మానసికముగా నిన్ను పొందితిని. ఇందువలన నీకు బలపరాక్రమసంపన్నుడు, బుద్ధిమంతుడు నైన పుత్రుడు కల్గును. అతడు ధైర్యశాలి, తేజస్వి, బలవంతుడు, పరాక్రమశాలియు నై నాతో సమానుడై ఆకసమున విహరించగలడు. సముద్రము దాటగలడు'.

'హనుమంతా, నీవే ఆ పుత్రుడు'.

ఇక్కడ పుంజికస్థలకు శాపమిచ్చిన ఋషి పేరు చెప్పబడలేదు. శాపకారణము కూడ స్పష్టముగ లేదు. కాని ఆమె ప్రార్థనపై ఆ ఋషి శాపశాంతి సూచించినట్లును ఆమె స్వేచ్ఛానుసారము వానరమానవరూపములు ధరింపగల్గినట్లును తెలియుచున్నది.

*(శ్రీరామకోశాంతర్గత హనుమాన్‌కోశ్. పు. 2)*

## 34. ? > లంకిణి సుందరకాండ

లంకిణి తన వృత్తాంతము హనుమంతునితో చెప్పుచున్నది.

వాయుసుతుడైన హనుమంతుడు రాత్రివేళ లంకలో ప్రవేశించుచుండెను. ఇంతలో ఆ నగరరక్షకి లంకిణి అతని త్రోవకు అడ్డము వచ్చెను. ఆమె రూపము భయంకరముగా నుండెను. 'ఓరీ కోతీ, నీవెవరు? ఏ పనిమీద ఇక్కడకు వచ్చితివి?' అని బిగ్గరగా గర్జించుచూ ఆమె అతని యెదుట వచ్చి నిల్చెను. 'రావణుని సైన్యము నల్వంకలా ఈ పట్టణమును కాయుచున్నది. నీ వీ లంకలో ప్రవేశింపలేవు'. అని చెప్పెను. అందుపై హనుమంతుడు 'నీ వడిగిన దంతయూ చెప్పెదను. కాని ముందుగా నీవెవరో? ఏల యిట్లు కోపించి నన్ను గద్దించుచుంటివో చెప్పుము' అని పలికెను. దాని కామె మరింతగా కోపించి కఠోరముగా నిట్లనెను- 'నేను రాక్షసరాజైన రావణుని

ఇక్కడ లంకను శాపోపహత యని చెప్పినన్నూ, అందుకు సంబంధించిన యితరవివరములు తెలుపబడలేదు. శాప మిచ్చిన దెవరో ఎందుకిచ్చిరో తెలియదు. శాపావధి తెలిసినన్నూ, శాపస్వరూపము స్పష్టముగా లేదు.

## 35. బ్రహ్మ > రావణుడు యుద్ధకాండ 13

రావణుడు మహాపార్శ్వునితో తన జీవితములో వెనుక గడిచిన ఘటన మొకటి వివరించుచుండెను.

సీత నపహరించి రావణు డామెను లంకకు తెచ్చెను. ఆమెను కట్టుదిట్టమైన కావలాలో నుంచెను. రావణు డామె సౌందర్యమువలన కామపీడితుడయ్యెను. రాజసభలో అతడు సీత యెడ తన ఆసక్తిని స్పష్టముగా చెప్పి, కర్తవ్యమేమో చెప్పుడని సభాసదుల నడిగెను. కొంద రతని మాట లామోదించిరి. రాముని చంపి రావణునకు చిరకాలమువరకు సీతను భోగించునవకాశ మిచ్చెదనని కుంభకర్ణుడు ప్రతిజ్ఞ చేసెను.మహాబలుడైన మంత్రి మహాపార్శ్వుడు సీతను బలాత్కారింపుమని ప్రోత్సహించెను. అప్పుడు రావణు డతనితో నిట్లనెను - "ఒకసారి ఆకసమున నగ్నితేజముతో వెలుగొందుచు బ్రహ్మభవనమున కేగుచున్న పుంజికస్థల యను నప్సరసను చూచి, ఆమె నా భయముచే ఒదిగి పోవుచున్నట్లు గ్రహించితిని. నేను బలవంతముగా ఆమెను వివస్త్రను చేసి అనుభవించితిని. తర్వాత నామె బ్రహ్మభవనము చేరినది. అప్పు డామె ఏనుగచే కలత చెందిన పద్మసరోవరమువలె శోభాహీనయై రూపించినది. అది చూచి బ్రహ్మ జరిగిన దంతయు గ్రహించి, మహాక్రోధముతో నన్నిట్లు శపించెను.

*అద్యప్రభృతి యామన్యాం బలాన్నారీం గమిష్యసి,*
*తదా తే శతధా మూర్ధా ఫలిష్యతి న సంశయః.* 14

'నేటినుండి నీవు ఏ స్త్రీనైనను బలాత్కరించితివా, అప్పుడే నీ తల నూరు ముక్క లగును. ఇది నిస్సంశయము' అని శపించినందున భయపడుచుంటిని. అందువలన సీతను బలాత్కరించుటకు పూనుకొనలేదు".

ఈ శాపము నియమాంచితము.

రావణుని వధించుటలో సహాయపడుటకు వానరరాజు సుగ్రీవుడు సమస్తసేనలతోను వచ్చి సముద్రతీరమున విడిసెను. రావణుని వేగులవాడైన శార్దూలుడు సముద్రతీరమున గల వానరసేనాసన్నాహ మంతయు చూచి వచ్చి రావణుని కెరిగించెను. రావణుడు కలత చెందెను. అతడు శుకుని దూతగా సుగ్రీవునివద్దకు పంపెను. శుకుడు పక్షిరూపమున నెగిరి ఆకాశమార్గమున వచ్చి సుగ్రీవుని చూచెను. కాని ఆకసముననే నిల్చి అతడు సుగ్రీవునికి పంపిన రావణుని సందేశము వినిపించెను. కాని యింతలోనే వానరు లతనిని పట్టుకొని భూమికి దింపి, రెక్కలు విరిచి, పిడిగ్రుద్దులతో పీడింపదొడగిరి. అప్పు డతడు రామునితో నిట్లనెను- 'నేను దూతను. దూత నిట్లు బాధించుట అనుచితము.' ఈ మాటలు విని రాముడు వానరులతో అతనిని విడిచిపుచ్చుడని చెప్పెను. అప్పుడు అంగదుడు 'మహారాజా, వీడు నాకు దూతగా కాక గుప్తచరుడుగా తోచుచున్నాడు. వీడు మన సేనా రహస్యములు గ్రహింపవచ్చెను. వీనిని బంధించుటయే మేలు' అని పలికెను. తిరిగి సుగ్రీవుని యాజ్ఞపై వానరులు వానిని పట్టుకొని బంధించిరి. వారట్లు బాధించగా శుకుడు రామునితో బిగ్గరగా నఱచుచూ, 'అయ్యా, నారెక్కలు విరచుచున్నారు. కనులు పొడుచుచున్నారు' కనుక-

*యాం చ రాత్రిం మరిష్యామి జాయే రాత్రిం చ యామహమ్,*
*ఏతస్మిన్నంతరే కాలే యన్మయా హ్యశుభం కృతమ్,*
*సర్వం తదుపపద్యేథా జహ్యాం చేద్యది జీవితమ్.* 33

'నేను పుట్టిననాటి రాత్రి మొదలుకొని ఇప్పుడు చావనున్న యీ రాత్రివరకు గల యీ మధ్యకాలమున నేను చేసిన పాపములన్నియు నీకు చుట్టుకొనును.' వాని ఆ ఆక్రందనము విని రాము డతనిని చంపకుండ 'వాడు దూత, వానిని వదలుడు' అని విడిపించెను. వానిది శాపమా, హాహాకారమా? శాపమైనచో ప్రతిబంధయుక్తము. శుకునికి శాపమిచ్చు నధికార మున్నదా? ఎట్లు కలిగినది? అను విషయములు తెలియవు.

శ్రీరాము డడుగగా విభీషణుడు కుంభకర్ణుని వృత్తాంతము చెప్పుచుండెను.

విశ్రవసుని పుత్రుడైన కుంభకర్ణుడు మహాపరాక్రమవంతుడు. అతడు యుద్ధములో వైవస్వతుడైన యముని, దేవరాజగు యింద్రుని జయించెను. అతని యంత ఎత్తైన రాక్షసు డింకొకడు లేడు. అతడు దేవ,దానవ, నాగ, యక్ష, రాక్షస, గంధర్వ, విద్యాధర,కిన్నరాదుల నెన్నో మార్లు యుద్ధములో జయించి పారద్రోలెను. దేవత లితనిని చంప నశక్తులు. అతడు స్వతః సిద్ధముగా తేజోబలాధికుడు. తక్కిన రాక్షసుల బలము వరదానమూలకము. ఈ మహాకాయుడైన రాక్షసుడు పుట్టినతోడనే, ఆకలితో వేలాది జనులను తిని వేసెను. ఇట్లు వేలకొలది అతని కాహార మగుచుండగా, ప్రజలు భయపడి యింద్రుని వేడుకొనిరి. ఇంద్రుడు కోపించి తీక్ష్ణమైన తన వజ్రాయుధముతో నతనిని కొట్టెను. వజ్రాహతిచే నతడు మరింత క్రుద్ధుడై ఇంద్రుని వాహనమైన ఐరావతముయొక్క దంత మొకటి ఊడబెరికెను. ఆ దంతముతోనే అతడు దేవేంద్రుని వక్షముపై కొట్టెను. ఇంద్రుడు వ్యాకులుడై జనసమూహముతో కలిసి బ్రహ్మవద్ద కరిగి కుంభకర్ణుని దౌష్ట్యము, ప్రజాభక్షణము, ఋష్యా శ్రమవిధ్వంసాదికము పరస్త్రీల నపహరించుట వంటి దుశ్చేష్ట లన్నిటిని వివరించెను. ఇట్లే యితని ఆట సాగనిచ్చినచో కొద్ది కాలములోనే యీ సంసారమంతయు శూన్యమగు నని చెప్పెను. ఇంద్రుని మాటలు విని బ్రహ్మ రాక్షసు లందరిని పిలిచెను. కుంభకర్ణుని చూచి తానే భయపడెను. కాని ఎట్లో ధైర్యము పూని నిల్చి వానితో నిట్లనెను.

*ధ్రువం లోకవినాశాయ పౌలస్త్యేనాసి నిర్మితః,*
*తస్మాత్ త్వమద్యప్రభృతి మృతకల్పః శయిష్యసే.* 24

'కుంభకర్ణా, ఈ జగత్తును నాశ మొనర్చుటకే నీవు విశ్రవసునికి జన్మించితివి. కనుక నీవు నేటినుండి చచ్చినవానివలె పడి నిద్రించుచుండుము' అని శపించెను.

బ్రహ్మ యిచ్చిన శాపమువలన కుంభకర్ణుడు రావణుని యెదుటనే నేల పడిపోయెను. రావణుడు కళవళపడి బ్రహ్మతో 'వీడు మీ మనుమడు. వీని కిట్టి శాపమిచ్చుట తగదు. మీ మాట పొల్లు పోదు. కావున వీడింక

నిద్రపోవలసినదే కాని వీనిని నిద్రయు, మేల్కొనుటయు నెప్పుడు జరుగునో నిశ్చయించి చెప్పుడు' అని చెప్పి వేడుకొనెను. అప్పుడు బ్రహ్మ యిట్లనెను-

*శయితా హ్యేష షణ్మాసమేకాహం జాగరిష్యతి,* 28

*ఏకేనాహ్నా త్వసౌ వీరశ్చరన్ భూమిం బుభుక్షితః,*
*వ్యాత్తాస్యో భక్షయేల్లోకాన్ సంవృద్ధ ఇవ పావకః.* 29

వీడు ఆరుమాసములు నిద్రించిన ఒకనాడు మేల్కొనును. ఆ ఒక్క దినమున వీ డాకలి తీర్చుకొనుటకు భూమిపై చరించును. అప్పుడు వీడు మండుచున్న అగ్నివంటి తననోట నెందరినో తినివేయును.

రావణుని ప్రార్థనపై బ్రహ్మ పలికిన మాటలు శాపశాంతి వంటివి. ఇక్కడ కుంభకర్ణుడు శాపమందెనే కాని శాంతి వేడలేదు. అది కుంభకర్ణునికై రావణుడు ప్రార్థించి సంపాదించినది.

## 38. పులస్త్యుడు > తృణబిందుని కుమార్తె ఉత్తరకాండ 2

అగస్త్యమహర్షి రామునికి విశ్రవసుని జన్మవృత్తాంతము చెప్పుచుండెను.

సత్యయుగమున బ్రహ్మ కొక ప్రభావసంపన్నుడైన పుత్రు డుదయించెను. అతడు పులస్త్యుడను పేర ప్రసిద్ధుడాయెను. గుణశీలధర్మములవలన నతడు దేవతలను మెప్పించెను. ఒకసారి అతడు మేరువు సమీపమున గల రాజర్షి తృణబిందుని యాశ్రమమున కేగి అచ్చటనే వసింపదొడగెను. అతడు తపస్సు చేసికొనుచుండగా కొందరు కన్యక లతని తపస్సునకు విఘ్న మొనర్చుచుండిరి. నాగ, ఋషి, రాజకన్యకలు, అప్సరసలు కూడ క్రీడార్థ మతని యాశ్రమమునకు వచ్చుచుండిరి. వారి ఆటపాటలవలన అతని తపమునకు భంగము కలుగుచుండెను. దానితో నతడు కోపించి యిట్లనెను -

*యా మే దర్శన మాగచ్ఛేత్ సా గర్భం ధారయిష్యతి.* 13

రేపటినుండి యిక్కడ నా కంటబడిన కన్య గర్భము ధరించును. ఆ ఋషీశ్వరుని శాపమునకు కన్యక లందరు మిక్కిలి భయమందిరి. ఆపై వారచ్చటకు వచ్చుట మానివేసిరి. కాని రాజర్షియైన తృణబిందుని కుమార్తె కీ శాపవిషయము తెలియరాలేదు. కనుక మరునా డా యాశ్రమములో

నిర్భయముగా సంచరింప నరిగి, అక్కడ తన సఖు లెవ్వరును లేకుండుట గమనించినది. అప్పుడు పులస్త్యు డచ్చట వేదాధ్యయనము చేయుచుండెను. ఆ వేదధ్వని విని ఆ కన్యక అటకు పోయి పులస్త్యుని దర్శించెను. మహర్షిదృష్టి ఆమెపై పడుటయే తడవుగా ఆమె శరీరము పాండువర్ణమందెను. గర్భలక్షణములు ప్రకటమాయెను. ఆమె కొందలపడి, దుఃఖితయై, తండ్రిపద్ద కేగి నిల్చెను. ఆమె నా స్థితిలో చూచి, విషయ మడిగి తెలిసికొని అతడు ధ్యానదృష్టితో చూచి నిజ మెరిగెను. వెంటనే తన కుమార్తెను తోడ్కొని పులస్త్యునికడకు పోయి, అతనితో నిట్లనెను - 'నా యీ కన్య గుణసంపన్నురాలు. మహర్షివరా, నీవు స్వయంప్రాప్తమైన భిక్షగా నీమెను స్వీకరింపుము. తపస్సులో నీకు శ్రమ కల్గుచుండును. ఆపట్టున నీమె నీకు తోడై సేవాశుశ్రూష లొనర్చును. పులస్త్యు డీ మాట లంగీకరించెను. ఆమె శీలసంపద కతడు సంతసించి ఒకనా డామెతో నిట్లనెను-

*తస్మాద్దేవి దదామ్యద్య పుత్రమాత్మసమం తవ,*
*ఉభయోర్వంశకర్తారం పౌలస్త్య ఇతి విశ్రుతమ్.* 30

'దేవీ, నేడు నీకు నేను నాతో సమానుడైన పుత్రుని ప్రసాదించెదను. అతడు ఉభయవంశములను ఉద్ధరించును. పౌలస్త్యు డను పేరున ప్రఖ్యాతు డగును. నేను వేదాధ్యయనము చేయుచుండగా వచ్చి నీ వది వింటివి, కావున నీ పుత్రుడు విశ్రవసుడు అనియు విశ్రవణు డనియు పిలువబడును.

పులస్త్యుడు తృణబిందుని ప్రార్థన మంగీకరించుట శాపశాంతి కాదు కాని తృణబిందుని కుమార్తె గర్భము ధరించుట మాత్రము శాపఫలమే. కాని చివర కా శాపము వరదానముగా పరిణమించెను.

## 39 విశ్రవసుడు > కైకసి ఉత్తరకాండ 9

అగస్త్యుడు శ్రీరామునికి సుమాలి కుమార్తె యైన కైకసి వృత్తాంతము చెప్పుచుండెను.

రాక్షసరాజైన సుమాలి కూతురు కైకసి చాల చక్కనిది. వివాహ యోగ్యురాలైన ఆ కన్యను వివాహమాడుటకొరకు కెందరో యువకులు ప్రస్తావించిరి. కాని అతడు వా రెవరినీ అంగీకరింపలేదు. అంతతో వివాహప్రయత్నము

లాగిపోయెను. ఆమె అంతకంతకు వయసు మీరుచుండెను. తండ్రి సుమాలి యిదంతయు చూచి చింతించెను. అతడామెతో నిట్లనెను- 'పుత్రీ, నీకొరకు తగిన వరుని కోరి ఎంతగానో ప్రయత్నించితిమి. కన్యాదానవిషయములో మేము ధర్మబుద్ధి ననుసరించుచుందుము. నీవు లక్ష్మీదేవివలె సర్వగుణసంపన్నవు. గౌరవాభిమానములు గలవారికి, ఆడుబిడ్డ తండ్రిగా నగుట దుఃఖహేతు వగుచుండును. ఏలయన, కన్య కెట్టి వరుడు లభించునో తెలియదు. కాబట్టి నీవు ప్రజాపతికులములో పుట్టి, గుణసంపద గల్గిన, పులస్త్యతనూజుని, విశ్రవసుని స్వయముగానే వెళ్లి వరింపుము. అతనిని సేవింపుము. నీ కతనిని పోలిన పుత్రు లుదయింపగలరు. వారు కుబేరునివలె సూర్యతేజస్కులై వెలుగొందెదరు.

తండ్రి చెప్పిన మాటలు విని కైకసి విశ్రవసుడు తపమొనర్చుచున్న చోటి కేగెను. అది సాయంసమయము. విశ్రవసుడు తప మొనర్చుచుండెను. లావణ్యరాశియైన కైకసిని చూచి, అతడామెను గురించి ప్రశ్నించి వచ్చిన కారణ మడిగెను. ఆమె చేతులు జోడించి అతని కిట్లు విన్నవించెను- 'మీరు తపఃసామర్థ్యమున నా మనోభావమును గుర్తింపగలరు. నేను మా తండ్రి యాజ్ఞ తలదాల్చి మీ సేవకు వచ్చితిని. నాపేరు కైకసి. మిగిలిన విషయము మీరే గ్రహింపనగును'. ఈ మాటలు విని విశ్రవసు డొక క్షణము ధ్యానించి, ఆమె కిట్లనెను -

*సుతాభిలాషో మత్తస్తే మత్తమాతంగగామిని,*
*దారుణాయాం తు వేళాయాం యస్మాత్ త్వం మాముపస్థితా.* 22

*శృణు తస్మాత్ సుతాన్ భద్రే యాదృశాన్ జనయిష్యసి,*
*దారుణాన్ దారుణాకారాన్ దారుణాభిజనప్రియాన్.* 23

*ప్రసవిష్యసి సుశ్రోణి రాక్షసాన్ క్రూరకర్మణః.* 24

'సుందరీ! నావలన పుత్రప్రాప్తిని కోరివచ్చితివి. కాని ఓ మత్తగజగమనా, నీవు వచ్చిన వేళ మంచిది కాదు. ఫలితముగా నీకు జనింపబోవు పుత్రులు స్వభావముచే క్రూరులు, రూపముకన్న భయంకరులు. వారికి క్రూరకర్ములగు రాక్షసులతోనే ప్రేమానుబంధము కలుగును. నీవు క్రూరకర్ములగు రాక్షసులకే జన్మనిచ్చెదవు.

ఈమె నా కుమార్తె హేమగర్భమున నుదయించినది. ఇప్పు డీమెకు తగిన వరుని వెదకుచు నే నిట్లు తిరుగుచుంటిని' అని చెప్పెను. అతడు రావణుని పరిచయ మడుగగా అతడు తాను పౌలస్త్యుని పుత్రుడగు దశగ్రీవుడ నని చెప్పెను.

*న హి తస్య మయో రామ శాపాభిజ్ఞస్తపోధనాత్.* 20

*విదిత్వా తేన సా దత్తా తస్య పైతామహం కులమ్.* 21

విశ్రవసునివలన రావణుని క్రూరస్వభావు డగునట్లు లభించిన శాపమును గూర్చి మయాసురు డెరుగును. అయినను రావణుడు బ్రహ్మకులసంభూతు డని తెలిసి అతనికి తన కన్యక నిచ్చెను. ఆమెయే మండోదరి. రావణు డచ్చట అగ్నిని వ్రేల్చి మండోదరిని పెండ్లాడెను.

విశ్రవసుడు రావణుని కేల శాపమిచ్చెనో తెలియకున్నది. బహుశా, విశ్రవసుడు కైకసి కిచ్చిన శాపముతో దీనికి సంబంధ ముండవచ్చును. (చూ.శాప క్ర. 39 విశ్రవసుడు > కైకసి)

## 41. పార్వతీదేవి > కుబేరుడు ఉత్తరకాండ 13

రావణుని నిరంకుశత్వమునుగూర్చి అగస్త్యుడు రామునితో చెప్పుచుండెను. దేవ, ఋషి, గంధర్వ, యక్షాదులను బాధించుట, నందనాది ఉద్యానవనములను ధ్వంస మొనర్చుట, నదీ, పర్వత, వృక్షాదులను నాశము చేయుట వంటి రావణకృత్యములను విని కుబేరుడు అతనిని మందలించి సన్మార్గమునకు తేదలచి దూత నంపెను. ఆ దూత కుబేరుని సందేశమును వినిపించుచు రావణుని కిట్లు చెప్పెను- 'దశగ్రీవా, మన తల్లిదండ్రుల కులముల కనురూపమైన రీతిని వర్తింపుము. ఇంతవరకు నీవు చేసిన అకార్యము లనేకము. దేవతలు నిన్ను నిరోధించు ప్రయత్నములో నున్నట్లు వినుచుంటిని. నేను శౌచసంతోషాది నియమములు పూని, ఇంద్రియసంయమపూర్వకముగా రౌద్రవ్రత మాశ్రయించి, ధర్మానుష్ఠానమునకై హిమాలయమున నొక శిఖరము చేరితిని. అచ్చట నాకు ఉమామహేశ్వరుల దర్శనము లభించెను. ఆ సమయమున నేను ఎడమ వైపు దృష్టి సారించుచు వారి నంతగా చూడలేదు. అనుపమాన సౌందర్యరాశి యగు ఉమాదేవి అక్కడ నిల్చియుండెను. ఆమె ప్రభావమున నా యెడమ కన్ను మాడిపోయి కుడికన్ను పింగలవర్ణ మందెను.'

*దేవ్యా దివ్యప్రభావేణ దగ్ధం సవ్యం మమేక్షణమ్,*
*రేణుధ్వస్తమివ జ్యోతిః పింగలత్వముపాగతమ్.* 24

'ఆ తర్వాత ఎనిమిది వందల ఏండ్లు మౌనభావ మూని నే నా మహావ్రత మాచరించితిని. అప్పుడు శంకరుడు కరుణించి దర్శనమిచ్చెను. నే నతని మిత్రుడనైతిని. అయినను నాకు ఏకాక్షి పింగలనామము శాశ్వతమాయెను. కాబట్టి, నీవు కులమునకు కళంకము తెచ్చునట్టి పాపకర్మల సంగతిని విడిచి పెట్టుము.'

దూత చెప్పిన సందేశము విని రావణుడు మహోగ్రుడై ఆ దూతను, కుబేరుని కూడ ప్రాణములతో నుండ నివ్వనని ప్రతిజ్ఞ చేసి, కత్తి దూసి ఆ దూత నక్కడే వధించెను.

ఈ శాపము సందేహజనకము. కుబేరుని ఎడమకన్ను దగ్ధమై, కుడికన్ను పింగలవర్ణమందినది. అది పార్వతీదేవి దివ్యతేజఃప్రభావమువల్లనా లేక శాపమువల్లనా? ఇది శాప మనిపించుకొనదు. శాపము వాచికమూలకము. పార్వతి ఈ సందర్భమున నోరు విప్పి శబ్దోచ్చారణ మొనర్చలేదు.

## 42. నందీశ్వరుడు > రావణుడు ఉత్తరకాండ 16

అగస్త్యుడు రామునితో రావణునికి నందీశ్వరు డిచ్చిన శాపమును గూర్చి చెప్పుచుండెను.

కుబేరుని జయించి రావణుడు పుష్పకవిమానము నధిరోహించి, శరవణ సమీపమున గల పర్వతముపై పోవనెంచెను. కాని అక్కడ పుష్పకము ముందుకు పోలేదు. కుబేరుని వాహన మగుటచేత ఈ విమానము కుబేరునకు తప్ప యితరులకు వాహనము కాజాలదేమో అని మారీచు డెంచెను. అంతలో శంకరుని పార్షదు డైన నందీశ్వరుడు రావణునివద్దకు వచ్చెను. నందీశ్వరుడు చూచుటకు వికృతముగా నుండెను. అతని శరీరవర్ణము నలుపు, పసుపుల మిశ్రమవర్ణముగా నుండెను. ఆకృతి హ్రస్వమై వికారముగా నుండెను. తల ముండితము, భుజములు చిన్నవి. అతడు వానరరూపమున వచ్చెను. రావణునితో నతడు 'వెనుకకు పొమ్ము, ఈ పర్వతముపై శంకరుడు విహరించుచున్నాడు. కనుక ఈ చోటికి ఇతరులు రాకూడదు' అని చెప్పెను.

ఇవి విని రావణుడు కుపితుడై 'శంకరుడెవడు?' అని అరచుచూ పర్వతమూలమును చేరెను. అక్కడ శంకరుని, తత్సమీపమున మెరయుచున్న శూలము ధరించి ఆ పరమశివుని వలె నిల్చిన నందిని చూచెను. అతని వానరముఖమును చూచి, తిరస్కారపూర్వకముగా రావణుడు అట్టహాసమొనర్చెను. అందుపై కోపించి నంది రావణునితో నిట్లనెను-

*యస్మాద్వానరరూపం మామవజ్ఞాయ దశానన,*
*అశనీపాతసంకాశమపహాసం ప్రయుక్తవాన్.* 16

*తస్మాన్ మద్వీర్యసంయుక్తా మద్రూపసమతేజసః,*
*ఉత్పత్స్యంతి వధార్థం హి కులస్య తవ వానరాః.* 17

*నఖదంష్ట్రాయుధాః క్రూర మనఃసంపాతరంహసః,*
*యుద్ధోన్మత్తా బలోద్రిక్తాః శైలా ఇవ విసర్పిణః.* 18

*తే తవ ప్రబలం దర్పముత్సేధం చ పృథగ్విధమ్,*
*వ్యపనేష్యంతి సంభూయ సహామాత్యసుతస్య చ.* 19

*కిం త్విదానీం మయా శక్యం హంతుం త్వాం హే నిశాచర,*
*న హంతవ్యో హతస్త్వం హి పూర్వమేవ స్వకర్మభిః.* 20

'ఓయి దశాననా! నీవు నా వానరముఖము చూసి అపహేలన చేయుచూ పిడుగులు పడినట్లు బిగ్గరగా అట్టహాసము చేసితివి. కనుక నీ కులమును నాశము చేయుటకు నాతో సమానమైన బలరూపతేజములు గల వానరులు జన్మింపగలరు. వారు నఖదంతాయుధులై, మనోజవము కలవారై, యుద్ధోన్మత్తులు, మహాబలులు, పర్వతోపములు నై యుందురు. వారందరూ ఏకమై వచ్చి నిన్ను మంత్రిపుత్ర సహితముగా వధించి నీ గర్వ మణచెదరు. నిన్నిప్పుడే చంపగల శక్తి నా కున్నది. కాని నిన్ను నేను చంపదలపను. నీవు చేసిన కుత్సితకర్మలకు ఫలితముగా నీ విప్పటికే చచ్చి యుంటివి.'

నందీశ్వరు డిట్లు స్పష్టముగా భవిష్య మెరిగింపచినను రావణు డతని మాటలను లక్ష్యపెట్టలేదు. ఆ పర్వతమును సమూలముగా పెకలించి విసిరివేయు తలపున అతడు దాని క్రింద తన భుజములు మోపి యెత్తబోయెను. పర్వతము కదలదొడగెను. శంకరు డది గాంచి పర్వతమును తన కాలి బొటనవ్రేలితో నణచి పట్టెను. దానితో రావణుని భుజములు పర్వతముక్రింద

నలిగిపోజొచ్చెను. ఇది చూచి రావణుని మంత్రు లాశ్చర్యచకితులైరి.

తర్వాత రావణుని మంత్రులు శంకరుని ప్రార్థించి ప్రసన్నుని జేసికొన దగునని చెప్పగా అత డట్లు చేసి భగవంతుని మెప్పించెను.

సుందరకాండ 50

రాక్షసులు హనుమంతుని కట్టి తెచ్చి రాజసభలో రావణుని ముందు నిలిపిరి. అతనిని చూచి రావణుడు రోషభరితుడయ్యెను. అతని మనసులో నెన్నో సందేహములు కలిగెను. అతడు పరాక్రమశాలియైన వానరరాజును గూర్చి యిట్లు తలంచెను-

*కిమేష భగవాన్ నందీ భవేత్ సాక్షాదిహాగతః,* 2

*యేన శప్తోऽ స్మి కైలాసే మయా ప్రహసితే పురా.*

*సోऽయం వానరమూర్తిః స్యాత్ కింస్విద్ బాణోऽపి వాసురః.* 3

'ఇతడు వానరరూప మంది వచ్చిన నందీశ్వరుడేమో? అతనిని పూర్వము కైలాసమున నపహసించితిని. అతడు నాకు శాపమిచ్చెను గదా? అతడే వానరరూపమున నిట్లు వచ్చియుండునా? లేక అతని రూపముతో బాణాసురుడే వచ్చెనా?'

యుద్ధకాండ 60

శ్రీరాముని బాణములచే పీడింపబడిన రావణుని కీ విషయము లన్నియు స్మరణకు వచ్చినవి. శాపములిచ్చిన వారందరు జ్ఞప్తికి వచ్చిరి. ఈ క్రింది పంక్తులలో నందీశ్వరు డిచ్చిన శాపము కూడ స్మరింపబడినది.

*ఉమా నందీశ్వరశ్చాపి రంభా వరుణకన్యకా,*
*యథోక్తాస్తన్మయా ప్రాప్తం న మిథ్యా ఋషిభాషితమ్.* 12

మీది పంక్తులలో రావణునకు ఉమాదేవి, రంభ, వరుణకన్యక కూడ శాపము లిచ్చినట్లు సూచింపబడినది.

ఆగస్త్యుడు రామునకువేదవతి రావణునిగూర్చి చేసిన ప్రతిజ్ఞావృత్తాంతమును చెప్పుచుండెను.

హిమాలయప్రాంతమున గల వనములలో సంచరించుచు రావణు డొక తపస్విని యగు కన్యను చూచెను. ఆమె దేవాంగనవలె దేదీప్యమాన తేజమున వెలుగొందుచుండెను. ఆమెను చూచి రావణుడు కామాకులచిత్తు డాయెను. అత డా కన్యక రూపలావణ్యములను ప్రశంసించి, ఆమెను తపము నుండి మరల్ప యత్నించెను. ఆమెతో మాటాడబోవగా ఆమె అతని కాతిథ్యమిచ్చి ఇట్లు చెప్పెను- 'నా పేరు వేదవతి. నేను బృహస్పతి పుత్రుడైన వేదాధ్యయన శీలుడగు బ్రహ్మర్షి కుశధ్వజుని కుమార్తెను. మాతండ్రి శ్రీవిష్ణువును అల్లునిగా కోరుచుండెను. అతని అభిప్రాయ మెరిగి, కోపించి శంభు డను దానవు డాతనిని రాత్రి నిద్రించుచుండగా వధించెను. మాతల్లి దుఃఖభారమున పతితో బాటు చితాగ్నిలో పడి మరణించెను. మా తండ్రి మనోరథమును పూరించుటకై ప్రతిజ్ఞ చేసి నేనిట్లు తప మొనర్చుచున్నాను'. ఇట్లు చెప్పగా విని రావణుడు విష్ణువును నిందించి ఆమెను తనకు భార్య కమ్మనెను. విష్ణుని గురించి అవమానముగా మాటాడినందుకు వేదవతి రావణుని నిందించెను. అంతలో ఆ రాక్షసుడు ఆమెకేశపాశము గ్రహించెను. ఆమె మహాక్రోధముతో తన చేతితో ఆ కేశములను ఖండించి, రోషావేశమున నగ్నివలె ప్రజ్వరిల్లి, రావణుని దహింపజేయుచున్నట్లు కఠోరముగా నిట్లనెను. 'ఓరి నీచా, నీవు నన్నుంటి అవమానించితివి. కనుక నే నీ జీవితము నిక కొనసాగింపదలపను. నీముందే అగ్నిప్రవేశ మొనర్చెదను.'

*యస్మాత్తు ధర్షితా చాహం త్వయా పాపాత్మనా వనే,* 31
*తస్మాత్తవ వధార్థం హి సముత్పత్స్యే హ్యహం పునః.*

*న హి శక్యః స్త్రియా హంతుం పురుషః పాపనిశ్చయః,* 32
*శాపే త్వయి మయోత్సృష్టే తపసశ్చ వ్యయో భవేత్.*

*యది త్వస్తి మయా కించిత్ కృతం దత్తం హుతం తథా.* 33

*తస్మాత్త్వయోనిజా సాధ్వీ భవేయం ధర్మిణః సుతా.* 34

పాపాత్ముడ వగు నీ వీ వనములో న న్నవమానించితివి. కనుక నిన్ను వధించుటకై నేను తిరిగి జన్మించెదను. స్త్రీని కనుక నా శరీరశక్తితో పాపాత్ముడైన పురుషుని వధింపజాలను. నీకు శాపమిచ్చినచో నాకు తపోవ్యయ మగును. నేను దానహోమాదిసత్క్రియ లేమేని చేసితినేని, మరుజన్మలో అయోనిజనైన సాధ్విగా ఏ ధర్మాత్మునికో పుత్రి నయ్యెదను' అని పల్కి ఆమె మండుచున్న అగ్నిలో పడెను. అప్పు డాకసమునుండి పుష్పవృష్టి గురిసెను.

యుద్ధకాండ 80

శ్రీరాముని బాణములకు వెరచి, బాధితుడైన రావణుడు తనతో మునుపు అగ్నిప్రవేశము చేయుచు వేదవతి పలికిన మాటలు స్మరించెను-

*శప్తోఽహం వేదవత్యా చ యథా సా ధర్షితా పురా,* 10
*సేయం సీతా మహాభాగా జాతా జనకనందినీ.* 11

'పూర్వము వేదవతి నన్ను శపించెను. నే నామెను బలాత్కరింపనెంచితిని. బహుశా ఆమెయే సీతగా అవతరించి యుండును'

ఉత్తరకాండమున వర్ణించిన వేదవతి వచనములు శాపతుల్యములే. కాని స్పష్టముగా తపఃక్షయ మగునని, అందుచే శాప మివ్వనని ఆమె ముందుగనే చెప్పినది. అయినను యుద్ధకాండలో రావణు డామె వాక్యములను స్మరించి శాపమనియే గ్రహించెను. కాగా ఈ వచనములు శాపవాణి అనిపించుకొనునో లేదో చెప్పుట కష్టము. ఆమె వచనమున గల ఉత్తరార్ధము నిశ్చయముగా శపథము.

వేదవతితో పాటు ఉమ, నందీశ్వరుడు, రంభ, వరుణకన్యక కూడ తనను శపించిన విషయములు రావణున కప్పుడు స్మరణకు వచ్చెను.

## 44. అనరణ్యుడు > రావణుడు ఉత్తరకాండ 19

అనరణ్యమహారాజు రావణున కిచ్చిన శాపమును అగస్త్యుడు రామునకు వివరించుచుండెను.

మరుత్తును జయించిన పిదప రావణు డన్యనరేంద్రులను కూడ జయింప నరిగెను. 'నాతో యుద్ధము చేయుడు లేదా ఓడినట్లు అంగీకరింపుడు.'

అని పంతగించి పల్కుచు పోయి, అతడు దుష్యంత, సురథ, గాధి, గయ, పురూరవుల నెదిరించెను. వారు పరాజయము స్వీకరించిరి. పిదప అయోధ్యకు వచ్చి అతడు ఇక్ష్వాకువంశీయుడైన అనరణ్యమహారాజును యుద్ధమునకు పిలిచెను. అనరణ్యు డా యుద్ధము చేయుటకు నిశ్చయించి రావణునితో తలపడెను. యుద్ధములో తన సేన నశించుచుండుటయు, తాను రావణుని శరీరమున గుప్పించిన వందలాది బాణము లతనిని నొప్పింపలేకపోవుటయు చూచి అనరణ్యు డాశ్చర్యపడెను. రావణు డతని మస్తకమును చేతితో కొట్టెను. ఆ దెబ్బకాతడు రథముపై నుండి దొర్లి క్రిందపడెను. అప్పుడు రావణు డతని నపహసించుచు 'ముల్లోకములలోను నన్నెదిరింపగల వీరుడు లేడు. భోగమత్తుడవై యుండి, బహుశా నీవు నా బలపరాక్రమములను గూర్చి వినలేదేమో' అని పలికెను. దాని కనరణ్యు డిట్లనెను - 'నీ పరాక్రమమును గూర్చి నీవే చెప్పుకొనుచున్నావు. వాస్తవమునకు, కాలము నన్ను వధించినది. నీవు నిమిత్తమాత్రుడవు. నేను యుద్ధములో వెనుతిరుగలేదు. యుద్ధముచేయుచు నీచేత కొట్టబడితిని. నీవు నీ వ్యంగ్యవచనములతో ఇక్ష్వాకుకులము నవమానించితివి. కనుక నీకు అశుభకరమగు మాట నేను చెప్పుచుంటిని--

*యది దత్తం యది హుతం యది మే సుకృతం తపః,*
*యది గుప్తాః ప్రజాః సమ్యక్ తదా సత్యం వచోఽస్తు మే.* 29

*ఉత్పత్స్యతే కులే హ్యస్మిన్ ఇక్ష్వాకూణాం మహాత్మనామ్,*
*రామో దాశరథిర్నామ స తే ప్రాణాన్ హరిష్యతి.* 30

నేను చేసిన దాన పుణ్యహోమాదిసత్క్రియలు, నా తపము, నా ధర్మపరిపాలనము నిర్దుష్టమైనచో నామాట సత్యమగును. మహనీయమైన ఈ ఇక్ష్వాకువంశమున దశరథుని కొడుకు రాము డుదయించి నిన్ను చంపగలడు.'

## యుద్ధకాండ 60

శ్రీరాముని బాణఘాతమువలని భయముచే పీడితుడైన రావణునికి బ్రహ్మదేవుని తాను వేడిన వరములు జ్ఞప్తికి వచ్చినవి. అతడు దేవదానవగంధర్వయక్షరాక్షససర్పాదులచే చావులేకుండ వర మడిగెను. మనుష్యులవలన చావురాని వర మడుగలేదు. అప్పుడు మానవులవంటి హీనబలులను జయించుట సుకరమని భావించెను. అప్పుడు బ్రహ్మ అతనితో 'నీకు మానవులవలన

భయమేర్పడును. ఈ మాట బాగా తెలిసికొను' మని చెప్పెను. ఇప్పుడు రావణుని కా విషయము వ్యథాకారక మయ్యెను. నేను చేసిన గొప్ప తపస్సంతయు వ్యర్థమైనది. నేడు మహేంద్రతుల్యతేజస్కుడ నగు నన్ను ఒక సాధారణమానవుడు (రాముడు) పరాజితుని చేసెను. ఆ సమయమున అతనికి వేదవతి, ఉమ, నంది, రంభ, వరుణకన్యకయు ఇచ్చిన శాపములు గుర్తుకు వచ్చెను. అట్లే ఇక్ష్వాకుకులోత్పన్నుడైన అనరణ్యమహారాజు పలికిన శాపవాక్యములు కూడ చెవిలో మారుమ్రోగెను.

*ఉత్పత్స్యతి హి మద్వంశే పురుషో రాక్షసాధమ,*
*యస్త్వాం సపుత్రం సామాత్యం సబలం సాశ్వసారథిమ్,* 9
*నిహనిష్యతి సంగ్రామే త్వాం కులాధమ దుర్మతే.* 10

'ఓరీ కులధ్వంసీ, రాక్షసాధమా, దుర్మతీ, నా వంశమున ఒక మహావీరు డుదయించి నిన్ను సపుత్రామాత్యపరివారముగా రథాశ్వసారథిసహితముగా వధించును.'

అనరణ్యుని వచనములలో శాపము, శపథము రెండును కలిసియున్నవి. వాక్యములలో ప్రథమఖండము (ఉత్తరకాండము 19-29,30) శపథము; ద్వితీయ ఖండము (యుద్ధకాండము 60-9/10) శాపము.

### 45. హరింపబడిన పతివ్రతలు > రావణుడు ఉత్తరకాండ 24

రావణు డపహరించిన పతివ్రతలు రావణుని శపించిన వృత్తాంతమును అగస్త్యుడు రాముని కెరిగించుచుండెను.

వరుణపుత్రుల నోడించిన పిదప రావణుడు పుష్పకవిమానముపై లంకకు బయలుదేరెను. దారిలో ఎందరో ఋషి, దేవ, దానవ, నాగ, యక్ష, రాక్షస, అసుర, మనుష్యకన్యలను, ఎందరో సుందర వనితల బంధువులను చంపి ఆ వనితలను బలవంతముగా అపహరించి, విమానమునందు బంధించెను. శోకాకులలు, భయాక్రాంతలు, దుఃఖపీడితలు, విహ్వలలునైన ఆ స్త్రీలు తమ మోక్షమున కింక మార్గమేదియు కానరాక, నిరాశులైరి.

*యస్మాదేష పరక్యాసు రమతే రాక్షసాధమః,* 20
*తస్మాద్వై స్త్రీకృతేనైవ వధం ప్రాప్స్యతి దుర్మతిః.* 21

'ఈ నీచుడు పరస్త్రీకాముకుడు గనుక, ఈ దురాత్మునికి స్త్రీమూలముగనే మరణము సిద్ధించుగాక' అని వారెల్లరు శపించిరి.

ఆ సాధ్వీమణు లిట్లు శపించినపుడు స్వర్గమున దేవదుందుభులు మ్రోగెను. ఆచోట పూలవాన గురిసెను. పతివ్రతలై ఆ సాధ్వీజన మిట్లు శపించినందున రావణుని శక్తి క్షీణించెను. అతడు నిస్తేజుడయ్యెను. అతని మనస్సు ఉద్వేగభరిత మయ్యెను. వారతనికి కంటగింపుగా తోచిరి.

యుద్ధ కాండ 111

రావణవధ జరిగిన పిమ్మట విలపించుచు మందోదరి పలికిన మాటలలో యీ శాపములు పేర్కొనబడినవి.

*యా స్త్వయా విధవా రాజన్ కృతా నైకాః కులస్త్రియః.* 64

*పతివ్రతా ధర్మరతా గురుశుశ్రూషణే రతాః,*
*తాభిః శోకాభితప్తాభిః శప్తః పరవశం గతః.* 65

*త్వయా విప్రకృతాభిశ్చ తదా శప్తస్తదాగతమ్,*
*ప్రవాదః సత్యమేవాయం త్వాం ప్రతి ప్రాయశో నృప.* 66

'నీ వెందరో కులస్త్రీలను గురుశుశ్రూషాపరాయణలను, పతివ్రతలను ధర్మనిష్ఠ గల స్త్రీలను, విధవలుగా జేసి అవమానించితివి. ఆ సమయమున నిట్టి దుఃఖపీడిత లందరూ నిన్ను శపించిరి. తత్ఫలముగా ఇప్పుడు నీవు శత్రువులకు చిక్కి మరణింపవలసి వచ్చినది. పతివ్రతల కన్నీటి బిందువులు భూమిపై వ్యర్థము కావని జనులాడుకొను మాటలు నేడు సత్యమైన వనవచ్చును.'

## 46. నలకూబరుడు > రావణుడు — ఉత్తరకాండ 26

అగస్త్యుడు రామునికి నలకూబరుడు రావణుని శపించిన విషయము వినిపించుచుండెను.

ఒకసారి రావణుడు సేనాసహితుడై రాత్రివేళ కైలాసపర్వతమున విడిసెను. అది వెన్నెలరాత్రి. ఆ సమయమున రంభ దివ్యవస్త్రాభరణవిభూషితయై ఆ త్రోవ నేగుచుండెను. ఆమె శరీరమున దివ్యగంధానులేపనమును, 'కేశపాశమున

పారిజాతపుష్పములును విలసిల్లుచుండెను. ఆమె శృంగారించుకొని ప్రియ సమాగమమున కేగుచుండెను. నీలివస్త్రావగుంఠనమున నామె మరింతసుందరముగ దీపించుచుండెను. ఆమెను చూచినదే తడవుగ రావణుడు కామోద్దీపితుడయి, వెంటనే ఆమెను చేయి పట్టి లాగి 'నీ వెవని కోర్కె తీర్చ నరుగుచుంటివి? నేను ముల్లోకాధిపతిని. నన్ను వరింపుము' అని పలికెను. రంభ భయకంపితురాలై, చేతులు జోడించి 'మీవంటివారి నోట నిట్టి మాటలు రాదగినవి కావు. ధర్మతః నేను మీకు కోడ లగుదును. నన్ను రక్షించుట మీ కర్తవ్యము. మీ అన్నగారి జ్యేష్ఠపుత్రుడు నలకూబరుడు, ధర్మానుష్ఠానమున బ్రాహ్మణుడు, పరాక్రమమున క్షత్రియుడు, క్రోధమున నగ్నితుల్యుడు, క్షమాశీలమున పృథ్వీసమానుడు. అతడు నాకు ప్రాణములకన్న నెక్కువ ప్రియుడు. నే నతనికై సింగారించుకొని యేగుచుంటిని. అతడు నాకై యెదురుచూచుచుండును. కనుక నన్ను పోనిండు' అని అతనితో పల్కెను. ఆమె మాటలు విని రావణుడు నీవు నా కోడలు కావచ్చును. కాని నీవు దేవవేశ్యవు కనుక సామాన్యజనుల నీతి నీకు వర్తింపదు. దేవలోకమున అప్సరసలకు పతి అని ఎవడునూ లేడు. దేవతల కొకే భార్య కూడ లేదు.' అని పలుకుచూ బలాత్కరించి అత డామె ననుభవించెను. పిదప లజ్జాభయకంపితురాలై రంభ నలకూబరునివద్దకు పోయి, నమస్కరించి అతని కాళ్లపై బడెను. అతని కామె జరిగినదంతయు వినిపించెను. అంతయు విని నలకూబరుడు క్రోధావిష్టుడై జలములు గ్రహించి, విధిపూర్వకముగా నాచమించి, రావణున కత్యంతభయానక మగు శాపమిచ్చెను.

*ఉత్ససర్జ తదా శాపం రాక్షసేంద్రాయ దారుణమ్,*

*అకామా తేన యస్మాత్త్వం బలాద్ భద్రే ప్రధర్షితా,* 54
*తస్మాత్ స యువతీమన్యాం నాకామా ముపయాస్యతి.*

*యదా హ్యకామాం కామార్తో ధర్షయిష్యతి యోషితమ్,* 55
*మూర్ధా తు సప్తధా తస్య శకలీభవితా తదా* 56

శుభాంగీ, నీ కిష్టము లేకున్నను రావణుడు నిన్ను బలాత్కరించెను. కనుక నేటినుండి అతడు కామోద్రేకమున ఏ యువతినైనను బలాత్కరించినట్లయిన తక్షణమే వాని శిరస్సు ఏడు ముక్కలగును.

అగస్త్యుడు రామునితో నిట్లు చెప్పెను. 'బుద్ధిబలపరాక్రమములలో హనుమంతుని సాటి కా గలవా రెవ్వరును లేరు. కాని భృగ్వంగిరోవంశీయుడైన మహర్షి యొక డతని కా విషయమున విస్మరణ కల్గునట్లు శపించెను.'

బ్రహ్మాదిదేవతలవలన వరము లభించినందున హనుమంతుడు శక్తిసంపన్నుడై సముద్రమువలె గంభీరముగా నుండెను. మహాతేజోవంతుడయ్యును అతడు శాంతచిత్తులైన మహామునుల యజ్ఞోపకరణములు పాడుచేయుచు, అగ్నిహోత్ర సాధనములైన యింధనములను విరిచి పోగుపెట్టుచు, వారి వల్కలాదికమును చింపి పారవేయుచూ అల్లరి చేయదొడగెను. బ్రహ్మగా రిచ్చిన వరమువలన అతడు బ్రహ్మదండమున కైనను అవధ్యుడు. మును లీ విషయ మెరుగుదురు. అందుచే వారెట్లో అతని అల్లరి సహించుచుండిరి. కేసరియు, వాయువును హనుమంతు నీ విషయమునుండి మరల్ప యత్నించిరి. కాని అత డా మర్యాద మీరుచుండెను. చివరకు భృగ్వంగిరోవంశజుడైన మహర్షి యొకడు మిగుల కోపించి అతనిని శపించుచు నిట్లు పలికెను.

*బాధసే యత్సమాశ్రిత్య బలమస్మాన్ ప్లవంగమ, 34*
*తద్దీర్ఘకాలం వేత్తాసి నాస్మాకం శాపమోహితః,*
*యదా తే స్మార్యతే కీర్తిస్తదా తే వర్ధతే బలమ్. 35*

'ఓ వానరవీరా, నీవు ఏ బలమున మమ్ము బాధించుచున్నావో, ఆ బలము మా శాపబలమున నీకు చిరకాలముపరకు స్ఫురింపకుందుగాక. తిరిగి నీ కీర్తి నీకు వినిపించిన పిమ్మట నీ ఆ బలము మరల వర్ధిల్లును.'

ఈ విధముగా మహర్షి యిచ్చిన శాపమువలన హనుమంతుని తేజోబలములు మరుగుపడినవి. అతడా ఆశ్రమములలో సాధువై చరింపదొడగెను. వాలిసుగ్రీవుల వైరకాలమున కూడ హనుమంతునికి ఈ సత్య మెరుకకు రాలేదు. కనుక వాలి నెదిరించలేదు.

శాపమునందలి ఉత్తరభాగము శాపశాంతిగా నున్నది. అది అయాచితము. సాధారణముగా శాపశాంతి అడిగి గ్రహింపవలసినదే, కాని యిక్కడ హనుమంతు డట్లు మహర్షి నడిగినట్లు చెప్పబడలేదు.

*అమోఘశాపైః శాపస్తు దత్తోऽస్య మునిభిః పురా,*
*న వేత్తా హి బలం సర్వం బలీ సన్నరిమర్దన. 16*

అగస్త్యుడు రామునితో నిట్లనెను - 'శత్రుసూదనా! రఘునందనా, ఎవరిచ్చిన శాప మేనాడును వ్యర్థము కాజాలదో అట్టి మును లితనిని శపించిరి. ఫలితముగా నితనికి బలముండియు ఆ విషయము తెలియరాలేదు.'

ఈ శాపం స్మరణమాత్రానికే.

## 48. భృగువు > విష్ణువు ఉత్తరకాండ 51

పూర్వము దుర్వాసముని చెప్పిన కథను సుమంత్రుడు లక్ష్మణున కెరిగించుచుండెను.

దుర్వాసు డొకప్పుడు వసిష్ఠాశ్రమములో నిల్చి వర్షర్తువున చాతుర్మాస్యము సలుపుచుండెను. ఒకనాడు దశరథుడు వసిష్ఠుని దర్శింపవచ్చెను. అతడు వసిష్ఠదుర్వాసు లిద్దరికిని ప్రణమిల్లెను. వారును రాజును గౌరవించిరి. దశరథుడు సవినయముగా వసిష్ఠునితో నిట్లనెను - 'మహాత్మా, మా వంశ మెంతవరకు సాగును? నా కుమారుడు రాము డెన్నాళ్ళు జీవించును? తక్కిన తనయు లెంతకాల ముందురు? రామునికి జన్మింపబోవు పుత్రుల ఆయు వెంత? దశరథుని ప్రశ్నలు విని మహాతేజస్వియైన దుర్వాసముని యిట్లనెను - 'మహారాజా! మును పెన్నడో జరిగిన విషయ మొకటి చెప్పెదను వినుము. ఒకసారి దేవాసురులకు యుద్ధమాయెను. దేవతల ధాటి కాగలేక దైత్యులు భృగుపత్నిని శరణు వేడిరి. ఆమె వారి కభయ మిచ్చెను. వా రామె ఆశ్రమమున నిర్భయులై తిరుగ దొడగిరి. కాని భృగుపత్ని వారికాశ్రయ మిచ్చినందున విష్ణు వామెపై కోపించి తన చక్రముతో ఆమె శిరసు ఖండించెను. తన భార్యను చంపినందున భృగుమహర్షి కోపించి విష్ణువు నిట్లు శపించెను -

*యస్మాదవధ్యాం మే పత్నీమవధీః క్రోధమూర్ఛితః,*
*తస్మాత్ త్వం మానుషే లోకే జనిష్యసి జనార్దన. 15*
*తత్ర పత్నీవియోగం త్వం ప్రాప్స్యసే బహువార్షికమ్. 16*

'జనార్దనా, అవధ్యురాలైన నా భార్యను, క్రోధమూర్ఛితుడవై వధించితివి. కనుక నీవు మానవలోకమున జన్మింపగలవు. అక్కడ చిరకాలము పత్నీవియోగము సహింపగలవు.'

శాప మిచ్చిన పిదప భృగువు పశ్చాత్తాప మందెను. ఆతడు తపస్సుచేసి విష్ణువు నారాధించెను. విష్ణువు సంతసించి 'మహర్షీ! సర్వజగత్తును సంతోషింప జేయుటకు నేను నీ శాప మంగీకరించెదను' అని చెప్పెను. ఇట్లు ఈ కథ వివరించి దుర్వాసుడు దశరథునితో నిట్లనెను. సాక్షాద్భగవంతుడైన విష్ణువు రాము డను పేరున భూలోకమున నీకు పుత్రుడై అవతరించెను. భృగు శాపఫలితముగా అతనికి పత్నీవియోగము కలుగును. అతడు దీర్ఘకాలము అయోధ్యను పాలించును. వేల సంవత్సరములు రాజ్యము చేసి చివరకు బ్రహ్మలోక మరుగును. అత డెన్నో అశ్వమేధముల నొనర్చును, ఎన్నో రాజ వంశములు స్థాపించును.

## 49. ఇద్దరు బ్రాహ్మణులు > నృగమహారాజు (ఉత్తరకాండ 59)

శ్రీరాముడు సీతను పరిత్యజింప నిశ్చయించిన మీదట, ఆమెను వాల్మీకిమహర్షి ఆశ్రమము చెంత విడిచి వచ్చునట్టి భారము లక్ష్మణునకు వహింపవలసివచ్చెను. తిరిగి వచ్చిన పిమ్మట లక్ష్మణుడు శ్రీరాముని పరమ దుఃఖావస్థలో మునిగియున్నట్లు కనుగొనెను. రాముడు నాల్గురోజులవరకు పౌరుల కార్యము లేవియు చేపట్టలేదు. ఇది కూడ నతనికి మర్మాంతకమగు దుఃఖము కలిగించుచుండెను. లక్ష్మణు డతనిని ధైర్యము వహింపుమనియు, తదేకధ్యానముచే దుఃఖమును వృద్ధిచేయవలదనియు ప్రార్థించెను. పురజనుల కార్యముల నశ్రద్ధ చేయు రాజున కగు దుర్గతిని గూర్చి రాముడు లక్ష్మణునకు నృగమహారాజు కథ నుదాహరించి చెప్పదొడగెను.

ఒకప్పు డీ భూమిని నృగుడను మహారాజు పాలించుచుండెను. అతడు యశస్వి, పరాక్రమశాలి, బ్రాహ్మణభక్తుడు, సత్యవాది, ఆచారపూతుడునై యుండెను. ఒకప్పు డతడు పుష్కరతీర్థమున సువర్ణభూషితములైన కోటి సవత్సగోవులను బ్రాహ్మణులకు దానమిచ్చెను. ఆ సమయమున ఉంఛవృత్తితో జీవించుచున్న ఒకానొక దరిద్రబ్రాహ్మణుని గోవు దూడతో కలిసివచ్చి రాజుగారి గోసమూహములో కలిసిపోయెను. రాజు ఆ గోవు నింకొక బ్రాహ్మణునకు దానమిచ్చెను. తన

గోవును వెదకుచూ బ్రాహ్మణుడు రాజ్యమంతయు తిరిగినను అది అగపడలేదు. చివరకు అతడు కనఖల మను తీర్థక్షేత్రము చేరి, యొక బ్రాహ్మణుని ఇంట తన ఆవును చూచెను. ఆవు పుష్టి జెందినది. దూడ పెరిగినది. వానిని 'శబలా, రా, రా,' అని పిల్చుటయే తడవుగా అవి ఆ బ్రాహ్మణుని వద్ద కరిగినవి. ఆవు నిప్పుడు పెంచుచున్న బ్రాహ్మణుడు 'తన కది నృగమహారాజు నుండి దానముగా లభించెనని చెప్పి, గోవు నడ్డగించెను. దానితో వారు జగడమాడి రాజు వద్దకు తీర్పుకొర కరిగిరి. కాని వెంటనే రాజదర్శనము కాలేదు. వేచి వేసారి, కుపితులై ఆ బ్రాహ్మణులు రాజు నిట్లు శపించిరి-

*అర్థానాం కార్యసిద్ధ్యర్థం యస్మాత్ త్వం నైషి దర్శనమ్,* 18
*అదృశ్యః సర్వభూతానాం కృకలాసో భవిష్యసి.*

*బహువర్షసహస్రాణి బహువర్షశతాని చ,* 19
*శ్వభ్రే త్వం కృకలీభూతో దీర్ఘకాలం నివత్స్యసి.*

*ఉత్పత్స్యతే హి లోకేఽస్మిన్ యదూనాం కీర్తివర్ధనః,* 20
*వాసుదేవ ఇతి ఖ్యాతో విష్ణుః పురుషవిగ్రహః.*

*స తే మోక్షయితా శాపాద్రాజంస్తస్మాద్ భవిష్యతి,* 21
*కృతా చ తేన కాలేన నిష్కృతిస్తే భవిష్యతి.* 22

'రాజా! తమ తగవు తీర్పవేడదలచి వచ్చిన జనులకు నీవు దర్శన మియ్యకుంటివి. కనుక ప్రాణికోటికంతటికి కానరాక ఊసరవెల్లివై వేలాదివత్సరములు పడియుందువు. యదుకులమున విష్ణు వవతరించి వాసుదేవుడని ప్రఖ్యాతి వహించును. అతడు నిన్ను శాపమునుండి విముక్తుని చేయును. అంతవరకు నీవు ఊసరవెల్లిగా పడియుండి పాపఫల మనుభవింతువు. అప్పుడు గాని నీకు నిష్కృతి లేదు.'

ఈ విధముగా శపించి ఆ బ్రాహ్మణులు శాంతులైరి. వా రా గోవును వేరొక బ్రాహ్మణున కిచ్చివేసిరి. కాగా, నృగున కీ విధముగా శాప మనుభవింపవలసి వచ్చినది.

ఇది విని లక్ష్మణుడు 'స్వల్పాపరాధమునకై బ్రాహ్మణులు రాజును ఘోరముగా శపించిరి' అని రామునితో ననెను.

బ్రాహ్మణుల వచనములో ఉత్తరార్ధము శాపశాంతి వలె నున్నది. సాధారణముగా శాపశాంతి వేడబడుచుండును. కాని బ్రాహ్మణులు నృగు డడుగకయే శాపముక్తికి అవధిని కూడ నిర్ణయించిరి.

నృగమహారాజును గురించి చెప్పిన పిదప రాముడు లక్ష్మణునితో నిమి చక్రవర్తి వృత్తాంతమును చెప్పదొడగెను.

## 50. వసిష్ఠుడు > నిమి ఉత్తరకాండ 55

ఇక్ష్వాకువంశమున నిమి యనువా డుదయించి చక్రవర్తి య య్యెను. అత డిక్ష్వాకునకు పండ్రెండవపుత్రుడు. అతడు ధర్మాత్ముడు, వీరుడును. అతడు గౌతమాశ్రమసమీపమున వైజయంత మను నగరము నిర్మించెను. తన తండ్రిని సంతోషపరచుటకై అత డొక యజ్ఞము తలపెట్టెను. దానికై తండ్రి అనుమతి గ్రహించి అతడు ముందుగా వసిష్ఠుని వద్ద కేగి అధ్వర్యునిగా రమ్మని ఆహ్వానించెను. తరువాత అతడు అత్రి, ఆంగిరసుడు, భృగువు అను మహర్షుల నాహ్వానించెను. వసిష్ఠుడు నిమితో తాను ఇంద్రుని యజ్ఞమున బ్రహ్మగా నుండుటకు ముందుగనే అంగీకరించితి ననియు అది ముగించుకొని వచ్చి యా యజ్ఞమును నిర్వహింపజేయుదుననియు చెప్పెను. కాని నిమి అంతవరకు ఆగక గౌతముని పిలిచి యజ్ఞము సాగించెను. ఇంద్రుని యజ్ఞము పూర్తియైన పిదప వసిష్ఠుడు నిమివద్దకు వచ్చెను. కాని అప్పటికే నిమి హిమాలయ ప్రాంతమున యజ్ఞ మారంభించెను. అత డయిదువేల సంవత్సరములవరకు యజ్ఞదీక్ష గ్రహించెను. వసిష్ఠుడు కోపావేశమున మండిపడుచూ, తత్క్షణమే నిమిని చూడగోరెను. కాని నిమి ఆ సమయమున నిద్రించుచుండెను. అతనిని చూడజాలకపోవుటతో వసిష్ఠుడు మరింతగా మండిపడి,

*యస్మాత్ త్వమన్యం వృతవాన్ మా మవజ్ఞాయ పార్థివ,*
*చేతనేన వినా భూతో దేహస్తే పార్థివైష్యతి.* 17

'నన్నవమానించి వేరొక పురోహితుని పిలిచితివి కనుక ఓ రాజా! నీ శరీరము అచేతనమై పడియుండును' అని శపించెను.

నిద్ర లేచిన నిమి కీ విషయము తెలిసి, అతడును వసిష్ఠునికి విదేహుడ వగు' మని శాపమిచ్చెను. ఇట్లిరువురను పరస్పరశాపములచే విదేహులైరి. (చూ. శాప.క్ర. 51 నిమి > వసిష్ఠుడు)

## 51. నిమి > వసిష్ఠుడు ఉత్తరకాండ 55

(చూ.శాప క్ర. 50 - వసిష్ఠుడు > నిమి)

నిమి మహారాజు నిద్రలేచి, తనకు వసిష్ఠు డిచ్చిన శాపమును గూర్చి విని కోపించి వసిష్ఠునితో నిట్లనెను-

*అజానతః శయానస్య క్రోధేన కలుషీకృతః,*
*ఉక్తవాన్ మమ శాపాగ్నిం యమదణ్డమివాపరమ్.* 19

*తస్మాత్తవాపి బ్రహ్మర్షే చేతనేన వినాకృతః,*
*దేహః స సుచిరప్రఖ్యో భవిష్యతి న సంశయః.* 20

'నాకు నీ ఆగమనవార్త తెలియదు. కావుననే నిదురించుచుంటిని, కాని, నీవు కోపముతో కలుషితుడవై నాపై యమదండము వంటి శాపాగ్నిని పడవైచితివి. కావున ఓ బ్రహ్మర్షి! ప్రాచీనశోభాయుక్తమగు నీ శరీర మచేతనమై పడిపోవును. ఇందు సందేహము లేదు.' ఈ విధముగా రోష పరవశులై ఆ రాజేంద్రద్విజేంద్రులు పరస్పరము శపించుకొని వెంటనే దేహము లేనివారైరి.

ఈ రెండు శాపములును ఇతర శాపములకంటె విలక్షణమైనవి. వాల్మీకి రామాయణమందు ఒకే విధమైన శాప-ప్రతిశాపము లిచ్చు సందర్భమునకు ఇది ఒకే ఒక ఉదాహరణము. వసిష్ఠుడు సౌదాసునకు శాప మీయగా (ఉత్తరకాండ 65) సౌదాసుడు గూడ ప్రతిశాప మీయ నుద్యుక్తుడయ్యెను. అతడు చేతిలో జలము పోసికొనెను కూడ. కాని అతని పత్ని - 'దేవ సమానుడగు పురోహితునికి శాప మిచ్చుట తగ' దని వారింపగా శాపమీయలేదు. ఇట్లు సౌదాసమహారాజు వసిష్ఠునికి శాప మీయనందున వసిష్ఠుడు > నిమి, నిమి > వసిష్ఠుడు ఇచ్చుకొనిన 'శాపప్రతిశాపములు' ఒకే ఉదాహరణముగా సిద్ధించును.

## 52. మిత్రదేవత > ఊర్వశి ఉత్తరకాండ 56

విదేహులైన నిమివసిష్ఠులు తిరిగి నూతనశరీరము లెట్లు పొందగలిగిరని లక్ష్మణు డడుగగా రాము డిట్లు చెప్పెను.

పరస్పరశాపములతో నిమివసిష్ఠు లిద్దరూ తమ తమ దేహములు విడిచి

వాయురూపము లందిరి. శరీరరహితుడైన పిమ్మట వసిష్ఠుడు నూతనశరీరమునకై బ్రహ్మ వద్దకు పోయి యిట్లు చెప్పెను - 'దేహము లేని ప్రాణి కే కార్యమును చేయుటకు వీలుండదు. కనుక నాకు వేరొక శరీరము లభించునట్లు కరుణింపుడు.' అందుపై బ్రహ్మ అతనితో నిట్లనెను - 'మహాయశస్వివగు ఓ ద్విజశ్రేష్ఠా! నీవు మిత్రావరుణులు విడిచిన తేజము (వీర్యము) లో ప్రవేశింపుము. అట్లు ప్రవేశించినను నీవు తిరిగి అయోనిజుడవుగనే జన్మించెదవు.' ఈ మాటలు విని వసిష్ఠుడు బ్రహ్మకు ప్రణమిల్లి ప్రదక్షిణము చేసి వాయురూపమున వరుణ లోక మరిగెను. ఆ సమయమున మిత్రుడు వరుణునితో కలిసి అధికారము వహించి పాలించుచుండెను. అట్లుండి అతడు సమస్తదేవతల చేతను పూజింపబడుచుండెను. ఇట్లుండగా అప్సరస యగు ఊర్వసి తన సఖీజనముతో కలిసి అచ్చటకు వచ్చెను. ఆమెను చూచి వరుణునికి మిక్కిలి ఉల్లాసము కలిగెను. అత డామెను సమాగమమున కాహ్వానించెను. 'మిత్రుడు స్వయముగా మున్నే నన్నామంత్రించె' నని ఊర్వశి వరుణున కెరిగించెను. అది వినియు కామబాణపీడితుడైన వరుణుడు- 'నీవు నన్ను కాదన్నచో, నేను నీ సమీపమున నున్న ఆ దేవనిర్మితమైన కుంభమున వీర్యము విడిచెద' ననెను. ఊర్వశి దాని కనుమతించెను. కాని ఊర్వశీవరుణులు ఒకరియం దొకరు గాఢముగా ననురక్తులు కాని ఆ సమయమున ఊర్వశీశరీరము మిత్రుని యధికారమున నుండెను. కనుక వరుణుడు తన మహాద్భుతతేజమును దేవకుంభమందు విడిచెను. తరువాత ఊర్వశి మిత్రుని కలిసెను. అతడు మిక్కిలి కోపించి ఆమెతో నిట్లనెను.

*మయాఽభిమంత్రితా పూర్వం కస్మాత్ త్వమవిశజ్జినీ,*
*పతిమన్యం వృతవతీ కిమర్థం దుష్టచారిణీ.* 23

*'అనేన దుష్కృతేన త్వం మత్కోఽధకలుషీకృతా,*
*మనుష్యలోక మాస్థాయ కంచిత్ కాలం నివత్స్యసి.* 24

*బుధస్య పుత్రో రాజర్షిః కాశిరాజః పురూరవాః,*
*తమభ్యాగచ్ఛ దుర్బుద్ధే స తే భర్తా భవిష్యతి.* 25

'ఓసీ దురాచారిణీ, నేను ముందుగా నిన్ను సమాగమమునకు ఆమంత్రించగా నన్ను విడిచి, శంకలేక, నీవు వేరొకనిని పతిగా ఎట్లు వరించితివి? నీవు చేసిన ఈ పాపకృత్యమునకు ఫలముగా, నా కోపమునకు గురియై నీవు మనుష్యలోకము

చేరి నివసింపుము. అక్కడ బుధుని పుత్రుడైన పురూరవుడు కాశీరాజ్య మేలుచున్నాడు. నీవతని వద్దకు పొమ్ము. అతడు నీకు భర్త కాగలడు.'

మిత్రు డిచ్చిన శాపమువలన ఊర్వశి మానవలోకమునకు వచ్చి, కొన్ని నియమము లేర్పరచి పురూరవుని పత్నియైనది.

## 53. శుక్రాచార్యుడు > యయాతి — ఉత్తరకాండ 58

'మహారాజయిన నిమి క్షత్రియుడు, శూరవీరుడు, పైగా యజ్ఞదీక్ష వహించినవాడు. కనుక అతడు వసిష్ఠుని పట్ల ఉచితముగా ప్రవర్తింపలేదు.' అని లక్ష్మణు డనగా రాముడు దానికి బదు లిట్లు పల్కెను - 'పురుషులందరి యందును అట్టి క్షమాగుణము కనిపించదు. అది యయాతిలో నుండెను. తక్కినవారు కోప మాపుకొనలేరు' అని అతడు తన మాట కుదాహరణముగా యయాతికి లభించిన శాపమునుగూర్చి చెప్పెను.

నహుషపుత్రుడైన యయాతి సత్త్వగుణసంపన్నుడు. అతని కిరువురు భార్యలు. ఒకతె శర్మిష్ఠ, రెండవయామె దేవయాని. శర్మిష్ఠకు పూరుడు పుట్టెను. దేవయానికి యదువు జన్మించెను. తల్లి ప్రేమవలనను, తన నైజగుణములవల్లను పూరుడు రాజుకు మిక్కిలి ప్రీతిపాత్రు డాయెను. ఇది చూచి యదువు మనసులో కించపడి తన తల్లి దేవయానితో ఇట్లు పల్కెను - 'అమ్మా! నీవు మహాత్ముడైన శుక్రాచార్యుని కులమున పుట్టితివి. అయినను, ఇచ్చట దుస్సహమగు నవమానము భరించుచుంటివి. కనుక మన మిద్దరము అగ్నిలో పడి చనిపోవుదము. కాదని, నీ వీ అవమానము సహింపదలచినచో నాకు ప్రాణత్యాగము చేయుటకు అనుమతినిమ్ము. నేను మాత్రము నిస్సందేహముగా మరణించెదను.' యదువు మాటలు విని దేవయానికి మిక్కిలి కోపము వచ్చెను. ఆమె అప్పుడే తన తండ్రి శుక్రాచార్యుని స్మరించెను. అత డా క్షణమే అచట ప్రత్యక్షమయ్యెను. కుమార్తెను అస్వస్థత చెంది, ప్రసన్నత లేక, అచేతనావస్థలో చూచి అతడు దానికి కారణ మడిగెను. 'నేను మండుచున్న అగ్నిలో దూకెదను. లేదా విషము త్రాగెదను. కాని యీ విధమైన అవమాన భరితమైన జీవిత మిక సహింపను. నా పతి తమపట్ల అనాదరము చూపుట చాలక నన్నుకూడ అనాదరించి అవమానించుచున్నాడు.' అని దేవయాని తండ్రి కెరిగించెను. కుమార్తె మాటలు విని శుక్రాచార్యుడు కుపితుడై యయాతి నిట్లు శపించెను.

*యస్మాన్మామవజానీషే నాహుష త్వం దురాత్మవాన్,*
*వయసా జరయా జీర్ణః శైథిల్యముపయాస్యసి.* 23

'నహుషపుత్రా, నివు దురాత్ముడవై అకారణముగా నన్నుపమానించుచున్నావు. కనుక నీ యౌవనము జరాజీర్ణమై నీవు ముసలివాడ వగుదువు గాక. నీవు సర్వవిధముల శిథిలుడ వగుదువు.'

క్షత్రియధర్మ మవలంబించి యయాతి శుక్రు డిచ్చిన శాపమును సహించెను.

## 54. యయాతి > యదువు

శుక్రాచార్యుని శాపముచే యయాతికి వృద్ధావస్థ ప్రాప్తించెను. కాని దానిని అతదు ఇతరుల కిచ్చుటకు వీలుండెను. అందువలన అతడు తన కుమారు లిద్దరిని పిలిచి తన వృద్ధావస్థను గ్రహింపవలసినదని కోరెను. అప్పుడు పూరు డది స్వీకరించెను. పిదప యయాతి యదువును శపించెను. శ్రీరాము డా శాపకథను లక్ష్మణునితో చెప్పుచుండెను.

విలక్షణమైన జరావస్థను పొందిన యయాతి యదువుతో నిట్లనెను- 'కుమారా! నాకు బదులుగా వేరొకరి శరీరము నావహింపదగిన ఈ జరావస్థను నీవు గ్రహింపుము. నాకు భోగవాంఛలు తీర్చుకొనుట కవకాశమిమ్ము. నాకింకను విషయసుఖాభిలాష తీరలేదు. ఇష్టానుసారము సుఖభోగము లనుభవించిన పిదప నేను తిరిగి నీవద్దనుండి నా ముసలితనమును గ్రహించెదను. 'అతని మాటలు విని యదు విట్లు బదులు చెప్పెను- 'మీ ప్రియపుత్రుడు పూరు డీ ముసలితనము గ్రహించుగాక. నన్ను మీరు మీ సంపదకు అధికారమునకు కూడ వెలిచేసినారు. కనుక మీ రెవరితో కలిసి భుజించుచున్నారో వారే యీ ముసలితనము గ్రహింపదగును.' యదువు చెప్పినది విని యయాతి పూరుని పిలిచి 'నాయనా! నా సౌఖ్యము కొరకు నీ వీ ముసలితనము గైకొనుము' అని చెప్పెను. అప్పు డతడు తన యౌవనమును తండ్రి కిచ్చి అతని ముసలితనమును తాను గ్రహించెను. యయాతి సంతసించెను. కాని యదువుపై కోపించి అతనితో నిట్లనెను--

*రాక్షసస్త్వం మయా జాతః క్షత్రరూపో దురాసదః,*
*ప్రతిహంసి మమాజ్ఞాం త్వం ప్రజార్థే విఫలో భవ.* 14

*పితరం గురుభూతం మాం యస్మాత్ త్వమవమన్యసే,*
*రాక్షసాన్ యాతుధానాంస్త్వం జనయిష్యసి దారుణాన్.* 15

*న తు సోమకులోత్పన్నో వంశః స్థాస్యసి దుర్మతేః,*
*వంశోఽపి భవతస్తుల్యో దుర్వినీతో భవిష్యతి.* 16

'నేను దుర్జయక్షత్రియరూపము దాల్చిన నీ వంటి రాక్షసునకు జన్మ నిచ్చితిని. నీవు నా ఆజ్ఞ నుల్లంఘించితివి. కనుక నీ సంతానము రాజ్యాధికారమునకు వెలియగును. నేను తండ్రిని, గురువును అయినను నన్ను నీ వవమానించితివి. కనుక నీకు భయంకరులైన రాక్షసులు, యాతుధానులు జన్మించెదరు. నీ బుద్ధి వికృతమైనది. కనుక నీ సంతతికి చంద్రవంశమువారికి వరంపరగా సిద్ధించు రాజరికము లభింపదు. నీ సంతతి వారు కూడ నీ వలెనే ఉద్దండులగుదురు.

పిదవ యౌవనముంది యయాతి ఎన్నో యజ్ఞయాగములు చేసి వేల కొలది సంవత్సరములు భూమి నేలి, చివరకు పూరునికి యౌవన మిచ్చి తన ముసలితనమును తిరిగి గ్రహించెను. పూరుని రాజ్యాభిషిక్తుని చేసెను.

## 55. కుక్క > భిక్షుకుడు ఉత్తరకాండ ప్రక్షిప్త స.2/59, స.60

ఈ కథ శ్రీరాముని నిష్పక్షన్యాయపాలనను వివరించునట్టిది. వసిష్ఠ కశ్యపమునులు, వ్యవహారదక్షులైన మంత్రులు, ధర్మజ్ఞులైన పండితులు, వేదవేత్తలైన బ్రాహ్మణులు, నీతికోవిదులు, రాజులు, తదితరసభాసదులు గల రాజసభలో శ్రీరాముడు రాజధర్మములను పాలించుచుండెను. అతని రాజ్యమున ఎల్లరకు ధర్మయుక్తమగు శాసనము చెల్లుచుండెను. ఎవరికిని ఏ విధమైన బాధలును లేవు. ఎవరును ఎవరిని గురించియు అభియోగము వినిపించలేదు. అయినను రాముడు తనవద్దకు కార్యార్థియై ఎవడైన వచ్చినేమో అని తెలిసికొనుచుండెను. ఒకసారి ఒక కుక్క రాజద్వారము చెంతకు వచ్చి అచ్చట గల లక్ష్మణుని వైపు చూచుచు అరవసాగెను. లక్ష్మణుడు దానిని దుఃఖ కారణ మడిగెను. అందుపై ఆ కుక్క - 'అన్ని భూతములకు శరణ్యుడై, క్లేశరహితకర్ముడై, అభయప్రదాతయై వెలుగు శ్రీరాముని సమక్షముననే నేను నా కార్యము సాధింప నెంచెదను' అని వలికెను. లక్ష్మణుడు దానిని రాజభవనములోనికి గొనిపోవ నెంచెను. కాని అది రాముని యాజ్ఞ లేనిదే నేను లోనికి రాజాల

ననెను. తర్వాత రాము డభయమిచ్చి ఆ కుక్కను రాజభవనములోనికి రప్పించి, కార్య మేమో చెప్పుమనెను. ఆకుక్కకు తల పగిలియుండెను. 'ప్రభూ! సర్వార్థసిద్ధుడను నొక భిక్షుకుడు బ్రాహ్మణుల యిండ్ల వసించుచున్నాడు. అత డీ దినము నన్నకారణముగా ఇట్లు కొట్టెను.' అని అది విన్నవించెను. రాముడు వెంటనే ఆ భిక్షుకుని పిలిపించెను. కుక్క నెందుకు కొట్టినావని యడుగగా నతడు 'భిక్షాసమయము ముగిసినది. అయినను ఆకలిచే నే నింటింటికి తిరిగి భిక్ష వేడుచుంటిని. ఈ కుక్క త్రోవ కడ్డముగా నిల్చినది. నేను మరల మరల త్రోలినను అది పోలేదు. అందువలన కోపము కల్గి నేను దాని తలపై నా కర్రతో కొట్టితిని. మహారాజా, నేనపరాధిని. నన్ను దండింపుడు. మీవల్ల శిక్షింపబడినచో నాకు తిరిగి నరక మేగు నవసరము కల్గదు' అని చెప్పెను. రాము డప్పుడు సభాసదులను చూచి - 'ఇతని కేమి శిక్ష ఈయదగునో తెలుపుడు' అని కోరెను. మునులు, ధర్మజ్ఞులు, పండితులు, మంత్రులు, మహాజనులు అందరు సభాసదులును 'ఇతడు బ్రాహ్మణుడు కనుక అవధ్యుడు. ఇతనికి శారీరకశిక్ష ఈయదగదు.' అని పలికిరి. అందుపై ఆ కుక్క సవినయముగా నిట్లనెను-

*యది తుష్టోऽసి మే రామ యది దేయో వరో మమ,* 37
*ప్రతిజ్ఞాతం త్వయా వీర కిం కరోమీతి విశ్రుతమ్,*
*ప్రయచ్ఛ బ్రాహ్మణస్యాస్య కౌలపత్యం నరాధిప,* 38
*కాలంజరే మహారాజ కౌలపత్యం ప్రదీయతామ్.* 39

'రామచంద్రా! నన్ననుగ్రహించి నా కోర్కె మన్నింపదలచినచో నా విన్నపము వినుము. మహారాజా, నీవు ప్రతిజ్ఞాపూర్వకముగా నా కార్యము సాధింతునని చెప్పితివి. ఇట్లు ప్రతిజ్ఞాబద్ధుడవైనందున నేను కోరినట్లుగా ఈ బ్రాహ్మణుని కులపతి (మహంతు) గా నొనర్చుము. ఇతనిని కాలంజర పర్వతమున నొక మఠాధిపతిగా నియమింపుము.'

రాము డా బ్రాహ్మణునికి మఠాధిపత్యమిచ్చెను. వెంటనే అతడు ఏనుగపై సవారి చేయుచూ, సంతోషముగా నటనుండి వెడలిపోయెను.

అప్పుడు శ్రీరాముని మంత్రులు చిరునవ్వులో నిట్లనిరి - 'మహారాజా! వీనికి మీరు వరమిచ్చిరి. శాపముగాని శిక్షగాని యిచ్చినట్లు లేదు.' దానికి రాము డిట్లనెను - 'ఏ కర్మ కెట్టి పరిణతి కలుగునో, దేనివలన జీవున కెట్టి

గతి కలుగునో, మీ రెరుగరు. బ్రాహ్మణునకు మఠాధిపత్య మెందు కీయపలెనో అది యీ కుక్క బాగుగా నెరుగును.'

అప్పుడు రాముడు ప్రశ్నింపగా ఆ కుక్క యిట్లు పలికెను - 'నేను క్రిందటి జన్మలో మఠాధిపతిని. అక్కడ యజ్ఞశిష్టాన్నము భుజించుచు, దేవబ్రాహ్మణసేవ చేయుచు, దాసదాసీపరివారమునకు న్యాయోచితముగా భాగమిచ్చుచు, శుభకార్యములం దనురక్తిచూపుచూ, శీలసద్గుణసంపత్తితో మెలగి, అందరి మన్నన లందుకొనుచుండెడివాడను. అయినను ఈ జన్మలో నా కీ దుర్గతి పట్టినది. అట్టి యెడ కోపస్వభావుడు, ధర్మము వీడినవాడు, పరులకు కీడు కలిగించుటే పనిగా కలవాడు, క్రూరుడు, కఠినుడు, మూర్ఖుడును అయిన బ్రాహ్మణుడు మఠాధీశుడైనచో తనతోబాటు ఇటు ఏడుతరములు, అటు ఏడుతరముల వారిని కూడ నరకమున పడవేయక మానదు. కనుక ఏ పరిస్థితిలోను మఠాధిపత్యము వహింపరాదు. ఎవడైన ఒకనిని వాని పశుపుత్ర బంధువుల నందరినీ నరకమునకు పంపదలచినచో వానిని దేవబ్రాహ్మణ గోసంస్థల కధిపతిని చేయవలెను. ఎవడు బ్రాహ్మణ, దేవ, స్త్రీ, బాలకుల ధన మపహరించునో, ఎవడు తాను దాన మొసగిన సంపదను తిరిగి తీసికొనునో అతడు ఇష్టబంధుసహితముగా నశించును. దేవబ్రాహ్మణద్రవ్య మపహరించిన వాడు శీఘ్రమే అవీచి అను ఘోరనరకమున పడును.'

ఇది వరము వలె కనుపించు ఘోరశాపము.

## 56. గౌతముడు > బ్రహ్మదత్తుడు

(ఉత్తరకాండ ప్రక్షిప్త.స 3/59 స. 60)

ఒక దుర్బుద్ధికల గ్రద్ద, ఒక గుడ్లగూబగూటిలో చేరెను. పిదప అది ఆ గూడు తనదే అని వాదించుచు గుడ్లగూబతో జగడమునకు దిగెను. చివర కా రెండు పక్షులును తమ తగవు నిర్ణయించుటకు శ్రీరాముని వేడుకొన నిశ్చయించుకొనెను. అట్లు నిశ్చయించి ఆ రెండును శ్రీరాముని సన్నిధికి వచ్చి, అతని గుణగణములను ప్రశంసించి తమ తగవు విన్నవించినవి. రాముడు మంత్రిసహితుడై వాటి తగవు విని ఆ గూడు గుడ్లగూబదే అని నిర్ణయించెను. గ్రద్ద గూబయొక్క గూటి నాక్రమించెను. కనుక దానిని శిక్షింపదలచెను. ఇంతలో ఆకాశవాణి యిట్లు వినిపించెను --

'రామచంద్రా, ఈ గ్రద్ద మునుపే తపోబలముచే దగ్ధమాయెను. కనుక దీని నిప్పుడు వధింపదగదు. కాలరూపుడైన గౌతముడు ముందే దీనిని దగ్ధమొనర్చెను. ఈ గ్రద్ద బ్రహ్మదత్తుడను పేరున విఖ్యాతుడైన శూరవరుడు, సత్యనిష్ఠగల రాజు. ఒకసారి యితనివద్ద కౌక విప్రుడు వచ్చి భోజన మర్థించెను. కాని అతడు తాను గతశతవర్షములలోను తినని భోజనము కావలె ననెను. బ్రహ్మదత్తు డతని కర్ఘ్యపాద్యాదు లిచ్చి భోజనమున కాహ్వానించెను. కాని-

*మాంసమస్యాభవత్ తత్ర ఆహారే తు మహాత్మనః,*
*అథ క్రుద్ధేన మునినా శాపో దత్తోఽస్య దారుణః.* 60

*గృధ్రత్వం భజ వై రాజన్ మావైనం హ్యథ సోఽబ్రవీత్,*
*ప్రసాదం కురు ధర్మజ్ఞ అజ్ఞానాన్మే మహావ్రత.* 61

*శాపస్యాంతో మహాభాగ క్రియతాం వై మమానఘ,*
*తదజ్ఞానకృతం మత్వా రాజానం మునిరబ్రవీత్.* 62

*ఉత్పత్స్యతి కులే రాజ్ఞాం రామో నామ మహాయశాః,*
*ఇక్ష్వాకూణాం మహాభాగో రాజా రాజీవలోచనః.* 63

*తేన స్పృష్టో విపాపస్త్వం భవితా నరపుంగవ.* 64

'ఆ మహాత్మునికి పెట్టిన భోజనమందు మాంసాహార మున్నది. అది చూచి ఆ ముని కోపించి గ్రద్ద వగు మని శపించెను. రా జతనిని శాప మీయవలదని ప్రార్థించుచు, 'ధర్మాత్మా, ఈ అపరాధము తెలిసి చేసినది కాదు. కనుక నన్ను క్షమింపుము. నా కిచ్చిన శాపమును మరలింపుము' అని వేడుకొనెను.

ముని అదంతయు నిజమని గ్రహించి, ఇక్ష్వాకువంశమున మహా యశోభాగుడైన రాజీవలోచనుడు రాము డుదయించును. అతడు నిన్ను ముట్టిన తోడనే నీవు శాపముక్తుడ వగుదువు.' అని పలికెను.

రాము డా గ్రద్దను ముట్టినదే తడవుగా దాని గ్రద్దరూపము తొలగి పోయి, చందనానులిప్తమైన మానవదేహము ప్రాప్తించెను. 'మహారాజా, నీవు నా శాపమును తొలగించితివి. నా కిక నరకవాసము తప్పినది' అని రామునితో పలికి ఆ గ్రద్ద అక్కడనుండి వెడలిపోయెను.

ఈ శాపోపశమనము యాచితము. గోరఖ్‌పూర్‌ప్రతిలో ఈ ప్రక్షిప్తసర్గము లేదు.

## 57. వసిష్ఠుడు > సౌదాసుడు ఉత్తరకాండ 65

వాల్మీకిమహర్షి శత్రుఘ్నునకు సౌదాసుని కథ చెప్పుచుండెను.

శ్రీరాముడు పంపగా శత్రుఘ్నుడు ససైన్యముగా మధువనమునకు పోవుచు, దారిలో వాల్మీకిముని యాశ్రమము చేరెను. ముని అతనికి యథోచిత స్వాగతసత్కారము లందించెను. ఆశ్రమసమీపమున యజ్ఞయూపాదులను చూచి, 'ఇక్కడ యజ్ఞ మెవ రొనర్చిరి? అని శత్రుఘ్నుడు వాల్మీకి నడిగెను. దానికి బదులుగా వాల్మీకిమహర్షి యిట్లు చెప్పెను-

మీ పూర్వజులలో నొకడైన సుదాసుని మనుమడు సౌదాసు డను వా డొకనాడు వేటకై వనమున కేగెను. అక్కడ అతనికి ఇరువురు రక్కసులు కనిపించిరి. వారు పులిరూపములు ధరించి వేలకొలది మృగములను చంపి తినివేసిరి. వారిమూలమున వన మట్లు మృగరహితమగుటచే కోపించి సుదాసుడు వారిలో నొకనిని బాణము వేసి సంహరించెను. దీనివలన రెండవవాడు దుఃఖ సంతప్తుడై నీవు నిరపరాధియైన నా స్నేహితుని చంపినావు. కనుక నేను నీపై దీనికి బదులు తీర్చుకొందు నని పలికెను.

ఆ తరువాత చిరకాలమునకు సౌదాసుడు రాజయ్యెను. అత డీ ఆశ్రమ సమీపమునందు యజ్ఞవాటి నిర్మించి అశ్వమేధము చేసెను. వసిష్ఠమహర్షి తన తపోబలముచే యజ్ఞరక్ష గావించుచుండెను. ఆ యజ్ఞము చాలకాలము జరిగెను. యజ్ఞము పూర్తి కానున్న సమయమున పూర్వవైరమును తలచి ఆ రాక్షసుడు వసిష్ఠుని రూపము ధరించి వచ్చి రాజుతో తనకు వెంటనే మాంసయుక్తభోజనము కావలెనని చెప్పెను. మారురూపులో వచ్చిన రాక్షసుని మాట నెరుగక రాజు వెంటనే వంటవానిని పిల్చి గురునకు మాంసాహారము వండి పెట్టుడని ఆజ్ఞాపించెను. వారు దీని కాశ్చర్యపడిరి. గురువుగా రీ అభక్ష్యభోజన మెట్లు కోరిరి? అని సందేహించిరి. ఇంతలో రాక్షసుడు వంటల వాని రూపము ధరించి నరమాంసయుక్తమగు భోజనము తెచ్చి వసిష్ఠునకు వడ్డించెను. నరమాంసము చూచిన వసిష్ఠు డాగ్రహించి రాజు నిట్లు శపించెను-

*యస్మాత్ త్వం భోజనం రాజన్ మమైతద్దాతు మిచ్ఛసి,*
*తస్మాద్ భోజన మేతత్తే భవిష్యతి న సంశయః. 28*

నా కిట్టి ఆహారము పడ్డింపజేసినందున నీ కిక ఈ విధమైన ఆహారమే తప్పక లభించును.' ఇది విని సౌదాసుడును కోపము వహించి వసిష్ఠుని శపించుటకు జలములు గ్రహించెను కాని రాణి అతని నా కార్యము నుండి నివారించెను.

(చూ. శాప క్ర. 58 సౌదాసుడు > వసిష్ఠుడు)

## 58. సౌదాసుడు > వసిష్ఠుడు ఉత్తరకాండ 65

(చూ. శాప క్ర. 57 - వసిష్ఠుడు > సౌదాసుడు)

వసిష్ఠమహర్షి యిచ్చిన శాపము విని సౌదాసుడు కుపితుడై, ఇతడే మాంసయుక్తభోజనము కావలెనని అడిగి ఇప్పు డిట్లు శాపమిచ్చుచున్నా డేమి అని వగచెను. నిజ మతనికి తెలియదు. అడిగినది వసిష్ఠరూపమున వచ్చిన రాక్షసుడు. వాడే ఆ పిదప వంటవాడై వసిష్ఠునకు నరమాంసాహారము వడ్డించెను. ఈ కథ తెలియక రాజు తాను నిరపరాధి నని యెంచి, వసిష్ఠుడు అకారణముగా తనను శపించెనని తలచి క్రుద్ధుడాయెను. వెంటనే అతడు వసిష్ఠునికి ప్రతిశాప మీయ నెంచి జలములు గ్రహించెను. కాని రాణి మదయంతి అడ్డుపడి, అతనితో నిట్లనెను-

*రాజన్ ప్రభుర్యతోఽస్మాకం వసిష్ఠో భగవాన్ ఋషిః,*
*ప్రతిశప్తుం న శక్తస్త్వం దేవతుల్యం పురోధసమ్. 30*

'రాజా, వసిష్ఠమహర్షి మనకు ప్రభువు, బ్రహ్మర్షి, పురోహితుడు. అతనికి శాప మీయదగదు.' ఇట్లు చెప్పి వారించినందున రాజు శాప మిచ్చుటకై గ్రహించిన జలములను తన పాదములపై చల్లుకొనెను. అతని పాదములు వెంటనే దగ్ధమయ్యెను. అప్పటినుండి సౌదాసుడు కల్మాషపాదు డనబడెను.

అటుపిమ్మట రాజు పత్నీసహితముగా వసిష్ఠుని కాళ్లపై బడి, 'మీ రూపము ధరించి వచ్చి నన్నెవడో మోసగించెను. అట్టి భోజనము కావలెనని మీరు కోరినట్లెంచి పొరపాటు చేసితి' నని చెప్పెను. మహర్షి దివ్యదృష్టిని

జూచి జరిగినదంతయు గ్రహించి రాజుతో నిట్లనెను-

మయా రోషపరీతేన యదిదం వ్యాహృతం వచః,
నైత చ్ఛక్యం వృథా కర్తుం ప్రదాస్యామి చ తే వరమ్. 35
కాలో ద్వాదశవర్షాణి శాపస్యాంతో భవిష్యతి,
మత్ప్రసాదాచ్చ రాజేంద్ర అతీతం న స్మరిష్యసి. 36

'రాజా! నేను రోషపూరితుడనై శాప మిచ్చితిని. అది వ్యర్థముకాదు. కాని దీనిని శమింపజేయుటకు నేను నీకు వర మిచ్చెదను. ఈ శాపము నిన్ను పండ్రెండు సంవత్సరములు బాధించును. ఆ పై తొలగిపోవును. నా కృపచే నీకు ఈ జరిగినదంతయు స్మృతిలో నుండదు.'

వసిష్ఠు డిచ్చిన ఈ వరము శాపశాంతి వంటిది.

## 59. శుక్రాచార్యుడు (భార్గవుడు) > దండుడు ఉత్తరకాండ 81

అగస్త్యముని శ్రీరామునకు రాజపుత్రుడైన దండున కీయబడిన శాపకథ వివరించుచుండెను.

దండరా జొకసారి మనోహరమగు మధుమాసమున శుక్రాచార్యుని ఆశ్రమమునకు వెళ్లెను. అక్కడ అతడు శుక్రాచార్యుని కుమార్తెను చూచెను. ఆమె త్రిలోకసుందరి. ఆమెను చూచి రాజునకు కామోద్వేగము కల్గెను. ఆమెను కౌగలింపబోగా అతనితో నామె సవినయముగా నిట్లనెను. 'రాజేంద్రా, నేను శుక్రాచార్యుని కుమార్తెలలో జ్యేష్ఠురాలను. నాపేరు అరజ. నన్ను బలవంతముగా ముట్టుకొనబోకుము. నా తండ్రి మీకు గురువు. నీ వతని శిష్యుడవు. ఆ మహాతపస్వి కోపించినచో నీకు మహావిపత్తు సంభవించును. నీవు నన్ను వరింపదలచినచో అతని నడిగి, ధర్మశాస్త్రోక్తమగు పద్ధతిలో వరింపుము. నీవు పోయి అడిగినచో మా తండ్రి కాదనడు.' ఆమె చెప్పినమాటలు కామాంధుడు మదోన్మత్తుడు నైన దండునికి నచ్చలేదు. 'సుందరీ! కాలము వ్యర్థము చేయకుము. నీకొరకు నా ప్రాణములు హరించుకొని పోవుచున్నది. నిన్ను పొందిన పిమ్మట నాకు ప్రాణభీతిగాని దుఃఖవ్యథగాని గణింపరానివి. నా కా చింతలేదు. కనుక నన్ను వ్యాకులపెట్టక వెంటనే అంగీకరింపుము.' అని పల్కుచు అత డా భార్గవకన్యను బలవంతముగా తన కౌగిలి కీడ్చెను.

తప్పించుకొన నెంచి ఆమె ఎంతగనో పెనుగులాడెను. అయిననూ విడువక అత డామెను బలాత్కరించి అనుభవించెను. ఆ తర్వాత అతడు వెంటనే తన నగర మరిగెను. అరజ దుఃఖించుచు ఆశ్రమప్రాంతమున తండ్రికై నిరీక్షించు చుండెను.

శుక్రుడు వచ్చి శోకాకులయై యున్న కుమార్తెను చూచి, సర్వము గ్రహించెను. వెంటనే ఆ మహాతేజస్వి పట్టరాని కోపమున శిష్యులతో నిట్లనెను.

*పశ్యధ్వం విపరీతస్య దండస్యావిదితాత్మనః,*
*విపత్తిం ఘోరసంకాశాం క్రుద్ధాదగ్నిశిఖామివ.* 4

*క్షయోఽస్య దుర్మతేః ప్రాప్తః సానుగస్య దురాత్మనః,*
*యః ప్రదీప్తాం హుతాశస్య శిఖాం వై స్ప్రష్టు మిచ్ఛతి.* 5

*యస్మాత్ స కృతవాన్ పాపమీదృశం ఘోరసంహితమ్,*
*తస్మాత్ ప్రాప్స్యతి దుర్మేధాః ఫలం పాపస్య కర్మణః.* 6

*సప్తరాత్రేణ రాజాసౌ సపుత్రబలవాహనః,*
*పాపకర్మసమాచారో వధం ప్రాప్స్యతి దుర్మతిః.* 7

'శాస్త్రవిరుద్ధాచరణశీలుడైన యీ మూర్ఖుడు దండుడు నా కోపాగ్ని కాహుతి కాగలడు. ఈ దుర్బుద్ధికి వినాశకాలము వచ్చినది, చూడుడు. ఇతడు మండుచున్న అగ్నికీలను కౌగిలింపబోయెను ఇట్టి పాపకార్య మొనర్చిన దానికి ఫల మవశ్య మందుకొనగలడు. నేటినుండి సప్తరాత్రములలో అతడు పుత్రమిత్రబలసహితముగా నశించిపోవును.'

ఇట్లు శాపమిచ్చి శుక్రాచార్యుడు తన ఆశ్రమవాసులతో 'మీ రీ రాజ్యము దాటిపోయి వేరొకచోట నివసింపు' డని చెప్పెను. శుక్రాచార్యుడు పల్కినట్లుగనే వారము దినములలో దండుని రాజ్యము సర్వము నశించిపోయెను.

## 60. శుక్రాచార్యుడు > దండకారణ్యము ఉత్తరకాండ 81

దండకారణ్యము నిర్జన మగుటకు కారణ మడుగగా అగస్త్యుడు శ్రీరాముని కిట్లు చెప్పెను.

(చూ. శాప క్ర. 59 శుక్రాచార్యుడు > దండుడు.)

వింధ్య-శైవలగిరుల మధ్యభాగమున దండుని రాజ్యముండెను. ధర్మయుగమగు కృతయుగమున ధర్మవిరుద్ధముగా వర్తించినందున శుక్రాచార్యుడు రాజును, అతని రాజ్యభూమిని కూడ శపించెను.

*సమంతాద్యోజనశతం విషయం చాస్య దుర్మతేః,*
*ధక్ష్యతే పాంసువర్షేణ మహతా పాకశాసనః. 8*

*సర్వసత్త్వాని యానీహ స్థావరాణి చరాణి చ,*
*మహతా పాంసువర్షేణ విలయం సర్వతోऽగమన్. 9*

*దండస్య విషయో యావత్ తావత్సర్వం సముచ్ఛ్రియమ్,*
*పాంసువర్షమివాలక్ష్యం సప్తరాత్రం భవిష్యతి. 10*

'ఈ రాజు రాజ్యమునకు చుట్టును నూరు యోజనముల భూమి వరకు గల ఈ భాగమంతయు ఇంద్రునిచే వర్షింపబడిన ధూళివర్షమున మ్రుంగిపోగలదు. ఇచ్చట గల స్థావరజంగమజీవు లన్నియు ధూళివర్షమున నశింపగలవు. దండుని రాజ్య మెంతవర కున్నదో అంతవరకు గల సమస్త ప్రాణికోటియు ఏడు రాత్రులలో ధూళివర్షమున మునిగి నశించును.' అని శాపమిచ్చెను. (ఇట్లు పాడుపడిన దండుని రాజ్యమే దండకారణ్యము).

## 61. దుర్వాసుడు > లక్ష్మణుడు ఉత్తరకాండ 105

శ్రీరాముని అవతారకార్యము సమాప్తమైనందున బ్రహ్మ అతని భవిష్యకార్యమును గూర్చి కాలునిద్వారా అతనికి సందేశమంపెను. కాలుడు వచ్చి ఆ సందేశము నితరులు వినరాదనియు, శ్రీరాముడు తన కేకాంత మీయదగుననియు చెప్పెను. రాముడు లక్ష్మణుని పిల్చి, 'నీవు ద్వారమున నిల్చి ఎవరినీ లోనికి రానివ్వకుము. మా మాటలు వినినవాడును, మేము మాట్లాడుకొనుచుండగా చూచినవాడును కూడ వధార్హు డగును' అని చెప్పెను.

వారిద్దరు మాట్లాడుకొనుచుండగా దుర్వాసమహర్షి రాజద్వారమునకు వచ్చెను. అతడు తత్క్షణమే రాముని చూడ నెంచెను. రాము డిప్పుడు కార్యాంతరమున నున్నందున రెండు ఘడియలు వేచియుండు' మని లక్ష్మణు డతనితో పలికెను. దానిపై కోపించి కన్నెఱ్ఱచేసి నేత్రాగ్నిచే దహింప నున్నట్లు లక్ష్మణుని మహోగ్రముగా జూచుచూ, అత డిట్లనెను-

అస్మిన్ క్షణే మాం సౌమిత్రే రామాయ ప్రతివేదయ,
అస్మిన్ క్షణే మాం సౌమిత్రే న నివేదయసే యది.
విషయం త్వాం పురం చైవ శపిష్యే రాఘవం తథా. 6

భరతం చైవ సౌమిత్రే యుష్మాకం యా చ సంతతిః,
న హి శక్ష్యామ్యహం భూయో మన్యుం ధారయితుం హృది. 7

'లక్ష్మణా! నీవు తత్క్షణమే పోయి రామునకు నా రాక తెలియజేయుము. నీవు వెంటనే నా ఆగమనవార్త రాముని కెరిగింపకున్నచో ఈ రాజ్యమును, నగరమును, నిన్నును, రాముని, భరతుని, మీ సంతానమును కూడ శపించెదను. నే నీ కోపము పట్టజాలను.' దుర్వాసుని ఘోరవచనములు విని లక్ష్మణుడు తనలో నిట్లు వితర్కించెను--

'అందరి వినాశము జరుగుటకు బదులు, నా యొక్కని మరణము శ్రేయస్కరము'. ఇట్లు నిశ్చయించి అతడు రాముని యాజ్ఞ నుల్లంఘించి, దుర్వాసుని రాకనుగూర్చి రాముని కెరిగించెను. కాలుడు, దుర్వాసుడు వెళ్ళిపోయిన పిదప లక్ష్మణుడు రామునివద్దకు వచ్చి 'మీరు నిశ్చింతగా నన్ను వధింపుడని' కోరెను. మీ ప్రతిన నిల్పుకొనుడని చెప్పెను.

ఇక్కడ శాపము ప్రత్యక్షముగా ఇవ్వబడలేదు.

# శపథములు

## 1. రాముని శపథము అరణ్యకాండ 24

మహాబలవంతుడైన ఖరరాక్షసుడు ససైన్యముగా వచ్చి రాముని యాశ్రమము వైపుకు నడిచెను. రామలక్ష్మణుల కా సమయమున నెన్నో దుర్నిమిత్తములు పొడసూపెను. ఆ సమయమున శ్రీరాముడు చూచిన ఉత్పాతములు ప్రజల కనిష్టసూచకములు. ఆకాశమున ధూసరవర్ణమేఘములు ప్రచండముగా గర్జించుచు రక్తధారలు వర్షింపదొడగెను. వెంటనే కొన్ని శుభ సూచకములైన నిమిత్తములు కూడ తోచెను. అవి విజయసూచకములు అయినను రాముడు ముందు జాగ్రత్తగా లక్ష్మణునితో నిట్లు చెప్పెను – 'నీవు సీతను తోడ్కొని వృక్షాచ్ఛాదిత మయిన పర్వతగుహలోని కరుగుము.' ఇట్లు చెప్పి లక్ష్మణుడు మారు చెప్పకుండునట్లు తిరిగి యిట్లనెను –

*ప్రతికూలితుమిచ్ఛామి న హి వాక్యమిదం త్వయా,*
*శాపితో మమ పాదాభ్యాం గమ్యతాం వత్స మా చిరమ్.* 13

'నీవు ప్రతికూలముగా మాటాడవలదని నా కోర్కె. నీకు నా పాదములపై ఒట్టు. నామాట ప్రకారము సీతను రక్షించుటకు గుహాముఖమున కరుగుము.'

వీరుడు, శూరుడు నైన లక్ష్మణుడు స్వయముగానే ఆ రాక్షసుల నెదిరింపగల డను విషయములో రామునికి సందేహము లేదు. కాని వారిని తానే స్వయముగా సంహరింపనెంచెను. అందుకని అతడు లక్ష్మణుని మాటాడనీయలేదు.

## 2. సీత చేసిన అగ్ని శపథము సుందరకాండ 53

లంకలో రాజసభలోనికి వచ్చిన హనుమంతుని చూచి రావణునకు లోలోన నొక సందేహము కలిగెను. అతనికి నందీశ్వరుడు పూర్వము తన

కిచ్చిన శాపము జ్ఞప్తికి వచ్చెను. అతడు హనుమంతుని వధించుటకు నిశ్చయించెను. కాని విభీషణు డా సమయమున దూతననియు, సుగ్రీవుడు పంపగా వచ్చినాననియు చెప్పుచున్న హనుమంతుడు దౌత్యధర్మము ననుసరించి వధార్హుడు కాడని చెప్పెను. అందుపై రావణుడు హనుమంతుని తోకకు నిప్పు పెట్టి ఊరంతయు త్రిప్పిరండనెను. రాక్షసు లా మాటపై హనుమంతుని తోకకు బట్టలు చుట్టి, చమురు పోసి, నిప్పంటించిరి. హనుమ రాక్షసు లందరిని సంహరింప సమర్థుడు. కాని అనుకొనిన కార్య మింకను పూర్తి కాలేదు. కనుక వారు చేసిన అవమానమంతయు సహించుచుండెను. అతడు లంకెంతయు చక్కగా చూడనెంచెను. అతని కోర్కె యిప్పు డనాయాసముగా పూర్తికాజొచ్చెను. అగ్నివలన హనుమంతుని తోక కంతగా బాధ కలుగలేదు. కాని లంక పూర్తిగా కాలిపోయెను. రాక్షసస్త్రీలవలన ఈ వార్త వినిన సీత మదిలో మిక్కిలి సంతాపమందెను. హనుమంతుని సందేశము విన్న మీదట ఆమె కతడు నిస్సంశయముగా రామదూత యని తెలిసెను. కనుక హనుమంతుని క్షేమమునకై ఆమె అగ్నిదేవుని ప్రార్థించెను.

*యద్యస్తి పతిశుశ్రూషా యద్యస్తి చరితం తపః,*
*యది వాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః.* 27

'అగ్నిదేవా! నేను పతిసేవాపరాయణురాల నగుదునేని, నాలో తపఃశక్తియు పాతివ్రత్యబలము నున్నవేని, నీవు హనుమంతునికి చల్లనగుము. మరియు,

*యది కించిదనుక్రోశస్తస్య మయ్యస్తి ధీమతః,*
*యది వా భాగ్యశేషో మే శీతో భవ హనూమతః.* 28

*యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసామ్,*
*న విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః.* 29

*యది మాం తారయేదార్యః సుగ్రీవః సత్యసంగరః,*
*అస్మాద్ దుఃఖాంబుసంరోధాచ్ఛీతో భవ హనూమతః.* 30

'రామచంద్రునికి నాయం దేమాత్రము దయయున్నను, నాయం దేపాటి సౌభాగ్యశేషమున్నను, అగ్నిదేవా, నీవు హనుమంతునికి చల్లనగుము. రాముడు

నేను సచ్ఛీల ననియు, తనను చేర నుత్కంఠిత ననియు నమ్ముచున్నచో, అగ్నీ, నీవు హనుమంతునికి శీతలమగుము. సత్యప్రతిజ్ఞుడైన సుగ్రీవుడు నన్నీ దుఃఖసాగరము నుండి ఉద్ధరింపగలడేని, ఓ అగ్నీ! నీవు హనుమంతునికి చల్లగా నగుము.'

## 3. శ్రీరాముని శపథము యుద్ధకాండ 19

శ్రీరాముడు విభీషణునితో శపథపూర్వకముగా నిట్లు పలికెను-

విభీషణుడు రాముని శరణు జొచ్చెను. రాము డతని కభయమిచ్చెను. పిదప అతనిని రాక్షసుల బలవిశేషములను గూర్చి చెప్పుమని కోరెను. అప్పుడు విభీషణుడు రావణునికి బ్రహ్మవలన లభించిన వరములు చెప్పి, అత డవధ్యుడనియు, సోదరుడగు కుంభకర్ణుడు మహాబలసంపన్ను డనియు, యుద్ధమున ఇంద్రునంత బలశాలియనియు, రావణుని కుమారుడైన మేఘనాదుడు యుద్ధకళానిష్ణాతు డనియు, మహోదర, మహాపార్శ్వ, అకంపనాదు లజేయు లనియు చెప్పెను. అది విని రాము డాలోచించి యిట్లనెను- 'నీవు చెప్పినది చక్కగా తెలిసికొంటిని.

*అహం హత్వా దశగ్రీవం సప్రహస్తం సహాత్మజమ్,*
*రాజానం త్వాం కరిష్యామి సత్యమేతచ్ఛృణోతు మే.* 19

*రసాతలం వా ప్రవిశేత్ పాతాలం వాపి రావణః,*
*పితామహసకాశం వా న మే జీవన్విమోక్ష్యతే.* 20

*అహత్వా రావణం సంఖ్యే సపుత్రజనబాంధవమ్,*
*అయోధ్యాం న ప్రవేక్ష్యామి త్రిభిస్తైర్భ్రాతృభిః శపే.* 21

రావణుని సపుత్రప్రహస్తాదికముగా వధించి నిన్ను నేను లంకాధిపతిగా చేయుదును. రావణుడు రసాతల మేగినను, పాతాళము చేరినను, బ్రహ్మ వద్ద కరిగినను, అతడు నాచేతినుండి ప్రాణములతో బయటపడజాలడు. నేను నా ముగ్గురు తమ్ములు ప్రమాణముగా ఈ యుద్ధములో రావణుని సపుత్ర బాంధవముగా వధించి గాని అయోధ్యలో అడుగుపెట్టను.'

శ్రీరాముని వచనములు విని విభీషణు డతనికి శిరసా నమస్కరించి, రాక్షససంహారమందును, లంకాపురీవిజయమందును తాను కూడ యథాశక్తి సహాయపడగలనని చెప్పెను. రాము డది విని చాల సంతోషించెను. వెంటనే

అతడు లక్ష్మణుని పిల్చి అప్పుడే సముద్రజలములు తెచ్చి లంకారాజ్యమునకు విభీషణు నభిషిక్తుని చేయుమని పలికెను.

## 4. లక్ష్మణుడు బాణముపై శపథముచేయుట యుద్ధకాండ 90

ఇంద్రజిత్తు లక్ష్మణులమధ్య ఘోరయుద్ధ మాయెను. లక్ష్మణుడు ఇంద్రజిత్తు ప్రయోగించిన బాణము లన్నిటిని వమ్ముచేసెను. పూర్వము దేవాసురయుద్ధములో దేవేంద్రు డే అస్త్రము ప్రయోగించి దానవులపై విజయమందెనో, ఆ ఐంద్రాస్త్రమును లక్ష్మణుడు గ్రహించెను. అది విషసర్పమువలె విరోధి ప్రాణము లపహరించును. కనుక దేవతలు దానిని పూజించుచుందురు. ఆ అస్త్రమును తీసి వింటిపై సంధించి తన మనోభీష్టసిద్ధికై లక్ష్మణు డిట్లు పలికెను--

*ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది,*
*పౌరుషే చాప్రతిద్వంద్వశ్శరైనం జహి రావణిమ్.* 69

'దశరథాత్మజుడైన రాముడు ధర్మాత్ముడు, సత్యసంధుడు, అసమాన పౌరుషశాలియు నైనచో ఓ అస్త్రమా! నీవీ రావణపుత్రుడైన మేఘనాదుని వధింపుము.'

## 5. శ్రీరాముని శపథము ఉత్తరకాండ 45

అగ్నిప్రవేశము చేసి సీత తన సచ్ఛీలపాతివ్రత్యములను ప్రమాణిత మొనర్చెను. సీత పరిశుద్ధురాలనియు, నిర్దోషయనియు రామునకు కూడ విశ్వాసము కలిగెను. అయినను అయోధ్యావాసులు, జానపదులు సీతనుగూర్చి అనేకవిధములైన అపవాదు లెంచుచుండిరి. రామున కీ విషయము సహింపరాని దయ్యెను. రాజధర్మమువట్ల అతనికి గల భావములను బట్టి యీ జననిందకు ప్రాముఖ్యము కలిగినది. ఎవనినిగూర్చి లోకములో అపకీర్తికరమైన చర్చ జరుగునో, అత డధమలోకముల కేగునని రాముని నమ్మిక. భార్యగా సీతపై అతని కపారమైన ప్రేమ కలదు. కాని సీత రాజప్రాసాదములో నుండుట లోకాపవాదమునకు మూల మాయెను. కనుక, రాజుగా తన కామెను విడుచుటయే కర్తవ్యమని అతడు భావించెను. గర్భవతిగా నున్నను సరే ఆమెను విడిచితీర వలసినదే అని అతడు నిర్ణయించెను. ఈ నిర్ణయము ప్రజలకు గాని, రాజబంధువులకు గాని నచ్చదని అత డెరుగును. అందువలన అతడు మిక్కిలి

కఠోరముగా లక్ష్మణున కాజ్ఞాపించుచూ, సీతను వాల్మీకి ముని ఆశ్రమము చెంతగల అడవిలో విడిచి రమ్మనెను. సీత విషయములో తన కింక నెవరును ఏమియు చెప్పరాదనియు, ఏ ఆటంకము కలుగు నీయరాదనియు అతని మనోభావము. కనుక లక్ష్మణునితో శపథపూర్వకముగా నత డిట్లనెను--

*శాపితా హి మయా యూయం పాదాభ్యాం జీవితేన చ.*
*యే మాం వాక్యాంతరే బ్రూయు రనునేతుం కథంచన, 21*
*అహితా నామ తే నిత్యం మదభీష్టవిఘాతనాత్. 22*

నా ప్రాణములపైనను జీవితముపైనను ఒట్టిదుకొని చెప్పుచుంటిని. నా మాటల నడ్డుకొని నన్నునునయింపదలచి మాటాడువారు, నా అభీష్టమునకు విరోధులు. వారు నాకు నిత్యశత్రువులు.

ఈ శపథము విని లక్ష్మణు డేమి, ఎల్లవారును నిరుత్తరులైరి. రాముడు తన మాట కెవరిని ఎదురాడనీయలేదు.

## 6. సీతాసుచారిత్రవిషయమున వాల్మీకిశపథము ఉత్తరకాండ 95

రాముని అశ్వమేధయజ్ఞము సాగుచుండెను. అప్పుడు వాల్మీకి, లవకుశులను అచ్చట ఎల్లెడల తిరుగుచు రామాయణమును గాన మొనర్చుడని పంపెను. వారు అట్లే యని పోయి మునివిప్రసభలలోను, నగరమున గల రాజమార్గములందును మండపములలోను బ్రహ్మవేత్త లుండుచోట్లను రామాయణములోని మొదటి ఇరుపదిసర్గములను లయతాళబద్ధముగా పాడి వినిపించిరి. అది విని అందరును ఆశ్చర్యచకితులైరి. రాము డా బాలకులకు బంగారునాణెములును, వేరేదైన వారు కోరినది ఇండని ఆజ్ఞాపించెను. కాని కుశలవులు వాటిని గ్రహింపలేదు. రాముడు వారిని ఈ కావ్యము వారి కెట్లు లభించెనని అడిగెను. ఆ కావ్యపరిమాణము, కర్తృనామము, అతని వాసస్థానము మున్నగు వాటిని గురించి కూడ ప్రశ్నించెను. బదులుగా వారిట్లు చెప్పిరి - 'మహారాజా! మీ చరిత్రము వర్ణించు నీ కావ్యమును వాల్మీకిభగవానులు రచించిరి. వారిప్పు డీ యజ్ఞమునకు విచ్చేసిరి. ఈ కావ్యము 24వేల శ్లోకములు, నూరు ఉపాఖ్యానములు, 500 సర్గలు, ఆరు కాండములు కల్గి, ఉత్తరకాండ సహితముగా రచింపబడినది. వారి మాటలు విని రాము డా

కావ్యమును పూర్తిగా వినదలచెను. వా రది గానముచేసి వినిపించిరి. రామున కప్పటికి కుశలవులు సీతకు జన్మించిన బాలకులే అని స్పష్టమైనది. వెంటనే రాముడు వాల్మీకి వద్దకు దూతముఖమున సందేశమంపెను -

*యది శుద్ధసమాచారా యది వా వీతకల్మషా,*
*కరోత్విహాత్మనః శుద్ధిమనుమాన్య మహామునిమ్.* 4

'సీత శీలము శుద్ధమైనచో, ఆమెయం దెట్టి పాపము లేనిచో, ఆమె వాల్మీకి మహాముని అనుమతి గ్రహించి యీ సభకు వచ్చి జనసముదాయము నెదుట తన శుద్ధతను ప్రమాణించి చూపవచ్చును. మరియు-

*శ్వః ప్రభాతే తు శపథం మైథిలీ జనకాత్మజా,*
*కరోతు పరిషన్మధ్యే శోధనార్థం మమైవ చ.* 6

రేపు ఉదయము జానకి వచ్చి నిండుసభలో శపథము చేసి నా కళంకమును కూడ తొలగించుగాక.' దూతలవాక్యములు విని, రాముని హృదయము గ్రహించి వాల్మీకి 'అట్లే యగుగాక, శ్రీరాము డెట్లాజ్ఞాపించునో, అట్లే సీత వర్తించును. ఏలయన పతియే స్త్రీలకు దైవము!' అని పలికెను.

ఈ శపథము వినుటకు ఋషులు, మునులు, రాజులు, మునిబాలకులు కూడ ఆహ్వానింపబడిరి. అందరును ఆ శపథగ్రహణమును చూడదలచిరి.

### ఉత్తరకాండ 96

అనుకొన్న సమయమునకు వాల్మీకి సీతను తోడ్కొని వచ్చెను. గుమికూడిన ఆ విశాలప్రజాసమూహమధ్యమున నిల్చి వాల్మీకి రామునితో నిట్లనెను- 'రాఘవేంద్రా! ఈ సీత మహాపతివ్రత, ధర్మపరాయణ. నీవు లోకాపవాదభీతిచే ఈమెను నా ఆశ్రమముచెంత విడిచితివి. లోకాపవాదమునకు వెరచిన నీకు సీత తన శుద్ధతను ప్రమాణింపగలదు. కనుక ఆజ్ఞాపింపుము. ఈ కుశలవులు సీతకు బుట్టిన కవలు. నీవంటి దుర్ధర్షులైన వీరులు. ఇది నేను సత్యముగా పలుకుచున్నాను. నేను ప్రచేతసుని (వరుణుని) పదియవకుమారుడను. నానోట నేనాడును అసత్యము వెలువడలేదు. అట్టిది నా జ్ఞప్తిలో లేదు. నేను సత్యముగా చెప్పుచుంటిని. వీరు నీ కుమారులు. నేను నా పంచేంద్రియమనోబుద్ధుల

ద్వారా సీత పారిశుద్ధ్యమును చక్కగా గుర్తించియే ఆమెను నా సంరక్షణమం దుంచితిని. ఈమె ఆచరణము సర్వదా పరిశుద్ధము. పాప మీమెను స్పృశింపజాలదు. ఈమె పతినే దైవముగా భావించును.'

*బహువర్షసహస్రాణి తపశ్చర్యా మయా కృతా,*
*నోపశ్నీయాం ఫలం తస్యా దుష్టేయం యది మైథిలీ.* 20

*మనసా కర్మణా వాచా భూతపూర్వం న కిల్బిషమ్,*
*తస్యాహం ఫలమశ్నామి అపాపా మైథిలీ యది.* 21

'నేను వేలకొలది వత్సరములు తప మొనర్చితిని. సీతయం దే మాత్రము దోషమున్నను నా కా తపఃఫల మందకుండుగాక. నేను మనోవాక్కాయ కర్మలా మనుపెన్నడును పాప మాచరించలేదు. సీత పాపరహితురాలైనచో నా కా పుణ్యకార్యఫలము చేరగలదు.'

ఇట్లు చెప్పిన వాల్మీకి యింకను ఇట్లనెను - 'నేను దివ్యదృష్టిని చూచి గ్రహించితిని. సీత మనోభావములు పవిత్రమైనవి. నీకును సీత పరిశుద్ధురాలని తెలియును. అయినను లోకాపవాదముచే హృదయము కలుషితమై నీ వీమెను విడిచిపెట్టితివి. ఇప్పు డామెయే తన పారిశుద్ధ్యమును గూర్చి విశ్వాసము కలిగింపగలదు.'

## 7. సీతాశపథము ఉత్తరకాండ 97

(మా.సీతాసుచారిత్ర విషయమున వాల్మీకిశపథము క్ర.6)

సీత పరిశుద్ధినిగూర్చి వాల్మీకి శపథపూర్వకముగా చెప్పినను శ్రీరాముడు జనసమూహము నెదుట చేతులు జోడించి యిట్లు పలికెను - 'మున్నొకసారి దేవతల యెదుట సీత పరిశుద్ధతను గూర్చి నాకు నమ్మిక లభించినది. ఆ సమయమున సీత తన శుద్ధతనుగూర్చి శపథము చేసినది. అందుపై నే నామెను రాజభవనమునందు చేర్చి నిలిపితిని. కాని ఆ పిదప ఘోరమైన లోకాపవాదము కలిగినది. అందువలన వివశుడనై నే నామెను విడచిపెట్టితిని. ఈ కుశలవు లను కవలపిల్లలు నా పుత్రులే. కాని జనసమూహము నెదుట ప్రమాణమొనర్చిననే సీత నా ప్రేమ పొందగలదు.'

ఆ సమయమున సీత తపస్విని వలె జేగురురంగుచీర ధరించియుండెను. ఉపస్థితు లందరకు నమస్కరించి, ముఖము వంచి, చూడ్కులు నేల నిలిపి ఆమె యిట్లనెను--

*యథాహం రాఘవాదన్యం మనసాపి న చింతయే,*
*తథా మే మాధవీ దేవీ వివరం దాతు మర్హతి.* 14

*మనసా కర్మణా వాచా యథా రామం సమర్చయే,*
*తథా మే మాధవీ దేవీ వివరం దాతు మర్హతి.* 15

*యథైతత్ సత్యముక్తం మే వేద్మి రామాత్ పరం న చ,*
*తథా మే మాధవీ దేవీ వివరం దాతుమర్హతి.* 16

నేను రాముని తప్ప వేరొక పురుషు నెన్నడును చింతించి యెరుగను. ఇది సత్యమైనచో పృథ్వీదేవి తన యొడిలో నాకు స్థాన మొసగుగాక. నేను మనోవాక్కర్మలా కేవలము రామునే ఆరాధించుచుంటినేని, భూదేవి నాకు తన యొడిలో స్థాన మొసగుగాక. శ్రీరాముని తప్ప వేరొక పురుషుని నే నెరుగను. ఇది సత్యమైనచో భూదేవి నన్ను తన యొడిలో చేర్చుకొనుగాక.

సీత యీ విధముగా శపథము పలుకగనే భూతలమునుండి ఒక అద్భుతసింహాసనము బయటకు వచ్చెను. ఆ మహోజ్జ్వలదివ్యసింహాసనమున ఆసీనయై భూదేవి ప్రకటమయ్యెను. ఆమె తన రెండు చేతులలోనికి సీతను గ్రహించి స్వాగతాభినందనపురస్సరముగా తన సింహాసనమున కూర్చుండ బెట్టుకొనెను. సింహాసనముపై నధిష్ఠించి సీత రసాతల మేగుచుండగా చూచి దేవతలు ఆమెపై పుష్పవృష్టి గురిపించిరి. ధన్యవాదములు మిన్ను ముట్టెను.

# వరములు

1. దశరథుడు > కైక బాలకాండ 1

దశరథుడు ఉత్తమగుణసంపన్నుడు, సత్యపరాక్రముడు, సద్గుణశాలి, ప్రియతమజ్యేష్ఠపుత్రుడు, ప్రజాహితకార్యములలోనిరతుడు నైన రాముని ప్రజలకు మేలు చేయగోరి ప్రీతితో యువరాజుగా చేయ నిశ్చయించెను. అందు కవసరమైన వస్తుసంభారములు తెప్పించెను. ఇదంతయు చూచి,

*పూర్వం దత్తవరా దేవీ వరమేనమయాచత,*
*వివాసనం చ రామస్య భరతస్యాభిషేచనమ్.* 22

కైకేయి తనకు పూర్వమే పతి యొసగిన వరములను వేడి, తద్ద్వారా రాముని కరణ్యావాసమును, భరతునికి రాజ్యాభిషేకమును కోరెను.

అయోధ్యాకాండ 9

దశరథుడు కైకకు రెండు వరము లిచ్చినట్టి విషయము మంథరకు ముందుగా తెలియదు. కాని ఈ విషయ మెప్పుడో కైకయే మంథరతో చెప్పెను. ఇప్పుడు మంథర కైకేయికి వాటిని జ్ఞాపకము చేసెను. ఆమె యిట్లనెను. 'దండకావనమున వైజయంత మను ప్రసిద్ధమగు పట్టణ మున్నది. అక్కడ శంబరుడను గొప్ప అసురుడు ఉండెను. వాడు తిమిధ్వజుడు; మహామాయావి. వాడొకసారి యింద్రునిపై దండెత్తి పోయెను. ఆ యుద్ధములో క్షతగాత్రులై, రాత్రులందు విశ్రమించుచున్నవారిని ఆ రాక్షసు డెత్తుకొనిపోయి వధించుచుండెను. ఆ రోజులలో మహావీరుడైన దశరథుడు కూడ రాక్షసులతో యుద్ధము చేయనేగెను. ఆ యుద్ధములో దశరథుని శరీరము శత్రువుల బాణములచే గాయపడి జర్జరితమయ్యెను. ఆ సమయమున నీవు రథము నడపి అతనిని యుద్ధభూమినుండి దూరముగా తొలగించి ఆయనను కాపాడితివి.

*తుష్టేన తేన దత్తౌ తే ద్వౌ వరౌ శుభదర్శనే,*
*స త్వయోక్తః పతిర్దేవి యదేచ్ఛేయం తదా వరమ్.* 17

నీవు చేసిన దానికి సంతోషించి మహారాజు నీకు రెండు వరము లిచ్చెద ననెను. అప్పుడు నీవు నాకు కావలసినప్పుడు గ్రహింతునని చెప్పితివి. ఇప్పుడు నీ వా వరము లడిగి పుచ్చుకొనుము. అందులో ఒకటి భరతునికి రాజ్యాభిషేకము, రెండవది రామునికి పదునాల్గేండ్లు వనవాసము అని కోరుకొనుము.'

మంథర యింకను చెప్ప సాగెను- 'దేవాసురసంగ్రామవేళ దశరథుడు నీ కిచ్చిన వరములనుగూర్చి అతనికి జ్ఞప్తి చేయుము. వరములు గ్రహించునపుడు అవి నీ మనోరథమును తీర్చునట్టివిగా ఉండవలెను. దశరథుడు నిన్ను నేలపైన పడియున్నదానిని స్వయముగా ఎత్తి లేవదీయబోవునప్పుడు ముందు అతని సత్యసంధతకు శపథము కోరి పుచ్చుకొని, నిశ్చయమైన పిదప వరములు కోరుకొనుము. అప్పుడు కూడ ముందుగా నిట్లు పలుకుము -

*రామం ప్రవ్రాజయారణ్యే నవవర్షాణి పంచ చ,*
*భరతః క్రియతాం రాజా పృథివ్యాం పార్థివర్షభః.* 30

నృపశ్రేష్ఠా! రాముని పదునాల్గేండ్లు వనమున కనుపుము. భరతుని భూమండలమునకు రాజుగా చేయుము.'

మంథర, కైకకు రాముని పదునాల్గేండ్లు వనవాసమునకు పంపుటచే భరతుని రాజ్యము సుదృఢముగా నుండగల దను విశ్వాసము కలిగించుటకు ప్రయత్నించెను.

### అయోధ్యాకాండ 11

వరము లడుగుసమయమున కైక దశరథునితో నిట్లు పలికెను.

*యథా క్రమేణ శపసే వరం మమ దదాసి చ.* 13

'మహారాజా, మొదట మీ ప్రియపుత్రుడైన రామునిమీదను, అట్లే మీ సత్కార్యాచరణముమీదను శపథము చేసి, నాకు మీ రే విధముగా వరము లిచ్చెద ననిరో ఆ విషయము ముప్పదిమూడు (కోట్ల) దేవతలును వినునట్లు స్పష్టముగా చెప్పుడు. సూర్యచంద్రులు, గగనము, గ్రహములు, దివారాత్రములు,

దిశాజగత్తులు, ఈ పృథ్వి, గంధర్వ, రాక్షస, నిశాచరప్రాణులు, గృహదేవతలు సమస్తజీవులును మీరు చెప్పినది స్పష్టముగా విని, ఆ మాటలకు సాక్షు లగుదురుగాక.

ఈ విధముగా వరమీయ దలచిన దశరథుని తన గుప్పిటిలోని కీడ్చి, కైకేయి ముం దతనిని ప్రశంసించి, ఆ మీద నిట్లన్నది- 'మహారాజా, వెనుకటి కథ స్మరింపుడు. అది దేవాసుర యుద్ధమునాటి కథ. అప్పుడు శత్రువులు మిమ్ము తీవ్రముగా గాయపరచి మూర్ఛిల్లజేసిరి. ప్రాణములు మాత్రము గ్రహింపలేదు. అ సమయమున-

*తత్ర చాపి మయా దేవ యత్ త్వం సమభిరక్షితః,*
*జాగ్రత్యా యతమానాయాస్తతో మే ప్రదదౌ వరౌ.* 19

*తౌ దత్తౌ చ వరౌ దేవ నిక్షేపౌ మృగయామ్యహమ్,*
*తవైవ పృథివీపాల సకాశే రఘునందన.* 20

*తత్ ప్రతిశ్రుత్య ధర్మేణ న చేద్ దాస్యసి మే వరమ్,*
*అద్యైవ హి ప్రహాస్యామి జీవితం త్వద్విమానితా.* 21

యుద్ధభూమిలో రాత్రియంతయు మేల్కొని అనేకవిధములుగా సేవలు చేసి నేను మీ జీవితము కాపాడితిని. దానికి సంతసించి మీరు నాకు రెండు వరము లిచ్చిరి. అవి నే నిప్పుడు కోరదలచితిని. ధర్మయుక్తముగా ప్రతిజ్ఞ చేసి యిచ్చిన ఆ వరము లిప్పుడు మీరు నా కివ్వకున్నచో, అవమానము పాలై నేను నేడే ప్రాణత్యాగము చేసెదను.'

ఈ విధముగా తన వాక్పాటవము నెరపి, కామార్తుడై వరమీయ నుద్యుక్తుడైన రాజును మాటలతో కట్టివైచి, పూర్తిగా నమ్మిక కల్గిన పిదప ఇక నీతడు తన మాట కాదనలేడని నిశ్చయించి కైక ఆతనితో నిట్లనెను-

*వరౌ దేయౌ త్వయా దేవ తదా దత్తౌ మహీపతే,*
*తౌ తావదహమద్యైవ వక్ష్యామి శృణు మే వచః.* 23

*అభిషేకసమారంభో రాఘవస్యోపకల్పితః,*
*అనేనైవాభిషేకేణ భరతో మేఽభిషిచ్యతామ్.* 24

*యో ద్వితీయో వరో దేవ దత్తః ప్రీతేన మే త్వయా,*
*తదా దేవాసురే యుద్ధే తస్య కాలోఽయమాగతః.* 25

*నవ పంచ చ వర్షాణి దండకారణ్యమాశ్రితః,*
*చీరాజినధరో ధీరో రామో భవతు తాపసః.* 26

*భరతో భజతామద్య యౌవరాజ్యమకంటకమ్.* 27

'అప్పు డిచ్చెదనన్న ఆ రెండు వరములును నేడు నా కివ్వవలెను. ఆ వరము లేమో చెప్పుచున్నాను వినుడు. ఇప్పుడు రాముని అభిషేకార్థము కూర్చిన సంభారములతోనే నా పుత్రుడైన భరతునికి రాజ్యాభిషేకము చేయవలెను. అప్పటి దేవాసురసంగ్రామవేళలో నా కిచ్చిన ఆ రెండు వరము లందుకొనదగిన సమయ మిప్పుడు కల్గినది. ధీరస్వభావుడైన రాముని చీరాజినవల్కలములు ధరించి తాపసియై పదునాలుగేండ్లు దండకారణ్యమున వసించుటకు పంపుడు. భరతునికి నిష్కంటకముగా యువరాజు పదవి లభించనిండు.'

పైగా, ఆమె 'ఇది నా కన్నిటికన్న మించిన కోరిక. నేను మునుపు మీరు నా కిచ్చిన వరములే వేడుచున్నాను *దత్తమేవ వరం వృణే* అని కూడ పల్కెను. అయోధ్యాకాండ 12

కైకేయి పలికిన కఠినోక్తులను విని దశరథు డెంతగనో దుఃఖించెను. శోకావేగముచే అతడు మూర్ఛిల్లెను. తెలివి వచ్చిన పిదప దుఃఖసంతప్తుడై మహోగ్రతేజముతో కైకను దగ్ధముచేయగలంత కఠోరముగా నిందించెను. తిరిగి ఆమెను బోధించి త్రోవకు తెచ్చుటకు యత్నించెను. ఆమెముం దతడు వెలవెలపడి, గిజగజలాడి, నేలమీద పడుచు పంతమును విడువుమని ఆమెను ప్రార్థించెను. దుఃఖితుడు, మూర్ఛాగ్రస్తుడు నైన ఆ రాజు వడవడ వణకుచు ఆమె నెంతగానో బ్రతిమిలాడెను. కాని ఆమె వినలేదు. సరికదా, మరింత భయంకరరూపము దాల్చి యిట్లనెను.-

*యది దత్త్వా వరం రాజన్ పునః ప్రత్యనుతప్యసే,*
*ధార్మికత్వం కథం వీర పృథివ్యాం కథయిష్యసి.* 39

'రాజా ! ముందుగా రెండు వరము లిచ్చి, యిప్పుడు పశ్చాత్తాపపడినచో పృథివిపై నీ ధార్మికత్వ మెట్లు చెల్లును? మహాసంకటసమయమున ప్రాణరక్ష గావించినందుకుగాను ప్రతిజ్ఞాపూర్వకముగా యిచ్చిన వరములు కాదందువా?

అయోధ్యాకాండ 14

పుత్రశోకపీడితుడై విలవిలలాడుచున్న దశరథునితో కైక మరియు నిట్లనెను-

*పాపం కృత్వేవ కిమిదం మమ సంశ్రుత్య సంశ్రవమ్.* 2

'మహారాజా, నాకు రెండు వరము లిచ్చెద నని ప్రతిజ్ఞ చేసి, నేను వాటిని కోరుసరికి పాపముచేసి పశ్చాత్తాపము పొందినవానివలె ఈ విధముగా స్తబ్ధుడవై నేలపై పడిపోయితి వేమి? నీవు సత్పురుషుల మర్యాద నిలుపుకోదగును. ధర్మమునకు తగిన అభీష్టఫలము లందుకొనుటకే నేను రాముని వనమునకు పంపుమంటిని. నా కిచ్చిన మాట నీవు కాదని, నన్ను పరిత్యజించుచో నీ ఎదుటనే నేను ప్రాణత్యాగము చేయుదును.

అయోధ్యాకాండ 18

శ్రీరాముడు కైకేయి భవనమున కేగెను. అతడు తండ్రిని కైకేయితో సహ ఒకే ఆసనమున కూర్చొనియుండగా చూచెను. కాని తండ్రి విషాదాకులుడై యుండెను. ముఖము వాడిపోయెను. అతడెంతో దయనీయమైన అవస్థలో అగపడెను. రాముడు తల్లిదండ్రులకు నమస్కరించెను. జనకుని యవస్థ కెంతో పరితపించెను. అందుకు కారణ మాతడు కైక నడుగగా ఆమె 'మహారాజు కుపితుడుగాని, అస్వస్థుడుగాని కాదు. అతని మనసులో నొక విషయమున్నది. కాని అది నీతో చెప్పుటకు జంకుచున్నాడు. నీ వితని ప్రియపుత్రుడవు గదా, నీ కప్రియమైన విషయము నీతో చెప్పుట ఎట్లని అతడు మాటాడలేకున్నాడు. అయినను, అతడు నాకు మాట యిచ్చి యేది చేయదలచెనో అది పాటించుట నీ కర్తవ్యము.'

*ఏష మహ్యాం వరం దత్త్వా పురా మామభిపూజ్య చ,*
*స పశ్చాత్తప్యతే రాజా యథాన్యః ప్రాకృతస్తథా.* 22
*అతిసృజ్య `దదానీతి వరం మమ విశాంపతిః.* 23

'మీ తండ్రి మునుపు నన్ను గారవించి నే నడిగిన రెండు వరములు నా కిచ్చెద నని ప్రతిజ్ఞచేసెను. ఇప్పుడు సామాన్యుని వలె పశ్చాత్తాపపడి ఆ మాట కాదన జూచుచున్నాడు. ఈ జనాధిపతి 'నే నిచ్చెదను' అని ముందు నాకు మాట యిచ్చెను. ఇప్పుడు దానిని నివారించుటకు వ్యర్థప్రయాస

చేయుచున్నాడు. ఇది నీరు పారిన పిదప కట్ట కట్ట నెంచుట వలె నున్నది'. ఇట్లు పల్కి కైక రాజానుమతితో ఆమె ఏది చెప్పినను తానది చేయుటకు సిద్ధముగా నున్నా నని రామునిచే ప్రతిజ్ఞ చేయించుకొని, ఆమీద అతనితో నిట్లు పలికెను -

*పురా దేవాసురే యుద్ధే పిత్రా తే మమ రాఘవ,*
*రక్షితేన వరౌ దత్తౌ సశల్యేన మహారణే. 32*

'వెనుక నొకసారి దేవాసురయుద్ధములో మీ తండ్రి శత్రుబాణపీడితుడై పడియున్న సమయమున నాచే రక్షింపబడెను. అప్పుడు నా కీయన రెండు వరము లిచ్చెదనని ప్రతిజ్ఞ చేసెను.

*తత్ర మే యాచితో రాజా భరత స్యాభిషేచనమ్,*
*గమనం దండకారణ్యే తవ చాద్యైవ రాఘవ. 33*

ఈ వరములలో నొకదానివలన భరతుని రాజ్యాభిషేకమును, రెండవదానివలన నీ వీ దినముననే కదలి దండకావన మేగవలెననియు నేను కోరితిని. ఇక తండ్రి ప్రతిజ్ఞను, నీ విచ్చిన మాటను నిల్పుకొనవలసినది నీవే.

*త్వయారణ్యం ప్రవేష్టవ్యం నవ వర్షాణి పంచ చ,*
*భరతశ్చాభిషిచ్యేత యదేతదభిషేచనమ్. 35*
*త్వదర్థే విహితం రాజ్ఞా తేన సర్వేణ రాఘవ. 36*

*సప్త సప్త చ వర్షాణి దండకారణ్య మాశ్రితః,*
*అభిషేకమిదం త్యక్త్వా జటాచీరధరో భవ. 37*

మీ తండ్రి ప్రతిజ్ఞ కనుగుణముగా నీవు దండకారణ్య మేగి పదునాల్గు వర్షములు వసింపవలెను. నీ అభిషేకమునకై మహారాజు సమకూర్చిన సంభారములతో భరతునికి రాజ్యాభిషేకము చేయవలెను. నీవు రాజ్యాభిషేకము విడిచి, జటావల్కలధారివై పదునాల్గేండ్లు వనములో నుండుటకు పోవలెను.'

*ఏతత్ కురు నరేంద్రస్య వచనం రఘునందన. 40*

ఈసారి కైక 'వర' మనుటకు బదులు 'వచన' మని అన్నది. ఇది యాచితవరము.

## ఈ వరముపై విభిన్నవ్యక్తుల ప్రతిక్రియలు-

### లక్ష్మణుడు

శ్రీరాముని వనవాసప్రతిజ్ఞను లక్ష్మణుడు సుస్పష్టముగా వ్యతిరేకించెను. తన వాదమును సమర్థించుచు అతడు రామున కెన్నో విధములుగా చెప్పెను. రాముని మనస్సులో వనగమనమును పురస్కరించుకొని ఏర్పడిన సంభ్రమమంతయు భ్రాంతిమూలకమనియు, అనుచితమనియు చెప్పెను. 'నీ కిప్పు డీ పాపులిద్దరిపై (కైకేయీదశరథులు) సందేహ మేల కలుగకున్నది? ఇతరులను మోసగించునట్టి ధర్మవేషధారులలో ఈ దశరథు డొక్కడు. కైకేయీదశరథులు తమ స్వార్థసిద్ధికై, ధర్మము నెపమున శఠత్వము వహించి మీవంటి సచ్చరిత్రుని రాజ్యభ్రష్టునిగా చేయనెంచుచున్నారు.'

*యది నైవం వ్యవసితం స్యాద్ధి ప్రాగేవ రాఘవ,*
*తయోః ప్రాగేవ దత్తశ్చ స్యాద్వరః ప్రకృతశ్చ నః.* 9

'ఇపుడూహించి చెప్పుచున్నదానిని వారు ముందెప్పుడో ఊహించి యుండినచో, ఇది మునుపే జరిగియుండును. వరమిచ్చిన మాట సత్యమైనచో అది మీ అభిషేకప్రసంగమునకు పూర్వమే ఇట్టి వర మిచ్చియుండవలసినది. అట్లు జరుగలేదు కనుక ఎప్పుడో వరము లభించినట్లును అది యింతవరకు కోరనట్లును ఇప్పుడు కోరినట్లును చెప్పెడి దంతయును అసత్యకల్పన.'

*యదయం కిల్బిషాద్భేదః కృతోఽప్యేవం న గృహ్యతే,*
*జాయతే తత్ర మే దుఃఖం ధర్మసంగశ్చ గర్హితః.* 13

'వరదాన మను పేర ఘోరమైన అసత్యము కల్పించి మీ రాజ్యాభిషేకమున కాటంకము కలిగించుచున్నారు. అయినను ఇదంతయు మీరు యథార్థమని తలంచుచున్నారు. ఇది నా కెంతయో దుఃఖదాయక మగుచున్నది. ఈ విధమైన కపటమును ధర్మమని యెంచుట నింద్యము' అని లక్ష్మణుడు రామునితో స్పష్టముగా తన అభిప్రాయము విప్పి చెప్పెను.

### వసిష్ఠుడు

అయోధ్యాకాండ 37

వనవాస మేగుచున్న రాముడు తనతో ఏ విధమైన భోగోపకరణములుగాని తీసికొని పోకూడదనియు అతనితో పాటుగా వనవాస మేగుచున్న సీతకూడ

నారచీరలు ధరించియే వెళ్లవలెననియు కైకేయి శాసించెను. అప్పుడు వసిష్ఠుడు కైకను నిందించి, సీతను వల్కలము ధరింపవలదని నివారించెను. అతడు కైకకు ఆమె కోరిక వరములకు గల హద్దు లేవో స్పష్టముగా తెలియజేసెను.

*ఏకస్య రామస్య వనే నివాసస్త్వయా వృతః కేకయరాజపుత్రి,*
*విభూషితేయం ప్రతికర్మనిత్యా వసత్వరణ్యే సహ రాఘవేణ.* 35

*యానైశ్చ ముఖ్యైః పరిచారకైశ్చ సుసంవృతా గచ్ఛతు రాజపుత్రీ,*
*వస్త్రైశ్చ సర్వైః సహితైర్విధానై ర్నేయం వృతా తే వరసంప్రదానే.* 36

'కేకయరాజపుత్రీ, నీవు రాముని కొఱకు మాత్రమే వనవాస మడిగితివి. (సీతకు కాదు). కనుక ఈ రాజపుత్రి సర్వాభరణభూషితయై, సదా శృంగార ద్రవ్యములు దాల్చి, రామునితో పోయి వనవాసముచేయును. ఆమె తన ముఖ్యపరిచారకులను, వలసిన వస్త్రాభరణములను, తదుపకరణసామగ్రిని కూడ తోడ్కొని వనమున కేగును. నీవు వర మడుగునప్పుడు సీతావనవాసమును ప్రస్తావింపలేదు. కనుక ఈమె వల్కలములు ధరింపనక్కరలేదు' అని వసిష్ఠుడు కైక కెరిగించెను.

దశరథుడు అయోధ్యాకాండ 34

వనగమనమునకు సిద్ధమై అనుమతి గ్రహించుటకై రాముడు ముందుగా దశరథుని వద్ద కేగెను. అప్పు డతడు రామునితో నిట్లనెను-

*అహం రాఘవ కైకేయ్యా వరదానేన మోహితః,*
*అయోధ్యాయాం త్వమేవాద్య భవ రాజా నిగృహ్య మామ్.* 26

'రాఘవా ! నేను కైకకు వరము లిచ్చి మోసపోతిని. నీవు నన్ను బంధించి స్వయముగా అయోధ్యకు రాజవు కమ్ము.'

దశరథుని మాటలు విని రాముడు చేతులు జోడించి అతనితో నిట్లనెను - 'మహారాజా, మీరు వేలాదివత్సరము లీ భూమి నేలుదు. నే నిప్పుడు వనములో నివసింతును. నాకు రాజ్యము గ్రహింపవలెనను కోరిక లేదు. పదునాల్గేండ్లు వనమందు వసించి, తిరిగి వచ్చి నేను మీ పాదయుగళమును సేవించెదను.'

రాముడు తత్క్షణమే అడవి కేగవలెనని కైక పట్టుపట్టెను. దశరథుడు వివశుడై దుఃఖపీడితు డగుచుండెను. అతడు రాముని వనగమనమును సహింపలేకుండెను. కాని రాముడు వనగమనమునకే నిశ్చయించి, తన నిశ్చయము మరల్పకుండెను. అతడు తండ్రితో నిట్లనెను-

*యస్తు యుద్ధే వరో దత్తః కైకేయ్యై వరద త్వయా,*
*దీయతాం నిఖిలేనైవ సత్యస్త్వం భవ పార్థివ.* 42

*అహం నిదేశం భవతో యథోక్తమనుపాలయన్,*
*చతుర్దశ సమా వత్స్యే వనే వనచరైః సహ.* 43

*మా విమర్శో వసుమతీ భరతాయ ప్రదీయతామ్,*
*న హి మే కాంక్షితం రాజ్యం సుఖమాత్మని వా ప్రియమ్.* 44

*యథానిదేశం కర్తుం వా తవైవ రఘునందన.* 45

'వరదాతవైన మహారాజా, మీరు దేవాసురసంగ్రామవేళ కైకేయి కే వరము లిచ్చెద నని ప్రతిజ్ఞ చేసినారో వానిని పూర్తిగా ఇచ్చివేయుడు. సత్యవాదిగా పేరు నిల్పుకొనుడు. మీ ఆజ్ఞ ననుసరించి నేను పదునాలుగేండ్లు ఆటవికజీవులతో కలిసి అరణ్యమున వసించెదను. మీరు వేరొక విధముగా విచారింపకుడు. ఈ సమస్తభూమిని భరతుని కిండు. రఘునందనా, నేను నా మనస్సునకు సుఖము కలుగవలె నని కాని, నాకు ప్రియము కోరి గాని రాజ్య మంగీకరింపలేదు. కేవలము మీ ఆజ్ఞ పాలించుటకే నేను దానిని గ్రహింపగోరితిని.'

### అయోధ్యాకాండ 36

రాముని వనగమనము దశరథునికి సహింపరాని సంకటమాయెను. కైక తన మాటల నేర్పుతో రాజునకు దుఃఖకరమైన వరము గ్రహించెను. కాని కైకపట్ల ఎంత క్రోధసంతప్తుడైనను వర మిచ్చుట అతనికి తప్పనిసరి అయ్యెను. సారమంతయు ముందుగనే పీల్చినవానికి నిస్సారమును, ‹ అరుచికరము నగు సురాపానమువలె, ధనధాన్యశూన్యమైన రాజ్యమును భరతు డంగీకరింపడు', అని కైక పలికిన మాట దశరథునికి మరింత దుఃఖము కలిగించెను. అత్యంతకుపితుడై అతడిట్లనెను-

*వహంతం కిం తుదసి మాం నియుజ్య ధురి మా హితే,*
*అనార్యే కృత్యమారబ్ధం కిం న పూర్వముపారుధః.* 14

'ఓసి అహితకారిణీ, శ్రీరాముని అడవికి పంపవలె నన్న దుస్సహ మగు దుఃఖభారముతో క్రుంగిపోవుచున్న నన్ను, నీవిట్టి కశాఘాతముల వంటి మాటలతో మరింతగా పీడించుచున్నావు. దుష్టురాలా ! రామునితో బాటు సేనాపరివారమును, వస్తువాహనములను పంపకూడదని పలికి ప్రతిబంధకము కల్పించుచుంటివే. ఈ విషయములు ముందే ఏల కోరలేదు?' (రాముడే వనమునకు పోవలె నంటివి కాని, సేనాసహితుడు కాకూడదని ఏ వస్తువులు తీసుకొని పోరాదని ముందుగా ఏల కోరలేదు?)

## అయోధ్యాకాండ 59

రాముని వనగమనవార్త సుమంత్రునివలన విని దశరథుడు భరింపరానంతగా దుఃఖించెను. అలంఘ్యమగు శోకసముద్రమున మునిగి, అతడు కౌసల్యతో నిట్లనెను - 'దేవీ కౌసల్యా! రాము డేగినందున నే నీ శోకసముద్రమున. మునిగిపోవుచుంటిని. ఒడ్డు చేరుట ఈ జీవితములో నిక దుర్లభము. రామనిమిత్తకమగు ఈ శోక మతితీవ్రవేగాకులమై యున్నది. సీతావియోగ మింకొక అపారమగు శోకజలధి. ఈ నా నిట్టూర్పులు ఆ సముద్రమున తరంగములు. అవి సుడులు గొనుచున్నవి. కన్నీటిధారలచే ఈ ప్రవాహము కలుషపంకిలమైనది. దుఃఖాతిరేకమున అల్లలాడు నా చేతుల చలనము దానిలో మహామీనముల సంచారమట్లున్నది. నాకరుణాక్రందనము వాటి గర్జన వలె ఘోషించుచున్నది. ఈ నా విడిపోయి బెదురుచున్న కేశకలాపము దానిలోని నాచువలె తోచుచున్నది. ఈ సముద్రములో కైక బడబానలము వలె నున్నది.'

*మమాశ్రు వేగప్రభవః కుబ్జావాక్యమహాగ్రహః,*
*వరవేలో నృశంసాయా రామప్రవ్రాజనాయతః.* 31

'ఈ శోకసాగరము నా కన్నీటిధారావేగమువలన పుట్టినది. మంథర చెప్పిన కుటిలవచనము లిందులో పెను మొసళ్లు. కఠినాత్మురాలైన కైక కోరిన వరములు రెండును దీని ఒడ్డులు. రామునడవికి పంపుట దీని నిడివి.'

సిద్ధార్థుడు అయోధ్యాకాండ 36

రత్నసమృద్ధమై చతురంగబల పరిపూర్ణమగు సైన్యము అడవిలో రాము ననుసరించి పోగలదని దశరథుడు పల్కగనే కైక సగరపుత్రుడైన అసమంజుని వృత్తాంతమును ఉదాహరించి దశరథుని నిరుత్తరునిగా చేసెను. 'సగరుడు తన పుత్రుడైన అసమంజుని రాజ్యమునుండి వెడలగొట్టి రాజ్యాధికారమునకు వెలిచేసెను. అట్లే రాముని కూడ వెడల నంపవలెను' అని కైకేయి పలికెను. ఆ మాటలు విని అచ్చట నున్న వా రందరును సిగ్గుపడి తలలు వంచుకొనిరి. దశరథు డామెను ఛీత్కరించెను. వయోవృద్ధుడైన మంత్రి సిద్ధార్థుడు కైకకు అసమంజుని కథ వివరించి ఈ ఉదాహరణ మసమంజసమని చెప్పెను. అత డామెను లోకనిందకైనను వెరవదగునని పల్కెను.

సుమంత్రుడు అయోధ్యాకాండ 58

శ్రీరాముని వనమువరకు చేరనంపుటకు సుమంత్రుడు రథ మాయత్తపరచెను. అతడు వారి నచ్చట దింపి తిరిగి వచ్చి దశరథుని కా వార్త తెలిపెను. లక్ష్మణుడు క్రోధముతో దీర్ఘముగ శ్వసించుచు పలికిన మాటలిట్లు చెప్పెను-

'సుమంత్రా, ఏ అపరాధ మెంచి మహారాజు రాముని కీ దేశ బహిష్కారశిక్ష విధించెను. రాజు కైకేయి మాటలు వినినతోడనే, ఆమె కోరినట్లు చేయుటకు ప్రతిజ్ఞ వహించెను. అతడొనర్చినది ఉచితమో, అనుచితమో, కాని మన కందరికిని బాధాకరమైనది.

*యది ప్రవ్రాజితో రామో లోభకారణకారితమ్,*
*వరదాననిమిత్తం వా సర్వథా దుష్కృతం కృతమ్.* 28

'కైకేయి లోభకారణమున రాముని వనమునకు పంపుమనెను. లేదా ముందిచ్చిన వరములవలన రాజు కా విధముగా చేయవలసి వచ్చెను. ఎట్లయినను, అన్నివిధములుగా ఘోరపాపమే చేయబడినది.'

భరతుడు అయోధ్యాకాండ 72

తాతగారింటినుండి మరలివచ్చిన భరతుడు ముందుగా తండ్రిని చూడనెంచి

అతని భవనమున కరిగెను. ఆ భవనమంతయు అతనికి కళావిహీనముగా కనుపించెను. అతడు తల్లి నిట్లడిగెను- 'అమ్మా! మహారాజు తరచుగా ఈ భవములో నుండెడివారు గదా, నేడు కానరారేమి? ఎక్కడున్నట్లు?' అప్పుడు కైక అతనితో దశరథుడు మరణించెనని చెప్పెను: అది విని భరతుడు మిక్కిలి దుఃఖించి, కొంత సంయమనము కల్గి పిదప తిరిగి ఆమెతో నిట్లనెను - 'ధర్మజ్ఞులు జ్యేష్ఠభ్రాతను తండ్రితో సమాను డందురు. నే నిప్పుడు శ్రీరాముని చరణములు సందర్శించెదను. అతడే నా కిప్పు డాశ్రయము. నీవు వెంటనే రామునికి నారాక నెరిగింపుము.' అందుకు బదులుగా కైక- 'నాయనా, రాముడు వల్కలములు ధరించి సీతాలక్ష్మణసహితుడై దండకాటవి కేగెను.' ఈ వార్త విని భరతుడు భయభ్రాంతుడయ్యెను. అతనికి రాముని శీలము శంకింపనయ్యెను. 'అమ్మా! రాము డడవి కేల పోయెను? పాపరహితుడైన వాని నెవనినైనా చంపెనా ? బ్రాహ్మణధన మపహరించెనా? పరస్త్రీ నెవతెనైన కామించెనా ?' అని ఆతురతతో నడుగగా తన ప్రతిజ్ఞకు తానే సంతసించుచు కైక యిట్లు మారుపల్కెను-

*న బ్రాహ్మణధనం కించిద్ధృతం రామేణ కస్యచిత్,*
*కశ్చిన్నాఢ్యో దరిద్రో వా తేనాపాపో విహింసితః.* 47

*న రామః పరదారాన్ స చక్షుర్భ్యామపి పశ్యతి,*
*మయా తు పుత్ర శ్రుత్వైవ రామస్యేహాభిషేచనమ్.* 48

*యాచితస్తే పితా రాజ్యం రామస్య చ వివాసనమ్.* 49

'రాము డే బ్రాహ్మణసంపదను అపహరింపలేదు. అనపరాధులను దండించలేదు. పరస్త్రీల నెవరిని కన్నెత్తి చూడనైన లేదు. కాని అతనికి అయోధ్యారాజ్యాభిషేకము జరుగబోవుచున్నదని విని నేను నీకు రాజ్యాభిషేకమును, రామునికి వనవాసమును మీ తండ్రి నడిగి గ్రహించితిని.' తండ్రి పరలోకగతిని, రాముని అరణ్యప్రవాసమును విని భరతు డెంతగనో దుఃఖసంతప్తు డాయెను.

## అయోధ్యాకాండ 107

వనవాసమున కరిగిన రాముని తిరిగి వెనుకకు పిల్చి రాజ్యాభిషేకమొనర్చు తలంపుతో భరతుడు వనములో రాముని చూడబోయెను. అతడు రాముని

తిరిగిరమ్మని యెంతగానో ప్రార్థించెను. కాని రాముడు తండ్రియాజ్ఞను పాటించుటకే నిశ్చయించెను. 'సోదరా, నీవు దశరథమహారాజునకు కేకయరాజపుత్రికిని జన్మించినవాడవు. కనుక నీవు చెప్పినది సముచితమే. కాని మునుపెన్నడో అనగా మన తండ్రి కైకను వివాహమాడునపుడు మీ తాతగారితో ఆమెకు పుట్టిన పుత్రుడు రాజు కాగలడని పల్కి వాగ్దాన మొనర్చెను.'

*దేవాసురే చ సంగ్రామే జనన్యై తవ పార్థివః,*
*సంప్రహృష్టో దదౌ రాజా వరమారాధితః ప్రభుః.* 4

*తతః సా సంప్రతిశ్రావ్య తవ మాతా యశస్వినీ,*
*అయాచత నరశ్రేష్ఠం ద్వౌ వరౌ వరవర్ణినీ.* 5

*తవ రాజ్యం నరవ్యాఘ్ర మమ ప్రవ్రాజనం తథా,*
*తచ్చ రాజా తథా తస్మై నియుక్తః ప్రదదౌ వరమ్.* 6

*తేన పిత్రాహమప్యత్ర నియుక్తః పురుషర్షభ,*
*చతుర్దశ వనే వాసం వర్షాణి వరదానికమ్.* 7

'ఆ పిదప దేవాసురయుద్ధములో మీ తల్లి మహారాజున కెంతగనో తోడ్పడినది. అందుకు సంతసించి రా జామెకు వరమిచ్చెను. దానిని పాటించుటకై మాట పుచ్చుకొని కైకేయి యీ రెండు వరము లడిగెను. ఒకదానివలన నీకు రాజ్యమును, రెండవదానివలన నాకు వనవాసమును ఆమె కోరినది. తదనుసారముగా రా జామె కా వరము లనుగ్రహించెను. కనుక నేను తండ్రిమాట నిల్పదలచితిని. నీవును అతని ఆజ్ఞను మన్నించి రాజ్యాభిషేకము బడసి, తండ్రిమాట నిలుపుము.'

### అయోధ్యాకాండ 111

భరతు డెన్నెన్నో విధములుగా తర్కయుక్తులు పలికి రాముని వెనుకకు రప్పించుటకు ప్రయత్నించెను. కాని రాముడు తన నిశ్చయము మార్చుకొనలేదు. భరతుడు రాజ్య మేలుటయు, తా నడవిలో నుండుటయు సరియైనవని అతడు పల్కెను. చివరకు భరతు డంగీకరించి శ్రీరాముని ముట్టి జలములు తాకి యిట్లనెను-

*శృణ్వంతు మే పరిషదో మంత్రిణః శృణుయుస్తథా,* 24

*న యాచే పితరం రాజ్యం నానుశాసామి మాతరమ్.*

*ఏవం పరమధర్మజ్ఞం నానుజానామి రాఘవమ్,* 25
*యది త్వవశ్యం వస్తవ్యం కర్తవ్యం చ పితుర్వచః.*

*అహమేవ నివత్స్యామి చతుర్దశ వనే సమాః.* 26

'ఈ సమస్తసభాసదులు, మంత్రులు కూడ వినుడు. నేను మా తండ్రిని రాజ్య మడుగలేదు. తల్లి నట్లు కోరుమని నే నెన్నడును చెప్పలేదు. పరమధార్మికుడైన రాముని వనవాసము చేయు మనుటలో నా సమ్మతి లేదు. తండ్రిగారి ఆజ్ఞ అవశ్యము పాటించవలసినప్పుడు నేను పదునాల్గేండ్లు వనములో నివసించెదను.'

భరతుని మాటలు విని, రాముని కాశ్చర్యమాయెను. అతడు సభాసదులవైపు చూచి యిట్లనెను - 'భరతుడు వనవాస మెట్లు చేయగలడు ? తండ్రిమాట నిల్పవలెనన్నచో నేనే వనములో నుండవలెను. రాజ్యసంచాలనమునకు తగిన శక్తియుక్తులు భరతునితో నున్నవని నేనెరుగుదును. పదునాలుగేండ్లు వనవాసము ముగించి తిరిగి వచ్చి భరతునితో కలిసి నే నీ భూమండలము పాలించెదను.'

*వృతో రాజా హి కైకేయ్యా మయా తద్వచనం కృతమ్,*
*అనృతాన్మోచయానేన పితరం తం మహీపతిమ్.* 32

'కైకేయి రాజు నడిగి వరము గ్రహించినది. నేను దానిని పాలించుటకు పూనుకొంటిని. కనుక, భరతా, నీవిప్పుడు నామాట మన్నించి తండ్రిగారి నసత్యవాది యను ప్రవాదమునుండి కాపాడుము.'

## సీతకు రాముని వనగమనసూచనము — అయోధ్యాకాండ 26

తల్లిపద్ద వనగమనమున కనుమతి పొంది రాముడు సీతను చూడబోయెను. రాజ్యాభిషేకముహూర్తము సమీపించుచున్నను రాముని ముఖమునం దట్టి ప్రసన్నత గోచరింపకుండుటచే సీత కత్యంతవిస్మయ మాయెను. అతని ముఖమున ప్రసన్నత లేదు, సరికదా ఉదాసీనత గోచరించుచున్నది. రాముడు సీతను చేరి, 'సీతా! నేడు పూజ్యులైన తండ్రిగారు నన్నడవికి పంపుచుండిరి. దానికి కారణము వినుము -

రాజ్ఞా సత్యప్రతిజ్ఞేన పిత్రా దశరథేన వై,
కైకేయ్యై మమ మాత్రే తు పురా దత్తౌ మహావరౌ. 21

తయాద్య మమ సజ్జేఽస్మిన్నభిషేకే నృపోద్యతే,
ప్రచోదితః స సమయో ధర్మేణ ప్రతినిర్జితః. 22

చతుర్దశ హి వర్షాణి వస్తవ్యం దండకే మయా,
పిత్రా మే భరతశ్చాపి యౌవరాజ్యే నియోజితః. 23

'సత్యప్రతిజ్ఞుడైన మహారాజు, మా తండ్రి దశరథుడు మునుపు మా తల్లి కైకేయికి గొప్ప వరము లిచ్చెను. నా రాజ్యాభిషేకమునకు మహారాజు ప్రయత్నించుచుండగా కేకేయి ఆ వరములను జ్ఞప్తికి తెచ్చెను. ధర్మబద్ధుడైన రాజామెకు వశుడాయెను. వివశుడై అతడు భరతునికి రాజ్యాభిషేకమును నాకు పదునాల్గేండ్లు దండకావనవాసమును విధించెను.

తండ్రిగారి ప్రతిజ్ఞను పూరించుటకై నేనిపుడు నిర్జనాటవి కేగుటకు బయలుదేరితిని. పోవుటకు ముందు నిన్ను చూడదలచి యిక్కడకు వచ్చితిని.' ఇట్లు చెప్పి రాము డామెను తన వనవాసకాలమున ఆమె నగరులో నెట్లుండవలెనో బోధించెను.

## పునరుల్లేఖనము

1. అరణ్యకాండ 2

విరాధుడు సీత నెత్తుకొనిపోవుట చూచి రాము డెంతయో దుఃఖించి తన మనోవ్యథను వెల్లడించుచు లక్ష్మణునితో నిట్లనెను -

యదభిప్రేతమస్మాసు ప్రియం వరవృతం చ యత్,
కైకేయ్యాస్తు సుసంవృత్తం క్షిప్రమద్యైవ లక్ష్మణ. 18

యా న తుష్యతి రాజ్యేన పుత్రార్థే దీర్ఘదర్శినీ,
యయాహం సర్వభూతానాం ప్రియః ప్రస్థాపితో వనమ్. 19

అద్యేదానీం సకామా సా యా మాతా మధ్యమా మమ. 20

'లక్ష్మణా, వనములో మన కెట్టి దుఃఖము కైకేయి కిష్టమో, తన కే ప్రియము కోరి ఆమె వరము లడిగినచో, అది శీఘ్రముగా నేడే ప్రాప్తించినది.

అందుకు దూరదృష్టిగల కైకేయి, తన కుమారునకు రాజ్యమిప్పించుటతో సంతృప్తి చెందలేదు. దానిని చిరకాల మతని వశమున నుంచుటకై ఆమె మన వినాశము కూడ వాంఛించినది. సమస్తభూతకోటికిని ఇష్టుడనైనను నన్ను వనమున కంపినది. ఈవిధముగా మన రెండవతల్లి కైక సఫలమనోరథురా లైనది.'

### అరణ్యకాండ 47

యతివేషధారియై వచ్చిన రావణుని సీత గుర్తింపలేకపోయెను. అత డడిగిన ప్రశ్నలకు సమాధాన మివ్వకున్నచో అతడు శపించునేమో యని భయపడినది. అందుచే సీత రావణునకు తన పరిచయ మెరిగించెను. ఆ సందర్భమున నామె యిట్లనెను-

*కైకేయీ నామ భర్తారం మమార్యా యాచతే వరమ్.* 6

మా అత్త కైకేయి తన భర్త నడిగి వరములు గ్రహించెను.

*పరిగృహ్య తు కైకేయీ శ్వశురం సుకృతేన మే,*
*మమ ప్రవ్రాజనం భర్తుర్భరతస్యాభిషేచనమ్.* 7

*ద్వావయాచత భర్తారం సత్యసంధం నృపోత్తమమ్.* 8

'కైకేయి మా మామగారివద్ద సత్యప్రతిజ్ఞ గొని వరములు గ్రహించెను. సత్యప్రతిజ్ఞాబద్ధుడై ఆ రాజశిరోమణి ఆమె కోరినట్లుగా భరతునికి రాజ్యాభిషేకము, నా భర్తకు వనవాసమును వరము లనుగ్రహించెను. ఇట్లు చేయనిచో ప్రాణములు విడుతునని కైకేయి బెదిరించెను.'

### కిష్కింధాకాండ 56

వింధ్యపర్వతకందరమునుండి వెలికి వచ్చిన గృధ్రరాజు సంపాతి, అచ్చట చేరియున్న వానరులను చూచెను. అతడు వారిని చూచి సంతసించి తనలో నిట్లనుకొనెను- 'వీరు ప్రాయోపవేశము చేసి మరణించినచో చచ్చిన వారి నొక్కొక్కరుగా గ్రహించి భక్షించెదను. అతని మాటలు విన్న వానరనాయకుడు అంగదుడు హనుమదాదులతో నిట్లనెను- 'దశరథమహారాజు మరణము, జటాయువు వినాశము, విదేహరాజకన్య యగు సీత అపహరింపబడుట వంటి యీ అన్ని

కారణములును చేరి నేడు వానరుల జీవితమునే సంశయాస్పద మొనర్చినవి.'

*కైకేయ్యా వరదానేన ఇదం చ వికృతం కృతమ్.* 16

'రామలక్ష్మణులకు సీతతో కూడి వనమందు వసింపవలసివచ్చెను. రాముని బాణము వాలిని సంహరించెను. ఇక రామకోపాగ్నిచే సమస్తరాక్షసకులమును భస్మమగును. ఈ అన్ని వికృతులును దశరథుడు కైకకిచ్చిన వరములవలననే సంభవించినవి.'

## సుందరకాండ 33

సీతను చూచుటకై హనుమంతు డశోకవాటికి చేరెను. సీత అతడు వానరరూపమున వచ్చిన రావణుడే అని భయము చెందెను. కాని హనుమంతు డామెకు పూర్ణవిశ్వాసము కలిగించుచు, తాను మాయావి యగు రావణుడు కాదనియు, శ్రీరాముని దూతననియు నచ్చచెప్పెను. ఆ తర్వాత సీత హనుమంతునితో తన వృత్తాంత మిట్లు చెప్పెను - 'నేను దశరథమహారాజుగారి కోడలను, విదేహరాజైన జనకుని కుమార్తెను. ధీమంతుడగు శ్రీరాముని భార్యను.'

దశరథమహారాజు రామునికి రాజ్యాభిషేకము చేయనెంచినపుడు, అతని భార్య కైకేయి రాముని రాజుగా చేసినచో తాను అన్నపానములు విడిచి మరణింతునని అతనితో పలికెను.

*యత్తదుక్తం త్వయా వాక్యం ప్రీత్యా నృపతిసత్తమ,*
*తచ్చేన్న వితథం కార్యం వనం గచ్ఛతు రాఘవః.* 21

*స రాజా సత్యవాగ్దేవ్యా వరదాన మనుస్మరన్,*
*ముమోహ వచనం శ్రుత్వా కైకేయ్యాః క్రూరమప్రియమ్.* 22

'రాజా! నీవు ప్రసన్నుడవై మునుపు నాకిచ్చిన వాగ్దాన మసత్యము కాకూడదన్నచో తత్క్షణమే రాము డడవి కేగవలెను.' అని కైకేయి పలికెను. రాజు సత్యసంధుడు. అత డామెకు పూర్వ మొకప్పుడు రెండు వరము లిచ్చెను. వాటిని జ్ఞప్తికి తెచ్చి క్రూరాత్మయై అప్రియము లాడుచున్న కైక మాటలు విని రాజు మూర్ఛిల్లెను.

కామాసక్తస్థితిలో నున్న క్రౌంచమిథునమునందు మగపిట్టను నిషాదు డొకడు వధించెను. ఆ పిట్టకు కల్గిన దూరవస్థను చూచి వాల్మీకిమహర్షి దయాకులహృదయు డయ్యెను. ఆ సమయమున అతని నోట నీ విధమైన శాపవాక్కు వెలువడెను.

*మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీః సమాః.*

కాని ఆ పిదప అతడు మనసులో నిట్లు చింతించెను - 'తపోవ్రతినైన నా కీ విధముగా శాప ముచ్చరించుట తగదు.' అయినను శ్లోకబద్ధమైన ఆ వాక్కు మరల మరల అతని మనసులో మెదలుచుండెను. అట్టితరి బ్రహ్మ అతనివద్దకు వచ్చెను. ఋషి అతనికి అర్ఘ్యపాద్యాదు లిచ్చి పూజించెను. ఆ పూజాసత్కారములు బడసి బ్రహ్మ అతనితో నిట్లనెను- 'నేడు నీ నోట ఛందోబద్ధముగా వెలువడిన మాట నా సంకల్పము వలనే అట్లు వెలువడినది. ఇట్లు చెప్పి బ్రహ్మ అతనిని నారదునివలన ముందు వినిన ప్రకారము రామకథను ఛందోబద్ధముగా రచింపుమని ఆదేశించెను.

*కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్,*
*యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే.* 36

*తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి,*
*యావద్రామస్య చ కథా త్వత్కృతా ప్రచరిష్యతి.* 37

*తావదూర్ధ్వ మధశ్చ త్వం మల్లోకేషు నివత్స్యసి.* 38

'శ్రీరాముని పుణ్యకథను నీవు మనోహరమగు కావ్యముగా రచింపుము. ఈ పృథ్విపై నదీపర్వతాదులెంతవరకు నిల్చియుండునో అంతవరకు ఆ రామాయణ కథ లోకములో ప్రచారములో నుండును. ఆ కథ అట్లు నిల్చినంతవరకు నీవు స్వేచ్ఛగా ఊర్ధ్వలోకములలోను అధోలోకములలోను నా లోకమందును కూడ సంచరించుచు నుండగలవు.'

బ్రహ్మగారి యీ ఆదేశముపై వాల్మీకి రామాయణము వ్రాసెను.

బ్రహ్మవాక్యము వరదానతుల్యమే కాని, అది వర మని స్పష్టముగా పేర్కొనబడలేదు. కనుక ఈ వాక్యము లాశీస్సులుగనో సద్భావనా సూచకములుగనో

రూపించుచున్నవి. వీటిని 'వర' మనియే గ్రహించినచో అది అయాచిత మనదగును.

## 3. మునులు > కుశలవులు బాలకాండ 4

ఒకనాడు పవిత్రాంతఃకరణులైన ముని లెందరో ఒకచోట జమకూడిరి. అట్లు కూడిన వారిలో శుభలక్షణోపేతులైన కుశలవులు కూడ నుండిరి. వా రా సభలో రామాయణ కావ్యమును పాడి వినిపించిరి. అది విని ముని లందరు ఆనందాశ్రు భరితులైరి. సంతోషచిత్తులై వారు కుశలవులకు వేరు వేరు వస్తువులు కానుకలుగా నిచ్చిరి. అట్టియ శక్తిలేనివారు ఆశీర్వాదము లిచ్చిరి. సత్యవాదులైన ఆ ముని లందరునూ వారి కెన్నో వరము లిచ్చిరి.

*దదుశ్చైవం వరాన్ సర్వే మునయః సత్యవాదినః.* 26

కాని యా వరము లేవో స్పష్టముగా తెలియదు. అవి ఎట్టివో ఎన్నో అని కూడ తెలుపబడలేదు.

ఈ వరములు అయాచితములు.

## 4. బ్రహ్మ > రావణుడు బాలకాండ 15

దశరథుని ప్రార్థన మంగీకరించి ఋష్యశృంగుడు రాజునకు పుత్రప్రాప్తి కలుగవలెనని పుత్రకామేష్టి నారంభించెను. శ్రౌతవిధి ననుసరించి అగ్నియం దాహుతులు వ్రేల్వబడసాగెను. అప్పుడు దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మునులు తమ తమ యజ్ఞభాగములు గ్రహించుటకు వచ్చి చేరిరి. (ఇతరులకు కానరాకుండ వచ్చి గుమికూడిన ఆ దేవగంధర్వాదులు) అప్పుడు సృష్టికర్త యగు బ్రహ్మతో నిట్లు పలికిరి- 'మహాత్మా! నీ కృపవలన వరములు పొందిన రావణాసురుడు మమ్మెంతగనో బాధించుచున్నాడు.'

*త్వయా తస్మై వరో దత్తః ప్రీతేన భగవంస్తదా,*
*మానయంతశ్చ తం నిత్యం సర్వం తస్య క్షమామహే.* 7

'ప్రభో! నీవు ప్రసన్నుడవై వానికి వర మిచ్చితివి. అది మొదలు మేము వాని అపరాధములు సహించి నిత్యము బాధ చెందుచుంటిమి. ఆ దుర్మార్గుడు ముల్లోకముల జీవులను వేధించుచున్నాడు. వాడు దేవేంద్రుని జయింప దలచెను.'

*ఋషీన్ యక్షాన్ సగంధర్వాన్ బ్రాహ్మణానసురాంస్తథా,*
*అతిక్రామతి దుర్ధర్షో వరదానేన మోహితః.* 9

వరదానము పొంది గర్వించి ఉద్దండుడై వాడు ఋషియక్షగంధర్వాసురబ్రాహ్మణాదు లందరిని బాధించి అవమానించుచు విహరించుచున్నాడు.'

దేవత లందరును చెప్పిన మాటలు విని బ్రహ్మ కొంత తడవు యోచించి వారితో నిట్లనెను. 'దేవతలారా, ఆ దుర్మార్గుని వధించుట కుపాయము తోచుచున్నది.'

*తేన గంధర్వయక్షాణాం దేవతానాం చ రక్షసామ్,*
*అవధ్యోఽస్మీతి వాగుక్తా తథేత్యుక్తం చ తన్మయా.* 13

*నాకీర్తయదవజ్ఞానాత్తద్రక్షో మానుషాంస్తదా,*
*తస్మాత్స మానుషాద్వధ్యో మృత్యుర్నాన్యోఽస్య విద్యతే.*

వర మడుగునపు డతడు దేవగంధర్వయక్షరాక్షసులచేత చావకుండ వర మడిగెను. నేను 'తథాస్తు' అని పలికితిని. మానవులను తుచ్ఛులుగా భావించి, అజ్ఞానముచే వా డా సమయమున మానవులను పేర్కొనలేదు. కనుక వాని కిప్పుడు మానవులచేతనే చావు మూడును. మానవుడు తప్ప మరియొకడు వానిని వధింపలేడు.'

బ్రహ్మగారి మాటలకు దేవర్షిగణ మెంతయో సంతసించెను. ఆ సమయమున విష్ణు వచ్చుటకి వచ్చెను. వెంటనే దేవత లతనిని మానవరూపమున నవతరించి లోకకంటకుడైన రావణుని వధింపవలసినదని ప్రార్థించిరి. వాడు వేరొకరిచే వధింపబడడు కనుక మానవావతార మావశ్యక మనిరి. బాలకాండ 16

దేవత లందరూ చేరి విష్ణువుతో నిట్లు చెప్పిరి-

*యేన తుష్టోఽభవద్బ్రహ్మా లోకకృల్లోకపూర్వజః.* 4

*సంతుష్టః ప్రదదౌ తస్మై రాక్షసాయ వరం ప్రభుః ,*
*నానావిధేభ్యో భూతేభ్యో భయం నాన్యత్ర మానుషాత్.* 5

*అవజ్ఞాతాః పురా తేన వరదానే హి మానవాః,*
*ఏవం పితామహాత్తస్మాద్వరదానేన గర్వితః.* 6

*ఉత్పాదయతి లోకాంస్త్రీంస్త్రియశ్చాప్యపకర్షతి,*
*తస్మాత్తస్య వధో దృష్టో మానుషేభ్యః పరంతప.* 7

'ఆ రాక్షసునియందు ప్రీతి గల్గి సృష్టికర్తయైన బ్రహ్మ వాడు కోరిన విధముగా వరములను ప్రసాదించెను. అత డట్టి ఘోరతప మొనర్చి బ్రహ్మను మెప్పించెను. 'మనుష్యులచే తప్ప తక్కినవా రెవరివల్లను భయము కల్గ దని వానికి వర మొసగెను. వర మడుగునప్పుడు వాడు మనుజులను దుర్బలులని తృణీకరించెను. ఇట్లు బ్రహ్మ యిచ్చిన వరములవలన వానికి గర్వము పెరిగెను. వాడు ముల్లోకములను బాధించుచుండెను. స్త్రీల నపహరించుచుండెను. కనుక వాని కిక మనుష్యునివల్లనే మృతి కలుగును.

## ఉత్తరకాండ 10

అగస్త్యుడు శ్రీరామునికి రావణుని తపస్సునుగూర్చియు, వరప్రాప్తిని గూర్చియు చెప్పుచు యిట్లు పలికెను - "దశాననుడు పదివేల సంవత్సరములు నిరాహారుడై తపమొనర్చెను. ప్రతి వేయియేండ్ల కొకటి చొప్పున తన శిరస్సొకటి అగ్నిలో వ్రేల్చుచుండెను. ఇట్లు తొమ్మిది శిరస్సులు అగ్ని కాహుతి అయ్యెను. పదవ వేయి పూర్తికాగానే వాడు తన పదవ శిరస్సుకూడ వ్రేల్చుట కుద్యుక్తుడాయెను. వెంటనే బ్రహ్మ వానికి ప్రత్యక్షమై- 'దశగ్రీవా! నేను సంతసించితిని.

*శీఘ్రం వరయ ధర్మజ్ఞ వరో యస్తేఽభికాంక్షితః,*
*కం తే కామం కరోమ్యద్య న వృథా తే పరిశ్రమః.* 14

'ధర్మజ్ఞా, నీ వేమి కోరుకొనుచుంటివో శీఘ్రముగా నెరిగింపుము. నీ కోరిక చెప్పుము, పూరించెదను. నీ యీ పరిశ్రమ వ్యర్థము కారాదు' అని పలికెను. అది విని రావణుడు సంతసించెను. అతదు బ్రహ్మకు నమస్కరించి ఇట్లనెను -

*భగవన్ ప్రాణినాం నిత్యం నాన్యత్ర మరణాద్భయమ్,*
*నాస్తి మృత్యుసమః శత్రురమరత్వమహం వృణే.* 16

'మహాత్మా, ప్రాణులకు మృత్యువును మించిన భయమింకొకటి లేదు. కనుక నేను అమరత్వము కోరుకొనుచుంటిని. అందరికిని మృత్యువు ప్రబల శత్రువు.'

దానికి బదులు చెప్పుచూ బ్రహ్మ యిట్లనెను - 'నీకు అమరత్వము సిద్ధింపదు. వేరొక వరము వేడుము' అందుపై రావణు డిట్లనెను -

*సుపర్ణనాగయక్షాణాం దైత్యదానవరక్షసామ్,*
*అవధ్యోఽహం ప్రజాధ్యక్ష దేవతానాం చ శాశ్వత.* 19

*న హి చింతా మమాన్యేషు ప్రాణిష్వమరపూజిత,*
*తృణభూతా హి తే మన్యే ప్రాణినో మానుషాదయః.* 20

'ప్రజాప్రభో, గరుడనాగయక్షదైత్యదానవరాక్షసులకు నే నవధ్యుడను కాగోరెదను. దేవపూజ్యా, అన్యప్రాణులనుగూర్చి నాకు చింతలేదు. మానవాదులు నాకు తృణప్రాయులు.'

రావణు డిట్లనుటతో బ్రహ్మ - 'రాక్షసేశ్వరా, నీ మాట తథ్యమగును' అనెను. రామచంద్రా! ఈ వరమువలన రావణుదు దుర్జయుడయ్యెను."

ఈ వరము విషయమున వివిధవ్యక్తుల ప్రతిక్రియలు.

## శ్రీరాముడు యుద్ధకాండ 37

రావణుని తమ్ముడు విభీషణుడు రామునికి రావణు డొనర్చిన లంకానగర రక్షణవ్యవస్థాదులు వివరించుచుండెను. అదంతయు విని రాముదు రావణుని జయించుటకు తగిన వ్యూహ మేర్పరచి యిట్లు చెప్పెను. -

"కపిశ్రేష్ఠడైన నీలుదు పూర్వద్వారమున నిల్చి ప్రహస్తు నెదిరించును. వాలిపుత్రుడు అంగదుడు దక్షిణమున నిల్చి మహోదరమహాపార్శ్వుల నెదిరించును. అప్రమేయ ఆత్మబలసంపన్నుడు హనుమంతుడు పశ్చిమద్వారమున నిల్చును.

*దైత్యదానవసంఘానామృషీణాం చ మహాత్మనామ్,*
*విప్రకారప్రియః క్షుద్రో వరదానబలాన్వితః* 29

*పరిక్రమతి యః సర్వాంల్లోకాన్ సంతాపయన్ ప్రజాః,*
*తస్యాహం రాక్షసేంద్రస్య స్వయమేవ వధే ధృతః.* 30

దైత్యదానవసంఘములను, ఋషులను, మహనీయులను వేధించుటయందు మక్కువకల క్షుద్రస్వభావుదు. వరబలగర్వితుడై సర్వలోకములలో సంచరించుచు

ప్రజాకంటకుడైన రాక్షసరాజు రావణుని వధించుటకు నేను నిశ్చయించి, స్వయముగానే లక్ష్మణసమేతుడనై రావణుడు సేనాసమేతుడై నిలచియున్న ఉత్తరద్వారము నాక్రమించి, లోపల ప్రవేశింతును.

### యుద్ధకాండ 41

రాక్షసవధార్థమై తన సేనను యథార్థస్థానములలో నియోగించి, రాముడు మంత్రులతో నాలోచించి, రాజధర్మమని యెంచి, వాలిపుత్రు నంగదుని రావణునివద్దకు దూతగా పంపెను. అతడు రావణున కిట్లు సందేశము పంపెను - 'నేను సముద్రముదాటి నీ లంకపైకి వచ్చితిని.

*ఋషీణాం దేవతానాం చ గంధర్వాప్సరసాం తథా,*
*నాగానామథ యక్షాణాం రాజ్ఞాం చ రజనీచర,* 62

*యచ్చ పాపం కృతం మోహాదవలిప్తేన రాక్షస,*
*నూనం తే విగతో దర్పః స్వయంభూవరదానజః,*
*తస్య పాపస్య సంప్రాప్తా వ్యుష్టిరద్య దురాసదా.* 63

'ఓరీ నిశాచరా, రాక్షసరాజా, నీవు గర్వమోహితుడవై దేవర్షిగంధర్వాప్సరోనాగయక్షులు రాజుల పట్ల మహాపరాధ మొనర్చితివి. బ్రహ్మ యిచ్చిన వరముచే పెరిగిన నీ గర్వమంతయు నశించు తరుణము వచ్చినది. నీ పాపములకు దుర్భరఫలము నీ కిపుడు ముట్టనున్నది.

### యుద్ధకాండ 123

వానరసమేతుడై సుగ్రీవుడు, మంత్రిసహితుడై విభీషణుడును పుష్పకవిమానముపై నెక్కి కూర్చొనిరి. రాముడు విమానము నాకసమున పోవ నాదేశించెను. అప్పుడు రాముడు నలువంకలా చూచి సీతతో నిట్లు చెప్పెను - "వైదేహీ, కైలాసశిఖరోపమమగు నీ త్రికూటపర్వతాగ్రమున విశ్వకర్మచే నిర్మింపబడిన ఆ లంకను చూడుము. ఇటుప్రక్క యుద్ధభూమిని చూడుము. ఇక్కడ రక్తమాంసములు చేరి బురదగా నైనది. సీతా, ఈ యుద్ధములో వానరరాక్షసుల మహాసంహారము జరిగినది.

*ఏష దత్తవరః శేతే ప్రమాథీ రాక్షసేశ్వరః,*
*తవ హేతోర్విశాలాక్షి నిహతో రావణో మయా.* 5

అదుగో, అక్కడ వరదానగర్వితుడైన రాక్షసేశ్వరుడు చచ్చిపడెను. విశాలాక్షీ! అతడు నీ నిమిత్తమున నాచే వధింపబడెను."

దేవతలు — ఉత్తరకాండ 18

వేదవతి అగ్నిలో పడి మరణింపగా రావణుడు పుష్పకమెక్కి భూమి నాల్గుచెరగులా సంచరింప దొడగెను. ఆ పట్టున నతడు ఉశీరబీజ మను దేశ మరిగి అచ్చట రాజైన మరుత్తు దేవతలతో కూడి యజ్ఞ మొనర్చుచుండుట చూచెను. అప్పుడచట బృహస్పతి తమ్ముడును, సర్వధర్మమర్మజ్ఞుడు నైన బ్రహ్మర్షి సంవర్తుడు సకలదేవతాపరివేష్టితుడై యజ్ఞకార్యములు నిర్వర్తించు చుండెను.

*దృష్ట్వా దేవాస్తు తద్రక్షో వరదానేన దుర్జయమ్,*
*తిర్యగ్యోనిం సమావిష్టాస్తస్య ధర్షణభీరవః.* 4

బ్రహ్మవరబలమున దుర్జయుడైన రాక్షసరాజు రావణుని చూచి దేవతలు భయభీతులై తిర్యగ్జంతువుల రూపమును పొందిరి. ఇంద్రుడు నెమలియందును, యముడు కాకిలోను, కుబేరుడు తొండలోను, వరుణుడు హంసలోను చేరి, ఆ రూపమున దాగి, ఆత్మరక్ష యొనర్చుకొనిరి.

మరుత్తు — ఉత్తరకాండ 28

రాజైన మరుత్తుని చేరి రావణుడు - 'నాతో యుద్ధము చేయుము, లేదా నోరు విప్పి ఓడిపోయితి నని చెప్పుము' అని శాసించెను. అతడు 'నీ వెవరు?' అని ప్రశ్నింపగా రావణుడు పెద్దగా నవ్వుచు నిట్లనెను - 'నేను కుబేరుని తమ్ముడైన రావణుడను. నీ వింకను నన్నెరుగకపోవుట ఆశ్చర్యము. ముల్లోకములలోను ఒక నీవు తప్ప వేరెవ్వరును నా బలపరాక్రమము లెరుగని వారు లేరు. మా అన్నయగు కుబేరుని జయించి, అతనినుండి పుష్పకము గ్రహించిన రావణుడను నేనే.' దానికి బదులుగా మరుత్తు అతనితో నిట్లు పల్కెను- 'ధన్యుడవు, అన్నను యుద్ధములో జయించితివి. నీ వంటి మెచ్చదగిన పురుషుడు ముల్లోకములలోను లేదు.'

*కం త్వం ప్రాక్కేవలం ధర్మం చరిత్వా లబ్ధవాన్ వరమ్.* 12

'నీ వే పూర్వపుణ్యబలమున నిట్టి వరము సంపాదించితివి? నీవు స్వయముగా చెప్పుచున్నదానిని బోలు విషయ మింతవరకు నేను వినలేదు. బుద్ధిహీనుడా, నీ విప్పుడు నాచేత చావకుండ తప్పించుకొనలేవు. ఇప్పుడే నా తీక్ష్ణబాణప్రహారమున నిన్ను యమలోక మంపెదను.'

ఇట్లు పలికి మరుత్తు మహారౌద్రమున ధనుర్బాణములు గ్రహించి యుద్ధమునకు సిద్ధమయ్యెను. కాని సంవర్తమహర్షి అతని నాపెను. యజ్ఞదీక్షితుడైన వానికి యుద్ధాధికారము లేదని చెప్పి నివారించుటతో అతదు శస్త్రధారణము మాని స్వస్థుడై యజ్ఞోన్ముఖు డయ్యెను.

## బ్రహ్మ

రావణుడు యమునితో యుద్ధము చేయుచుండెను. యముని కా రాక్షసబలమును సంహరించుటకు సామర్థ్య ముండెను. అత డందుకొరకు తన కాలదండ మను ఆయుధమును ప్రయోగింపనెంచెను. ఆ దండము దృష్టి మాత్రముననే ప్రాణులను సంహరించును. ఇక దానిని ముట్టినవారుగాని, దానిచే కొట్టబడినవారుగాని చావకుండ నుండు టెట్లు? యము డా కాలదండము ప్రయోగించి రావణుని దగ్ధము చేయనెంచెను. ఆ సమయమున బ్రహ్మ అచ్చట ప్రత్యక్షమై యమునితో నిట్లనెను-

*వైవస్వత మహాబాహో న ఖల్వమితవిక్రమ,*
*న హంతవ్య స్త్వయైతేన దండేనైష నిశాచరః* 39

*వరః ఖలు మయైతస్మై దత్తస్త్రిదశపుంగవ,*
*న త్వయా నానృతః కార్యో యన్మయా వ్యాహృతం వచః.* 40

'వైవస్వతా, మహాబాహూ, నీపరాక్రమ మగణ్యము. కాని నీ వా కాలదండముతో రావణుని వధింపబోకుము. నే నితనికి దేవతలచేత చావులేకుండు నట్లు వర మిచ్చితిని. దానిని నీ వసత్యము గావింపవద్దు. ఏ దేవతగాని, మనుజుడుగాని నామాట పొల్లు చేసినచో అతనికి మూడులోకములవారిని అసత్యవాదులుగా చేసి దోషము వచ్చును. ఇందు సందేహము లేదు. కనుక నీ వీ దండమును రావణుని శిరస్సున ప్రయోగింపకుము. దీనిచే కొట్టబడిన

వా డెపడైనను తక్షణమే ప్రాణములు బాయును. ఈ దెబ్బకు చచ్చినను, చావకున్నను రెండు విధములా నా మాట పొల్లుపోవును. కనుక నీ వీ దండము నుపసంహరింపుము." బ్రహ్మ మాటలు విని యముడు కాలదండమును వెనుకకు దీసెను.

*కిం త్విదానీం మయా శక్యం కర్తుం రణగతేన హి,*
*న మయా యద్యయం శక్యో హంతుం వరపురస్కృతః.* 48

వరదాన మందినవా డగుటచే ఈ రాక్షసుడు నాచే కొట్టబడరా దన్నచో ఈ యుద్ధమున నేనిక చేయదగిన దేమి? ఇక వీని దృష్టినుండి తొలగిపోయెదను.' అని యెంచి యముడు రథవాహనాదిసహితముగా అదృశ్యుడాయెను.

ఇంద్రవిష్ణువులు ఉత్తరకాండ 27

కైలాసపర్వతమును దాటి పరాక్రమవంతుడైన రావణుడు ససైన్యముగా ఇంద్రలోక మరిగెను. అప్పు డింద్రుడు తన వద్ద గల దేవాదిత్యవసురుద్రమరుత్ సాధ్యగణములను యుద్ధమునకు పంపెను. రావణుని చూచిన ఇంద్రునికి భయమాయెను. అతడు వెంటనే విష్ణువు వద్ద కేగి 'మహాత్మా! నేనిప్పు డేమి చేయదగును' అని అడిగెను.

*వరప్రదానాద్ బలవాన్ న ఖల్వన్యేన హేతునా,*
*తత్తు సత్యం వచః కార్యం యదుక్తం పద్మయోనినా.* 8

'బ్రహ్మ యిచ్చిన వరముచే ఈ రాక్షసుడు మహాబలు డయ్యెను. దీనికి వేరొక కారణము లేదు. బ్రహ్మ యిచ్చిన వరమును అసత్యమొనర్పరాదు. అది మన కర్తవ్యము. కనుక ఏదో ఉపాయ మెంచి అతని అంత మూహింపుడు' అని చెప్పి యింద్రు డింకను యిట్లనెను. 'మహాత్మా! నీవు చక్రఖడ్గాదులు ధరించి స్వయముగా రావణు నెదిరించెదవా?' ఈ ప్రశ్నకు జవాబుగా విష్ణువతని కిట్లనెను - 'దేవరాజా! భయ మందకుము. నా మాట వినుము.

*న తావదేష దుష్టాత్మా శక్యో జేతుం సురాసురైః,*
*హంతుం చాపి సమాసాద్య వరదానేన దుర్జయః.* 15

ఈ దుష్టాత్ముని సురాసురులందరూ చేరినను సంహరింపలేరు. జయింపలేరు

కూడ. అది అతని వరబలము. అతడు దుర్జయుడు. నే నిపుడు యుద్ధరంగమున వాని నెదిరింపను. ఏలయన-

*నాహత్వా సమరే శత్రుం విష్ణుః ప్రతినివర్తతే,*
*దుర్లభశ్చైవ కామోఽద్య వరగుప్తాద్ధి రావణాత్.* 18

'యుద్ధములో శత్రువును సంహరింపకుండ వెనుకకు మరలుట నా స్వభావము కాదు. కాని యిప్పుడు రావణుడు వరదానముచే సురక్షితుడు. కనుక నా పూనిక తీరదు. అయినను, సమయము వచ్చినప్పుడు నేను వీనిని తప్పక సంహరింతునని నీతో ప్రతిజ్ఞచేసి చెప్పుచున్నాను. రావణుని ససైన్యముగా నేనే వధించెదను. దేవతల కానందము చేకూర్చెదను. కాని వానికి మరణసమయము రావలెను. అది గమనించి నే నా కార్య మొనర్చెదను.' ఇట్లు చెప్పి తత్కాలమున యముడు, దేవతలు ధైర్యము వహించి రావణునితో యుద్ధము చేయవలెనని సలహాయిచ్చెను.

ఉత్తరకాండ 29

రావణునితో యుద్ధము చేయుచున్న సమయమున ఇంద్రుడు దేవతలతో నిట్లనెను - 'ఈ దుష్టనిశాచరుని ప్రాణములతోనే పట్టి బంధించవలెను. వీడు బలవంతుడు. వాయువేగమున వచ్చి రథసహితముగా సేనామధ్యమున దిగును.

*న హ్యేష హంతుం శక్యోఽద్య వరదానాత్ సునిర్భయః,*
*తద్ గ్రహీష్యామహే రక్షో యత్తా భవత సంయుగే.* 15

వీ డీ దినమున మరణింపడు. బ్రహ్మ యిచ్చిన వరబలమున మహానిర్భయుడై మీదికి వచ్చుచున్నాడు. కనుక వీనిని పట్టుకొని బంధించుటకే ప్రయత్నము చేయుదము. మీ రిదే లక్ష్యముతో యుద్ధము చేయుడు.'

కార్తవీర్యార్జునుడు ఉత్తరకాండ 32

మాహిష్మతీనగరపాలకుడైన కార్తవీర్యార్జునుడు సహస్రబాహుడు. అతనితో దశబాహుడైన రావణుడు యుద్ధమొనర్పసాగెను. కార్తవీర్యార్జునుడు కోపించి రావణుని వక్షఃస్థలమున గాఢముగా కొట్టెను. కాని-

*వరదానకృతత్రాణే సా గదా రావణోరసి,*
*దుర్బలేవ యథావేగం ద్విధాభూతాఽపతత్ క్షితౌ.* 61

పరప్రభావముచే రావణుడు రక్షింపబడెను. వేగముగా వచ్చి కొట్టినను ఆ గద దుర్బలమైన దానివలె రావణుని వక్షము తాకి రెండుముక్క లయ్యెను. కాని రావణు డొక అడుగు వెనుకకు వేసెను. ఆర్తనాదము చేయుచు క్రింద చతికిలబడెను. అప్పు డర్జునుడు వాని మీదికి లంఘించి, పట్టుకొని, తన వేయి చేతులతోను పట్టి, అతనిని త్రాళ్లతో బంధించెను. పిదప రాక్షసుల నెదిరించి, పారద్రోలి, అర్జునుడు రావణుని తన నగరమునకు తోడ్కొని పోయెను.

## మాల్యవంతుడు యుద్ధకాండ 35

రావణుని మాతామహుడు మాల్యవంతుడు మంచి బుద్ధిమంతుడు. అతడు రావణునికి రామునితో సంధిచేసికొనుమని సలహాయిచ్చెను. రాముడు సీతకొరకై దండెత్తివచ్చెను. కనుక సీత నతని కిచ్చివేయుమని చెప్పెను.

*దేవదానవయక్షేభ్యో గృహీతశ్చ వరస్త్వయా,*
*మనుష్యా వానరా ఋక్షా గోలాంగూలా మహాబలాః,*
*బలవంత ఇహాగమ్య గర్జంతి దృఢవిక్రమాః.* 23

నీవు దేవదానవయక్షుల కవధ్యుడుగా వరము పొందితివి. కాని మనుష్యులచే కాదు. ఇప్పుడు మహాబలవంతులైన నరవానరఋక్షగోలాంగూలబలములు వచ్చి గర్జించుచున్నవి. వారు బలవంతులు, సేనాసమేతులు, దృఢవిక్రములు అని చెప్పెను-

'రాక్షసులకు వినాశకాలము దాపురించినట్టి నిమిత్తములు గోచరించుచున్నవి.' అని అతడు సూచించెను. కాని యీ మాటలు గర్విష్ఠియైన రావణుని తల కెక్కలేదు.

## హనుమంతుడు యుద్ధకాండ 59

మాల్యవంతునివలెనే హనుమంతుడు కూడ రావణునకు, అతడు పొందిన వరమునకు గల హద్దు లేవో తెలిపెను. యుద్ధములో రావణుడు తన మహోజ్జ్వలధనుర్ముక్తములైన బాణములతో వానరులను చీల్చి చెండాడుచూ ముందు కేగుచుండెను. అప్పు డతని బాణాసారమును నిలువరించి, హనుమంతు డతని కెదురేగి యిట్లనెను-

*దేవదానవగంధర్వైర్యక్షైశ్చ సహరాక్షసైః,*
*అవధ్యత్వం త్వయా ప్రాప్తం వానరేభ్యస్తు తే భయమ్.* 55

'నిశాచరా, దేవదానవగంధర్వయక్షరాక్షసులచే చావు లేకుండ వర మందినావు. కాని వానరులచే నీకు ముప్పు తప్పదు.'

విభీషణుడు యుద్ధకాండ 19

విభీషణుడు, రాముని శరణు జొచ్చిన పిదప, అత డడుగగా లంకాధిపతికి గల బలాబలవివరములు తెలియజేయుచు నిట్లనెను.

*అవధ్యః సర్వభూతానాం గంధర్వోరగపక్షిణామ్,*
*రాజపుత్ర దశగ్రీవో వరదానాత్ స్వయంభువః.* 9

'రామచంద్రా! బ్రహ్మ యిచ్చిన వరమువలన రావణుడు గంధర్వనాగ పక్షిప్రభృతిసత్త్వములచేత మరణ మొందడు. తర్వాత నతడు తక్కిన రాక్షసయోధుల బలపరాక్రమములు వివరించెను.

రావణుని ఉద్విగ్నత యుద్ధకాండ 90

శ్రీరాముని బాణాసారముచే పీడితుడై భయపడిన రావణుడు రాక్షసులతో నిట్లనెను - 'నేను చేసిన మహోగ్రతపస్సంతయు వ్యర్థమైనది. నేడు మహేంద్రోపమ పరాక్రముడ నగు నాకు ఒకానొక మనుజమాత్రునిచే పరాజయమందవలసి వచ్చెను. బ్రహ్మ నాకు 'మానవులచే భయ మేర్పడును, తెలిసికొనుము.' అని చెప్పిన మాట తిరుగులేని సత్యమై నేడు నాకు ప్రత్యక్షానుభవమయ్యెను.

*దేవదానవగంధర్వైర్యక్షరాక్షసపన్నగైః,*
*అవధ్యత్వం మయా ప్రోక్తం మానుషేభ్యో న యాచితమ్.* 7

'దేవదానవగంధర్వయక్షరాక్షసపన్నగాదులచే అవధ్యత్వమును కోరుకొంటిని కాని నేను మానవులచే నవధ్యత్వము వేడలేదు.' అతని కిప్పు డా విషయము పశ్చాత్తాపము కలిగించుచుండెను.

యుద్ధకాండ 92

కుమారుడైన ఇంద్రజిత్తు యుద్ధములో మరణింపగా రావణుడు మిక్కిలి కోపించి, రాక్షసులను ప్రోత్సహించుచు ఇట్లు పలికెను- 'నిశాచరులారా, నేను దశసహస్రవర్షములు తపస్సు చేసి బ్రహ్మను మెప్పించితిని.'

*తస్యైవ తపసో వ్యుష్ట్యా ప్రసాదాచ్చ స్వయంభువః,*
*నాసురేభ్యో న దేవేభ్యో భయం మమ కదాచన.* 29

'ఆ తపస్సువలన నాకు బ్రహ్మదేవుని వరము లభించెను. నాకు దేవాసురులవలన ఏనాడును భయము లేదు.

బ్రహ్మవలన ప్రాప్తించిన కవచము ధరించి, దేవాసురులతో నేను పోరాడినప్పుడు ఇంద్రుని వజ్రము కూడ దానిని ఛేదించలేకపోయెను. అందుచే నాతో యుద్ధము చేయుటకు ఇంద్రుడు కూడ భయపడుచుండును. దేవాసుర సంగ్రామవిజేతనైన నాకు బ్రహ్మ మహోన్నతమగు ధను విచ్చెను. నే నిప్పు డా ధనువు గొని మంగళవాద్యధ్వనులు చెలరేగుచుండగా యుద్ధమున కరిగి రామలక్ష్మణులను వధించెదను.'

## రాక్షసస్త్రీల విలాపము యుద్ధకాండ 94

ఇంద్రజిత్తు వధింపబడుటతో లంకలో నెల్లెడల హాహాకారములు చెలరేగెను. రాక్షసస్త్రీ లెంతయో భయపడిరి. యుద్ధములో వారి ఆత్మీయులు మరణించుటచే వారెంతయో శోకాకులలై విలపింపదొడగిరి. 'బహుశా ఈ రామునిరూపమున వచ్చి సాక్షాత్ రుద్ర, విష్ణు, దేవేంద్రులలో నొకరో లేదా స్వయముగా యముడో మనలను చంపుచున్నట్లున్నది. మన యోధులెందరో రామునిచే చంపబడిరి. ఇక మనకీ జీవితమే నిరాశాపూర్ణమైనది. ఈ భయ మెట్లు తీరునో తెలియకున్నది.' అని వారు తమలో తాము చర్చించుచుండిరి.

*రామహస్తాద్ దశగ్రీవః శూరో దత్తమహావరః,*
*ఇదం భయం మహాఘోరం సముత్పన్నం న బుద్ధ్యతే.* 26

'రావణుడు శూరుడు. బ్రహ్మ అతనికి వరము లిచ్చెను. కాని ఈ గర్వముచేతనే అతడు రామునిచే తన కేర్పడిన భయమును తెలియజాలకున్నాడు.'

రావణుని ప్రతియుద్ధసమయమునను రాక్షసస్త్రీలు ఉత్పాతములు చూచు చుండిరి.

*పితామహేన ప్రీతేన దేవదానవరాక్షసైః,*
*రావణస్యాభయం దత్తం మనుష్యేభ్యో న యాచితమ్.* 29

బ్రహ్మ యిచ్చిన వరము రావణునకు దేవదానవరాక్షసులచే నవధ్యత్వమే కాని మానవులచే కాదని, అత డట్లడుగలేదని వారెరుగుదురు.

సుమాలి ఉత్తరకాండ 11

రావణాదినిశాచరులకు వరములు లభించెను. ఇది విని సుమాలి యను రాక్షసుడు అనుచరసహితముగా నిర్భయుడై రసాతలము వీడి వచ్చెను. ఉత్తమయోధులైన రాక్షససచివులతో నతడు రావణుని చూడ నేగి, అతనిని కౌగిలించుకొనెను.

*దిష్ట్యా తే వత్స సంప్రాప్తశ్చింతితోఽయం మనోరథః,*
*యస్త్వం త్రిభువనశ్రేష్ఠాల్లబ్ధవాన్ వరముత్తమమ్.* 4

'నాయనా, త్రిభువనశ్రేష్ఠుడైన బ్రహ్మవలన మహోత్తమవరములు గడించి ధన్యుడవైతివి. ఇది మహాదృష్టము. నీ చిరకాలమనోరథము నేడు సంప్రాప్తమాయెను.

ఇట్లు వలికి అత డింకను ఇట్లనెను - 'విష్ణువువలన భయముచే రాక్షసులమైన మేమందరమును లంకను విడిచి రసాతలమునకు పోయినారము. ఇప్పుడా భయము తొలగిపోయెను.' ఇట్లు చెప్పి అతడు సామదానభేద దండోపాయములలో దేనినైనను ప్రయోగించి కుబేరునినుండి లంకను తిరిగి గ్రహించవలెనని బోధించెను.

విశ్వామిత్రుడు బాలకాండ 20

యజ్ఞవిఘ్న మొనర్చుచున్న రాక్షసులను పరిమార్చుటకై శ్రీరాముని తనతో పంపవలెనని విశ్వామిత్రుడు దశరథుని కోరెను. విశ్వామిత్రునికి స్వాగత మిచ్చునప్పుడు దశరథుడు ఆతడు కోరిన దేదియైనను సమకూర్చెదనని చెప్పెను. కాని రాముని తనతో పంపుమని విశ్వామిత్రుడు కోరుటతో, దశరథుని మనసులో పుత్రవియోగమును గూర్చి విచారము కలిగెను. రామునికి బదులుగా తానే సేనాసహితముగా ఆ రాక్షసులతో యుద్ధము చేయుటకు వచ్చెదనని అతడు చెప్పెను. కాని విశ్వామిత్రుడు -

*పౌలస్త్యవంశప్రభవో రావణో నామ రాక్షసః,*
*స బ్రహ్మణా దత్తవరస్త్రైలోక్యం బాధతే భృశమ్.* 16

'మహారాజా! రావణుడను రాక్షసుడు పులస్త్యవంశసంభవుడు. మహాప్రసిద్ధుడు. వానికి బ్రహ్మ కోరిన వరము లిచ్చుటచే వాడు మరింత బలపరాక్రమవంతు డాయెను. వా డప్పుడు అనేకరాక్షసగణపరివృతుడై మూడులోకముల వారిని బాధించుచుండెను. వాడు విశ్రవసుని పుత్రుడనియు, కుబేరుని తమ్ముడనియు వినుచున్నాము.

ఆ బలశాలి యైన రాక్షసుడు, కోరికయున్నను తాను స్వయముగా యజ్ఞములకు విఘ్న మొనర్చుటకు రాడు. అది వాని దృష్టికి నీరసకార్యము. అందువలన మారీచసుబాహు లను మహాబలులైన రాక్షసులను ఈ కార్యమునకై ప్రేరేపించి పంపుచుండును. రాముడు తప్ప వేరొక డా రాక్షసులను సంహరింపలేడు. కనుక నాతో రాముని పంపుము.' అని పల్కెను.

ఉత్తరకాండ 14

బలాభిమానముచే మదించిన రావణుడు మహోదర, ప్రహస్త, మారీచ, శుక, సారణ, ధూమ్రాక్షులను ఆర్గురు వీరులైన మంత్రులతో కలిసి కైలాస పర్వతముపైకి పోయెను. అక్కడ అతని అన్న కుబేరుడు రాజ్యమేలుచుండెను. అతడు యక్షులను రావణునితో యుద్ధము చేయుటకు పంపెను. కాని రావణుడును అతని మంత్రులును యక్షులలో నెందరినో సంహరించిరి. వారు కుబేరుని నగరద్వారము చేరుకొనిరి. అపుడచ్చట ద్వారపాలురు వారి నాపబోయిరి, కాని వారి కది సాధ్యము కాలేదు. వారు నగరములోనికి ప్రవేశించిరి.

*తతస్తోరణముత్పాట్య తేన యక్షేణ తాడితః,*
*రుధిరం ప్రస్రవన్ భాతి శైలో ధాతుస్రవైరివ.* 27

*స శైలశిఖరాభేణ తోరణేన సమాహతః,*
*జగామ న క్షతిం వీరో వరదానాత్ స్వయంభువః.* 28

అప్పు డా ద్వారరక్షకులు తోరణస్తంభ మొకటి పెకల్చి దానితో రావణుని కొట్టిరి. అతని శరీరము రక్తసిక్తమాయెను. గైరికధాతుజలప్రవాహముతో నొప్పు పర్వతమువలె రావణుడు రక్తధారలతో దోగాడుచు, తోరణాఘాతమును లక్షింపక పర్వతశిఖరమువలె నిశ్చలుడై నిల్చెను. బ్రహ్మ యిచ్చిన వరప్రభావముచే అతడు యక్షులచేత ఓటుపడి మరణింపలేదు.

అప్పుడు రావణుడు అదే స్తంభ మందుకొని యక్షులను సంహరింప

దొడగెను. యక్షులు ప్రహారజర్జరితశరీరులై, రావణుని పరాక్రమమునకు వెరచి యుద్ధము వీడి పారిపోయిరి.

రావణునకు బ్రహ్మ యిచ్చిన వరములు వెనుక చూచితిమి. ఆ వరప్రసంగములు కొన్నిచోట్ల భిన్నముగా నున్నవి. అన్నిచోట్లను అతని అవధ్యతను గూర్చి చెప్పిన ప్రాణులు ఒకే రీతిగా లేరు. అయినను నరవానరభల్లూకములను ఎచ్చటను పేర్కొనలేదు. రావణుడు చేసిన తపస్సంతయు వరప్రాప్తికొరకే. కనుక అతనికి లభించిన యీ వరము యాచిత మనదగినది.

ఈ వరమునకు తోడు బ్రహ్మవలన అతనికి మరి రెండు మూడు వరములు కూడ లభించినట్లు చెప్పబడినది.

### ఉత్తరకాండ 9

రావణుని తల్లి కైకసి. ఆమె రావణునితో 'నీవును అన్న కుబేరుని వలె తేజోవిభవసంపన్నుడవు కాదగిన ప్రయత్నము చేయుమనెను. రావణుడందుకు ప్రతిజ్ఞ చేసి 'నేను పరాక్రమాదులలో అన్న కుబేరుని మించెదను. నేను తపస్సు చేసి నా మనోరథము సాధించెదను.' అని పలికి, ఆ ఉద్దేశ్యముతో తపస్సునకు పూనుకొనెను. అతడు గోకర్ణక్షేత్రమున ఆశ్రమ మేర్పరచుకొని తపస్సు చేయదొడగెను.

*స రాక్షసస్తత్ర సహానుజస్తదా*
*తపశ్చచారాతులముగ్రవిక్రమః,*
*అతోషయచ్చాపి పితామహం విభుం*
*దదౌ స తుష్టశ్చ వరాన్ జయావహాన్.* 48

తన సోదరులతో కలసి, మహావిక్రముడైన రావణుడు ఘోరముగా తపస్సు చేసెను. అతని తపస్సునకు బ్రహ్మ సంతోషించి, అతడు కోరినట్లుగా జయావహములైన వరము లిచ్చెను.

### ఉత్తరకాండ 10

రావణుడు బ్రహ్మను గరుడ నాగ యక్ష దైత్యదానవ రాక్షసులవల్లను, దేవతలవల్లను తన కవధ్యత్వము కోరుకొనెను. బ్రహ్మ దాని కంగీకరించెను. పైగా ఇట్లనెను-

*శృణు చాపి వరో భూయః ప్రీతస్యేహ శుభో మమ,*
*హుతాని యాని శీర్షాణి పూర్వమగ్నౌ త్వయానఘ.* 23

*పునస్తాని భవిష్యంతి తథైవ తవ రాక్షస,*
*వితరామీహ తే సౌమ్య వరం చాన్యం దురాసదమ్.* 24

*ఛందతస్తవ రూపం చ మనసా యద్యథేప్సితమ్.* 25

'అనఘా! నీయందు ప్రసన్నుడనై నే నిచ్చు వరము లింకను వినుము. నీవు పూర్వము అగ్నిలో వ్రేల్చిన ఆ నీ శిరస్సులన్నియు యథాపూర్వముగా తిరిగి నీకు లభించును. ఇంకొక దుర్లభమగు వరము ీ కిచ్చుచున్నాను. దానివలన నీవు కోరినట్టి రూపము పొందగలవు.'

ఈ వర మయాచితము.

## ఉత్తరకాండ ప్రక్షిప్త - 4

ఒకసారి చంద్రకిరణములకు రాక్షసులు బెగ్గడిల్లిరి. దానిపై కోపించి రావణుడు తన బాణములతో చంద్రుని వేధించెను. అప్పుడు బ్రహ్మ చంద్రలోకమునకు వెళ్లి రావణునితో నిట్లనెను - 'నీ వీ చంద్రలోకము విడిచి పొమ్ము, చంద్రుని బాధింపవలదు. అతడు విశ్వహిత మొనర్చువాడు. నేను నీ కొక మంత్ర మిచ్చెదను. ప్రాణముల మీదకు వచ్చినపుడు ఆ మంత్రము జపించినచో మృత్యువు కల్గదు. రావణు డా మంత్రము చెప్పుమనెను. మంత్రమిచ్చుటకు ముందు బ్రహ్మ కొన్ని ముఖ్యమైన నియమము తేర్చెను. ప్రాణ సంకటసమయమున మాత్రమే ఈ మంత్రమును జపించవలెను. తక్కిన సమయములలో కాదు. జపము చేయనిదే సిద్ధి కలుగదు.' ఇట్లు చెప్పి బ్రహ్మ ఆతనికి శిరోమంత్ర మనుగ్రహించెను.

*మయా ప్రోక్తమిదం పుణ్యాం నామాష్టశతముత్తమమ్,*
*సర్వపాపహరం పుణ్యాం శరణ్యాం శరణార్థినామ్,*
*జప్త మేతద్దశగ్రీవ కుర్యాచ్ఛత్రువినాశనమ్.* 50

'దశగ్రీవా, నే నిచ్చిన ఈ మంత్రము మహాపవిత్రమైనది. దానిని 'నామాష్టశతక' మందురు. ఇది సర్వపాపహరము, పుణ్యప్రదము. శరణార్థుల కాశ్రయపదము. నీవిది జపించినచో నీ శత్రువులు నాశమందెదరు.'

*దత్త్వా తు రావణస్యైవం వరం స కమలోద్భవః,*
*పునరేవ జగామాశు బ్రహ్మలోకం సనాతనమ్.* 52

రావణుని కీ వరమిచ్చి బ్రహ్మ తనలోకమునకు పోయెను. ఈ వర మయాచితము.

## 5. విష్ణువు > దేవతలు

దశరథుని పుత్రకామేష్టికి ఋశ్యశృంగుడు అధ్వర్యుడుగా నుండెను. అతడు ప్రజాపతి నుద్దేశించి యజ్ఞారంభ మొనర్చెను. శ్రౌతవిధి ననుసరించి హోమము చేయుచుండెను. యజ్ఞభాగములు గ్రహించుటకు దేవగంధర్వమహర్షు లందరూ వచ్చిరి. (వా రితరులకు కనబడరు). వారు బ్రహ్మదేవునితో నిట్లు పలికిరి - 'మహాత్మా, రావణాసురుడు నీ దయవలన వరములంది, బలవంతుడై, మమ్మందరిని బాధించుచున్నాడు. నీ విచ్చిన ఆ వరములు మాకు మన్నింపదగినవయ్యెను. కనుక వాని అపరాధములన్నియు సహించుచున్నాము. వాడు ముల్లోకములను వేధించుచున్నాడు. వా డింద్రుని జయింప గోరు చున్నాడు. నీ విచ్చిన వరముల వలన వాడు ఉద్దండుడైనాడు. కనుక వాని వధార్థమేదేని ఉపాయ మూహింపుము.' దేవత లందరు ఇట్లు చెప్పగా విని బ్రహ్మ కొంత యోచించి వారితో నిట్లనెను - 'దేవతలారా, ఆ దురాత్ముని వధ కొక ఉపాయము తోచుచున్నది. వాడు వరము లడిగినప్పుడు గంధర్వదేవ యక్షరాక్షసాదులచే తనకు చావు లేకుండ వర మడిగెను. మానవులను వాడు తుచ్ఛులుగా భావించెను. అందుచే వారి నతడు పేర్కొనలేదు. కనుక వానికి మానవులచేతిలో మరణము కలుగును.' ఈ మాటలు విని దేవతలు విష్ణుని ప్రార్థించిరి - 'ముల్లోకములకును హిత మెంచి నీ కొక మహాకార్యము నప్పగించుచుంటిమి. ఇప్పుడు ధర్మాత్ముడైన యీ దశరథుడు, యజ్ఞమొనర్చు చున్నాడు. ఇత డుదారుడు, ఋషితేజుడు. ఇతనికి ముగ్గురు భార్యలున్నారు. నీవు నాల్గు రూపములు ధరించి ఆ రాణులు ముగ్గురకును పుత్రుడవై ఉదయింపుము. ఇట్లు మానవరూపమున నవతరించి నీవు లోకకంటకుడై దేవతల కవధ్యుడైన రావణుని సంహరింపుము.' అప్పుడు విష్ణుదేవుడు వారి కిట్లనెను-

*భయం త్యజత భద్రం వో హితార్థం యుధి రావణమ్,*
*సపుత్రపౌత్రం సామాత్యం సమంత్రిజ్ఞాతిబాంధవమ్.* 28

హత్వా క్రూరం దురాధర్షం దేవర్షీణాం భయావహమ్,
దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ. 29

వత్స్యామి మానుషే లోకే పాలయన్ పృథివీమిమామ్,
ఏవం దత్వా వరం దేవో దేవానాం విష్ణురాత్మవాన్. 30

'దేవతలారా, మీరు భయపడకుడు, భద్రమగును. నేను మీ హితార్థము మానవరూపమున జనించి రావణుని పుత్రపౌత్రహితబంధుమంత్రిమిత్రులతో కూడ వధించి, యీ భూమిని పదకొండువేల యేండ్లు పాలించెదను.'

దేవతల కీ విధముగా వరమిచ్చి విష్ణువు తా నవతరించుటకు దశరథుని పత్నులే తగిన క్షేత్రములని నిశ్చయించి నల్గురు పుత్రులుగా వారి గర్భమున నుదయించెను.

ఈ వరము యాచితము.

6. ? > . జయ, సుప్రభ బాలకాండ 21

విశ్వామిత్రుని బల ముగ్గడించుచు వసిష్ఠుడు ఆతనితో రాముని పంపవలసినదిగా దశరథునకు నచ్చజెప్పుచుండెను.

మారీచసుబాహులను రాక్షసులు విశ్వామిత్రుని యజ్ఞమునకు విఘ్నము కలిగించుచుండిరి. శాప మిచ్చి ఆ రాక్షసులను నాశము చేయగల శక్తి విశ్వామిత్రునికున్నను, యజ్ఞారంభమైనది కనుక నియమానుసారము శాప మీయదగదు. కనుక ఆతడు యజ్ఞపూర్తి చేయనెంచి దశరథునివద్దకు వచ్చెను. అత డడిగినది ఇచ్చెద నని దశరథు డతనికి ముందుగా వాగ్దాన మిచ్చెను. అప్పుడు విశ్వామిత్రుడు యజ్ఞరక్షకు, రాక్షససంహారమునకు శ్రీరాముని తనతో పంపుమని కోరెను. కాని దశరథునకు పుత్రవియోగము నచ్చక ఏవేవో వికల్పములు చెప్పి శ్రీరాముని పంపుట కంగీకరింపకుండెను. అందుపై విశ్వామిత్రుడు కోపించి 'ముందుగ కోరిన దిచ్చెదనని చెప్పి, యిప్పుడు కాదనుట మీ రఘువంశపు మర్యాద కాదని' చెప్పి యచ్చట నుండి వెడలిపోయెను. అతడు కోపించి ప్రపంచమునే ధ్వంసము చేయగలడని యెంచి వసిష్ఠుడు దశరథునితో నిట్లనెను- 'నీవు మూడు లోకములలోను ధర్మాత్ముడని ప్రసిద్ధిజెందితివి. కనుక రాముని విశ్వామిత్రునితో పంపుము.

కుశికనందనుడైన యీ విశ్వామిత్రుని రక్షణలో రామునికి రాక్షసభయము లేదు. విశ్వామిత్రుడు తపస్సంపన్నుడు. ముల్లోకములందలి సమస్తశస్త్రాస్త్రములను విశ్వామిత్రు డెరుగును. ఆ అస్త్రములు కుశాశ్వుని పుత్రులు. ప్రజాపతి వానిని విశ్వామిత్రునికి అతడు రాజుగా నున్నతరి  ఇచ్చెను. అవి అతనివద్ద నున్నవి.'

*జయా చ సుప్రభా చైవ దక్షకన్యే సుమధ్యమే,*
*తే సూతేఽస్త్రాణి శస్త్రాణి శతం పరమభాస్వరమ్.* 15

*పంచాశతం సుతాన్ లేభే జయా లబ్ధవరా వరాన్,*
*వధాయాసురసైన్యానామప్రమేయానరూపిణః.* 16

*సుప్రభా జనయచ్చాపి పుత్రాన్ పంచాశతం పునః,*
*సంహారాన్నామ దుర్ధర్షాన్ దురాక్రామాన్ బలీయసః.* 17

'దక్షప్రజాపతి తనయలు జయ, సుప్రభలు మిక్కిలి సౌందర్యవతులు. వారిరువురు మహాతేజఃపూర్ణములైన నూరు శస్త్రాస్త్రములను ప్రసవించిరి. వారిలో జయ తన వరబలమున ఏబదిమంది పుత్రులను బడసెను. వా రపరిమితబలులు, అదృశ్యరూపులు. వారు రాక్షససైన్యములను నాశనము చేయుటకు అవతరించిరి. సుప్రభకును సంహారకులను పేర ఏబదిమంది పుత్రులు కలిగిరి. వారు దుర్జయులు. వారి · నెదిరించుట ఎవరికిని శక్యము కాదు. వారు మహాబలవంతులు.'

'ధర్మజ్ఞుడైన యీ విశ్వామిత్రుడు ఆ అస్త్రశస్త్రము లన్నిటిని బాగుగా నెరుగును. ఇంతవరకు లేని అస్త్రశస్త్రములను ఉత్పాదించగల శక్తి సామర్థ్యము లితని కున్నవి. కనుక రాజా! యశస్వియు తేజస్వియునైన యీ విశ్వామిత్రుని వెంట రాముని పంపుటకు నీవు సందేహింపవలదు. ఈ మహర్షి స్వయముగనే ఆ రాక్షసులను సంహరింపగలడు. కాని అతడు నీ పుత్రునికి శుభమాపాదింప నెంచెను. అందుకని అత డీ విధముగా వచ్చి నిన్నడుగుచుండెను.

వసిష్ఠుని వాక్యములు విని దశరథుడు ప్రసన్నమనస్కు డాయెను. వెంటనే అతడు విశ్వామిత్రుని వెంట రాముని పంపుటకు నిశ్చయించెను.

జయ, సుప్రభలకు వరము లెవరిచ్చిరో, ఎందు కిచ్చిరో, స్పష్టముగా చెప్పలేదు. కనుక యీ వరములు యాచితములో, అయాచితములో తెలియదు.

## 7. ఇంద్రుడు > మలదకరూశములు బాలకాండ 24

యజ్ఞరక్షణార్థము విశ్వామిత్రుని వెంట రామలక్ష్మణు లేగుచుండిరి. గంగను దాటుచుండగా, విశ్వామిత్రుడు వారికి సరయూనది జన్మవృత్తాంతమును, తాటకావననిర్మాణగాథను వినిపించెను-

పూర్వమిచ్చట రెండు సమృద్ధములైన జనపదము లుండెడివి. వాటిని మలదమని, కరూశమనియు పిల్చుచుండిరి. అవి దేవనిర్మితములు. వృత్రాసురుని వధించిన పిదప ఇంద్రునికి మల మంటినది. అతనికి క్షుద్బాధ కలిగినది. బ్రహ్మహత్యాదోష మతనిలో ప్రవేశించినది. అపుడు దేవతలు, ఋషులు అతనిని గంగాజలపూర్ణకలశములతో స్నానము చేయించి అతనికంటిన మల కరూషము (క్షుద్బాధ) లను తొలగించిరి. ఈ భూభాగమున ఆ మల కరూషములు ప్రోగుపడినవి. దేవతలు సంతసించిరి. దేవేంద్రుడు ప్రసన్నుడాయెను. అత డప్పు డీ దేశమున కిట్లు వరమిచ్చెను -

*తతో దేశస్య సుప్రీతో వరం ప్రాదాదనుత్తమమ్,*
*ఇమౌ జనపదౌ స్ఫీతౌ ఖ్యాతిం లోకే గమిష్యతః.* 22

'ఈ రెండు జనపదములును మలదమని, కరూశమని ప్రసిద్ధి చెందగలవు. నా శరీరమందలి మలము నివి భరించినవి, కనుక ఈ దేశములు సర్వసమృద్ధము లగును.'

ఇంద్రు డిచ్చిన యీ వరములకు సంతసించి దేవతలు సాధువాద మొనర్చిరి.

ఈ వరము అయాచితము.

## 8 బ్రహ్మ > సుకేతువు, తాటక బాలకాండ 25

విశ్వామిత్రమహర్షి రామునికి తాటకావృత్తాంతమును చెప్పుచుండెను.

పూర్వ మొకప్పుడు సుకేతు వను ప్రసిద్ధుడైన యక్షు డుండెడివాడు. అతడు పరాక్రమవంతుడు, సదాచారశీలుడు. కాని అతనికి సంతతి కలుగలేదు. అందులకై అతడు తపస్సు చేసెను. బ్రహ్మ అతని తపస్సునకు మెచ్చి, అతనికొక కన్యారత్నమును ప్రసాదించెను. ఆమె పేరు తాటక.

*వరదానకృతం వీర్యం ధారయత్యబలా బలమ్.* 4

వరదానబలమున జనించినది కనుక ఆమె అబలయైనను మహాబలవంతు రాలైనది.

*దదౌ నాగసహస్రస్య బలం చాస్యాః పితామహః.* 7

బ్రహ్మ ఆమెకు వేయి ఏనుగుల బలమిచ్చెను.

బ్రహ్మ ఆ యక్షునికి పుత్రసంతాన మియ్యలేదు. అట్లిచ్చినచో ఆ పుత్రుడు లోకకంటకు డగునని భావించెను. తాటకాకన్యయు తక్కువది కాదు. ఆమె ఈ లోకుల నెంతగనో బాధించెను. కనుక విశ్వామిత్రుడు రామునిచే నామెను సంహరింపజేసెను.

సంతానప్రాప్తికొరకు చేసినందున సుకేతు వొనర్చిన తపస్సు సకామము. కనుక దానివలన గ్రహించిన వరము యాచితము. కాని తాటక స్వయముగా వర మడుగలేదు. కనుక ఆమెకు లభించిన వరము అయాచితము.

## 9. విష్ణువు > కశ్యపుడు బాలకాండ 29

విశ్వామిత్రుడు యజ్ఞము చేయుచున్న ప్రదేశము సిద్ధాశ్రమము. దాని కాపేరు కల్గిన కారణము వివరించుచు విశ్వామిత్రుడు రామున కిట్లు చెప్పెను – 'పూర్వ మొకప్పుడు మహావిష్ణువు అనేకవేలసంవత్సరములు, యుగములు ఈ చోట తపస్సు చేయుచు నిలచెను. ఇది వామనావతారగ్రహణమునకు పూర్వము విష్ణువు తపస్సు చేసి సిద్ధి పొందిన చోటు. అందుచే దీనికి సిద్ధాశ్రమమని పేరు వచ్చెను. విష్ణువు తపస్సు చేయుచుండగా విరోచనుని కుమారుడు బలి ఇంద్రమరుద్గణములను జయించి, వారి రాజ్యము గ్రహించెను. అప్పు డత డొక యజ్ఞము ప్రారంభించెను. అప్పుడు అగ్నిదేవుడు మున్నగువా రీ ఆశ్రమమునకు వచ్చి విష్ణువును ప్రార్థించి, దేవహితము కొరకు అతడు యోగమాయాబలమున వామనుడై బలియజ్ఞవాటిక కరిగి అతనిని నిగ్రహింపవలెనని కోరిరి. అదేసమయమున అగ్నితేజస్కుడైన కశ్యపమహర్షి, ధర్మపత్నియగు అదితితో కలిసి ఆచోటికి వచ్చెను. వారు వేయిసంవత్సరముల కాల మొక వ్రతము చేసి ముగించిరి. వారు విష్ణువును స్తుతించి 'మహాత్మా! ఈ చరాచర జగత్తంతయు నీ శరీరమున కనిపించుచున్నది. నీ వనాదివి. నిన్ను శరణు పొందుచుంటి' మని పలికిరి.

మహావిష్ణువును ప్రసన్నుడై అతనితో నిట్లు చెప్పెను - 'నీకు భద్రమగును. నీవు నీ యిష్టప్రకారము వరమేదేని కోరుకొనుము. నీవు వరగ్రహణమునకు తగినవాడవు.

*వరం వరయ భద్రం తే, వరార్హోఽసి మతో మమ.* 14

ఆ మాటలకు బదులుగా కశ్యపు డిట్లు పల్కెను -

*అదిత్యా దేవతానాం చ మమ చైవానుయాచితమ్.* 15

*వరం వరద సుప్రీతో దాతుమర్హసి సువ్రత,*
*పుత్రత్వం గచ్ఛ భగవన్నదిత్యా మమ చానఘ.* 16

*భ్రాతా భవ యవీయాంస్త్వం శక్రస్యాసురసూదన,*
*శోకార్తానాం తు దేవానాం సాహాయ్యం కర్తుమర్హసి.* 17

*అయం సిద్ధాశ్రమో నామ ప్రసాదాత్తే భవిష్యతి.* 18

'వరదాత వగు పరమాత్మా! ఈ సకలదేవతలకు, అదితికి, నాకును ఒకే విషయము మరల మరల వేడదగినది. నీ వా వర మొక్కటియు నాకు ప్రసాదింపుము. మహాత్మా! నీవు అదితికిని నాకును పుత్రుడవు కమ్ము. ఇంద్రునికి తమ్ముడవై, శోకపీడితులైన దేవతలకు సహాయపడుము. నీ కృపవలన ఆ ప్రదేశ మిక సిద్ధాశ్రమ మని ప్రసిద్ధి చెందును.

కశ్యపమహర్షి ప్రార్థన మంగీకరించి విష్ణువు అదితిగర్భమున వామనుడై జనించి బలిని నిగ్రహించెను.

ఈ వరము యాచితము.

## 10. చూళి > సోమద బాలకాండ 33

కుశనాభుని నూర్గురు కుమార్తెలును వాయుదేవుని కోపమువలన కుబ్జలైరి. ఆ కుమార్తెల సహనమును, క్షమాశీలమును మెచ్చి కుశనాభుడు వారినందరిని బ్రహ్మదత్తుని కిచ్చి వివాహము జరిపించెను. విశ్వామిత్రు డా కథ రామునికి చెప్పుచుండెను.

రాజర్షియైన కుశనాభుని కుమార్తె లొకసారి, తమ సహజరూపలావణ్యములకు

తోడు తదనురూపశృంగారభూషితలై ఉద్యానవనమున విహరించుచుండిరి. వారి సౌందర్యమునకు మెచ్చి వాయుదేవుడు వారిని మోహించెను. అతడు వారిని తనకు భార్యలు కమ్మని కోరెను. వా రందు కంగీకరింపలేదు. అందుపై కినిసి వాయువు వారి శరీరములలో చేరి వారిని వంచి కుబ్జలుగా చేసెను.

అంగభంగమై గూనులుగా నైన ఆ కన్యకలు లజ్జాభయాన్వితలై తండ్రి వద్ద కరిగి జరిగిన దంతయు వివరించిరి. వారి దీనస్థితికి కుశనాభుడు పరితపించెను. అయినను, అతడు తన కుమార్తెల శీలమును మెచ్చుకొనెను. శాప మియ్యగలిగియు వారు వాయువును క్షమించి విడిచిరి. కుశనాభుడు క్షమాగుణము దాన సత్యయజ్ఞయశస్సు లన్నిటికి మూలమనియు, ఈ జగత్తు క్షమాగుణముపై నాధారపడియున్నదనియు చెప్పి, కన్యకల నంతఃపురమున కంపెను. తర్వాత నతడు మంత్రులతో నాలోచించి ఆ కన్యలకు తగిన వరు డెచ్చట గలడో యని విచారించెను. ఆ రోజులలో చూళి యను మహాతేజస్వి, సదావ్రతుడు, ఊర్ధ్వరేతస్కుడు నైన ముని యొకడు బ్రహ్మనిష్ఠతో తప మొనర్చుచుండెను. సోమద యను గంధర్వకన్యక ఆ తపస్వి నుపాసించుచుండెను. ఆమె సేవలకు సంతసించి చూళి ఆమెతో నిట్లనెను -

*'పరితుష్టోఽస్మి భద్రం తే కిం కరోమి తవ ప్రియమ్.* 14

'నీవల్ల సంతోషించితిని. నీకు ప్రియమైన దేమి చేయుమందువో చెప్పుము.' మునిమాటలకు సంతసించి ఆ గంధర్వకన్య సుమధురముగా నిట్లు పలికెను -

*లక్ష్మ్యా సముదితో బ్రాహ్మ్యా బ్రహ్మభూతో మహాతపాః,*
*బ్రాహ్మేణ తపసా యుక్తం పుత్ర మిచ్ఛామి ధార్మికమ్.* 16

*అపతిశ్చాస్మి భద్రం తే భార్యా చాస్మి న కస్యచిత్,*
*బ్రాహ్మేణోపగతాయాశ్చ దాతు మర్హసి మే సుతమ్.* 17

*తస్యాః ప్రసన్నో బ్రహ్మర్షిర్దదౌ బ్రాహ్మమనుత్తమమ్,*
*బ్రహ్మదత్త ఇతి ఖ్యాతం మానసం చూళినః సుతమ్.* 18

'మునివర్యా! నీవు బ్రహ్మతేజస్సంపన్నుడవు. బ్రహ్మస్వరూప మందితివి. మహాతపస్వివి. నీవ లెనే బ్రహ్మతపోభూయిష్ఠుడై ధర్మాత్ముడగు పుత్రుని నీవల్ల

పొందగోరెదను. మహాత్మా! నీకు భద్రమగుగాక. నాకు పతి లేదు. నేనొకని పత్నిని కాను. నిన్నే సేవించితిని. నాకు బ్రహ్మతేజస్వియగు పుత్రుని ప్రసాదింపుము.'

ఆమె కోరినట్లుగా చూళిముని ఆమెకు మహాతపస్సంపన్నుడైన పుత్రుని ప్రసాదించెను. అతని మానసికసంకల్పమున జనించిన ఆ పుత్రుడు బ్రహ్మదత్తు డని పిలుపబడెను.

ఆ బ్రహ్మదత్తునికి తన నూర్గురు కుమార్తెలను ఇచ్చి కుశనాభుడు వారికి వివాహ మొనర్చెను. బ్రహ్మదత్తుడు పాణిగ్రహణ మొనర్చుటయే తడవుగా ఆ కన్యకల కుబ్జత్వము తొలగిపోయి, వారు మునుపటికన్న ఎక్కువ శోభాసంపన్నలైరి.

సోమద యొనర్చిన సేవకు సంతుష్టుడై చూళి ఆమెకు కోరిన వరమిచ్చెను. అత డామెను వరము కోరుకొమ్మని చెప్పి అనుగ్రహించెను.

## 11 భృగువు >· సగరుడు, కేశిని, సుమతి బాలకాండ 38

విశ్వామిత్రమహర్షి రామునికి సగరుని వృత్తాంతము చెప్పుచుండెను.

పూర్వ మొకప్పుడు అయోధ్యలో సగరుడను ధర్మాత్ముడు రాజ్యమేలు చుండెను. అతనికి సంతానము కలుగలేదు. పుత్రప్రాప్తి కత డెంతగనో చింతించుచుండెను. అతని జ్యేష్ఠభార్య విదర్భరాజు పుత్రియగు కేశిని, రెండవ భార్య సుమతి, కశ్యపారిష్టనేమి పుత్రిక. ఆమె గరుడుని సోదరి. సగరుడు తన భార్య లిరువురితోడను హిమాలయమున కేగి అచ్చట భృగుప్రస్రవణమను చోట తపస్సు చేయదొడగెను. నూరేండ్లు తపస్సు చేయగా భృగుమహర్షి ప్రసన్నుడై రాజునకు వర మిచ్చెను.

*సగరాయ వరం ప్రాదాద్ భృగుః సత్యవతాం వరః.* 6

*అపత్యలాభః సుమహాన్ భవిష్యతి తవానఘ,*
*కీర్తిం చాప్రతిమాం లోకే ప్రాప్స్యసే పురుషర్షభ.* 7

*ఏకా జనయితా తాత పుత్రం వంశకరం తవ,*
*షష్టిం పుత్రసహస్రాణి అపరా జనయిష్యతి.* 8

సత్యవాదులలో శ్రేష్ఠుడైన భృగువు సగరునికి వరమిచ్చుచు ఇట్లు

పలికెను- 'రాజా, నీకు పుత్రలాభమగును. నీ కీర్తి లోకములో చిరస్థాయిగా నుండును. నీ భార్యలలో నొకతెకు వంశోద్ధారకుడైన పుత్రుడొకడు కలుగును. రెండవ యామెకు అరువదివేలమంది తనయులు జన్మింతురు.'

భృగుమహర్షి వచనములకు రాణు లిద్దరును సంతసించిరి. వారు చేతులు మోడ్చి 'మహాత్మా! మాలో ఎవరికి పుత్రు డొక్కడే జనించునో, ఎవరికి అరువది వేలు జనించెదరో, తెలియజేయు' డని వేడుకొనిరి. దానిపై ఆ మహర్షి, 'మీలో ఎవరేది కోరుకొందురో చెప్పు' డని పల్కెను.

*ఏకో వంశకరో వాస్తు బహవో వా మహాబలాః,*
*కీర్తిమంతో మహోత్సాహాః కా వా కం వరమిచ్ఛతి.* 12

'ఒకడైనను వంశము నిల్పునట్టివాడు కావలెనా, లేక మహాబలవంతులు, ఉత్సాహులు, కీర్తియుతులు నైన బహుపుత్రులు కావలెనా ? మీలో ఎవరి కేది కావలెనో చెప్పుడు.'

ముని మాటలు విని కేశిని వంశోద్ధారకుడైన పుత్రు నొక్కనినే గ్రహించెను. సుమతి మహోత్సాహులైన అరవైవేలమంది యశస్వులగు పుత్రులను కోరెను.

కొంతకాలమునకు సగరకైశినుల కౌరసపుత్రుడుగా అసమంజుడు జన్మించెను. సుమతి కొకే గర్భపిండ ముదయించెను. దానిని చీల్చగా అరువదివేలమంది పుత్రు లుదయించిరి.

ఇవి యాచితమైన వరములు.

## 12. బ్రహ్మ > భగీరథుడు బాలకాండ 42

గంగాప్రాప్తికై భగీరథుడు చేసిన తపమునుగూర్చి విశ్వామిత్రుడు రాముని కిట్లు చెప్పెను.

'ధర్మాత్ముడగు భగీరథమహారాజునకు సంతానము కలుగలేదు. సంతతికై చింతించి అతడు రాజ్యరక్షణ, ప్రజాపాలనభారమును మంత్రులపై నుంచి పితరుల నుద్ధరించుటకు గంగను భూమిపై ప్రవహింపజేయుటకు, గోకర్ణతీర్థమున కఠోరమగు తపస్సు చేయదొడగెను. అతడు ఊర్ధ్వబాహుడై పంచాగ్నిమధ్యమున

నిల్చి జితేంద్రియుడై, నెలకొకసారి ఆహారము గ్రహించుచు తపమొనర్ప సాగెను. ఇట్లు ఘోరముగా తపస్సు చేయుచుండగా వేయేండ్లు గడచెను. బ్రహ్మ ప్రసన్నుడై దేవతాసహితుడై ప్రత్యక్షమై, భగీరథునితో నిట్లనెను-

*భగీరథ మహారాజ ప్రీతస్తేఽహం జనాధిప,*
*తపసా చ సుతప్తేన వరం వరయ సువ్రత.* 16

'భగీరథమహారాజా! నీ యీ ఘోరతపమునకు సంతసించితిని. నీవు నీ కిష్టమైన వర మేదో కోరుకొనుము.' మహాతేజస్వియైన భగీరథు డాతనికి చేతులు జోడించి మ్రొక్కి ఇట్లు విన్నవించెను-

*యది మే భగవన్ ప్రీతో యద్యస్తి తపసః ఫలమ్,*
*సగరస్యాత్మజాః సర్వే మత్తః సలిలమాప్నుయుః.* 18

*గంగాయాః సలిలక్లిన్నే భస్మన్యేషాం మహాత్మనామ్,*
*స్వర్గం గచ్ఛేయురత్యంతం సర్వే చ ప్రపితామహాః.* 19

*దేవ యాచే హ సంతత్యై నావసీదేత్ కులం చ నః,*
*ఇక్ష్వాకూణాం కులే దేవ ఏష మేఽస్తు వరః పరః.* 20

'దేవా, నీవు ప్రసన్నుడవై నా తపస్సు ఫలప్రదమైనచో, భస్మీభూతులై పడియున్న నా ప్రపితామహులు సగరపుత్రు లందరును, నా ప్రయత్నము వలన గంగాజలప్లావితులై స్వర్గ మేగుదురు గాక. మరియొక వరముగా మా యీ యిక్ష్వాకువంశము కొనసాగుటకై నాకు సంతాన మనుగ్రహింపవలెను.'

భగీరథుని ప్రార్థన విని బ్రహ్మ యిట్లు పలికెను-

*మనోరథో మహానేష భగీరథ మహారథ,*
*ఏవం భవతు భద్రం తే ఇక్ష్వాకుకులవర్ధన.* 22

'ఇక్ష్వాకుకులోద్ధారకుడవు, మహారథుడ వైన ఓ భగీరథా!, నీవు కోరినట్లే నీకు శుభము చేకూరును. హిమవంతుని జ్యేష్ఠపుత్రి గంగ. ఆమెను ధరించుటకై శంకరుని వేడుకొనుము. గంగావతరణవేగమును భూమి భరింపజాలదు. శంకరుడు తప్ప వేరొక రెవరును ఆ వేగ మాపి గంగను ధరింపలేరు.' ఇట్లు చెప్పి బ్రహ్మ గంగను కూడ భగీరథునికి ప్రసన్నవగు మని కోరెను.

భగీరథుడు తపస్సుచే బ్రహ్మను మెప్పించి పితరులకు స్వర్గప్రాప్తి కలిగించుట, తనకు సంతానప్రాప్తియను మనోరథములను బడయనెంచెను. కనుక అత డందిన యీ వరములు యాచితములు.

## 13. కశ్యపుడు > దితి బాలకాండ 46

విశ్వామిత్రమహర్షి రామునికి మరుత్తుల జన్మకథ చెప్పుచుండెను.

దితియు, అదితియు కశ్యపమహర్షి భార్యలు. దితిపుత్రులు దైత్యులు. అదితిపుత్రులు దేవతలు. సముద్రమథనావసరమున జరిగిన యుద్ధములో అదితి పుత్రులైన దేవతలు దితిపుత్రులైన దైత్యులను సంహరించిరి. తన పుత్రుల మృతికి దితి యెంతగనో దుఃఖించెను. ఆమె తన భర్త కశ్యపునివద్ద కరిగి యిట్లు వేడుకొనెను - 'మహాత్మా! నీ పుత్రులగు దేవతలు నా పుత్రులను వధించిరి. కనుక నేను తపస్సు చేయుదును. దానికి నీ అనుమతి కోరు చుంటిని. నా గర్భమున సర్వకార్యసమర్థుడు, ఇంద్రవిజేతయు నగు పుత్రు డుదయించునట్లు నన్ననుగ్రహింపుము!' ఆమె మాటలు విని కశ్యపు డిట్లనెను-

*ఏవం భవతు భద్రం తే శుచిర్భవ తపోధనే,*
*జనయిష్యసి పుత్రం త్వం శక్రహంతార మాహవే.* 5

*పూర్ణే వర్షసహస్రే తు శుచిర్యది భవిష్యసి,*
*పుత్రం త్రైలోక్యహంతారం మత్తస్త్వం జనయిష్యసి.* 6

'తపోధనురాలా, నీవు కోరినట్లు జరుగుగాక. నీకు శుభము. నీవు శుచివై వ్రత మొనర్చినచో ఇంద్రుని యుద్ధములో సంహరింపగల పుత్రుని గాంచెదవు. వేయి యేండ్లు శుచిగా నుండి తపోవ్రత మాచరించినచో నీకు నావలన ముల్లోకములను జయింపగల పుత్రు డుదయించును.'

ఇట్లు చెప్పి మహాతేజస్వి యగు కశ్యపుడు దితిశరీరముపై చేతితో నిమిరెను. 'నీకు శుభమగుగాక' అని పల్కి అతడు తపమున కరిగెను.

అత డరిగిన పిదప దితి అత్యంతహర్షోత్సాహభరితయై కుశప్లవ మను తపోవనమున కేగి ఘోరముగా తప మారంభించెను. ఆమె అట్లు తపస్సు చేయుచుండగా ఇంద్రుడు వచ్చి వినయవంతుడై ఆమెకు సేవలు చేయదొడగెను. వేయియేండ్లు పూర్తికాజొచ్చెను. పదియేండ్లు మాత్రమింకను కొరతయుండెను.

దితి యొకప్పు డింద్రునితో నిట్లనెను. 'పుత్రా; నిన్ను చంపగల పుత్రుని కోరి యీ తప మిట్లు చేయుచుంటిని. కాని వాడు పుట్టి నిన్ను చంప వచ్చినచో, నేను వానికి బోధించి శాంతింపజేయుదును. నీ కీ విషయమున వేరొకభావన వలదు. నీకు వాడు విధేయుడై భ్రాతృస్నేహము నెరపునట్లు చేయుదును.'

*వరో వర్షసహస్రాంతే మమ దత్తః సుతం ప్రతి.* 15

నా ప్రార్థనముపై మీ తండ్రి వేయి సంవత్సరముల వ్రతము పూర్తియై నంతనే నా కట్టి పుత్రుడు కలుగునని వరమిచ్చెను.

అప్పుడు మధ్యాహ్నకాల మయినది. దితి ఆసనోపవిష్టయై, అట్లే నిద్రలో మునిగెను. ఆమె తల వాలిపోయెను. జుట్టు పాదములపై బడెను. ఈ విధమైన నిద్రావశమున ఆమె శిరసు వంచి పాదములపై చేర్చెను. ఇది చూచి, దితి అపవిత్రురా లైనదని గ్రహించి లోలోన సంతసించి, యింద్రుడు ఆమె గర్భమున ప్రవేశించి, గర్భస్థపిండమును ఏడు ముక్కలుగా ఖండించెను. గర్భశిశువు ఘోరముగా అరిచి ఏడ్వదొడగెను. దితికి నిద్రాభంగమాయెను. విషయము గ్రహించి ఆమె లేచి కూర్చొని 'ఇంద్రా! శిశువును చంపకుము' అని పలికెను. కాని అప్పటికే అతడు వానిని ఏడు ఖండములుగా చీల్చి వేసెను. అతడు గర్భము వెడలివచ్చి, చేతులు జోడించి మ్రొక్కి దితితో నిట్లనెను – 'అమ్మా! నీ శిరోజములు కాళ్లపై బడియుండెను. ఇట్లు నీ వశుచివై నిద్రించుచుంటివి. ఈ లోపము గ్రహించి 'ఇంద్రహంత' యగు శిశువును ఏడు ముక్కలుగా తరిగితిని. అమ్మా, నా యీ అపరాధము క్షమింపుము.' అంత నామె వాని ననునయించుచు 'నీ యీ చేసిన పని నాకును సంతోషకర మగుటకు గల ఉపాయము చింతించుచున్నాను. నాగర్భమందలి శిశుఖండము లేడును సప్తమరుద్గణము లగుదురు.' అని పలికెను. దాని కింద్రు డనుమతించెను. ఆ పుత్రులు సప్తమరుత్తులని ప్రసిద్ధి జెందిరి.

ఈ వరము నియమాంచితమును, యాచితమును కూడ.

14 ఇంద్రుడు > దితి బాలకాండ 47

విశ్వామిత్రుడు రామునికి మరుద్గణముల జన్మవృత్తాంతము చెప్పుచుండెను.

కశ్యపుడు దితి కామె కోరిన ప్రకారము 'ఇంద్రహంత' యగు పుత్రుని గాంచునట్లు వరమిచ్చెను. కాని వరఫలము బడయుటకై వేయి సంవత్సరములు శుచివ్రతము పాటింపవలెనను నియమ మెరిగించెను. దితి అట్లే వేయేండ్ల తపోవ్రతము చేయుచు శుచిత్వము కాపాడుకొనుచుండెను. ఇట్లు చేయుచుండగా వ్రతపూర్తిలో ఆమె తన కాళ్లపై శిరసు మోపెను. దానిచే ఆమె కశుచిత్వము కలిగెను. అది గ్రహించి ఇంద్రుడు తత్క్షణమే ఆమె గర్భమున ప్రవేశించి గర్భస్థ పిండమును ఏడు ముక్కలు చేసెను. దితి కెంతో దుఃఖమాయెను. ఆమె యింద్రునితో నిట్లనెను.

*మమాపరాధాత్ గర్భోఽయం సప్తధా శకలీకృతః,*
*నాపరాధో హి దేవేశ తవాత్ర బలసూదన.* 2

*ప్రియం త్వత్కృతమిచ్ఛామి మమ గర్భవిపర్యయే,*
*మరుతాం సప్త సప్తానాం స్థానపాలా భవంతు తే.* 3

*వాతస్కంధా ఇమే సప్త చరంతు దివి పుత్రక,*
*మారుతా ఇతి విఖ్యాతా దివ్యరూపా మమాత్మజాః.* 4

'దేవేంద్రా, నా అపరాధమువల్లనే నా యీ గర్భ మిట్లు ఏడుముక్కలైనది. ఇందు నీ దోష మేమియు లేదు. గర్భనాశ మొనర్చుటకు నీవు చేసిన ఈ క్రూరకర్మ మేవిధముగా నైనను నీకును నాకును కూడ ఉపకారక మగునట్లు చేయవలెనని నా తలంపు. నా గర్భ మిపుడు ఏడుగురు పుత్రులుగా జన్మించి సప్తమరుద్గణములను పాలింతురు గాక. వారు దివ్యరూపులై (ఆవహ, ప్రవహ, సంవహ, ఉద్వహ, వివహ, పరివహ, పరావహులు) ఆకసమున చరించుచుందురు.

దితి మాటలు విని చేతులు జోడించి యింద్రు డామెతో నిట్లనెను-

*సర్వమేతద్యథోక్తం తే భవిష్యతి న సంశయః.* 8

'అమ్మా! నీవు చెప్పినట్లే, అది నిస్సంశయముగా జరుగును. అట్లే ఆ ఏడుగురు పుత్రులును మరుత్తులను పేరున ప్రఖ్యాతి బడసిరి. ఇంద్రుని మాటలు ఆశ్వాసనములే కాని 'వరదానము' కాదు. అట్లు చెప్పబడలేదు. అయినను అది వరదానతుల్య మనదగినది.

ఈ వరము యాచితము.

శతానందుడు రామునికి విశ్వామిత్రుని అస్త్రసంపాదనకథను వివరించు చుండెను.

వసిష్ఠుని కామధేనువైన శబలను విశ్వామిత్రుడు తన కిమ్మని కోరెను. కాని వసిష్ఠు డందు కంగీకరించలేదు. అందుపై రాజైన విశ్వామిత్రుడు ఆ శబలను బలాత్కారముగా తోలుకొనిపోబోయెను. ఆ ధేనువు హుంకరింపగా కాంబోజు లుదయించిరి. దాని పొదుగునుండి శస్త్రధారులైన బర్బరులు వెడలిరి. యోనినుండి యవనులు, గుదస్థానము నుండి శకులు, రోమకూపముల నుండి మ్లేచ్ఛ, హారీత, కిరాతులు జనించిరి. ఆ వీరులందరూ చేరి విశ్వామిత్రుని సైన్యమును క్షణములో సంహరించిరి. ఇది చూచి విశ్వామిత్రుని నూర్గురు పుత్రులును వసిష్ఠునిపై బడిరి. ఆ మహర్షి హుంకరింపగా వారందరు కాలి బూడిదయైరి. ఇట్లు తన పుత్రు లందరును, సమస్తసైన్యమును నష్టమగుట చూచి విశ్వామిత్రుడు లజ్జించి నిస్తేజుడయ్యెను. ఆతని కుమారు డొకడు మాత్రము బ్రదికియుండెను. వానికి రాజ్యాభిషేకము చేసి విశ్వామిత్రుడు వనమున కరిగెను. అచ్చట నతడు ఘోరముగా తప మొనర్పసాగెను. కొంత కాలమునకు ఈశ్వరు డతనికి ప్రత్యక్షమై ఇట్లడిగెను -

*కిమర్థం తప్యసే రాజన్ బ్రూహి యత్ తే వివక్షితమ్,*
*వరదోఽస్మి వరో యస్తే కాంక్షితః సోఽభిధీయతామ్.* 14

'రాజా! నీ వేమి కోరి యీ తపస్సు చేయుచున్నావో చెప్పుము. నేను నీకు వరమీయ వచ్చితిని. నీకు కావలిసిన దేదో ఆ వరము కోరుకొనుము.'

మహాతపస్వి యైన విశ్వామిత్రుడు శివునకు నమస్కరించి యిట్లు పలికెను-

*యది తుష్టో మహాదేవ ధనుర్వేదో మమానఘ,*
*సాంగోపాంగోపనిషదః సరహస్యః ప్రదీయతామ్.* 16

*యాని దేవేషు చాస్త్రాణి దానవేషు మహర్షిషు,*
*గంధర్వయక్షరక్షస్సు ప్రతిభాంతు మమానఘ.* 17

*తవ ప్రసాదాద్ భవతు దేవదేవ మమేప్సితమ్,*

*ఏవమస్త్వితి దేవేశో వాక్యముక్త్వా గతస్తదా.* *18*

'మహాదేవా! నాయందు సంతుష్టి చెందినచో నాకు అంగోపాంగములతోను ఉపనిషద్రహస్యములతోను కూడిన ధనుర్వేదమును నా కనుగ్రహింపుము. దేవాదిదేవా! సమస్త దేవదానవ మహర్షిగంధర్వ యక్షరాక్షసుల వద్ద గల అస్త్రము లన్నియు నీకృపచే నాకు స్ఫురించునట్లు వరమిమ్ము. మహాత్మా! ఇదే నా మనోరథము. దీనిని పూర్తిచేయుము.

'అట్లే యగుగాక' అని పలికి శివు డంతర్థితుడయ్యెను. శివునివలన ఆ అస్త్రశస్త్రములు సంపాదించి మహాబలగర్వితుడై విశ్వామిత్రుడు వసిష్ఠుని ఆశ్రమమున కేగి దానిపై వివిధములైన అస్త్రములు ప్రయోగింపదొడగెను. వాని తేజముచే ఆ తపోవనము దగ్ధము కాజొచ్చెను. అందువల్ల అక్కడ నివసించు వందలాది మునులు వసిష్ఠశిష్యులు, పశుపక్షులు, భయభ్రాంతులై నానాదిక్కులకు పరుగులెత్తిరి. ఇట్లే వసిష్ఠుని ఆశ్రమము శూన్యమయ్యెను.

ఇది యాచితవరము.

## 16. బ్రహ్మ > విశ్వామిత్రుడు బాలకాండ 65

శతానందుడు రామునికి విశ్వామిత్రుడు బ్రహ్మర్షిపదవి సంపాదించిన కథ వినిపించుచుండెను.

క్షత్రియబలము కన్న బ్రహ్మబలము ప్రబలము. ఈ సత్య మనుభవపూర్వకముగా గ్రహించి విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కాగోరి ఘోరముగా తపస్సు చేయదొడగెను. వేయేండ్లు మౌనవ్రతియై అతడు దుష్కరమగు తపము చేసెను. ఎండిన కట్టెపుల్ల వలె అతడు నీరసించి నిశ్చేష్టుడై పడి యుండెను.

వేయేండ్లు ఊపిరికూడ తీయకుండ తప మొనర్చుటచే అతని శిరసు నుండి ధూమము వెడలసాగెను. దానివలన ముల్లోకములవారును భయసంతప్తులైరి. అప్పుడు దేవగంధర్వనాగసర్పరాక్షసఋషిమునిగణము లన్నియు ఆ తపస్సుచే మోహితులైరి. దుఃఖవ్యాకులులై వారు బ్రహ్మ కిట్లు విన్నవించిరి - 'మహాత్మా, విశ్వామిత్రమహామునిని లోభపరచుటకు, అతనికి కోపము తెప్పించుటకు వలసిన ప్రయత్నములన్నియు జరిగినవి. కాని అతని తపఃప్రభావము నిరంతరముగా వృద్ధి జెందుచున్నది. అతనియందు లేశమాత్రమును దోషము కానరాదు.

అతనికి కోరిన కోర్కె ప్రసాదింపకున్నచో, అతడు తన తపస్సుచే చరాచర ప్రాణికోటి నంతటిని, ఈ ముల్లోకములను నశింపజేయగలడు. అతని తపస్తేజముచే సూర్యుని ప్రభ మందగించెను. అతడగ్నివలె వెలుగుచున్నాడు. అతని నెట్లయిన ప్రసన్నుని చేయవలెను. ఈ ముల్లోకములను నశింపకుండ కాపాడవలెను. ఆ పిదప బ్రహ్మాదిదేవతలందరును విశ్వామిత్రునివద్దకు వచ్చిరి.

*బ్రహ్మర్షే స్వాగతం తేఽస్తు తపసా స్మ సుతోషితాః.* 19

*బ్రాహ్మణ్యం తపసోఽగ్రేణ ప్రాప్తవానసి కౌశిక,*
*దీర్ఘమాయుశ్చ తే బ్రహ్మన్ దదామి సమరుద్గణః.* 20

*స్వస్తి ప్రాప్నుహి భద్రం తే గచ్ఛ సౌమ్య యథాసుఖమ్.* 21

'బ్రహ్మర్షీ! నీకు స్వాగతము. నీ తపస్సునకు సంతసించితిమి. కుశికనందనా, నీవు మహోగ్రతపోబలమున బ్రాహ్మణుడవైతివి. మరుద్గణములతో పాటు నీవును దీర్ఘాయువందెదవు. నీకు శుభమగుగాక, ఓ సౌమ్యమూర్తీ, నీవు మంగళభాజనుడవై, నీ యిష్టానుసారము సుఖపూర్వకముగా సంచరించుచు జీవింపుము.'

ఇట్లు బ్రహ్మచెప్పగావిని విశ్వామిత్రుడు మిక్కిలి సంతోషించి, దేవతలకు నమస్కరించి యిట్లనెను -

*బ్రహ్మణ్యం యది మే ప్రాప్తం దీర్ఘమాయుస్తథైవ చ,* 22
*ఓంకారోఽథ వషట్కారో వేదాశ్చ వరయంతు మామ్.*

*క్షత్రవేదవిదాం శ్రేష్ఠో బ్రహ్మవేదవిదామపి.* 23
*బ్రహ్మపుత్రో వసిష్ఠో మామేవం వదతు దేవతాః.*

*యద్యేవం పరమః కామః కృతో యాంతు సురర్షభాః.* 24

'దేవగణములారా, నాకు బ్రాహ్మణత్వము, దీర్ఘాయువును ప్రాప్తించినచో ఓంకారము, వషట్కారము, నాల్గువేదములు కూడ నన్ను చేరుగాక. ధనుర్వేదవిదులలోను, ఋగాదిచతుర్వేదములయందును శ్రేష్ఠత్వము గల్గినట్టి బ్రహ్మపుత్రుడైన వసిష్ఠుడు స్వయముగా వచ్చి నీవు బ్రహ్మర్షి వైతి వని నాతో చెప్పవలెను. అప్పుడు నేను నా గొప్ప అభీష్ట మీడేరినట్లు భావించెదను.

అపుడు మీరందరును వెడలిపోవచ్చును.'

అపుడు దేవతలు వసిష్ఠుని ప్రసన్నుని జేసికొనిరి. వసిష్ఠుడు విశ్వామిత్రుని బ్రహ్మర్షిగా నంగీకరించెను. అతనితో చెలిమి చేసి యిట్లనెను -

*బ్రహ్మర్షిస్త్వం న సందేహః సర్వం సంపద్యతే తవ.* 26

'నీవు బ్రహ్మర్షి వైతివి. సందేహము లేదు. బ్రాహ్మణోచితసర్వ సంస్కారములు నిన్ను పొందినవి.' అని చెప్పిన పిదప దేవతలు తమ తమ లోకములకేగిరి.

ఈ వరము యాచితము.

## 17 కైక > మంథర అయోధ్యాకాండ 7

శ్రీరాముని అభిషేకవార్త విని ఖిన్నురాలైన మంథర కైకను అభిషేక విఘాతమునకు పురిగొల్పదలచెను. ఆమె కీ కార్యమున కైకేయి కనిష్టము తోచెను. కాని మంథరకు తన ప్రయత్నములో సాఫల్యము కలుగలేదు. శ్రీరాముని అభిషేకవార్త విని కైక ఎంతగనో సంతసించెను. రాముని అభిషేకమైనచో కైక కనేకవిపత్తులు కల్గునని మంథర చెప్పబోయెను. రామాభిషేకము నెపమున కైకేయి సర్వసౌభాగ్యములకు వినాశ మారంభ మగుననియు, దానికి ప్రతీకారము లేదనియు మంథర వాదించెను. కాని కైక కీ మాటలు నచ్చలేదు. ఆమె హృదయ మానందభరితమాయెను. శ్రీరాముని అభిషేకమును గురించి చెప్పిన ఈ ప్రియవార్తకు బహుమానముగా నామె మంథరకు తన దివ్యాభరణ మొకటి యిచ్చి, యింకను మరికొన్ని యీయబోయెను. ఆమె రాముని వేరుగా భరతుని వేరుగా చూచి యెరుగదు. ఆమె మంథరతో నిట్లనెను -

*న మే పరం కించిదతో వరం పునః*
*ప్రియం ప్రియార్హే సువచం వచోఽమృతమ్,*
*తథా హ్యవోచస్త్వమతః ప్రియోత్తరం*
*వరం పరం తే ప్రదదామి తం వృణు.* 36

'మంథరా, నీవు నానుండి ప్రియమైన బహుమాన మందుకొన దగుదువు. నాకు శ్రీరాముని అభిషేకసమాచారమునకు మించి ప్రియమైన అమృతోపమానమైన

వార్త వేరొకటి లేదు. అట్టి ఆ పరమప్రియమధురవార్త వినిపించినందుకు నీకు వరమీయ దలచెదను నీకు కావలసినది కోరుకొనుము. ఇచ్చెదను.'

ప్రత్యక్షముగా ఈ వర మీయబడలేదు. మంథర దానిని స్వీకరింపలేదు కూడ. మంథర కోరకున్నను కైక ఆమెకు వర మీయదలచెను. కనుక ఈ వర మయాచితము.

## 18 అలర్కుడు > గ్రుడ్డి బ్రాహ్మణుడు అయోధ్యాకాండ 12

ఆడినమాట నిల్పుకొనుటకు ఎంతటి త్యాగమైనను చేయుటకు సిద్ధము కావలెను. ఈ విషయ మెరిగించుచు కైక దశరథునికి అలర్కుని ఉదాహరించి చెప్పెను.

దేవాసురసంగ్రామములో పాల్గొనిన దశరథుడు తీవ్రముగా శస్త్రఘాతములకు లోనై మూర్ఛిల్లెను. అప్పుడు యుద్ధరంగమున రాత్రంతయు మేల్కొనియుండి సేవజేయుచు కైక అతనిని కాపాడెను. ఆతడు సంతసించి కైకకు రెండు వరము లిచ్చెను. కాని వాటి నామె అతనివద్దనే యుంచెను. మంథర మాటలు వినిన పిదప కోపించిన కైక రామరాజ్యాభిషేకావసరమున ఆ వరముల నడిగి గ్రహింపదలచెను. వర మడుగుటకు ముందు, మాట తప్పనని రాజుచే పలికించుకొని, అందుకు సకలదేవతలును సాక్షులని పలికి ఆమె ఆ వరము లడిగెను. తేజస్వియు, సత్యసంధుడు, ధర్మజ్ఞుడు, విశుద్ధకర్మాచరణశీలుడు నైన మహారాజు తన కా వరము లిచ్చుచున్నాడనియు, అందుకు సకలదేవతలును సాక్షులనియు వారి నాహ్వానించి పేర్కొనెను. అతడప్పుడు కామపరాధీనుడు. ప్రతిజ్ఞాపూర్వకముగా వరము లిచ్చెదనని పలికెను. ఆ పిమ్మట కైక రామునికి పదునాల్గేండ్లు వనవాసమును, భరతునికి రాజ్యాభిషేకమును వరములుగా కోరుకొనెను. కైకేయి మాటలు విని రాజు నిశ్చేష్టు డాయెను. తిరిగి సంభాళించుకొని ఆత డామెను నిందించి, వరము లిచ్చెద నని నందుకు పశ్చాత్తాపపడెను. అత డామె కెన్నోవిధముల బోధించెను. కాని ఆమె వినలేదు. ఆమె మరింతగా భయానకరూపము వహించి, కఠోరముగా రాజును నిందింపదొడగెను. సత్యవాక్పరిపాలకులైన మహాపురుషుల త్యాగశీలమును గూర్చి ఎన్నో ఉదాహరణలు చూపెను. ఆతడు ప్రతిజ్ఞాభంగ మొనర్చినచో కులము కళంకిత మగు ననెను. శైబ్య, సముద్రముల దృష్టాంతము చూపి, అలర్కుని కథ కూడ వినిపించెను.

అలర్కుడు రాజు. అతడొక గ్రుడ్డి బ్రాహ్మణునికి కోరిన వరమిచ్చెద ననగా, అతడు నేత్రదాన మడిగెను.

*అలర్కశ్చక్షుషీ దత్వా జగామ గతి ముత్తమామ్.* 43

'అలర్కుడు తన నేత్రములు తీసి యిచ్చి, ఉత్తమగతి పొందెను.'

ఈ వర మయాచితము.

19 సాధువు > కేకయరాజు అయోధ్యాకాండ 35

శ్రీరాముని వనవాసమునకై పట్టుబట్టి వాదించుచున్న కైకను నిందించుచు సుమంత్రు డిట్లు పలుకుచుండెను.

రాగల కష్టనష్టములు గమనింపకయే కైక తాను కోరిన వరము లిచ్చి తీరవలెనని పట్టుపట్టెను. దశరథుడు, లక్ష్మణుడు, వసిష్ఠుడు మున్నగువా రందరు ఎన్నో విధములుగా నయభయములు చూపి చెప్పిరి. కాని ఆమె తన పట్టు వీడలేదు. అందుపై మిక్కిలి కోపించి సుమంత్రుడు మర్మభేదకము లైన మాటలతో నామె నిట్లు గర్హించెను- 'నీవు పతిఘాతకురాలవు. చివరకు కులఘాతినివి కూడ కాగోరుచుంటివి. నీ దుశ్చేష్టలచే మహారాజును నీవు దుఃఖసంతప్తునిగా చేయుచుంటివి. ఈ కులములో రాజు గతించిన పిదప అతని పుత్రులలో జేష్ఠుడెవరో అతడే రాజగును. వరంపరాగతమైన యీ కులధర్మమును, ఇక్ష్వాకువంశీయుడైన మహారాజు దశరథుడు జీవించి యుండగనే నీవు నాశమొనర్ప నెంచుచుంటివి. నీ కొడుకు భరతుడు రాజు కావచ్చును, రాజ్యము పాలింపవచ్చు. కాని మేమందరము శ్రీరాము డెచ్చట నుండునో అచ్చటికే పోయెదము. నీవు చేయుచున్న యీ మర్యాదావిహీనమైన దుష్కర్మ మెరిగి బ్రాహ్మణు లెవరును నీ రాజ్యమున నివసింపరు. కైకేయీ, నీవు నీ తల్లి స్వభావమునే పుణికి పుచ్చుకొన్నట్లున్నది. వేప కొమ్మకు తీపి కల్గదను సామెత నిజమే.'

*'పితుస్తే వరదః కంచిద్దదౌ వరమనుత్తమమ్.* 18

*సర్వభూతరుతం తస్మాత్ సంజజ్ఞే వసుధాధిపః,*
*తేన తిర్యగ్గతానాం చ భూతానాం విదితం వచః.* 19

ఒకప్పు డొకానొక సాధుపుంగవుడు మీ తండ్రి కొక దివ్యవర మిచ్చెను. ఆ వరప్రభావమున మీ తండ్రి కేకయరాజు సమస్తజీవుల మాటలు తెలిసి కొనుచుండెను. తిర్యగ్జంతువుల భాషకూడ అతనికి బోధపడుచుండెను.

ఒకసారి మీతండ్రి శయ్యపై పరుండియుండెను. అప్పు డతనికి 'జృంభ' యను పక్షి అరుపు వినిపించెను. ఆ అరుపునకు గల అర్థము రాజున కవగతమయ్యెను. అందుపై అతనికి నవ్వు వచ్చెను. అతడు నవ్వాపుకొనలేక నవ్వుచుండగా, ప్రక్కనే గల మీ తల్లి చూచి, అతడు తననే చూచి నవ్వుచున్నట్లు భావించి కుపితురాలయ్యెను. ఆ కోపమున నామె మెడకు త్రాడు చుట్టుకొని చావ నుద్యుక్తురాలై భర్తతో నిట్లనెను- 'రాజా! నీవు నవ్విన దానికి కారణమేదో చెప్పుము.' అది విని రాజు 'నవ్వినదానికి కారణము చెప్పినచో, తక్షణమే నేను మరణింతును' అని చెప్పెను. 'నీవు మరణించినను, లేకున్నను, ఈ నవ్విన దానికి కారణము నాకు చెప్పితీరవలసినదే' అని ఆమె పట్టుబట్టెను.

భార్య పట్టుదల చూచి రాజు తనకు వర మిచ్చిన ఆ సాధుపురుషుని వద్ద కేగి జరిగిన దంతయు చెప్పి వినిపించెను. అప్పు డా సాధువు 'రాణి మరణించినా, ఇల్లు వదలిపోయినా సరే, నీవు మాత్రము ఈ విషయ మామెకు చెప్పవల' దని హెచ్చరించెను. రాజు తిరిగి వచ్చి మీ తల్లిని విడిచి పెట్టెను. నీవు నీ తల్లిని పోలితివి. ఈ దురాగ్రహము వీడుము. నీ భర్త ఆశయ మెరిగి చరించి, ఈ జనసముదాయమునకు శరణ్యా వగుము'.

వర మిచ్చిన సాధువు పేరు గాని, అత డెందుకు వర మిచ్చెనో ఆ కారణము గాని చెప్పబడలేదు. అందుచే ఈ వరము యాచితమో, అయాచితమో నిశ్చయముగా తెలియదు.

## 20. చ్యవనుడు > కాళింది అయోధ్యాకాండ 110

వసిష్ఠుడు శ్రీరామునికి ఇక్ష్వాకువంశపరంపరను వివరించుచుండెను. ధ్రువసంధి పుత్రుడు యశోభాగుడైన భరతుడు. భరతుని కుమారుడు అసితుడు. హైహయ, తాలజంఘ, శశబిందులను వీరులు భరతుని శత్రువులు. అసితుడు వారి కోడిపోయి వరదేశమున శరణార్థిగా నుండవలసివచ్చెను. అత డొక సురమ్యపర్వతాగ్రమున నిశ్చింతగా నిల్చి భగవద్ధ్యాన మొనర్పసాగెను. అతనికి

ఇద్దరు భార్యలు. వారిద్దరును గర్భవతులైరి. వారిలో నొకతె కాళింది. ఆమె సత్పుత్రుని బడయగోరి చ్యవనమహర్షిని సేవించెను. రెండవభార్య తన సవతి గర్భమును నాశమొనర్ప దలచి ఆమెకు విషమిచ్చెను. కాళింది హిమాలయ మేగి చ్యవనమహర్షికి నమస్కరించి నిల్వగా అత డామెను చూచి యిట్లనెను-

*స తామభ్యవదత్ ప్రీతో వరేప్సుం పుత్రజన్మని,*
*పుత్రస్తే భవితా దేవి మహాత్మా లోకవిశ్రుతః.* 21

*ధార్మికశ్చ సుభీమశ్చ వంశకర్తారిసూదనః,*
*శ్రుత్వా ప్రదక్షిణం కృత్వా మునిం తమనుమాన్య చ.* 22

'దేవీ! నీవు పుత్రోత్పత్తిని కోరి వర మడుగ వచ్చితివి. నీకు మహామనస్వియు, లోకవిఖ్యాతుడును నగు పుత్రుడు జన్మించును. అతడు ధర్మాత్ముడు, శత్రువిజేత, వంశకర్తయును నగును.' ఇట్లు ప్రసన్నుడై ముని పల్కగా దానికి రాణి మిక్కిలి సంతసించి అతనికి ప్రదక్షిణనమస్కారములొనర్చి యింటికి వచ్చెను.

యథాసమయమున నామె పుత్రుని ప్రసవించినది. సవతి ఆమె గర్భనాశమునకై యిచ్చిన విషముతో కూడ ఆ శిశువు జన్మించెను. అందుచే అతనికి సగరుడు (గరమనగా విషము దానితో కూడినవాడు సగరుడు) అని పేరు వచ్చెను.

ఈ సగరుని కథ బాలకాండ సర్గ 70 శ్లో. 34, 35 లలో వర్ణింపబడినది. పుత్రాభిలాషతో వచ్చి ప్రణమిల్లిన కాళిందిని చూచి చ్యవను డిట్లనెను-

*స తామభ్యవదద్విప్రః పుత్రేప్సుం పుత్రజన్మని,*
*తవ కుక్షౌ మహాభాగే సుపుత్రః సుమహాబలః.* 34

*మహావీర్యో మహాతేజా అచిరాత్సంజనిష్యతి,*
*గరేణ సహితః శ్రీమాన్ మా శుచః కమలేక్షణే.* 35

'పుణ్యాత్మురాలా! నీ గర్భమున మహాబలవంతుడు, తేజస్వి, పరాక్రమ వంతుడు నగు పుత్రుడు జన్మించును. వాడు కొద్ది రోజులలో విషసహితముగా జన్మించును. కనుక సుందరీ, నీవు పుత్రవిషయమున చింతింపకుము.'

ఈ వాక్యము వరమో, ఆశీర్వాదమో వాల్మీకి స్పష్టముగా చెప్పలేదు. అయోధ్యాకాండమున 'వరేప్సుం' అని స్పష్టముగా చెప్పబడినది. కనుక యీ వరము యాచితము.

## 21. అనసూయ > సీత అయోధ్యాకాండ 118

శ్రీరాముదును, సీతాలక్ష్మణులును వనగమనవేళ అనుమతి గ్రహింప దలచి అత్రిమహాముని యాశ్రమమునకు వచ్చిరి. ముని పుత్రవాత్సల్యముతో ఆదరించి, పత్నియైన అనసూయతో సీతను సత్కారపూర్వకముగా నాదరింపుమని చెప్పెను. అత్రిముని రామునికి అనసూయ చేసిన ఘోరతపమును గూర్చి తెలియజేసెను. అప్పుడు రాముడు సీతతో శుభము కలుగుటకై అనసూయను దర్శించి రమ్మనెను. ఆమె అట్లేగి, శాంతభావముతో తన నామము చెప్పి, అనసూయకు నమస్కరించెను. పిదప వినయపూర్వకముగా ఆమెను కుశల మడిగెను. అనసూయ సీతకు స్త్రీధర్మము లెరిగించి, కర్తవ్యోపదేశ మిచ్చెను. సీత కిది యెంతగనో సంతోషదాయక మయ్యెను. సీత కూడ తన యాచరణమును, పతివ్రతాధర్మమును గురించి ఆమె కెరిగించెను. అనసూయ సంతసించి, మూర్ధమాఘ్రాసించి ఆమెతో నిట్లనెను -

*నియమైర్వివిధైరాప్తం తపో హి మహదస్తి మే,*
*తత్ సంశ్రిత్య బలం సీతే ఛందయే త్వాం శుచివ్రతే.* 14

*ఉపపన్నం చ యుక్తం చ వచనం తవ మైథిలి,*
*ప్రీతా చాస్మ్యుచితాం సీతే కరవాణి ప్రియం చ కిమ్.* 15

'ఉత్తమవ్రతపాలన మొనర్చుచున్న సీతా! నే నెన్నో వ్రతనియమములు పాటించి పెద్దగా తపము సలిపితిని. ఆ తపోబలమున నీకు కోరిన వర మీయదలచుచున్నాను, కోరుకొనుము. మైథిలీ! నీవు చాల యుక్తియుక్తముగా ఎన్నో ఉత్తమవిషయములు చెప్పితివి. నాకు మిక్కిలి సంతసమైనది. కనుక సీతా, నీ కేది కావలెనో 'ఏది చేయమందువో చెప్పుము.'

ఆమె మాటలకు సీత ఆశ్చర్యపడెను. అనసూయతో నామె యిట్లనెను- 'మీరు మీ మాటలతోనే నా కెంతగనో ప్రియము కలిగించితిరి. వేరుగా నాకిక కావలసిన దేమి ?' సీతమాటలు విని అనసూయ మరింతగా ప్రసన్నురాలై

ఆమెకు దివ్యభూషాంబరములు, అంగరాగము, అమూల్యమగు ననులేపము బహూకరించెను. పరమప్రసన్నతతో ఇచ్చిన ఆ దివ్యవస్తువులను సీత ప్రసాదమని స్వీకరించెను.

అయాచితముగా అనసూయయే సీతకు వరమిచ్చెద ననెను. కాని సీత వరము స్వీకరింపలేదు. అనసూయ యిచ్చిన వస్తువులను మాత్రము అనుగ్రహరూపమున స్వీకరించెను. ఇది వరదానము కాదు.

## 22. బ్రహ్మ > విరాధుడు అరణ్యకాండ 3

క్రూరజంతువులతో నిండిన దుర్గమారణ్యమగు దండకాటవిలో సీతాలక్ష్మణ సహితుడై యేగుచున్న రామునికి, పర్వతశిఖరోన్నతుడై నరభక్షకు డైన రాక్షసు డొకడు కనిపించెను. అతని కన్నులు లోతు, ముఖము విశాలము, ఆకృతి వికటము, కడుపు వికృతముగా నుండెను. అతడు చూచుటకు భయంకరముగా, అసహ్యముగా వికృతాట్టహాసమొనరించు చుండెను. ముని వేషమున ధనుర్బాణఖడ్గపాణులై వచ్చుచున్న రామలక్ష్మణులను చూచి, క్రోధఘూర్ణిత భైరవనాద మొనర్చుచూ అతడు వారిమీదికి పర్వెత్తి వచ్చి సీతను చంక కెత్తుకొని కొంత దూరము పోయి నిలిచెను. అక్కడ నిల్చి వాడు మీరిద్దరు తపస్వులవలె కనిపించుచున్నారు గదా! స్త్రీసహితముగా ఎట్లున్నారు? మీ రధర్మపరాయణులు, పాపాత్ములు మునిజనమును కళంకితమొనర్చు చున్నారు. మీరెవరు? నేను విరాధు డను రాక్షసుడను. ప్రతిదినము ఋషిమాంసము భుజించుచూ నే నీ వనమున విహరించుచుందును. ఈ స్త్రీ చక్కనిది. కనుక నాకు భార్య యగును. నేను యుద్ధమున మీ యిద్దరిని చంపి మీ రక్తము త్రాగుదును' అని వల్కెను. సీతను రాక్షసుని గుప్పిటలో చూచి రామున కెనలేని దుఃఖము వచ్చెను. అతనికి నో రెండిపోయెను. సీత నింకొకడు పట్టి తీసికొని పోవుచుండుటకంటె మించిన దుఃఖ మతనికి వేరేమున్నది? ఇంతలో లక్ష్మణుడు కోపించి రాక్షసుని సంహరించుట కుద్యుక్తుడాయెను. విరాధుడు వారిని 'మీరెవరు ? ఎక్కడి కేగుచున్నారు?' అని మరల ప్రశ్నించెను. రాము డతనికి తమ పరిచయము చెప్పి 'నీవెవరు? ఈ దండకావనిలో ఇంత స్వేచ్ఛగా తిరుగుచున్నావెట్లు?' అని అడిగెను. బదులుగా విరాధు డిట్లనెను-

*పుత్రః కిల జవస్యాహం మాతా మమ శతహ్రదా,*
*విరాధ ఇతి మామాహుః పృథివ్యాం సర్వరాక్షసాః.* 5

*తపసా చాభిసంప్రాప్తా బ్రహ్మణో హి ప్రసాదజా,*
*శస్త్రేణావధ్యతా లోకేఽచ్ఛేద్యాభేద్యత్వమేవ చ.* 6

'నేను జవాసురుని కుమారుడను. మా తల్లి శతహ్రద. భూమండలమున రాక్షసు లందరు నన్ను విరాధుడని పిల్చెదరు. నేను తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి శస్త్రాస్త్రములచే చావు లేనట్లు వరము గ్రహించితిని. నన్ను కూల్చుట గాని ఖండించుటగాని అసంభవము.'

ఇట్లు చెప్పి, తిరిగి వాడిట్లనెను. 'మీ రీ యువతి నిచ్చుట విడిచి పారిపొండు. అట్లయినచో మిమ్ము నేను ప్రాణములతో విడిచెదను.' ఈ మాటలు విని రాముదు వెంటనే తీక్ష్ణమైన బాణములు గ్రహించెను.

లక్ష్మణుడును బాణవర్షము కురిపించెను. కాని యీ బాణములు వాని శరీరము నుండి వెడలి నేలపై పడుచుండెను.

*'స్వర్శాత్తు వరదానేన ప్రాణాన్ సంరోధ్య రాక్షసః.'* 17

బాణములు తగిలినను, వరదానప్రభావమువలన వాని ప్రాణములు పోకున్నవి.

ఆ పిదప విరాధుడు రాముని శరణువేడి తన మరణమునకు ఉపాయము తానే వారి కెరిగించెను. అతదు చెప్పినట్లుగా రాము డతని నొక పెద్ద గోతిలో పూడ్చి వధించెను.

ఈ వరము యాచితము.

## 23. ఇంద్రుడు > శరభంగముని — అరణ్యకాండ 5

విరాధుని వధించిన పిదప రాముడు సీతాలక్ష్మణులతో కలిసి శరభంగముని యాశ్రమము వంక కేగెను. అట్టి దారుణదుర్గమారణ్యములలో నడచుట వారి కభ్యాసముగాని, అనుభవముగాని లేని విషయము. కాని శరభంగుని యాశ్రమము సమీపించుతరి రాముని కొక విశేషము కన్పించెను. దేవతాసహస్రయుతుడై దేవేంద్రుడు దివ్యరథముపై వచ్చి మునివద్ద కేగుచుండెను. రాము డింద్రుని

పోల్చుకొని లక్ష్మణునకు చెప్పి అతని రథము చూపించెను. ఇంద్రుడును రాముని చూచి, ఆ సమయమున నతనిని కలియుట కిష్టపడక, ముని వద్ద వీడ్కోలు పుచ్చుకొనెను. రావణసంహారము జరిగిన పిదప నతదు శ్రీరాముని దర్శింప నెంచెను. ఇంద్రుడు వెడలిపోయిన పిదప రాముడు సీతాలక్ష్మణసహితుడై మునిని దర్శించెను. శరభంగు డతని కాతిథ్యమిచ్చెను. తర్వాత రాము డతనిని యింద్రుని రాకను గూర్చి ప్రశ్నింపగా అత డిట్లనెను -

*మామేష వరదో రామ బ్రహ్మలోకం నినీషతి,*
*జితముగ్రేణ తపసా దుష్ప్రాపమకృతాత్మభిః.* 28

రామచంద్రా! వరదుడైన యీ యింద్రుడు నన్ను బ్రహ్మలోకమునకు గొనిపోవ నెంచి వచ్చెను. నేను తపోబలమున ఆ లోకము జయించితిని. అది జితేంద్రియులు కాని వారికి దుర్లభము.'

అత డింకను ఇట్లు చెప్పెను- 'రామా, నీ వాశ్రమము చెంతకు వచ్చినట్లు తెలిసి, నేను మహనీయధర్మపరాయణుడ వగు నిన్ను చూచిన పిద పనే స్వర్గలోకముగాని, బ్రహ్మలోకము గాని పోవుటకు నిశ్చయించితిని.'

ఇంద్రుని ముని వరదుడుగా వర్ణించెను. కాని వరదానమును గూర్చి వివరణ మేదియు తెలియజేయలేదు.

## 24 శరభంగముని > శ్రీరాముడు అరణ్యకాండ 5

(చూ.వర.క్ర. 23)

దేవేంద్రుడు శరభంగుని బ్రహ్మలోకమునకు గొని పోవ నెంచి వచ్చెను. కాని శరభంగుడు శ్రీరాముడు తన ఆశ్రమసమీపమునకు వచ్చినట్లు తెలిసి కొని, ఆ సమయమున ఇంద్రునితో కలిసి పోవుటకు నిరాకరించెను. అతడు రామునితో నిట్లనెను- 'నీవంటి ప్రియుడైన అతిథిని చూడకుండ నేను బ్రహ్మలోక మరుగదలపను.'

*అక్షయా నరశార్దూల జితా లోకా మయా శుభాః,*
*బ్రాహ్మ్యాశ్చ నాకపృష్ఠ్యాశ్చ ప్రతిగృహ్ణీష్వ మామకాన్.* 31

'పురుషోత్తమా! నేను బ్రహ్మలోకమును, స్వర్గాదులను, తదితరశుభ లోకము లన్నిటిని జయించితిని. నేను సంపాదించిన ఆ లోకము లన్నిటిని నీవు గ్రహింపుము.' దానికి రాము డిట్లనెను-

*అహమేవాహరిష్యామి సర్వాన్ లోకాన్ మహామునే,*
*ఆవాసం త్వహమిచ్ఛామి ప్రదిష్టమిహ కాననే.* 33

'మహామునీ! ఆ లోకము లన్నిటిని నేనే సంపాదించెదను. ఇప్పుడు నాకీ వనములో నివాసస్థలము కావలెను. దాని నెరిగింపుడు'.

అప్పుడు శరభంగముని, అదే వనములో కొంచెము దూరమున సుతీక్ష్ణమహాముని ఆశ్రమ మున్నదని చెప్పి అచ్చట నివసింపనగునని చెప్పెను.

ఇక్కడ వర మయాచితము. అస్వీకృతమును కూడ.

## 25. బ్రహ్మ > మారీచుడు — అరణ్యకాండ 38

సీతాపహరణమున సహాయము కోరిన రావణునకు మారీచుడు తన పూర్వానుభవమును చెప్పి, రాముని కపకారము చేయవద్దని అతనికి బోధించుచుండెను. రామునితో వైరము తెచ్చుకొనుట, సీత నపహరించుట, వంటి కార్యములు రాక్షసులకు హితము గూర్చవని మారీచుడు రావణునకు మరల మరల బోధించెను. తాను స్వయముగా శ్రీరాముని శక్తి ననుభవించి యెరిగితి నని చెప్పెను. రామునివలన తనకు పట్టిన దుర్దశను వివరించెను. విశ్వామిత్రుడు దశరథుని వేడి యజ్ఞరక్షణార్థము రాముని తనతో పంపుమనెను. కారణము, రాక్షసులను (మారీచునితో సహా) చంపగల శక్తి రామునికి కలదని అత డెరుగును. ఇక తన విషయము మారీచు డిట్లు చెప్పెను.

*తతోఽహం మేఘసంకాశస్తప్తకాంచనకుండలః,*
*బలీ దత్తవరో దర్పాదాజగామాశ్రమాంతరమ్.* 16

'మేఘమువలె నల్లని మేను గల నేను, కాంచనకుండలధారినై, వరబలమున మహాదర్పితుడనై, అతని ఆశ్రమమున ప్రవేశించితిని. నేను బలవంతుడనే కాదు. నాకు బ్రహ్మ యిచ్చిన వరము ఉన్నది. నన్ను దేవతలు కూడ సంహరింపలేరు.

ఆశ్రమమున ప్రవేశించుటయే తడవుగా రాముని దృష్టి నాపై బడినది. నన్ను చూచుటతోడనే అతడు ధనుపు గ్రహించి, అవిచలుడై నారి సంధించెను. నే నతనిని బాలకుడని యెంచితిని. అతనిని లెక్కచేయక విశ్వామిత్రుని యజ్ఞవాటిపైకి పోయితిని. ఇంతలోనే రాము డొక తీక్ష్ణబాణమును విడిచెను. అది శత్రుసంహారకము. కాని ఆ బాణఘాతమునకు నేను చాపలేదు. నూరు యోజనముల దూర మెగురగొట్టబడి సముద్రములో పడితిని. బహుశా రాము డప్పుడు నన్ను చంపదలచుకోలేదు. కనుక బ్రతికితిని.'

ఇట్లు చెప్పి మారీచుడు రామునితో విరోధము పెంచుకొనినచో శీఘ్రమే విపత్తులకు గురియగుదు వనియు, ప్రాణములకు ముప్పు కలుగవచ్చుననియు రావణుని హెచ్చరించెను.

మారీచునికి లభించిన వరము ఎప్పుడో, ఎట్లో స్పష్టము కాలేదు. కనుక ఈ వరము యాచితమో, అయాచితమో చెప్పలేము.

## 26. ఇంద్రుడు > సీత          అరణ్యకాండ ప్రక్షిప్త 56 వ సర్గలో

రావణుడు సీతను బలవంతముగా ఎత్తుకొనిపోయెను. అత డామెను లంకలో భయంకరరాక్షసీగణము నడుమ నుంచెను. అప్పుడు సీత జీవనాధారమగు అన్నమును గ్రహించుట మానివేసెను. అందుపై బ్రహ్మ మిక్కిలి చింతించెను. అతడు దేవేంద్రుని పిల్చి, ఎట్లో లంకకేగి సీతకు హవిష్యాన్న మందజేయుమని చెప్పెను. ఇంద్రుడు నిద్రాసహాయుడై వెళ్లి, రాక్షసస్త్రీలకు నిద్ర కల్పించి, సీతను దర్శించెను. తాను వచ్చిన కార్య మెరిగించుచు అత డిట్లనెను- 'దేవీ! నే నింద్రుడను. నిన్నుద్ధరించు కార్యములో రామునికి సహాయపడగలను.

*మత్ప్రసాదాత్ సముద్రం స తరిష్యతి బలైః సహ.* 13

'నా సహాయమున అతడు సేనాసహితుడై సముద్రము దాటివచ్చును. ఈ రాక్షసస్త్రీలు నా మాయవల్లనే నిద్రామోహితులైరి. నేను స్వయముగా నీ కొరకు హవిష్యాన్నము గ్రహించి, నిద్రాసహాయుడనై, యిచ్చుటకు వచ్చితిని.'

*ఏతదత్స్యతి మద్ధస్తాన్న త్వాం బాధిష్యతే శుభే,*
*క్షుధా తృషా చ రంభోరు వర్షాణామయుతైరపి.* 15

'అమ్మా! ఈ హవిష్యాన్నము గ్రహించితివేని, వేలాదివత్సరములైనను, నీకు ఆకలిదప్పిక లుండవు. కనుక నేను తెచ్చిన యీ హవిస్సు గ్రహింపుము.'

ఇది వరదానమో, ఇంద్రుని ప్రభావమో తెలియకున్నది. వరమైనచో అయాచితము. హవిష్యాన్నప్రాప్తి అనుగ్రహరూపమున కలిగినది.

## 27. గురువులు > శబరి    అరణ్యకాండ 74

కబంధుడు చెప్పిన మార్గమున రామలక్ష్మణులు పంపాసరోవర ప్రాంతమున కేగుచుండిరి. దారిలో వారికి రమ్యమగు శబరి యాశ్రమము కనిపించెను. వృక్షలతాపరివేష్టితమైన ఆ రమణీయమగు ఆశ్రమములోని కేగి వారు శబరిని చూచిరి. శబరి వారిరువురి చరణములకు నమస్కరించి, అర్ఘ్యపాద్యాచమనీయము లిచ్చి వారి నాదరించెను. రాము డామెను, ఆమె తపమును, తద్విఘ్నకారులైన షడ్రిపుల దమనమును, కోపనిగ్రహమును, ఆహారనియమాదిపాలనమును గూర్చి ప్రశ్నించెను. ఆమె కుశల మడిగి తెలిసికొనెను. ఆమె సవినయముగా నిట్లు బదులు చెప్పెను. - 'రామా! నేడు నీ దర్శనము లభించుటతోనే నా తపస్సు ఫలించినది. నేడు నా జన్మ సఫలమైనది. గురుజనులను సేవించి పూజించిన దంతయు సార్థకమైనది. దేవాధిపుడవైన నీకు సత్కారమొనర్చి, నీ కృపచే నేనిప్పు డక్షయలోకము లందుకొందును.'

*చిత్రకూటం త్వయి ప్రాప్తే విమానైరతులప్రభైః,*
*ఇత స్తే దివమారూఢా యానహం పర్యచారిషమ్.* 14

*తై శ్చాహముక్తా ధర్మజ్ఞైర్మహాభాగైర్మహర్షిభిః,*
*ఆగమిష్యతి తే రామః సుపుణ్యమిమమాశ్రమమ్.* 15

*న తే ప్రతిగ్రహీతవ్యః సౌమిత్రిసహితోऽతిథిః,*
*తం చ దృష్ట్వా వరాన్ లోకానక్షయాంస్త్వం గమిష్యసి.* 16

'రామచంద్రా! నీవు చిత్రకూటమునకు వచ్చినపుడే, ఇచ్చట నాచే పరిచర్య గ్రహించుచుండిన నా గురుజనులు, ప్రకాశమానమైన విమానమెక్కి దివ్యలోక మరిగిరి. ధర్మాత్ములైన ఆ మహర్షులు ఇచ్చటనుండి పోవుచు నాతో నిట్లు చెప్పిరి.- 'ఈ ఆశ్రమమునకు లక్ష్మణసహితుడై శ్రీరాముడు వచ్చును. నీ వతనిని యథావిధిగా సత్కరింపుము. ఆయనను దర్శించిన పిదప నీకు అక్షయపుణ్యలోకములు లభించును.'

'ఈ కారణమున నే నీ పంపాతటమున ఫలించిన రకరకములైన ఫలమూలములు మీకొరకు సమకూర్చియుంచినాను' అని చెప్పి ఆ ఫలమూలములను గ్రహింపుమని రాముని ప్రార్థించెను. రాము డవి గ్రహించెను. పిదప నతడు- 'శుభాంగీ! నీ విప్పుడు స్వేచ్ఛగా, మహానందమున, అభీష్ట లోకముల కేగుము' అని పలికెను. ఇట్లు రామునివద్ద అనుమతి గ్రహించి శబరి అగ్నిలో తన్నాహుతి చేసికొని, దివ్యాభరణమాల్యానులేపనము లంది స్వర్గలోకమున కేగెను.

గురుజనులు చెప్పినది శుభాకాంక్షయా, పరమా? పరమైనచో అయాచితము. దివ్యవస్త్రాభరణాదుల ప్రాప్తి అనుగ్రహరూపము.

## 28. ? > దుందుభి కిష్కింధాకాండ 11

సుగ్రీవుడు వాలి పరాక్రమమును గురించి రామునికి వివరించుచున్నాడు. వాలి ప్రతిదినము సూర్యోదయాత్పూర్వమే ముందుగా పశ్చిమసముద్రమున కేగి, ఆమీద పూర్వదక్షిణోత్తరసముద్రములకు పోయి వచ్చెడివాడు. అతడు పర్వతశిఖరములకు లంఘించి పెద్ద పెద్ద శిఖరములు పెకలించెడివాడు. ఒకప్పుడు వాటిని దొంతులుగా పేర్చి పట్టుకొనెడివాడు. అతడు పెద్ద పెద్ద వృక్షములను అతివేగముగా విరిచెడివాడు.

దుందుభి అను రాక్షసు డొక డుండెను. వాడు ఔన్నత్యమున కైలాసపర్వతముతో సమానుడు. వాడు దున్నపోతు రూపముతో కన్పించెడివాడు. వానికి వేయి ఏనుగుల బలముండెను.

*న వీర్యోత్సేకదుష్టాత్మా వరదానేన మోహితః.* 8

వాడు బలోత్సాహమున మదించి, వరదానముచే మిగుల గర్వించెను. అట్లు గర్వించిన వాడు సముద్రమువద్ద కేగి యుద్ధమునకు రమ్మనెను. సముద్రుడు తనకు శక్తి చాల దని హిమాలయమువద్దకు పొమ్మని చెప్పెను. హిమవంతు డతనితో 'నాకు యుద్ధములో నేర్పు లేదు. నీవు కిష్కింధలో నున్న వాలి వద్ద కేగు' మని చెప్పెను. వాలి యుద్ధములో దుందుభిని పరిమార్చెను.

దుందుభికి వర మెవరిచ్చిరో తెలియదు. అత డా వరము తపస్సు చేసి పొందెను. కనుక అది యాచితవరము.

## 29. సూర్యుడు > మేరుపర్వతము కిష్కింధాకాండ 42

సీతాన్వేషణకై సుగ్రీవుడు వానరయోధులైన కపిశ్రేష్ఠులను నాల్గు దిక్కులకు పంపెను. మరీచిపుత్రుడైన అర్చిష్మంతుడను కపివరుని పశ్చిమదిశకు పంపెను. అతని కా మార్గ మెరిగించుచూ సుగ్రీవుడు మేరుపర్వతమును గురించి చెప్పెను. 'అనేక పర్వతపంక్తులు గడచిన పిదప దేవేంద్రరక్షితమైన మేరుగిరి కనిపించును. దానిని దాటి ముందుకు పోయినచో అరువది యోజనము లున్న సువర్ణగిరులు కన్పించును. అవి నల్వంకలా సూర్యుని వలె దేదీప్యమానములై వెలుగుచుండును. ఆ పర్వతముల మధ్య పర్వతరాజు మేరువు విరాజిల్లుచున్నది.'

*ఆదిత్యేన ప్రసన్నేన శైలో దత్తవరః పురా, 38*

*తేనైవముక్తః శైలేంద్రః సర్వ ఏవ త్వదాశ్రయాః,*
*మత్ప్రసాదాద్ భవిష్యంతి దివారాత్రౌ చ కాంచనాః. 39*

*త్వయి యే చాపి వత్స్యంతి దేవగంధర్వదానవాః,*
*తే భవిష్యంతి భక్తాశ్చ ప్రభయా కాంచనప్రభాః. 40*

'పూర్వము సూర్యుడు మేరువుపై ప్రసన్నుడై దాని కిట్లు వరమిచ్చెను- 'ఓ శైలరాజా! నీ ఆశ్రయమును నున్నవా రెల్లరు నా కృపవలన సువర్ణకాంతి పొందెదరు. ఇచ్చటి దేవదానవగంధర్వు లందరూ సువర్ణతేజులై నాయందు భక్తి గల్గియుందురు.'

ఈ వరము యాచితమో, అయాచితమో స్పష్టముగా చెప్పబడలేదు.

## 30. బ్రహ్మ > మయుడు కిష్కింధాకాండ 51

హనుమంతుడు కోరగా వృద్ధతాపసి స్వయంప్రభ, తానున్న గుహ సువర్ణమయ మగుటకు గల కారణమును వివరించుచున్నది.

*మయో నామ మహాతేజా మాయావీ వానరర్షభ, 10*
*తేనేదం నిర్మితం సర్వం మాయయా కాంచనం వనమ్.*

*పురా దానవముఖ్యానాం విశ్వకర్మా బభూవ హ,* 11
*యేనేదం కాంచనం దివ్యం నిర్మితం భవనోత్తమమ్.*

*స తు వర్షసహస్రాణి తపస్తప్త్వా మహద్వనే,* 12
*పితామహాద్వరం లేభే సర్వమౌశనసం ధనమ్.* 13

'మాయావిశారదుడైన మయుడను మహాత్ముని పేరు నీవు వినియుందువు. అతడు తన మాయాబలమున నీ సువర్ణమయవనమును కల్పించెను. అతడు పూర్వము దానవుల విశ్వకర్మగా నుండెను. తన నేర్పుతో నత డీ సువర్ణగుహా మందిరము నిర్మించెను. అత డిచ్చట వేయియేండ్లు ఘోరముగా తపస్సు చేసి బ్రహ్మను మెప్పించెను. బ్రహ్మదేవుని వరముపలన అతనికి శుక్రాచార్యుని సమస్తశిల్పకళావైభవమును ప్రాప్తమాయెను.'

సమస్తకాంక్షలను సంప్రాప్తింపజేసికొని మయు డీ సువర్ణమందిరము నిర్మించి యిచ్చట చిరకాలము వసించెను. ఆ తర్వాత అతనికి హేమ యను అప్సరసతో సంబంధము కలిగెను. అది విని ఇంద్రుదు కోపించి అతనిని వజ్రాయుధముతో కొట్టి ఇటనుండి తరిమివేసెను.

ఈ వరము యాచితము.

## 31. హేమ > స్వయంప్రభ కిష్కింధాకాండ 51

హనుమంతుని కోరికపై స్వయంప్రభ తా నున్న దివ్యగుహామందిరమును గురించి చెప్పుచున్నది.

సీతను వెదకుచు వనములందు తిరుగుచున్న హనుమదాదు లొకచోట నొక బిలములో ప్రవేశించిరి. అచ్చట గల వైభవోపేతమగు సురమ్యవస్తుసంచయ మును చూచి వా రాశ్చర్యచకితులైరి. కొంతముందు కేగి వారచ్చట వల్కలము, కృష్ణమృగచర్మము ధరించి, నియతాహారిణియై తపస్సు చేయుచున్న స్త్రీమూర్తిని దర్శించిరి. ఆమె వారందరికిని ఆతిథ్య మిచ్చెను. హనుమంతుడు ప్రశ్నింపగా ఆ బిలమును గూర్చి వివరించెను. ఆ బిలము మయదానవనిర్మితము, సువర్ణమయము. అక్షయకామోపభోగప్రదమైన ఆ బిలాశయమును మయు డింద్రునిచే చంపబడిన పిదప బ్రహ్మదేవుడు హేమ కిచ్చెను. ఇట్లు వివరించి, ఆమె తన పరిచయము కూడ నిట్లు వినిపించెను-

*దుహితా మేరుసావర్ణేరహం తస్యాః స్వయంప్రభా,* 16
*ఇదం రక్షామి భవనం హేమాయా వానరోత్తమ.*

*మమ ప్రియసఖీ హేమా నృత్యగీతవిశారదా,* 17
*తయా దత్తవరా చాస్మి రక్షామి భవనం మహత్.* 18

'నేను మేరుసావర్ణి కుమార్తెను. నన్ను స్వయంప్రభ యందురు. నేను హేమకు సఖిని. ఆమె భవనమును కాపాడుచుంటిని. హేమ నృత్యగీత విశారద. ఆ నా ప్రియసఖి నాకు వరమిచ్చి యీ భవనరక్ష నా కర్పించినది.

తర్వాత నామె హనుమదాదు లచ్చటి కే కారణమున నెట్లు వచ్చినారో దుర్గమ మగు నా బిలమును వారెట్లు ప్రవేశించిరో అడిగి తెలిసికొనెను.

హేమ యిచ్చిన వరము అయాచిత మనదగును.

## 32. హనుమంతుడు > స్వయంప్రభ కిష్కింధాకాండ 52

హేమాప్సరసకు ప్రియసఖి స్వయంప్రభ, హేమ వనభవనాదులను సంరక్షించుచుండెను. ఆమె అచ్చటి కెట్లో వచ్చి చేరిన హనుమదాదులను వారి వృత్తాంతమేమో చెప్పుడని యడిగెను. అంత హనుమంతుడు సవిస్తరముగా సీతాన్వేషణములో తా మచ్చటికి వచ్చి, ఆ బిలమందు ప్రవేశించినట్లు చెప్పెను. తిరిగి కృతజ్ఞత వెల్లడించుచు నత డామెతో నిట్లనెను-

*త్వాం చైవోపగతాః సర్వే పరిద్యూనా బుభుక్షితాః,*
*ఆతిథ్యధర్మదత్తాని మూలాని చ ఫలాని చ.* 16

*అస్మాభిరుపయుక్తాని బుభుక్షాపరిపీడితైః,*
*యత్త్వయా రక్షితాః సర్వే మ్రియమాణా బుభుక్షయా.* 17

*బ్రూహి ప్రత్యుపకారార్థం కిం తే కుర్వంతు వానరాః.* 18

'ఆకలిచే నీరసించి వచ్చి మేము నీ శరణు జొచ్చితిమి. నీ వాతిథ్య ధర్మ మెంచి మాకు ఫలమూలము లర్పించితివి. ఆకలితో నున్న మే మవి కడుపార భుజించితిమి. ఆకలితో చావనున్న మమ్మందరిని నీవు ప్రాణములతో నిల్పి కాపాడితివి. కనుక దీనికి బదులుగా మేము నీకేమి మేలు చేయవలెనో చెప్పగోరెదము.'

అతని మాటలకు స్వయంప్రభ యిట్లు బదులు పలికెను-

*సర్వేషాం పరితుష్టాస్మి వానరాణాం తరస్వినామ్,* 19
*చరంత్యా మమ ధర్మేణ న కార్య మిహ కేనచిత్.* 20

'వానరవీరులైన మీవలన నేను సంతుష్టి జెందితిని. ధర్మానుష్ఠానతత్పరనైన నాకు వేరొకరిచే కావలసిన పని యేదియు లేదు.'

వాల్మీకి యిచ్చట వరదానమని పేర్కొనలేదు. కాని 'ప్రత్యుపకారార్థమ్' అనుటలో కృతజ్ఞత వ్యక్తమగుచున్నది. దీనిని వర మనుకొన్నచో అది అయాచితము, అస్వీకృతము కూడ.

## 33. నిశాకరముని > సంపాతి కిష్కింధాకాండ 62, 63

సంపాతి వానరులతో తన పూర్వవృత్తాంతము చెప్పుచుండెను.

నిశాకరమహాముని అడిగిన దానికి బదులుగా సంపాతి తన రెక్క లేల కాలిపోయినవో తెలియజేయుచుండెను.

'నేను, నా తమ్ముడు జటాయువు బలగర్వితులమై ఒకనాడు మా బలపరాక్రమములను పరీక్షింప నెంచి, పైపైకి అత్యధికదూర మెగురుచు పోయితిమి. అలసిన మా శరీరములు చెమటతో తడిసినవి. మాకు అలుపు దుర్భరమైనది. భయవ్యాకులులమై మూర్ఛలో మునుగుచుంటిమి. సూర్యతేజము మిక్కుటమై మాకు కనులు సరిగా కనిపించలేదు. ఇంతలో తమ్ముడు జటాయువు నన్నడుగకయే భూమిపైకి దిగిపోయెను. అత డట్లు దిగుట చూచి నేనును క్రిందకు దిగి పోవుచు, నా రెక్కలతో జటాయువును కప్పి దిగుచుంటిని. కాని సూర్యకిరణములవలన నా రెక్కలు కాలిపోయినవి. జటాయువు జనస్థానమున పడిపోయినట్లు తోచినది. నేను వింధ్యపర్వతముపై పడిపోయితిని. రెండురెక్కలును కాలిపోవుటచేత వికలుడనై పడియుంటిని.'

'రాజ్యభ్రష్టుడనై, సోదరుని నుండి విడిపోయి, పరాక్రమమంతయు పోగొట్టుకొని, నేనిప్పుడు మరణేచ్ఛతో ఈ పర్వతశిఖరమునుండి పడనెంచు చున్నాను.'

సంపాతి మాటలు విని నిశాకరమహాముని, కొంత తడవు ధ్యానించి, అతనితో నిట్లనెను - 'నీకు తిరిగి క్రొత్తగా రెక్కలు వచ్చును. దృష్టికూడ మునుపటి వలె లభించును. పోయిన బలసత్త్వములు తిరిగి పొందగలవు. నేను ముందు రాగల విషయము లనేకములు పురాణములవలన తెలిసికొంటిని. తపస్సుచే అవి సత్యములని నిదర్శనముగా గ్రహించితిని. శ్రీరాముని దూతలగు వానరులు సీతాన్వేషణముపై ఇచ్చటికి వచ్చెదరు. వారికి నీవు సీతనుగూర్చి, ఆమె యున్న ప్రదేశమును గూర్చి చెప్పుము. నీ వీ చోటు విడిచి వే రెచ్చటికిని పోవలదు.'

'నీకు నా మహిమచే రెక్కలు తక్షణమే రప్పింపగలను. కాని నీ విక్కడనే పడియుండుచో ప్రపంచమునకు హితమైన పని చేయగలుగుదువు.'

నిశాకరముని చెప్పినట్లుగనే సంపాతి వింధ్యపర్వతముపై నిల్చి, వానరుల రాక కెదురు చూచుచుండెను. వారు వచ్చిన పిదప వారికి తన కథ వినిపించెను. అంతలోనే అతనికి రెక్కలు వచ్చెను.

*ఉత్పేతతుస్తదా పక్షౌ సమక్షం వనచారిణామ్,*
*స దృష్ట్వా స్వాం తనుం పక్షైరుద్గతైరరుణచ్ఛదైః.* 63-9

తన శరీరమున నూతనముగా అరుణారుణములై రెక్క లుదయించుటచే సంపాతి హర్షాతిశయముతో పొంగిపోయెను.

ఈ వర మయాచితము.

## 34. బ్రహ్మ > హనుమంతుడు కిష్కింధాకాండ 66

జాంబవంతుడు హనుమంతుని కతని జన్మవృత్తాంత మెరిగించి సముద్రలంఘనమున కతనిని ప్రోత్సహించుచుండెను.

కపిరాజైన కుంజరుని పుత్రియు, కపిరాజు కేసరికి పత్నియు నైన అంజన ముల్లోకములలోను ప్రసిద్ధి బడసినది. ఆమె రూపసంపదకు సాటిలేదు. ఆమె సౌందర్యమునకు. వాయుదేవుడు మోహితుడయ్యెను. ఉద్రేకముతో అత డామెను గట్టిగా పట్టి కౌగలించుకొనెను ఆ పతివ్రత ఎవ రిట్లు నా పాతివ్రత్యము చెరుపుచున్నారని పల్కగా, వాయువు, 'నేను నీ పాతివ్రత్యము చెరుపలేదు. భయము చెందకుము. నేను నిన్ను అప్రకటముగా కౌగలించి

మానసికసమాగము మొనర్చితిని. దీనివలన నీకు బలపరాక్రమసంపన్నుడును, ధీశాలియు నైన పుత్రుడు జన్మించును. అతడు ధైర్యశాలి, తేజస్వి, బలపరాక్రమోపేతుడు, సముద్రలంఘనాదులలో నాతో సమానుడు నగును' అని పలికెను. అంజన ప్రసన్నురాలైనది. ఆమె ఒక గుహలో హనుమంతుని ప్రసవించెను. బాల్యావస్థలో ఒక దినము సూర్యోదయవేళ సూర్యుని చూచి ఫలమని భ్రమించి హనుమంతు డాకాశమున కెగిరెను. అత డట్లరిగి అంతరిక్షమున గల సూర్యుని సమీపించెను. దానిపై ఇంద్రుడు కుపితుడై అతనిపై వజ్రాయుధము ప్రయోగించెను. హనుమంతుడు ఉదయాచలశిఖరముపై పడెను. అతని హనువు కుడిభాగము మొక్కవోయెను. అప్పటినుండి అతనికి హనుమంతుడని పేరు కలిగెను. హనుమంతునికి దెబ్బ తగులుట చూచి వాయువు కుపితుడై మూడు లోకములందును తన సంచారము నిలిపివేసెను. దానితో దేవతలు వ్యాకులులై వాయువును బ్రతిమాలజొచ్చిరి.

*ప్రసాదితే చ పవనే బ్రహ్మా తుభ్యం వరం దదౌ,*
*అశస్త్రవధ్యతాం తాత సమరే సత్యవిక్రమ.* 27

వాయుదేవుడు ప్రసన్నుడైన పిదప బ్రహ్మదేవుడు సత్యపరాక్రముడైన హనుమంతునికి యుద్ధములో ఏ అస్త్రశస్త్రములచేతను వధింపబడకుండా వరమిచ్చెను.

ఈ వర మయాచితము.

35. ఇంద్రుడు > హనుమంతుడు కిష్కింధాకాండ 66

జాంబవంతుడు హనుమంతుని కాతని జన్మకథ చెప్పుచుండెను.
చూ. మీద చెప్పబడిన బ్రహ్మ యిచ్చిన వరక్ర. 34

*వజ్రస్య చ నిపాతేన విరుజం త్వాం సమీక్ష్య చ,*
*సహస్రనేత్రః ప్రీతాత్మా దదౌ తే వరముత్తమమ్.* 28
*స్వచ్ఛందతశ్చ మరణం తవ స్యాదితి వై ప్రభో* 29

'వజ్రప్రహారముచే, నీకు బాధ కల్గుట గమనించి దేవేంద్రుడు ప్రసన్నుడై నీ కొక గొప్ప వరమిచ్చెను. దానిచే నీకు స్వచ్ఛందమరణము లభించును, గాని అన్యథా కాదు.'

ఈ వర మయాచితము.

సముద్రము దాటిపోవుచున్న హనుమంతునికి కొంత తడవు విశ్రామహేతువుగా నుండదగునని చెప్పి సముద్రుడు తనలో దాగియున్న సువర్ణగిరి మైనాకుని పైకి రమ్మని కోరెను. సముద్రజలములను ఛేదించుకొని గగనతలమున వచ్చి ఎత్తుగా నిల్చిన మైనాకుని చూచి హనుమంతు డది యొక విఘ్నముగా భావించెను. అట్లెంచి అతడు మైనాకుని మహోన్నత శిఖరమును తన రొమ్మున డీకొనెను. ఆ దెబ్బకు మైనాకుడు తిరిగి నీటిలో పడెను. అయినను హనుమంతుని వేగమునకు మిక్కిలి సంతసించి అతడు తిరిగి లేచి, మనుష్యరూపమున తన శిఖరిపై నిల్చి యిట్లనెను- 'కపీశ్వరా! నీవు యీ సముద్రమును గగనమార్గమున దాట నెంచితివి. కనుక నీవు కొంత విశ్రాంతి తీసికొనుట కనుకూలత కల్పింపవచ్చితిని. కొంతసేపు విశ్రమించి తిరిగి వెళ్ళవచ్చును.' తిరిగి అత డిట్లనెను - 'కపివరా, నీతో నాకు చుట్టరిక మున్నది. పూర్వము కృతయుగములో పర్వతములకు రెక్కలుండెడివి. అవి గరుడుని వలె వేగముగా నెగురుచు నలు దిక్కులకు పోవుచుండెడివి. కాని దేవతలు ఋషులాదిగా సమస్తప్రాణులు ఆ కొండలు తమపై పడునేమో యని భయమందుచుండెనవి. ఇంద్రుడు కోపించి తన వజ్రాయుధముతో పర్వతముల రెక్కలు ఖండింపదొడగెను. అతడు నా వంకకు వచ్చినప్పుడు నేను మీ తండ్రి వాయుదేవుని సహాయముతో ఎగిరివచ్చి, ఈ సముద్రమున తలదాచుకొంటిని. కనుక నీవు నా కాదరార్హుడవు, మాన్యుడవు. నా ఆతిథ్యము గ్రహించి కొంతసే పిట విశ్రమించి నా స్నేహ మంగీకరింపుము.'

మైనాకుని మాటలకు బదులుగా హనుమంతు డిట్లనెను- 'ని న్నెరుగుట వలన నా కానందమైనది. నేను వానరుల వద్ద, మార్గమధ్యమున నిలువనని ప్రతిజ్ఞ చేసి వచ్చితిని.' అని చెప్పి నవ్వుచు అతనిని చేతితో ముట్టి మీది కెగిరిపోయెను. ఇదంతయు చూచి ఇంద్రుడు సంతోషించి వెంటనే మైనాకునికి ప్రత్యక్షమై అతనితో నిట్లనెను -

*హిరణ్యనాభ శైలేంద్ర పరితుష్టోఽస్మి తే భృశమ్,*
*అభయం తే ప్రయచ్ఛామి గచ్ఛ సౌమ్య యథాసుఖమ్.* 139

'స్వర్ణమయ శైలరాజా, మైనాకా, నీ వల్ల నా కెంతో సంతోషము కలిగినది. నీ కభయ మిచ్చుచున్నాను. నీ విక స్వేచ్ఛగా తిరుగవచ్చును.'

ఇంద్రునివలన వర మందుకొని మైనాకుడు తిరిగి సముద్రము చేరుకొనెను.

*నవై దత్తవరః శైలో బభూవావస్థితస్తదా.* 143

ఈ వర మయాచితము.

## 37. బ్రహ్మ > సురస సుందరకాండ 1

'వెళ్లినపని విజయవంతముగా ముగించుకొని సీతను తోడ్కొని వచ్చెదను, లేదా లంకనే పెకలించి తెచ్చెదను' అని ప్రతిజ్ఞ చేసి బయలుదేరిన హనుమంతుని బలపరాక్రమములు పరీక్షించ నెంచి దేవగంధర్వసిద్ధమహర్షులు సూర్యతుల్యతేజస్విని యైన నాగమాత సురసను పిలిచి యిట్లనిరి - 'వాయు సుతుడైన హనుమంతుడు వాయుమార్గమున సముద్రము దాటుచున్నాడు. నీవు రెండు ఘడియల కాల మతని మార్గమున విఘ్నము గావింపుము. నీవు పర్వతము వలె మహాకాయము కల భయంకరరాక్షసీరూపము, వికృతకేశ కలాపము, పింగళనేత్రములు కలదానవై, ఆకాశము నంటుచున్నట్లున్న విశాలమైన నోరు తెరచి పొమ్ము' అనగా, సురస అంగీకరించి రాక్షసీరూపమున వచ్చి, సముద్రము దాటుచున్న హనుమంతు నడ్డగించెను.

*'మమ భక్ష్యః ప్రదిష్టస్త్వమీశ్వరైర్వానరర్షభ,*
*అహం త్వాం భక్షయిష్యామి ప్రవిశేదం మమాననమ్.* 150

*వర ఏష పురా దత్తో మమ ధాత్రేతి సత్వరా,*
*వ్యాదాయ వక్త్రం విపులం స్థితా సా మారుతేః పురః.* 151

'కపిశ్రేష్ఠా! దేవాదులు నిన్ను నాకు ఆహారముగా అర్పించిరి. కనుక నేను నిన్ను భక్షించెదను. నీవు నా నోటిలో ప్రవేశింపుము. పూర్వము బ్రహ్మ నా కీ వర మిచ్చెను' అని చెప్పి ఆమె విశాలముగా నోరు తెరచి హనుమంతుని యెదుట నిల్చెను. హనుమంతు డామెకు తన కార్యమును దాని మహత్త్వమును వివరించి, ఆ కార్యమునకై తనను విడువుమని వినయముగా పలికెను. అంతేగాక, ఆమెకు తా నాహారముగా కావలెనన్నను, సీతాదర్శనానంతరము శ్రీరాముని కలిసి, పిదప తానే స్వయముగా వచ్చి ఆమె కాహార మగుదునని కూడ చెప్పెను. అందుపై కామరూపిణి యగు సురస,

*అబ్రవీన్నాతివర్తేన్మాం కశ్చిదేష వరో మమ.* 156

'నన్ను మీరి ఎవడునూ పోజాలడని నాకు వరమున్నదని చెప్పి, దాటిపోవ నెంచుచున్న హనుమంతుని బల మెరుగ నెంచి యింకను నిట్లనెను-

*ప్రవిశ్య వదనం మేఽద్య గంతవ్యం వానరోత్తమ,*
*వర ఏష పురా దత్తో మమ ధాత్రేతి సత్వరా.* 158

'వానరవీరా! నా నోటిలో ప్రవేశింపుము. అట్లు ప్రవేశించియే నీవు పోవలెను. మునుపు బ్రహ్మ నా కిట్టి వర మిచ్చెను' అని పల్కుచూ నోరింకను ఎక్కువగా తెరచి హనుమంతుని యెదుట నిల్చెను. అప్పుడు హనుమంతు డామెతో 'నీవు నోరింకను తెరచి నా శరీరమును భరించుటకు సిద్ధము కమ్ము' అని పల్కెను. ఆమె తన నోరు నూరు యోజనములుగా పెంచి తెరచెను. అప్పుడు హనుమంతుడు తన శరీరమును కుదించి అంగుష్ఠ మాత్రుడై, ఆమె నోటిలో ప్రవేశించి, అవలీలగా తిరిగి బయటకు వచ్చెను. అట్లు వచ్చి ఆకసమున నిల్చి, ఆమెతో నత డిట్లనెను -

*ప్రవిష్టోఽస్మి హి తే వక్త్రం దాక్షాయణి నమోఽస్తు తే,*
*గమిష్యే యత్ర వైదేహీ సత్యశ్చాసీద్వరస్తవ.* 169

'దక్షకుమారి! నేను నీ నోటిలో ప్రవేశించి వచ్చితిని. నీ వరము చెల్లినది. ఇక నేను సీతను చూడనేగెదను' అని పల్కెను. అప్పుడు సురస తన నిజరూపమున ప్రత్యక్షమై 'నీవు శ్రీరామదేవుని కార్యమున విజయ మందుకొనుటకై సుఖముగా నరిగి సీతను శ్రీరామునితో చేర్చుము' అని పలికెను.

హనుమంతుడు వానరులతో తన లంకాయాత్ర గురించి చెప్పుచు సురసకు లభించిన ఆ వరమును గూర్చి చెప్పెను. 'కార్యము ముగించుకొని వచ్చి నీ నోటిలో ప్రవేశించెద నని ప్రతిజ్ఞ చేసి చెప్పినను ఆమె అంగీకరింపలేదు. పైగా,

*అబ్రవీన్నాతివర్తేన్మాం కశ్చిదేష వరో మమ.* 156

'న న్నెవరును దాటిపోలేరు. ఇది నాకు వరము' అని చెప్పినది.

సురస కీ వర మెట్లు లభించినదో స్పష్టముగా చెప్పబడలేదు. కనుక ఈ వరము యాచితమో, అయాచితమో స్పష్టము కాలేదు.

లంకానిశాచరి హనుమంతునికి తన వృత్తాంతము చెప్పుచుండెను.

లంకలో ప్రవేశింపబోవుచున్న హనుమంతుని చూడగనే, ఆ నగరాధిష్ఠాత్రియైన లంకిణి, అతని నడ్డగించెను. హనుమంతు డామెకు తన రాకకు గల ఉద్దేశ్య మెరిగించెను. ఆమె మరింతగా కోపించి, కఠోరముగా గర్జించుటయే గాక, అతనిని గట్టిగా చరచి కొట్టెను. అప్పుడు హనుమంతు డామెను తన పిడికిలితో పొడిచెను. ఆడుది కదా అని అత డెక్కువగా కోపించలేదు. కాని ఆ పిడికిలి పోటునకే ఆమె స్పృహ తప్పి పడిపోయినది. తిరిగి లేచి ఉద్విగ్నయై, అభిమానము విడిచి, గద్గదస్వరముతో ఆమె అతని కిట్లనెను - 'ఓ కపివరా! నన్ను రక్షింపుము. బలవంతులు, సాత్త్వికులునైన మహాత్ములు మర్యాదలు విడువరు.

*అహం తు నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ,*
*నిర్జితాహం త్వయా వీర విక్రమేణ మహాబల.* 45

*ఇదం చ తథ్యం శృణు మే బ్రువంత్యా వై హరీశ్వర,*
*స్వయం స్వయంభువా దత్తం వరదానం యథా మమ.* 46

*యదా త్వాం వానరః కశ్చిద్విక్రమాద్ వశమానయేత్,*
*తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయమాగతమ్.* 47

*న హి మే సమయః సౌమ్య ప్రాప్తోఽద్య తవ దర్శనాత్.* 48

'ఓ వీరవానరా! నేను స్వయముగా ఈ లంకానగరాధిదేవతను. నీవు నన్ను నీ బలముచే జయించితివి. నేను నీ కొక సత్య మెరిగించుచుంటిని. వినుము. నాకు స్వయముగా బ్రహ్మ యిచ్చిన వరమిది. ఏమనగా, ఏనాడు నీ వొక వానరుని పరాక్రమమునకు లొంగిపోదువో, ఆనాడు లంకకు విపత్తు సంభవించినదని తెలిసికొనుము. మహాత్మా! నే డిది నీ దర్శనముచే సత్యసిద్ధముగా ప్రాప్తమైనది.' అని చెప్పి ఆమె హనుమంతుని లంకలోని కరిగి, అభీష్ట కార్యము నెరవేర్చుకొనుటకు అనుమతించినది.

వర మిచ్చిన కారణము చెప్పలేదు. కనుక ఈ వర మయాచితమో యాచితమో స్పష్టపడకున్నది.

హనుమంతుడు లంకలో ఉద్యానచైత్యప్రాసాదములను, రక్షకులైన రాక్షసులను పూర్తిగా నశింపజేసి, జంబుమాలి, విరూపాక్షుడు, అక్షకుమారుడు మున్నగు వారిని సంహరించెను. ఇది చూచి క్రోధసంతప్తుడైన రావణుడు ఇంద్రజిత్తును హనుమంతుని జయించుటకు పంపెను. జవసత్త్వసంపన్నులు, యుద్ధకళాకుశలులు నైన ఆ వీరు లిర్వురును ఒకరి బల మొకరు తెలిసికొనిరి. తన అమోఘ బాణములన్నియు హనుమంతునిపట్ల నిర్వీర్య మగుచుండుట చూచి ఇంద్రజిత్తు ధర్మబలమున నతడు అవధ్యుడని గ్రహించెను. అప్పు డా మహాస్త్రవేది బ్రహ్మాస్త్రము ప్రయోగించి హనుమంతుని బంధించెను. ఆ అస్త్రముచే బంధింపబడిన హనుమంతుడు నిశ్చేష్టుడై నేలబడిపోయెను. బ్రహ్మవరమువలన అతని కా బ్రహ్మాస్త్రముచే నే విధమైన హానియు కలుగలేదు.

*తతః స్వాయంభువైర్మంత్రైః బ్రహ్మాస్త్రం చాభిమంత్రితమ్,*
*హనుమాంశ్చింతయామాస వరదానం పితామహాత్.* 40

బ్రహ్మమంత్రములతో నభిమంత్రితమైన ఆ అస్త్రమును చూచి హనుమంతుడు తనకు మునుపు బ్రహ్మ యిచ్చిన వరమును స్మరించెను. (నా అస్త్రము నిన్నొక ముహూర్తకాలము బంధించి విడువగలదని అతనికి బ్రహ్మ వర మిచ్చెను.)

హనుమంతు డా అస్త్రముయొక్క శక్తిని, తనపై బ్రహ్మకు గల కృపను, అస్త్రబంధమునుండి విముక్తు డగుటకు గల తన సామర్థ్యమును, తలచి, బ్రహ్మ ఆజ్ఞ పాటించుటయే మేలని నిశ్చయించెను. హనుమంతుడు నిశ్చేష్టుడై పడుటతో రక్కసు లతనిని నారతో పేనిన బలమైన మోకుత్రాళ్లతో బంధించిరి. రావణుని చూడ నెంచిన హనుమంతుడు రాక్షసులు చేయు నవహేళనాదులను సహించి నిల్చెను.

*న బద్ధ స్తేన వల్కేన విముక్తోఽస్త్రేణ వీర్యవాన్,*
*అస్త్రబంధః న చాన్యం హి న బంధమనువర్తతే.* 48

నారత్రేళ్లతో బంధించుటచే హనుమంతుని బ్రహ్మాస్త్రబంధము వీడిపోయినది. ఆ మహాస్త్రబంధ మితరబంధముల నంగీకరింపదు.

ఇంద్రజిత్తది గ్రహించి మిక్కిలి చింతించెను. అతడు చేసిన ప్రయత్నమును రాక్షసులు భగ్న మొనర్చిరి. ఆ అస్త్రము రెండవసారి ప్రయోగింపబడదు. ఈ విషయము తెరిగి విజయము పొందియు, అతడు సంశయాత్ముడయ్యెను.

రావణుని చూడవలెనని కోరి, అస్త్రబంధము నుండి విడిపడినను, హనుమంతు డింకను బంధములో నున్నట్లే నటింపసాగెను. రాక్షసు లతని నట్లు బంధించి రావణుని యెదుటకు తెచ్చి నిల్పిరి.

## సుందరకాండ 50

రాక్షసులు కట్టి, యీడ్చి తెచ్చిన హనుమంతుని చూచి రావణుడు తన మంత్రి ప్రహస్తునితో ఇతడెవరో, లంకలోని కేల వచ్చెనో, ఎక్కడినుండి వచ్చెనో అడిగి తెలిసికొనుమని పలికెను. ప్రహస్తుడు హనుమంతు నడిగి సత్యము చెప్పినచో విడిచిపుత్తుమనియు, లేనిచో ప్రాణములతో తిరిగి పోనీయమనియు చెప్పెను. దానికి హనుమంతు డిట్లు బదులు చెప్పెను - 'నేను ఇంద్రయమవరుణులలో నెవరికిని దూతను కాను. కుబేరునితో నాకు చెలిమి లేదు. విష్ణుదేవుడు నన్నిటకు పంపలేదు. నేను జన్మతః వానరుడను. రావణాసురుని చూడ నెంచి వచ్చి నే నా చొరరాని వనము ధ్వంసము చేసితిని. పిదప రాక్షసవీరులు నాతో యుద్ధ మొనర్ప వచ్చిరి.

*రక్షణార్థం చ దేహస్య ప్రతియుద్ధా మయా రణే,*
*అస్త్రపాశైర్న శక్యోఽహం బద్ధుం దేవాసురైరపి.* 16

*పితామహాదేష వరో మమాపి హి సమాగతః,*
*రాజానం ద్రష్టుకామేన మయాస్త్రమనువర్తితమ్.* 17

ఆత్మరక్షణార్థము నేను యుద్ధములో వారి నెదిరించితిని. దేవాసురు లెవరికిని నన్ను అస్త్రపాశమున బంధించుట సాధ్యము కాదు. నా కట్టి వరము బ్రహ్మవద్ద లభించెను. రాక్షసరాజును చూడ నెంచినందున నేనే అస్త్రమునకు లొంగి కట్టుబడితిని.'

ఈ వరము యాచితమో, అయాచితమో స్పష్టముగా చెప్పలేదు.

## 40. బ్రహ్మ > మైందద్వివిదులు (అశ్వినీదేవతల పుత్రులు)
సుందరకాండ 59

లంకనుండి తిరిగి వచ్చిన హనుమంతుడు అంగదాదివానరవీరులకు అచ్చట జరిగిన వృత్తాంత మంతయు వివరించెను. అప్పుడు ప్రతీకారమును గూర్చి చర్చించుచు అంగదు డిట్లనెను.

*అశ్విపుత్రౌ మహావేగౌ బలవంతౌ ప్లవంగమౌ,* 16
*పితామహవరోత్సేకాత్ పరమం దర్పమాస్థితౌ.*

*అశ్వినోర్మాననార్థం హి సర్వలోకపితామహః,* 17
*సర్వావధ్యత్వమతులమనయోర్దత్తవాన్ పురా.* 18

*వరోత్సేకేన మత్తౌ చ ప్రమథ్య మహతీం చమూమ్,* 19
*సురాణామమృతం వీరౌ పీతవన్తౌ ప్లవంగమౌ.*

అశ్వినీదేవతల పుత్రులైన ఈ మైందద్వివిదులు మహావేగబలశాలులు. పూర్వము బ్రహ్మవద్ద వర మందుకొని వీరు మహాగర్వితులై విహరించు చుండిరి. అశ్వినీదేవతల నాదరించుటకై బ్రహ్మ వీరికి అవధ్యత్వము వరముగా నిచ్చెను. ఆ వరబలమున వీరు దేవసైన్యమును కూడ నెదిరించి అమృతము త్రాగినారు.

వీరు కోపించినచో గజాశ్వరథసంకులమగు లంక నంతటిని నశింప జేయగలరు. తక్కిన వానరులు తీరికగా కూర్చొనవచ్చును. కనుక మనము కిష్కింధకు బదులుగా, ఇప్పుడు లంక కేగి రాక్షసనాశ మొనర్చి, సీతను తోడ్కొని రాముని వద్ద కేగదగును.'

ఈ వరము కూడ యాచితమో, అయాచితమో తెలియకున్నది.

## 41. ? < కాలకేయులు (దానవులు) యుద్ధకాండ 7

శ్రీరాముడు వేలాది వానరసేనలను కూర్చుకొని లంకపై దండెత్తి వచ్చుచున్నట్లు విని రావణుడు బలాధికులైన రాక్షసవీరు లందరిని పిలిచి యుద్ధవ్యూహమును గురించి ఆలోచించెను. ఆ రాక్షసులు రావణుని పూర్వ పరాక్రమము నుగ్గడించి యిట్లు పలికిరి- 'నీవు భోగవతిలో నాగులను,

లోకపాలుడైన కుబేరుని, వాసుకి, తక్షకుడు మున్నగు సమరదుర్జయులైన మహావీరులను ఎందరినో జయించితివి. నీ కిప్పుడీ రాముని జయించుటలో కష్టమేమి?'

*అక్షయా బలవంతశ్చ శూరా లబ్ధవరాః పునః,*
*త్వయా సంవత్సరం యుద్ధ్వా సమరే దానవా విభో.* 10

'మహాబలవంతులైన కాలకేయదానవులు, అజేయులు, బలపరాక్రమ సంపన్నులు, వరలబ్ధశక్తిసంయుతులు. వారి నందరిని ఒక సంవత్సరకాలము యుద్ధము చేసి నీవు జయించితివి.' కాలకేయుల కెవరు వరమిచ్చిరో, ఎప్పుడో, ఏ కారణముననో చెప్పలేదు. కేవలము వరప్రాప్తి మాత్రమే ఉగ్గడింపబడెను.

## 42. ? > ఇంద్రజిత్తు యుద్ధకాండ 7

శ్రీరాముడు వానరసేనాసహితుడై లంకపై దండెత్తి వచ్చుచున్నట్లు విని రావణుడు రాక్షసయోధులతో విషయపరామర్శ చేసి చర్చింప దొడగెను. అప్పుడు రాక్షసులు రావణుని పూర్వపరాక్రమము ఉగ్గడించిరి- 'నీవు యుద్ధములో మహావీరులైన శత్రువు లెందరినో జయించితివి. రాముని జయించుట నీకు కష్టమెట్లగును?' అని కొంత తడ వూహించి వారు రావణున కిట్లు సలహా చెప్పిరి- 'నీవు పరిశ్రమింపవలసిన పని యేమున్నది? నీవు నిశ్చింతగా నుండవచ్చును. మహావీరుడైన ఇంద్రజిత్తు తానొక్కడే వానరు లందరిని సంహరించి వచ్చును.

*అనేన చ మహారాజ మాహేశ్వర మనుత్తమమ్,*
*ఇష్ట్వా యజ్ఞం వరో లబ్ధో లోకే పరమదుర్లభః.* 19

'మహారాజా! పరమోత్తమమగు మాహేశ్వరయజ్ఞ మొనర్చి ఇంద్రజిత్తు లోకదుర్లభమైన వరము సంపాదించెను. కనుక రాముని జయించు కార్యము నీ వతని కప్పగింపుము.' ఇంద్రజిత్తుని కెవ రట్టి వరమిచ్చిరో చెప్పకపోయినను, అది శివప్రసాదమని స్పష్టమగుచున్నది. అది మాహేశ్వరయజ్ఞఫలము. అతనికి శివుని కృపచే దివ్యరథము, ధనుర్బాణములు, శస్త్రాదికము, తామసీమాయ మున్నగునవి లభించెను. వాస్తవమున కిదంతయు అనుగ్రహము. వరము కాదు. కాని వాల్మీకి దీనిని వరమనియే వచించెను.

(చూ. మహేశుడు > మేఘనాథుడు, వర.క్ర. 64. ఉత్తరకాండ 25)

'నే నీ నాడు సముద్రము దాటెదను, లేదా సముద్రము నింకింతును' అని కృతనిశ్చయుడై రాముడు కుశలు పరచిన నేలపై కూర్చుండి మౌనధారియై విధిపూర్వకముగా సముద్రమును సుముఖముగా చేయనెంచి వ్రతము ధరించెను. అట్లతడు మూడు రాత్రులు వ్రతనిష్ఠలో గడిపెను. కాని మందమతి యైన సముద్రు డతనికి ప్రత్యక్షము కాలేదు. అప్పుడు రాముడు కోపించి, సర్వజగత్సంహారకమగు బాణము తీసి సముద్రముపై ప్రయోగింప నెంచెను. అతని బాణము సముద్రజలము నల్లకల్లోలపరుపసాగెను. సముద్రమున పెద్ద పెద్ద కెరటములు లేచెను. వాటినుండి పొగ జిమ్ముచుండెను. అవి సుడులు గొని తిరుగసాగెను. సముద్రములోని జీవరాశులు వ్యాకులపడి పాతాళ మేగజొచ్చెను. అచ్చటి దానవవీరులు కూడ వ్యథావ్యాకులు లగుచుండిరి. సముద్రమం దంతటను కోలాహలధ్వనులు చెలరేగెను. రాముడు తిరిగి బాణప్రయోగమున కుత్సహించుచుండగా లక్ష్మణు డతని వద్దకేగి 'చాలు, చాలు, ఇకవలదు, వలదు.' అని అతని ధనువును పట్టుకొనెను. కాని రాము డింకను తీవ్ర స్వరమున సముద్రమును హెచ్చరించుచూ 'నేను నిన్నీనాడు పాతాళము వరకు ఇగురజేయుదును. నా బాణములతో ఈ జలరాశి దగ్ధమగును. నీ వింకిపోవుదువు. నీలోని జీవరాశి నాశమందును' అని పల్కెను. ఇట్లు పలికి రాముడు బ్రహ్మదండసమానమగు బాణము గ్రహించి దానిని బ్రహ్మాస్త్రమంత్రముచే నభిమంత్రించెను. దానిని ధనువున సంధింపగనే చరాచరసృష్టి యంతయు విచలిత మయ్యెను. అప్పుడు సముద్రజలములనుండి స్వయముగా ప్రత్యక్షమై వచ్చి సముద్రుడు చేతులు జోడించి రామునితో నిట్లు పల్కెను - 'మహాత్మా! పృథివి, వాయువు, ఆకాశము, జలము, అగ్ని - ఇవి సదా తమ స్వభావము ననుసరించి యుండును. ఈ సనాతనధర్మమార్గము నవి విడువజాలవు. నా స్వభావమును అట్టిదే. నే నగాధజలరాశిని. న న్నెవరును దాటజాలరు. నా లోతు ఇతరులకు గమ్యమగుచో, నా స్వభావమే నశించి మారిపోయినట్లగును. రాజకుమారా! తిమినక్రజలచరభరితమైన నా జలములను నేను, కామలోభ భయాదికారణములచే స్తంభింపజేయజాలను. కాని నేను నీకు వేరొక ఉపాయము చెప్పెదను. దానిచే నీ వీ వానరసేనతో సులభముగా నన్ను దాటిపోగలుగుదువు. నాకును కష్టముండదు.' ఆ మాటలు విని రాముడు సముద్రునితో నిట్లనెను- నా యీ బాణ మమోఘము. దీని నెక్కడ ప్రయోగింపనగునో చెప్పుము.'

దానికి బదులుగా సముద్రు డిట్లు చెప్పెను- 'నాలో ఉత్తరదిక్కున ద్రుమకుల్యమను పేరుగల పవిత్రస్థల మున్నది. దానిని ఆభీరజాతులవా రాక్రమించిరి. వారు రూపగుణక్రియలలో భయంకరులు, పాపులు, దొంగలును. వారు నా జలములు హరించుచున్నారు. ఆ పాపాత్ముల సంపర్కము నాకు దుస్సహముగా నున్నది. నీ వీ బాణమును వారున్నచోట విడుపుము.' ఆ మాట విని రాముడు సముద్రుడు చెప్పినట్లుగనే ఆ బాణమును ఉత్తరదిశగా విడిచెను. అది మహోజ్జ్వలముగా వెలుగుచూడని ఆ ప్రదేశము నంటెను. అచ్చట ఘోరమగు ఆర్తనాదము వెడలెను. ఆ బాణఘాతముచే నేర్పడిన బిలమునుండి పాతాళ జలము లువ్వెత్తుగా నెగిరి వచ్చెను. ఆ బిలరంధ్ర మొక వ్రణరూపముగా నేర్పడినందున ఆ ప్రదేశమునకు వ్రణ మను పేరు వచ్చెను. అచ్చటి జలము లింకిపోయెను. అప్పటినుండి అది మరుకాంతారముగా ప్రసిద్ధిపొందెను. అట్లైండిపోగా-

*వరం తస్మై దదౌ విద్వాన్ మరవేఽమరవిక్రమః,* 41

*పశవ్యశ్చాల్పరోగశ్చ ఫలమూలరసాయుతః,*
*బహుస్నేహో బహుక్షీరః సుగంధిర్వివిధౌషధిః.* 42

*ఏవమేతైశ్చ సంయుక్తో బహుభిః సంయుతో మరుః,*
*రామస్య వరదానాచ్చ శివః పంథా బభూవ హ.* 43

దేవోపమపరాక్రముడు శ్రీరాము డా మరుభూమి కిట్లు వర మనుగ్రహించెను- 'ఈ మరుభూమి పశువుల కుపకరించును. ఇచ్చట రోగభయ ముండదు. ఫలమూలములు, రసస్నిగ్ధపదార్థములు, క్షీరములు, సుగంధములు, బహువిధములైన ఓషధులు, దీనిలో నిండియుండును.' ఇట్లు రాముడు వర మిచ్చుటచే ఆ ప్రదేశము గుణసంపన్నమై, ఎల్లరకు మంగళకరమగు మార్గమాయెను.

ఈ వరము అయాచితము.

## 44. విశ్వకర్మ > నలుడు (వానరుడు) యుద్ధకాండ 22

సముద్రుడు రామునితో విశ్వకర్మసుతుడైన నలుని శక్తియుక్తులు చెప్పుచుండెను.

కుక్షిస్థానము దగ్గరైన పిదప సముద్రుడు రామునితో నిట్లనెను-

*అయం సౌమ్య నలో నామ తనయో విశ్వకర్మణః,*
*పిత్రా దత్తవరః శ్రీమాన్ ప్రీతిమాన్ విశ్వకర్మణః.* 45

'రామచంద్రా! నీ యీ సేనలో నలుడను తేజస్వి యగు వానరు డున్నాడు. అతడు విశ్వకర్మపుత్రుడు. వానికి తండ్రి తన యంతగా శిల్పకళలో నిపుణు డగునట్లు వర మిచ్చెను. మహాత్మా! నీవును ఈ విశ్వమునకు విశ్వకర్మ వంటి స్రష్టవు. ఈ నలునికి నీ యందే ప్రేమాతిశయ మున్నది. ఇతడు మహోత్సాహి, శిల్పకళాసమర్థుడు. నాపై నితడు వంతెన నిర్మింపగలడు. నే నా వంతెనను ధరించి నిల్పెదను' ఇట్లు చెప్పి సముద్రు డంతర్హితుడయ్యెను. వానరుల సహాయముతో నలుడు వార్ధిపై వంతెన నిర్మింపదొడగెను.

తండ్రి విశ్వకర్మ తన తల్లి కిచ్చిన వరప్రభావమున తాను వంతెన నిర్మించుటలో సమర్థుడ నైతినని నలుడు స్వయముగా రామున కెరిగించెను.

వర మిచ్చుటకు గల కారణము చెప్పలేదు. ఇది బహుశా అయాచిత వరము.

## 45. విశ్వకర్మ > నలవానరుని తల్లి యుద్ధకాండ 22

నలుడు రామునితో తన వృత్తాంతము చెప్పుచుండెను.

'ప్రభూ! సముద్రుడు నన్ను గురించి చెప్పిన దంతయు నిజమే. నేను తండ్రిగారివలన గ్రహించిన శక్తియుక్తులతో సముద్రముపై వంతెన నిర్మించెదను. లోకములో కృతఘ్నులపై దండనీతి ప్రయోగించుటే అర్థసిద్ధిప్రద మని యందురు. అట్టి వారి పట్ల క్షమ, సాంత్వన, దానము వంటివి ప్రయోగింపదగవు. ఈ భయంకరుడగు సముద్రుడు కృతజ్ఞతతో గాక, దండమునకు వెరచి, సేతుబంధన మూహించి ఉపాయము నివేదించెను.

*మమ మాతుర్వరో దత్తో మందరే విశ్వకర్మణా,*
*మయా తు సదృశః పుత్రస్తవ దేవి భవిష్యతి.* 51

'మందరాచలమున నున్నప్పుడు మా తండ్రి విశ్వకర్మ మా తల్లితో 'నీకు నా వంటి పుత్రు డుదయించు' నని వర మిచ్చెను. నే నిట్లు విశ్వకర్మ

*ఏతేన సాహ్యం తు మహత్ కృతం శక్రస్య ధీమతా,*
*దేవాసురే జాంబవతా లబ్ధాశ్చ బహవో వరాః.* 12

దేవాసురసంగ్రామమున నీ ధీశాలి యింద్రుని కెంతయో సహాయపడి, అతనిచే నెన్నో వరము లందుకొనెను'.

ఇక్కడ చాల వరము లని మాత్రమే చెప్పబడెను. కాని అవి ఏమో తెలియజేయలేదు.

## 47. ? > కుంభకర్ణుడు యుద్ధకాండ 61

విభీషణుడు శ్రీరామునికి కుంభకర్ణునిగురించి చెప్పుచుండెను.

మహాకాయుడైన కుంభకర్ణుని పర్వతోన్నతశరీరమును, మహోజ్జ్వలకిరీటమును, సువర్ణభూషాదికమును చూచి వానరసేన భయవిహ్వాల మాయెను. రాముడు 'ఈ విశాలకాయుడైన వీరు డెవ' రని విభీషణు నడిగెను. దానికి విభీషణు డిట్లు బదులు చెప్పెను- 'ఇతడు విశ్రవసుని పుత్రుడగు కుంభకర్ణుడు. పూర్వ మితడు యుద్ధములో యమధర్మరాజును, దేవేంద్రుని కూడ నోడించెను. ఈతని వలె నొడ్డుపొడుగులు గల రాక్షసు డింకొక డీ లంకలో లేదు. వీనితో తలపడి దేవ దానవ యక్ష రాక్షస గంధర్వ నాగ విద్యాధర కిన్నరు లెన్నో సారులు యుద్ధములో నోడి పారిరి. ఉగ్రనేత్రుడైన ఈ వీరుడు శూలము చేత గొని యుద్ధరంగమున నిల్చినచో, ఇతనిని దేవతలైనను జయింపలేరు.

*ప్రకృత్యా హ్యేష తేజస్వీ కుంభకర్ణో మహాబలః,*
*అన్యేషాం రాక్షసేంద్రాణాం వరదానకృతం బలమ్.* 12

మహాబలుడును, తేజస్వియునైన ఈ కుంభకర్ణుని కీ బలపరాక్రమములు జన్మసిద్ధమైనవే కాని తక్కిన రాక్షసాధిపుల బలము వరదానమున లభించినట్టిది.'

ఆ వరము లేవో ఎవరి కెవ రిచ్చిరో చెప్పలేదు. 'వరదాన' మని మాత్రమే చెప్పబడినది.

## 48. బ్రహ్మ > అతికాయుడు యుద్ధకాండ 69

కుంభకర్ణుడు వధింపబడుటచే రావణు డత్యంత దుఃఖపీడితుడై విలపించుచుండగా, త్రిశిరు డతనితో నిట్లనెను- 'మహారాజా! ఈ విధముగా

కౌరసుడనై శిల్పకర్మలో అతనితో సమానుడనైతిని. అదుగనిదే నా శక్తిని గురించి నేను మీకు చెప్పజాలకపోయితిని. అట్లే ఇంతవరకు మౌనము వహించితిని. నా కీ సముద్రముపై వంతెన నిర్మించు సామర్థ్య మున్నది'

వర మిచ్చిన కారణము చెప్పలేదు. బహుశా అది అయాచితము.

నలుని తల్లి పేరేమో తెలియదు. బహుశా ఆమె ఘృతాచి యను నప్సరస కావచ్చును.

## 46. ఇంద్రుడు > జాంబవంతుడు యుద్ధకాండ 27

రావణుని మంత్రి సారణుడు. అతడు వేర్వేరు వానరయూథపులను గురించి రావణునికి చెప్పుచున్నాడు.

రాముడు సేనాసహితుడై సముద్రము దాటి వచ్చెను. అప్పుడు రావణుడు తన మంత్రులైన శుకసారణులను వానరసేనను చూచి రమ్మని పంపెను. వారు దొంగచాటుగా వానరసేనను నిరీక్షించుచుండిరి. కాని విభీషణుడు వారిని గుర్తించెను. వారిని బంధించి రాముని వద్దకు తెచ్చి- 'వీరు రావణుని గుప్తచరులని' చెప్పెను. ఆ రాక్షసు లిరువురు రాముని చూచి మిక్కిలి భయపడిరి. కాని రాముడు వారితో 'మీ నిరీక్షణకార్యము పూర్తియైనచో మీరు నిర్భయముగా పోవచ్చును. అట్లు పోయి రావణునికి నా సందేశముగా అత డే బలము నమ్మి సీత నపహరించెనో, ఆ బలముతో పాటుగా ఇప్పుడు బంధుమిత్రసేనాసహితుడై వచ్చి బలము చూపుమని చెప్పు' డని పలికెను. వానరయూథపతుల విస్తృతపరిచయము కలిగించుచు అతడు జాంబవంతుని గూర్చి ఇట్లు తెలిపెను-

'నీలమేఘావృతుడైన ఇంద్రుని వలె నాలుగువైపులను భల్లూకములతో నొప్పుచున్న ఆ యూథాధిపుడు ధూమ్రుడు. అతడు ఋక్షవంత మను పర్వతమున నిల్చి నర్మదాజలములు గ్రోలుచుండును. ఆ ధూమ్రుని తమ్ముడు జాంబవంతుడు. రూపమున అన్నవలె నున్నను పరాక్రమమున నతని కంటె మిన్న. ఇతడు శాంతస్వభావుడు. అన్నయు, గురుజనులును ఆదేశించినట్లు నడచుకొనును.

దుఃఖించుట శ్రేష్ఠపురుషుల లక్షణము కాదు. నీ వొక్కడవే మూడు లోకములను జయింప సమర్థుడవు. నీవద్ద బ్రహ్మదత్తములైన శక్తి, కవచము, ధనుర్బాణములు, మేఘగర్జనము పోలు ధ్వని కల రథము నున్నవి. నీ వొకే శస్త్రముతో నెన్నోసార్లు దేవదానవుల నోడించితివి. కనుక నీవు సర్వవిధ శస్త్రాస్త్రధరుడవై రణమున కేగినచో రాము నవలీలగా జయింపగలవు. అది నీ కిష్టము కాకున్నచో నీ విచటనే నిలువుము. నేను యుద్ధమున కరుగుదును. నేడు నాచేత చంపబడి రాముడు శాశ్వతముగా నిద్రించును.'

త్రిశిరుని మాటలు విని, దేవాంతకనరాంతకులు, మహాతేజస్వియైన అతికాయుడు, ముప్పురును యుద్ధమున కుత్సహించిరి. వీరు రావణుని పుత్రులు. ఇంద్రోపమపరాక్రమవంతులు. రణదుర్మదులు. దేవతలదర్ప మణచగలవారు.

*సర్వే సమరమాసాద్య న శ్రూయన్తే పరాజితాః,*
*దేవైరపి సగంధర్వైః సకిన్నరమహోరగైః.* 12

*సర్వేఽస్త్రవిదుషో వీరాః సర్వే యుద్ధవిశారదాః,*
*సర్వే ప్రవరవిజ్ఞానాః సర్వే లబ్ధవరాస్తథా.* 13

'దేవ గంధర్వ కిన్నర మహోరగబలములతో పోరాడి వీ రెన్నడు పరాజితులు కాలేదు. వీరందరు అస్త్రకోవిదులు. అందరును యుద్ధవిశారదులు, వీరులు, శస్త్రప్రయోగము, శాస్త్రజ్ఞానములలో ప్రజ్ఞ గడించినవారు. వీ రందరును వరము లందినవారే.'

వీరికి వరము లెవరిచ్చిరో, అందుకు కారణ మేమో, ఆ వరముల స్వరూప మెట్టిదో చెప్పబడలేదు. వరప్రాప్తి మాత్రము పేర్కొనబడినది.

### యుద్ధకాండ 71

యుద్ధములో వాలిపుత్రుడైన అంగదుడు నరాంతకుని, వాయుపుత్రుడైన హనుమంతుడు దేవాంతకుని వధించిరి. శత్రుభీకరమైన తన సేన వ్యథావికల మగుట అతికాయుడు గమనించెను. ఇంద్రతుల్యపరాక్రములైన తన సోదరులు గతించుట, పినతండ్రులైన మహోదర, మహాపార్శ్వులును రణరంగమున వధింపబడుటతో అతని కత్యధికమగు క్రోధ మావహించెను.

*చుకోప చ మహాతేజా బ్రహ్మదత్తవరో యుధి,*
*అతికాయోఽద్రిసంకాశో దేవదానవదర్పహా.* 3

అతనికి బ్రహ్మ యిచ్చిన వర మున్నది. విశాలపర్వతాకారుడైన ఆ వీరుడు దేవదానవుల దర్పమణప సమర్థుడు.

ఇక్కడ కూడ అతికాయునకు బ్రహ్మ యిచ్చిన వర మేదో చెప్పబడలేదు. కేవలము వర మిచ్చినట్లు మాత్రమే చెప్పబడినది.

అతికాయుని విరాట్ శరీరమును చూచి వానరులు భయగ్రస్తులై నలువంకలకు పారిపోదొడగిరి. వా రా యుద్ధక్షేత్రమున రాముని వద్ద చేరి శరణు పొందిరి. అతికాయుని విశాలకాయము చూచి రాము డాశ్చర్యపడెను. అతడు వానిని గురించి విభీషణు నడిగెను. అందుపై విభీషణు డిట్లు చెప్పెను. 'ఇతడు రావణుని పుత్రుడైన అతికాయుడు. బలములో రావణునితో సమానుడు. ఇతడు వేదశాస్త్రము లెరిగినవాడు, అస్త్రశస్త్రవేత్తలలో శ్రేష్ఠుడు.'

*ఏతేనారాధితో బ్రహ్మ తపసా భావితాత్మనా,*
*అస్త్రాణి చాప్యవాప్తాని రిపవశ్చ పరాజితాః.* 31

*సురాసురైరవధ్యత్వం దత్తమస్మై స్వయంభువా,*
*ఏతచ్చ కవచం దివ్యం రథశ్చ రవిభాస్వరః.* 32

'తపముచే విశుద్ధమైన మనస్సు కల యితడు దీర్ఘకాలము బ్రహ్మను ఆరాధించెను. బ్రహ్మ యితని కెన్నో దివ్యాస్త్రములు ప్రసాదించెను. వాని బలమున నిత డెందరో శత్రువులను జయించెను. బ్రహ్మ యితనికి దేవాసురులచే నవధ్యత్వము వరముగా నిచ్చెను. పైగా దివ్యకవచము, సూర్యసమానమైన తేజముకల రథమును కూడ ప్రసాదించెను.'

అతికాయునితో లక్ష్మణుడు యుద్ధము చేయుచు, అతనిని వధించుట కెన్నో అమోఘములగు బాణములు ప్రయోగించెను. కాని అవి ఆ రాక్షసుని శరీరమును ఛేదింపజాలకుండెను. ఆ సమయమున వాయుదేవుడు లక్ష్మణుని వద్దకు వచ్చి ఇట్లు చెప్పెను-

*బ్రహ్మదత్తవరో హ్యేష అవధ్యకవచావృతః,*

*బ్రాహ్మేణాస్త్రేణ భింధ్యేనమేష వధ్యో హి నాన్యథా,*
*అవధ్య ఏష హ్యన్యేషామస్త్రాణాం కవచీ బలీ.* 103

'ఈ రాక్షసునికి బ్రహ్మదత్తమగు వర మున్నది. అభేద్య మగు కవచము

ధరించినాడు. కనుక దానిని బ్రహ్మాస్త్రముచే ఛేదింపుము. ఈ కవచధారి నిశాచరవీరుడు వేరొక అస్త్రముచే వధింపబడడు.' అప్పుడు లక్ష్మణుడు మహావేగము కల బాణ మొకటి బ్రహ్మాస్త్రమంత్రముచే నభిమంత్రించి అతికాయునిపై ప్రయోగించగా అది అతనిని వధించెను.

ఈ వరము యాచితము. దివ్యకవచమును, తేజఃపూర్ణ మగు రథమును అనుగ్రహఫలముగా లభించినవి.

## 49. ఇంద్రుడు > శ్రీరాముడు యుద్ధకాండ 103

రామరావణయుద్ధములో రావణుడు రథము మీద నుండియు, రాముడు భూమిపై నిల్చియు బాణవర్షము కురిపించుచుండిరి. ఆకాశమున నిల్చి యీ యుద్ధము చూచుచున్న దేవ గంధర్వ కిన్నరాదులు తమలో నిట్లు చర్చింప దొడగిరి- 'రాముడు నేలపై నిల్చెను. ఆ రాక్షసుడు రథముపై నుండెను. ఇట్టి స్థితిలో ఈ యుద్ధము సమాన మెట్లగును?' ఈ మాటలు విని దేవేంద్రుడు మాతలిని పిలిచి 'సారథీ! నీవు నా రథము తీసికొని శీఘ్రముగా రాముని వద్ద కేగి, ఆ రథ మధిరోహించి దేవహిత మొనర్చుమని చెప్పు' మని పంపెను. అట్లే మాతలి వెంటనే రథము తీసికొని స్వర్గమునుండి భూమికి దిగి రాముని వద్ద కరిగి, నమస్కరించి అతనితో నిట్లనెను-

*సహస్రాక్షేణ కాకుత్స్థ రథోఽయం విజయాయ తే,*
*దత్తస్తవ మహాసత్త్వ శ్రీమన్ శత్రునిబర్హణ.* 14

*ఇదమైంద్రం మహచ్చాపం కవచం చాగ్నిసన్నిభమ్,*
*శరాశ్చాదిత్యసంకాశాః శక్తిశ్చ విమలా శివా.* 15

'శత్రుసూదనుడవైన రఘువీరా, మహాత్మా! సహస్రాక్షుడైన దేవరాజు ఇంద్రుడు నీ విజయమునకై యీ రథ మంపెను. ఇది ఇంద్రుని మహాధనువు. ఇది అగ్నిసంకాశమగు తేజముకల కవచము. ఇవి సూర్యునివలె ప్రకాశించు శరములు. ఇది మంగళకరమైన శక్తి. వీని నతడు నీ కొరకు పంపెను.'

'మహావీరా! నీ వీ రథ మధిరోహింపుము. నా సారథ్యమున నీవు, దేవేంద్రుడు దానవులను వధించినట్లు, యీ రావణుని వధింపుము.'

మాతలి వచనములు విని, రాము డా రథమునకు ప్రదక్షిణనమస్కారములు

గావించి దానిపై నధిరోహించెను.

ఇది వరదానమా, లేక యుద్ధవేళ రాముని కింద్రు డందించిన సహాయమా? వర మనుకొన్నచో ఇది అయాచితము. రథము, బాణములు, కవచము, శక్తి ఇవన్నియు అనుగ్రహసూచకములు.

యుద్ధకాండ 123

రావణవధయు, సీతాదేవి శీలపరీక్షార్థము అగ్నిలో జొచ్చి కుశలముగా వచ్చుటయు జరిగిన పిదప సంతుష్టుడై యింద్రుడు రామునియందు ప్రసన్నుడై 'నీ అభీష్టానుసారము వరము కోరుకొను' మని రామునితో ననెను. రాముడు ప్రసన్నుడై హర్షముతో నతని కిట్లనెను-

*యది ప్రీతిః సముత్పన్నా మయి తే విబుధేశ్వర,*
*వక్ష్యామి కురు మే సత్యం వచనం వదతాం వర.* 4

*మమ హేతోః పరాక్రాంతా యే గతా యమసాదనమ్,*
*తే సర్వే జీవితం ప్రాప్య సముత్తిష్ఠంతు వానరాః.* 5

*మత్కృతే విప్రయుక్తా యే పుత్రైర్దారైశ్చ వానరాః,*
*తాన్ ప్రీతమనసః సర్వాన్ ద్రష్టుమిచ్ఛామి మానద.* 6

*విక్రాంతాశ్చాపి శూరాశ్చ న మృత్యుం గణయంతి చ,*
*కృతయత్నా విపన్నాశ్చ జీవయైతాన్ పురందర.* 7

*మత్ప్రియేష్వభిరక్తాశ్చ న మృత్యుం గణయంతి యే,*
*త్వత్ప్రసాదాత్ సమేయుస్తే వరమేతమహం వృణే.* 8

*నీరుజో నిర్వ్రణాంశ్చైవ సంపన్నబలపౌరుషాన్,*
*గోలాంగూలాంస్తథర్క్షాంశ్చ ద్రష్టుమిచ్ఛామి మానద.* 9

*అకాలే చాపి పుష్పాణి మూలాని చ ఫలాని చ,*
*నద్యశ్చ విమలాస్తత్ర తిష్ఠేయుర్యత్ర వానరాః.* 10

'వక్తలలో శ్రేష్ఠుడవగు దేవవిభూ! నా యందు ప్రసన్నుడవైనచో నా ప్రార్థన మంగీకరింపుము. నాకొరకు యుద్ధమునకు వచ్చి, పరాక్రమము చూపి, యమలోక మరిగిన వానరుల నందరిని తిరిగి బ్రతికింపుము. మాననీయా!

నాకొరకు దారపుత్రాదులను విడిచి వచ్చినట్టి వారందరిని తిరిగి ప్రసన్నచిత్తులుగా చూడగోరుచున్నాను. దేవరాజా! వారు బలవంతులు, శూరవీరులు, మృత్యువును లక్ష్యము చేయనివారు. వారందరిని తిరిగి బ్రతికింపుము. నా కెప్పుడును ప్రియ మొనర్చుచుండినవారును, మృత్యువును సైతము లక్షింపనివారును నైన ఆ వీరులందరు తిరిగి నన్ను కలిసికొందురుగాక. మహనీయా! నే నా వానర గోలాంగూల ఋక్షవీరు లందరిని ఆరోగ్యవంతులుగా, వ్రణరహితులుగా, బలపౌరుష సంపన్నులుగా చూడగోరుదును. ఈ వానరు లే చోట నుందురో ఆ చోటున గల వృక్షలతాదికములు అకాలములో కూడ పుష్పఫలభరితములయి యుందునట్లును, అచ్చటి నదులు నిర్మలజలపూరితము లగునట్లును వర మిమ్ము.'

శ్రీరాముని కోరిక విని ఇంద్రుడు మహాప్రసన్నుడై 'నీవు కోరిన వరము చాల గొప్పది. కాని నే నాడిన మాట తప్పను. నీ కోరిక తప్పక సిద్ధించును.' అని పలికెను. *'వరమేతమహం వృణే'* అని రాముడు చెప్పినను, ఈ వరము అయాచితమే యగును. కారణము, ఇంద్రుడు స్వయముగా వచ్చి వర మడుగుమని కోరెను.

### యుద్ధకాండ 127

పదునాల్గేండ్ల వనవాసకాలమును పూర్తి చేసి శ్రీరాముడు భరద్వాజాశ్రమమునకు వచ్చి చేరెను. అత డా తపోధనునికి నమస్కరించి అయోధ్యను గురించి ప్రశ్నించెను. దాని కా ముని ఇట్లు బదు లిచ్చెను-

*యథా చ నిహతే తస్మిన్ రావణే దేవకంటకే,*
*సమాగమశ్చ త్రిదశైర్యథా దత్తశ్చ తే వరః.* 15
*సర్వం మమైతద్విదితం తపసా ధర్మవత్సల.*

'దేవకంటకుడైన రావణుని నీవు సంహరించిన పిదప, దేవతలు వచ్చి నిన్ను కలియుటయు, వారు నీకు వర మిచ్చుటయు, మున్నగు విషయము లన్నియు నేను తపోబలమున నెరిగితిని.'

ఈ వరమును, దేవేంద్రు డిచ్చిన వరమును ఒకటియేనా, వేరు వేరైనవా? దేవత లిచ్చిన వరము వేరుగా నుండవచ్చును. వర మొక్కటే అయినచో 'దేవతలు' అని బహువచనప్రయోగము కనిపించుచున్నది. వర

కేగుము.' అని అతడు పల్కెను. రాము డాతని వచనము శిరసా గ్రహించి, హర్షచిత్తుడై, అతని నిట్లు వర మడిగెను-

*అకాలఫలినో వృక్షాః సర్వే చాపి మధుస్రవాః,*
*ఫలాన్యమృతగంధీని బహూని వివిధాని చ.* 18
*భవంతు మార్గే భగవన్నయోధ్యాం ప్రతి గచ్ఛతః.* 19

'మహాత్మా! ఇచ్చటనుండి అయోధ్యవరకు గల మార్గములోని సమస్త వృక్షములును, అకాలమున గూడ ఫలించి, మధుస్రవములు, అమృతసుగంధ భరితములు నగునట్లును, అవి ఎన్నో రకములుగా, అత్యధికముగా లభించునట్లును వర మనుగ్రహింపుము.'

భరద్వాజుడు రాముని అభీష్ట మీడేర్చెను. అపుడు అచ్చటి వృక్షములు దేవవృక్షములవలె శోభించుచుండెను.

ఈ వర మయాచితము.

## 51. బ్రహ్మ > వైశ్రవణుడు (కుబేరుడు) ఉత్తరకాండ 3

రావణుని వంశము, జన్మము, వరప్రాప్తి మున్నగు విషయములు వినగోరిన రామునికి అగస్త్యు డవి వివరింపదొడగెను.

వైశ్రవణు డొక తపోవనమున వసించుచుండెను. ధర్మమే పరమగతి యని గ్రహించి, అత డుత్తమధర్మమార్గమున చరింప నిశ్చయించెను. అందుకై అతడు వనములో వేలాది వత్సరములు కఠోరనియమవ్రతుడై తపము చేసెను. అతని తపస్సునకు సంతోషించి ఇంద్రాదిదేవతాసహితముగా బ్రహ్మదేవు డాతని ఆశ్రమమునకు వచ్చి ఇట్లనెను-

*పరితుష్టోఽస్మి తే వత్స కర్మణానేన సువ్రత,* 14
*వరం వృణీష్వ భద్రం తే వరార్హస్త్వం మహామతే.* 15

'నాయనా, నీ తపమునకు సంతసించితిని. ఉత్తమవ్రతపాలనపూర్వక మగు నీ యీ తపస్సుచే నాకు సంతుష్టి కలిగెను. ఓ మహామతీ! నీకు మేలగుగాక. నీవు వరము గ్రహింప నర్హుడవు. నీకు కావలసిన వరము కోరుకొనుము' అని అతడు పలుకగా వైశ్రవణు డతనితో నిట్లనెను.

*భగవన్ లోకపాలత్వమిచ్ఛేయం లోకరక్షణమ్.* 16

'మహాత్మా! నేను లోకరక్షణము చేయ నెంచుచుంటిని. అందుకు తగినట్లుగా నేను లోకపాలకత్వమును కోరుచుంటిని.'

ఆ మాటలకు బ్రహ్మ సంతసించి ఇట్లనెను-

*అహం వై లోకపాలానాం చతుర్థం స్రష్టుముద్యతః.* 17
*యమేంద్రవరుణానాం చ పదం యత్తవ చేప్సితమ్,*
*తద్ గచ్ఛ బత ధర్మజ్ఞ నిధీశత్వమవాప్నుహి.* 18
*శక్రాంబుపయమానాం చ చతుర్థస్త్వం భవిష్యసి.*

*ఏతచ్చ పుష్పకం నామ విమానం సూర్యసన్నిభమ్.* 19
*ప్రతిగృహ్ణీష్వ యానార్థం త్రిదశైః సమతాం వ్రజ.*
*స్వస్తి తేఽస్తు........* 20

'నేను నాల్గవ లోకపాలకస్థానము కల్పింప నెంచితిని. ఇంద్రయమవరుణులకు వలెనే నీకును లోకపాలకత్వము లభించును. నీ కోరిక తీరును. ధర్మజ్ఞా! నీ వా పదవిని సంతోషముగా గ్రహింపుము. నిధీశ్వరుడ వగుము. ఇంద్రయమవరుణులతో పాటుగా నీవు నాల్గవ లోకపాలకుడుగా గుర్తింపబడుదువు. ఈ సూర్యసంకాశ మగు పుష్పకమను విమానమును వాహనముగా గ్రహించి తక్కిన దేవతలతో సమానుడ వగుము. నీకు శుభము.' వైశ్రవణుడు తానై బ్రహ్మను వర మడుగలేదు. బ్రహ్మ ప్రసన్నుడై వర మడుగుమని చెప్పగా, అత డప్పుడు తన కోరిక వినిపించెను. ఇట్లిది అయాచితవరము. నిధీశ్వరత్వము, పుష్పకయానము కూడ అత డడిగినవి కావు. బ్రహ్మయే స్వయముగా వాటి నతనికి ప్రసాదించెను. కనుక ఈ వర మయాచిత మనుట స్పష్టము. పుష్పకవిమానప్రాప్తి వరము కాదు. అనుగ్రహము.

## 52. శివుడు > సుకేశుడు ఉత్తరకాండ 4

శ్రీరాముని కోర్కెపై అగస్త్యు డతనికి రాక్షసవంశోత్పత్తిని గూర్చి చెప్పుచుండెను. ప్రజాపతియైన బ్రహ్మ పూర్వము సముద్రజలములను సృజించి వాటిని రక్షించుట కనేకవిధములైన జలజంతువులను కల్పించెను. అవి ఆకలిదప్పికలకు బాధచెంది, ఇప్పు డేమి చేయనగునని యెంచి, జన్మదాతయైన

బ్రహ్మవద్దకు పోయెను. 'మీరు జలములను ప్రయత్నపూర్వకముగా కాపాడుచుండు' దని బ్రహ్మ వాటితో చెప్పెను. ఆకలిదప్పికలచే పీడింపబడుచున్న ఆ జంతువులలో కొన్ని 'మే మీ జలములను రక్షించెద' మనగా మరికొన్ని మే మీ జలములను యక్షించె (పూజించె) దమని పల్కెను. రక్షించెద మన్న జీవులు రాక్షసులైరి. యక్షించెద మన్న జీవులు యక్షులైరి. అట్లేర్పడిన రాక్షసులలో హేతి, ప్రహేతి అను సోదరులు రాక్షసుల కధిపతులైరి. వారిలో ప్రహేతి ధర్మాత్ముడు. అత డప్పుడే తపోవనమునకు పోయి తపస్సు చేయదొడగెను. కాని హేతి కాలుని సోదరియగు మాయను వివాహమాడెను. వారికి విద్యుత్కేశు డను పుత్రుడు కల్గెను. అతడు యువకుడైన తరి, హేతి అతనికి సంధ్యాపుత్రియగు సాలకటంకటతో నుద్వాహ మొనర్చెను. శచీదేవేంద్రుల వలె విద్యుత్కేశసాలకటంకట లిర్వురును సుఖవిహారము చేయసాగిరి. మందరాచలముపై ఆ రాక్షసి ఒక తేజోవంతుడగు పుత్రుని కనెను. కాని ఆ బిడ్డ నక్కడనే, అట్లే విడిచి ఆమె పతితో విహరింపబోయెను. తల్లిచే విడువబడిన ఆ బిడ్డడు తన బొటనవ్రేలు చప్పరించుచూ ఏడ్వ సాగెను. ఒకసారి పార్వతీపరమేశ్వరులు వృషభవాహనారూఢులై వాయుమార్గమున చరించుచూ వచ్చి ఆ బిడ్డ ఏడ్పు వినిరి. వాని దయనీయమగు స్థితికి పార్వతిహృదయము కరుణాభరితమై చలించినది. ఆమె శంకరుని ప్రార్థించినది-

*తం రాక్షసాత్మజం చక్రే మాతురేవ వయఃసమమ్,*
*అమరం చైవ తం కృత్వా మహాదేవోఽక్షరోఽవ్యయః.* 29

శివు డా బిడ్డను, తల్లితో సమానవయస్కునిగా, తరుణునిగా చేసెను. అంతేగాక, పార్వతిని సంతోషింపజేయ నెంచి శివు డా బాలకుని కమరత్వ మిచ్చి, అతనికి ఆకాశసంచారియగు నగరము కల్పించి యిచ్చెను. ఈ విధముగా తల్లిచే విడువబడి, శివప్రసాద మందిన ఆ రాక్షసబాలకుడు సుకేశుడు. గగనసంచారి నగరాకార విమాన మతనికి శివుని అనుగ్రహమున లభించెను.

ఆకాశసంచారి నగరాకారవిమానము అనుగ్రహము; వరము కాదు.

*సుకేశం ధార్మికం దృష్ట్వా వరలబ్ధం చ రాక్షసమ్,*
*గ్రామణీర్నామ గంధర్వో విశ్వావసుసమప్రభః.* 1

సుకేశరాక్షసునికి వరము లభించుటయు, అతడు ధర్మబుద్ధి యగుటయు గమనించి, విశ్వావసుసమానతేజుడైన గ్రామణి యను గంధర్వుడు, తన కుమార్తె దేవవతి నాతని కిచ్చి వివాహ మొనర్చెను.

*వరదానకృతైశ్వర్యం సా తం ప్రాప్య పతిం ప్రియమ్,*
*ఆసీద్ దేవవతీ తుష్టా ధనం ప్రాప్యేవ నిర్ధనః.* 4

వరదానరూపమగు నైశ్వర్యము గల ఆ పతిని గాంచి దేవవతి నిర్ధనునకు ధనము లభించినట్లుగా మిగుల సంతసించినది.

ఈ వర మయాచితము.

చూ. బ్రహ్మ > మాల్యవంతుడు, సుమాలి, మాలి - వరక్ర. 54)

## 53. పార్వతి > రాక్షసి ఉత్తరకాండ 4

చూ. శివుడు > సుకేశుడు (వరక్ర. 52)

*ఉమయాపి వరో దత్తో రాక్షసీనాం నృపాత్మజ.* 30
*సద్యోపలబ్ధిర్గర్భస్య ప్రసూతిః సద్య ఏవ చ,*
*సద్య ఏవ వయఃప్రాప్తిః మాతురేవ వయఃసమమ్.* 31

పార్వతీదేవి కూడ 'నేటినుండి రాక్షసస్త్రీలకు సద్యోగర్భము, సద్యః ప్రసూతియు కలుగుననియు, ప్రసవించిన బిడ్డ అప్పుడే తల్లితో సమానవయస్సు పొందు ననియు' వర మిచ్చెను.

రాక్షసస్త్రీల కీ వరమును పార్వతి ఏ కారణమున నిచ్చెనో స్పష్టముగా తెలియలేదు. ఈ వర మయాచితము.

## 54. బ్రహ్మ > మాల్యవంతుడు, సుమాలి, మాలి ఉత్తరకాండ 5

అగస్త్యుడు శ్రీరాముని కోర్కెపై అతనికి రాక్షసవంశోత్పత్తి నెరిగించుచూ, సుకేశుడు, అతని పుత్రులు, వారి సంతతి మున్నగు విషయములు చెప్పుచుండెను.

సుకేశునకు దేవవతియందు మాల్యవంతుడు, సుమాలి, మాలి యగు ముగ్గురు కుమారులు కల్గిరి. వారు త్రేతాగ్నితేజస్కులు. (గార్హపత్య, ఆవహనీయ, దక్షిణాగ్ను లని అగ్నులు మూడు) తండ్రికి తపోబలముచే వరదానమూలమున ఐశ్వర్యము లభించినట్లు తెలిసినంతనే వారు ముగ్గురును మేరుపర్వతమున కరిగి, భయానకనియమము లేర్పరుచుకొని, ఘోరముగా తపస్సు చేయ నారంభించిరి. వారి తపస్సునకు సంతసించి బ్రహ్మ ప్రత్యక్షమై, 'మీకు వరము లీయ వచ్చితి' నని చెప్పెను. వా రతనికి నమస్కరించి యిట్లు పలికిరి-

*తపసాఽఽరాధితో దేవ యది నో దిశసే వరమ్,* 14
*అజేయాః శత్రుహంతారస్తథైవ చిరజీవినః.*
*ప్రభవిష్ణవో భవామేతి వరస్పరమనువ్రతాః,* 15
*ఏవం భవిష్యథేత్యుక్త్వా సుకేశతనయాన్విభుః.* 16

'దేవా! నీవు మా తపస్సుచే నారాధింపబడి సంతుష్టి జెందినచో, మా యందు కరుణించి మాకు అజేయత్వము, శత్రుహననము, చిరజీవితము, ప్రభావసంపన్నత, మాలో మాకు పరస్పరప్రీతియు వరముగా అనుగ్రహింపుము.' మీ కట్లే యగు నని వల్కి బ్రహ్మ నిష్క్రమించెను.

ఈ విధముగా వర మందుకొని ఆ రాక్షసులు నిర్భయులై దేవాసురులను మిక్కిలి బాధింపదొడగిరి. వారు విశ్వకర్మచే సువేలపర్వతాగ్రమున, ఈశ్వరుని కైలాసమునకు దీటైన నగర మొకటి నిర్మింపజేసికొనిరి.

బ్రహ్మ సంతోషించి స్వయముగా వచ్చి వర మిచ్చెను. అయినను సుకేశపుత్రులు వరప్రాప్తికొరకే తపస్సు చేసిరి. గనుక యీ వరము యాచిత మనదగినది.

### ఉత్తరకాండ 6

మాల్యవంతుడు మున్నగు రాక్షసులు ముప్పురును, తమ వందలాది పుత్రులతోపాటు, రాక్షసులను కూర్చుకొని బాహుబలగర్వముచే దేవ, ఋషి, నాగ, యక్షాదులను తరచు బాధింపదొడగిరి. వారిచే పీడింపబడిన దేవతలు తపస్విజనము భయవ్యాకులులై మహాదేవుని శరణు జొచ్చి ఇట్లు పలికిరి-

*సుకేశపుత్రైర్భగవన్ పితామహవరోద్ధతైః,*
*ప్రజాధ్యక్ష ప్రజాః సర్వా బాధ్యంతే రిపుబాధనైః.* 4

'భగవన్, ప్రజానాథా, బ్రహ్మగా రిచ్చిన వరముచే మదోన్మత్తులై సుకేశాత్మజులు శత్రుపీడాకరములగు సాధనములు గ్రహించి ప్రజ లెల్లరకు కష్టము కలిగించుచున్నారు. అంతేకాదు; వారు మా ఆశ్రమములను నాశము చేయుచున్నారు. దేవతలను స్వర్గమునుండి వెడలగొట్టి వారే అక్కడ అధికారము వహించి, దేవతలవలె స్వర్గవిహారము సలుపుచున్నారు. స్వామీ! మా కభయ మిచ్చి రౌద్రరూపము ధరించి దేవకంటకులైన ఆ రాక్షసులను సంహరింపుడు' అని వేడుకొనిరి.

వారి మాటలకు శంకరు డిట్లు బదులు పల్కెను- 'నేను సుకేశుని రక్షించితిని. వా రా సుకేశుని పుత్రులు. కనుక నేను వారిని వధింపను. కాని, ఆ రాక్షసులను సంహరింపగల వానిని నేను మీ కెరిగించెదను. నా మాటపై మీ రతని వద్ద కేగుడు. అతడు శ్రీమహావిష్ణువు. తక్షణమే పోయి అతనిని శరణు వేడుకొనుడు. అతడు వారిని తప్పక సంహరించును.' శివుని సలహాపై దేవతలు విష్ణువువద్ద కరిగి యిట్లు చెప్పిరి-

*సుకేశతనయైర్దేవ త్రిభిస్త్రేతాగ్నిసన్నిభైః,*
*ఆక్రమ్య వరదానేన స్థానాన్యపహృతాని నః.* 14

'త్రేతాగ్నిసమతేజులైన సుకేశతనయులు, వరదానగర్వితులై మమ్మాక్రమించి, మా మా స్థానము లపహరించిరి.'

'మా హితమునకై, మహాత్మా! నీ వా రాక్షసులను సంహరింపుము. స్వామీ! మా భయము నివారింపుము.'

విష్ణువు వారి కభయమిచ్చి 'మీరు నిశ్చింతగా నుండుడు. నేను వారిని వధించెద' నని చెప్పెను. దేవతలు చేసిన ఈ ప్రయత్న మంతయు మాల్యవంతునికి తెలిసెను. అతడు తన సోదరుల నిద్దరిని పిల్చి వారితో నిట్లనెను- దేవతలును, ఋషులును శంకరుని వద్దకు పోయి అతనితో నిట్లు చెప్పిరి-

*సుకేశతనయా దేవ వరదానబలోద్ధతాః,*
*బాధంతేఽస్మాన్ సముద్వృత్తా ఘోరరూపాః పదే పదే.* 15

'వరదానమదమత్తులై సుకేశాత్మజులు మమ్ము సదా బాధించుచున్నారు. అడుగడుగునను మేము వారిచే పీడింపబడుచున్నాము.' ఇట్లు చెప్పి వా రతనిని మనలను చంపుమని కోరిరి. కాని శంకరుడు స్వయముగా ఆ కార్యము చేయుట కంగీకరింపక వారి కొక ఉపాయ మెరిగించెను.' (విష్ణువు చేతిలో పరాజితులై రాక్షసులు రసాతల మేగిరి.)

ఉత్తరకాండలో ఈ క్రిందివిధముగా ఇది వర్ణింపబడెను-

*సుమాలీ వరలబ్ధాంస్తు జ్ఞాత్వా చైతాన్నిశాచరాన్,*
*ఉదతిష్ఠద్భయం త్యక్త్వా సానుగః స రసాతలాత్.* 11-1

రావణాదులకు వరములు ప్రాప్తమైనట్లు తెలిసి, సుమాలి తన అనుచరులతో కలిసి నిర్భయుడై రసాతలము వీడి బయటకు వచ్చెను.

## 55. బ్రహ్మ > విభీషణుడు ఉత్తరకాండ 10

అగస్త్యుడు రామునికి రావణుడు, అతని సోదరులును చేసిన తపస్సు, పొందిన వరములు మున్నగు వాటిని గురించి చెప్పుచుండెను.

రావణుడును, అతని సోదరులును జితేంద్రియులై వేర్వేరు ధర్మవిధులు గ్రహించి తపోనుష్ఠానము చేయుచుండిరి. విభీషణుడు అయిదువేల సంవత్సరములు ఒంటికాలిపై నిలిచి తపస్సు చేసెను. ఆ పిదప శిరసును, బాహుద్వయమును మీది కెత్తి నిల్చి స్వాధ్యాయపరాయణుడై అయిదువేలయేండ్లు సూర్యు నారాధించెను. అతని తపస్సునకు మెచ్చి బ్రహ్మ ప్రత్యక్షమై అతని కిట్లనెను-

*పరితుష్టోఽస్మి ధర్మాత్మన్ వరం వరయ సువ్రత.* 28

'ఓయి ధర్మాత్మా! సువ్రతా! సంతసించితిని. వరము వేడుకొనుము. నీ యందు పరితుష్టి జెందితిని. అభీష్ట మెరిగింపుము'.

అంత విభీషణుడు చేతులు జోడించి అతనితో నిట్లు విన్నవించెను- 'నీవు నాయందు ప్రసన్నుడవైనచో నేను కృతార్థుడను.'

*ప్రీతేన యది దాతవ్యో వరో మే శృణు సువ్రత,* 30
*పరమాపద్గతస్యాపి ధర్మే మమ మతిర్భవేత్.*

*అశిక్షితం చ బ్రహ్మాస్త్రం భగవన్ ప్రతిభాతు మే,* 31
*యా యా మే జాయతే బుద్ధిర్యేషు యేష్వాశ్రమేషు చ.*

*సా సా భవతు ధర్మిష్ఠా తం తం ధర్మం చ పాలయే.* 32
*ఏష మే పరమోదారో వరః పరమకో మతః.*

*న హి ధర్మానురక్తానాం లోకే కించన దుర్లభమ్.* 33

'నీవు నాయందు ప్రసన్నుడవైనచో, మహాత్మా! ఎట్టి ఘోరవిపత్తులో నైనను నా బుద్ధి ధర్మమును విడువకుండ నుండునట్లు వర మిమ్ము. నేర్వకుండగనే బ్రహ్మాస్త్రము నాకు సిద్ధించునట్లు అనుగ్రహింపుము. ఏ ఆశ్రమమును గూర్చిన ఏ యే ఆలోచన చేసెదనో, అది ధర్మానుకూల మగునట్లును, దానిని నే నాచరించునట్లును వరము ప్రసాదింపుము. ఇదే నా కన్నిటికన్న ఉత్తమమైన వరదానము. ధర్మానురక్తునకు దుర్లభ మేదియు లేదు.'

అని పల్కగా బ్రహ్మ సంతసించి విభీషణున కిట్లనెను-

*యస్మాద్రాక్షసయోనౌ తే జాతస్యామిత్రనాశన,*
*నాధర్మే జాయతే బుద్ధిరమరత్వం దదామి తే.* 35

'కుమారా! రాక్షసకులమున పుట్టినప్పటికిని నీ బుద్ధి అధర్మము వైపు మొగ్గలేదు. కనుక నేను నీకు అమరత్వము వరముగా నిచ్చుచున్నాను.'

బ్రహ్మ ప్రసన్నుడై విభీషణుని వర మడుగుమని కోరెను. కనుక అత డడిగిన వరము యాచితము కాదు. కాని, తపస్సు చేసి బ్రహ్మను మెప్పించుటలో విభీషణుని ముఖ్యోద్దేశ్యము వరప్రాప్తియే అని నిశ్చయించినను, అతనికి బ్రహ్మ ప్రసాదించిన అమరత్వము అయాచితమైన వరమే అనదగినది.

## 56. బ్రహ్మ > కుంభకర్ణుడు ఉత్తరకాండ 10

రావణాదిసోదరుల తపోవ్రతములను గూర్చియు, వరదానములను గూర్చియు శ్రీరామునికి అగస్త్యుడు వివరించుచుండెను.

రావణవిభీషణుల తపస్సునకు ప్రసన్నుడై బ్రహ్మ వారికి కోరిన వరము లిచ్చెను. పిదప నతడు కుంభకర్ణునికి వర మీయదలచి యేగెను. అప్పుడు

దేవతలు చేతులు జోడించి నిల్చి 'ప్రభో! కుంభకర్ణునికి వర మీయకుడు. వా డెట్టి దురాత్ముడైన రాక్షసుడో మీ రెరుగుదురు. వా డీ లోకము నెట్లు బాధించుచున్నదియు, నందనాదివనములను, అప్సరోగణమును, ఇంద్రుని, అతని అనుచరదశకమును, మునిమనుష్యగణమును ఎంతగా బాధించి, ఎంతమందిని భక్షించినదియు మీకు తెలియును. వరములు పొందకయే ఈ రాక్షసు డిట్లు క్రూరుడై ప్రాణికోటిని బాధించి భక్షించుచుండెను. వరము లందినచో వా డీ ముల్లోకములను మ్రింగివేయును. కనుక మీరు వరము నెపమున వానికి మోహము ప్రసాదింపుము. అట్లయినచో లోకకల్యాణమగును. వానిని కూడ సత్కరించినట్లగును.' అని చెప్పిరి.

దేవత లిట్లు చెప్పగా విని బ్రహ్మ సరస్వతిని స్మరించెను. వెంటనే ఆ దేవి వచ్చి అతని పక్కన నిలిచెను. 'నా కేమి యాజ్ఞ' అని ఆమె అడుగగా బ్రహ్మ 'నీవు కుంభకర్ణుని నాలుకపై నిల్చి దేవతల కనుకూల మగునట్లు వాని నోట పలికింపుము' అని చెప్పెను. ఆమె వెంటనే కుంభకర్ణుని నోటిలో ప్రవేశించెను. తర్వాత బ్రహ్మ ఆ రాక్షసునితో నిట్లనెను-

*కుంభకర్ణ మహాబాహో, వరం వరయ యో మతః.* *44*

'వీరా కుంభకర్ణా! నీ కభీష్టమైన వరము వేడుకొనుము.' అనగా కుంభకర్ణుడు-

*స్వప్తుం వర్షాణ్యనేకాని దేవదేవ మమేప్సితమ్.* *45*

'దేవదేవా! నే ననేకవత్సరములు నిద్రించుచుండ దలచెదను. ఇదే నా కోర్కె' అనెను. 'అట్లే యగు గాక' అని బ్రహ్మ దేవసహితుడై మరలి పోయెను. పిదప సరస్వతి వానిని విడిచిపోయెను. ఆమె విడిచిపోయినదే తడవుగా కుంభకర్ణునికి చైతన్యము కలిగెను, తా నట్టి విచిత్రవరము కోరినందుల కత డెంతగనో పశ్చాత్తాపమందెను.

ఈ వరవ మయాచితము.

## 57. శంకరుడు > రావణుడు ఉత్తరకాండ 16

అగస్త్యుడు రామునితో దశాననునికి 'రావణు' డను పేరెట్లు కల్గెనో, అతనికి శివునివలన వరము లెట్లు లభించెనో చెప్పుచుండెను.

శివుని పార్షదుడైన నందీశ్వరుని యెదుట రావణుడు అమర్యాదకరముగా ప్రవర్తించెను. ఉద్దండుడై మాట్లాడెను. దాని కతడు కోపించి శపించెను. కాని రావణుడు దానిని లక్ష్యపెట్టక కైలాసపర్వతముపైకి పోవదలచెను. శివపార్వతు లచ్చట విహరించుచుండిరి. పుష్పకవిమానము ముందు కేగలేదు. అందుపై రావణుడు ఆ పర్వతమును పెకలింపదలచి యూపెను. శంకరుడు తన కాలి బొటనవ్రేలితో నా పర్వతము నణచిపట్టెను. దాని క్రింద రావణుని బాహువులు చిక్కి నలిగి పోగా, రోషశోకాకులుడై రావణుడు గట్టిగా ఆర్తనాద మొనర్పసాగెను. అప్పు డతని మంత్రులు శివుని ప్రార్థింపు మని బోధించిరి. అప్పుడు శివునికి నమస్కరించి రావణు డెన్నో విధములుగా అతనిని మంత్రపూతముగా స్తుతించెను. ఇట్లతడు వేయేండ్లు కొండక్రింద నలిగి స్తోత్రపాఠ మొనర్చుచు నిల్చెను. అంత శివుడు ప్రసన్నుడై అతని బాహువులను విడిపించెను. 'దశాననా! నీవు పర్వతము క్రింద నణగిపోయి మహాభయంకరముగా ఆర్తరావ మొనర్చితివి కనుకను, ఆ రవము విని ముల్లోకములును భయకంపితమైనందుననూ, నీ వింక రావణు డని పేరు పొందెదవు' అని చెప్పి శివు డతనిని యథేచ్ఛగా పోవ ననుమతించెను. అప్పుడు రావణు డతనితో నిట్లనెను- 'మహాదేవా! నా యందు ప్రసన్నుడవైనచో నాకు కోరిన వర మనుగ్రహింపుము.'

*ప్రీతో యది మహాదేవ వరం మే దేహి యాచితః.* 40

'నేను నిన్ను వర మర్థించుచున్నాను. దేవ, గంధర్వ, దానవ, రాక్షస, గుహ్యక, నాగ, తదితర మహాబలశాలి వీరు లెవరిచేతను నాకు చావు లేనట్లు వర మిమ్ము. మానవుల నేనంతగా గణింపను. నా లెక్కకు వారు మిక్కిలి శక్తిహీనులు. నాకు బ్రహ్మవలన దీర్ఘాయువు వరముగా లభించెను. నా కోరిక యేమనగా-

*వాంఛితం చాయుషః శేషం శస్త్రం త్వం చ ప్రయచ్ఛ మే.* 43

బ్రహ్మ నా కొసగిన ఆయువులో మిగిలినభాగము కూడ (ఏ లోపము కలుగకుండగా) పూర్ణముగా లభించునట్లు, వర మనుగ్రహించి, నీవు నా కొక శస్త్రము ప్రసాదింపుము.' అని పలికెను. శంకరు డతనికి మహాదీప్తిమంతమైన చంద్రహాస మను ఖడ్గ మిచ్చి, మిగిలిన ఆయువును,' గతించిన భాగముతో కలిపి పూర్తిగా అనుభవించుటకు వర మిచ్చెను. 'ఈ ఖడ్గ మెప్పుడైనా నీచే తిరస్కరింపబడినచో అది అప్పుడే తిరిగి నా వద్దకు వచ్చి చేరును. ఇది

నిస్సంశయ' మని శివు డతనికి తెలియజేసెను.

ఈ వరము యాచితము. చంద్రహాసప్రాప్తి అనుగ్రహసూచకము.

## 58. ఇంద్రుడు > మయూరము ఉత్తరకాండ 18

అగస్త్యుడు రామునికి మరుత్తుని యజ్ఞమును గురించి చెప్పుచుండెను.

ఉశీరబీజ మను ప్రదేశమున మరుత్తను రాజు దేవతాసహితుడై యజ్ఞము చేయుచుండెను. బృహస్పతిసోదరుడును, ధర్మమర్మజ్ఞుడు నైన సంవర్తుడు యజ్ఞకార్యము నిర్వహించుచుండెను. ఇంతలో రావణు డచ్చటికి వచ్చెను. అతనిని చూడగనే భయాక్రాంతులై దేవతలు తిర్యగ్యోనిరూపములను పొంది దాగిరి. ఇంద్రుడు నెమలిని, యముడు కాకిని, కుబేరుడు తొండను వరుణుడు హంసను చేరి వాటిలో రూపాంతరము స్వీకరించిరి. తక్కిన దేవతలును ఇట్లే వేర్వేరు పశుపక్షులతో చేరి దాగిరి. అంత రావణు డా యజ్ఞవాటికలో ప్రవేశించి మరుత్తునితో నిట్లనెను- 'నాతో యుద్ధము చేయుము. లేదా పరాజయ మంగీకరింపుము.' మరుత్తు రావణుని చూచి 'నీ వెవర' వని అడిగెను. రావణుడు తన పరిచయ మెరిగించి తన పరాక్రమాదుల నెక్కువగా పొగడి చెప్పుకొనెను. మరుత్తు రోషావేశమున నతనితో యుద్ధము చేయుటకు లేచెను. కాని సంవర్తమహర్షి అతని నాపి 'యజ్ఞదీక్ష గైకొనిన పిదప యుద్ధమునకు పోరాదనియు, మాహేశ్వరయజ్ఞ మట్లు మధ్యలో విడిచినచో, అది నీ కుల మంతయు నశింపజేయు'నని యు చెప్పెను. పైగా, యుద్ధములో జయాపజయము లెప్పుడును సంశయాస్పదములే అనియు, ఆ వచ్చిన రాక్షసు డజేయు డనియు చెప్పి అతనిని నివారించెను. మరుత్తు యుద్ధవిముఖు డాయెను. రావణు డతనిని పరాజితుడని భావించగా శుకు డంత రావణుడు జయించెనని చాటించెను. అక్కడకు వచ్చి చేరిన మహర్షులను భక్షించి రావణు డచ్చట నుండి పృథ్వీపరిభ్రమణమునకు వెడలిపోయెను. రావణుడు వెడలిపోయిన పిదప దేవేంద్రాది దేవతలు తిరిగి తమ తమ నిజ రూపములతో ప్రకటమై, తమ కాశ్రయ మిచ్చిన ఆ పశుపక్షులకు వరము లొసగిరి.

*హర్షాత్తదాబ్రవీ దింద్రో మయూరం నీలబర్హిణమ్,*
*ప్రీతోఽస్మి తవ ధర్మజ్ఞ భుజంగాద్ధి న తే భయమ్.* 22

*ఇదం నేత్రసహస్రం తు యత్తద్ బర్హే భవిష్యతి,*
*వర్షమాణే మయి ముదం ప్రాప్స్యసే ప్రీతిలక్షణమ్.* 23

ఇంద్రుడు సహర్షముగా నీలబర్హమైన నెమలిని చూచి యిట్లనెను- 'ధర్మజ్ఞా! నీయందు నేను ప్రసన్నుడనైతిని. నీ కిక ఎప్పుడును సర్పభయ ముండదు. నా యీ సహస్రనేత్రములకు సమానముగా నీ పింఛములు నేత్రరూపమున వెలుగును. నేను మేఘుడనై వర్షించునపుడు నీకు మిక్కిలి ఆనందమగును.' అని యింద్రుడు నెమలికి వర మిచ్చెను.

ఈ వరదానమునకు పూర్వము నెమలికి నీలిరంగు పింఛములే యుండెడివి. కాని యింద్రుడు వర మిచ్చిన పిదప అవి నేత్రయుక్తము లైనవి.

ఈ వర మయాచితము.

59. యముడు > కాకి ఉత్తరకాండ 18

అగస్త్యుడు రామునికి మరుత్తుని యజ్ఞమును గూర్చి చెప్పుచుండెను. చూ.మీద వర్ణించిన వరము, ఇంద్రుడు>మయూరము (వర.క్ర. 58)

*ధర్మరాజోఽబ్రవీద్రామ ప్రాగ్వంశే వాయసం ప్రతి,*
*పక్షింస్తవాస్మి సుప్రీతః ప్రీతస్య వచనం శృణు.* 26

*యథాన్యే వివిధై రోగైః పీడ్యంతే ప్రాణినో మయా,*
*తే న తే ప్రభవిష్యంతి మయి ప్రీతే న సంశయః.* 27

*మృత్యుతస్తే భయం నాస్తి వరాన్మమ విహంగమ,*
*యావత్త్వాం న వధిష్యంతి నరాస్త్వావద్భవిష్యసి.* 28

*యే చ మద్విషయస్థా వై మానవాః క్షుధయార్దితాః,*
*త్వయి భుక్తే సుతృప్తాస్తే భవిష్యంతి సబాంధవాః.* 29

అటు పిమ్మట యముడు ప్రాగ్వంశపు (హవిర్గృహమునకు తూర్పున యజమానుడు, అతని భార్య నివసించుటకు నిర్మితమైన గృహము) పై కప్పుపై కూర్చున్న కాకిని చూచి యిట్లనెను. 'ఓ పక్షీ! నీయందు నాకు ప్రీతి కలిగినది. నా ప్రీతికి ఫలముగా ఇక మీద అన్యులను బాధించునట్టి ఏ

విధమైన రోగములును నిన్ను బాధింపవు. నీ కిక మృత్యుభయము కూడ లేదు. ఇది నా వరము. లోకులు నిన్ను వధింపకుండ నున్నంతవరకు నీకు మృత్యువు కల్గదు. నా రాజ్య మగు యమలోకమున నుండి ఆకలిచే పీడింపబడుచున్నవారు, భూలోకమున నున్న వారి బంధువులు నీకు భోజనము పెట్టినచో, ఆ బంధుజనముతో కూడ సంతృప్తులగుదురు.'

ఈ వర మయాచితము.

60. వరుణుడు > హంస ఉత్తరకాండ 18

అగస్త్యుడు రామునికి మరుత్తు యజ్ఞగాథ వివరించుచుండెను.
చూ. ఇంద్రుడు > మయూరము. (వర క్ర. 58)

*వరుణస్త్వబ్రవీద్ధంసం గంగాతోయవిచారిణమ్,*
*శ్రూయతాం ప్రీతిసంయుక్తం వచః పత్రరథేశ్వర.* 30

*వర్ణో మనోరమః సౌమ్యశ్చంద్రమండలసన్నిభః,*
*భవిష్యతి తవోదగ్రః శుద్ధ ఫేనసమప్రభః.* 31

*మచ్ఛరీరం సమాసాద్య కాంతో నిత్యం భవిష్యసి,*
*ప్రాప్స్యసే చాతులాం ప్రీతిమేతన్మే ప్రీతిలక్షణమ్.* 32

ఆ వెనుక గంగాజలవిహారమొనర్చుచున్న హంసను చూచి వరుణు డిట్లనెను-

'ఓ పక్షిరాజా! నా యీ ప్రీతివచనము వినుము. నీ శరీరవర్ణము చంద్రమండలమువలె, స్వచ్ఛ ఫేనమువలె పరమోజ్జ్వల కాంతిమయము, సౌమ్యము, మనోహరము నగును. నా శరీరరూపమైన జలమునందు నిలచి నీవెల్లప్పుడు కాంతిమంతుడవై అత్యంతహర్షమును పొందగలవు. ఇది నా ప్రీతికి చిహ్నము.

పూర్వకాలమున హంసలు పూర్తిగా తెల్లగా నుండెడివి కాదు. వాని రెక్కల చివరిభాగములు నీలవర్ణముగను, రెండు భుజముల మధ్యభాగము నూతన దూర్వాదళవర్ణముగను, అగ్రభాగము కోమలమై శ్యామలవర్ణముతోను నుండెడిది.

ఈ వర మయాచితము.

## 61. కుబేరుడు > తొండ ఉత్తరకాండ 18

అగస్త్యుడు రామునికి మరుత్తుని యజ్ఞమునుగూర్చి చెప్పుచుండెను.
చూ. ఇంద్రుడు > మయూరము (వర క్ర. 58)

*అథాబ్రవీద్ వైశ్రవణః కృకలాసం గిరౌ స్థితమ్,*
*హైరణ్యం సంప్రయచ్ఛామి వర్ణం ప్రీతస్తవాప్యహమ్.* 34

*సద్రవ్యం చ శిరో నిత్యం భవిష్యతి తవాక్షయమ్,*
*ఏష కాంచనకో వర్ణో మత్ప్రీత్యా తే భవిష్యతి.* 35

పిదప, కుబేరుడు గుట్టపైనున్న తొండను చూచి యిట్లనెను - ఓయీ, నీయందు నేను ప్రసన్నుడనైతిని. తత్ఫలముగా నీకు సువర్ణసంకాశమగు సుందర వర్ణ మనుగ్రహించుచున్నాను. నీ శిరస్సు సదా సువర్ణాభమై అక్షయరూపమందును, నా ప్రీతికి చిహ్నముగా నీ యీ నల్లరంగు బంగారురంగుగా మారును.

ఈ వర మాయాచితము.

## 62. బ్రహ్మ > నివాతకవచులు ఉత్తరకాండ 23

అగస్త్యుడు రామునికి రావణుని పరాక్రమమును గూర్చి చెప్పుచుండెను.

యమధర్మరాజు నోడించి రావణుడు మారీచాదిరాక్షసులతో కలిసి పుష్పకముపై రసాతల మేగదలచి సముద్రమున ప్రవేశించెను. అక్కడ నాగరాజైన వాసుకి భోగవతిలో నుండెను. రావణుడు వాసుకిని, బలమైన నాగులను జయించెను. అచ్చటినుండి హర్షోన్మత్తుడై అతడు మణిమయ మను పురము చేరెను.

*నివాతకవచాస్తత్ర దైత్యా లబ్ధవరా వసన్.* 6

అక్కడ వరలాభ మందిన నివాతకవచులను దైత్యులు వసించుచుండిరి. రావణు డచ్చటి కేగి వారందరిని యుద్ధమునకు పిల్చెను. వారితో జరిగిన ఆ యుద్ధ మొక సంవత్సరకాలమైనను జయాపజయములు నిశ్చయింపబడలేదు. అప్పుడు బ్రహ్మదేవుడు విమానముపై అక్కడకు వచ్చి ఆ దైత్యులతో నిట్లనెను - 'ఓ దైత్యవీరులారా! దేవాసురులందరును కలిసియైనను రావణుని జయింపలేరు. అట్లే దేవదానవు లందరును కలిసి వచ్చినను మిమ్ము జయింపలేరు.

కనుక మీ రీ రాక్షసునితో సంధి చేసికొనుడు.' అప్పు డక్కడ అగ్నిసాక్షిగా రావణునికి నివాచకవచులతో సంధి జరిగెను.

ఈ వరస్వరూపము స్పష్టముగా లేదు. వరమిచ్చినట్లు మాత్ర ముల్లేఖింప బడినది.

## 63. రుద్రుడు > మాంధాత ఉత్తరకాండ - ప్రక్షిప్త 3

అగస్త్యుడు రామునికి రావణమాంధాతల యుద్ధమునుగురించి చెప్పుచుండెను.

అనేక ప్రదేశములలో యుద్ధములు జయించి రావణుడు సోమలోకమునకు వెళ్లెను. అక్క డతని కెందరో పుణ్యాత్ము లు కనిపించిరి. పర్వతముని అతనికి వారిని గురించి వివరించెను. వారు యుద్ధము కోరరు. స్వర్గము కోరెదరు. అయితే మరి యుద్ధకాంక్షు లెవరు? అని రావణు డడుగగా, అతడు మాంధాత పేరు చెప్పెను. రావణు డతనిని యుద్ధములో జయింపదలచి పోవుచుండగా, మార్గమధ్యముననే సముద్రవలయిత సప్తద్వీపములను జయించి వచ్చుచున్న మాంధాత అతని కెదురాయెను. రావణుడతనిని యుద్ధమునకు పిలిచెను. 'నీకు జీవితముపై ఆశ లేకున్నచో నాతో యుద్ధమునకు తలపడుము' అని మాంధాత బదులాడెను. పిదప ఆ యిరువురికి ఘోరయుద్ధ మాయెను. ఇద్దరును ఎన్నో రకముల శస్త్రాస్త్రములు ప్రయోగించిరి. అపుడు మాంధాత తన మనస్సులో దివ్యమగు పాశుపతాస్త్రమును స్మరించెను. ఆమహాస్త్రమును చూచి ఎల్ల ప్రాణులును భయకంపితులైరి.

*వరదానాత్తు రుద్రస్య తపసారాధితం మహత్,*
*తతః సంకంపతే సర్వం త్రైలోక్యం సచరాచరమ్,* 54
*దేవాః సంకంపితాః సర్వే లయం నాగాశ్చ సంగతాః.* 55

తపస్సుచే రుద్రుని మెప్పించి మాంధాత ఆ మహాస్త్రమును సంపాదించెను. దానిని చూచి సచరాచరముగా మూడు లోకములు భయకంపితములైనవి. దేవతలు భయపడిరి. నాగులు నశింపదొడగిరి.

మునిశ్రేష్ఠులైన పులస్త్యగాలవులు తమ సమాధియోగబలమున నిది యంతయు తెలిసికొనిరి. వారు వచ్చి రాజును శాంతింపజేసిరి. రావణుని పెద్దగా నిందించి యుద్ధవిముఖుని జేసిరి.

ఇక్కడ వరప్రాప్తి మాత్రము చెప్పబడినది. కాని రుద్రుడిచ్చిన వరము స్పష్టముగా వర్ణింపబడలేదు. తపోబలమున సంపాదించినది గనుక ఈ వరము యాచితము. (ఈ సర్గ గీతాప్రెస్ వారి ప్రతిలో లేదు)

## 64. మహేశ్వరుడు > మేఘనాధుడు ఉత్తరకాండ 25

అగస్త్యుడు రామునికి మేఘనాదునికి మహేశ్వరునివలన లభించిన వరములనుగూర్చి చెప్పుచుండెను.

ఖరాసురునితో శూర్పణఖను దండకారణ్యములో నివసింప బంపి రావణుడు నికుంభిలయను ఉద్యానమునకు పోయెను. అతని వెంట నెందరో అనుచరు లుండిరి. అక్కడ ఆ సమయమున మరొక యజ్ఞము జరుగుచుండెను. రావణుని పుత్రుడు మేఘనాదుడు నల్లటి జింకతోలు కట్టుకొని కమండలము, శిఖ, ధ్వజము ధరించియుండెను. అతని వద్ద కరిగి, కౌగిలించుకొని రావణు డతని నిట్లడిగెను- 'వత్సా నీ విది యేమి చేయుచున్నావు? స్పష్టముగా తెలియుజేయుము.'

యజ్ఞనియమము ననుసరించి మేఘనాదుడు మౌనము వహించెను. కాని పురోహితుడైన శుక్రాచార్యుడు రావణునితో నిట్లనెను- 'రాజా, నీ కుమారుడు ఎంతో విస్తారములగు యజ్ఞములు ఏడువరకు సంకల్పించి ఆచరించెను. అవి ఏమనగా అగ్నిష్టోమము, అశ్వమేధము, బహుసువర్ణకము, రాజసూయము, గోమేధము, వైష్ణవము, మహేశ్వరము ననునవి.

*మహేశ్వరే ప్రవృత్తే తు యజ్ఞే పుంభిః సుదుర్లభే,*
*వరాంస్తే లబ్ధవాన్ పుత్రః సాక్షాత్ పశుపతేరిహ.* 9
*కామగం స్యందనం దివ్యమంతరిక్షచరం ధ్రువమ్,*
*మాయాం చ తామసీం నామ యయా సంపద్యతే తమః.* 10
*ఏతయా కిల సంగ్రామే మాయయా రాక్షసేశ్వర,*
*ప్రయుక్తయా గతిః శక్యా న హి జ్ఞాతుం సురాసురైః.* 11
*అక్షయావిషుధీ బాణైశ్చాపం చాపి సుదుర్జయమ్,*
*అస్త్రం చ బలవద్రాజన్ శత్రువిధ్వంసనం రణే.* 12

*ఏతాన్ సర్వాన్ వరాంల్లబ్ధ్వా పుత్రస్తేఽయం దశానన,*
*అద్య యజ్ఞసమాప్తౌ చ త్వాం దిదృక్షన్ స్థితో హ్యహమ్.* 13

ఇది ఏడవదైన మహేశ్వరయజ్ఞము. దీని నితరు లనుష్ఠింపలేరు. ఈ అనుష్ఠాన మారంభించినందున నీ కుమారునికి సాక్షాత్ పరమేశ్వరునివలన ఎన్నో వరములు లభించెను. పైగా స్వేచ్ఛాగమనము గల రథము, తామసి యను మాయ లభించినవి. ఆ మాయచే అంధకార ముత్పన్నమగును. రాక్షసేశ్వరా, ఆ మాయాప్రయోగముచే యుద్ధములో దేవాసురులకైనను ప్రయోగించినవాని గతివిధానము లెరుగరాదు. రాజా, బాణభరితములైన అక్షయతూణీరములు, అవంధ్యమగు ధనువు, శత్రువిధ్వంసకరములగు ఎన్నో అస్త్రములు నీ పుత్రునికి లభించినవి. దశాననా, నీ కుమారు డిట్లు సకల మనోభీష్టములను బడసి, నే డీ యజ్ఞము పూర్తి చేసి నిన్ను దర్శింపదలచినాడు' అని చెప్పెను.

రావణునికి మేఘనాదు డొనర్చిన యీ కార్య మంతగా నచ్చలేదు. కారణ మేమనగా యజ్ఞాహుతులద్వారా అతనికి శత్రువులైన ఆ ఇంద్రాది దేవతలే పూజింపబడుచుందురు. అయినను కుమారునికి లభించిన వరములు విని అతడు సంతుష్టి చెందెను.

వరప్రాప్తికై యొనర్చిన యజ్ఞము గనక లభించిన ఈ వరములు యాచితములు. వాస్తవమునకు గగనచారిరథము, అక్షయతూణీరములు, అవంధ్య ధనువు మున్నగునవి వరదానములు కావు. అవి అనుగ్రహరూపములు. కాని వాల్మీకి వీటిని స్పష్టముగా వరములనియే పేర్కొనెను.

## 65. బ్రహ్మ > మేఘనాదుడు ఉత్తరకాండ 30

అగస్త్యుడు రామునితో మేఘనాదునికి ఇంద్రజిత్తు అను పేరెట్లు వచ్చినదో, అతనిచేత చెరబెట్టబడిన ఇంద్రుని విడిపించుటకై బ్రహ్మ అతని కెట్టి వరము లీయవలసివచ్చినదో వివరించి చెప్పుచుండెను.

రావణుని కుమారుడు మేఘనాదుడు బలవంతుడై యింద్రుని జయించి బంధించి లంకకు తెచ్చెను. అప్పుడు దేవత లందరును బ్రహ్మతో కలిసి లంకకు వచ్చిరి. పుత్ర సహోదర పరివృతుడై కొలువున్న రావణుని వద్ద కేగి

బ్రహ్మ సౌమ్యముగా వానికి నచ్చచెప్పుచు నిట్లనెను- 'వత్సా, రావణా! యుద్ధములో నీ కుమారుని వీరత్వమునకు నేను చాల సంతసించితిని. అతని పరాక్రమము నిన్ను పోలినదే గాక నిన్ను మించినది. నీవు నీ పరాక్రమముచే మూడులోకములు జయించితివి. నీ ప్రతిజ్ఞ చెల్లినది కనుక పుత్రసహితుడవగు నీయందు నేను చాల ప్రసన్నుడనైతిని.'

*అయం చ పుత్రోఽతిబలస్తవ రావణ వీర్యవాన్,*
*జగతీంద్రజిదిత్యేవ పరిఖ్యాతో భవిష్యతి.* 5

'రావణా, మహాబలశాలియైన యీ నీ కుమారుడు నేటినుండి ఇంద్రజిత్తు అను పేరున ప్రపంచవిఖ్యాతు డగును.'

'రాజా, ఈతడు మిక్కిలి బలవంతుడు, దుర్జయుడు. ఇతని సాహాయ్యమున నీ వింద్రుని లొంగదీసికొంటివి. ఇక నీ వింద్రుని విడిచి పెట్టుము. బదులుగా నీకు దేవత లేమి ఈయవలెనో తెల్పుము.' అనగా దానికి బదులుగా ఇంద్రజిత్తు స్వయముగా నిట్లు పలికెను-

*అమరత్వమహం దేవ వృణే యద్యేష ముచ్యతే.* 8

'మహాత్మా, ఇంద్రుని విడువ వలె నన్నచో దానికి బదులుగా నే నమరత్వము కోరుచుంటిని.'

అనగా బ్రహ్మ అతని కిట్లనెను --

*నాస్తి సర్వామరత్వం హి కస్యచిత్ ప్రాణినో భువి.* 4

'భూతలమునగల పశుపక్షులకు గాని మహాతేజస్వులైన మానవులకుగాని మరే యితరప్రాణులకుగాని అమరత్వము సిద్ధింపజాలదు.'

బ్రహ్మ చెప్పినది విని మేఘనాదు డిట్లనెను-

*శ్రూయతాం యా భవేత్సిద్ధిః శతక్రతువిమోక్షణే,*
*మమేష్టం నిత్యశో హవ్యై ర్మంత్రైః సంపూజ్య పావకమ్,*
*సంగ్రామమవతర్తుం చ శత్రునిర్జయకాంక్షిణః* 19
*అశ్వయుక్తో రథో మహ్యముత్తిష్ఠేత్తు విభావసోః,* 20
*తత్స్థస్యామరతా స్యాన్మే ఏష మే నిశ్చితో వరః.*

*తస్మిన్ యద్యసమాప్తే చ జప్యహోమే విభావసౌ,*
*యుద్ధ్యేయం దేవ సంగ్రామే తదా మే స్యాద్వినాశనమ్.* 21

'ఇంద్రుని విడిచిపెట్టవలె నన్నచో నాకు వేరొక వరము దయచేయుడు. నేను యుద్ధములో విజయము కోరి మంత్రయుక్తముగా ఆహుతు లిచ్చి అగ్ని నారాధించినపుడు నా కగ్నినుండి దివ్యరథమును దివ్యాశ్వములును లభింపవలెను. నే నా రథముపై నున్నంతవరకు నన్నెవరును చంప శక్తులు కారాదు. ఇది నా నిశ్చితవరము. ఇంకను-

*సర్వో హి తపసా దేవ వృణోత్యమరతాం పుమాన్,*
*విక్రమేణ మయా త్వేతదమరత్వం ప్రవర్తితమ్.* 15

దేవా, అందరును తపస్సు చేసి అమరత్వము పొందుచున్నారు .కాని నేను పరాక్రమమువలన అమరత్వము పొందదలచుచున్నాను.

బ్రహ్మ 'అట్లే' అని పలికిన మీద ఇంద్రజిత్తు ఇంద్రుని విడిచిపెట్టెను.

యుద్ధకాండ 44

రాక్షసవానరుల మధ్య ఘోరయుద్ధము జరుగుచుండగా అంగదుడు ఇంద్రజిత్తును మిక్కిలి భంగపరచి బాధించెను. అత డా రాక్షసుని సారథిని, గుర్రములను చంపివేసెను. దానితో అతడు మరింతగా కోపించెను. ఈ సందర్భమున అతనికి బ్రహ్మ యిచ్చిన వర ముగ్గడింపబడెను-

*సోఽంతర్ధానగతః పాపో రావణీ రణకర్శితః,*
*బ్రహ్మదత్తవరో వీరో రావణిః క్రోధమూర్ఛితః.* 34

రావణపుత్రుడైన ఆ వీరుడు బ్రహ్మచే వరము పొందినవాడు. యుద్ధములో భంగపడుటతో ఆ పాపాత్ముడైన యింద్రజిత్తు క్రోధమూర్ఛితుడై అంతర్ధానమయ్యెను.

ఆపై మాయావృతుడై సమస్తజీవులకు అదృశ్యుడై, కూటయుద్ధమునకు దిగి ఆ రాక్షసుడు రామలక్ష్మణులను మోహమున ముంచి నాగాస్త్రముచే వారిని బంధించెను.

## యుద్ధకాండ 22

నాగపాశముచే బంధింపబడిన రామలక్ష్మణులను వారి మిత్రుడైన గరుడుడు విడిపించెను. ఇది చూచి వానరులు హర్షోల్లాసభరితులై మునుపటి వలెనె తిరిగి గర్జించుచు వీరాలాపము లాడజొచ్చిరి. వానరుల ఈ తుముల నినాదము విని రావణుడు చింతాకులచిత్తు డయ్యెను. తన చింతాభయములను తెలియజేయుచూ ఇంద్రజిత్తు పొందిన వరము నత డిట్లు ప్రస్తావించెను.

*ఘోరైర్దత్తవరైర్బద్ధౌ శరైరాశీవిషోపమైః,*
*అమోఘైః సూర్యసంకాశైః ప్రమథ్యేంద్రజితా యుధి.* 15

'విషసర్పములవలె భయంకరములు, సూర్యునివలె ప్రకాశమానములు, వరప్రభావమున నమోఘములు నగు బాణములతో ఇంద్రజిత్తుచే బంధింపబడియు నా శత్రువు లా అస్త్రబంధమునుండి విముక్తులైరి. నే నిప్పుడు నా సకల సైన్యమును సంశయాపన్నుడనై చూచుచున్నాను.'

ఈ వర మెవ రిచ్చిరో యిచ్చట స్పష్టముగా చెప్పలేదు. ఇంద్రజిత్తు బ్రహ్మ నడిగిన వరములో రథము పేర్కొనబడెను. కాని బాణములు పేర్కొనబడలేదు. మహేశ్వరయజ్ఞము సమాప్తమైనప్పు డతనికి ధనుర్బాణములు వరరూపమున లభించినట్లు యుద్ధకాండము 7వ సర్గలో నున్నది.

చూ. వర్క. 42 ? > మేఘనాదుడు

## యుద్ధకాండ 72

లక్ష్మణునిచేత అతికాయుడు వధింపబడినట్లు విని రావణుడు ఉద్విగ్నమనస్కుడై యిట్లనెను-

*తౌ భ్రాతరౌ తదా బద్ధౌ ఘోరైర్దత్తవరైః శరైః,*
*యన్నశక్యం సురైః సర్వైరసురైర్వా మహాబలైః.* 6

'బలపరాక్రమవిఖ్యాతుడైన నా కుమారుడు మేఘనాదుడు ఆ అన్నదమ్ము లిద్దరును వరప్రాప్తములైన నాగపాశములతో బంధించెను. ఆ బంధనమును సమస్తదేవతలు గాని మహాబలులైన అసురులుగాని విడిపింపలేరు. అయినను, దేనివలన వారట్లు విముక్తులయిరో తెలియకున్నది.'

యుద్ధకాండ 73

శ్రీరాముడు లక్ష్మణునితో పలుకుచు ఇంద్రజిత్తునకు లభించిన బ్రహ్మాస్త్రమునుగూర్చి భయము వెల్లడించెను.

ఇంద్రజిత్తు తన తండ్రి రావణునివద్ద ఘోరముగా ప్రతిజ్ఞ చేసి యిట్లు పలికెను- 'నే నీ దినము రామలక్ష్మణుల శరీరములను నా బాణములతో ఛిన్నాభిన్న మొనర్చెదను. అతడు వానరులను తన బాణవర్షమున ముంచి వారి శరీరములను ముక్కలు ముక్కలుగా చేసెను. అతని బాణసమూహముచే వానరసేన వ్యథావికల మాయెను.

*సుగ్రీవం ఋషభం చైవ సోఽంగదం ద్వివిదం తథా,* 48
*ఘోరైర్దత్తవరైస్తీక్ష్ణై ర్నిష్ప్రాణానకరోత్తదా.* 49

వరదానప్రాప్తములైన అసంఖ్యాకములగు బాణములతో ఇంద్రజిత్తు సుగ్రీవుని, ఋషభుని, అంగదుని, ద్వివిదుని చచ్చిపడియుండునట్లు కొట్టెను. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణునితో నిట్లనెను-

*స్వయంభువా దత్తవరో మహాత్మా*
*సమాహితోఽంతర్హితభీమకాయః,*
*కథం ను శక్యో యుధి నష్టదేహో*
*నిహంతుమద్యేంద్రజిదుద్యతాస్త్రః.* 69

బ్రహ్మ యిచ్చిన వరబలమున ఈ రాక్షసవీరు డిట్లు మనలను నొప్పించుచున్నాడు. బ్రహ్మవరమున నితడు తాను సావధానుడై తన భీమకాయమును మరుగుపరచెను. అతని శరీరము కానరాదు. అతని బాణములు మాత్రము మనకు తగులుచున్నవి. ఈ స్థితిలో వాని నెట్లు చంపనగును?

యుద్ధకాండ 80

రామలక్ష్మణులను వధించెద నని ప్రతిజ్ఞచేసి వచ్చిన మేఘనాదుడు అత్యద్భుతమగు శిలావృష్టివంటి బాణవృష్టి కురిపించెను. ఈ సందర్భమున నిట్లు వర్ణింపబడినది.

*స రామం సూర్యసంకాశైః శరైర్దత్తవరైర్భృశమ్,*
*వివ్యాధ సమరే క్రుద్ధః సర్వగాత్రేషు రావణిః.* 28

సంగ్రామరంగమున క్రోధోద్రేకము కలవాడై యింద్రజిత్తు వరలబ్ధములైన సూర్యసంకాశబాణసమూహముతో రాముని సర్వాంగములను గాయపరచెను.

### యుద్ధకాండ 85

'ఇంద్రజిత్తు మేము చూచుచుండగనే శోకార్తయగు సీతను వధించెను.' అని హనుమంతుడు చెప్పగా విని శోకాతిరేకమున రాముడు మూర్ఛిల్లెను. విభీషణుని కీ వార్తలోని సత్యము సందేహ మనిపించెను. వానరుల మహోగ్ర పరాక్రమమును అదుపుచేయుటకు మేఘనాదు డీ మాయ కల్పించి మాయ సీతను వధించియుండు నని అత డూహించెను. అతడు రామునితో ఈ కల్లవార్తపై శోకసంతాపములు తగవనియు, వాటిని విడిచి ధైర్యము వహింపదగు ననియు ప్రార్థించి చెప్పెను. సీతను విడిపించుటకు, రాక్షసులను వధించుటకు పూనుకొనదగునని ప్రోత్సహించెను. అంతేగాక, ప్రస్తుతము నికుంభిల కేగిన యింద్రజిత్తును ముట్టడించి జయించుటకు వానరసేనాసహితముగా లక్ష్మణు నచ్చుటకి పంపదగునని చెప్పి, నికుంభిలలో హోమ మొనర్చినచో మేఘనాదుడు అందరినీ సంహరింపగలడని కూడ చెప్పెను.

విభీషణునకు ఇంద్రజిత్తు బ్రహ్మవద్ద వరముగా బ్రహ్మాస్త్రము, ఆకాశచారి రథము మున్నగునవి పొందెనని తెలియును. అందుచే నతడు రాముని కా వరములను గూర్చి యిట్లు చెప్పెను-

*నికుంభిలామసంప్రాప్తమకృతాగ్నిం చ యో రిపుః,*
*త్వామాతతాయినం హన్యాదింద్రశత్రోః స తే వధః.* 14
*వరో దత్తో మహాబాహో సర్వలోకేశ్వరేణ వై,*
*ఇత్యేవం విహితో రాజన్ వధస్తస్యైష ధీమతః.* 15

'మహాత్మా! సర్వలోకేశ్వరుడైన బ్రహ్మ యింద్రజిత్తునకు వరమిచ్చుచు ఇట్లు చెప్పెను. ఇంద్రజిత్తా! నికుంభిల యను వటవృక్షమువద్దకు చేరి హోమకార్యమును పూర్తిచేయుటకు పూర్వమే నిన్నెదిరింపవచ్చిన శస్త్రధారియగు శత్రువుచేతిలో నీకు మరణము కలుగును. కనుక రామచంద్రా! ఇట్లే మేఘనాదుని వధ కుపాయముగ ముందే నిశ్చయింపబడినది.

వధ వరదాన మనబడదు. ఎవడును తన వధనుగూర్చి వర మడుగడు. ఎవనియందైనను ప్రసన్నులైన దేవత లతని కమంగళకరముగా నీ వీ విధముగా వధింపబడుదువని వరమియ్యరు. కనుక సహజముగానే యీ విషయము తర్కయుక్త మనిపించదు. కాగా ఈ వరదానమున కర్థమేమనగా, ఒకానొక విశిష్టపరిస్థితిలో, ఒకానొక నియమమునకు లోబడి వధ జరుగును. కాని తక్కిన యప్పుడు కాదు. ఆ విశిష్టస్థితిని విడిచినచో అమరత్వమే. బ్రహ్మ, యిదే విధమైన వరమొకటి సుందోపసుందుల కిచ్చెను.

ఈ సందర్భమున నీ వరదానము యాచితమా అయాచితమా అని కూడ చెప్పబడదు. ఇంద్రుని బంధముక్తుని చేయదలచి వచ్చిన బ్రహ్మకు మేఘనాధునికి నడుమ జరిగిన వార్తాలాపము వ్యావహారికము. ఇది ఇచ్చిపుచ్చుకొను ధోరణిలోనే నడచినది. బ్రహ్మ స్పష్టముగనే యింద్రుని విడచుటకు బదులుగా నీకేమి ఈయవలెను? అని అడిగెను. అప్పుడు మేఘనాదు డమరత్వ మర్థించెను. భూతలవాసులకు అమరత్వ మసంభవమని బ్రహ్మ చెప్పగా మేఘనాదుడు రెండవకోరికగా ఒకానొక విశిష్టపరిస్థితిలో మృత్యువును, తక్కినయప్పు డమరత్వమును కలుగవలె ననెను. వివశుడై బ్రహ్మ అతని కా వర మిచ్చెను.

తపస్సు చేసి, దేవతలను మెప్పించి వర మందుకొనునట్టి సాధారణ పద్ధతి ఇంద్రజిత్తునకు నచ్చలేదు. స్వీయపరాక్రమము చూపి వర మందగలనను అహంకార మతనిలో నెలకొనెను. ఇక్కడ *'మదాయత్తం తు పౌరుషమ్'* అని కర్ణుడు పల్కిన మాటలు స్మరింపదగినవి.

## 66. సూర్యుడు > సుమేరువు ఉత్తరకాండ 35

శ్రీరాముడు హనుమంతుని చరిత్రము వినగోరెను. అప్పు డగస్త్యు డతనికా చరిత్రమంతయు వినిపించెను. ఆ సందర్భములో హనుమంతుని బాల్యావస్థను వర్ణించుచు నతడిట్లు చెప్పెను.

శ్రీరాముడు వాలిని, రావణుని సాటిలేని బలవంతులని యెంచినను, హనుమంతుని వారిద్దరి కన్న బలవంతుడని భావించెను. పైగా, శౌర్యము, దక్షత, ధైర్యము, బలము, బుద్ధిశక్తి, నీతి, పరాక్రమము, ప్రభావసంపద మున్నగు సద్గుణములెన్నో హనుమంతునిలో నున్నవి. కనుక ఈ విషయమున రామునికి నిజ మెరుగుటకు ఉత్సాహము కలిగెను.

అప్పు డగస్త్యుడు రామునితో నిట్లనెను - 'రఘువీరా! బల, బుద్ధి, వేగములలో హనుమంతునికి సాటి యనదగినవా రెవ్వరూ లేరు. కాని కొందరు మునులు పూర్వ మొకప్పు డతనికి బలమున్నను ఆ సంగతి అతనికి తెలియకుండు నట్లు శాపమిచ్చిరి. బాల్యములో నత డొనర్చిన మహాకార్యము వర్ణింపనలవికానిది.

*సూర్యదత్తవరస్వర్ణః సుమేరుర్నామ పర్వతః.* 19

సూర్యభగవాను డిచ్చిన వరమువలన సుమేరుపర్వతము సువర్ణమయ మయ్యెను. హనుమంతుని తండ్రి కేసరి ఈ పర్వతమున రాజ్య మేలుచుండెను.అతని భార్య అంజన. వాయుదేవుని వరమున నామెకు జన్మించిన పుత్రు డే హనుమంతుడు. అంజన ఒకనాడు ఫలములు కోయనెంచి ఆశ్రమమును వీడి గహనారణ్యమధ్యమున కేగినది. ఆకలితో నున్న శిశువైన హనుమంతునికి అప్పుడే ఎర్రగా ఉదయించుచున్న సూర్యబింబము కనిపించెను. దాని నతడు ఫలమని భావించి పట్టుకొనదలచి ఎగిరెను. మహావేగముతో ఎగిరి వచ్చుచున్న హనుమంతుని చూచి దేవదానవయక్షాదు లందరు విస్మితులైరి.

సూర్యుడు సుమేరువున కే కారణమున వరమిచ్చెనో చెప్పలేదు. వరప్రాప్తి మాత్రమే చెప్పబడినది.

## 67. ఇంద్రుడు > హనుమంతుడు — ఉత్తరకాండ 36

పలువురు దేవతలచే హనుమంతునికి లభించిన వరములను గురించి అగస్త్యుడు రామునికి వివరించుచుండెను.

సూర్యుని పట్టుకొని తిన నెంచి తీవ్రగతితో నెగిరి హనుమంతు డేగిన దినముననే రాహువు సూర్యుని గ్రసింపదలచి వచ్చెను. అతడు సూర్యుని రథోపరిభాగమున నుండునంతలో హనుమంతు డతని నంటెను. అతడు భయపడి ఇంద్రుని వద్ద కేగి క్రోధముతో నిట్లనెను- 'నాకు సూర్యచంద్రులను ఆకలి తీర్చుకొనుటకు సాధనముగా నిర్ణయించి యిచ్చి, యిప్పుడు వారిని వేరొకరి కేల యిచ్చినారు. ఇదెట్లు జరిగెను? నే డమావాస్య. నేను సూర్యుని పట్టబోయితిని. కాని మరియొక రాహువు వచ్చి హఠాత్తుగా సూర్యునాక్రమించెను.' రాహువు మాటలు విని దేవేంద్రుడు కళవళ పడి రాహువును ముందుంచుకొని

హనుమంతుడు సూర్యు నందుకొనబోవుచున్న చోటికి తక్షణమే వెళ్లి చూచెను. ఇంతలో హనుమంతుడు రాహువునే ఫలమనుకొని పట్టుకొనబోయెను. రాహువు భయపడి ఇంద్రుని వెనుక చేరెను. అప్పు డింద్రుడు వానరబాలకునిపై వజ్ర ప్రహార మొనర్చెను. వజ్రాఘాతము వలన హనుమంతు డొక కొండ శిఖరముపై పడిపోయెను. అట్లు పడుటతో అతని కుడిముట్టె విరిగి పోయెను. వజ్రముచే కొట్టబడి క్రింద పడిన హనుమంతుని చూచి వాయుదేవునకు ఇంద్రునిపై కోపము వచ్చెను. అతడు వెంటనే శ్వాసప్రశ్వాసగతులు బంధించి, తన కుమారు నెత్తుకొని పర్వతగుహలోనికి పోయి కూర్చొనెను. ఊపిరి సలుపక సమస్తప్రాణులును విలవిలలాడ జొచ్చిరి. వెంటనే దేవ, గంధర్వ, దానవ, మానవులందరూ బ్రహ్మ వద్దకు పరుగెత్తి పోయి, ఆ వచ్చిన ఆపదను తొలగింపుమని ప్రార్థించిరి. అది విని వారందరితో కలిసి బ్రహ్మ వాయుదేవుని వద్దకు వచ్చెను. మూర్ఛిల్లి పడిన బిడ్డను ఒడిలో పెట్టుకొని కూర్చొనియున్న వాయువును చూచి బ్రహ్మ జాలిపడెను. అతడు తన చేతితో వాయువును లేవనెత్తి, హస్తస్పర్శచే హనుమంతుని మూర్ఛదేర్చి నిలుపగా వాయువు సంతసించి తిరిగి సంచరింపదొడగెను. తర్వాత వాయువునకు ప్రీతి కల్పింప నెంచి బ్రహ్మ తక్కిన దేవతలతో నిట్లు వల్కెను- 'ఇంద్రాగ్ని వరుణ కుబేర మహాదేవాదులారా, మీ రెరిగిన విషయమైనను, నేను మీకు మీ హితమెంచి చెప్పుచున్నాను. ఈ బాలకునివలన భవిష్యములో మీ కార్యము లెంతగనో సిద్ధించును. కనుక వాయువు సంతసించునట్లు మీరందరును ఈ బాలకునకు వరములు ప్రసాదింపుడు.

*తతః సహస్రనయనః ప్రీతియుక్తః శుభాననః,*
*కుశేశయమయీం మాలాముత్క్షిప్యేదం వచోఽబ్రవీత్.* 10

*మత్కరోత్సృష్టవజ్రేణ హనురస్య యథా హతః,*
*నామ్నా వై కపిశార్దూలో భవితా హనుమానితి.* 11

*అహమస్య ప్రదాస్యామి పరమం వరమద్భుతమ్,*
*ఇతఃప్రభృతి వజ్రస్య మమావధ్యో భవిష్యతి.* 12

అప్పుడు సహస్రాక్షుడైన దేవేంద్రుడు ప్రసన్నవదనుడై, బాలహనుమంతుని మెడలో కమలముల మాల తొడిగి యిట్లు వల్కెను- 'నా చేతి వజ్రముచే హనువు భగ్నమైనందున నిక మీద ఈ బాలుడు హనుమంతుడని ప్రసిద్ధికి

వచ్చును. మరియొక అద్భుతమేమనగా, ఇది మొదలు వీనిని నా వజ్రము బాధింపదు దానికి ఇత డవధ్యు డగును.

ఈ వరమయాచితము

## 68. సూర్యుడు > హనుమంతుడు ఉత్తరకాండ 36

అగస్త్యుడు రామునికి వేర్వేరు దేవతలవలన హనుమంతునికి లభించిన వరములను గూర్చి చెప్పసాగెను.

చూ. వర. క్ర. 67 ఇంద్రుడు > హనుమంతుడు.

*మార్తండస్త్వబ్రవీత్తత్ర భగవాం స్తిమిరాపహః,*
*తేజసోఽస్య మదీయస్య దదామి శతికాం కలామ్.* 13

*యదా చ శాస్త్రాణ్యధ్యేతుం శక్తిరస్య భవిష్యతి,*
*తదాస్య శాస్త్రం దాస్యామి యేన వాగ్మీ భవిష్యతి,*
*న చాస్య భవితా కశ్చిత్ సదృశః శాస్త్రదర్శనే.* 14

అంధకారనాశకుడైన సూర్యభగవానుడు,'నా తేజములో నూరవ అంశము నే నితని కిచ్చుచున్నాను. అదిగాక, ఇతడు శాస్త్రాభ్యాసమునకు తగిన శక్తి యుక్తుడైనప్పుడు నేనితనికి శాస్త్రజ్ఞానము ప్రసాదించెదను. దానిచే నితడు మంచి వక్తయగును. శాస్త్రజ్ఞానమున నితనితో సమానులుండరు' అని చెప్పెను.

ఈ వరము అయాచితము.

## 69. వరుణుడు > హనుమంతుడు ఉత్తరకాండ 36

అగస్త్యుడు రామునికి దేవతలు హనుమంతుని కిచ్చిన వరములను వివరించుచున్నాడు.

చూ. వర.క్ర. 67 ఇంద్రుడు < హనుమంతుడు

*వరుణశ్చ వరం ప్రాదాన్నాస్య మృత్యుర్భవిష్యతి,*
*వర్షాయుతశతేనాపి మత్పాశాదుదకాదపి.* 15

బాలహనుమంతునికి వర మిచ్చుచు వరుణు డిట్లు వల్కెను- 'వదిలక్షల

యేండ్లు వయసు దాటినను, ఇతనికి నా పాశమువలన గాని, జలములవలన గాని మృత్యువు సంభవింపదు.

ఈ వర మయాచితము.

70. యముడు > హనుమంతుడు ఉత్తరకాండ 36

అగస్త్యుడు రామునికి హనుమంతునికి లభించిన వరములను గూర్చి చెప్పుచుండెను.

చూ. వర.క్ర. 67 ఇంద్రుడు < హనుమంతుడు

*యమో దండాదవధ్యత్వమరోగత్వం చ దత్తవాన్,*
*వరం దదామి సంతుష్ట అవిషాదం చ సంయుగే.* 16

హనుమంతునికి వరమిచ్చుచు యముడిట్లు పలికెను- 'ఇతడు నా దండముచే వధింపబడడు. ఇతని కే రోగమును అంటదు. యుద్ధములో నితని కెప్పుడును అలసట కలుగదు.'

ఈ వర మయాచితము.

71. కుబేరుడు > హనుమంతుడు ఉత్తరకాండ 36

అగస్త్యుడు రామునితో హనుమంతునికి ఆ యా దేవతలిచ్చిన వరములను గురించి చెప్పుచుండెను.

చూ. వర.క్ర.67 ఇంద్రుడు > హనుమంతుడు

*గదేయం మామికా నైనం సంయుగేషు వధిష్యతి,*
*ఇత్యేవం ధనదః ప్రాహ తదా హ్యేకాక్షి పింగళః.* 17

ఒక కంటిలో పింగళవర్ణమేర్పడిన కుబేరదిక్పాలుడు - నా గదచే ఈ హనుమంతునికి మృత్యువు కలుగ దని వరమిచ్చెను.

ఇది అయాచితమైన వరము.

72. శంకరుడు > హనుమంతుడు ఉత్తర -36

హనుమంతునికి దేవతలిచ్చిన వరములను గురించి అగస్త్యుడు రామునితో చెప్పుచుండెను.

చూ. వర.క్ర.67 - ఇంద్రుడు > హనుమంతుడు

*మత్తో మదాయుధానాం చ అవధ్యోఽయం భవిష్యతి,*
*ఇత్యేవం శంకరేణాపి దత్తో ఽస్య వరమో వరః.* 18

'ఇతడు నా చేతను, నా ఆయుధములచేతను కూడ వధింపబడడు, అని శంకరుడు హనుమంతునికి వరమిచ్చెను.

ఈ వర మయాచితము.

## 73. విశ్వకర్మ > హనుమంతుడు ఉత్తరకాండ 36

అగస్త్యుడు రామునికి హనుమంతుడు పొందిన వరములను వివరించు చుండెను.

చూ. వర.క్ర.67 ఇంద్రుడు > హనుమంతుడు

*విశ్వకర్మా చ దృష్ట్వేమం బాలసూర్యోపమం శిశుమ్,*
*శిల్పినాం ప్రవరః ప్రాదాద్వరమస్య మహామతిః.* 19
*మత్కృతాని చ శస్త్రాణి యాని దివ్యాని తాని చ,*
*తైరవధ్యత్వమాపన్నశ్చిరజీవీ భవిష్యతి.* 20

శిల్పిశ్రేష్ఠుడైన విశ్వకర్మ బాలసూర్యుని వలె వెలుగుచున్న శిశువు హనుమంతుని చూచి 'నాచే నిర్మితములైన దివ్యాస్త్రములలో నేదియు నితనిని వధింపదు, ఇతడు చిరంజీవి యగును అని వరమిచ్చెను.

## 74. బ్రహ్మ > హనుమంతుడు ఉత్తరకాండ 36

అగస్త్యుడు రామునికి వివిధదేవతల వలన హనుమంతునికి లభించిన వరములనుగూర్చి వివరించుచుండెను.

చూ. వర.క్ర.67 - ఇంద్రుడు > హనుమంతుడు

*దీర్ఘాయుశ్చ మహాత్మా చ బ్రహ్మా తం ప్రాబ్రవీద్వచః,*
*సర్వేషాం బ్రహ్మదండానామవధ్యోఽయం భవిష్యతి.* 21

బ్రహ్మదేవుడు బాలహనుమంతునికి వరమిచ్చుచు ఇతడు దీర్ఘాయువు,

*గంగాతీరే మయా దేవి ఋషీణామాశ్రమాన్ శుభాన్,*
*శీఘ్రం గత్వా తు వైదేహి శాసనాత్ పార్థివస్య నః.* 8

దేవీ! నీవు ఋష్యాశ్రమములకు పోవ నెంచి మహారాజును వరమడిగితివి. మహారాజు నిన్నా ఆశ్రమములకు పంపుటకు ప్రతిజ్ఞచేసెను. దేవీ! రాజాజ్ఞ ననుసరించి శీఘ్రమే ఋష్యాశ్రమములకు తోడ్కొనిపోయి నిన్నచ్చట విడిచెదను.

శ్రీరాము డడుగగా సీత తన కోరిక తెలియజేసెను కనుక ఈ వర మయాచితము. ఇక్కడ వరశబ్దము ప్రయోగింపబడినను వాస్తవమునకు సీత కోరిక నెరిగి ఈ కార్యమంతయు కపటముగానే జరుపబడినది. ఆమె కన్యాయమే జరిగినది. నిజమున కీ వరము శాపమైనది.

## 76. దేవతలు > నిమిచక్రవర్తి ఉత్తరకాండ 57

రాముడు లక్ష్మణునికి నిమిచక్రవర్తి వృత్తాంతము చెప్పుచుండెను.

*చూ. శాప.50 - వసిష్ఠుడు > నిమి*

వసిష్ఠుని శాపముచే నిమిచక్రవర్తి తన దేహమునుండి విడివడెను. మునులే స్వయముగా దీక్ష గైకొని అతని యజ్ఞమును పూర్తిచేసిరి. ఆ శ్రేష్ఠ మహర్షులు పురజనులు, సేవకులు కలిసి నిమిశరీరమును సుగంధపుష్పవస్త్రాదులతో కప్పి, సుగంధతైలకటాహమున భద్రపరచిరి. యజ్ఞము పూర్తియైన పిదప, భృగుమహర్షి ఇట్లు పల్కెను.

*ఆనయిష్యామి తే చేత స్తుష్టోऽ స్మి తవ పార్థివ.* 12

మహారాజా, నేను నీయందు ప్రసన్నుడను, కనుక నీవు కోరినచో తిరిగి నీ శరీరమును నేను చైతన్యవంత మొనర్చెదను.

*సుప్రీతాశ్చ సురాః సర్వే నిమేశ్చేతస్తదాబ్రువన్,*
*వరం వరయ రాజర్షే క్వ తే చేతో నిరూప్యతామ్.* 13
*ఏవముక్తః సురైః సర్వైర్నిమేశ్చేతస్తదాబ్రవీత్,*
*నేత్రేషు సర్వభూతానాం వసేయం సురసత్తమాః.* 14
*త్వత్కృతే చ నిమిష్యంతి చక్షూంషి పృథివీపతే,*
*వాయుభూతేన చరతా విశ్రామార్థే ముహుర్ముహుః.* 15

భృగునితో పాటుగా తక్కిన దేవతలు కూడ మిక్కిలి ప్రసన్నులై నిమి యొక్క జీవాత్మతో నిట్లనిరి - 'రాజర్షివరా, నీ జీవచైతన్యము నెక్కడ నిలుపవలెనో నీవే కోరుకొనుము.' ఇట్లడిగిన దేవతలతో నిమి జీవాత్మ యిట్లనెను - 'దేవోత్తములారా, నేను సమస్తప్రాణికోటిలోను వారి నేత్రాంచలమున నివసింపగోరెదను' ఆ మాట విని దేవతలు సంతసించి యిట్లు పలికిరి - 'నీవు వాయురూపమున సమస్తప్రాణుల నేత్రములయందును విహరించుచుందువు. రాజా, అట్లు విహరించు నీకు అలసట కలిగినపుడెల్ల విశ్రమింపదగినట్లు ప్రాణుల కనురెప్పలు మాటిమాటికి మూతపడుచుండును'

ఇట్లు చెప్పి దేవతలు వెళ్లిపోయిరి. ఋషులు నిమిశరీరమును గ్రహించి, దానిపై అరణి నుంచి గట్టిగా మథించిరి. మునుపటివలెనే మంత్రములు ఉచ్చరించుచు హోమము చేయసాగిరి. వారతనికి పుత్రోత్పత్తి కావలెనని యెంచి యట్లు చేయగా నిమిశరీరమునుండి మహాతపస్వియగు మిథి జన్మించెను.

ఈ వర మయాచితము. దేహత్యాగ మొనర్చిన జీవాత్మ కీ వర మీయబడుట. విశేషము.

## 77. రుద్రుడు > మధుదైత్యుడు ఉత్తరకాండ 61

ఒకసారి భార్గవచ్యవనాదిమునులు శ్రీరాముని చూడవచ్చిరి. అతడు వారందరికిని స్వాగతసత్కారములు నెరపి వారటకు వచ్చిన కారణ మడిగెను. అప్పుడు చ్యవనుడు లవణాసురునిచే పీడింపబడుచున్న మహర్షుల దుఃస్థితిని వర్ణించి, వాని నెట్టైన కడతేర్చి మునులను కాపాడవలెనని రామునితో చెప్పెను.

కృతయుగమున మధు వను నొక దానశీలియగు దైత్యు డుండెను. అతడు బ్రాహ్మణభక్తుడు. శరణాగతవత్సలుడు. దేవతలతో నతనికి గాఢమైన మైత్రి యుండెను.

*న మధుర్వీర్యసంపన్నో ధర్మం చ సుసమాహితః,*
*బహుమానాచ్చ రుద్రేణ దత్తస్తస్యాద్భుతో వరః.* 5

*శూలం శూలాద్వినిష్కృష్య మహావీర్యం మహాప్రభమ్,*
*దదౌ మహాత్మా సుప్రీతో వాక్యం చైతదువాచ హ.* 6

*త్వయాయమతులో ధర్మో మత్ప్రసాదకరః కృతః,*
*ప్రీత్యా పరమయా యుక్తో దదామ్యాయుధ ముత్తమమ్.* 7

*యావత్ సురైశ్చ విప్రైశ్చ న విరుధ్యేర్మహాసుర,*
*తావచ్ఛూలం తవేదం స్యాదన్యథా నాశమేష్యతి.* 8

*యశ్చ త్వామభియుంజీత యుద్ధాయ విగతజ్వరః,*
*తం శూలో భస్మసాత్కృత్వా పునరేష్యతి తే కరమ్.* 9

మధువు బలవిక్రమసంపన్నుడు ధర్మానుష్ఠానమున నేకాగ్రచిత్తుడై యుండెడివాడు. అతడు శంకరభగవాను నధికముగా ఆరాధించెను. దాని కా దేవుడు సంతసించి అతని కొక మహాద్భుతమగు వరమిచ్చెను. శివుడు తన చేతి శూలమునుండి తేజోబలాన్వితమైన వేరొక శూలమును జనింపజేసి దాని నా మధుదైత్యుని కిచ్చెను - 'నీవు సాటిలేని విధమున నన్నారాధించి సంతసింపజేసితివి. కనుక నేను నీ కీ యుత్తమమైన ఆయుధమిచ్చుచున్నాను ఓ మహాసురా, నీవు దేవబ్రాహ్మణుల కపకారము చేయకుండ నున్నంతవరకు ఈ శూలము నీ వద్ద నుండును. అట్లు కానినా డిది అదృశ్యమగును. నీతో యుద్ధమునకు వచ్చిన వారిపై దీనిని ప్రయోగించినచో ఇది వారిని భస్మము చేసి తిరిగి నీ చేతికి వచ్చును, అని శివు డతనితో చెప్పెను.

*ఏవం రుద్రాద్వరం లబ్ధ్వా భూయ ఏవ మహాసురః,*
*ప్రణిపత్య మహాదేవం వాక్యమేతదువాచ హ.* 10
*భగవన్మమ వంశస్య శూలమేతదనుత్తమమ్,*
*భవేత్తు సతతం దేవ సురాణామీశ్వరో హ్యసి.* 11

ఇట్లు శివునివలన వరమంది, ఆదైత్యు డతనికి నమస్కరించి యిట్లనెను - 'మహాత్మా! నీవు సర్వదేవతాప్రభుడవు. కనుక నిన్ను నేను వేడుకొనున దేమనగా, నీ విచ్చిన దివ్యశూలము నా వంశము వారివద్ద నెల్లకాల ముండునట్లు అనుగ్రహింపుము.

*ప్రత్యువాచ మహాదేవో నైతదేవం భవిష్యతి.* 12
*మా భూత్ తే విఫలా వాణీ మత్ప్రసాదకృతా శుభా.*

*భవతః పుత్రమేకం తు శూలమేతద్భవిష్యతి,* 13
*యావత్కరస్థః శూలోఽ యం భవిష్యతి సుతస్య తే,*
*అవధ్యః సర్వభూతానాం శూలహస్తో భవిష్యతి.* 14

అందుపై శివు డతని కిట్లనెను - 'అట్లు కుదరదు. కాని నన్ను మెప్పించిన నీ మాటలు శుభమైనవి, కనుక అవి నిష్ఫలముకారాదు. కనుక ఈ శూలము నీ కుమారునివద్ద మాత్రము నిల్చును. అతని చేతులో అది యున్నంతవరకు అతని నెవరు చంపజాలరు.'

ఆ తర్వాత మధు వీ దేశము విడిచి సముద్రమున వసింప నరిగెను. పోవుచున్నప్పు డతడా శూలమును తన కుమారుడైన లవణుని కిచ్చెను. అతనికా శూలమును గూర్చిన వరము కూడ తెలియజేసెను. లవణాసురుడు తన నైజదౌష్ట్యముతోను, శూలప్రభావమువల్లను ముల్లోకములను, ముఖ్యముగా మునీశ్వరులను బాధింపదొడగెను. శత్రుఘ్ను డతనిని వధించిన పిదప ఆ శూలము తిరిగి శివునివద్దకు చేరిపోయినది.

ఈ వర మయాచితము. మధుదైత్యునికి లభించిన శూలము రుద్రుని అనుగ్రహస్వరూపము. కాని వాల్మీకి దీనిని వరమనియే పేర్కొనెను. లవణాసురునికి తండ్రి పుణ్యమున నీ శూలము లభించినది. దుష్టస్వభావుడగుటచే అతడు దానిని నిలుపుకొనలేకపోయెను. లవణుని కది వరదానము కాదు. కేవలము పైతృకపరంపరచే సిద్ధించినది.

## 78. వసిష్ఠుడు > కల్మాషపాదుడు (సౌదాసుడు) ఉత్తరకాండ 65

రాముని ఆజ్ఞచే అభిషిక్తుడై శత్రుఘ్నుడు లవణాసురుని సంహరింప నరిగెను. దారిలో నతడు వాల్మీకిముని ఆశ్రమములో నిల్చెను. ఆశ్రమ సమీపమున యజ్ఞసంభారములు చూచి ఇక్కడ యజ్ఞమొనర్చిన మహారాజెవరు? అని అతడు వాల్మీకి నడిగెను. అప్పుడు వాల్మీకి అతనికి సౌదాసుని కథ చెప్పెను.

చూ. శాపక్ర. 57 - వసిష్ఠుడు > సౌదాసుడు
శాపక్ర. 58 - సౌదాసుడు < వసిష్ఠుడు

"కల్మాషపాదుడు (మచ్చలున్న పాదములు కలవాడు) పత్నీసహితముగా వసిష్ఠుని కాళ్లపై బడి, బ్రాహ్మణవేషమున వచ్చిన రాక్షసుని మోసము నెరిగించెను. రాజు మాటపై ధ్యానమగ్నుడైన వసిష్ఠుడు నిజమెరిగి, సౌదాసుని తో నిట్లనెను -

*మయా రోషపరీతేన యదిదం వ్యాహృతం వచః,*
*నైతచ్ఛక్యం వృథా కర్తుం ప్రదాస్యామి చ తే వరమ్.* 35

*కాలో ద్వాదశ వర్షాణి శాపస్యాంతో భవిష్యతి,*
*మత్ప్రసాదాచ్చ రాజేంద్ర అతీతం న స్మరిష్యసి.* 36

'రాజా! నేను కోపావేశమున పల్కినది అసత్యము కాబోదు. అది అట్లు చేయబడదు. కాని దానినుండి విముక్తికై నేను నీకు వరమిచ్చెదను. అదెట్లనగా ఈ శాపము నిన్ను పన్నెండు సంవత్సరములు బాధించును. తర్వాత ఇది తొలగిపోవును. నీ కీ పూర్వవిషయములు స్మృతిలో నుండవు.'

పన్నెండేళ్లట్లు శాప మనుభవించి సౌదాసుడు తిరిగి తన రాజ్యము తాను పొందెను. అతడు ప్రజాహితపాలకుడు. ఈ యజ్ఞసంభారము లా రాజునకు చెందినవి."

ఈ వరము తక్కిన వరములకు భిన్నము. ఈ వరము శాపవిమోచనము కొరకు వచ్చినది. కల్మాషపాదుని పునఃపునఃప్రార్థనాఫలితముగా లభించినందున ఈ వరము యాచితము.

## 79. దేవతలు > శత్రుఘ్నుడు ఉత్తరకాండ 70

శత్రుఘ్నుడు లవణాసురుని సంహరించి మూడులోకములవారిని భయరహితులుగా నొనర్చెను. దేవ ఋషి గంధర్వాప్సరోగణము అతనికి జయధ్వానములు చేసిరి. ఇంద్రుడు, అగ్ని మున్నగు దేవతలు అతనితో మధుర వచనములు పల్కుచు నిట్లనిరి- 'వత్సా, మహాదృష్టవశమున నీ వీ లవణాసురుని చంపి విజయము నందితివి. మేము నీకు వరమీయ వచ్చితిని. నీ జయ మాకాంక్షించినవారము. మా దర్శన మమోఘము. కనుక నీ వేదేని వరము కోరుకొనుము.

దేవతల మాటలు విని శత్రుఘ్నుడు వారికి నమస్కరించి యిట్లనెను-

ఇయం మధుపురీ రమ్యా మధురా దేవనిర్మితా,
నివేశం ప్రాప్నుయాచ్ఛీఘ్రమేష మే ऽ.స్తు వరః పరః. 5

'దేవతలారా, దేవనిర్మితమైన యీ మధుపురి తిరిగి శీఘ్రముగా మనోహర రూపమున రాజధానిగా వెలయునట్లు చేయుడు. ఇది నాకు ముఖ్యమగు వరము.'

అప్పుడు దేవతలు సంతసించి- 'మంచిది, అట్లే యగును. ఈ రమణీయమగు నగరము శీఘ్రముగా శూరవీరుల సేనతో నిండును.

దేవతల కోరికపై ఈ వర మడుగబడెను. కనుక యీ వర మయాచితము.

## 80. దేవతలు > బ్రహ్మహత్య ఉత్తరకాండ 86

లక్ష్మణుడు రామునితో వృత్రాసురవధనుగూర్చి చెప్పుచుండెను. తపస్సు చేసి బలము గడించి వృత్రాసురుడు మూడు లోకములను జయించెను. ఇందువలన దేవతలందరు దుఃఖితులైరి. వారు విష్ణువు చెంత కరిగి వృత్రాసురుని సంహరించి దేవతల నుద్ధరింపు మని ప్రార్థించిరి. అతడు పూర్వమే వృత్రునితో స్నేహబంధము నెరపినవాడు కనుక తాను వానిని చంపజాలనని చెప్పెను. కాని తన తేజోరూపము మూడుభాగములుగ విభక్తము చేసి దేవతలకిచ్చెదననియు, దాని బలమున ఇంద్రుడు వృత్రాసురుని వధింపగలడనియు చెప్పెను. అట్లే అతని తేజమున నొక అంశము దేవేంద్రునిలో ప్రవేశించెను. వేరొక అంశము వజ్రాయుధములో నిండెను. మూడవ అంశము భూమిపైకి దిగెను. తర్వాత దేవేంద్రుడు రెండు చేతులతోను వజ్రము నెత్తి వృత్రాసురుని తలపై కొట్టెను. ఆ దెబ్బకు వృత్రుని తల తెగి పడిపోయెను. ప్రపంచమంతయు భయకంపిత మాయెను. నిరపరాధుడైన వృత్రుని చంపుట అనుచితము. ఈ విషయమెరిగి యింద్రుడు పారిపోయి లోకాలోకపర్వతమున గల చీకటిగుహలలో దాగెను. కాని బ్రహ్మహత్య అతనిని వెంటాడెను. అది అతని అవయవముల నావహించెను. దీని వలన ఇంద్రుడెంతో దుఃఖితుడాయెను. దేవతలు తిరిగి విష్ణుని చేరి నీవే నీ తేజోభాగ మిచ్చి దేవేంద్రునిచే వృత్రుని వధింపజేసితివి, మమ్ములను కాపాడితివి. కాని యింద్రు నిప్పుడు బ్రహ్మహత్య పట్టి పీడించుచున్నది. కనుక నతని నెట్లుద్ధరింపవలెనో నీవే తగిన ఉపాయ మెరిగింపుము.' అని ప్రార్థించిరి. ఇంద్రుడు నన్నుగూర్చి యజ్ఞము చేయవలెను. పవిత్రమైన

అశ్వమేధము చేసి అతడు నన్నారాధించినచో బ్రహ్మహత్య తొలగిపోయి అతడు తిరిగి దేవేంద్ర పదవి సంపాదించును. ఆ మీద నతని కేవిధమైన భయమును కలుగదు.' అని విష్ణువు తెలియజేసెను. ఆ పిదప ఇంద్రుడు అశ్వమేధ మొనర్చెను. యజ్ఞము పూర్తికాగా బ్రహ్మహత్య దేవతలవద్దకు వచ్చి యిట్లడిగెను- 'నాకు స్థాన మెక్కడ కల్పించెదరు?' దానిపై వారు బ్రహ్మహత్య నాల్గు విభాగములుగా నయి యింద్రుని శరీరమును విడిచి అన్యత్ర వసింప ననుమతించిరి.

*ఏకేనాంశేన వత్స్యామి పూర్ణోదాసు నదీషు వై,*
*చతురో వార్షికాన్మాసాన్ దర్పఘ్నీ కామచారిణీ.* 13

*భూమ్యామహం సర్వకాలమేకేనాంశేన సర్వదా,*
*వసిష్యామి న సందేహః సత్యేనైతద్ బ్రవీమి.* 14

*యోఽయమంశస్తృతీయో మే స్త్రీషు యౌవనశాలిషు,*
*త్రిరాత్రం దర్పపూర్ణాసు వసిష్యే దర్పఘాతినీ.* 15

*హంతారో బ్రహ్మణాన్యే తు మృషాపూర్వమదూషకాన్,*
*తాంశ్చతుర్థేన భాగేన సంశ్రయిష్యే సురర్షభాః.* 16

*ప్రత్యూచుస్తాం తతో దేవా యథా వదసి దుర్వసే,*
*తథా భవతు తత్సర్వం సాధయస్వ యదీప్సితమ్.* 17

అంత బ్రహ్మహత్య వారితో నిట్లనెను- 'ఇక మీద నా భాగమొకటి సంవత్సరములో నాల్గుమాసములు (చాతుర్మాస్యకాలము) నీటితో నిండిన నదులలో నుండును. అప్పుడు నేను స్వేచ్ఛగా విహరించుచు గర్వితమతులైన వారి దర్ప మడచివేయుచుందును. నా రెండవ భాగము సర్వదా భూమిపై నిల్చును. అది నిస్సంశయము. నా మూడవభాగము యువతులై మదించు నారీజనములో ప్రతిమాసము మూడు రాత్రులుండి వారి మదము నణచివేయును. దేవతలారా, అసత్యమాడి అన్యులను నిందాభాజనులుగా చేయు నట్టి సద్బ్రాహ్మణులను వధించునట్టి పాపాత్ములను నా నాల్గవభాగము వహించును.

దేవత లా మాటలు విని 'దుర్వసా! నీవు చెప్పినట్లే జరుగనిమ్ము' అని పల్కిరి. ఇంద్రుడు పాపరహితుడై నిశ్చింతగా విశుద్ధుడాయెను.

ఇక్కడ వరశబ్దప్రయోగము లేకున్నను ఇది యాచితవరమే.

శ్రీరాముడు లక్ష్మణునికి ఇలుని వృత్తాంతము చెప్పుచుండెను.

పూర్వము కర్దమప్రజాపతి కుమారుడైన ఇలుడు బాహ్లీకదేశ మేలుచుండెడివాడు. అతడు ధర్మాత్ముడు. పృథివి నంతటిని వశపరచుకొని ప్రజలను సంతానము వలె పాలించుచుండెను. ఒకసారి సేనాపరివారవాహనాదికముతో కలిసి వేటకై బయలుదేరి వెళ్లి పదివేలు క్రూరమృగములను వధించెను. ఇంకను తృప్తి జెందక కార్తికేయస్వామి జన్మించిన వనప్రదేశమునకు వేటాడ నడిగెను. అప్పుడచ్చట శివుడు తన సమస్తసేవకగణములతోను వచ్చి నిల్చి పార్వతికి మనోరంజనము కల్పించుచుండెను. ఆ వనమున గల సమస్త పశుపక్షివృక్షాదులును పుంలింగధారులైనచో స్త్రీలుగా మారిపోయినవి. పార్వతిని సంతోషపెట్టనెంచి శివుడు కూడ స్త్రీ రూపము ధరించెను. అట్టి ఆ వనము చేరగనే ఇలుడును అతని సేవకులు కూడ స్త్రీలుగా మారిపోయిరి. తన కట్టి స్థితి దాపురించినందున ఇలుడు మిక్కిలి దుఃఖించెను. ఇదంతయు శివుని మనోభీష్టమున జరిగినదని తెలిసి అతడు మరింతగా దిగులు చెందెను. అప్పుడతడు సేనాసేవక పరివారసహితముగా పరమశివుని శరణు పొంద నరిగెను. పార్వతీసహితుడైన శివుడు నవ్వుచూ ఇలునితో నిట్లనెను.

*పురుషత్వమృతే సౌమ్య వరం వరయ సువ్రత.* 20

'రాజా, పురుషత్వము తప్ప వేరేదైన వరము కోరుకొనుము'.

పరమశివు డిట్లు పురుషత్వ మీయరా దనినందున ఇలు డత్యంత శోకవికలుడై వేరొక వరమేదియు కోరలేదు.

అతడంతట శోకాకులచిత్తుడై పార్వతిని శరణువేడి యిట్లు పల్కెను-

*ఈశే వరాణాం వరదే లోకానామసి భామిని.* 22

*అమోఘదర్శనే దేవి భజ సౌమ్యేన చక్షుషా.* 23

'సమస్తవరములకు అధీశ్వరివైన ఓ మహాదేవీ, నీవు లోకములన్నిటికి వరప్రదవు. మాననీయవు. నీ దర్శనము వృథా కాగూడదు. కనుక నాయందు దయజూపుము.'

రాజు హృదయము గ్రహించి పార్వతీదేవి అతనితో నిట్లనెను -

*అర్ధస్య దేవో వరదో వరార్ధస్య తవ హ్యాహమ్,* 24
*తస్మాదర్ధం గృహాణ త్వం స్త్రీపుంసోర్యావదిచ్ఛసి.* 25

'రాజా! నీవు కోరుచున్న పురుషత్వమున నర్ధభాగము శివు డివ్వదగినది. మిగిలిన సగభాగము నే నియ్యగలను. కనుక నే నిచ్చునట్టి అర్ధవరము గ్రహింపుము.'

దేవి యిచ్చిన యీ ఉత్తమాద్భుతవరము విని రాజు సంతసించి యిట్లనెను-

*యది దేవి ప్రసన్నా మే రూపేణాప్రతిమా భువి.* 26

*మాసం స్త్రీత్వముపాసిత్వా మాసం స్యాం పురుషః పునః.* 27

'దేవీ! నీవు నాయందు కృప వహించినచో నేను భువనసుందరమగు రూపమున స్త్రీగా మారి ఒక మాసమును, ఆపై మాసమున తిరిగి పురుషుడుగను మారుచుండునట్లు వర మనుగ్రహింపుము.'

ఇలుని మనోభీష్ట మెరిగి పార్వతి యిట్లనెను-

*ప్రత్యువాచ శుభం వాక్యమేవమేవ భవిష్యతి,*

*రాజన్ పురుషభూతస్త్వం స్త్రీభావం న స్మరిష్యసి.* 28
*స్త్రీభూతశ్చ పరం మాసం న స్మరిష్యసి పౌరుషమ్.* 29

'అట్లే యగుగాక, నీవు పురుషునిగా నున్నప్పుడు నీకు స్త్రీరూపమున గడిపిన విషయములు స్మృతిలో నుండవు. తిరిగి స్త్రీవైనప్పుడు పురుషభావము స్మరణకు రాదు.'

ఈ విధముగా కర్దమప్రజాపతి కుమారుడైన ఇలుడు ఒకమాసము పురుషుడుగాను మరుసటి నెల స్త్రీగను తిరిగి వేరొక మాసము పురుషుడుగను మారుచుండెను.

## ఉత్తరకాండ 90

కర్దమప్రజాపతికి తన కుమారునికి వచ్చిన యీ విపరీతస్థితి శంకరుని వల్లగాని వేరొకరివల్ల తొలగింపబడజాలదని గ్రహించెను. 'అశ్వమేధమునకు మించిన యజ్ఞ మింకొకటి లేదు. ఆ యజ్ఞము శివునకు ప్రియము. కనుక మనము

ఇలుని మేలెంచి దుష్కరమైన ఆ యజ్ఞ మాచరించెదము అని చెప్పి సంవర్త శిష్యుడైన రాజర్షి మరుత్తును పిల్చి యజ్ఞమునకు పూనుకొనెను. ఆ యజ్ఞము వలన శివుడు పరమసంప్రీతుడయ్యెను. నేను నీ భక్తికి యజ్ఞానుష్ఠానమునకు చాలా సంతోషించితిని. బాహ్లీకాధిపతియైన ఇలునకు నేను చేయదగిన ప్రియమేదో చెప్పుము.' అని శివుడు కర్దమునితో పలికెను. అప్పు డా యజ్ఞమునకు వచ్చిన బ్రాహ్మణులు స్త్రీగా మారిన ఇలుడు తిరిగి ఎల్లప్పుడు పురుషుడుగా నుండునట్లు వర మిమ్మనిరి.

అందుపై శివు డతనికి శాశ్వతపురుషత్వ మిచ్చెను.

తక్కిన వరములతో పోల్చినపు డీ వరము విశిష్టమయినదిగా నుండును. పార్వతి ఇలున కిచ్చిన వరము రామాయణములో పేర్కొనబడిన అర్ధవరము మాత్రమే.

శివుడిచ్చిన వరము అయాచితము, అస్వీకృతమును. పార్వతి యిచ్చిన వరము యాచితమైనను, అందులో విస్మరణభాగము అయాచితము. స్త్రీరూపమున నున్నప్పుడు పురుషత్వమును, పురుషరూపమున నున్నప్పుడు స్త్రీత్వమును విస్మరింపగలుగునట్లు ఇలు డడుగలేదు. పార్వతియే స్వయముగా ఆవర మా రీతిగా ననుగ్రహించెను.

## 82. శ్రీరాముడు > ప్రజలు ఉత్తరకాండ 107

లక్ష్మణుని విడిచి రాముడు శోకసంతప్తు డాయెను. మంత్రి పురోహిత మహాజనులను పిలిచి అతడు వారితో నిట్లనెను- 'నేనిప్పుడు అయోధ్యారాజ్యమునకు ధర్మవత్సలుడు, వీరుడునైన నా సోదరుడు భరతుని రాజుగా చేయుదును. ఆపిదప నేను వనమున కరిగెదను. కనుక కావలసిన వస్తుసంభారమంతయు సిద్ధము చేయుడు. నే నీ దినముననే లక్ష్మణుని అనుసరింపదలచుచున్నాను.' ఇట్లు చెప్పిన రాముని వాక్యములు విని ప్రజలు నేలపై సాష్టాంగపడి చేష్ట లుడిగిరి. భరతుడు స్మృహతప్పి పడిపోయెను. తర్వాత నతడిట్లనెను- 'మీరు లేని రాజ్యము నాకు వలదు. కుశలవులకు పట్టాభిషేక మొనర్పుడు. దక్షిణకోసలమును కుశునికి, ఉత్తరకోసలము లవునికి అనుగ్రహింపుడు. వెంటనే మన దూతలు శత్రుఘ్నుని వద్ద కరిగి, అతనితో మన యీ మహాయాత్రను గూర్చి తెలియజేయనిండు.

పురజనులు నతముఖులై, దుఃఖసంతప్తులై యున్న సంగతి గమనించి వసిష్ఠుడు రామునితో నిట్లనెను - 'వత్సా రాఘుచంద్రా, నేలబడి తపించుచున్న యీ ప్రజాసమూహమును చూడుము. వారి యభిప్రాయమేదో తెలిసికొని దాని ననుసరించి చరింపుము. వారి యిష్టమునకు విరుద్ధముగా నడిచి వారిని దుఃఖింపజేయకుము.' వసిష్ఠుని మాటలు విని రాముడు ప్రజలను లేవనెత్తి వారి నిట్లడిగెను. 'నేను మీకొరకు కేమి చేయవలెను?' దానికి బదులుగా వారతనితో నిట్లనిరి-

*గచ్ఛంత మనుగచ్ఛామో యత్ర రామ గమిష్యసి,* 12
*పౌరేషు యది తే ప్రీతిర్యది స్నేహో హ్యనుత్తమః,*

*సపుత్రదారాః కాకుత్స్థ సమం గచ్ఛామ సత్పథమ్.* 13

*తపోవనం వా దుర్గం వా నదీమంభోనిధిం తథా,*
*వయం తే యది న త్యాజ్యాః సర్వాన్నో నయ ఈశ్వర.* 14

*ఏషా నః పరమా ప్రీతిరేష నః పరమో వరః,*
*హృద్గతా నః సదా ప్రీతిస్తవానుగమనే నృప.* 15

'రఘునందనా! నీ వెక్కడి కేగుదువో, అక్కడకు నీ వెనుకనే మేము రాగోరుదుము. కాకుత్స్థవీరా, పురవాసులపై నీకు ప్రీతి గలదేని, మాయందు స్నేహమున్నదేని, మమ్ము నీ వెంట వచ్చుటకు అనుమతింపుము. మేము దారపుత్రులతో కలిసి నీ వెంట సన్మార్గమున చరింపదలచుచున్నాము. స్వామీ! తపోవనమో, దుర్గమప్రదేశమో, నదీతీరమో, సముద్రమో - ఏదియైనను సరే, నీ వేగెడి చోటికి మమ్ము గొనిపొమ్ము. మమ్ములను విడువదగిన వారుగా నీవెంచవేని ఆ విధముగా ననుగ్రహింపుము. అట్లయినచో అది మాకు నీ సర్వశ్రేష్ఠమగు కృపాప్రసాదము. అది మాకు పరమోత్తమమైన వరము. నీ వెనుక నడచి వచ్చుటే మాకు హార్దికమైన ప్రసన్నత.

పురజనుల నిశ్చలభక్తిని గ్రహించి రాముడు వారి కోర్కె కనుమతి తెల్పెను. అత డదే దినమున కుశలవులకు రాజ్యాభిషేక మొనర్చి శత్రుఘ్నునకు వర్తమాన మంపెను.

# ఆశీస్సులు
# ప్రొక్కుబడులు

## 1. కౌసల్య ఆశీర్వాదము అయోధ్యాకాండ 25

శ్రీరాముని వనగమనమునకు తల్లి కౌసల్య దుఃఖించుచునే అనుమతించెను. అయినను ఆమె ఎట్లో దుఃఖము దిగమ్రింగి యాత్రాకాలిక మంగళవిధు లనుష్ఠించెను. పిదప తనయుని ఆశీర్వదించుచు- 'రఘుకులభూషణా! నీవు నియమముతో, ప్రసన్నతాపూర్వకముగా ఏ ధర్మ మనుసరించుచున్నావో అదే నీకు రక్ష. మహర్షులు నిన్ను వనములో రక్షింతురు గాక. విశ్వామిత్రమహర్షి నీ కిచ్చిన దివ్యాస్త్రములు నిన్ను సదా కాపాడుగాక. నీవు తండ్రికి, తల్లికి చేసిన సేవాశుశ్రూషలు, నీ సత్యవాక్పరిపాలనము నిన్ను రక్షించుచుండుగాక. చిరంజీవి వగుము. నరశ్రేష్ఠా! సమిధలు, దర్భలు, పవిత్రములు, వేదికలు, ఆలయములు, విప్రపూజాస్థలములు, పర్వతములు, వృక్షములు, జొంపములు, జలాశయములు, పక్షులు, సర్పములు, సింహములు, వనములో నిన్ను రక్షించుగాక. ఇంద్రాది దిక్పాలురు, షడృతువులు, ద్వాదశమాసములు, సంవత్సరములు, దినరాత్రములు, ముహూర్తములు నీకు మంగళకారులగుగాక. శ్రుతి స్మృతి ధర్మములన్నియు నిన్ను సర్వత్ర రక్షించుచుండుగాక. గిరులు, సముద్రము, వరుణుడు, ద్యులోకము, అంతరిక్షము, పృథివి, వాయువు, చరాచరప్రాణికోటి సర్వము, సమస్తనక్షత్రరాశులు, గ్రహములు, దేవతలు, దివారాత్రులు, సంధ్యాద్వయము ఇవి యన్నియు నిన్ను వనములో కాపాడుచుండుగాక. మునివేషము ధరించి గహనారణ్యములందు సంచరించునట్టి నీవంటి ధీకుశలునికి సమస్తదేవాసుర సంఘములు సుఖదాయకము లగుగాక. కుమారా! నీకు భయంకరులగు రాక్షసులవలన గాని, క్రూరపిశాచములవలన గాని, మాంసాహారిజంతువులవలన గాని ఏ భయమును లేకుండుగాక. ఈ చెప్పినవి గాక, మిగిలిన నరమాంసభక్షకులైన

సమస్త జీవులును నాచే పూజింపబడినవారై వనములో నిన్ను హింసింపకుందురు గాక' అని పల్కెను. మరియు-

*ఆగమాస్తే శివాః సంతు సిద్ధ్యంతు చ పరాక్రమాః,*
*సర్వసంపత్తయో రామ స్వస్తిమాన్ గచ్ఛ పుత్రక.* 21

*స్వస్తి తేఽస్త్వంతరిక్షేభ్యః పార్థివేభ్యః పునః పునః,*
*సర్వేభ్యశ్చైవ దేవేభ్యో యే చ తే పరిపంథినః.* 22

*శుక్రః సోమశ్చ సూర్యశ్చ ధనదోఽథ యమస్తథా,*
*పాంతు త్వామర్చితా రామ దండకారణ్యవాసినమ్.* 23

*అగ్నిర్వాయుస్తథా ధూమో మంత్రాశ్చర్షిముఖచ్యుతాః,*
*ఉపస్పర్శనకాలే తు పాంతు త్వాం రఘునందన.* 24

*సర్వలోకప్రభుర్బ్రహ్మా భూతకర్తృ తథర్షయః,*
*యే చ శేషాః సురాస్తే తు రక్షంతు వనవాసినమ్.* 25

'కుమారా! రామచంద్రా, నీకు మార్గములన్నియు శుభ మగు గాక. నీ పరాక్రమము సఫల మగుగాక. నీకు సర్వసంపదలు ప్రాప్తించుగాక. నీవు కుశలముగా పోయిరమ్ము. గగనసంచారి పక్షులవలన, భూమిపై పశువులవలనను నీకు శుభ మగుగాక. సమస్తదేవతలవల్లను, శత్రువులవల్లను కూడ నీకు శుభమగు గాక. రామచంద్రా, శుక్ర సోమ సూర్య కుబేర యములు, నాచే పూజితులై, దండకారణ్యనివాసకాలమున నిన్ను రక్షించుచుందురుగాక. రఘునందనా, స్నానాచమనాదిసమయములలో అగ్ని, వాయువు, ధూమము, ఋషిముఖోద్గతమంత్ర సమూహము నిన్ను రక్షించుచుండుగాక. సర్వలోకేశ్వరుడగు బ్రహ్మ, జగత్కారణుడైన పరబ్రహ్మ, ఋషిగణము, తక్కిన దేవతాసమూహము, అందరూ ని న్నన్నివేళలను వనములో కాపాడుదురుగాక.'

ఇట్లు పలికి కౌసల్య గంధపుష్పాదులు సమర్పించి స్తుతిపూర్వకముగా దేవతలను పూజించెను. శ్రీరాముని హితార్థము ఆమె యొక బ్రాహ్మణుని పిలిచి అగ్నిలో యథావిధిగా హోమము చేయించెను. పురోహితుడు సకలోపద్రవశాంతికి, ఆరోగ్యాభివృద్ధికిని, శాస్త్రోక్తముగా అగ్నిలో హోమము చేసి హవిశ్శేషమును పదిదిక్కులందును ఇంద్రాదిదిక్పాలకులకు బలిగా అర్పింపజేసెను. పిమ్మట స్వస్తివాచనము జరిపి, బ్రాహ్మణులకు దధిమధు

ఘృతాక్షతలు సమర్పించెను. 'వనములో శ్రీరామునికి సర్వదా మంగళమగుగాక' యని కౌసల్య స్వస్తిమంత్రములు పఠింపజేసెను. పురోహితునకు దక్షిణ నిచ్చి ఆమె రామునితో నిట్లనెను-

*యన్మంగళం సహస్రాక్షే సర్వదేవనమస్కృతే,*
*వృత్రనాశే సమభవత్ తత్తే భవతు మంగళమ్.* 32

*యన్మంగళం సుపర్ణస్య వినతాకల్పయత్ పురా,*
*అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్.* 33

*అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్,*
*అదితిర్మంగలం ప్రాదాత్ తత్తే భవతు మంగళమ్.* 34

*త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణోరమితతేజసః,*
*యదాసీన్మంగళం రామ తత్తే భవతు మంగళమ్.* 35

*ఋషయః సాగరా ద్వీపా వేదా లోకా దిశశ్చ తే,*
*మంగళాని మహాబాహో దిశంతు శుభమంగళమ్.* 36

'వృత్రాసురుని వధింప నరుగునప్పుడు సర్వవందితుడైన ఇంద్రుని కే మంగళకరమగు ఆశీస్సు లభించెనో, అది నీకు లభించుగాక. పూర్వము వినత అమృతము కొరకు కరుగుచున్న తన కుమారునికి ఏ శుభాశీస్సు నిచ్చెనో, అది నీకు ప్రాప్తించుగాక. అమృతమథనవేళ, దైత్యసంహారము చేయ సమకట్టిన ఇంద్రునికి అదితి ఏ యే మంగళము లాశీర్వదించెనో ఆ మంగళము లన్నియు నీకు లభించుగాక. రామా! మూ డడుగులు వేసి పరాక్రమించిన తేజశ్శాలియగు వామనరూప విష్ణుభగవానునికి ఏ మంగళాశాసనము జరిగెనో అది నీకు సమకూరుగాక. మహాబాహూ! ఋషి సముద్ర ద్వీప వేద సకలలోకములు, దశదిశలును నీకు మంగళ మొనర్చుగాక. నీకు సదా శుభమంగళము.'

ఇట్లు పలికి, తిరిగి కౌసల్య రామునితో- అతడు తాను కోరినట్లు వనమున కేగి, వనవాసము తీరగనే యింటికి వచ్చి రాజోచిత శుభవస్త్రాభూష ణములు ధరించి తనకు, తన కోడలైన సీతకు గల అభిలాష లన్నిటిని తీర్చుచుండుగాక యని కోరెను. ఇంకను ఇట్లు పలికెను-

*మయార్చితా దేవగణాః శివాదయో*
*మహర్షయో భూతగణాః సురోరగాః,*

*అభిప్రయాతస్య వనం చిరాయ తే*
*హితాని కాంక్షంతు దిశశ్చ రాఘవ.* 45

'రాఘవా! నాచే నెల్లప్పుడు పూజింపబడుచుండిన శివాదిదేవతలు, మహర్షులు, భూతగణము, దేవసర్పసమూహము, దిగ్పాలయము - ఇవన్నియు వన మరుగుచున్న నీకు సర్వవేళల హితసాధన మొనర్చుచుండుగాక.'

## 2. సుమిత్ర ఆశీర్వాదము అయోధ్యాకాండ 40

రామునితో కూడ వనమునకు పోవుచున్న లక్ష్మణుడు మొదట కౌసల్యకు నమస్కరించెను. పిదప తన తల్లి సుమిత్రకు పాదప్రణామ మాచరించెను. లక్ష్మణు డట్లు నమస్కరించుచుండగా చూచి సుమిత్ర అతని శిరసు మూర్కొని యిట్లనెను -

*సృష్టస్త్వం వనవాసాయ స్వనురక్తః సుహృజ్జనే,*
*రామే ప్రమాదం మా కార్షీః పుత్ర భ్రాతరి గచ్ఛతి.* 5

*వ్యసనీ వా సమృద్ధో వా గతిరేష తవానఘ,*
*ఏష లోకే సతాం ధర్మో యజ్జ్యేష్ఠవశగో భవేత్.* 6

*ఇదం హి వృత్తముచితం కులస్యాస్య సనాతనమ్,*
*దానం దీక్షా చ యజ్ఞేషు తనుత్యాగో మృధేషు హి.* 7

*లక్ష్మణం త్వేవముక్త్వాసౌ సంసిద్ధం ప్రియరాఘవమ్,*
*సుమిత్రా గచ్ఛ గచ్ఛేతి పునః పునరువాచ తమ్.* 8

*రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్,*
*అయోధ్యామటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్.* 9

'వత్సా! నీవు సఖులయం దనురాగము కలవాడవు. దైవము రామునియం దనురక్తుడవైన ని న్నతనితో కలసి వనవాసము చేయుటకు సృష్టించినది. నీ అన్న వనములలో నున్నప్పుడు సదా అప్రమత్తుడవై అతనికి సేవచేయుము. సంకట కాలమైనను, సమృద్ధి గల్గినను అతడే నీకు పరమగతి. లక్ష్మణా, ప్రపంచము నం దిదే సత్పురుషుల ధర్మము. వారు తమ జ్యేష్ఠభ్రాతల ననుసరించుచుందురు. దానము, యజ్ఞదీక్ష, యుద్ధములో శరీరత్యాగము- ఇవి

ఈ కులములోని వారికి తగిన సనాతనధర్మములు.' ఇట్లు చెప్పి ఆమె తిరిగి వనగమనమునకు నిశ్చయించిన రామునికి ప్రియమెంచి లక్ష్మణునితో వెళ్లు వెళ్లు మని మరల మరల పలికెను. 'కుమారా, శ్రీరాముని దశరథునిగను, సీతను నన్నుగాను, అరణ్యమునే అయోధ్యగను గ్రహింపుము. సుఖముగా పోయిరమ్ము.'

## 3. శ్రవణకుమారునికి తండ్రి ఆశీర్వాదము అయోధ్యాకాండ 65

శ్రవణముని తన కుమారుని మరణవార్త విని శోకాకులుడై మూర్ఛిల్లెను. ఆ పిదప తేరుకొని పుత్రునికి జలాంజలి యిచ్చుటకు ముందు అతని నిట్లాశీర్వదించెను -

*అపాపోఽసి యథా పుత్ర నిహతః పాపకర్మణా,*
*తేన సత్యేన గచ్ఛాశు యే లోకాస్త్వస్త్రయోధినామ్.* 40

*యాం హి శూరా గతిం యాంతి సంగ్రామేష్వనివర్తినః,*
*హతాస్త్వభిముఖాః పుత్ర గతిం తాం పరమాం వ్రజ.* 41

*యాం గతిం సగరః శైబ్యో దిలీపో జనమేజయః,*
*నహుషో ధుంధుమారశ్చ ప్రాప్తాస్తాం గచ్ఛ పుత్రక.* 42

*యా గతిః సర్వభూతానాం స్వాధ్యాయాత్తపసశ్చ యా,*
*భూమిదస్యాహితాగ్నేశ్చ ఏకపత్నీవ్రతస్య చ.* 43

*గోసహస్రప్రదాతౄణాం గురుసేవాభృతామపి,*
*దేహన్యాసకృతాం యా చ తాం గతిం గచ్ఛ పుత్రక.* 44

*న హి త్వస్మిన్ కులే జాతో గచ్ఛత్యకుశలాం గతిమ్.* 45

'వత్సా! నీవు పాపరహితుడవు. కాని నిన్నొక పాపకర్ముడు వధించెను. కనుక నా సత్యప్రభావమున నీవు శీఘ్రమే అస్త్రయోద్ధ లైన శూరు లేగు లోకములకు చేరుకొనుము. యుద్ధములో వెన్ను జూపని శూరవీరులు యుద్ధములో మరణించిన పిదప ఏ యుత్తమగతులు పొందుదురో నీ వవి పొందుము. నాయనా, సగర శైబ్య దిలీప నహుష జనమేజయ ధుంధుమారు లే లోకములకు చేరిరో నీ వా లోకములు చేరుకొనుము. స్వాధ్యాయ తపోవ్రతములచే

సమస్తభూతములకు నాశ్రయభూతులైన వారి కెట్టి పరలోకప్రాప్తి కలుగునో అది నీకు కలుగుగాక. భూదానము, అగ్నిహోత్రము, ఏకపత్నీవ్రతము, గోదానసహస్రము, గురుసేవ, మహాప్రస్థానమున దేహత్యాగము చేసిన వారి కెట్టి సద్గతి కల్గునో అది నీకు లభించుగాక. నీవంటి తపస్వి లుదయించిన యీ కులములో జన్మించిన వాడెవడును దుర్గతి పొందజాలడు.

## 4. స్వర్గస్థ దశరథుని ఆశీస్సు యుద్ధకాండ 119

పరమశివుడు స్వర్గవాసియైన దశరథుని రప్పించి రామునికి చూపెను. దశరథుడు తనకు ప్రాణములకంటె ప్రియపుత్రుడైన రాముని చూచి చాల సంతసించెను. అతడు రామునితో నిట్లనెను- 'అష్టావక్రుడు ధర్మాత్ముడైన తన తండ్రి కహోలు నెట్లుద్ధరించెనో, అట్లే మహాత్ముడ వైన నీవు నన్నుద్ధరించితివి. కైకేయి కటువచనములను, ఆమె కారణమున రామలక్ష్మణులును, సీతయు వనవాసులై పడిన కష్టములను తలచి ఆ రాజు మిక్కిలి దుఃఖించెను. తన దుఃఖమును ప్రకటముగా చెప్పి అతడు రాము నిట్లాశీర్వదించెను.

*నివృత్తవనవాసోఽసి ప్రతిజ్ఞా పూరితా త్వయా,*
*రావణం చ రణే హత్వా దేవతాః పరితోషితాః.* 23

*కృతం కర్మ యశః శ్లాఘ్యం ప్రాప్తం తే శత్రుసూదన,*
*భ్రాతృభిః సహ రాజ్యస్థో దీర్ఘమాయురవాప్నుహి.* 24

'నీ వనవాసకాలము పూర్తియైనది. నా ప్రతిజ్ఞను నీవు చెల్లించితివి. యుద్ధములో రావణుని సంహరించి దేవతలకు సంతుష్టి కలిగించితివి. శత్రుసూదనా, ఈ కార్యము లన్నిటిని ముగించితివి. స్పృహణీయమగు కీర్తి నార్జించితివి. ఇక తమ్ములతో కలిసి రాజ్యమందుకొని దీర్ఘాయు వనుభవింపుము.'

రాముడు దశరథునితో కైకేయీభరతులను క్షమింపుమని చెప్పి ప్రార్థించెను. ఆ ప్రార్థనను దశరథమహారాజు స్వీకరించెను. పిదప నతడు లక్ష్మణునితో నిరంతరము శ్రీరాముని సేవ చేయుచుండు మని చెప్పి, అతని నిట్లాశీర్వదించెను.

*ధర్మం ప్రాప్స్యసి ధర్మజ్ఞ యశశ్చ విపులం భువి,*
*రామే ప్రసన్నే స్వర్గం చ మహిమానం తథోత్తమమ్.* 29

'ధర్మజ్ఞా, భావికాలమున నీకు ధర్మఫలము లభించును. భూలోకమున

నీకు విస్తారమగు కీర్తి కలుగును. శ్రీరాముని సంతుష్టివలన నీకు మహోన్నతమగు స్వర్గఫలము ప్రాప్తించును.

ఆ పిమ్మట సీతను దీవించుచు అత డిట్లనెను-

*కర్తవ్యో న తు వైదేహి మన్యుస్త్యాగమిమం ప్రతి,*
*రామేణేదం విశుద్ధ్యర్థం కృతం వై త్వద్ధితైషిణా.* 35

*సుదుష్కరమిదం పుత్రి తవ చారిత్రలక్షణమ్,*
*కృతం యత్తేఽన్యనారీణాం యశో హ్యాభిభవిష్యతి.* 36

*న త్వం కామం సమాధేయా భర్తృశుశ్రూషణం ప్రతి,*
*అవశ్యం తు మయా వాచ్యమేష తే దైవతం పరమ్.* 37

'వైదేహీ! నీ వీ త్యాగము నెంచి రామునిపై కోపించవలదు. నీ హితము కోరియే, ప్రపంచమునకు నీ పవిత్రతను ప్రకటింపదలచి రాము డట్లు వ్యవహరించెను. బిడ్డా, నీవు నీ విశుద్ధచరిత్రమును ప్రమాణీకరించుటకై అగ్నిప్రవేశరూపమున నే ఘనకార్య మొనర్చితివో అది తక్కిన స్త్రీలకు మిక్కిలి దుష్కరము. నీవు చేసిన ఈ కార్యము నారీలోక మంతటికిని యశము చేకూర్చును. పతిసేవావిషయమున నేను నీకు చెప్పవలసిన ఆవశ్యకత లేదు. కాని నీ కతడే పరమదైవతమని మాత్రము చెప్పుచున్నాను.'

## 5. పుష్పకవిమానమునకు రాముని ఆశీర్వాదము ఉత్తరకాండ 41

కుబేరుని యాజ్ఞపై పుష్పకవిమానము రామునివద్దకు వచ్చెను. రాముడా విమానమును, లాజాక్షతపుష్పధూపచందనాదులతో పూజించి స్వాగతసత్కారములు నెరపి యిట్లు పలికెను-

*గమ్యతామితి చోవాచ ఆగచ్ఛ త్వం స్మరే యదా,*
*సిద్ధానాం చ గతౌ సౌమ్య మా విషాదేన యోజయ.* 14

*ప్రతిఘాతశ్చ తే మా భూద్యథేష్టం గచ్ఛతో దిశః.* 15

'నీ విక వెళ్ళిపొమ్ము. నేను స్మరించినపుడు తిరిగిరమ్ము. నేను విడిచితినని వియోగదుఃఖ మందవలదు. అవసర మెరిగి నేను నిన్నుపయోగించుకొందును. స్వేచ్ఛగా నీవు సకలదిక్కులను సంచరించునపుడు నీ కెట్టి ఆటంకముగాని, గత్యవరోధముగాని కలుగకుండుగాక.'

గుహుడు తెచ్చిన నావపై శ్రీరాముడు గంగ దాటనెంచి సీతాలక్ష్మణ సహితుడై నావ నధిరోహించెను. ఆత్మహితార్థ మతడు వైదికమంత్రములు జపించెను. తిరిగి ఆచమించి సీతతో కూడి గంగ కతడు నమస్కరించెను. లక్ష్మణుడును గంగకు శిరస్సు వంచి నమస్కరించెను. కేవర్తులు నావను నడుపసాగిరి. అది నదీమధ్యమునకు చేరినంతనే సీత చేతులు జోడించి గంగ నిట్లు ప్రార్థించెను-

*పుత్రో దశరథస్యాయం మహారాజస్య ధీమతః,*
*నిదేశం పాలయత్వేనం గంగే త్వదభిరక్షితః.* 83

*చతుర్దశ హి వర్షాణి సమగ్రాణ్యుష్య కాననే,*
*భ్రాత్రా సహ మయా చైవ పునః ప్రత్యాగమిష్యతి.* 84

*తతస్త్వాం దేవి సుభగే క్షేమేణ పునరాగతా,*
*యక్ష్యే ప్రముదితా గంగే సర్వకామసమృద్ధినీ.* 85

*త్వం హి త్రిపథగా దేవి బ్రహ్మలోకం సమీక్షసే,*
*భార్యా చోదధిరాజస్య లోకేఽస్మిన్ సంప్రదృశ్యసే.* 86

*సా త్వాం దేవి నమస్యామి ప్రశంసామి చ శోభనే,*
*ప్రాప్తరాజ్యే నరవ్యాఘ్రే శివేన పునరాగతే.* 87

*గవాం శతసహస్రం చ వస్త్రాణ్యన్నం చ పేశలమ్,*
*బ్రాహ్మణేభ్యః ప్రదాస్యామి తవ ప్రియచికీర్షయా.* 88

*సురాఘటసహస్రేణ మాంసభూతౌదనేన చ,*
*యక్ష్యే త్వాం ప్రీయతాం దేవి పురీం పునరుపాగతా.* 89

*యాని త్వత్తీరవాసీని దైవతాని చ సంతి హి,*
*తాని సర్వాణి యక్ష్యామి తీర్థాన్యాయతనాని చ.* 90

*పునరేవ మహాబాహుర్మయా భ్రాత్రా చ సంగతః,*
*అయోధ్యాం వనవాసాత్తు ప్రవిశత్వనఘోఽనఘే.* 91

'గంగాదేవీ! ఇతడు ధీశాలియైన దశరథమహారాజు పుత్రుడు. తండ్రి యాజ్ఞను పాలించుటకై వనమున కరుగుచున్నాడు. ఇతడు నీచే సురక్షితుడై, తండ్రిగారి యాజ్ఞను పాలింపగల్గుగాక. ఇట్లు నీ వనుగ్రహింపుము. అడవిలో పదునాలుగేండ్లు వసించి యితడు తమ్మునితోను నాతోను కలిసి అయోధ్యకు మరలి వచ్చును. సౌభాగ్యశాలిని వగు గంగాదేవీ! వనమునుండి కుశలముగా మరలివచ్చి, సంపూర్ణమనోరథురాల నగు నేను నీ సంతుష్టికై నిన్ను పూజించెదను. స్వర్గమర్త్యపాతాళమార్గములు మూడింటియందును చరించునట్టి ఓ దేవీ, నీ విచ్చటనుండి బ్రహ్మలోకమువరకు వ్యాపించియున్నావు. ఈ లోకములో సముద్రుని రాణిగా కనిపించుచున్నావు.

శోభాశాలిని వగు దేవీ, పురుషసింహుడైన రాముడు కుశలముగా అయోధ్యకు తిరిగి వచ్చి తన రాజ్యమును తాను వహించును. నేనప్పుడు నీకు నమస్కరించి నిన్ను స్తుతించెదను. నీకు ప్రియము గూర్చుటకై బ్రాహ్మణులకు ఒక లక్ష గోవులను దాన మిచ్చెదను. వారికి వస్త్రములు, మేలైన భోజనము కల్పింతును. అయోధ్యకు తిరిగివచ్చిన వెంటనే నీ కనేక దివ్యవస్తువులు సమర్పించి రాజస్వరహితమైన భూమి నర్పించి, వస్త్రహారాదికమిచ్చి నిన్ను పూజించెదను. నీవు నాయందు దయ వహింపుము. నీ తీరమున గల దేవతలను, తీర్థములను, ఆలయములను కూడ పూజించెదను. పవిత్రగంగానదీ! పాపరహితుడైన నా పతి, నాతోను తమ్మునితోను కలిసి వనవాసము ముగించుకొని తిరిగి అయోధ్యకు చేరుకొనుగాక.'

## 7. యమునకు మ్రొక్కు అయోధ్యాకాండ 55

భరద్వాజాశ్రమమున నొక రాత్రి వసించిన పిదప రాముని కా ముని చిత్రకూటపర్వతమునకు మార్గము చూపెను. అతడు సీతారామలక్ష్మణులు ముగ్గురను ఆశీర్వదించి పంపెను. యమున దాటవలసివచ్చెను. పడవ లేదు. కనుక రాముడును లక్ష్మణుడును కలిసి అడవిలోని ఎండు కట్టె లేరి తెచ్చి వాటితో బల్లకట్టు పడవ నొకదానిని తయారుచేసికొనిరి. ఆ పడవపై గడ్డి పరిచిరి. ప్రబ్బలి తీగలు, నేరేడుకొమ్మలు కూర్చి సీతకు కూర్చొన దగిన సుఖాసన మేర్పరచిరి. ముందుగా సీత నా పడవపై నెక్కించి పిదప రాముడును, లక్ష్మణుడును దానిని పట్టి నడపదొడగిరి. యమునానదిలో ప్రవాహమధ్యము చేరినంతనే సీత నమస్కరించి ఆ నది నిట్లు ప్రార్థించెను-

*స్వస్తి దేవి తరామి త్వాం పారయేన్మే పతివ్రతమ్,* 19
*యక్ష్యే త్వాం గోసహస్రేణ సురాఘటశతేన చ,*

*స్వస్తి ప్రత్యాగతే రామే పురీమిక్ష్వాకుపాలితామ్.* 20

'దేవీ, ఈ నావపై నిన్ను దాటుచున్నాను. నీవు మాయందు కృపగల్గి మేము తిరిగి కుశలముగా వచ్చున ట్లనుగ్రహింపుము. వనవాసవిషయకమైన నా పతిప్రతిజ్ఞను నిర్విఘ్నముగా కొనసాగనిమ్ము. ఇక్ష్వాకువీరుల రాజధాని యగు నీ అయోధ్యకు శ్రీరాముడు క్షేమముగా తిరిగి వచ్చినతోడనే నీ యొద్దున నేను వేయి గోవులు దాన మిచ్చెదను. నూరు మద్యఘటములతో నిన్ను పూజించెదను.

# వ్యక్తి పరిచయములు

## 1. అగస్త్యుడు

ఇతడు వసిష్ఠునివలెనే మిత్రావరుణుల పుత్రుడు. ఊర్వశిచే సమాగమమునకు నిరాకరింపబడిన వరుణుడు తన తేజమును దేవకుంభమున విడిచెను. మిత్రుడు ఊర్వశిని శపించి తన వీర్యము నదే కుంభమున విడిచెను. ఆ కుంభమునుండి ఇరువురు తేజస్వులైన మహర్షులు జన్మించిరి. వారిలో నొకడు అగస్త్యుడు. రెండవవాడు వసిష్ఠుడు. కాని అగస్త్యుడు మిత్రునితో 'నేను నీ పుత్రుడను కాను' అని చెప్పెను. మరియొక గాథ ననుసరించి ఊర్వశిని చూచి మిత్రావరుణు లిద్దరును తమ తేజమును కమలములో విడిచిరి. దానినుండి అగస్త్యవసిష్ఠు లుదయించిరి. రాజకుమారియైన లోపాముద్ర అగస్త్యుని భార్య యైనది. ఆమె ఐశ్వర్యము నెక్కుడుగా కోరినది. అందువలన విరాగి అయ్యును అగస్త్యు డామె సంతోషముకొరకు ఇల్వలుని సంపద నంతటిని గ్రహించెను. సముద్రములో నుండు కాలకేయులు జనులను పీడించుచుండగా, అగస్త్యు డా సముద్రపు నీటిని పూర్తిగా త్రాగివేసెను. నహుషు డితనిని తన వాహకునిగా చేయగా, నితని జటాగ్రమున నున్న భృగువు నహుషుని 'పదివేల సంవత్సరములు పామువై పడియుండు'మని శపించెను. అగస్త్యుడు రామునికి సువర్ణవజ్రశోభితమైన ధనువును, అమోఘములగు బాణములను, అక్షయతూణీరములను ఇచ్చెను. మరుత్తుని యజ్ఞపశువును ఇంద్రు డపహరించెను. మరుత్తు ఇంద్రుని శిక్షింప నుద్యుక్తుడాయెను. అప్పు డగస్త్యుడు మరుత్తును శాంతింపజేసి ఇంద్రమరుత్తులకు సంధిజేసెను. ఇతడు దశవార్షిక సత్రయాగ మారంభించి పశుబలి ఇయ్యకయే ఇంద్రునిచే వర్షము కురిపించెను. ఇతడు దక్షణదిశలో నుండె దక్షిణస్వామిగా పేరొందెను. లోపాముద్రయం దితనికి ఇధ్మవాహుడు (దృఢస్యుడు) జన్మించెను. బహుశా ఇధ్మవాహ దృఢస్యులు వేర్వేరుగా నిర్వురు పుత్రులైనను కావచ్చును. భాద్రపదమున దక్షిణదిక్కున అగస్త్యనక్షత్ర ముదయించును. అగస్త్యోదయ

మైనంతనే జలములు నిర్మలము లగునని యందురు. ఈ నక్షత్రమును అగస్త్యఋషిగనే భావించుచుందురు. ఇతని పేరున నెన్నో గ్రంథము లున్నవి. ఈయన పేరుతో గోత్ర మొకటి కూడ కలదు.

## 2. అంగదుడు

ఇతడు తారయందు వాలికి కలిగిన పుత్రుడు. తండ్రి కత్యంతప్రియుడైన పుత్రుడే కాక ఇతడు తండ్రివలెనే శూరవీరుడు. వాలి తాను చనిపోవునపుడు ఇతనిని సుగ్రీవున కప్పగించి పుత్రునివలె చూడదగునని చెప్పెను. అంగదునితో కూడ సుగ్రీవుని యాజ్ఞాపాలనమున మెలగుమని చెప్పెను. కాని అంగదుడు సుగ్రీవుని పెద్దగా నమ్మలేదు. శ్రీరాముని సహాయార్థము బృహస్పతియంశమున నంగదుడు జన్మించెను. అట్లే ఇతడు బుద్ధిమంతుడు. వాలివధానంతరము రాముడు సుగ్రీవుని కిష్కింధారాజ్యమున కభిషేకించెను. అప్పుడు సుగ్రీవునిచే అంగదుని యువరాజుగా నభిషేకింపజేసెను. సీతాన్వేషణమున దక్షిణదిశ కేగిన వానరసమూహమునకు నాయకుడుగా నంగదుడు నియమింపబడెను. ఆ సమయమున దారిలో నిత డొక రక్కసుని వధించెను. సీతను వెదకి తిరిగి రావలసిన కాలము (గడువు) దాటిపోవుటచే సుగ్రీవునికి భయపడి వానరులు ప్రాయోపవేశము చేసి మరణింపనెంచిరి. కాని సంపాతిచే సీత వార్త వినిన పిదప సముద్ర మెట్లు దాటనగునని యోచింపసాగిరి. అంగదుడు వేర్వేరు వానరముఖ్యుల బలములు, వేగములు తెలిసికొనదలచి యడిగెను. పిదప తాను నూరు యోజనము లున్న యా సముద్రమును దాటుటకు నిశ్చయించెను. యుద్ధారంభవేళ శ్రీరాముని దూతగా రావణుని వద్ద కేగెను. ఇంద్రజిత్తుతో తలపడి యుద్ధమున చీకాకుపరచెను. నరాంతక, మహాపార్శ్వ, వజ్రదంష్ట్రిలను వధించెను. కుంభకర్ణుని మహోన్నతవిగ్రహము చూచి భయపడి పారిపోవుచున్న వానరుల నడ్డగించి యుద్ధమునకు ప్రోత్సహించెను. అంగదుని పరాక్రమమును రాముడు మెచ్చుకొనెను. రాజ్యాభిషేకావసరమున రాము డితనికి బాహువలయ మిచ్చి సత్కరించెను. అంగదుని తన యంకమున నుంచుకొని రాముడు సుగ్రీవునితో నిట్లు చెప్పెను. 'అంగదుడు నీ పుత్రుడు. విషయపరామర్శలో నిపుణుడు. నాకు హితము గూర్చుటలో కడు సమర్థుడు. సుగ్రీవుడు కూడ కిష్కింధారాజ్య మంగదునికే యిచ్చెను.

## 3. అంజన

పుంజికస్థల యను నప్సరస శాపవశమున వానరరాజైన కుంజరునకు పుత్రికయైనది. శివశతరుద్రసంహితలో నీమె గౌతమమహర్షి కుమార్తెగా పేర్కొనబడినది. ఈమె వానరయూథపుడైన కేసరిని వరించినది.వాయుదేవుని కృపవలన నీమెకు హనుమంతుడు జన్మించెను. ఇది పురాణవచనము. మతంగ మహర్షి వచనమున నీమె పతిసహితముగా వేంకటాచలమున పుష్కరిణీ తీర్థమున స్నానము చేసి వరాహస్వామి వేంకటేశుల నారాధించెను. ఆకాశగంగా తీర్థమునకు పోయి ఈమె వాయుదేవు నారాధించెను. వేయి సంవత్సరములు తపము చేయగా ప్రసన్నుడై వాయుదేవు డీమెకు వర మీయ వచ్చి, అడుగగా నీమె పుత్రప్రాప్తివర మర్థించెను. ఆ వరప్రసాదమున జనించిన పుత్రుడే హనుమంతుడు. ఈమె కామరూపధారిణి. ఈమెకు మార్జార యను సవతి యుండెను.

## 4. అతికాయుడు

ఇతడు రావణునకు ధాన్యమాలినియందు జన్మించెను. ఇతని శరీరము చాల విశాలమైనది. బ్రహ్మను మెప్పించి యితడు దివ్యాస్త్ర కవచ రథములను సురాసురులచే నవధ్యత్వమును వరములుగా గ్రహించెను. ఇత డింద్రవరుణుల నోడించెను. కుంభకర్ణుని వధానంతరము యుద్ధమున కేగి యితడు గర్జించినపుడు వానరసేన భయవికలమై రామునివద్దకు పర్వెత్తెను. శ్రీరాముని కతికాయుని గూర్చి చెప్పుచు విభీషణు డిట్లు చెప్పెను- 'ఇతడు బలపరాక్రమసంపన్నుడు, వృద్ధోపసేవి, వేదశాస్త్రపరిజ్ఞాత, అస్త్రశస్త్రవిదులలో శ్రేష్ఠుడు, గజాశ్వయుద్ధము లలోను, ఖడ్గసంచాలనములోను బాణసంధానప్రయోగములలోను నేర్పరి. సామదాన ప్రయోగములోను న్యాయోచితవ్యవహారములోను సముచితమంత్రణమునను నితని నందరు మెచ్చుకొందురు. ఇతడు యుద్ధములో రాము నెదిరించి యిట్లు పలికెను- 'సామాన్యులతో యుద్ధమొనర్చుట నా కిష్టము లేదు. శక్త్యుత్సాహ సాహసము లున్నవారు నన్నెదిరించి పోరాడ వచ్చెదరుగాక.' యుద్ధములో నితడు లక్ష్మణుని చేతిలో మరణించెను.

## 5. అదితి

ఈమె ప్రాచేతసుడైన దక్షునికిని, అసిక్నికిని పుత్రిక. కశ్యపుని భార్య.

మిత్ర వరుణు లామె బిడ్డలు. ఈమెకు ఎనమండుగురు కొడుకులు. వేదములలో నీమె విష్ణుపత్నిగా కూడ పేర్కొనబడినది. అట్లే ఈమె పృథ్వీరూపిణిగా చెప్పబడినది. మైనాకపర్వతశిఖరమున గల వినశనతీర్థమున నీమె చరుపు వండినది. పుత్రప్రాప్తికై ఈమె ఒంటికాలిపై నిలిచి తపస్సుచేసెను. ఫలితముగా విష్ణు వీమె గర్భమున జనించెను. ఈమెకు పన్నెండుగురు పుత్రు లుండిరని కూడ వర్ణింపబడెను. తైత్తిరీయమున నీమె కెనమండుగురు పుత్రు లున్నట్లు చెప్పబడెను. అదితి కేవలము ఏడుగురు పుత్రులనే కోరి, ఎనిమిదవ గర్భము నడపగా దానినుండి మార్తాండుడు లేక వివస్వానుడు జన్మించినట్లు వర్ణింపబడెను. నరకాసురు డీమె కర్ణకుండలము లపహరించెను. శ్రీకృష్ణుడు వానిని వధించి కుండలము లీమెకు తిరిగి యర్పించెను. ఈ కథ మహాభారతమున నుద్యోగ పర్వములో వర్ణింపబడెను.

ఈమె వైదికదేవీమూర్తి. ద్వాదశాదిత్యుల జనని. ఋగ్వేదమున నీమె విశ్వమాతగా సంబోధింపబడెను. ఆదిత్యులకు మాతగా ఈమె కత్యంత గౌరవస్థానము లభించినవి.

## 6. అనరణ్యుడు

వాల్మీకిరామాయణమున (బాలకాండ 70/23, 24లో) నిత డిక్ష్వాకు కులమున బాణుని పుత్రుడనియు, పృథుని తండ్రి యనియు చెప్పబడెను. భాగవతములో నితడు త్రసదస్యుని పుత్రుడుగా వర్ణింపబడెను. మరికొన్ని పురాణము లితనిని సంభూతుని పుత్రుడుగా పేర్కొనెను. ఇత డయోధ్యలో రాజ్యము చేయుచుండగా రావణుడు యుద్ధమునకు వచ్చెను. యుద్ధములో నితని సేన నశించెను. కాని వీరుడైన అనరణ్యుడు వెనుదీయక మారీచ శుక సారణ ప్రహస్తాదుల నోడించెను. రావణు డితని మస్తకమున నరచేతితో కొట్టగా నితడు రథమునుండి దొర్లి క్రిందపడెను. చనిపోవుచు నితడు రావణునికి శాపమిచ్చెను. మరియొక కథనము ననుసరించి, రావణు డితనిని వధించెను. ఆ సమయమున నితడు తపోవ్రతమున నుండెను. కాని వాల్మీకమున దీని కాధారము లేదు. పైగా 'రాక్షసా! నే నెన్నడును యుద్ధవిముఖుడను కాలేదు. యుద్ధములో నీవు నన్ను వధించితివి.' అని ఇతడు పల్కినట్లున్నది. (ఉత్తర -19-28).

## 7. అనసూయ

ఈమె కర్దమునికి, దేవహూతికి జనించిన కన్య. స్వాయంభువ వైవస్వత మన్వంతరములలో బ్రహ్మమానసపుత్రుడుగా నుదయించిన అత్రి మహామునికి భార్య. పురాణసాహిత్యములో నీమె ప్రసిద్ధురాలైన మహాపతివ్రత. నిరాహారిణియై యీమె మూడువందలయేండ్లు తపస్సు చేసెను. శివుని మెప్పు బడసెను. ఈమె గర్భమున దత్తాత్రేయ, దుర్వాస, చంద్రులను ముగ్గురు పుత్రు లుదయించిరి. చిత్రకూటమున నీమె గంగను పారించెను. మాండవ్యముని శూలమున నున్నతరి ఒకానొకముని పత్ని చీకటిలో ఆ శూలమును డీకొనెను. మాండవ్యు డామెను తెల్లవారుసరికి విధవ యగుమని శపించెను. అనసూయ ఆ మునిపత్ని స్నేహితురాలు. ఆమె సూర్యోదయ మాపివేసెను. లోక మంధకారబంధుర మాయెను. తిరిగి తన సఖికి వైధవ్యము రాకుండ వర మందుకొని ఆమె సూర్యోదయమున కనుజ్ఞ యిచ్చెను. ఈమెను దక్షకన్యగా కూడ పేర్కొందురు.

అత్రిముని రామునితో అనసూయను గురించి యిట్లు చెప్పెను- 'ఒకప్పుడు దశవర్షక్షామ మేర్పడెను. జగమంతయు మండిపోజొచ్చెను. అప్పుడనసూయ మహోగ్రతప మొనర్చి, తన తపఃప్రభావమున ఫలమూలము లుత్పన్నము చేసి మందాకిని నట ప్రవహింపజేసెను. ఈమె పదివేల సంవత్సరములు ఘోరముగా తపస్సుచేసి తన శీలవ్రతప్రభావమున ఋషీశ్వరులకు విఘ్నబాధ కలుగకుండ చేసెను. ఒకసారి దేవతలకొరకు కీమె పదిరాత్రుల నొక రాత్రిగా మార్చెను. రామచంద్రా, ఈ అనసూయ నీకు తల్లివలె పూజనీయురాలు.'

అనసూయకు లభించిన సతీత్వప్రఖ్యాతికి అసూయ వహించి ఉమాలక్ష్మీ సరస్వతు లొకసారి ఆమె పాతివ్రత్యమును భంగపరచుటకై తమ పతులు ముగ్గురిని పంపిరి. అట్లు వచ్చిన బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ముప్పురు అనసూయను నగ్నముగా తమకు భిక్ష పెడ్డింపుమని కోరిరి. అనసూయ తన పతిపాదోదకమును వారిపై జల్లి వారిని శిశువులుగా మార్చి స్తన్యపాన మిచ్చెను. ఆ తర్వాత ఆ ముగ్గురి యంశములవల్లను ఆమెకు దత్తాత్రేయ దుర్వాస చంద్రులు ముగ్గురును జన్మించిరి. ఇది వేరొకగాథ.

## 8. అంబరీషుడు

ఇతడు త్రిశంకుని ఇర్వురు పుత్రులలోను రెండవవాడు. ఇతని కుమార్తె పేరు శ్రీమతి. అద్భుతరామాయణము ననుసరించి నారదపర్వత వివాదమున చివరకు శ్రీవిష్ణువే శ్రీమతిని వరించినట్లు చెప్పబడెను. ఒకసారి కార్తీకమాసమున ఏకాదశీవ్రతమున దుర్వాసుడు ద్వాదశిపారణ కతిథిగా వచ్చెను. అతడు స్నానమునకై నది కేగి, ఆహ్నికము లొనర్చి వచ్చుసరికి ద్వాదశి సమాప్తమగు చుండెను. అందుపై అంబరీషుడు నైవేద్యమొసగి పారణము చేసెను. ఇది తెలిసి దుర్వాసుడు కోపించి తన జటనుండి కృత్యను పుట్టించి అంబరీషునిపై వదలెను. కాని విష్ణుభగవానుని చక్ర మా కృత్యను సంహరించెను. అంతతో నాగక అది దుర్వాసుని వెన్నంటెను. దుర్వాసుడు శ్రీవిష్ణుని చేరి రక్షింపగోరెను. కాని విష్ణు వతనిని అంబరీషునే శరణు పొందుమని చెప్పెను. ఇట్లు తిరిగి అంబరీషుని వద్ద కతడు వచ్చుటకు సంవత్సరకాలము పట్టెను. అంతవరకు అంబరీషుడు నిరాహారిగా నుండెను. అతడు దుర్వాసునికి స్వాగతమిచ్చి, చక్రమును స్తుతించి వెనుకకు మరల్చి, మునికి భోజనము కల్పించెను. ఈ కథ భాగవతములో నున్నది. పద్మపురాణములో దీనిని పక్షవర్ధనీ ఏకాదశీవ్రతమనియు, దీనినొనర్చి ద్వాదశిపారణ గావించినచో మహావిష్ణునికి ప్రీతిపాత్రు లగుదు రనియు చెప్పబడినది. అట్టివారికి మోక్షము లభించునని చెప్పబడెను. అంబరీషునికి స్వర్గములో సుదేవుడను సేనాపతి కనిపించెను. రణభూమిలో వీరగతి నందిన కారణముచే నతనికి స్వర్గము లభించెనని యింద్రుడు చెప్పెను. ఇతనికి ముగ్గురు పుత్రులు. (చూ. ఋచీకుడు. క్రమసం. 18)

## 9. అరజ

ఈమె శుక్రాచార్యుని కుమార్తె. ఈమెను మోహించి దండుడు బలాత్కారముగా ననుభవించెను. శుక్రుని కీ విషయము తెలిసి, అతడు దండుని, దండకారణ్యమును శపించెను. పిదప కుమార్తెతో నిట్లనెను - 'నీవు సావధానురాలవై యీ ఆశ్రమముననే నిలువుము. ఇచ్చటి యోజనాయతమగు సరోవరమున స్నానపానాదులు జరుపుకొనుచు ఇచ్చటనే నిల్వగా ఒకానొక రాత్రి ధూళి వర్షించును. అప్పుడిచ్చటి ప్రాణులెల్ల నీ సమీపమున గలవి తప్ప తక్కినవి నశించును.' అని పలికి శుక్రచార్యుడు వెడలిపోయెను. తండ్రి చెప్పిన యీ మాటల కామె ఎంతగనో దుఃఖించెను.

## 10. అలర్కుడు

ఇతడు కాశీరాజైన దివోదాసుని ప్రపౌత్రుడు. ఇతడు 66 వేల సంవత్సరములు రాజ్యము పాలించెను. ఇతనికి లోపాముద్రాశాపము వరమై దీర్ఘాయువు వచ్చినది. అట్లే యితడు చిరయౌవనుడు. క్షేమకుని సంహరించి యితడు నికుంభుని శాపముచే నిర్జనమైన వారణాసి నగరమును, తిరిగి ఆవాసయోగ్య మొనరించెను. ధనుర్బలమున నితడు పృథ్వి నంతటిని జయించెను. ఆపై నితనికి బ్రహ్మనిష్ఠయం దిష్టము కల్గెను. ఇతనికి సంతతి యను పుత్రు డుండెను. తల్లి ఇచ్ఛానుసార మితడు రాజ్యత్యాగ మొనర్చెను. ఇట్లీతనిని గూర్చి వేర్వేరు గ్రంథములలో పేర్కొనబడెను.

## 11. అసమంజుడు

సగరకేశినుల పుత్రుడు అసమంజుడు. బాలురను సరయూనదిలో ముంచి చంపి ఆనందించెడివాడు. ఇది అతని క్రూరవినోదము. పూర్వజన్మలో నతడొక యోగి, కాని కుసంగతిచే యోగభ్రష్టుడాయెను. తండ్రి సగరు డీతనిని నగరు వెడలనంపెను. ఇతడు వనములోనికి పోవుచు తాను మునుపు చంపిన బాలకు లందరిని తనయోగసామర్థ్యమున తిరిగి బ్రదికించెను. ఇతడు శివభక్తుడు. ఇతని కుమారుడు అంశుమంతుడు.

## 12. అహల్య

ఈమె బ్రహ్మకు మానసపుత్రిక. భాగవతమున నీమె తండ్రి ముద్గలు డని చెప్పగా హరివంశమున వధ్ర్యశ్వుడని పేర్కొనబడెను. ఈమెలో కురూపమనునది ఏమాత్రమును లేనందున బ్రహ్మ ఈమెకు అహల్య అని పేరిడెను. బాల్యమున నీమెను బ్రహ్మ గౌతమునివద్ద నుంచెను. యువావస్థ ప్రాప్తించగనే గౌతము డీమెను బ్రహ్మవద్దకు గొనిపోయెను. అతని జితేంద్రియత్వమునకు మెచ్చి బ్రహ్మ ఈమెను గౌతమున కీయదలచెను. అనంతరము పృథ్వీపరిక్రమణ మొనర్చి అందరికన్న ముందు వచ్చినవానికి ఈమె నీయ నిశ్చయించెను. 'దేవదానవయక్షాదు లందరును సౌందర్యరాశియగు ఈమెను పొందుటకు ప్రయత్నింతురుగాక' యని బ్రహ్మ తలంచెను. అట్లు చేయగా ఇంద్రుడు ఇతరదేవతలతో పాటు పృథ్వీ పరిక్రమణము చేయ నారంభించెను. అర్ధప్రసూత యగు గోమాత పృథ్వితో సమానమని చెప్పుదురు. గౌతము డట్టి అర్ధప్రసూత

యగు గోపు నొక దానిని చుట్టివచ్చి బ్రహ్మచెప్పిన మాట చెల్లించెను. అంత నతనితో అహల్యకు వివాహము జరుపబడెను. ఇది విని దేవతలు దుఃఖించిరి. ఇంద్రు డామె నధికముగా కాంక్షించినందున ఎక్కువగా దుఃఖించెను. ఒకసారి గౌతము డింటిలో లేని సమయమున నతడు గౌతముని వేషమున వచ్చి అహల్యను సమాగమ మర్థించెను. అహల్య ఇంద్రుని పొందు వాంఛించినది. సమాగమానంతరము కృతార్థత నెరిగించి ఆమె ఇంద్రుని శీఘ్రముగా వెడలిపొమ్మని చెప్పెను. కాని ఉత్తరకాండములో, అహల్య యింద్రుని పోల్చుకొనలేదనియు, ఆ కారణమున పొరపాటు జరిగినదనియు చెప్పబడినది. బ్రహ్మపురాణములో, ఇంద్రుడు కొన్నాళ్లిట్లు అహల్యాసమాగమమునకు వచ్చుచుండెననియు, గౌతముని శిష్యు లిది కనిపెట్టి గురువుగారికి నివేదించిరనియు, తర్వాత గౌతముడు నిజ మెరిగెననియు చెప్పబడినది. అతడు అహల్యను, ఇంద్రుని కూడ శపించెను. అహల్య కిచ్చిన శాపము వేర్వేరు గ్రంథములలో వేర్వేరుగా నున్నది. వాల్మీకమున గౌతము డిట్లు పలికినట్లున్నది- 'నీవు ఇతరులకు కనబడవు. నీవు వాయుమాత్రభక్షణము సలుపుచుందువు. నీ రూపము విభక్తమగును.' ఆనందరామాయణసారమున, స్కాందపురాణమున, గణేశపురాణమున కూడ అహల్యాశాపము వర్ణింపబడినది. 'నీవు రాయివగుము' అని శపించినట్లున్నది. పద్మపురాణములో 'నీ శరీరము అస్థిచర్మమాత్రావశిష్టమై మాంసనఖాదు లుత్పన్నము గాకుండ నుండును. ఇట్టి నీ రూపముచే స్త్రీల కిట్టి పాపకృత్యమునకు సాహసము కలుగదు' అని శపించి శాంతిగా మహావీరుడగు దశరథాత్మజుడు రాము డీ వనమునకు రాగలడు. లోభమోహములు విడిచి నీ వాతనికి సాదరాతిథ్య మిచ్చి శాపముక్తవై పూర్వపు రూపమును పొంది ప్రసన్నురాలవై నా చెంత చేరగలవు' అని గౌతమవచనముగా పేర్కొనబడినది. స్కందపురాణాను సారము గౌతమమహర్షి అహల్య ముక్తికొరకు కోటితీర్థమును సేవించి తపము చేసినట్లును, అప్పుడామెకు శాప ముక్తి కలిగినట్లును, ఆ చోటున అహల్యాసరో వర మేర్పడినట్లును చెప్పబడినది.

తపస్సువలన శుద్ధురాలైన అహల్య తిరిగి గౌతముని చేరినది. బ్రహ్మపురాణమున గౌతమిగా పేర్కొనబడినది. ఇంద్రసమాగమమునకు పూర్వమే ఈమెకు గౌతమునివలన శతానందుడను పుత్రుడు జన్మించెను. గౌతముని శిష్యుడైన ఉత్తంకునితో నహల్య సౌదాసుని రాణివద్ద గల కుండలములు గ్రహించి తెచ్చి గురుదక్షిణగా ఇమ్మని చెప్పినట్లున్నది.

## 13. ఆదిత్యుడు (సూర్యుడు)

వైవస్వతమన్వంతరములో ప్రసిద్ధులగు దేవతలకు 'ఆదిత్యు' లనునది సామూహికనామము. ఋగ్వేదములో ఆరు సూక్తములు ఆదిత్యుని వర్ణించుచున్నవి. ఆదిత్యులు పన్నెండుగురు. వారు పన్నెండు మాసములను సూచింతురు. అదితి పుత్రు డగుటచే ఇంద్రుడు ఆదిత్యులలో నొకడు. కాని అత డాదిత్యుల కంటె వేరు. తరచుగా దేవతావర్ణన లన్నిటిలోను ఆదిత్యులు కూడ వర్ణింపబడుచుందురు. కాని వాటిలో ఆదిత్యులలో ముఖ్యుడగు మిత్రుడు వరుణునితో చేరడు. వీరిని వర్ణించుచూ వీరు సర్వాధారులు, సర్వపాలకులు, మనోభిప్రాయాభిజ్ఞులు, పాపులను శిక్షించువారు, రోగపరిహర్తలు, దీర్ఘాయు ప్రదాతలుగా చెప్పబడుచుందురు. తన గర్భమున సాధ్యదేవత జన్మింపవలెనని బ్రహ్మనుగూర్చి అదితి పాయసము వండెను. దాని నాహుతిగా ఇచ్చి, చరుశేషమును భుజింపగా ఆమెకు ధాత, అర్యము డనువారు జన్మించిరి. రెండవసారి మిత్రావరుణులు, మూడవసారి అంశభగులు, నాల్గవసారి ఇంద్రవివస్వంతులు జన్మించిరి. ఈ అదితిపుత్రులే ద్వాదశాదిత్యులు లేదా సాధ్యదేవతలు.

## 14. ఇంద్రుడు

ఇంద్రు డనునది యొక బిరుదనామము. నూరు యజ్ఞములు చేసినవారి కీ బిరుదము కలుగును. ఇంద్రుని ముఖ్యకర్తవ్యము ప్రజారక్షణము. విభిన్నమన్వంతరములలో విభిన్నవ్యక్తు లింద్రులైరి. కాని వారి గుణశీలవ్యవహారము లన్నియు సమానముగానే అగపడును. సప్తర్షులు వీరికి సలహాదారులు. గంధర్వాప్సరసలు వీరి ఐశ్వర్యము. ఇంద్రుడు వజ్రపాణి, సహస్రాక్షుడు, పురందరుడు, మఘవానుడు నని పిలువబడును. నహుష, హిరణ్యకశిపు, బలి, ప్రహ్లాదులు కొంతకాల మింద్రపదవి నందిరి. ఇంద్రుడు వర్షాధిదేవత.

రామాయణ మహాభారతాది ప్రాచీనకావ్యములలో ఇంద్రుడు అదితిపుత్రుడైన శక్రుడుగా పేర్కొనబడెను. ఇతడు దేవతలరాజు. శచీదేవి ఇతని భార్య. నూరు యజ్ఞములు పూర్తిచేసిన వారి కింద్రపదవి లభించుననుటచేత, ఎవరేని అశ్వమేధము చేసినచో ఇంద్రు డా యజ్ఞాశ్వము నపహరించుచుండును. అట్లే ఎవరైనా ఉగ్రముగా తపస్సు చేసినచో ఆ తపస్సునకు విఘ్నము కల్పించుట కితడు దేవవేశ్యలను పంపుచుండును. విశ్వామిత్రుని తపోభంగమునకై ఇతడు రంభను

పంపించెను. యముని తపస్సు చెరచుటకై గణిక యను నప్సరస నంపెను. గౌతముని రూపమున నేగి ఇతడు అహల్యను కూడెను. గౌతముని శాపముచే వృషణహీనుడై తాను దేవహితార్థ మట్లు చేసి వృషణహీనుడ నైతిననియు దానికి మారు చేయవలెననియు కోరగా పితృదేవత లితనికి మేషవృషణములు కల్పించిరి. అట్లాతడు మేషవృషణుడయ్యెను. ఇట్లే రుక్మానందుని మోహించిన వాచక్నవీముని భార్య ముకుంద యను నామెతో కూడ ఇతడు రుక్మానంద రూపమున నరిగి సంగమించెను. ఇతడు హిరణ్యాక్ష హిరణ్యకశిపులను వధింపజేసెను. అందువలన వారి తల్లి దితి ఇంద్రఘాతకుడగు పుత్రుని బడయగోరి పతి కశ్యపుని ప్రార్థించెను. కశ్యపు డొక నియమముంచి ఆమె కోరిక తీర్చ ననుగ్రహించెను. కాని ఆ నియమము నామె పూర్తిగా పాలింపలేదు. అప్పు డింద్రు డామె గర్భమున ప్రవేశించి గర్భస్థపిండమును ఏడు ముక్కలు చేసెను. దుర్వాసు డింద్రుని కొక పుష్పమాలిక నీయగా, ఇంద్రుడు దాని ననాదరించినందున ఆ ముని కోపించి ఇతనిని శపించెను. విశ్వామిత్రుని ప్రయత్నముచే స్వర్గమునకు వచ్చిన త్రిశంకు నితడు తలక్రిందుగా త్రోసివేసెను. శరభంగమునిని బ్రహ్మలోకమునకు గొనిపోవుటకై ఇతడు స్వయముగా రథముగొని యేగెను. రామరావణయుద్ధసమయమున నితడు తన సారథి మాతలిద్వారా రామునికి రథమంపెను. కుంభకర్ణుని కిత డోడిపోయెను. ఇంద్రజిత్తు ఇతనిని బంధించి లంకకు గొనిపోయెను. అప్పు డితనిని విడిపించుటకు బ్రహ్మ మేఘనాదునికి పరిమితామరత్వమును, అగ్నినుండి వెలువడి నట్టి దివ్యరథమును వరముగా నిచ్చెను. బ్రహ్మ చెప్పిన మాటలపై నితడు వైష్ణవయాగ మొనర్చెను. ఇతని వజ్రఘాతమువలన వాయుపుత్రుని హనువు భగ్నమై అతడు హనుమంతుడని ప్రసిద్ధి బడసెను. విష్ణువు నాజ్ఞచే ఇత డశ్వమేధము చేసెను.

బ్రహ్మ కోరగా నితడు నిద్రాసహాయుడై పోయి లంకలో నున్న సీతకు హవిష్యాన్న మిచ్చి వచ్చెను. ఆ హవిస్సు భుజించినచో ఆకలిదప్పికలు లేక జీవింపవచ్చును. త్వష్టృపుత్రుడైన వృత్రాసురుని సంహరించినందున నింద్రునికి బ్రహ్మహత్య చుట్టుకొనెను. మైనాకుడు సముద్రలంఘనవేళ హనుమంతునికి విశ్రాంతి కల్పింప నరిగెను. శ్రీరాముని కార్యమున నిట్లు సహాయపడినందున మైనాకున కితడు వరమిచ్చి సముద్రమున నుంచెను. కబంధరాక్షసు నితడు వజ్రాయుధముచే కొట్టి అతని తల కడుపులోనికి జొనిపి, జీవనార్థమతడు ప్రార్థింపగా వానికి యోజనాయతబాహువు లిచ్చెను. శునఃశేపుని స్తుతులకు ప్రసన్నుడై ఇంద్రు డతనికి దీర్ఘాయు విచ్చెను.

ఇంద్రుడు తన శరీరమందలి మాలిన్య, క్షుధలను వహించిన మలద, కరూషము లను ప్రదేశములయెడ ప్రసన్నుడై, వానికి సమృద్ధివర మిచ్చెను. కశ్యపుడు విష్ణువును అదితిగర్భమున జన్మింపు మని వేడెను. అట్లే విష్ణు వామె కడుపున వామనుడై జన్మించెను. అతడు బలిని నిగ్రహించి ఇంద్రునికి తిరిగి దేవరాజ్య మిప్పించెను. ఋక్షవానరుని పత్ని విరజకు ఇంద్రుని యంశమున వాలి యను పుత్రు డుదయించెను.

## 15. ఇల, ఇలుడు

ఇలుడు కర్దమప్రజాపతి కుమారుడు. బాహ్లిక దేశపాలకుడు. శివ-పార్వతుల వరమువలన ఇతనికొక మాసము పురుషత్వము మరియొకమాసము స్త్రీత్వము కలుగుచుండెను. పురూరవు డితని కుమారుడు. ఇతడు వైవస్వతమనువు (శ్రాద్ధదేవుడు) నకు శ్రద్ధకు జన్మించెను. వారిర్వురు పుత్రప్రాప్తికై మిత్రావరుణుల నుద్దేశించి వసిష్ఠునిచే పుత్రకామేష్టి చేయించిరి. వారికి ఇల యను పుత్రిక కల్గెను. కాని మనువు కోరికపై వసిష్ఠ డామెను పురుషునిగా చేసెను. ఇత డొకసారి వేటకేగి శివునిచే శపింపబడిన శరవణమున కరిగెను. అప్పు డితనికి సపరివారముగా స్త్రీత్వము కలిగెను. మత్స్య, పద్మపురాణముల ననుసరించి యితనికి వసిష్ఠుని కృపవలన ఒక నెల పుంస్త్వము, వేరొక నెల స్త్రీత్వము కలుగుచుండెను.

రామాయణము (ఉత్తర -90) ననుసరించి ఇతనికి స్థిరముగా పురుషత్వము కలుగుటకై మరుత్తు శంకరప్రీతిగా నశ్వమేధ మొనర్చెను. శంకరుడు ప్రసన్నుడై యితనికి శాశ్వతపురుషత్వము ప్రసాదించెను. స్కందపురాణము ననుసరించి ఇలమహారాజు అరుణాచలేశ్వరు నారాధించి పురుషత్వము పొందినట్లును, బ్రహ్మపురాణము ననుసరించి గౌతమీనదిలో స్నానముచేసి పురుషత్వ మందినట్లును తెలియుచున్నది.

స్త్రీరూపమున నితనికి బుధునివలన పురూరవుడు జన్మించెను. ఇతని కింకను ముగ్గురు సంతాన ముండిరి.

## 16. ఉమ

ఈమె హిమాలయమునకు, మేనకు రెండవకుమార్తె. రుద్రుని పత్ని. పార్వతీదేవి కీమె సౌమ్యరూపము. ఈమె యొక శక్తిదేవి. ఈమె మొదట

గౌరవర్ణ కాని నిశాదేవి స్పర్శవలన శ్యామవర్ణ మందెను. అందుచే పతి ఈమె నుపేక్షించగా నుభయులకు నడుమ మనోమాలిన్య ముదయించెను. అప్పు డీమె గౌరవర్ణప్రాప్తికై తపస్సు చేసి అభీష్టసిద్ధి పొందెను. ఈమెకు రుద్రునివలన సంతతి కలుగలేదు. శివునివలన ఆకాశగంగకు పుట్టిన పుత్రుడు గంగా ఉమల కిద్దరకు పుత్రు డగునని బ్రహ్మ వచించెను.

## 17. ఊర్వశి

ఋగ్వేదమున నెన్నో చోట్ల ఈమె ప్రసక్తి యున్నది. ఈమె చాల చక్కని అప్సరస. పద్మపురాణము ననుసరించి, ఒకసారి బదరికాశ్రమమున నరనారాయణులు తపస్సు చేయుచుండిరి. ఇంద్రుడు తన పదవికి భంగము వచ్చునేమో యని భయపడెను. అందుచే నతడు వారి తపస్సు భగ్నముచేయుటకు రంభ, మేనక, తిలోత్తమ మున్నగు పదహారువేల యాభైమంది అప్సరసలను బదరికావన మంపెను. కాని సఫలత కలుగలేదు. పైగా నారాయణుని తొడలో నుండి పదారువేలయాభైయొక్కమంది అప్సరస లుదయించిరి. వారిలో ఊర్వసి సర్వశ్రేష్ఠసుందరి. ఊరుభాగమున జన్మించుటచే ఈమెకు ఊర్వశి యని పేరు కలిగెను. నరనారాయణు లీమెను ఇంద్రునికి కానుకగా నిచ్చిరి.

సూర్యారాధన కేగుచు నీమె ఆదిత్యులలో నొకడగు మిత్రుని వరించెను. తర్వాత వరుణు డీమెను కలిసి వరింపబోయెను. కాని తాను ముందే మిత్రుని వరించిన ట్లీమె చెప్పి, తన ప్రేమ నాతని కర్పించెను. వరుణు డీమెను లక్ష్య మొనర్చి తన తేజము నొక కుంభమున విడిచెను. ఈ విషయము తెలిసి మిత్రుడు కోపించి ఈమెను మర్త్యలోకమున పురూరవుని పత్ని వగుదువని శపించి, తన వీర్యము నొక కుంభమున విడిచెను. ఈ రెండు కుంభముల నుండి అగస్త్యవసిష్ఠు లుదయించిరి. విష్ణుపురాణములో, ఊర్వశిని చూచుటతోనే మిత్రునికి వీర్యపతన మైనట్లును, శాపభయముచే దాని నతడు పాదముక్రింద త్రొక్కి మూసినట్లును, అందుండి వసిష్ఠు డుదయించినట్లును వర్ణింపబడినది.

నారదుని పొగడ్తలు విని ఈమె పురూరవుని వలచినది. లక్ష్మీస్వయంవర వేళ నృత్యము చేయుచు నీమె హావభావప్రకటనలో పొరబడినది. అది చూచి భరతముని ఈమెను ఏబది సంవత్సరములు లతగా పడియుండునట్లు శపించెను. శాపము తీరి ఈమె పురూరవుని వద్దకు పోవుచుండగా కేశి యను దైత్యు

డీమె నపహరింపబోయెను. ఆ సమయమున పురూరవు డీమెను రక్షించెను. ఊర్వశి మూడు నియమము (షరతు) లపై పురూరవునితో వివాహ మంగీకరించెను. ఈ నియమములలో నే యొకటి భగ్నమైనను తా నతనిని విడిచిపోయెద నని చెప్పెను. ఆ నియమము లే మనగా - (1) ఈమె తెచ్చిన మేకపిల్లలు రెండింటిని అతడు పుత్రసమానముగా పెంచి రక్షింపవలెను. (2) ఈమె ఘృతాహారమే కాని అన్యమెప్పుడు గ్రహింపదు (3) సంభోగావసరమున గాక తక్కిన వేళలో పురూరవు డామెకు నగ్నరూపమున కనబడకూడదు. ఈ నియమములు పాటించుచు పురూరవు డామెతో అరువదియొక్క వేయేండ్లు సుఖించెను. కాని ఆమీద మూడవ నియమము భగ్నమైనందున నామె అతనిని విడిచి దేవలోకమునకు వెళ్లిపోయెను.

మహాభారతమున నెన్నో చోట్ల ఊర్వశి పేర్కొనబడెను. ఈమె ఎల్లపుడును కుబేరుని సేవించుచుండెడిది. అర్జునుని జన్మసమయమున గాన మొనర్చిన పదునొకండుగురు అప్సరసలలో ఊర్వసి కూడ నుండెను. అర్జునుడు శిక్షార్థము దేవలోక మేగెను. అప్పు డత డీమెను పూజ్యభావమున జూచెను. కాని ఇంద్రుని కతనిపై అనుమానము కల్గెను. అందుపై నతడు చిత్రసేనగంధర్వునితో చెప్పి, ఊర్వశి నలంకరించుకొని అర్జునునివద్ద కేగునట్లు చేసెను. అర్జునుడు తన మనోభావమును స్పష్టముగా చెప్పి విముఖుడైనందున నీమె మానసికముగా నవమానపడి అతనిని ఒక సంవత్సరకాలము నపుంసకుడుగా నుండునట్లు శపించెను. ఊర్వశీతీర్థ మను పేర నొక పవిత్రతీర్థము ప్రసిద్ధము.

## 18. ఋచీకుడు

ఇతడు భార్గవవంశమున నొక ప్రఖ్యాతుడైన ఋషి. బ్రహ్మాండపురాణము ననుసరించి ఇతడు ఔర్వుని తొడ చీల్చుకొని జన్మించెను. బాల్యమున నితడు వేదానుష్ఠాన తపోవ్రతములయం దాసక్తుడుగా నుండెను. ఒకసారి తీర్థాటన చేయుచు నితడు విశ్వామిత్రనది యొడ్డున స్నానమాడుచున్న గాధిపుత్రి సత్యవతిని జూచెను. వెంటనే మోహించి యిత డామెను వివాహమాడగోరి గాధితో ప్రస్తావించెను. గాధి తనకు నల్లని చెవులున్న వేయి గుర్రములు శుల్కమిచ్చి యామెను గ్రహింపు మనెను. ఇతడు వరుణుని స్తుతించి, గుర్రములు సంపాదించి తెచ్చి యిచ్చి సత్యవతిని పెండ్లాడెను. సత్యవతి తనకును తన తల్లికిని పుత్రోదయ మగునట్లుగా నితనిని వర మడిగెను.

ఇతడు మంత్రపూతమైన చరువు రెండుభాగము లేర్పరిచి, అందొకటి సత్యవతిని, రెండవది సత్యవతి తల్లిని గ్రహింపుడని యిచ్చెను. చరుప్రాశనమునకు గల నియమములు కూడ చెప్పెను. కాని ప్రమాదమున నా చరుభాగములు మారిపోయి ఒకరి దింకొకరు గ్రహించిరి. తత్ఫలితముగా సత్యవతికి జమదగ్ని మున్నగు నూర్గురు పుత్రు లుదయించిరి. ఆమె జనని గాధిపత్నికి విశ్వామిత్రు డుదయించెను. భూమిని క్షత్రియశూన్యముగా చేసిన పరశురాము డితని మనుమడు. ఒకసారి భృంగుతుంగపర్వతమున నితనిపద్దకు వచ్చి అంబరీషుడు లక్షగోవులకు బదులుగా యజ్ఞపశువురూపమున నరబలి యిచ్చుటకు ఇతని కుమారు నొకని నిమ్మని ప్రార్థించెను. కాని యిత డందు కంగీకరింప లేదు.

## 19. ఐరావతము

ఇరావంతుని సంతాన మైరావతము. పురాణములలో ఐరావతము ఇంద్రునివద్ద గల ఏనుగుగా వర్ణింపబడినది. సముద్రమథనవేళ జన్మించిన యీ యేనుగు యింద్రునికి వాహనమైనది. ఈ యేనుగు తెల్లనిది. దీనికి నాల్గు దంతము లుండెను. ఇంద్రుడు దీనిని తూర్పున దిగ్గజముగా నిల్పెను. కృష్ణునితో నింద్రునకు జరిగిన యుద్ధములో దీనిని గరుడుడు జయించెను.

## 20. కండుముని

ఇతడు సత్యవాది. తపోనిరతుడు, మహాకోపి. నియమపాలనమున నెవరికిని తీసిపోని మహర్షి. ఇతని తపస్సు భగ్నము చేయ నెంచి యింద్రుడు ప్రమ్లోచ యను నప్సరసను పంపెను. కౌసల్యకు ధైర్యము చెప్పుచు కండుని కథ ఉదహరింపబడెను. తండ్రి యాజ్ఞను పాలించుట పుత్రుని కర్తవ్యము. కండుడు తండ్రియాజ్ఞచే గోవధ యొనర్చెను.

*ఋషీణాం చ పితుర్వాక్యం కుర్వతా వనచారిణా,*
*గ్వార్తతా జానతా ధర్మం కండునా చ విపశ్చితా*
*(అయోధ్యాకాండ 21/31)*

ఇతని కుమారు డొకడు పది వత్సరముల ప్రాయమున నొక వనములో మరణించెను. దానిపై కినిసి కండు డా వనము వృక్షోదకహీన మగునట్లు శపించెను.

## 21. కబంధుడు

ఇతడు దండకారణ్యమున నొక రాక్షసుడు. ఇంద్రుడు వజ్రాయుధముతో కొట్టి యితని తల, తొడలు కడుపులో చేరునట్లు చేసెను. కాగా ఇతడు శీర్షవిహీను డాయెను. అందుచే నితనికి కబంధు డని పేరు వచ్చెను. జీవనము సాగించుటకై ఇతనికి యోజనాయతములగు బాహువులు కల్పింపబడెను. వాటితో సమీపమున సంచరించు వన్యప్రాణులను గ్రహించి యితడు తినుచుండెడివాడు. రామునిచేతిలో వధింపబడిన మీద నితనికి తిరిగి నిజరూపము లభింపగలదని యింద్రుడు చెప్పెను. కావున భక్ష్యమునకై వెదకుచుండగా ఎప్పటికైనా రాముడు వచ్చునని ఇతడు ఎదురుచూచుచుండెను. అట్లే రామలక్ష్మణు లితని చేతికి చిక్కిరి. కాని రాము డితని కుడిచేతిని లక్ష్మణు డెడమచేతిని ఖండించిరి. అప్పు డితని శరీరమునుండి దివ్యతేజోభరితుడైన పురుషు డుదయించి ఆకసమున కేగెను. రాము డడుగగా అతడు తన వృత్తాంత మిట్లు చెప్పెను- 'నేను విశ్వావసు డను గంధర్వుడను. బ్రాహ్మణశాపమున నా కీ రాక్షసరూపము కల్గెను.' కబంధరూపమున దివ్యజ్ఞానము లేనందున నితడు రామునికి సీతావృత్తాంతము చెప్పలేకపోయెను. కాని చనిపోయిన పిదప సహాయ మొనర్చెద నని చెప్పెను. సుగ్రీవునివద్ద కేగుటకు మార్గము కూడ తెలియజేసెను. పిమ్మట నితడు పుణ్యలోకముల కరిగెను.

## 22. కశ్యపుడు

కర్దముని పుత్రియు, మరీచిపత్నియు నైన కళకు కశ్యపుడు, పూర్ణిమ యని యిద్దరు పుత్రు లుదయించిరి. కశ్యపుడు జ్యేష్ఠుడు. వీరికే తార్క్ష్య, అరిష్టనేము లని కూడ నామాంతరము లున్నవి.

కశ్యపుడు సప్తఋషులలో నొకడు. ఇతడు ప్రజాపతి యయ్యెను. వాయుపురాణము ననుసరించి యితనికి ఆర్గురు సపతి సోదరు లుండిరి. వారు బ్రహ్మమానసపుత్రులు. పరశురాము డిరువదియొక్కసార్లు క్షత్రియులను హతమార్చగా పృథివి క్షత్రరహితమైన తరువాత కశ్యపుని ఆధ్వర్యమున సరస్వతీరామతీర్థమున పరశురాము డొక యజ్ఞ మొనర్చెను. పృథ్వి నంతటిని కశ్యపునకు దానమిచ్చెను. అప్పటికి మిగిలిన క్షత్రియులను రక్షింప నెంచి కశ్యపుడు పరశురాముని తన భూభాగమున నుండరాదని వచించెను. అప్పుడు పరశురాముడు సముద్రము నుండి శూర్పారక (కొంకణ) క్షేత్రమును వెలికి

తీసి యచ్చట నివసింప వెడలెను. పృథ్విని బ్రాహ్మణుల కిచ్చి కశ్యపుడు వనవాస మేగెను. పుత్రప్రాప్తికై యితడు యజ్ఞము చేయగా దానికి దేవగంధర్వఋషు లందరును సహాయపడిరి. ఇంద్రుడు వాలఖిల్యుల నవమానపరిచెను. దానికి వారు కోపించిరి. వారి కోపమునకు వెరచి యింద్రుడు కశ్యపుని శరణువేడెను. కశ్యపుడు నేర్పుగా వాలఖిల్యులను ప్రసన్నులుగా జేసెను. వారి కృపవలన నితనికి గరుడుడు, అరుణుడు అను పుత్రులు కలిగిరి. వాలఖిల్యులు నూతనదేవేంద్రునికొరకు చేసిన తపమునకు ఫలమును వారు కశ్యపున కొసగిరి. ఇంద్రునకు దీనిచే భీతి తొలగినది.

కశ్యపుడు అర్బుదపర్వతమున గొప్ప తపస్సు చేసి శంకరుని మెప్పించి గంగను సంపాదించెను. గరుడునికి నారాయణుని మహత్త్వము తెలియజేసెను. కశ్యపునకు కపిల, ఇర, క్రుధ, అదితి, వినత మున్నగు పెక్కంద్రు భార్య లుండిరి. ఇతని సంతతి మిక్కుటము. ఈతని పేరున కశ్యపగోత్ర మున్నది. తమ గోత్ర మెరుగని వారు, గోత్రము లేనివారు కూడ కశ్యపగోత్రులుగా పేర్కొనబడుదురు. ఇతనివల్లనే దేవదానవుల యుత్పాదన జరిగెను.

## 23. కార్తికేయుడు (స్కందుడు)

శంకరవీర్యమును పృథ్వి ధరించెను. పిదప అగ్ని తోడాయెను. చివర కది శ్వేతపర్వతరూపము ధరింపగా నందుండి కార్తికేయు డుదయించెను. కార్తికేయుడు కృత్తికల స్తన్యపాన మొనర్చి పెరిగి కార్తికేయు డనబడెను. కృత్తిక లార్గురు. వా రితనిని పుత్రునిగా భావించిరి. కనుక యితడు షణ్ముఖుడు, షాణ్మాతురుడు, షడాననుడు మున్నగు పేర్లతో ప్రసిద్ధుడాయెను. ఇతడు దానవుల స్కందన (వధ) మొనర్చి స్కందు డనబడెను. స్కన్న (స్ఖలించిన) వీర్యసంజనితుడు గనుక స్కందు డనబడెనని కూడ చెప్పుదురు. దానవులను జయించినందున దేవత లితనిని దేవసేనాపతిగా గ్రహించిరి. మహాభారతములో వనపర్వమున గల కథ ననుసరించి, సప్తర్షులు యజ్ఞము చేయుచుండగా అగ్ని అరుంధతిని తప్ప తక్కిన ఋషిపత్నులను కామించెను. అగ్నిదేవునికి అప్రియ పత్నియైన స్వాహ భర్తృప్రీతి సంపాదించుట కీ అవకాశము గ్రహించి, ఆ యా ఋషిపత్నుల రూపమున తానే పోయి అగ్నిని సంతృప్తిపరచెను. కాని అతని వీర్యమును కుంభగత మొనర్చెను. ఆ వీర్యసంభవుడే స్కందు డనబడెను. అత డమావాస్యనాడు జన్మించెను. విశ్వామిత్రు డితనికి ఉపనయన మొనర్చెను.

తీసి యచ్చట నివసింప వెడలెను. పృథ్విని బ్రాహ్మణుల కిచ్చి కశ్యపుడు వనవాస మేగెను. పుత్రప్రాప్తికై యితడు యజ్ఞము చేయగా దానికి దేవగంధర్వఋషు లందరును సహాయపడిరి. ఇంద్రుడు వాలఖిల్యుల నవమానపరిచెను. దానికి వారు కోపించిరి. వారి కోపమునకు వెరచి యింద్రుడు కశ్యపుని శరణువేడెను. కశ్యపుడు నేర్పుగా వాలఖిల్యులను ప్రసన్నులుగా జేసెను. వారి కృపవలన నితనికి గరుడుడు, అరుణుడు అను పుత్రులు కలిగిరి. వాలఖిల్యులు నూతనదేవేంద్రునికొరకు చేసిన తపమునకు ఫలమును వారు కశ్యపున కొసగిరి. ఇంద్రునకు దీనిచే భీతి తొలగినది.

కశ్యపుడు అర్బుదపర్వతమున గొప్ప తపస్సు చేసి శంకరుని మెప్పించి గంగను సంపాదించెను. గరుడునికి నారాయణుని మహత్త్వము తెలియజేసెను. కశ్యపునకు కపిల, ఇర, క్రుద్రువ, అదితి, వినత మున్నగు పెక్కండ్రు భార్య లుండిరి. ఇతని సంతతి మిక్కుటము. ఈతని పేరున కశ్యపగోత్ర మున్నది. తమ గోత్ర మెరుగని వారు, గోత్రము లేనివారు కూడ కశ్యపగోత్రులుగా పేర్కొనబడుదురు. ఇతనివల్లనే దేవదానవుల యుత్పాదన జరిగెను.

## 23. కార్తికేయుడు (స్కందుడు)

శంకరవీర్యమును పృథ్వి ధరించెను. పిదప అగ్ని తోడాయెను. చివర కది శ్వేతపర్వతరూపము ధరింపగా నందుండి కార్తికేయు డుదయించెను. కార్తికేయుడు కృత్తికల స్తన్యపాన మొనర్చి పెరిగి కార్తికేయు డనబడెను. కృత్తిక లార్గురు. వా రితనిని పుత్రునిగా భావించిరి. కనుక యితడు షణ్ముఖుడు, షాణ్మాతురుడు, షడాననుడు మున్నగు పేర్లతో ప్రసిద్ధుడాయెను. ఇతడు దానవుల స్కందన (వధ) మొనర్చి స్కందు డనబడెను. స్కన్న (స్ఖలించిన) వీర్యసంజనితుడు గనుక స్కందు డనబడెనని కూడ చెప్పుదురు. దానవులను జయించినందున దేవత లితనిని దేవసేనాపతిగా గ్రహించిరి. మహాభారతములో వనపర్వమున గల కథ ననుసరించి, సప్తర్షులు యజ్ఞము చేయుచుండగా అగ్ని అరుంధతిని తప్ప తక్కిన ఋషిపత్నులను కామించెను. అగ్నిదేవునికి అప్రియ పత్నియైన స్వాహ భర్తృప్రీతి సంపాదించుట కీ అవకాశము గ్రహించి, ఆ యా ఋషిపత్నుల రూపమున తానే పోయి అగ్నిని సంతృప్తిపరచెను. కాని అతని వీర్యమును కుంభగత మొనర్చెను. ఆ వీర్యసంభవుడే స్కందు డనబడెను. అత డమావాస్యనాడు జన్మించెను. విశ్వామిత్రు డితనికి ఉపనయన మొనర్చెను.

విష్ణు పతనికి గరుడ, మయూర, కుక్కుట వాహనము లిచ్చెను. వాయువు ధ్వజము, సరస్వతి వీణ, బ్రహ్మ మేషము, శంకరుడు పొట్టేలు నిచ్చిరి. మహారాష్ట్రమున స్త్రీ లితని గుడికి పోరు. కాని దీని కాధార మేమో పురాణములలో చెప్పబడలేదు. శివలీలామృతములో ఇతడు తనను చూడవచ్చిన స్త్రీ లేడు జన్మలవరకు వైధవ్య మనుభవింతురని శపించినట్లు వర్ణింపబడినది. చిన్నపిల్లలు ఆరోగ్యరక్షణకై యితనిని, సప్తమాతృకలను పూజించుచుందురు. తారకాసురవధార్థ మితడు జన్మించునని బ్రహ్మ ముందుగనే వరమిచ్చెను. పుట్టిన యేడవనాడే యితడు తారకుని వధించెనని పద్మమత్స్యపురాణములు వర్ణించుచున్నవి.

## 24. కాలుడు

సుదీర్ఘకాలము రాజ్యము చేసిన శ్రీరాముని చూచుటకు తపస్వివేషమున వచ్చి కాలు డతనితో నిట్లనెను- 'నేను నీతో కొంతరహస్యము మాటాడ వచ్చితిని. 'రాము డందుకు సమ్మతించి అతనికి స్వాగతసత్కారములు జరిపి యేకాంత మిచ్చెను.' నేను బ్రహ్మ పంపగా వచ్చిన దూతను. విష్ణురూపుడవైన నీ కుమారుడు కాలుడను. నీ కీ పృథ్విపై నుండదగిన కాలము పూర్తియైన దని చెప్పుటకే నేను వచ్చితిని' అని అతడు రామునితో చెప్పెను.

## 25. కాలకేయులు

వైశ్వానరదానవుని పుత్రియు, కశ్యపప్రజాపతికి పత్నియు నైన కాలకకు కలిగిన కాలఖండులను రాక్షసులే కాలకేయులు. వీరు అసంఖ్యాకులు.

## 26. కాళింది

అసితమహారాజునకు గల పత్ను లిర్వురిలో నొకామె కాళింది. రాజు మరణించిన సమయమున వీరిర్వురును గర్భవతులు. సవతి ఈమెకు విషాహార మిప్పించెను. అప్పు డీమె హిమాలయమున నున్న చ్యవనమహర్షిని దర్శించి తన కోర్కె నెరిగింపగా అత డీమెకు పుత్రశ్రేష్ఠుడు కలుగుననియు, అతడు విషయుక్తుడుగనే జన్మించి సగరుడని పిలువబడుననియు చెప్పి దీవించెను.

## 27. కుంభకర్ణుడు

పులస్త్యతనయుడైన విశ్రవసునికి కైకసియందు జన్మించిన సంతాన చతుష్టయములో కుంభకర్ణుడు రెండవవాడు. భాగవతములో నితని తల్లి పేరు కేశిని అని యున్నది. ఇతడు రావణుని తమ్ముడు. ఇతడు పుట్టినప్పుడే లోకులను మ్రింగజొచ్చెను. అప్పుడు లోకులు దేవేంద్రునితో మొరపెట్టగా అతడు వీనిపై వజ్రాయుధము ప్రయోగించెను. దీనివలన నొప్పి కలిగి యితడు మరింతగా విజృంభించి లోకులను భక్షించుటే కాక ఇంద్రుని శిక్షింపదలచి ఐరావతముపై నెగిరి దాని దంతమొకటి విరచి అదే దంతముతో ఇంద్రుని కొట్టెను. ఇంద్రుడు రక్తసిక్తుడై బ్రహ్మను చూడగా, అతడు వీనిని సదా నిద్రాయుక్తు డగునట్లు శపించెను. కాని రావణుడు పోయి ప్రార్థింపగా బ్రహ్మ ఆరుమాసముల కొక దినము మేల్కొని యుండునట్లు శాపశాంతి వచించెను. కుబేరుని మించుట కితడు పదివేల వర్షములు తపస్సు చేసెను. దానికి మెచ్చి బ్రహ్మ యితనికి వర మీయబోగా దేవతలు దాని కభ్యంతరము తెలిపిరి. అత డేడుగు రప్సరసలను, ఇంద్రునివద్ద గల పదిమంది సేవకులను, లోకములో నింకెందరినో మునిజనులను తినివేసెనని తెలియజేసిరి. అప్పుడు బ్రహ్మ సరస్వతిని పిల్చి, కుంభకర్ణుని నోటిలో నిల్చి వానికి మారుగా పలుకుమని చెప్పెను. తత్ఫలితముగా నితడు దీర్ఘావధిగా నిద్రావరము కోరుకొనెను. బ్రహ్మ 'తథాస్తు' పల్కెను. ఆ తరువాత నితడు తానట్లు కోరినందున పశ్చాత్తాపమందెను. రావణుడు కుబేరుని లంకను గ్రహించినప్పు డితడు కూడ అన్నగారివెంట నుండెను. విరోచనుని పుత్రుడైన బలికి మనుమరాలైన వజ్రజ్వాల యను నామెతో నితని కుద్వాహమయ్యెను. మేల్కొని యున్న సమయములలో నితడు రావణుని సభలో నుండెడివాడు. సీతాపహరణవిషయమున నితడు రావణునే నిందించెను. కాని అతని కన్నివిధములా తోడ్పడనెంచెను. రాముని చేత లంకావీరు లనేకులు మరణించిన పిదప కుంభకర్ణుని నిద్ర మేల్కొలుపుటకు ప్రయత్నములు జరిగినవి. మేల్కొని యుద్ధమునకు పోవ నిశ్చయించియు నితడు రావణునకు కొన్ని సదుపదేశములు జేసెను. శ్రీరాముని వధించితి మని అసత్యవార్త పుట్టించి సీతను వశపరచుకొనదగునని చెప్పిన మహోదరు నితడు గర్హించి యుద్ధమునకు వెడలెను. ఇతని మహోన్నతభీకరాకారము చూచి వానరులు భయభీతులై పారిపోవ దొడగిరి. అంగదుడు వారి నడ్డగించి ధైర్యము చెప్పెను. కుంభకర్ణుడు హనుమంతుని గాయపరచెను. ఋషభ,

శరభ,నీల, గవాక్షులను కొట్టి మూర్ఛిల్లజేసెను. కుంభకర్ణుడు విసరిన శూలమును నేర్పుగా తప్పించుకొని అంగదు డతని వక్షముపై తీక్ష్ణప్రహార మొనర్చి, మూర్ఛిల్లజేసెను. తెప్పరిల్లిన పిదప కుంభకర్ణు డంగదుని మూర్ఛిల్లజేసెను. సుగ్రీవుని పట్టుకొని యితడు లంక కేగుచుండగా, అత డితని ముక్కు చెవులు కొరికి వెనుకకు గెంతి వచ్చెను. శ్రీరాము డితని కాళ్లు ఖండించెను. నేలపై పడి డేకుచు వచ్చి రాముని పట్టబోవుచుండగా ఐంద్రాస్త్రిమున రాము డితని తల ద్రుంచెను. కుంభనికుంభు లితని కుమారులు. విభీషణుడును, శూర్పణఖయు నితని పరాక్రమ ముగ్గడించిరి.

## 28. కుబేరుడు (వైశ్రవణుడు)

ఇతడు విశ్రవసునికి, దేవవర్ణినికి పుత్రుడు. ఇతడు రాక్షసరూపుడు ఆసురబలుడు. మూడు కాళ్ళు, విశాలకాయము, పెద్ద శిరస్సు, మహాహనువు, ఎనిమిది దంతములు, పల్లవెంద్రుకలు, శంకుపులవంటి చెవులు, పొట్టిమొద్దుల వంటి బాహువులు కలిగి, పింగళవర్ణముతో నితడు భయంకరముగా నుండును. వైవర్తజ్ఞానసంపన్నుడైన యితడు జన్మతః జ్ఞాని. బ్రహ్మాండపురాణము ననుసరించి, ఇతని శరీరము కుత్సిత మైనందున నితడు కుబేరు డనబడెనని చెప్పబడినది. వాల్మీకమున నితడు తండ్రిని పోలియున్నందున తాతగారైన పులస్త్యు డితనిని వైశ్రవణుడని పిల్చినట్లును, భవిష్యమున ధనాధ్యక్షుడగునని చెప్పినట్లు నున్నది. ఇతని తల్లిపేరు వేర్వేరు గ్రంథములలో వేరు వేరు విధములుగా వినిపించును. ఇతడు తపస్సుచేసి బ్రహ్మను మెప్పించెను. అతనివలన యక్షరాజ్యాధిపత్యము, రాజరాజత్వము, ధనేశత్వము, అమరత్వము, ఈశ్వరమైత్రి వరమందెను. నలకూబరు డితని పుత్రుడు. రావణుడు లంకను తన కిమ్మని నప్పు డితడు తండ్రి నడిగి లంక నతని కిచ్చివేసెను. రావణుడు దండెత్తి వచ్చి యితనిని జయించి పుష్పకవిమానమును గ్రహించెను. పార్వతీదేవి నొక కంటితో చూసినందున నితని కన్ను కాలిపోయినది. కుడికన్ను పసుపువర్ణ మాయెను. అందుచే నితనికి ఏకాక్షిపింగళు డని అన్వర్థనామ మేర్పడెను. కుబేరసభలో నితనికి నూరుమందికి పైగా రాణు లుండిరి. అలకానగర మితని రాజధాని. అది గంధమాదనపర్వతశిఖరమున వెలిసినది. ఇతని ఉద్యానమునకు సౌగంధికమని పేరు. మహాభారతమున నితని ప్రస్తావన తరచుగా కాన్పించును. ఇతని యంశమున గంధమాదను డను వానరుడు జన్మించెను. ఇతడు దూత నంపి రావణునకు హితము చెప్పబోయెను.

కాని రావణుడు వినలేదు. ఇతడు తుంబురుని శపించి, శాపశాంతికూడ నెరిగించెను. సీతాదేవి అగ్నిప్రవేశ సమయమున నితడు రామునికి నచ్చచెప్పెను. ఇతని గద అవంధ్యము. దాని నితడు హనుమంతునికి వశము జేసెను. (చూ. తుంబురుడు. క్రమసం. 48)

## 29. కుశనాభుడు - కుశకన్యలు

కుశనాభుడు బ్రహ్మపుత్రుడు. విదర్భరాజపుత్రియందు కుశమహారాజునకు కలిగిన పుత్రులలో నితడు నాల్గవవాడు.అప్సరస ఘృతాచివలన నతనికి నూరుమంది పుత్రికలు జన్మించిరి. వారందరును సౌందర్యవతులు.వారి రూపసంపదకు మోహించి వాయువు వారిని వివాహమాడగోరెను. కాని వారందుల కంగీకరింపలేదు. అందువల్ల కోపించి వాయువు వారి శరీరములలో చేరి అంగభంగ మొనర్చెను.

మరుగుజ్జులైన వారు వికృతరూపులైరి. అయినను కుశనాభుడు వారిని సోమదాగంధర్వికి జనించిన బ్రహ్మదత్తున కిచ్చి వివాహము గావించెను. బ్రహ్మదత్తుని పాణిగ్రహణ మగుటతోడనే ఆ కన్య లందరును తిరిగి పూర్వరూప మంది సౌందర్యవతులైరి. కాని ఆ దేశమునకు కన్యాకుబ్జ మను పేరు స్థిరపడెను. కుశనాభుడు మహోదయనగరము నిర్మించెను.

## 30. కుశలవులు

శ్రీరాముడు లోకాపవాదము కారణముగా గర్భవతి యగు సీతను పరిత్యజించెను. రాముని యాజ్ఞచే లక్ష్మణు డామెను తమసానది యొడ్డున నొక యాశ్రమమున దిగవిడిచెను. వాల్మీకి శిష్యులవలన నది యెరిగి యామెను తన యాశ్రమమునకు తీసికొనిపోయెను. తర్వాత నామె కక్కడ కవలబిడ్డ లుదయించిరి. వారే కుశలవులు. వీరు జన్మించిన దినమున శత్రుఘ్నుడు వాల్మీకి ఆశ్రమముననే యుండెను. వాల్మీకి కుశముష్టిని, వాటి లవములను తెచ్చి బిడ్డలకు భూతరక్షావిధులు నెరపెను. అందువలన వారికి కుశుడనియు, లవుడనియు పేర్లు కలిగెను. వాల్మీకి ఆ బిడ్డలకు సకల సంస్కారము లాచరించి వారికి వేదవేదాంగ ధనుర్వేద శస్త్రవిద్య లన్నియు నేర్పెను. వేదపాఠమును దృఢ మొనర్చుట కతడు వారికి రామాయణము నేర్పెను. వాల్మీకిరామాయణము ననుసరించి, వీరు రామాయణము గానము చేయుచు

పోయి శ్రీరాముని దర్శించిరి. రాముని అశ్వమేధయాగావసరమున వాల్మీకి వీరిని తీసికొని అయోధ్య కరిగెను. వీరు ధన మాశింపక తాళస్వరయుక్తముగా రామాయణములోని ఇరువదేసి సర్గము లొక రోజున పాడి వినిపించుచుండిరి. మేము వాల్మీకిపుత్రుల మని చెప్పుకొనుచుండిరి. శ్రీరామునికి వారు తన పుత్రులని తెలిసెను. అతడు లవునికి దక్షిణకోసలమును, కుశునికి ఉత్తరకోసలమును పంచి యిచ్చెను. సుమతియు, కంజాననయు లవుని భార్యలు. కుశుని భార్య చంపక.

శ్రీరాముని అశ్వమేధమున పృథ్వీపరిక్రమణమునకై విడిచిన యజ్ఞాశ్వమును కుశలవులు పట్టుకొనిరి. దానిని విడిపించుటకు వచ్చి శత్రుఘ్న,భరత, లక్ష్మణ, హనుమంతులును, చివరకు రాముడును వీరితో యుద్ధము చేసిరి. రాముడు తప్ప తక్కినవారు వీరిచేతిలో పరాజితులైరి. రామునికి వీరు తన పుత్రులని తెలియగనే అతని చేతినుండి విల్లు జారిపడిపోయెను. ఇట్లందరిని జయించి వీరు తమ తల్లి సీతవద్దకు పోయి చెప్పగా ఆమె వారందరిని విడిపించెను. ఆ తర్వాత కుశలవులే అశ్వరక్షకులైరి. రాముని యజ్ఞము పూర్తి యాయెను. ఈ కథ అన్యగ్రంథములలో నున్నది కాని వాల్మీకములో లేదు.

## 31. కృశాశ్వుడు

ఇత డొక ఋషి, ప్రజాపతికూడ. ప్రాచేతసదక్షుడు తన కుమార్తె లరువదిమందిలో ఇద్దరిని కృశాశ్వుని కిచ్చి వివాహమొనర్చెను. అస్త్రములన్నియు కృశాశ్వుని సంతానము. తాటకను సంహరించిన పిదప దేవతలు సంతసించి విశ్వామిత్రునితో కృశాశ్వపుత్రులైన ఆ అస్త్రము లన్నిటిని రాముని కిమ్మని కోరిరి. విశ్వామిత్రు డా అస్త్రములను రామున కిచ్చెను.

## 32. కేకయరాజు

కేకయదేశపు రాజున కిది బహుశా ఉపనామము.అసలు పేరు అశ్వపతి కావచ్చును. యుధాజిత్తు, కైకయు అని ఇతని కిరువురు సంతానము. ఇతని భార్య చాల సాహసిక. శఠని. దేనినీ లక్ష్యపెట్టెడిది కాదు.

## 33. కేశిని

ఈమె విదర్భరాజకన్య. సగరుని జ్యేష్ఠపత్ని. ఈమెకు అసమంజు డను పుత్రుడు కల్గెను.

## 34. కేసరి

ఇత డొక వానరయూథపుడు. అంజన ఇతని భార్య. వీరు సుమేరు స్వర్ణగిరిపై వసించుచుండిరి. అచ్చటి ఋషులను పీడించుచున్న శంబసాదను డను రక్కసుని వధించి ఇతడు వారిచే నిట్లాశీర్వదింపబడెను- 'నీకు సుస్వభావుడు, భగవద్భక్తుడు, బలశాలియు నగు పుత్రుడు కలుగును. ఆ పుత్రుడే హనుమంతుడు. ఇంద్రజిత్తు యుద్ధములో నితనిని మూర్ఛిల్లజేసెను. యుద్ధము ముగిసిన పిదప, వీరు లందరితోబాటు రాము డితనిని సత్కరించెను.

## 35. కైకసి

ఈమె సుమాలి యను రాక్షసుని కుమార్తె. విశ్రవసుని భార్య. ఈమె నెందరో వివాహమాడగోరి వచ్చిరి. కాని ఏదో నెపమున సుమాలి వారెవ్వరిని అంగీకరింపలేదు. ఆ పిదప వివాహప్రస్తావము లాగిపోయినవి. కుమార్తె వయసు పెరుగుచు వచ్చినందున సుమాలి యామెను స్వయముగనే పోయి విశ్రవసుని వరింపుమనెను. ఆమె అతనిని చేరినప్పటికి సంధ్యాకాల మాయెను. కాని యామె దీనిని గమనింపక తండ్రి యాజ్ఞ ననుసరించి విశ్రవసుని యాశ్రమము చేరెను. అత డప్పుడు సంధ్యాహోమవేళ యని గ్రహించెను. ఎదుటకు వచ్చి నిలిచిన కైకసి యభిప్రాయ మతడు తెలిసికొని, యామెతో నిట్లనెను- 'ఇది క్రూరసమయమగుటచే నీకు క్రూరులు, భయానకులు నగు రాక్షసులు జన్మింతురు.' అందుపై నామె అట్టి పుత్రులు వలదని అతనిని ప్రార్థించెను. అప్పు డతడు 'నీకు కలిగెడి కనిష్ఠపుత్రుడు ధర్మాత్ము డగు' నని పల్కెను. ఆ పుత్రుడే విభీషణుడు. అతడు కులదీపకు డాయెను. ఇతనికంటె ముందు పుట్టినవారు రావణ కుంభకర్ణ శూర్పణఖలు. పుష్పకవిమానముపై వచ్చి తండ్రిని దర్శించిన కుబేరుని చూపి కైకసి రావణునితో 'నీవు నట్టి వైభవశాలి వగుము.' అని చెప్పెను. ఈమె అసలుపేరు కేశిని కావచ్చును.

## 36. కైకేయి

ఈమె కేకయరాజగు అశ్వపతి కుమార్తె. దశరథుని రాణులలో నొకతె. పతికన్న వయసులో నీమె చాల చిన్నది. వివాహకాలమున నీమె తండ్రి యామెకు కల్గిన పుత్రుడే రాజు కావలెనని దశరథునితో చెప్పి, అట్టి ప్రతిజ్ఞ చేయించుకొనెను. కాని కైక కీ విషయము తెలియదేమో యనిపించును. దేవదానవయుద్ధవేళలో దేవసహాయార్థ మరిగిన దశరథుడు క్షతగాత్రుడై మూర్ఛిల్లెను. అప్పు డీమె అతనిని కాపాడెను. అందుకు సంతసించి దశరథు డీమెకు రెండు వరము లనుగ్రహించెను. కాని వాటి నామె అతనివద్దనే దాచి యుంచెను. కావలసినప్పుడు గ్రహింతునని చెప్పెను. రా జందుల కంగీకరించెను. రామునికి రాజ్యాభిషేక మొనర్పదలచినప్పుడు ఈమె దాసియైన మంథర, ఈమెకు మాత్సర్యము కలిగించి, ఆ రెండు వరములలో నొకదానిచే రామునికి వనవాస మీయవలెననియు, రెండవదానిచే భరతునికి రాజ్య మీయవలెననియు కోరుకొనజేసినది. రాముడు వనవాసమేగిన పిదప భరతుడు రాగా ఈమె సంతోషముగా అతని కీ వార్త చెప్పినది. ఉత్తేజముతో నామె దశరథుని కుత్తరక్రియలు నిర్వర్తించి వెంటనే పట్టాభిషేక మందవలెనని చెప్పెను. భరతు డది విని మిక్కిలి దుఃఖించి యామెను కఠోరముగా నిందించెను. అత డీమెను ఆత్మకామ, సదాచండి, క్రోధస్వభావ, స్వబుద్ధి గర్విత అని కూడ పలికి ధిక్కరించెను. వనవాససమయమున రాముడు భరద్వాజాశ్రమమున నిల్చినపుడు లక్ష్మణునితో 'నీ వయోధ్యకు పోయి తల్లులను రక్షించుచుండు' మని పల్కెను. ఐశ్వర్యమదమున కైకేయి కౌసల్యాసుమిత్రల కేమి కీడెంచునో యనియు, క్షుద్రబుద్ధి కలిగి ద్వేషముచే వారిపట్ల నెట్టి అన్యాయము చేయునో, వారికి విషము పెట్టించునేమో యని కూడ చెప్పెను. కౌసల్యకును మనసులో నిట్టి భయ ముండెను. దశరథుడు రామునితో తన మనోవ్యథ నెరిగించుచు భస్మావకుంఠితమగు నగ్నికణమువలె నుండి కైక నన్ను పూర్తిగా మోసగించి కట్టి పడవేసె' నని పలికెను. ఆమె నతడు తన శరీరమును తాకవద్దని శాసించెను. విధవవై రాజ్య మేలుకొమ్మని పలికెను. సుమంత్రు డామెను పతిఘాతిని, కులఘాతిని యని నిందించెను. లోకనిందాపాత్రమై కైక భరద్వాజుని చరణములకు నమస్కరించినపుడు భరతు డామె పరిచయ మెరిగించుచు ఎవరివలన రామలక్ష్మణుల జీవితము వ్యర్థమయ్యెనో, ఎవరిమూలమున దశరథమహారాజు పుత్రశోకమున మునిగి స్వర్గ మరిగెనో, ఆ వివేకరహిత,

క్రోధశీల, గర్విష్ఠురాలు, ఐశ్వర్యలుబ్ధయు, ఆర్యరూపమున నున్న అనార్యయు అగు నీమె నా జనని' యని పలికెను.

## 37. కౌసల్య

ఈమె కోసలాధిపతి యగు భానుమంతుని కుమార్తె. దశరథుని పట్టమహిషి. ఈమెకు పుట్టినింటినుండి వేయి యూళ్ళు స్త్రీధనముగా లభించెను. దశరథు డీమెకు పాయసములో సగభాగ మిచ్చెను. రాముని పట్టాభిషేకవార్త విని ఎంత యెక్కువగా సంతసించెనో అంతగానే అతని వనవాసవార్త విని దుఃఖించెను. శోకావేగముచే మూర్ఛిల్లిపడెను. పతిసుఖ మీమెకు తగినంతగా లభింపలేదు. పుత్రసుఖము కూడ లేకుండ పోవుచున్నదని ఈమె మిక్కిలి దుఃఖించెను. వనవాస మేగవలదని యెన్నో విధములుగా రామునకు నచ్చజెప్పుచు చివర కీమె రాముడు వనమేగుటకే నిశ్చయించినచో తనను కూడ తోడ్కొని పొమ్మని కోరినది. లేకున్నచో ప్రాణములు విడుతునని కూడ బెదిరించినది. కాని రాము డీమె నెట్లో సమాధాన పరచి అయోధ్యలోనే యుండునట్లు చేసెను. కైక యీమె నెప్పుడును వ్యంగ్యభాషణములతో వేధించుచుండెడిది. కాని యీమె కైకను తోబుట్టువు వలె చూచెడిది. తాను లేని తరి కౌసల్యకు కష్టములు కల్పింపబడునని రామునికి కూడ తెలియును. లక్ష్మణు డందుకే దశరథుని మాట తిరస్కరించి రాజ్యము స్వాధీనము చేసికొను మని రామునితో చెప్పెను. పుత్రప్రేమచే కౌసల్య కూడ లక్ష్మణుని మాటలు సమర్థించెను. రామువనగమనానంతర మీమె వ్యంగ్యబాణములతో దశరథుని వేధించెను. అతడు దయనీయస్థితిలో నుండి యీమెకు చేతులు జోడించెను. అప్పు డామెకు తన తప్పు బోధపడెను. ఈమె స్వభావము కోమలము కాని ఉదాసభావ మెక్కువ.

## 38. గాలవుడు

ఇతడు విశ్వామిత్రుని శిష్యుడు. గురుసేవలో నితడు శ్రద్ధాన్వితుడై గురుకృపకు పాత్రుడయ్యెను. కాని గురుదక్షిణ విషయములో వలదన్నను పట్టుబట్టినందున విశ్వామిత్రు డితనిని నల్లటి చెవులున్న ఎనిమిది వందల గుర్రములను దక్షిణగా నిమ్మనెను. అందుకు తన శక్తి చాలక యితడు శ్రీవిష్ణు నారాధించెను. విష్ణువు ప్రసన్నుడై యితని కోర్కె తీర్చుమని గరుడునితో చెప్పెను. గరుడు డితనిని యయాతివద్దకు తీసికొని పోయెను.

యయాతిపద్ద అట్టి గుర్రములు ఎనిమిదివందలు లేవు. అతడు దౌహిత్రునిపై తన కధికార ముంచుకొని కుమార్తె యైన మాధవిని గాలపున కిచ్చెను. ఆమె వలన గాలవుడు విశ్వామిత్రునికి గురుదక్షిణ చెల్లింపగలిగెను.

విశ్వామిత్రుని పుత్రులలో నొకని పేరు గాలవుడు. కరువుకాలములో కూడ , పత్నీపుత్రుల భరణవిచార ముడిగి విశ్వామిత్రుడు తపస్సు చేయుట కరిగెను. అతని భార్య యెట్లో బిడ్డలను పోషింప నెంచి ప్రయత్నించినది కాని ప్రయత్నము ఫలించక బిడ్డ లాకలిదప్పులకు తల్లడిల్లజొచ్చిరి. అప్పు డామె వారిని విక్రయింప నెంచెను. సత్యవ్రతుడు (త్రిశంకుడు) విషయమంతయు తెలిసికొని విశ్వామిత్రుడు తపోవనమునుండి తిరిగి వచ్చునంతవరకు ఆ తల్లి బిడ్డలను పోషింపనెంచి తగిన యేర్పాట్లు చేసెను.

## 39. గౌతముడు

ఇతడు బృహస్పతి శాపముచే జన్మాంధుడైన ఆంగిరస వంశోత్పన్ను డగు దీర్ఘతమునకును ప్రద్వేషికిని పుత్రుడు. వైవస్వతమన్వంతరమున నితడు సప్తర్షులలో నొకడు. బ్రహ్మమానసపుత్రిక యగు అహల్య యితని భార్య. ఆమెయం దితనికి శతానందు డను పుత్రుడు కల్గెను. అతడు జనకమహారాజునకు పురోహితుడు. గౌతముని శిష్యులలో నొకడు ఉత్తంకుడు. అతనిని గౌతము డల్లునిగా స్వీకరించెను. మిథిలాసమీపమున గల పారియాత్ర పర్వతప్రాంత వనములలో నితని యాశ్రమ ముండెడిది. అచ్చట నితడు అరువదివేల యేండ్లు తపస్సు చేసెను. శివుని మెప్పించి యితడు గంగ నచ్చట ప్రవహింపజేసెను. దానికి గౌతమి అను పేరు వచ్చెను. కరువుకాలమున నిత డాహారము కల్పించి ఋషులను కాపాడెను.

ఇతడు ధర్మశాస్త్రకర్త. గౌతమస్మృతి యితడు నిర్మించిన గ్రంథము. ఇదిగాక ఆస్తికసూత్రము, పితృమేధసూత్రము, దానచంద్రిక, గౌతమీశిక్ష, న్యాయసూత్రము వంటి గ్రంథము లెన్నో యితడు వ్రాసెను.

## 40. గ్రామణి, దేవవతి

ఋషభపర్వతమున గల చందనవనమును రక్షించుచుండు గంధర్వ పంచకములో గ్రామణి యొకడు. ఇతని కుమార్తె దేవవతి. ఆమె సుకేశరాక్షసుని పత్నియైనది. మాల్యవంతుడు, సుమాలి, మాలి అనువా రీమె పుత్రులు.

## 41. ఘృతాచి

కశ్యపుని పత్నియైన ప్రాథకు జన్మించిన అప్సరసలలో ఘృతాచి యొకతె. ఈమెను చూచినపుడు భరద్వాజునకు వీర్యపతనముకాగా దానినుండి ద్రోణాచార్యు డుదయించెను. ఘృతాచియందు వ్యాసునకు శుకుడు, ప్రమతిమునికి రురుడు జన్మించిరి. ఈమెకు మొత్తము పదిమంది పుత్రులు కలిగిరి. కిష్కింధాకాండము (35/7) ననుసరించి విశ్వామిత్రుడు కూడ ఈమెపై ఆసక్తుడాయెను. ఈమెతో పదిసంవత్సరములు గడిపినను అదంతయు నతని కొక దినముగనే తోచెను.

విశ్వకర్మతో నీమెకు సంబంధమేర్పడగా అత డీమెను భూమిపై శూద్రయోనిలో జన్మింపుమని శపించెను. దానివలన నీమె గోపగృహమున జన్మించెను. పూర్వజన్మస్మృతి కల్గుటచే నీమె ఈ జన్మలో వివాహము చేసికొనలేదు. విశ్వకర్మకూడ బ్రహ్మదేవుని దయవలన నొక బ్రాహ్మణగృహమున జన్మించెను. ఇట్లు భూమిపై జన్మించిన వీరిద్దరును ప్రయాగలో గంగాతటమున పరస్పరము కలిసిరి. పూర్వస్మృతి కల్గుటచే వీరికి మాలి, గాజులవాడు, దర్జీ, సుగాలి, కుమ్మరి, కంసాలి, వడ్రంగి, శిల్పి మున్నగువారు జన్మించినట్లు బ్రహ్మవైవర్తపురాణములో వర్ణింపబడెను.

## 42. చూళి

ఇతడు బ్రహ్మర్షి. సోమద యను గంధర్వి తపోవ్రతమున నున్న యా మునికి సేవలు చేసి ఇతనిని మెప్పించి మానసపుత్రుని వరముగా బడసినది. ఆ పుత్రునిపేరు బ్రహ్మదత్తుడు.

## 43. చ్యవనుడు

భృగుమహర్షి భార్య పులోమ. ఆమె గర్భము ధరించియున్న సమయమున నొకనాడు భృగువు స్నానార్థము బయటకు పోగా పులోము డను రాక్షసుడు వారి ఆశ్రమములోనికి వచ్చెను. పులోమ సౌందర్యమునకు మోహించి అతడామె నపహరించెను. ఆ రాక్షసకృత్యమునకు బెగ్గడిల్లినందున నామె గర్భము జారిపోయెను. అట్లు గర్భచ్యుతిచే కల్గిన పుత్రుడు గనుక అతనికి చ్యవను డని పేరువచ్చెను. పుట్టిన బిడ్డడైన చ్యవనుని తేజముచే పులోమరక్కసుడు కాలి బూడిద యయ్యెను. పులోమ బిడ్డను గ్రహించి యాశ్రమము చేరినది. చ్యవనుడు వేద

వేదాంగ ప్రవీణుడు. మహాతపస్వి. తపస్సులో నున్నప్పు డితని శరీరమును పుట్టలు కప్పెను. అతడందులో నిశ్చలుడై నిల్చి తపము చేయుచుండెను. ఇంతలో ఆ వనమునకు వైవస్వతమనువు పుత్రుడైన శర్యాతి సపరివారముగా వేటకు వచ్చెను. శర్యాతి కుమార్తె సుకన్య. ఆమె రూపయౌవనసంపన్న. సఖీజనముతో కలిసి క్రీడార్థము వచ్చి యామె ఆ పుట్టవద్ద కేగెను. పుట్టలో నుండి కాంతిమంతమగు పదార్థ మేదో వెలుగుచున్నట్లు చూచి యామె పుడుకతో నా పుట్టలోనికి గ్రుచ్చెను. దానివలన లోన తపస్సుచేయుచున్న చ్యవనుని నేత్రములు చిట్లిపోయెను. ఋషి కోపించి సేనాపరివారసహితముగా రాజునకు మలమూత్రబంధ మగునట్లు శపించెను. రాజు వెంటనే అతనిని శరణువేడెను. చ్యవను డతని కుమార్తెను భార్యగా నిమ్మనెను. చ్యవను డప్పటికే వృద్ధుడు అయినను రా జతనికి తన కుమార్తె సుకన్య నిచ్చి వివాహ మొనర్చెను. ఆశ్వినీ కుమారు లొకసారి సుకన్యను చూచి పరీక్షించి ఆమె పాతివ్రత్యమున కాశ్చర్యపడిరి. వారంతట చ్యవనుని యువకునిగా చేసిరి. ఈ ఉపకారమునకు బదులుగా చ్యవనుడు అత్తవారింటి కరిగి యజ్ఞ మొకటి చేసి అశ్వినీకుమారులకు యజ్ఞభాగమును కల్పించి యిచ్చెను. ఇంద్రుని కిది నచ్చలేదు. చ్యవనుని చంపుటకై అతడు వజ్రాయుధ మెత్తెను. చ్యవనుడు మదు డను రాక్షసుని జన్మింపజేసెను. ఇంద్రు డతనిని చూచి భయపడి అశ్వినీకుమారులకు హవిర్భాగము లిచ్చుటకు అంగీకరించెను. చ్యవను డొకసారి ప్రయాగలో ఉదవాసవ్రతము పూని దివారాత్రములు నీటిలో నిలిచెను. అట్లుండగా జాలరులు వేసిన వలలో తగులుకొని యితడు జాలరుల చేతిలో పడెను. వారీ ఋషిని చూచి భయపడి రాజైన నహుషున కీ సంగతి తెలియజేసిరి. నహుషుడు చ్యవనమునిని షోడశోపచారపూజలతో సత్కరించి, కావలసినది కోరుకొను మని పలికెను. చ్యవనుడు జాలరులకు తనకు మారుగా తగినంత మూల్యము చెల్లింపుమని రాజుతో చెప్పెను. రాజు తన రాజ్యమంతయు నిచ్చుటకు సిద్ధమయినను, మూల్యము పూర్తికాలేదు. అప్పు డొక ఋషి గోధనము నిమ్మని చెప్పగా, అట్లు చేయుటతో మూల్యము పూర్తియాయెను. రానున్నకాలమున తనకులమునకు భిన్నజాతిత్వదోషము కలుగుననియు, అది కుశికునివలన కల్గుననియు చ్యవనునకు తెలిసెను. అత డంత కుశికుని బాధింపదొడగెను. కాని కుశికు డిది సేవగా గ్రహించి సంతసించెను. అందుపై ముని కుశికుని వంశమున బ్రాహ్మణు డుదయించు నని వరమిచ్చి అతనికి

స్వర్గప్రాప్తి కలిగించెను. మనుపుత్రి యైన ఆరుషియం దితనికి ఔర్వుడను పుత్రుడు కల్గెను. అతడు మంచివక్త, మంత్రవేత్త. ఇతనికి సప్తర్షులలో స్థానము లభించెను.

## 44. జయ, సుప్రభ

వీరు దక్షప్రజాపతి కుమార్తెలు. వరము పొంది జయ రాక్షససంహారమునకై అదృశ్యులు, అరూపులునైన ఏబదిమంది పుత్రులను కనెను. స్కందపురాణములో నీమె ప్రజాపతియైన కృశాశ్వుని పుత్రిక యనియు, పార్వతీదేవివద్ద దాసి యనియు వర్ణింపబడెను. కాని వామనపద్మపురాణములలో ఈమె పార్వతికి సఖిగా వర్ణింపబడెను. సుప్రభ కూడ ఏబది శస్త్రాస్త్రములకు జన్మనిచ్చెను.

## 45. జాంబవంతుడు

వాల్మీకము ననుసరించి, యితడు బ్రహ్మ యావులించినపుడు పుట్టెను. కాని బ్రహ్మాండపురాణములో నితడు ప్రజాపతికి, రక్షకు తనయుడని చెప్పబడెను. ఇతని భార్య వ్యాఘ్రి. ఆమెయం దతనికి జాంబవతి యను పుత్రిక కలిగెను. ఇతడు ఋక్షములకు రాజు. సీతాన్వేషణమున నితడు రామునికి తోడ్పడెను. రావణవధానంతరమున నగారా మ్రోగించి యితడు శ్రీరాముని విజయము నెల్లరకు చాటెను. వృద్ధుడైనను తొంబది యోజనముల దూరము దాటగలనని చెప్పెను. హనుమంతుని కతని బలపౌరుషములు స్మృతికి తెచ్చి సముద్రలంఘనమున కితడు ప్రోత్సహించెను. విభీషణుని విషయమున కొంత సందేహించి, జాగ్రత్త వహింపవలసినదని కూడ సలహా యిచ్చెను. దేవదానవయుద్ధములో ఇంద్రునికి, రామరావణయుద్ధములో రామునికి నితడు సాహాయ్యపడెను. రామరాజ్యాభిషేక సమయమున నితడు నూరునదులనుండియు, సముద్రమునుండియు జలములు తెచ్చెను.

రాజసూయావసరమున నితడు శత్రుఘ్నునితో పాటు అశ్వరక్ష కేగెను. రాము డితనిని బహుమూల్యభూషాదిక మిచ్చి సత్కరించెను.

## 46. తాటక

ఈమె సుకేతువను యక్షుని కూతురు. జంభాసురుని తనయుడైన

సుందుని పత్ని. బ్రహ్మ సుకేతుని కిచ్చిన వరమువలన నీమె జన్మించెను. ఈమెకు నూరేనుగుల బలము, కామరూపము ధరించు శక్తియు కలవు. మారీచసుబాహు లీమె పుత్రులు. అగస్త్యుడు సుందుని మరణమునకు కారణమైనందున ఈమె తన తనయులతో కలిసి అతనిపై విజృంభించెను. అతని శాపముచే వికృతాకారము గల రాక్షసిగా మారిపోయి మలదకరూశ క్షేత్రమున నివసింపదొడగెను. ఈమెవలన ఆ ప్రదేశము నిర్జనమై, తాటకావన మనబడెను. ఈ వనమునకు సమీపమున విశ్వామిత్రుని యాశ్రమ ముండెను. ఈమె తనయు లతని యజ్ఞమునకు విఘ్నము కల్పించుచుండిరి. అందువలన విశ్వామిత్రుడు అయోధ్యనుండి రాముని తోడ్కొని వచ్చి, ఈమెను వధింపవలెనని చెప్పి ప్రోత్సహించెను. రాము డీమెను వధించెను.

## 47 తారుడు

ఇతడు బృహస్పతి యంశమున జన్మించిన వానరుడు. ఇతడు బుద్ధిమంతుడు. వానరులలో ప్రముఖుడు.

సుగ్రీవుని భార్యయైన రుమ యితని కుమార్తె. అయిదుకోట్ల వానర సమూహముతో వచ్చి యితడు సుగ్రీవుని సైన్యములో కలిసెను. సీతాన్వేషణమున నితడు జాంబవంతునితో కలిసి దక్షిణదిశకు పోయెను. తక్కినవారితో పాటుగా నితడును ఋక్షబిలములో ప్రవేశించెను. వాలి శక్తిని గూర్చి చెప్పి రావణుని కితడు నోరాడనీయలేదు.

## 48. తుంబురుడు

కశ్యపునకు ప్రాథయందు జన్మించిన పుత్రులలో నొకడు తుంబురుడు. ఇతడు చైత్రమాసములో ధాత యను సూర్యునివద్ద నుండును. ఇతని భార్య పేరు రంభ. నారదునితో పాటు బ్రహ్మసభలో నితడు భగవద్గుణగాన మొనర్చుచుండెను. రంభపై నాసక్తుడై యితడు కుబేరుని శాపమువలన విరాధరాక్షసుడుగా మారెను. ఈ కథవలన రంభ యతని భార్య కాదేమో అనిపించుచున్నది. భరతునికి స్వాగతసత్కారము లాచరించునపుడు భరద్వాజు డితని నాహ్వానించెను.

## 49. తృణబిందుడు

ఇత డొక రాజర్షి. భాగవత, విష్ణు పురాణములలో నితడు బంధు వను రాజునకు పుత్రుడనియు, నితనికి విశాల, శూన్యబంధు, ధూమ్రకేతు ఇడవిడ అను నల్గురు సంతాన ముండెననియు తెలియుచున్నది. రామాయణ విష్ణుపురాణములు ఇతడు బుధమహారాజు పుత్రు డనియు, అలంబుస యితని పత్ని యనియు విశాల, ఇలబిల యనువా రిరువు రితనికి సంతానమనియు తెలియజేయుచున్నది. ఇలబిలను పులస్త్యుడు వివాహమాడెను. పులస్త్యుని శాపమును గురించి తెలియక ఇలబిల అతని ఆశ్రమములోని కరిగినది. శాపఫలముగా నీమె గర్భవతి యయ్యెను. తండ్రి తృణబిందున కిది చెప్పగా, అతడు ధ్యానముద్రలో నిజమెరిగి పులస్త్యుని వద్ద కరిగి, తన పుత్రికను స్వీకరింపదగునని ప్రార్థించెను. ఇలబిలకు 'గో' నామము కూడ నున్నది.

## 50. త్రిశంకుడు

ఇతని నిజనామము సత్యవ్రతుడు. కాని శాపకారణమున త్రిశంకు డనబడెను. ఇతని తండ్రి నిబంధనుడు. కాని కొన్ని గ్రంథములలో నతడు త్రైయ్యారుణుడు లేదా అరుణుడు అని పేర్కొనబడెను. త్రిశంకుడు బహుశా పౌరాణికవ్యక్తి కాడు. అతడు తాను బ్రహ్మజ్ఞుడననియు, సర్వజ్ఞుడననియు చెప్పుకొనుచుండెను. దురాచారు డగుటచే జను లితనిపట్ల సదభిప్రాయము లేనివారైరి. ఇతడొక స్త్రీ నపహరించెను. అందుపై తండ్రి యితనిని దేశమునుండి వెడలనంపెను. అప్పు డితడు విశ్వామిత్రుని యాశ్రమసమీపమున నివసింపసాగెను. ఒకసారి మాంసాహారముకొర కితడు వసిష్ఠుని కామధేనువును చంపెను. అప్పుడు వసిష్ఠు డితనిని, గోవధ, మహిళాపహరణ, పితృక్రోధములకు ఫలితముగా నితని శిరమున మూడు కొమ్ము లుదయించునట్లు శపించెను. పైగా ఇతడు పిశాచ మగునని శాపమిచ్చెను. తర్వాత దేవకృపవలన నితని పిశాచత్వము నివారింపబడెను. తండ్రి కూడ శాంతించి యితనికి రాజ్యమిచ్చెను. విశ్వామిత్రు డితనిచే యజ్ఞము చేయించి సశరీరస్వర్గకాంక్షను పూరించెను. విశ్వామిత్రు డీ యజ్ఞమున నధ్వర్యుడుగా నుండి దేవతల నాహ్వానించెను. కాని వారు రాలేదు. వెంటనే విశ్వామిత్రుడు తన తపోబలమున నితనిని స్వర్గమునకు పంపెను. కాని యింద్రు డితనిని క్రిందకు త్రోసివేసెను. తలక్రిందుగా పడుచూ 'త్రాహి త్రాహి' యని అరుచుచున్న త్రిశంకుని చూచి విశ్వామిత్రుడు

కోపించి అట్లే నిలుపు మని గట్టిగా నరచెను. వెనువెంటనే తన ప్రతిజ్ఞ నిలుపుకొనుటకై విశ్వామిత్రుడు నక్షత్రగ్రహదేవతాసహితముగా ప్రతిసృష్టి చేయబూనుకొనెను. ఇంద్రరహితముగనో లేక ద్వితీయేంద్రసహితముగనో నిర్మింపబోవుచున్న స్వర్గమును చూచి దేవతలు విశ్వామిత్రుని అనునయించిరి. గురుశాపదగ్ధుడైనను త్రిశంకునికి సదేహస్వర్గప్రాప్తి కల్గించుటకు వా రనుమతించిరి.

స్కందపురాణములో ఈ కథ వేరుగా నున్నది. హరివంశములో నితని పత్ని సత్యరథ యని పేర్కొనబడినది. ఈమెయం దితనికి మహావిఖ్యాతుడైన హరిశ్చంద్రు డుదయించెను. విశ్వామిత్రు డితని ధార్మికప్రవృత్తికి సహాయపడెను. వనవాసకాలమున నితని యాచరణము మేలుగా నుండెను. ఇతడు నూరు యజ్ఞములు చేసెను. విశ్వామిత్రుని సంతానమును కాపాడెను.

త్రిశంకుని సదేహస్వర్గప్రాప్తి యను వాంఛ విచిత్రమైనను, అది అసంభవము కాదు. వసిష్ఠవిశ్వామిత్రాదులు సదేహులుగనే స్వర్గమేగి వచ్చుచుండెడివారు. మహాభారతములో అర్జునుడు సదేహుడుగనే స్వర్గ మరిగి యింద్రుని అతిథ్యమందు కొని తిరిగి వచ్చినట్లున్నది. విశ్వామిత్రుని యాగ్రహముచే దేవతలు త్రిశంకుని నక్షత్రవీథిలో అధోముఖముగా వ్రేలాడుచూ మెరయుచుండున ట్లనుగ్రహించిరి.

## 51. త్రిశిరుడు

రావణుని పుత్రుడైన త్రిశిరుడు, కుంభకర్ణుడు వధింపబడుటతో నత్యంత శోకాకులుడైన రావణునికి ధైర్యము చెప్పి, రాముని వధింతునని ప్రతిజ్ఞచేసెను. అతితీక్ష్ణమగు శూలమును చేత ధరించి శ్వేతవృషభారూఢుడై ఇతడు రణభూమి కేగెను. ఇతడు మూడు కిరీటములు ధరించి యుండెను. నరాంతకుని వధ పై నిత డాక్రోశించి, అంగదహనుమంతులతో యుద్ధము చేయదొడగెను. చివరకు హనుమంతునిచే నితడు వధింపబడెను.

## 52. దనువు

ఈమె దక్షుని పుత్రి. కశ్యపుని పత్ని. ఈమె తనయుడు అశ్వగ్రీవుడు. ఈమెవలన దానవులు పుట్టిరి. వృత్రాసురు డీమె తనయుడే.

## 53. దండుడు

దండుడు ఇక్ష్వాకుని నూర్గురు పుత్రులలో కడపటివాడు. ఇతడు వీరుడు, విద్వాంసుడు నయ్యును, తనయందలి ఘోర మను దోషమువలన మూఢుడుగను, విద్యాహీనుడుగను, ఉన్మత్తుడుగను మారిపోయెను. ఇక్ష్వాకు డితనికి వింధ్యశైవలపర్వతముల మధ్యభాగము రాజ్యముగా నిచ్చి, బుద్ధులు గరపి పంపెను. వింధ్యపర్వతపు రెండు శిఖరముల మధ్యభాగమున నితడు మధుమత్తము, లేక మధుమంతము అను నగరము నిర్మించెను. శుక్రాచార్యు డితని పురోహితుడు. ఆచార్యపుత్రి యగు అరజ నితడు బలాత్కరించెను. అందుపై కోపించి శుక్రు డితనిని, యితని రాజ్యమును శపించెను. ఇతడు నశించెను. రాజ్యము దండకారణ్య మయ్యెను. ఇతనికి దండకుడని కూడ పేరుండెను.

చూ. శాప్రక. 59 భార్గవుడు > దండుడు, మరియు భార్గవుడు > దండకారణ్యము.

## 54. దశరథమహారాజు

దశరథుడు ఇక్ష్వాకువంశమున జనించిన అజమహారాజునకు పుత్రుడు. ఇత డయోధ్యాధిపతి. పద్మపురాణములో ఇతని తండ్రిపేరు ప్రజాపాలు డని పేర్కొనబడెను. ఇతడు వేదవేత్త, సర్వసంగ్రాహకుడు, దీర్ఘదర్శి, జనప్రియుడు, పరాక్రమవంతుడు, ఋషికల్పుడు, జితేంద్రియుడు. ధనధాన్యము లెక్కుపగా సంగ్రహించి, మనువువలె .అన్నివిధములుగా జనులను రక్షించుచుండెడివాడు. ఇతని రాజ్యమున నాల్గువర్ణముల వారును పరస్పరసహాయకులై యుండిరి. గుణవంతులైన మంత్రుల సహాయమునను, జాగరూకులైన చారుల నేర్పువలనను, ఇతడు మనునిర్మితమైన అయోధ్యకు మరింతగా వైభవము చేకూర్చెను. కౌసల్య, కైక, సుమిత్ర యను నితని భార్యలు ప్రసిద్ధులు కాని పద్మపురాణమున కైక పేరు లేదు. ఆమెకు బదులుగా సురూప, సువేషలు మరి యిద్దరును పేర్కొనబడిరి. ప్రతిరాణికిని ఒక్కొక్క పుత్రు డుదయించినట్లు చెప్పబడినది. దశరథుడు విషయలంపటు డనియు, అందువలననే అతడు వృద్ధావస్థలో కైకను, ఆమెకు కల్గిన పుత్రునికే రాజ్యమిచ్చెదనని ఆమె తండ్రివద్ద ప్రతిజ్ఞ చేసి వివాహమాడెననియు వర్ణింపబడెను. వివాహానంతర మితడు అశ్వమేధము

చేసెను. ఆ యజ్ఞమునకు శృంగిముని సహాయ మావశ్యక మయ్యెను. ఇతడు తన కుమార్తె శాంతను శృంగిముని కిచ్చి వివాహము చేసెను.

కైకేయికి వెనుక నెప్పుడో యిచ్చిన వరములవలన రామునికి రాజ్యాభిషేకము చేయనెంచిన యితని కోర్కె భగ్నమైనది. ఇతడు రాముని నిరతిశయముగా ప్రేమించెడివాడు. రాముని రాజ్యాభిషేకమునకు భరతునివలన నాటంక మేర్పడునేమో యని యితడు శంకించుచుండెను. అందువలన భరతుడు తాతగారింటివద్ద నున్న సమయమున శీఘ్రముగా నితడు రాము నభిషేకింప దలచెను. కాని కైక తన కిచ్చిన వరము లడిగినందున యితని ప్రయత్నమంతయు భగ్నమాయెను. శ్రవణముని యిచ్చిన శాపమును స్మరించి సంత్రస్తుడగుచుండిన దశరథునకు వరముల మూలమున నా భయము సత్యసిద్ధమాయెను. వరములేమో వినకయే యితడు వాటిని పాలింతునని కైకకు మాట యిచ్చెను. అందువలన నెంత కటువైనను నితడా మాట పాటింపవలసివచ్చెను. అగతికుడై యితడు కైకేయి నెంతగానో బోధించి, బుజ్జగించి, బెదరించి, కాళ్లవ్రేళ్లబడి ప్రార్థించినను ఆమె తన పట్టు వీడలేదు. రాముడు తండ్రి యాజ్ఞను పాలించుటకే నిశ్చయించెను. ఇట్లితనికి పుత్రవియోగము తప్పినది కాదు. ఆ దుఃఖము భరింపలేకనే యితడు మరణించెను. భరతుడు అయోధ్యకు వచ్చునంతవరకు నితని శవమును తైలకటాహమున భద్రపరచిరి. వసిష్ఠుని యాదేశమున భరతు డితని కంత్యేష్టి జరిపెను. కైకేయి కిచ్చిన వరములను గూర్చి పశ్చాత్తాపము కలిగి యిత డామెతో గల సమస్తసంబంధములను విడిచిపెట్టెను.

సీతాదేవి అగ్నిపరీక్షానంతరము శివుని కృపవలన స్వర్గస్థుడైన దశరథుడు భూతలమునకు వచ్చి రామునకు దర్శనమిచ్చెను. నీవు నన్నుద్ధరించితి వని పల్కి రాముని కోర్కెపై కైకేయీభరతులను మునుపటివలెనే ప్రేమపూర్వకముగా చూచుట కంగీకరించెను. సీత నాశీర్వదించి యామెకు సద్బుద్ధు లెరిగించెను. దుర్వాసుడు ముందుగనే దశరథునితో నీ కుమారుడు రాముడు సీతను త్యజించునని చెప్పెను.

## 55. దితి

ప్రాచేతస దక్షప్రజాపతికి అసిక్నికి పుత్రికయైన దితి కశ్యపుని పత్నియై దైత్యులను ప్రసవించినది. అదితి పుత్రులైన ఆదిత్యులతో దైత్యులకు విరో

ధము. ఋగ్వేదమున రెండుమార్లు ఈమె ప్రస్తావన కనిపించినను ఒకసారి అదితితోపాటుగను వేరొకసారి అగ్నిసవితృభగులతోను ఈమె పేర్కొనబడినది. అధర్వవేదములో ఈమెపుత్రుల పేర్లున్నవి. దితి బహుశా అదితికి విరోధినిగా పేర్కొనబడెను.

## 56. దుందుభి

ఇతడు మయాసురునకును, అప్సర హేమకును కలిగిన రెండపకుమారుడు. ఇతడు చిరకాలము తపస్సుచేసి వేలకొలది యేనుగుల బలము సంపాదించెను. ఆ బలముచే గర్వించెను. కాని వాలి వీనిని చంపి దూరముగా విసరివేసెను. అప్పుడు వాని రక్తము మతంగముని యాశ్రమములో పడెను. సుగ్రీవుని బలవిషయమున నమ్మిక కలిగించుటకై రాము డితని కంకాళమును కాలివ్రేలితో పదియోజనముల దూరమున పడునట్లు తన్నివేసెను. దుందుభి పదునారువేల నారీమణులను చెరబట్టెను. లక్షమంది నొకేసారి వివాహమాడగోరెను. ఇతని కుమారుడు మాయావి.

## 57. దుర్వాసుడు

అత్రి అనసూయల పుత్రుడు దుర్వాసుడు. శివశతరుద్రసంహితలోను, మహాభారతములోను చెప్పిన యితని జన్మకథ వేరువేరుగా నున్నది. అత్రిముని మస్తకమునుండి వెడలిన అగ్నిజ్వాలనుండి ఇత డుదయించెనని రుద్రసంహితలో నుండగా, మహాభారతమున త్రిపురవినాశార్థము శంకరుడు విడిచిన బాణము బాలకరూపమున తిరిగి వచ్చి శివుని యొడిలో కూర్చొనినట్లును అతడే దుర్వాసుడని చెప్పబడెను. ఇతనిని శివుని యవతారముగా చెప్పుదురు. ఇతడు తామసుడు. భూతలమున నందరికన్న పొడవరి. ఇత డెప్పుడును ఇతరులను బాధించుచుండెడివాడు. ఇతని క్రోధమునుగూర్చి ఎన్నో కథలున్నవి. ఇంద్రుని కితడు పుష్పమాలిక నిచ్చెను. అది ఐరావతము పాదముల క్రింద పడి నలిగిపోయెను. అది చూచి కోపించి యత డింద్రుని సంపద్రహితుడ వగుమని శపించెను. శాపశాంతికై యింద్రుడు వేడుకొన్నను ఇతడు చలించలేదు. అంబరీషు నిత డకారణముగా బాధింపబోయి చివర కాపదలో చిక్కుకొని ఆ అంబరీషునే శరణు వేడుకొనెను. పద్మపురాణము ననుసరించి, రాముని అశ్వమేధమున యజ్ఞాశ్వము దుర్వాసునివలన శపింపబడిన కపటబ్రాహ్మణుడే.

ఒకసారి యితడు వేయేండ్లు ఉపవాసముండి పారణకొరకు రాముని పద్ద కేగెను. ఆ సమయమున కాలుడు శ్రీరామునితో ఏకాంతమున నుండెను. అందుచే లక్ష్మణుడు వెంటనే యితనిని రామునివద్ద కేగనీయలేదు. కొంచెము సేపు తాళుమని చెప్పగా దుర్వాసుడు మహోగ్రమూర్తియై తనకు తత్క్షణమే రాముని దర్శనము లభింపకున్నచో అందరిని శపింతునని బెదిరించెను. లక్ష్మణుడు రామునివద్ద కితనిని గొనిపోయెను. రాము డితనికి కావలసినట్లు భోజన మేర్పాటు చేసెను. ముద్గలుని సత్యము పరీక్షించి యితడు అతనికి సదేహస్వర్గము పరముగా నిచ్చెను. స్కందపురాణము ననుసరించి యితడు శ్రీకృష్ణునికి పరమిచ్చి, రుక్మిణిని శపించెను. ఇతడు శివారాధనమున చిరకాలము తపించి, అప్పటికిని శివుడు ప్రసన్నుడు కాకపోవుటతో అతనినే శపింపబోయెను. ఔర్వ ఋషికుమార్తె కందళి యితని భార్య. క్రోధావేశమున నిత డామెను శపించి భస్మము చేసెను. ఈతని పేరున నెన్నో గ్రంథము లున్నవి.

దుర్వాసుడు కుంతికి దేవహూతి యను విద్య నిచ్చెను. ఈ విద్యవలననే ఆమెకు ఇంద్ర, వాయు, యములవల్లను, అశ్వినీకుమార, సూర్యులవల్లను పుత్రప్రాప్తి కల్గెను. శ్రీ.మ.రం శిరవాడ్కర్ గారి మతమున దుర్వాసుడే పాండవుల జనకుడు.

చూ. మహాభారతమున చమత్కారములు హస్తినాపురం పు. 19-27 (మరాఠీ)

## 58. దేవయాని

ఈమె దైత్యగురువైన శుక్రాచార్యుని కుమార్తె. దేవగురువైన బృహస్పతి కుమారుడు కచుడు శుక్రునివద్ద సంజీవని విద్య గ్రహించుటకు వచ్చెను. దేవయాని కచునియం దనురక్తురా లాయెను. అతనిని పెండ్లాడగోరెను. కాని గురుపుత్రి యగుటచే కచు డందు కంగీకరించలేదు. అప్పు డామె నీ కీ విద్య నిష్ఫల మగునని శపించెను. శర్మిష్ఠతో నీమెకు జగడమాయెను. ఆమె ఈమెను నూతిలో ద్రోయించెను. యయాతి ఈమెను నూతిలో నుండి వెలికి దీసి యుద్ధరించెను. పరిచయము చెప్పిన పిదప యయాతి ఈమెను వివాహమాడెను. శుక్రాచార్యుని క్రోధమునకు వెరచి, జాతికి మేలెంచి శర్మిష్ఠ దేవయానికి దాసిగా యయాతి వెంట నరిగెను. యయాతివలన దేవయానికి

యదుపు, తుర్వసుదు నను నిద్దరు పుత్రులు కల్గిరి. రామాయణములో యదు వొక్కడే పేర్కొనబడెను. శుక్రాచార్యుదు దేవయానితో శయనకార్యమున నెప్పుదును శర్మిష్ఠను నియోగింపపలదని హెచ్చరించెను. కాని ఎట్లో శర్మిష్ఠకు యయాతి పలన సంతానము కల్గెనని విని అతడు యయాతిని వృద్ధు డగునట్లు శపించెను.

## 59. దేవాంతకుడు

ఇతడు రావణుని పుత్రుడు. కుంభకర్ణుని పధ విని శోకాకులుడై త్రిశిరుని ఉత్తేజకరభాషణముచే నరాంతకుని పలె నితదును యుద్ధమున కేగెను. నరాంతకుడు పధింపబడుటతో నితడు మండిపడి అంగదునితో పోరాడ దొడగెను. హనుమంతు డితనిని పధించెను.

## 60. ద్వివిదుడు

ఇతడు వానరయూథపుడైన సుషేణుని పుత్రుడు. సుగ్రీవరాజ్యాభిషేకమునకై యితడు మిక్కిలి శ్రమించెను. ఆ తర్వాత నిత డతని ప్రధాని యయ్యెను. ఇతడు మైందుని సోదరుడు. డెబ్బదియోజనములు దాటగలడు. ఇతర వానరులతోపాటుగా ఇతడును ఋక్షబిలమున ప్రవేశించెను. ఇతనికి బ్రహ్మపలన అవధ్యత్వము పరముగా లభించెను. యుద్ధములో నితని కెవరును సాటిరా రని శుకుడు రావణునితో నితని పరాక్రమమునుగూర్చి వివరించెను. అశని ప్రభుడు, సమప్రభు డను అసురుల నితడు సంహరించెను. కుంభకర్ణునిపై నితడు విసరిన పర్వతము పడి ఎందరో రాక్షసులు నశించిరి. ఎన్నో రథాశ్వములు నుగ్గునూచై పడి పోయెను. ఇత డతికాయు నాక్రమింపబోయెను కాని సఫలుడు కాలేదు. శోణితాక్షు డితని చేతిలో మరణించెను. రాము డితనితో కలియుగాంతముపరకు నీవు జీవించియుందు పని చెప్పెను.

ఇతడు కిష్కింధకు రా జాయెను. మహాభారతము ననుసరించి, యితడు రాజసూయాపసరమున సహదేవునకు కప్పము చెల్లించెను. బలరామునితో యుద్ధము చేయుచు నిత డతనిచే సంహరింపబడెను.

## 61. నందీశ్వరుడు

ఇతడు శిలాదుని పుత్రుడు, శాలంకాయనుని ప్రపౌత్రుడు. శిలాదునికి

పుత్రులు లేనందున నతడు తపస్సు చేసెను. శివు డతని కభీష్టవర మిచ్చెను. ఒకసారి యజ్ఞభూమిని దున్నుచుండగా మూడు కళ్లు, నాలుగు చేతులు, జటామకుటము కల్గి, శివుని యాకారమున నున్న శిశువు దొరికెను. ఇంటికి తెచ్చిన పిదప అత డన్యశిశువులవలెనే మారిపోయెను. నందీశ్వరు డెనిమిదేండ్ల ప్రాయమువా డగుసరికి, మిత్రావరుణులవలన అల్పాయుష్కు డగునని తెలిసెను. ఆ అపమృత్యువును తొలగించుకొనుట కితడు తపస్సుచేసి శంకరుని మెప్పించి అమరత్వము సంపాదించెను. శివు డితనిని పుత్రసమానుడుగా మన్నించి తనకు పార్షదునిగా చేసికొనెను. మరుత్పుత్రి సుయశ నితడు పెండ్లాడెను. దక్షయజ్ఞధ్వంసావసరమున నితడు ఋత్విజుడైన భృగుని బంధించెను. దక్షుని శపించెను. శ్రీరాముని అశ్వమేధసందర్భమున నితనికి మారుతితో యుద్ధమైనట్లు పద్మపురాణ పాతాళఖండములో వర్ణింపబడినది. ఇతడు రావణుని శపించెను.

## 62. నరాంతకుడు

ఇతడు రావణుని పుత్రుడు. విభీషణు డితనిని అగ్నితేజుడనియు, పర్వతశిఖరములతో ఢీకొనువాడనియు చెప్పెను. కుంభకర్ణవధకు కోపించి యితడు రావణుని యాజ్ఞకొని యుద్ధమునకు పోయెను. త్రిశిరుని మాటలచే నుత్తేజితుడాయెను. వానరసేనలో ప్రవేశించి ఎందరినో వానరులను చంపి చివరకు అంగదునిచేత వధింపబడెను.

## 63. నలుడు

ఇతడు విశ్వకర్మవలన ఘృతాచి యను అప్సరకు జన్మించెను. ఋతుధ్వజుడను మునీశ్వరుని శాపముచే నితనికి వానరరూపము కల్గెను. శ్రీరాముని సేనలో నితడు ప్రముఖయోధుడు. తండ్రివలన నితనికి వలసినట్టి వస్తువు దేనినైనను నిర్మింపగల్గునట్లు వరము లభించెను. శ్రీరాముని యాజ్ఞపై నితడు సముద్రముపైన సేతువు నిర్మించెను. లంకాప్రాకారమునందు రంధ్రము దొల్చుటలో నితడు సహాయపడెను. నీ చేతిరాయి నీటిలో తేలగల దని ఒక బ్రాహ్మణు డితనికి వరమిచ్చెను. ప్రతపనుడు, అకంపనుడు, ప్రహస్తుడు యుద్ధమునకు వచ్చినప్పు డిత డెంతగనో పరాక్రమము జూపెను. అశ్వమేధావసరమున

యజ్ఞాశ్వరక్షార్థము శత్రుఘ్నునితో నితడు కూడ పోయెను. ఇంద్రజిత్తు ఇతనిని బాణాసారముచే భంగపరచెను. రాజ్యాభిషేకసమయమున రాము డితనిని సత్కరించెను. కుశలవు లితనిని జయించిరి.

## 64. నలకూబరుడు

ఇతడు వైశ్రవణుని పుత్రుడు. మణిగ్రీవుని తమ్ముడు. ఒకసారి యీ సోదరు లిరువురు మద్యపానమత్తులై స్త్రీజనముతో కూడి కైలాసపర్వతోపవనమున గల నదిలో జలక్రీడ లాడుచుండిరి. నారదు డా స్థితిలో వారిని చూచి, వివస్త్రులగుటచే మందిపడి నూరేండ్లు దివ్యవృక్షములై నిల్చునట్లు శపించెను. కాని నారదుని కృపవలన వారికి పూర్వస్మృతి యుండెను. మహాభారతమున, వీరు శ్రీకృష్ణుని సామీప్యముచే శాపముక్తులైనట్లు చెప్పబడినది. వీరు కృష్ణభక్తులైరి.

వాల్మీకి రామాయణములో రంభానలకూబరు లన్యోన్యప్రేమికులని వర్ణింపబడెను. రంభ యితనిగూర్చి రావణునితో నిట్లు చెప్పెను - 'అతడు ధర్మముచే బ్రాహ్మణుడు, వీర్యమున క్షత్రియుడు, క్రోధమున నగ్నిసమానుడు, క్షమాశీలమున పృథ్వివంటివాడు.' ఆమె పూర్వసంకేతము ననుసరించి అలంకరించుకొని నలకూబరుని వద్ద కేగుచుండగా దారిలో రావణు డామె నడ్డగించి బలాత్కారముగా ననుభవించెను. ఆమె నలకూబరుని కీ సంగతి తెలియజేయగా నత డుగ్రుడై జలహస్తుడై రావణునికి శాపమిచ్చెను.

## 65. నహుషుడు

ఇతడు పురూరవుని ప్రపౌత్రుడు. ఆయువునకు పుత్రుడు. యయాతి యితని కుమారుడు. ఇతని తల్లిపేరు వేర్వేరు పురాణములలో వేర్వేరుగా నున్నది. ఇతడు పుట్టుటకు ముం దితని తల్లికి ఆమె గర్భమున నున్న శిశువు పుట్టగనే పితృఘాతకు డగునని భవిష్యవాణి వినిపించెను. ఫలితముగా పుట్టుకతోనే యితనిని కష్టము లావరించినవి. కాని వసిష్ఠుడు తన దివ్యదృష్టితో విషయములన్నియు గ్రహించి యితనిని రక్షించెను. వసిష్ఠు డితనికి ఉపనయన సంస్కార మొనర్చి యితనికి వేదములు, ధనుర్వేదము నేర్పెను. ఇతడు జాలరుల వలలో తగుల్కొనిన చ్యవనుని విడిపించుటకు గోదాన మిచ్చెను.

త్వష్టృని సమ్మానించుటకు గవాలంభన మొనర్చెను. బ్రహ్మహత్యాదోషమున నింద్రునికి పదభ్రంశము కలిగినపుడు దేవతలును, ఋషులును తమ తపోబల మిచ్చి యితని నింద్రునిగా జేసిరి. నీ వెవరివంక చూచెదవో వారి తేజము నీవు హరింపగలవని యితనికి వరమిచ్చిరి. కొంతకాల మితడు ధర్మముగా పరిపాలించెను. కాని తర్వాత నితనికి గర్వము పెరిగెను. మత్తిల్లి యితడు విషయలంపటు డాయెను. ఇంద్రాణి నొకసారి చూచి, ఆమె సౌందర్యమునకు మోహించి దేవతలతో నామెను తెచ్చి తన కిమ్మనెను. అపు డామె యింద్రునితో నాలోచించి సప్తర్షులు మోయు పల్లకిలో వచ్చినచో నతని నంగీకరింతునని కబురంపెను. నహుషుని కిది సంభవ మనిపించెను. అతడు సప్తర్షులను పల్లకీ మోయుటకు నియోగించెను. వారు మోసి తెచ్చుచుండగా నహుషుని కాళ్లు అగస్త్యుని మస్తకమును తాకెను. దానితో కోపించి అగస్త్యు డితనిని పాముపై భూమిపై పడియుండుమని శపించెను. కాని తనకున్న విశేషశక్తివలన ఇత డగస్త్యుని వంకచూచి అతని తేజ మపహరింపదలచెను. కాని అగస్త్యుని జటలలో భృగువు దాగియుండెను. నహుషు డతనిని చూడలేదు. కనుక అతని యూహ ఫలింపలేదు. శాపము మాత్రమబ్బినది. యుధిష్ఠిరు డితనికి శాపవిమోచనము గావించెను.

విభిన్నగ్రంథములలో నితని పుత్రుల సంఖ్య విభిన్నముగా నున్నది. యతి, యయాతి, సంయాతి, అయాతి అను పేర్లు చాల గ్రంథములలో కనిపించుచున్నవి.

## 66. నిమిచక్రవర్తి

అయోధ్యాపతియైన ఇక్ష్వాకున కితడు పండ్రెండవ పుత్రుడు. పద్మపురాణము ననుసరించి, యితడు స్త్రీలతో జూదమాడుచున్న సమయమున అకస్మాత్తుగా వసిష్ఠు డక్కడికి వచ్చెను. నిమి అతనికి తగిన స్వాగతసన్మానములు చేయలేదు. అందుపై కోపించి వసిష్ఠు డితనిని శపించెను. ఇతడును వసిష్ఠుని శపించెను. వసిష్ఠుని శాపముచే నచేతనుడై పడిన నిమి శరీరము గంధపుష్పవస్త్రాదులతో తైలకటాహమున భద్రపరుపబడెను. యజ్ఞార్థము వచ్చిన ఋషిగణము స్వయముగా దీక్ష వహించి యజ్ఞమును పూర్తిజేసిరి. చివర హవిష్యాన్నమును గ్రహింపవచ్చిన దేవతలను రాజు నాశీర్వదింపుడని కోరిరి.

నిమియొక్క జీవాత్మ వారితో నిట్లనెను- 'శరీరప్రాణముల వియోగము మిక్కిలి దుఃఖదాయకము కనుక నేను తిరిగి శరీరము ధరింప నిచ్ఛగింపను. అశరీరినై ప్రాణుల నేత్రములలో నివసింపదలచెదను.' అంతట దేవత లతనిని వాయు రూపమున సమస్తజీవుల నేత్రములందును నివసింప ననుగ్రహించిరి. ఇందుచే జీవుల నేత్రములు మాటిమాటికి మూసికొనిపోవుచు తిరిగి తెరుచుకొనుచుండెను. మూసికొని తిరిగి తెరచుకొనుటలో గల కాలవ్యవధికి నిమిష మని పేరు వచ్చెను. మత్స్యపురాణము ననుసరించి బ్రహ్మ యితనిని కంటిరెప్పలపై నధివసింపజేసెను.

నిమికి పుత్రులు లేరు. ఋషు లితని శరీరము నరణినుంచి బలముగా మథించిరి. మంత్రోచ్చారణపూర్వకముగా హోమ మొనర్చిరి. ఫలితముగా నతని శరీరమునుండి మహాతపస్వి యగు మిథి జన్మించెను. ఇట్లు తండ్రికి మాత్రమే, తల్లి లేకుండ పుట్టిన కారణముచే 'నిమిజనకు' డనియు, విదేహము (జీవరహిత శరీరము) నుండి జనించుటచే వైదేహుడనియు మిథికి పేరు వచ్చెను. ఈ విషయమున నింక నెరుగగోరువారు చూడుడు –

శాప్రక. 50,51. వసిష్ఠుడు > నిమి, నిమి > వసిష్ఠుడు.
వర్రక. 76 దేవతలు > నిమి.

## 67. నివాతకవచులు

వీరు రాక్షసులు. ఇది సామూహికనామము. ప్రహ్లాదుని సోదరుడు సంహ్రాదుడు. ఈ పేరు గల పుత్రుని గాంచెను. ఈ రాక్షసులు రావణుని మిత్రులు. వీ రింద్రునికైన జయింప నసాధ్యులు. వీరు లెక్కకు అరువది లేదా డెబ్బదియయిదువేలమంది. వీరికి బ్రహ్మ వరమిచ్చెను. వీరు పాతాళమున మణిమయ మను నగరమున వసించుచుండిరి.

## 68. నిశాకరుడు

వింధ్యపర్వతముపై నొక యాశ్రమములో ఈ ముని వసించెడివాడు. సంపాతియు, జటాయువు నితనిని సేవించుచుండెడివారు. సూర్యకిరణములచే రెక్కలు కాలిపోయి ఆశ్రమసమీపమున పడియున్న సంపాతిని చూచి యితడు నీకు తిరిగి రెక్కలు,కనులు, ప్రాణశక్తి కలుగునని చెప్పెను. సీతాపహరణ

విషయమున భవిష్య మెరిగించి సంపాతి నితడు అప్పటివరకు నిరీక్షించుచుండుమని చెప్పెను. ఇట్లు సంపాతికి ధైర్యము చెప్పి నిశాకరముని స్వర్గమునకై మహాప్రస్థాన మరిగెను.

## 69. నిషాదుడు

నిషాదశబ్దమునకు వ్యుత్పత్తి నిర్వచించుచూ, 'నిషద్యతే గ్రామశేషసీమాయామ్' - గ్రామసీమనుండు వాడు నిషాదుడు అని చెప్పబడెను. 'చత్వారో వర్ణాః పంచమో నిషాదః' అను వచనమువలన చాతుర్వర్ణ్యేతర పంచమభాగ మగు భారతీయులకు నిషాదు లని పేరు వచ్చినట్లున్నది. బౌద్ధాయన, మహాభారతముల ననుసరించి బ్రాహ్మణునికి శూద్రస్త్రీవలన కలిగిన సంతతి నిషాదు లనబడిరి. ఐతరేయబ్రాహ్మణములో వీరు క్రూరకర్మ లనియు, చౌర్యము చేసి జీవించు వారనియు చెప్పబడినది. సమాజములో నిషాదులకు నిమ్నతమ మగు స్థాన మీయబడినది. కాని వారికిని కొన్ని ధార్మికాధికారములు సమకూర్చబడినవి. వీరికి వేట, కైవర్తము వంటి వృత్తులు జీవనాధారముగా నేర్పబడెను. ప్రాచీనకాలమున నిషాదులు పడవ నడుపు వృత్తికూడ వహించెడివారని తెల్పియుచున్నది. శ్రీరామునికి వనగమనసమయమున పడవపై గంగ దాటించినది నిషాదుడే.

వాల్మీకిరామాయణములో 'మా నిషాద' శ్లోకము (బాల. 2-15) తర్వాత తిరిగి యెచ్చటను నిషాదుని ప్రస్తావము లేదు. వేట నిషాదుల జీవనాధారము. వారి దృష్టిలో క్రౌంచవధ దోషము కాదు. కాని కామపీడితావస్థలో నున్న క్రౌంచమును బాణముతో కొట్టి చంపుట అనుచితము. ఆ నింద్యకర్మకే నిషాదుడు శపింపబడెను.

చూ. శాపక్ర. 1 వాల్మీకి > నిషాదుడు

## 70. నీలుడు

అగ్ని యంశమున జనించిన వానరయూథపుడు నీలుడు. ఇతదు ధీశాలి, కార్యరతుడు. పదికోట్ల వానరసేనతో నితడు సుగ్రీవుని యాదేశముపై వచ్చి అతనిని కలిసెను. ఇతడు సమస్తవానరసేనకు సేనాధిపతిగా నుండెను. సైన్యమును కుశలముగా సముద్రము దాటించెను. రాముని యాజ్ఞపై ప్రహస్తు

నెదిరించి పోరాడుట కితడు తూర్పు వాకిలిలో వానరసేనతో నిల్చెను. నికుంభు డితనిని తీవ్రముగా గాయపరచెను. అందుపై నితడు వాని సారథిపై కెగిరి వాని తలను మొండెమునుండి పెరకివేసెను. ఇంద్రజిత్తును వెదకుచూ పోయినప్పు డితడు వాని బాణములచే మూర్ఛపడెను. ప్రహస్తునితో యుద్ధము చేసి యితడు వానిని సంహరించెను. రాము డితనిని చాల మెచ్చుకొనెను. రావణు డాగ్నేయాస్త్రము ప్రయోగింపగా, అది యితనిని వధింపలేదు. సేనా వ్యూహమును చక్కగా తీర్చి యితడు కుంభకర్ణునిపై పర్వతశిఖరము విసరెను. కుంభకర్ణుని మోకాలిదెబ్బ కితడు క్రిందపడెను. రాక్షసులు చుట్టుముట్టినపు డితడు అంగదునికి సహాయపడెను. మహోదరునితో పోరాడి అతనిని వధించెను. కాని అతికాయునిచేత పరాజితుడయ్యెను. యుద్ధానంతరము రాము డితనిని పెద్దగా సత్కరించెను. రాముని అశ్వమేధావసరమున యజ్ఞపశురక్ష కితడు శత్రుఘ్నునితో కలిసి వెళ్ళెను.

## 71. నృగమహారాజు

నృగమహారాజు పుష్కరతీర్థమున కోట్లకొలది సవత్సగోదానములు చేసెను. ఒక ఆహితాగ్నియైన బ్రాహ్మణుని గోవు పొరపాటున దానమిచ్చిన గోవులలో కలిసిపోయెను. బ్రాహ్మణుడు తన గోవును వెదకుచు పోయి దాని నింకొక బ్రాహ్మణుని వద్ద చూచెను. అప్పు డా గోవునుగూర్చి ఆ బ్రాహ్మణు లిరువురకు వివాదమాయెను. న్యాయముకొరకు వా రిరువురు రాజువద్ద కరిగిరి. కాని పెక్కుదినములు రాజద్వారమున వేచియున్నను వారికి రాజదర్శనము లభింపలేదు. అప్పుడు వారు రాజును తొండగా మారిపోవుదు వని శాపమిచ్చిరి. కాని కలియుగమున శాపముక్తి కలుగునని పలికిరి. రాజు తన కుమారుడైన వసువునకు రాజ్యమిచ్చి, తానొక బిలములో చేరి శాప మనుభవించెను. శాపశాంతి వేడగా, శ్రీకృష్ణునిద్వారా నీ వుద్ధరింపబడుదు వని పల్కినట్లు అన్యత్ర వినిపించుచున్నది.

## 72. పర్వతుడు

ఇత డొక దేవర్షి. మాంధాతృనృపాలుడు నీ గర్వ మడపగలడని యితడు రావణునితో చెప్పెను.

## 73. పుంజికస్థల

ఈమె ఒక ఉత్తమాప్సరస. మిక్కిలి రూపవతి. ఎవడో ఒక ఋషి ఈమెను శపించుటచే నీమెకు వానరరూపము కలిగినది. వానరయూథపుడైన కేసరి కీమె భార్యయైనది. వానరరూప మున్నను శాపశాంతివలన నీమెకు మానవరూపము ధరించు శక్తి యుండెను. ఆమె రూపమునకు ముగ్ధుడై వాయుదేవు డామెతో మానసికసమాగమ మొనర్చి 'నీ కిందువలన చింతింప నవసరము లేదు. నీకు మహాబుద్ధిమంతుడగు పుత్రుడు పుట్టు'నని చెప్పెను. ఆ పుత్రుడే హనుమంతుడు.

## 74. పురూరవుడు

ఇతడు బుధునివలన ఇలకు జన్మించిన పుత్రుడు. మత్స్యపురాణము ననుసరించి, ప్రతిష్ఠాపుర మితని రాజధాని. ఇతడు నూరు అశ్వమేధములు చేసెను. ఇతడు సోమవంశమునకు మూలపురుషుడు. మిత్రావరుణుల శాపముచే భూమికి దిగిన అప్సరస యగు ఊర్వశి యితనిని విడిచి వెళ్ళిపోయెను. ఊర్వశి యం దితనికి ఆర్గురు పుత్రు లుదయించిరి. ఒకసారి ధర్మార్థకామములు మానవరూపమున వచ్చి యితనిని పరీక్షింపనెంచెను. ఇతడు ధర్మమును సర్వోత్కృష్ట మని గౌరవించెను. అందువలన అర్థకామము లితనిని 'లోభకారణమున నీ సర్వస్వము నశించు' నని శపించెను. స్కందపురాణమున నితనికి తుంబురునివలన కూడ శాపము కలిగినట్లున్నది. ఇతడు రాజయినను మంత్రకర్త. వాయుకశ్యపులతో నితడు చాతుర్వర్ణ్యవ్యవస్థను గూర్చి వాదించెను.

చూ. ఊర్వశి. క్ర.17

## 75. పులస్త్యుడు

ఇతడు బ్రహ్మమానసపుత్రుడు. కర్దమునినుండి పదకొండవ ప్రజాపతి. ఇతడు బ్రహ్మ యంతటివాడు. దేవతలకు మానవులకు కూడ ప్రియుడు. విశ్రవసు డితని మానసపుత్రుడు. దేవవర్ణినియం దితని కొక పుత్రుడు కలిగెను. అతని లక్షణములు పరికించి పులస్త్యు 'డితడు ధనాధ్యక్షు డగు'నని భవిష్యవాణి నెరిగించెను. అందుచే నతనికి వైశ్రవణుడని పేరువచ్చెను.

గాలవముని సహాయమున నితడు రావణమాంధాతలకు యుద్ధము మాన్పి సఖ్య మొనర్చెను.

బ్రహ్మాండపురాణము ననుసరించి యితడు బ్రహ్మ యుద్యానమున జన్మించెను. ఇతడు స్వాయంభుపదక్షునకు జామాత, శంకరునకు షడ్డకుడు. దక్షునివలన నవమానింపబడినపుడు శంకరు డితనిని ధగ్ధమొనర్చెను. దక్షపుత్రియైన ప్రీతి యితని భార్య. ఆమెయం దితనికి దానాగ్ని యను పుత్రుడు కలిగెను. ఇంకను అత్రి, దేవబాహులను పుత్రులును, సద్వతి యను పుత్రికయు నితని కుండిరి. మహాభారత, వాయు, మత్స్యపురాణము లితడు బ్రహ్మమానసపుత్రుడని, బ్రహ్మదేవుని చెవి నుండి పుట్టెనని చెప్పుచున్నవి. బ్రహ్మ నిర్మించిన ప్రజాపతులలో నిత డొకడు. కర్దముని పుత్రి హవిర్భువ యీతని పత్ని. ఆమెయం దితనికి అగస్త్యవిశ్రవసులు జనించిరి. విష్ణుపురాణములో అగస్త్యుడు ప్రీతికి పుట్టినవాడుగా వర్ణింపబడెను. మహాదేవుని శాపముచే నశించిన బ్రహ్మమానసపుత్రులలో నితడు కూడ కలడు.

అట్లు నశించిన ఆ పుత్రులను బ్రహ్మ తిరిగి వైవస్వతమన్వంతరమున నుత్పాదించెను. అప్పు డితడు అగ్నిదేవుని పింగళజ్వాలలనుండి పుట్టెను. తన తపస్సునకు విఘ్నము కలిగించుచున్న అమాయికకన్యాజనము నితడు తన కంటబడినచో గర్భవతు లగుదురని శపించెను. ఈ శాపకారణమున తృణబిందుని కుమార్తె గర్భము ధరించెను. కాని తృణబిందుని యనురోధమున నిత డామెను పెండ్లాడెను. ఆమెయం దితనికి విశ్రవసుడు జన్మించెను. ఈ కథ వాల్మీకి రామాయణములో ఉత్తరకాండమం దున్నది. పద్మపురాణము ననుసరించి యితడు బ్రహ్మదేవుని పుష్కరయాగమున నధ్వర్యుడుగా నుండెను. యాజ్ఞవల్క్యు డితనిని స్మృతికారునిగా పేర్కొని గౌరవించెను. పౌలస్త్యస్మృతి బహుశా క్రీస్తు శకము నాల్గు ఏడు శతాబ్దముల మధ్య నిర్మింపబడియుండును.

## 76. ప్రహస్తుడు

ఇతడు సుమాలికి, కేతుమతికిని పుట్టిన రాక్షసుడు. రావణునికి మామ. అతని వద్ద ప్రధాని. ఇతడు మంచివీరుడు. అందుచే నితడు రావణుని సర్వసేనాధ్యక్షుడయ్యెను. ఇతడు కైలాసమున మణిభద్రు నోడించెను. రామరావణయుద్ధములో నితడు పౌరుషము చూపెను. హనుమంతు డితని

యిల్లు కాల్చివేసెను. అప్పు డితడు పృథ్విని నిర్వానర మొనర్తునని ప్రతిజ్ఞ పట్టెను. శ్రీరామునితో మైత్రి నెలకొల్పుట మేలని చెప్పు విభీషణుని నీతి నిత డంగీకరింపలేదు. కుబేరుడు లంకాధిపతిగా నున్నప్పుడు లంకను తన కిమ్మని యడుగుటకు రావణు డితనిని దూతగా పంపెను.

నరాంతకుడు వధింపబడిన పిదప నితడు నీలునితో పోరాడుచు అతని చేత వధింపబడెను.

## 77. బలి

ఇతడు ప్రహ్లాదుని పుత్రుడైన విరోచనునకు దేవి యను భార్యయందు జన్మించెను. ఇతడు దైత్యులరాజు. మిక్కిలి బలవంతుడు. ఇతని భార్య వింధ్యావళి. వేరొక భార్య అశన. బాణుడు మున్నగువారు నూర్గు రితని పుత్రులు. వారు విష్ణుభక్తులు. శుక్రాచార్యుని ప్రోత్సాహమున నితడు స్వర్గముపై దండెత్తెను. దేవతలు మారు రూపములు ధరించి స్వర్గము విడిచి పారిపోయిరి. ప్రహ్లాదుడు ధర్మయుక్తముగా రాజ్యము చేయుమని బలితో చెప్పెను. అంతేగాక దేవతలను బాధించినచో శీఘ్రమే నశింపగల వని శాపమిచ్చెను. బలి చాలా కాలము రాజ్యము చేసెను. దేవదానవయుద్ధములో ఇంద్రు డితనిని వజ్రముతో కొట్టి చంపెను. కాని శుక్రాచార్యుని స్పర్శ, మంత్రశక్తులచే నితడు పునర్జీవితు డయ్యెను. శుక్రు డితనిచే విశ్వజిత్ యజ్ఞము చేయించెను. యజ్ఞనారాయణుడు ప్రసన్నుడై ఇతని కింద్రుని కుండిన యట్టి దివ్యరథము, స్వర్ణధనువు, అక్షయ తూణీరములు, దివ్యకవచము మున్నగునవి ప్రసాదించెను. ప్రహ్లాదుడు ఎన్నటికిని వాడిపోని పూలమాల నొసగెను. శక్రుడు శంఖ మిచ్చెను. బ్రహ్మకూడ పుష్పమాల కల్పించెను. ఇతడు స్వర్గమును జయించి నూరు అశ్వమేధములు చేసెను.

నర్మదానదికి ఉత్తరతీరమున గల భృగుకచ్ఛక్షేత్రమున నితని చివరి అశ్వమేధము జరుగుచుండగా శ్రీమహావిష్ణువు వామనరూపమున నితని వద్దకు వచ్చెను. అతడు బలిని తనకు మూడడుగులు నేల యిమ్మని కోరెను. శుక్రాచార్యు డీ దాన మీయవద్దని బలిని హెచ్చరించెను. అతని కీ విష్ణుమాయ తెలిసెను. కాని అతిథిగా వచ్చిన వానిని రిక్తహస్తునిగా పంపుట బలికి నియమ విరుద్ధమైన విషయము. అందువల్ల నతడు శుక్రాచార్యుని మాట పాటింపలేదు.

శుక్రుడు కోపించి యితనిని శపించెను. వామనుడు రెండడుగులతో సమస్త బ్రహ్మాండము నాక్రమించెను. మూడవ అడుగు బలితలపై మోపి అతనిని పాతాళమునకు పంపెను. హరివంశమత్స్యపురాణములలో బలికి బ్రహ్మవలన నెన్నో వరములు లభించినట్లు చెప్పబడెను. బలిరాజ్యములో దేవబ్రాహ్మణులు బాధింపబడుచుండిరి. క్షేత్రములు హరింపబడుచుండెను. అందువలన దేవతలు విష్ణుని శరణు వేడిరి. అతడు బలిని నిగ్రహించుటకు వామనుడుగా అవతరించెను.

## 78. బాణాసురుడు

బాణాసురునికి శివు డెన్నో వరము లిచ్చెను. పార్వతీదేవి యితనిని పుత్రరూపమున గ్రహింపగల దని కూడ ఒక వర మివ్వబడెను. కార్తికేయుని జన్మస్థానమున నితనికి సంపూర్ణాధిపత్యము సిద్ధించెను. ఇతడు మహాబలశాలి. యుద్ధము చేయవలెనని యితనికి తీవ్రకాంక్ష యుండెను. దేవతల కితని యిచ్ఛానుసారమే గాని మరియొక విధమున నుండ వీలయ్యేడిది కాదు. ఇతనికి వేయి చేతులు, వీటిలో రెండింటిని మిగిల్చి, తక్కిన వాటిని కృష్ణుడు ఖండించెను. ఇతడు అనిరుద్ధుని బంధించినందున శ్రీకృష్ణు డితనిని సంహరింపదలచెను. కాని ముందుగా ప్రహ్లాదునికి అతని వంశములోనివారిని వధింపనని మాట యిచ్చినందున నట్లు చేయలేదు. ఇతడు తన కుమార్తె ఉషను అనిరుద్ధున కిచ్చి వివాహ మొనర్చెను. ఇతడు శివుని ముఖ్యసేవకుడు, ఉషానిరుద్ధుల పుత్రునికి ఇతడు తన రాజ్య మిచ్చివేసెను. దీనివలన నితనికి పుత్రులు లేరని తెలియుచున్నది. కాని బ్రహ్మాండపురాణము ననుసరించి యితనికి లోహిని యను స్త్రీయందు ఇంద్రధ్వనను డను పుత్రుడు కలిగినట్లు తెలియుచున్నది.

## 79. విభీషణుడు

ఇతడు కైకసీవిశ్రవసుల పుత్రుడు. భారతము వనపర్వములో నితని తల్లి పేరు మాలిని యని చెప్పబడెను. భాగవతములో నీమె కేశిని యని పేర్కొనబడెను. ఇత డత్యంతసుస్వభావుడు. ఘోరముగా తపస్సుచేసి బ్రహ్మను మెప్పించి యితడు, 'నా బుద్ధి ఎప్పుడును సద్ధర్మము ననుసరించుగాక' అని వరము వేడెను. బ్రహ్మ అట్లే యని యితనికి బ్రహ్మాస్త్రము, అమరత్వము

కూడ ప్రసాదించెను. శైలుష గంధర్వుని పుత్రి సరమ యితని భార్య. పద్మపురాణములో ఆమె పేరు మహామూర్తి అని యున్నది.

విభీషణుడు లంకలో నివసించుచుండెను. కాని రావణునితో నతనికి సరిపోకుండెను. సీతను శ్రీరామున కిచ్చివేయుమని యితడు రావణుని కెన్నోసార్లు చెప్పెను. అతనితో చెలిమి చేసుకొమ్మనెను. కాని రావణు డితని మాటలు వినలేదు. ఇతనికి సీతాపహరణము నచ్చలేదు. ఎంతగనో చెప్పి, సదుపదేశ మిచ్చి, దూతలపట్ల నీతి నెరిగించి, రాజసభలో విస్పష్టముగా వీరుల మని బడాయిలు చెప్పుచున్న రాక్షసులు రాము నెదుట నిలువజాలరనియు, అతని చేత వధింపబడుదు రనియు చాటి చెప్పెను. ఇతని మాట మన్నించలేదు సరికదా రావణు డితనిని అవమానించి ధిక్కరించెను. అప్పు డితడు రావణుని విడిచి వేరొక చోటి కేగదలచెను. ఇంద్రజిత్తుచే బంధింపబడిన హనుమంతుని రావణుడు చంపనెంచగా విభీషణు డతనిని వారించెను. యుద్ధము విడిచి,లంకను రక్షింపుమని యితడు చెప్పగా రావణుడు దాని నపహాస్యపూర్వకముగా తిరస్కరించెను. అప్పు డితడు రాముని శరణు జొచ్చెను. రామరావణయుద్ధములో ఇత డెంతో వీరత్వము నెరపెను. ధూమ్రాక్షప్రహస్తాదులతో పోరాడి వారిని యమలోకము పంపెను. తన మంత్రులను లంకలో చారులుగా నిలిపి రామునికి వార్త లందించుచుండెను. ఇంద్రజిత్తు యజ్ఞము పూర్తికాక మునుపే వానిని సంహరింపవలెనని లక్ష్మణున కెరిగించెను. అట్లే చేసి లక్ష్మణు డింద్ర జిత్తును సంహరించెను. రావణవధానంతరము విభీషణు డతని కంత్యేష్టి నిర్వర్తించెను. లక్ష్మణు నంపి రాము డితనిని లంక కభిషిక్తుని చేసెను. రామునితో కలిసి పుష్పకముపై నితడును అయోధ్యకు పోయెను. రాముని కందించిన సహాయమునకై భరతు డితనికి కృతజ్ఞత తెల్పెను.

విభీషణుడు మిక్కిలి ధర్మపరాయణుడు, జితేంద్రియుడు, స్వాధ్యాయ నిరతుడు, మితాహారి. రాక్షసకులమున జన్మించినను ఇతని మన సెప్పుడును అధర్మమువంక కరుగలేదు. కనుకనే బ్రహ్మ యితని కమరత్వ మిచ్చెను. అట్లే సప్తర్షులలో నితనికి స్థానము కల్పించెను. అశ్వమేధసమయమున రాక్షస సహితముగా రావలెనని రాము డితని కాహ్వాన మంపెను. శ్రీరాముని యాజ్ఞ లితడు యథోక్తముగా పాటించుచు వచ్చెను.

## 80. బుధుడు

ఇతడు బృహస్పతి పత్నియైన తారకు చంద్రునివలన కలిగిన పుత్రుడు. ఇతడు చంద్రవంశము నుత్పాదించెను. భవిష్యపురాణములో నితడు చంద్రునికి రోహిణియందు పుట్టినట్లున్నది. బృహస్పతియే యితనికి జాతకర్మాదులు చేసెను. ఇతడు మంచి విద్వాంసుడు. హస్తిశాస్త్రనిపుణుడు. తారామండలమున నితడు శుక్రునికన్న రెండులక్షల యోజనముల యెత్తున నుండును. ఇతడు తరచుగా శుభుడు. సూర్యుని దాటిపోయినప్పు డిత డనావృష్టికారకు డగుచుండును. ఇతడు సరోవరమున మునిగి తపస్సు చేయుచుండెడివాడు. ఇలాసుందరిని మోహించి, యిత డామెయందు పురూరవు డను పుత్రుని గాంచెను. పద్మపురాణము ననుసరించి యితడు సోమవంశమునకు మూలపురుషుడు.

## 81. బ్రహ్మదత్తుడు

ఊర్మిలాగంధర్వి పుత్రి యైన సోమద కితడు చూళిమహర్షికృపవలన జన్మించెను. సోమద యొనర్చిన సేవలకు సంతసించి చూళి యామె కీ మానసపుత్రుని ప్రసాదించెను. ఇతడు కాంపిల్యనగర మేలుచుండెను. వాయువు కోపముచే కుబ్జలైన కుశనాభుని కుమార్తెల నితడు పెండ్లాడెను. ఇతని స్పర్శచే వారి కుబ్జత్వము తొలగిపోయెను. వారు తిరిగి రూపవతులైరి.

## 82. బ్రహ్మ

బ్రహ్మ యీ సృష్టి కాదితత్త్వమని పేర్కొందురు. ఇత డీ సమస్తసృష్టికి ముందు పుట్టెను. మత్స్యపురాణము ననుసరించి భగవంతుడు కమలరూప మగు పృథ్విని నిర్మించెను. ఆ కమలములో బ్రహ్మ జన్మించెను. మహాభారతము ననుసరించి మహావిష్ణువు సృష్టి గురించి చింతించుచుండగా అహంభావ ముత్పన్నమై, దానినుండి బ్రహ్మ యుదయించెను. స్కందపురాణము ననుసరించి ఒక అండము పుట్టి, అందుండి బ్రహ్మ జన్మించెను. భగవంతుడే విశ్వశక్తి, అదే బ్రహ్మ. అతడు మొదట తమోగుణి, పిదప రజోగుణమును, ఆపై సత్త్వగుణమును సాధించి ప్రజోత్పత్తి గావించెను. ఇతడు వేదములకు అధిష్ఠాత. గాయత్రి యితనివలన కలిగెను. ఇతడు యుగళమూర్తిగను, అమూర్తిగను కూడ నుండును. గాయత్రి యితని నెన్నడు విడిచియుండదు. మత్స్యపురాణము

ననుసరించి యితని రాశి వేదరాశి, దానిలో సావిత్రి ప్రకటమాయెను. కనుక ఈతనికి సావిత్రీగమనదోషము కలుగదు.

ఇతనికి మొదట నొకే ముఖముండెను. కాని చతుర్ముఖుడుగా వర్ణింపబడ సాగెను. కారణమేమనగా, ఇతడు తన శరీరమునుండి శతరూప యను దివ్యసుందరిని జనింపజేసెను. ఆమె యితనికి ప్రదక్షిణము చేసినపుడు నల్వంకలను మానసపుత్రులు కూర్చొని యుండిరి. సిగ్గుపడి యిత డామెను తిరిగి చూడజాలక, నల్వంకలకు నాల్గు ముఖములు కల్పించుకొనెను. ఆమె మీదికిపోగా ఇత డైదవముఖ మేర్పరచుకొనెను. శివు డా శిరస్సు ఖండించెను. శతరూపను చూచుటకై చేసిన యీ ప్రయత్నమువలన పుత్రప్రాప్తికై యితడు చేసిన తపస్సు వ్యర్థమాయెను. రుద్రుడు తన కుమార్తె సంధ్యవల్ల నితనిని మోహింపజేసి పుత్రుల యెదుటనే అప్రతిష్ఠపాలు చేసెను. అప్పు డితడు రుద్రుని మోహింప జేయగల సతిని నిర్మించి దక్షయజ్ఞకాలమున శివు నవమానింపజేసెను.

వరము లిచ్చుటలో బ్రహ్మ చాల ఉదారుడు. వాల్మీకములో నిత డిచ్చిన వరము లెన్నో వర్ణింపబడినవి. బ్రహ్మ యిచ్చిన వరబలముననే వాల్మీకి రామాయణ రచనకు పూనుకొనెను. విశ్వామిత్రుడు వేయేండ్లు తపము చేయగా నితడు మొదట రాజర్షి యని పేర్కొని వరమిచ్చెను. రావణ కుంభకర్ణ మేఘనాద మాలి సుమాలి మాల్యవంత సుకేతు తాటకా విరాధ మయ మారీచ నివాతకవచాది రాక్షసుల కెందరికో బ్రహ్మ వరము లిచ్చెను. భగీరథుని పితరులకు స్వర్గప్రాప్తి, కలుగుటకు బ్రహ్మవరము మూలసాధనమైనది. దేవకార్యమున సహాయపడగల డని గుర్తించి బ్రహ్మ హనుమంతునికి తాను వరమిచ్చుటయే కాక, తక్కిన దేవతలతో కూడ చెప్పి వరము లిప్పించెను. ఇతడు కుంభకర్ణునికి దీర్ఘనిద్రను, రావణునికి పరిమితావధ్యత్వమును వరముగా నిచ్చెను. ఇంద్రజిత్తుచే నింద్రుని విడిపించుటకు వాడు కోరిన విధముగా వరము లిచ్చుట కంగీకరించెను. పృథ్విపై నెవరికిని సంపూర్ణామరత్వము సిద్ధింపదని చెప్పగా మేఘనాదుడు హవనకర్మారంభమునకు పూర్వమే శస్త్రధారియై నికుంభిలలో నన్నెదిరించువాని చేత తప్ప తదన్యులచే తక్కినవేళల నాకు చావు కలుగరాదని కోరుకొనగా బ్రహ్మ దానికి అంగీకరించెను. ఇట్లు శాపమువంటి వరమును బ్రహ్మ మేఘనాదుని కిచ్చెను. వానరులైన మైందద్వివిదులు కూడ బ్రహ్మచే వరలాభ మందిరి. బ్రహ్మ వరములతో పాటు శాపములు కూడ

పలికెను. కాని ఆ శాపములు కేవలము రావణకుంభకర్ణుల విషయమునకే పలుకబడినది. వరబలమున రావణుడు గర్వోన్మత్తుడై ప్రజలను పీడించి స్త్రీలను బలాత్కరించు చుండగా శాపమీయవలసివచ్చెను. కుంభకర్ణుని బలాధిక్యము నాపుటకొరకు వానికి ఘోరనిద్ర విధించవలసివచ్చినది. తన వరము లసత్యములు కారాదని బ్రహ్మ తగినంత జాగ్రత్త వహించుచుండెను. యమరావణసంగ్రామమున యముని కాలదండ ప్రయోగము నాపివేసెను. నివాతకవచరావణులకు తెగని పోరాటమైనప్పుడు బ్రహ్మ వారికి మైత్రి చేసెను. విశ్వకర్మనిర్మితమైన విమానము నితడు కుబేరుని కిచ్చెను. ఇంద్రునిచే వైష్ణవయాగ మొనర్పజేసెను. చంద్రుని హింసింప దలచిన రావణున కొక మంత్ర మిచ్చి యూరుకొనజేసెను. దేవకార్యార్థము శ్రీవిష్ణువును మానవావతారధారణకై ప్రార్థించెను. అన్నత్యాగ మొనర్పదలచిన సీతకు దేవేంద్రునిచే హవిష్యాన్నము పంపెను. మహాప్రస్థానానంతరము విష్ణుతేజములో విలీనుడైన రాము నితడు స్వాగతమిచ్చి సత్కరించెను.

## 83. బ్రహ్మహత్య

భైరవుడు బ్రహ్మశిరస్సు ఎగుర గొట్టెను. ఆకార్యసాఫల్యమునకై శివుడు కల్పించిన స్త్రీమూర్తి బ్రహ్మహత్య. భైరవుడు కార్యానంతర మామెను వెనుకకు పంపివేసెను.

## 84. భగీరథుడు

ఇతడు దిలీపమహారాజు కుమారుడు. కపిలమహాముని కోపమునకు గురియై **భస్మావశిష్టులైన** అరువదివేలమంది సగరపుత్రులను ఉద్ధరించుటకై, కపిలుని **ఉపదేశము**పైననే అంశుమంతుడును, దిలీపుడును గంగాప్రాప్తికై తపము చేసిరి. కాని ఆ కార్య మింకను పూర్తికాలేదు. అందుకని భగీరథుడు హిమాలయమున కేగి ఘోరముగా తపస్సుచేసెను. తపము ఫలించి గంగా దర్శన మాయెను. కాని స్వర్గమునుండి భూమిమీదికి పడబోవు తన ధారను ముందుగా ధరించుటకు శంకరుని ప్రార్థింపుమని గంగయే సలహాయిచ్చెను. భగీరథు డట్లు చేసి శంకరుని ప్రసన్నుని చేసికొనెను. అతడు తన జటలలో గంగను ధరించుట కంగీకరించెను. పిదప ఒక్కొక్క జడయు విప్పి గంగకు త్రోవ కల్పించెను. ఇందువల్లనే గంగకు అలకనంద యను పేరు వచ్చెను.

భగీరథుడు గంగను తన వెంట రమ్మని చెప్పి, సగరపుత్రులు భస్మరాశులై పడి యున్నచోటికి తీసికొనిపోయి వారి నుద్ధరించెను. గంగను భూమికి తెచ్చినందున భగీరథుని పేరున గంగ భాగీరథి యనబడెను. ఆ పిదప భగీరథుడు తిరిగి తన రాజ్యమునకు పోయి యథాపూర్వముగా రాజ్యమేలుకొనెను. భగీరథుడు ధర్మాత్ముడు, దాత. అతనికి నాభాగుడు, శ్రుతుడు అను పుత్రులును, హంసి యను పుత్రికయు కల్గిరి. భగీరథుడు తన కుమార్తెను కౌత్సు డను విప్రున కిచ్చి వివాహ మొనర్చెను. గంగాతటమున రేవులు నిర్మించి, అచ్చట వేలకొలది కన్యలను సాలంకృతలుగా బ్రాహ్మణులకు దానమిచ్చెను. యజ్ఞములు నిర్వర్తించి అపారమగు ధనము దక్షిణగా నిచ్చెను. ఇతని యజ్ఞములకు దేవతలు స్వయముగా వచ్చుచుండిరి. మహాభారతములో నితడు వేలకొలది గోదానములు చేసినట్లున్నది. వాల్మీకిరామాయణములో నితని పుత్రుడు కకుత్స్థుడని చెప్పబడినది.

## 85. భరతుడు

ఇతడు కైకేయీదశరథుల పుత్రుడు. విష్ణుని నాల్గవయంశమున జన్మించినవాడు. భరతశత్రుఘ్నులు పరస్పరము విడరానిప్రేమతో మెలగెడివారు. జనకుని తమ్ముడైన కుశధ్వజుని కుమార్తె మాండవి యితని పత్ని. దశరథుడు రాముని రాజ్యాభిషేకము తలపెట్టినప్పుడు భరతు డయోధ్యలో లేడు. అతడప్పుడు శత్రుఘ్నసహితముగా మాతామహుని యింటివద్ద నుండెను. భరతుడు ధర్మాత్ము డనియు అందరితోను కలిసిమెలసి యుండునట్టివాడనియు శ్రీరాముడు కౌసల్యతో చెప్పెను. భరతుడు వల్కలములు ధరించి రామునితో పాటు వనవాస మేగుననియు, తండ్రి యియ్యని రాజ్య మాతడు గ్రహింపడనియు, వసిష్ఠుడు స్పష్టముచేసెను. అయోధ్యకు మరలిరావలసినదని మాత్రమే వసిష్ఠుడు భరతుని వద్దకు దూతలద్వారా సమాచార మంపెను. కాని భరతుని కప్పటికే అశుభసూచనలు కలుగసాగెను. అయోధ్యకు వచ్చి విషయములన్నియు తెలిసిన పిమ్మట అతడు కైకపై కోపించెను. కఠోరముగా నామెను నిందించెను. 'తల్లి రూపమున నున్న నీవు నా శత్రువవు. నీవు నరకమున కేగుదువు. నీవు నా పితృకులమును కళంకిత మొనర్చితివి.' అని అత డామెను గర్హించెను. తనకు రాజ్యేచ్ఛ లేదని అతడు మంత్రులకు స్పష్టము చేసెను. కౌసల్య, గుహుడు, భరద్వాజుడు భరతుని సంశయించిరే కాని అతడు ప్రతిజ్ఞాపూర్వకముగా తన

యాచరణముపై వారికి నమ్మిక కలిగించెను. దశరథుని అంత్యేష్టికర్మ లాచరించిన పిదప వసిష్ఠు డితనిని రాజ్యము గ్రహింపుమని చెప్పెను. కాని అతడు వినయముగనే తన కేదియు వలదని చెప్పెను.

రాముని తిరిగి రప్పించుటకై భరతుడు వసిష్ఠుని తల్లులను కూడ తనతో తోడ్కొని అరణ్యమున కేగెను. రాముని కలిసి ప్రసన్నుడై, అతనిని తిరిగి వచ్చి రాజ్యము చేయుమని కోరెను. కాని యిత డెంత చెప్పినను రాముడు తన నిర్ణయము మార్చుకొనలేదు. భరతునితో నతడు కర్తవ్యపాలనము చేయుమని చెప్పెను. చివరకు భరతు డతని పాదుకలు గ్రహించి వచ్చి అతని పేరుననే రాజ్యము చేయుచు, తాను సంన్యస్తవృత్తి ననుసరించెను. వనవాసము పూర్తికాగానే తిరిగి వచ్చెదనని రాముడు చెప్పగా నితడు అట్లు కానిచో అగ్నిప్రవేశ మొనర్చెదనని పల్కెను. అయోధ్యలో ప్రవేశించుటకు ముందు రాముడు హనుమంతునిచే భరతునకు తన ఆగమనవార్త చెప్పి పంపెను. భరతు డది విని ప్రసన్నుడై రామునికి స్వాగతము నెరపి, అతని రాజ్య మతని కప్పగించెను. లక్ష్మణుడు యువరాజపదవి నంగీకరింపలేదు. కనుక భరతున కది స్వీకరింపక తప్పలేదు. లవణాసురుని వధించుటకు భరతుడే ముం దుత్సహించెను. కాని శత్రుఘ్నుని కా కార్యము లభించెను. తక్షుడు, పుష్కలుడు అను వారిద్దరు భరతునికి పుత్రులు. వారిలో తక్షునికి తక్షశిలయు, పుష్కలునికి పుష్కలావర్తమును రాజధానులుగా రాజ్య మీయబడెను. శ్రీరాముని మహాప్రస్థానమున నితడును అతనివెంట నరిగెను.

## 86. భరద్వాజుడు

ఇతడు వాల్మీకి శిష్యుడు. వాల్మీకినోట 'మానిషాద' అని శ్లోకరూపమున శాపవాక్యము వెడలినప్పు డిత డతనితో కూడ నుండెను. ఇతడు ప్రయాగనివాసి. దండకారణ్యా మేగుచూ రాము డితనిని దర్శించెను. తగిన యాతిథ్య మిచ్చి రామునితో నితడు తన యాశ్రమముననే నిలుపుమని చెప్పెను. కాని అయోధ్యకు సమీపమున నుండుట కిష్టపడక రాము డింకొక సురక్షితస్థానము చూపుడని వేడెను. అప్పు డతడు చిత్రకూటము తగిన స్థలమని చెప్పి పంపెను. శ్రీరాముని తిరిగి వెనుకకు పిలువబోవుచు వనమున కేగునప్పుడు భరతు డితని యాశ్రమమునకు వచ్చెను. ఇతడు భరతునిపై సందేహించెను. కాని

కన్నీటితో ప్రతిజ్ఞ లొనరించుచున్న భరతునిపై నితనికున్న సందేహము తొలగుటయే కాదు, విశ్వాసము జనించెను. సేనాసహితముగా భరతున కితఁ డాతిథ్యమిచ్చెను. చిత్రకూటమునకు మార్గ మెరిగించెను. అయోధ్యకు పోవుచు, రాముడు ముందుగా భరద్వాజాశ్రమములోనే విడిసెను.

భరద్వాజుడు రాము నభినందించి అతనికి వరము లిచ్చెను. అశ్వమేధాంతమున కూడ రాము డితని నింకొకసారి దర్శించెను.

ఇతడు తనకుమార్తె దేవవర్ణినిని పులస్త్యపుత్రుడైన విశ్రవసుని కిచ్చి వివాహము గావించెను.

## 87. భృగువు

భృగు వను పేరు గలవా రెందరో విభిన్నగ్రంథములలో పేర్కొని వర్ణింపబడిరి. ఐతరేయబ్రాహ్మణము ననుసరించి, ప్రజాపతి వీర్యము మూడు భాగములు కాగా, అందుండి ఆదిత్య, భృగు, అంగిరసులు ముప్పురు జనించినట్లు తెలియును. తైత్తిరీయారణ్యకము భృగువును వరుణపుత్రుడుగా పేర్కొనెను. వరుణునిచే బ్రహ్మజ్ఞాన మందిన కారణమున నితనికి వారుణభృగువని కూడ పేరు కల్గెను. గోపథబ్రాహ్మణము ననుసరించి, సృష్టినిర్మాణప్రయత్నమున బ్రహ్మ తపస్సు చేయుచుండగా, అతని చెమట భూమిపై పడెను. అందులో నతనికి తన రూపము కనిపించెను. అచటనే వీర్యస్ఖలన మయ్యెను. ఆ వీర్యము రెండుభాగము లయ్యెను. ఒక భాగము శాంతము, పేయము, స్వాదువుగను రెండవది క్షారము, అపేయము, అస్వాదువుగను మారెను. పేయభాగమునుండి భృగువును, అపేయభాగమునుండి అంగిరసుడును జన్మించిరి. ఇట్లు బ్రహ్మమానసపుత్రులైన వీరు స్వాయంభువమనువున కల్లురును, శివునకు షడ్డకులు నైరి. దక్షయజ్ఞమున శివు డవమానింపబడెను. అప్పుడు శివుని నిందించుటలో భృగువును పాల్గొనెను. దక్షయజ్ఞవిధ్వంసవేళ వీరభద్రు డితని గడ్డము దహించివేసెను. భాగవతములో, ఇతడు శంకరుని స్తుతించినట్లును, అతడు సంతోషించి, యితనికి మేకగడ్డము కల్పించినట్లును చెప్పబడినది. దేవదానవయుద్ధములో దానవు లోడిపోవుచుండగా చూచి శుక్రాచార్యుడు సంజీవనికై ప్రయత్నింప నరిగెను. భృగువును తపస్సు చేయదొడగెను. భృగుపత్ని దేవతల నెదిరించెను. స్త్రీయని కూడ విచారింపక విష్ణు వామెను చక్రప్రయోగము

చేసి వధించెను. సంజీవనీమంత్రము గ్రహించి వచ్చి భృగు వామెను తిరిగి జీవింపజేసెను. విష్ణువు నతడు నీకు గర్భవాసదుఃఖము కలుగుననియు, భూమిపై జన్మింపనగు ననియు శపించెను. ఈ శాపకథ దేవీభాగవతమున నున్నది. విశ్వామిత్రుడు రామునితో విశేషపరిస్థితులలో స్త్రీవధ దోషము కాదని చెప్పి తాటకను వధింపుమనుచు మీది కథ నతనికి వినిపించెను. పద్మపురాణములోని భృగుఖండమున విష్ణునికి భృగువిచ్చిన శాపమును గూర్చి వేరొక కథ చెప్పబడెను.

విష్ణువు భృగుని యజ్ఞము రక్షింతునని మాట యిచ్చియు, ఇంద్రుని పిలు పందుకొని మాట తప్పి యింద్రునివద్ద కరిగెను. విష్ణువు లేకపోవుటతో దైత్యులు చెలరేగి భృగుని యజ్ఞమును నాశముచేసిరి. అందుపై భృగువు 'మర్త్యలోకమున నీవు పదిమారులు జన్మించెద' వని విష్ణుని శపించెను. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో నెవదు శ్రేష్ఠుడను విషయమును పరీక్షించు భార మొకప్పుదు భృగువుపై బడెను. అత డా సందర్భమున నిద్రించుచున్న విష్ణుని గుండెపై తన్నెను. కాని విష్ణువు కోపించలేదు. అది చూచి భృగు వతనిని శ్రేష్ఠుదుగా నిర్ణయించెను. భృగువు తాపునకు చిహ్నముగా విష్ణువు తన వక్షమున శ్రీవత్సలాంఛనము వహించెను.

భృగునికి దివ్య, పులోమి అను భార్య లిద్ద రుండిరి. దివ్యవలన శుక్రుడాదిగా పండ్రెండుగురు పుత్రు లుదయించిరి. పులోమికి చ్యవనుదు పుట్టెను. భృగుని పేరున భృగుస్మృతి, భృగుగీత, భృగుసూత్రము మున్నగు గ్రంథములు లభించుచున్నవి. ఇతడు వాస్తుకళపై గూడ నొక గ్రంథము రచించెను.

ఇక్ష్వాకుకులమునకు వసిష్ఠుదు పురోహితుడు. కాని నిమిచక్రవర్తి అత్రి అంగీరసులతో పాటుగా భృగువును కూడ పిల్చి ఋత్విక్కుగా నియమించెను. వాల్మీకిరామాయణములో ఉత్తరకాండము ననుసరించి, వసిష్ఠుని శాపముచే నిమి విదేహు డైనప్పుదు భృగు వతనికి చైతన్యము కల్పించుటకు అభివచనమిచ్చెను.

## 88. మతంగుదు

ఋష్యమూకపర్వతము వద్ద పంపానదికి పశ్చిమతటమున మతంగవన ముండెను. మతంగముని యిచ్చిన శాపమువలన వాలి ఆ ప్రాంతమునకు పోజాలకుండెను. అందుచే సుగ్రీవుని కచ్చట నిశ్చింతగా నిలువ వీలాయెను.

మతంగమునిశిష్యు లొకసారి సమిధల కట్ట మోసుకొని వచ్చుచుండగా వారి శరీరములనుండి జారిన చెమటబిందువు లచ్చట పూలుగా మారెను. అవి ఎప్పుడును వాడిపోవు. రాముని కాతిథ్యమిచ్చిన శబరి యిదే చోటున నుండెను. మతంగు డామె గురువు.

బ్రాహ్మణత్వము జన్మపైననే నిర్భర మను విషయమును విశదీకరించుచు మహాభారతమున అనుశాసనపర్వములో మతంగుని కథ వర్ణింపబడినది. తండ్రి యజ్ఞమునకై సమిధలు, దర్భలు కోసి తెచ్చుటకు పోవుచు మతంగుడు తన బండికి ఒక ఆడుగాడిదను • దాని పిల్లను చేర్చి కట్టెను. పిల్ల బండిని సమముగా లాగలేకుండెను. అందుచే మతంగుడు దాని ముక్కుపై కొరడా ముల్లు గుచ్చెను. అది చూచి తల్లి బిడ్డ నోదార్చుచు చెప్పిన దాని అర్థము మతంగునకు బోధపడెను. అతని తల్లి బ్రాహ్మణి, కాని తండ్రి మంగలి, అందుచే నతని బ్రాహ్మణ్యము నష్టమయ్యెను. ఈ విషయము తెలియగనే అతడు యజ్ఞకార్యమునకు స్వస్తి చెప్పి తపస్సు చేయ నేగెను. ఇంద్రు డతని తపస్సునకు సంతసించెను.

కాని చండాలయోనిజన్మునకు బ్రాహ్మణత్వ మసంభవ మని చెప్పెను. అయినను మతంగుడు ఒంటికాలిపై నిలిచి నూరేండ్లు తపస్సు చేసెను. అప్రాప్యమునకై యీ ప్రయత్న మసంగతమని యింద్రుడు మరల చెప్పెను. బ్రాహ్మణ్య మంత సులభము కాదనియు, అనేకజన్మములకు పిమ్మట లభించుననియు తెలిసికూడ ఇతడు తిరిగి వేయియేండ్లు తపస్సు చేసెను. అప్పు డింద్రు డతనికి బ్రాహ్మణత్వము విడిచి కామగమన, కామరూప, గగన సంచార శాశ్వతకీర్త్యాదివరము లిచ్చెను. మతంగుడు శరీరము విడిచి వరముచే ప్రాప్తించిన స్థాన మందుకొనెను.

## 89. మదయంతి

ఈమె సౌదాసుని (కల్మాషపాదుని) భార్య. వసిష్ఠుడు సౌదాసుని శపింపగా నతడు తిరిగి వసిష్ఠుని శపింపదలచెను. అప్పు డీమె భర్తకు నచ్చజెప్పి ఆ అనుచితమును మాన్పించెను. ఈమెకు అశ్మకు డను పుత్రు డుండెను.

## 90. మధుచ్ఛందుడు

ఇతడు విశ్వామిత్రుని ఏబదియొకటవ పుత్రుడు. మొదటి ఏబదిమంది పుత్రులును శునఃశేపుని తమకు జ్యేష్ఠభ్రాతగా స్వీకరింపలేదు. అట్లు స్వీకరించిన వారిలో నితడు ప్రముఖుడు. విశ్వామిత్రు డిందుకు సంతోషించి యితని కుత్తమాశీర్వాదము లిచ్చెను. ఋగ్వేదప్రథమమండలములోని మొదటి పదిసూక్తములు రచించిన కీర్తి యీ మధుచ్ఛందున కబ్బినది. ఇంతడు శర్యాతికి పురోహితుడుగా నుండెను.

## 91. మధుదైత్యుడు

ఇతడు కృతయుగమున దితికి జన్మించిన పుత్రుడు. ఇతడు రావణుని పినతల్లి కుమార్తె కుంభీనసిని అపహరించెను. అందుపై నితనిని శిక్షించుటకు రావణుడు సేనాసహితుడై వచ్చెను. కాని కుంభీనసి యితనినే తాను పతిగా వరించితి నని చెప్పి రావణు నితనికి సహాయపడుమని కోరెను. ఇతడు జ్ఞాని, బుద్ధిమంతుడు, దేవతలకు మిత్రుడు. శంకరు డితనికి శూల మిచ్చి, దేవబ్రాహ్మణులకు వైర మెంచకుండ నున్నంతకాలమువర కా శూల మతనివద్ద నుండునని చెప్పెను. ఇతడు దానిని తన వంశమువారివద్ద శాశ్వతముగా నుండు నట్లు వర మిమ్మనెను. కాని శంకరు డందుల కంగీకరింపలేదు.

అయిననూ, ఆ శూల మతని కుమారుని వద్ద నుండగలదనియు, అది అతని చేతిలో నున్నంతవరకు అత డవధ్యు డగుననియు శంకరు డనుగ్రహించెను. అట్లే యితని పుత్రుడైన లవణాసురున కా శూలము లభించెను.

## 92. మయుడు

దనుపుత్రులైన దానవులలో నిత డొకడు. రామాయణములో నితడు దితిపుత్రుడుగా పేర్కొనబడెను. కాని అది సరికాదు. ఇతని సోదరుడు నముచి. ఇతని భార్యాపుత్రులను గురించి వేర్వేరుగ్రంథములలో వేర్వేరు రీతులుగా చెప్పబడెను. అప్సరస యైన హేమ యితని పత్ని. ఆమెయం దితనికి మండోదరి యను పుత్రిక కలిగెను. మండోదరితో పాటుగా మయావి, దుందుభి అను వారును కలిగినట్లు చెప్పబడెను. బ్రహ్మాండపురాణము ననుసరించి, యితనికి రంభవలన ఆర్గురు సంతానము లభించినట్లు తెలియుచున్నది.

మత్స్యపురాణములో మండోదరితో పాటు, కుహూ, ఉపదానవి యను పుత్రిక లిద్దరు పుట్టినట్లున్నది. ఇతడు ఋక్షబిలమున స్వర్ణగృహము నిర్మించిన మాయాశిల్పి. బ్రహ్మవరముచే ఉశనసుని ధనమంతయు నితనికి లభించెను. వాల్మీకిరామాయణములో హేమసంబంధము కారణముగా ఇంద్రు డితనిని వధించినట్లు చెప్పబడినది. కాని బ్రహ్మపురాణము ననుసరించి, నముచి వధింపబడిన పిదప నితని కింద్రునితో వైమనస్యము తొలగి మైత్రి యేర్పడినట్లు తెలియుచున్నది. ఆ మైత్రివలన వీ రొకరి మాయ లింకొకరికి తెలిపినట్లున్నది. వాస్తు, శిల్ప, జ్యోతిషశాస్త్రగ్రంథములు కొన్ని యితని రచనలుగా నున్నవి.

## 93. మంథర

ఈమె కైకేయి పుట్టినింటినుండి వచ్చిన దాసి. ఈమె పూర్వజన్మమున దుందుభి యను గంధర్వి. కృష్ణావతారమున నీమె కుబ్జగా నవతరించెను. ఈమెకు గూని. కైకకు రామునియం దెంత ప్రేమయున్నను ఈమె మనసు విరచి, పూర్వము దశరథు డామె కిచ్చిన వరము లడిగి పుచ్చుకొని రామరాజ్యాభిషేకమును మాన్పింప యత్నించినది. భరతుని రాజ్యాభిషేకము, రాముని పదునాల్గేండ్ల వనవాసము, వరప్రాపశ్యకములని ఈమె కైకకు చెప్పి యొప్పించినది. భరతశత్రుఘ్నులు వచ్చి మాటాడు నవసరమున నీమె చక్కగా నలంకరించుకొని వచ్చి నిల్చినది. ఈమెను చూడగనే శత్రుఘ్నుడు మండిపడి, తగినట్లు శిక్షింపబోయెను. కాని భరతు డడ్డుపడెను. భోరున విలపించుచు నీమె కైకేయి వద్ద కేగినది. కైక ఈమె నెట్లో ఓదార్చెను.

## 94. మండోదరి

ఈమె మయాసురుని పుత్రిక. రావణునికి భయపడి మయు డీమెను వానికిచ్చి, వానితో మైత్రి నెరపెను (వాల్మీకిరామాయణము, యుద్ధ. 7.7) సీతాన్వేషణమున లంకలో తిరుగుచున్న హనుమంతునికి అచ్చటి రాజభవనములో సాలంకృతయు, గౌరవర్ణయు, సుందరియు నగు మండోదరి కనిపించెను (సుందర. 10/50-52) రంభవలననో, హేమవలననో మయునికి ప్రాప్తించిన పుత్రికయే మండోదరి యని స్కంద బ్రహ్మాండ పురాణములు చెప్పుచున్నవి. వేరొకమతమున సీత యీమె కుమార్తె. మేఘనాదు డీమె పుత్రుడు.

పంచమహాపతివ్రతలలో మండోదరి పేరు వినిపించును - 'అహల్యా ద్రౌపదీ సీతా తారా మండోదరీ తథా'.

## 95. మరుత్తు

సంవర్తశిష్యుడైన మరుత్తు రాజర్షిగా పేర్కొనబడెను. ఐతరేయ బ్రాహ్మణ మితనిని కామప్రవంశజుడని చెప్పుచున్నది. బృహస్పతి యితని పురోహితుడు. ఇతని కెప్పుడును ఇంద్రునితో ప్రతిస్పర్ధ యుండెను. ఇంద్రు డితనిని వేరు విధమున లొంగదీసికొనలేక బృహస్పతిచే నితని పౌరోహిత్యము మాన్పించెను. నారదుని సలహాపై నితడు సంవర్తుని పద్ద కేగి, తా నాచరించు యజ్ఞమునకు ఋత్విక్కుగా నుండవలెనని కోరెను. సంవర్తు డంగీకరించెను. ఇంద్రు డా యజ్ఞమునకు విఘ్న మాపాదింపదలచెను. కాని సంవర్తుని శక్తివలన అతని ప్రయత్నములు సాగలేదు. ఇత డింద్రబృహస్పత్యాదులను సమ్మానపూర్వకముగా యజ్ఞభాగము లందుకొనుట కామంత్రించి హవన మాచరించిన సోమరసమును స్వీకరింపవలెనని ప్రార్థించెను. ఆమీద నితని కింద్రునితో మైత్రి కల్గినది.

మరుత్తు చేయుచున్న యజ్ఞమునకు రావణుడు కూడ విఘ్న మొనర్ప వచ్చెను. అప్పు డితడు రావణునితో యుద్ధమున కుద్యుక్తు డాయెను. కాని యజ్ఞదీక్షితునకు యుద్ధము పనికిరాదని చెప్పి సంవర్తు డితని నా ప్రయత్నమునుండి మరల్చెను. రావణు డితనిని జయించినట్లు చాటుకొని వెడలిపోయెను. మరుత్తుని యజ్ఞ మభూతపూర్వముగా జరిగెను. మరుద్గణము లందరును ప్రసన్నులైరి. బ్రాహ్మణులకు గంధర్వులకు విశేషముగా ధనకనకదానములు లభించెను. గురువు నాజ్ఞపై నితడు యజ్ఞము ముగించి తిరిగి రాజ్యము చేయదొడగెను. దము డితని యేకైక పుత్రుడు.

## 96. మహాపార్శ్వుడు

ఇతడు పుష్పోత్కటయందు విశ్రవసునికి కలిగిన పుత్రుడు. ఇతనికి 'మత్తు' డని మారు పేరు. ఇతడు రావణుని మంత్రులలో నొకడు. హనుమంతు డితని యింటిని కాల్చివేసెను. రామునితో యుద్ధము చేయుచు నితడు వెనుకకు పరుగెత్తెను. కాని వానరుల నెందరినో సంహరించెను. గవాక్ష జాంబవంతులను గాయపరచెను. ఇత డంగదుని చేతిలో మరణించెను.

## 97. మాతలి

ఇత డింద్రుని రథసారథి. ఇతని భార్యపేరు సుధర్మ. ఆమెయం దితనికి ఇరువురు పుత్రు లుదయించిరి. రామరావణయుద్ధములో, ఇంద్రుడు పంపగా నితడు రథము, ధనుర్బాణములు, కవచము మున్నగునవి తీసికొని రామునివద్దకు వచ్చెను. నేర్పుగా రథము నడపి యితడు రావణవధయందు రాముని కెంతో సహాయపడెను. రావణుని వధించుటకు బ్రహ్మాస్త్రము ప్రయోగింపదగునని రాముని కితడు జ్ఞప్తిచేసెను. రావణవధానంతరము రాము డితనిని సత్కరించెను. ఇంద్రుని యాజ్ఞపై అర్జునుని స్వర్గమునకు తోడ్కొని పోవుటకు కూడ మాతలియే రథము గొనివచ్చెను.

## 98. మాంధాత

ఇతడు యువనాశ్వుని పుత్రుడు. రాజ్యమందు కరు వేర్పడగా నితడు ఘోరముగా తపస్సుచేసి, పద్మ మను ఏకాదశీవ్రత మాచరించి, కరువు నివారించెను. రాముడు వాలితో నిత డొకసారి పాపకర్ముడై శ్రమణుని తీవ్రముగ శిక్షించినట్లు చెప్పెను. ఇతనికి నూరుమంది భార్యలు. కాని సంతతి కలుగలేదు. అందుకు విచారించి యితడు ఋషులను పిల్చి యజ్ఞ మొనర్చెను. ఋషులు రాజపత్నులకు పృషదాజ్యము తయారుజేసిరి. కాని దాహము వేసి అత డప్పుడే దానిని త్రాగివేసెను. తత్ఫలితముగా అతనికి గర్భము కల్గెను. గర్భము పూర్తిగా పెరిగినపిదప ఋషు లతని ఉదరము చీల్చి అందుండి బాలకుని బయటకు తీసిరి. ఇంద్రుడు తన చిటికెనవ్రేలు బాలకునిచే చప్పరింప జేసెను. ఇట్లు పోషింపబడిన ఆ బాలకుడు పెరిగి బలవంతుడై విద్యాబుద్ధులు గడించెను. తపస్సు చేసి శస్త్రాస్త్రములు సంపాదించెను. పృథ్వి నంతటిని జయించి రాజసూయము, అశ్వమేధము మున్నగు యజ్ఞము లాచరించెను. పరాక్రమాభిమాని యగుటచే నతడు ఇంద్రుని అర్ధాసన మభిలషించెను. ఇంద్రు డితనిని యుద్ధమునకు పిల్చి ముందుగా లవణాసురునితో యుద్ధము చేయుమనెను. ఆ యుద్ధములో నితడు వధింపబడెను. ఇతడు క్షత్రియు డయ్యును బ్రాహ్మణు డాయెను. రావణుని జయించెను. మాంధాత భార్య శశిబిందుని కుమార్తె యగు బిందుమతి. ఆమెయం దితనికి ముచుకుందుడు, అంబరీషుడు, పురుకుత్సుడు అను ముగ్గురు పుత్రులు కలిగిరి. మాంధాతకు

ఏబదిమంది కుమార్తెలు. ఒకసారి యొక ఋషి యితని కుమార్తెలను పెండ్లాడగోరెను. కాని ఆ ఋషి చాల ముసలివాడు. అందుచే కుమార్తెల నిచ్చుట కితడు సాహసించలేదు. అట్లున్న ఆ ఋషి నే కన్యయు వరింపదని అతడు తలంచెను. అట్లు తలచి అత డతనిని తన కుమార్తెలున్న అంతఃపురమునకు తోడ్కొని పోయెను. వారిలో నెవరు వరించినను ఆమె నిచ్చి అతనితో వివాహము చేయుదునని చెప్పెను. ఋషికి రాజు మనస్సు తెలిసిపోయెను. వెంటనే అతడు సుందరమైన రూపము ధరించెను. రాజకుమార్తె లందరును అతనిని వరించిరి. అతడు సంతసించి వారందరినీ ఆ ఋషి కిచ్చి వివాహము జరిపెను. ఈ కథ పద్మ, విష్ణు, గరుడపురాణములలో వర్ణింపబడినది.

## 99. మారీచసుబాహులు

వీరు తాటకకు సుందునివలన జన్మించిన పుత్రులు. విశ్వామిత్రుడు వీరిద్దరిని మంచి పరాక్రమవంతు లనియు, నేర్పరు లనియు చెప్పెను. మారీచుడు మొదట యక్షుడు కాని అగస్త్యుని శాపముచే రాక్షసు డయ్యెను. శ్రీరాముని బలము గ్రహించిన వాడగుటచే మారీచుడు రావణునితో సీతాపహరణప్రయత్నము మానుకొను మని యెంతగానో బోధించెను. కాని రావణు డతనిని చంపివేయుదు నని బెదిరించుటచే బంగారులేడిగా మారి, సీతాపహరణోద్యమమున రావణునకు సహాయపడెను. ఇతడు పదివేల యేనుగుల బలమున్నవాడు. సుమాలి రాక్షసుని మంత్రులు నల్వురిలోను మారీచు డొకడు. మారీచసుబాహు లిద్దరును విశ్వామిత్రుని యజ్ఞమునకు తరచుగా విఘ్నము కలిగించుచుండిరి. రాముడు సుబాహుని ఒక బాణముతో చంపెను. వేరొక బాణముతో మారీచుని సముద్రములో పడున ట్లెగురగొట్టెను. అంతతో నితడు లంక చేరుకొని రావణుని యాశ్రమము చేరెను. స్వర్ణమృగరూపమున నున్న మారీచుని రాముడే సంహరించెను. బ్రహ్మ యితని కవధ్యత్వము వరముగా నిచ్చెను.

## 100. మాలి

సుకేశునికి దేవవతి యందు పుట్టిన మూడవపుత్రుడు మాలి. తన సోదరులైన సుమాలి, మాల్యవంతులతో కలిసి యితడు ఘోరముగా తపస్సుచేసి బ్రహ్మను మెప్పించెను. ఇతనికి బ్రహ్మ చిరంజీవిత్వము అజేయత్వము వరములుగా

నిచ్చెను. ఇతడు సోదరసహితుడై దేవతలను బాధింపదొడగెను. మహావిష్ణు వితనిని యుద్ధములో సంహరించెను. వసుద యను గంధర్వి యితని భార్య. అనల, అనిల, హర, సంపాతులనువా రితని పుత్రులు. విభీషణు డితని కమాత్యపదవి నిచ్చెను.

## 101 మాల్యవంతుడు

ఇతడు సుకేశదేవవతుల జ్యేష్ఠపుత్రుడు. తండ్రి తపోబలమున నైశ్వర్యవంతు డయ్యెనని విని యితడు కూడ తన తమ్ములిద్దరితో పాటుగా తపస్సు చేయదొడగెను. బ్రహ్మ ప్రసన్నుడై వరము లిచ్చెను. అప్పు డితడు సపరివారముగా లంకానగరములో నివసించుచు దేవతల బాధింపసాగెను. శ్రీవిష్ణు వితనిని వధించుటకు ప్రతిజ్ఞ చేసెను. అట్లే మాలిని వధించెను. అప్పు డితడు తమ్ముడైన సుమాలిని తోడ్కొని పాతాళమున కేగి నివసింపదొడగెను. తిరిగి యొకప్పుడు మర్త్యలోకమునకు వచ్చి, వైశ్రవణుని ఐశ్వర్యము చూచి ఆశ్చర్యచకితు డయ్యెను. ఇతడు తన కుమార్తె కైకసిని విశ్రవసుని కిచ్చి వివాహము చేసెను. ఆమెకు రావణాదులు జన్మించిరి. నర్మదాగంధర్వి జ్యేష్ఠపుత్రియైన సుందరి మాల్యవంతుని భార్య. ఆమెయం దితనికి ఏడుగురు పుత్రులును, ఒక పుత్రికయు కలిగిరి. రావణు డొనర్చిన సీతాపహరణ మితనికి నచ్చలేదు. సీతను రామునికి తిరిగి యిచ్చివేయు మనియు, అధర్మము విడిచిపెట్టు మనియు నితడు రావణునకు నీతి చెప్పెను.

## 102. మిత్రుడు

వరుణపదముతో కలిసి వినవచ్చు దేవత మిత్రుడు. ఇతడు ద్వాదశాదిత్యులలో నొకడు. రేవతియం దితనికి ఉత్సర్గ, అరిష్ట, పిప్పలు లను ముగ్గురు పుత్రులు కలిగిరి. వరుణపద మంది యితడు ఊర్వశిని వలచెను. ఆమె అంగీకరించెను. కాని ఈ లోపున వరుణు డామెను చూచెను. వెంటనే కామోద్దీపితుడై అత డామెను కోరెను. అప్పు డామె తాను మిత్రునికి ముందే మాటయిచ్చితి ననియు ఆ కారణమున దేహము తన స్వాధీనములో లేదనియు అందువలన కేవలము ప్రేమమాత్ర మియ్యనగుననియు చెప్పెను. కాని వరుణుడు కామ మాపుకొనలేక ఆమె నుద్దేశించి తన వీర్యము నొక కుంభములో విడిచెను. మిత్రుని కీ విషయమంతయు తెలియగనే అత

దూర్వశిని శపించి, తన వీర్యమును కూడ అదే కుంభమున విడిచెను. ఆ కుంభమునుండి అగస్త్యవసిష్ఠు లుదయించిరి. అగస్త్యుడు మిత్రునితో నేను నీ కొక్కనికే పుత్రుడను కాదని చెప్పి అతనిని త్యజించెను.

## 103. మేఘనాదుడు (ఇంద్రజిత్తు)

ఇతడు మండోదరీరావణుల ప్రథమపుత్రుడు. పుట్టినంతనే మేఘము వలె గర్జించినందున మేఘనాదు డనబడెను. యువరా జగుటతోడనే యితడు శుక్రాచార్యుని పిలిచి అశ్వమేధము, అగ్నిష్టోమము, బహుసువర్ణకము, రాజసూయము, గోమేధము, వైష్ణవము, మాహేశ్వరము నను ఏడు యజ్ఞములు చేసెను. ఈ యజ్ఞము లన్నియు నికుంభిలలో జరిగెను. శివు డితనికి దివ్యరథము, తామసీమాయ, ధనుర్బాణములు, శస్త్రములు మున్నగునవి యిచ్చెను. బ్రహ్మ యితనికి పరిమితావధ్యతను వరముగా నిచ్చెను. ఇతడు మహాపరాక్రమవంతుడు. ఇంద్రుని జయించి కట్టి తెచ్చి విడిపించవచ్చిన బ్రహ్మ నితడు, అమరత్వము వరముగా వేడెను. బ్రహ్మ మర్త్యలోకమున నమరత్వము సిద్ధింపదని వేరేదైన కోరుకొను మనెను. ఇంద్రుని జయించినందున ఇంద్రజిత్తు అను బిరుద నాఘ మిచ్చెను. మేఘనాదుని భార్య సులోచన. నికుంభిలాహోమము ముగించినచో నతడు సర్వనాశనము చేయగలడని విభీషణుడు భయపడి రాముని కెరిగించెను. అప్పుడు లక్ష్మణుని పంపి హోమము పూర్తి కాకమునుపే యుద్ధములో నతనిని సంహరింపజేసెను. అప్పు డితని భార్య సహగమనము చేసెను.

మేఘనాదుడు దుర్జేయుడైన వీరుడు. రామరావణయుద్ధములో నితడు చూపిన పరాక్రమము సాటిలేనిది. అసంఖ్యాకవానరవీరులను హతమార్చి యితడు రామ రామ అని ఆక్రోశించుచున్న మాయసీతను చూపి హనుమంతుని భయవిహ్వలు నొనర్చెను. అంతటితో ఆగక ఇత డా మాయసీతను చంపుదునని బెదిరించి, చివరకు వానరులు చూచుచుండగనే ఆమె కంఠ ముత్తరించెను. శత్రువులను హతోత్సాహులుగా చేయుటకు తగిన పరాక్రమమునకు తోడుగా యితనికి వరలబ్ధములైన శస్త్రాస్త్రములు మాయాప్రయోగసామర్థ్యముకూడ నున్నవి. పరబలమున హనుమంతు డొక్కడు తప్ప తక్కిన వానరసేన యంతయు నితని బ్రహ్మాస్త్రముచే బంధింపబడెను. రామలక్ష్మణుల నితడు బాణాసారముచే మూర్ఛిల్లజేసెను. వారిని నాగపాశముచే బంధించెను. మాయచే నదృశ్యుడై పరబలముచే నితడు విజయము సాధించుచుండెను.

## 104. వైరందుడు

ఇతడు వానరయూథపుడైన సుషేణుని కుమారుడు. ద్వివిదునికి జ్యేష్ఠభ్రాత. అరువదియోజనములు దాటగల శక్తి సంపన్నుడు. వజ్రముష్టి, యూపాక్షులను వధించి యితడు యుద్ధములో రామునికి సహాయపడెను. సీతాన్వేషణమునకై సుగ్రీవు డంపిన వానరులలో నితడును కలడు. బ్రహ్మచే పరిమితామరత్వము వరముగా బడసిన యీ కపియోధుని రాముడు కలియుగాంతమువరకు జీవించియుండునట్లు ఆశీర్వదించెను.

## 105. యదువు

యయాతికి దేవయానియందు కల్గిన పుత్రుడు యదువు. ఇత డతని సంతానములో జ్యేష్ఠుడు. శర్మిష్ఠాపుత్రుడై పురుడు యయాతికి మిక్కిలి ప్రీతి పాత్రుడు. ఈ విషయము యయాతికి కంటగింపుగా నుండెను. పురుని పట్ల అసూయతో పాటు తండ్రిపట్ల ద్వేషము కూడ పెంచుకొనెను. యయాతికి శుక్రుని శాపముచే ముసలితనము వచ్చెను. దానిని కొంతకాలము తన పుత్రులు గ్రహించి తనకు యౌవన మీయదగునని యయాతి కోరెను. అతడు యదువు నడుగగా నతడు తిరస్కరించెను. ఈ తిరస్కారకారణము వేర్వేరుగా వర్ణింపబడెను. యయాతి యదువు నంతగా ప్రేమింపలేదను మాట అటుంచి అత డొక బ్రాహ్మణుని కిచ్చిన వాగ్దానమునకు కూడ ముసలితనము బాధకమగునని తలచి తండ్రి కోర్కె నతడు తిరస్కరించెను. అంతేగాక, తన యౌవనము గ్రహించి తండ్రి తిరిగి తన తల్లితో కలిసినప్పు డది తనకు మాతృసమాగమ దోష మగు నని అతడు భయపడెను. కారణ మేదియైనను యదువు తండ్రి కోర్కె నిరాకరించెను. యయాతి కుపితుడై అతని నిట్లు శపించెను- 'నీవు ఘోరరాక్షసుడ వగుదువు. నీకు యాతుధానులే పుట్టెదరు. సోమకులోత్పన్నుల వంశమున నీ సంతతి చేరదు. నీవంశముకూడ నీవలెనే ఉద్దండాచరణము పొందును.' జ్యేష్ఠు డగుటచే యయాతి వెనుక యదువే రాజ్యాధికారి కావలసియుండెను. కాని యయాతి యీతనికి రాజ్య మియ్యలేదు. యదువు రాజ్యమును, సార్వభౌమపదవీలోభమును విడిచి తండ్రి యిచ్చిన తగుమాత్రపు రాజ్యభాగముతోనే తృప్తిపడెను. యదువువలన యాదవు లుద్భవించిరి. వారు మౌసలయుద్ధములో గతించిరి.

## 106. యముడు

ఋగ్వేదములో నితని తండ్రి వివస్వతుడనియు, తల్లి సరణ్యువనియు చెప్పబడెను. కాని హరివంశ, మార్కండేయ, పద్మ, విష్ణు, మత్స్య, వరాహాది పురాణములలో నితని తల్లి పేరు సంజ్ఞ యని చెప్పబడెను. సంజ్ఞ సూర్యతేజస్సు భరింపలేకుండెను. చూడలేక కనులు మూసికొనుచుండెడిది. అందుచే సూర్యు డామెను నీవు ప్రజాసంహారకుడగు పుత్రుని గాంతువని శపించెను. ఆ పుత్రుడే యముడు. యమి యితని కవలసోదరి. ఋగ్వేదములో వీరి పరస్పర సంభోగసంవాదము వర్ణింపబడెను. సవతితల్లియైన ఛాయ యముని తన్నెను. నీ కుడిభాగము తనంతటఁ తానే తెగి పడిపోవునని యము డామెను శపించెను. సూర్యుడు శాపశాంతి వచించెను. తపస్సు చేసి బ్రహ్మచే నితడు పితృలోకమున కాధిపత్యము, విశ్వమందలి పాపపుణ్యములు గమనించునట్టి అధికారమును వరములుగా పొందెను. మాండవ్యమునికి అపరాధము లేకయే, శూలముపై నిల్పు శిక్ష వేయగా, మరణించుటకు పూర్వ మా ముని శూద్రుడవై పుట్టెద వని యముని శపించెను. కుంతి కితనివలన యుధిష్ఠిరుడు జన్మించెను. సరోవరమున యక్షరూపధారిగా ధర్ము డడిగిన ప్రశ్నలకు సదుత్తరము లిచ్చెను. తత్ఫలితముగా అక్కడ చచ్చిపడి యున్న పాండవు లందరును తిరిగి జీవించిరి. యముడు ధర్మశాస్త్రకారుడు.

యముడు దక్షిణదిశాధిపతి. ఇతడు కుంభకర్ణునిచే పరాజితుడయ్యెను. రావణుని భయమున నితడు కాకిగా మారి పారిపోయెను. ఆ పిదప కాకికి, రోగములు లేకుండునట్లును, స్వాభావికమృత్యువు లేనట్లును, లోకులు వధింపకున్నంత వరకు జీవించియుండునట్లును వరమిచ్చెను. యమరావణయుద్ధము సప్తరాత్రములు జరిగెను. తుదకు యముడు కాలదండము ప్రయోగింప నెంచెను. కాని బ్రహ్మ వచ్చి రావణునికి తానిచ్చిన వరమునకు విరుద్ధమగునని చెప్పి అతని ప్రయత్నము నాపివేసెను. ఇతడు హనుమంతునికి రోగముక్తుడై యుండునట్లు కాలదండమునకు కూడ అవధ్యు డగునట్లును వరమిచ్చెను.

## 107. యయాతి

ఇతడు ఇక్ష్వాకువంశమున నహుషుని పుత్రుడు. దైత్యగురువైన శుక్రాచార్యుని కుమార్తె దేవయానియు, దైత్యరాజైన వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠయు నితని భార్యలు. శర్మిష్ఠ దేవయానికి దాసిగా, వివాహితయై యయాతివద్దకు వచ్చెను.

ఆమెతో శయన మంగీకరింపవలదని శుక్రుడు శాసించెను. కాని యితని కామె యందు ముగ్గురు పిల్లలు పుట్టిరి. దేవయాని కిద్దరే పిల్లలు కల్గిరి. అందుచే నామె కోపించి తండ్రితో ఫిర్యాదు చేసెను. శుక్రు డతనిని ముసలివా డగునట్లు శపించెను. కాని అతని కుమారులలో నెవరైన ఆ ముసలితనమును గ్రహించినచో నతనికి తిరిగి యౌవనము కల్గునని శాపశమనము వచించెను. యయాతి తన పుత్రులను పిల్చి, తన ముసలితనమును గ్రహించి వారి యౌవనము తన కిమ్మనెను. పురు డందు కంగీకరింపగా మిగిలిన పుత్రులు కాదనిరి. వారల కితడు వేర్వేరు శాపము లిచ్చెను. పురునకు రాజ్యమిచ్చెను. ఇతడు విషయాసక్తుడు. వేలకొలది సంవత్సరములు భోగించియు నితనికి తృప్తి కలుగలేదు, కాని ధర్మనిష్ఠ కలవాడు. పురుని కిచ్చిన వార్ధకము నితడు తిరిగి గ్రహించి వాని యౌవనము వాని కిచ్చెను. స్వర్గమున కేగిన పిదపకూడ యితని స్వాభిమానము తగ్గలేదు. అందుచే యింద్రు డితనిని తిరిగి భూలోకమునకు త్రోసివేసెను.

యయాతి యెన్నో యజ్ఞయాగములు చేసెను. రాజనీతి ననుసరించి ప్రజాపాలన మొనర్చెను. ఎన్నో దానములు చేసెను. ఇతనికి దేవయానియందు యదుతుర్వసులును, శర్మిష్ఠయందు ద్రుహ్యు, అను, పురులును జన్మించిరి. కొన్ని గ్రంథములలో యితనికి మాధవి, సుకన్య అను నిర్వురు కుమార్తె లుండినట్లు వ్రాయబడినది. కాని సుకన్య బహుశా యయాతి కుమార్తెగాక శర్యాతి కుమార్తెయై యుండును.

యయాతి కథ వేర్వేరు గ్రంథములలో వేర్వేరుగా వర్ణింపబడెను.

## 108. రంభ

ఈమె మిక్కిలి అందమైన అప్సరస. కశ్యపునకు ప్రథవలన నామె జనించెను. కుబేరుని తనయుడు నలకూబరునితో నీమె పత్నీభావమున మెలగుచుండెను. ఒకసారి చక్కగా అలంకరించుకొని పోవుచున్నప్పు డీమెను రావణుడు చూచెను. కామమోహితుడై అత డీమెను కోరగా నేను నలకూబరుని ప్రేమించి, సమాగమమునకై అతని వద్దకు పోవుచున్నాను. నేను మీకు కోడల నగుదు నని చెప్పి యీామె అతనిని వారింపబోయెను. కాని రావణుడు వినక ఆమెను బలాత్కరించెను.

శ్వేతమునికి ఒకానొక రాక్షసికిని జరిగిన యుద్ధములో వాయవ్యాస్త్రము తగిలి ఆ రాక్షసియు, విశ్వామిత్రుని శాపముచే శిలగా మారిన రంభయు, కపితీర్థమున పడిపోయిరి. అట్లు పడుటతో ఈ యిద్దరూ నుద్ధరింపబడిరి. మహాభారతమున ఉద్యోగపర్వములో రంభ తుంబురుని భార్యగా చెప్పబడెను. కాని రంభాసాంగత్యమువల్లనే తుంబురుడు విరాధరాక్షసుడుగా మారవలసివచ్చెను. బహుశా యిత డామె భర్త కాదు.

## 109. రాముడు

అయోధ్యాధిపతి దశరథుడు పుత్రకామేష్టి చేయగా యజ్ఞపురుషు డతనికి పాయస మిచ్చెను. ఆ పాయసము గ్రహించినందున నితని రాణులు ముప్పురకును నల్గురు పుత్రులు కల్గిరి. వారిలో కౌసల్యపుత్రుడైన రాముడు జ్యేష్ఠుడు. ఇతనిని శ్రీవిష్ణుని అవతారముగా చెప్పుచుందురు. బ్రహ్మ రావణునకు పరిమితముగా నవధ్యత్వము వరముగా నిచ్చి మనుష్యులను పేర్కొనపోవుటచే రావణవధార్థము దేవతల ప్రార్థనపై విష్ణువు రాముడుగా మానవావతార మెత్తెను. వసిష్ఠునిచే నితనికి సమస్తశస్త్రశాస్త్రములలోను ప్రశిక్షణ మబ్బెను. విశ్వామిత్రుడు తన యజ్ఞరక్షకై దశరథునివద్దకు వచ్చి రాముని తనతో వంపుమని కోరెను. ఇందు మూలముగా రాముని కెన్నో విద్యలు, అస్త్రములు లభించెను. పూర్వకథ లెన్నో తెలిసెను. ఇతడు తాటకను, సుబాహుని వధించి మారీచు నెగుర గొట్టెను. మిథిలానగరమున జనకరాజు సభలో నితడు శివధనుస్సును భంజించెను. జనకపుత్రి సీత నితడు పెండ్లాడెను. దశరథు డితనికి రాజ్యాభిషేకము చేయబోగా, కైకేయి తనకు రా జెప్పుడో యిచ్చిన వరములు స్మరించి, వాటివలన రామునికి పదునాలుగేండ్లు వనవాసమును కోరుకొని, అతని నడవికి పంపెను. సీతాలక్ష్మణులు రాముని వెంట నడవి కరిగిరి. పుత్రవియోగ దుఃఖమున దశరథుడు మరణించెను. రాము డడవి కేగుచున్నపుడు భరతు డయోధ్యలో లేడు. అతడు వచ్చి, అన్ని విషయములు తెలిసికొని, తన తల్లి పట్టుదలవల్లనే యీ ఘోరము లన్నియు జరిగెనని గ్రహించి, ఆమెను నిందించి, తా నడవికి పోయి రాముని తిరిగి అయోధ్యకు రమ్మని పిల్చెను కాని అతని ప్రయత్నము ఫలించలేదు. చివర కతని పాదుకలు గ్రహించి వచ్చి రాముని పేరుమీదనే సంన్యాసిగనే నిల్చి భరతుడు రాజ్యమేలెను. వనవాసకాలమున రామున కెన్నో యిక్కట్లు కల్గెను. స్వర్ణమృగరూపమున ప్రలోభము కల్పించి రావణుడు సీతను లంక కెత్తుకొని పోయెను.

అతడు సీతను నయభయములు చూపి తనను వరింపుమని కోరెను. కాని సీత అతని వశము కాలేదు. సీతను వెదకుచు లక్ష్మణునితో కలిసి రాము డెంతగానో శ్రమించెను. వాలిని సంహరించి సుగ్రీవుని వంటి మిత్రుని, హనుమంతుని వంటి కర్తవ్యనిష్ఠుని సఖ్య మందెను. విభీషణుని తన పక్షమున చేర్చుకొని వానరుల సహాయముతో లంకపై దండెత్తెను. రావణుని చంపి సీతను విడిపించెను. అగ్నిపరీక్ష చేయించి ఆమె శుద్ధత్వమును పరికించి తిరిగి గ్రహించెను. రాముడు విభీషణుని లంకాధిపతిగా చేసి భరతరక్షితమైన తన రాజ్యమును తిరిగి గ్రహించెను. లోకాపవాదము కారణముగా గర్భవతిగా నున్న సీతను పరిత్యజించి ఏకాకిగా జీవించెను. సీత వాల్మీకిముని ఆశ్రమములో కుశ లవు లను కవలబిడ్డలను ప్రసవించెను. కాలుని సలహాపై రాముడు తన అవతారకార్యము ముగిసినందున మహాప్రస్థాన మరిగెను.

శ్రీరాముడు సత్యవాది. తండ్రి యాజ్ఞ పాలించుటకై అతడు రాజ్యాభిషేకము త్యజించి వనవాస మరిగెను. సీత నెక్కువగా ప్రేమించుచున్నను, ఆమె విశుద్ధశీలముపై విశ్వాసమున్నను, రాము డామెను అగ్నిపరీక్షానంతరమే స్వీకరించెను. రాజు చరిత్ర నిష్కళంకముగా నుండవలెనని భావించి, లోకాపవాదము కారణమున సీతను పరిత్యజించెను. ఏకపత్నీవ్రతనిష్ఠుడై యితడు సమాజము నెదుట నొక ఆదర్శము నిల్పెను. దుష్టసంహారముతో పాటుగా నితడు శిష్టరక్షణభారము కూడ వహించుచు వచ్చెను.

రాము డెంత కర్తవ్యనిపుణుడో అంతగనే కఠోరనిశ్చయుడు. లక్ష్మణుని యం దతనిప్రేమ సాటిలేనిది. అతడు లేనిదే ఒక్క క్షణమైనను నిత దుండజాలకుండెను. కఠోరకర్తవ్యనిర్వహణము నితడు లక్ష్మణున కప్పగించు చుండెను. లక్ష్మణు డట్లే ఉదాత్తభావమున నితని యాజ్ఞ నుల్లంఘింపక పాలించుచుండెను. చివరకు లక్ష్మణుని త్యజించి ఆతని వెనుకనే రాముడు మహాప్రస్థాన మరిగెను. శ్రీరాముని నిఃస్వార్థభావ మద్వితీయము. శరభంగముని తాను తపోబలముచే గడించిన బ్రహ్మలోకమును రామున కిచ్చెద ననెను. రాముడు వినయపూర్వకముగా తన కది వల దనెను. భరద్వాజు డతనికి వరమీయదలచెను. రాము డతనిని అననుకూల ఋతువులలో కూడ అయోధ్యామార్గమున గల వృక్షములన్నియు పుష్పఫలభరితములుగా నుండునట్లు అనుగ్రహింపు డని వర మడిగెను. అయినను, సీతాత్యాగము, వాలివధ అనునవి రాముని చరిత్రమున సర్వథా సమర్థనీయములు కాజాలవు.

రాముని జీవితమంతయు ఆదర్శపూర్ణమే. ఆచరణమంతయు ఆదర్శభరితమే. అత డొక అలౌకికమానవుడు. మర్యాదాపురుషోత్తముడు. కర్తవ్యపాలనయే అతని జీవననిష్ఠ. పుత్రుడు, భర్త, శాసకుడు, మిత్రుడు మున్నగు నన్ని రూపములలోను అతడు తన కర్తవ్యమును కఠోరముగా నిర్వర్తించి సమాజమున కాదర్శము జూపెను. అతడు చేసిన కొన్ని నిర్ణయములు కొందరికి అన్యాయము లని అనిపించిననూ, సమిష్టికళ్యాణముపైననే రాముని దృష్టి సదా కేంద్రీకరించి యుండెను.

## 110. రావణుడు

పులస్త్యుని పుత్రుడైన విశ్రవసునకును, సుమాలి పుత్రిక కైకసికిని రావణుడు జన్మించెను. కుబేరు డితని సవతియన్న. కైకసి యితనిని కుబేరునంత వైభవశాలివి కమ్మని చెప్పగా ఇతడు గోకర్ణక్షేత్రమున వేయేండ్లు తపస్సుచేసి, తన శిరస్సు ఒకటి హవనము చేసెను. అట్లే యితడు ప్రతివేయేండ్ల తపము పూర్తికాగానే ఒక శిరస్సు చొప్పున హవనము చేయుచు వచ్చి, పదియవ సహస్రాంతమున కూడ నట్లు చేయబోగా బ్రహ్మ ప్రత్యక్షమై పరిమితావధ్యత్వము వరముగా నిచ్చెను. పద్మపురాణములో శంకరు డట్లు ప్రత్యక్షమై వరమిచ్చినట్లున్నది. బ్రహ్మవరమున నితని శిరస్సు లన్నియు తిరిగి మొలిచెను. ఇతనికి దశాననుడు, దశగ్రీవుడు అని పేర్లు ఏర్పడినవి. రావణుడు కుబేరుని లంక నాక్రమించి లంకాధీశుడయ్యెను. మయుని పుత్రిక మండోదరి యితని భార్య. ఆమెగాక వేరే వేయిమంది యితనికి భార్య లుండిరి. మండోదరికి కలిగిన పుత్రుడు మేఘనాదుడు. అతికాయుడు, త్రిశిరుడు, నరాంతకుడు, దేవాంతకుడు అను వారితో కలిసి యితని పుత్రు లైదుగురు. కుంభకర్ణవిభీషణు లితని తమ్ములు. శూర్పణఖ చెల్లెలు. ప్రహస్త, మహోదర, మారీచ, శుక, సారణ, మహాపార్శ్వ, ధూమ్రాక్షాదులు రావణుని మంత్రులు. సహజముగా బలవంతుడైన రావణుడు వరబలమున దుర్జయుడయ్యెను. కుబేరుని పుష్పక మితడు గుంజుకొనెను. రాజులెందరినో పరాజితుల నొనర్చెను. శంకరుని గూర్చి అనాదరసూచకముగా మాట్లాడినప్పుడు నందీశ్వరుడు తగురీతి నితనికి శంకరుని ప్రభావ మవగతము చేసెను. తనపాదాంగుష్ఠముచే నదిమిపట్టబడిన కైలాసము క్రింద నితని బాహువులు చిక్కి నలిగిపోవునట్లు చేసి శివు డితని మదమును దింపివేసెను. యమునితో యుద్ధములో నితనికి మృత్యు వాసన్నమైనది, కాని బ్రహ్మ ఆ

యుద్ధము నాపివేసెను. నివాతకవచుల నితడు జయించలేక పోయెను. బ్రహ్మ వారితో నితనికి మైత్రి చేసెను. మరుత్తు యజ్ఞదీక్షలో నుండుటచే యుద్ధవిముఖు డయినందున నితనికి పరాజయము తప్పెను. వాలి రావణుని తన బాహుమూలమున నిరికించి యూపిరి సలుప నీయలేదు. అంతలో నితనికి వాలిసఖ్య మపగతమై అగ్నిసాక్షిగా అతనితో సంధిచేసికొనెను.

స్త్రీలను బలాత్కరించుటలో రావణుడు ఘనుడు. ఎందరినో సాధ్వీమణుల నితడు, వారి బంధుజనులను హతమార్చి, బలవంతముగా చెరబట్టి తెచ్చెను. పుంజికస్థలను, రంభను బలాత్కరించి, యితడు బ్రహ్మచేతను, నలకూబరుని చేతను శపించబడెను. వేదవతి యితని దౌర్జన్యమునకు వగచి ఆత్మత్యాగ మొనర్చి, యితని వినాశమునకై తిరిగి యవతరించుటకు ప్రతిజ్ఞ చేసెను. సీతను వేదవతి యవతార మనియే చెప్పుదురు. సీతాస్వయంవరవేళ రావణుడు మిథిల కేగెనే కాని శివధనుస్సు నెత్తజాలకపోయెను. రామలక్ష్మణుల బలపరాక్రమములను గురించి మారీచు డితనిని హెచ్చరించెను. కాని రావణు డతనిని సీతాపహరణమున సహాయపడుమని బలాత్కరించి అందులకు బాధ్యత వహింపజేసెను. అట్లు సహాయపడనిచో చంపివేసెద నని బెదిరించెను. విభీషణుడు సీతాపహరణమును గూర్చి రావణుని నిందించెను. కాని రావణు డా మాట లుపేక్షించెను. సీతను లొంగదీసికొనలేక, రావణు డామెను చంపుటకు కూడ సిద్ధమయ్యెను. కాని యితరు లా కార్యము నుండి యితనిని నివారించిరి. రాముని మాయాశిరమువంటివి చూపి సీతను వశపరచుకొనుటకై చేసిన ప్రయత్నములలో రావణుడు విఫలుడయ్యెను.

అనరణ్యుడు, మాంధాత యితని కోడినట్లు ప్రకటింపబడెను. హనుమంతుని తోకకు నిప్పంటించి లంకాదహనమున కితడే కారకుడాయెను. మానవులను తుచ్ఛులుగా తలచి గర్వించిన రావణుడు రాము నవలీలగా గెలిచెద ననుకొనెను. కాని సేనాధిపతు లొక్కొక్కరే గతించుచుండుటయు, అతికాయకుంభకర్ణులు వధింపబడుటయు నితని కధైర్యము కలుగజేయదొడగెను. ఇంద్రజిత్తు మరణముతో ఆశ లన్నియు నడుగంటెను. ఏదో కొంత జయము లభించినను, దానిని స్థిరముగా నిల్పుకొను నవకాశము లేదని అతనికి స్పష్టమాయెను. 'మరణాంతాని వైరాణి' అను నీతిపై రాము డితనికి విభీషణునిచే నంత్యేష్టి చేయించెను. బ్రహ్మయు, శివుడును ఇచ్చిన వరములవలన నితని కహంభావము, స్వేచ్ఛాచారము,

ప్రమత్తత అధికమైనవి. శివు డిచ్చిన చంద్రహాసము, బ్రహ్మ యిచ్చిన సిద్ధమంత్రము నితని నిరంకుశాచరణమునకు తోడ్పడెను. కాని ఎవరికినీ, ఎప్పుడునూ భయపడని రావణుడు బ్రహ్మశాపమునకు మాత్రము వెరచుచుండెను. ఈ కారణముననే అతడు సీత నంటుటకు సాహసింపలేదు.

## 111. రుద్రుడు (మహాదేవుడు, హరుడు, శివుడు)

రుద్రుడు పింగళజటాధారి, శత్రుసంహారకుడు, మహాబలుడైన దేవత, ప్రాణులను చంపునట్టివాడు. అందుచే భయంకరుడు. ఇత డోషధులచే రోగనివారణ మొనర్పగల నేర్పరి. ఋగ్వేదమున నితడు ధనుర్బాణవజ్రములు ధరించినవాడుగా వర్ణింపబడెను. శతపథబ్రాహ్మణములో అగ్నియే రుద్రు డనబడెను. అట్లే శర్వ,భవ, పశుపతి అను పేర్లు కూడ వాడబడెను. బ్రహ్మపురాణము, ఐతరేయ శతపథ బ్రాహ్మణములును, దుహితృగమనదోషమునకై ప్రజాపతిని శిక్షించుటకై రుద్రు డవతరించినట్లు చెప్పుచున్నవి. విష్ణుపురాణ మితనిని బ్రహ్మ కనుబొమ్మలనుండి పుట్టినట్లు పేర్కొనెను. అట్లే యిత డర్ధనారీశ్వరుడుగా చెప్పబడెను. స్కందపురాణము ననుసరించి సృష్టిచింతలో మునిగిన బ్రహ్మకు మొదట నరుణముగను, పిదప నీలముగను జనించిన శిశుద్వయమే రుద్రు డాయెను. రుద్రులు పదునొకండుగురు. వారి పేర్లు వేర్వేరు గ్రంథములలో వేర్వేరుగా నున్నవి.

దక్షపుత్రియైన సతీదేవి యితని భార్య. ఆమెయే తిరిగి హిమవంతుని కుమార్తె పార్వతి (ఉమ)గా జన్మించెను. ఇత డొకసారి బ్రహ్మ నిర్మించిన అప్సరస నొకామెను చూచి మోహించెను. కాని పార్వతి సమీపమున నుండుటచే ఆమెను. తిరిగి చూచుటకు సాహసింపలేదు. కాని నల్వంకలు నాల్గుముఖము లేర్పాటు చేసికొనెను. నారదునివలన నీ రహస్య మెరిగిన పార్వతి యితని నేత్రములు మూసెను. అప్పు డితనికి మూడవకన్ను లభించెను. వీరభద్రునిచే నితడు దక్షుని యజ్ఞమును విధ్వస్త మొనర్పజేసెను. అట్లే అతనిచే బ్రహ్మ పంచమముఖము నూడదీయించెను. కాని దీనివలన బ్రహ్మహత్యాదోష మంటెను. భూతపిశాచనాథు డగుటచే నితనికి శ్మశానమూవాస మాయెను. వీరభద్రాదు లితని పుత్రులు. ఎందరో ఋషులకు తామసప్రవృత్తి కలిగించినది రుద్రుడే. బాణ, భస్మాసుర, రావణుల పట్ల వ్యవహరించిన తీరులో నితని అమాయికత్వము

వెల్లడి యగుచున్నది. గంధమాదనపర్వతముపై దిగుచున్న గంగ నితడు తన జడలలో ధరించెను. అందుచే గంగ యితని పత్ని యనబడెను. ఇతని నివాసస్థానమును గురించి, మేరుపర్వతము, ఉత్తరధ్రువము, కైలాసము, హిమవంతము మున్నగు ననేకస్థలములు చెప్పబడుచున్నవి.

మహాదేవ, హర, శివ, శంకరాదు లన్నియూ నితని పేర్లే. సంతానప్రాప్తికై యితడు పార్వతితో చిరకాల మేకాంతమం దుండుటతో దేవతలు భయపడిరి. వా రితని రతిక్రీడకు విఘ్న మాపాదించిరి. అందుచే పార్వతి దేవతలను, వారికి పరోక్షముగా సహాయపడిన పృథ్విని సంతానహీను లగునట్లు శపించెను. ఇతడు పర్వతమున కరిగి తపస్సు చేయదొడగెను. భగీరథుని తపస్సునకు మెచ్చి శివు డతడు కోరినట్లు ఆకాశగంగను తన శిరస్సున ధరించెను. శివుడు సముద్రమథనవేళ జనించిన హాలాహలమును మ్రింగెను. హనుమంతునికిని, మధుదైత్యునికి వరము లిచ్చెను. శ్రీరామునితో అయోధ్యలో రాజ్యము చేయుమనియు, అశ్వమేధము చేయుమనియు, ఇంద్రలోకమునుండి విమానముపై వచ్చిన దశరథు నభివాదనపూర్వకముగా దర్శింపుమనియు చెప్పెను. ఒకసారి పార్వతితో గగన మార్గమున నేగుచు శంకరుడు సాలకటంకటచే విడువబడిన శిశువు సుకేశుని చూచి, కరుణించి అతని కమరత్వ మిచ్చెను. పార్వతి నొంటికంటితో చూచినందున కుబేరుని ఎడమకన్ను నష్టమాయెను. కుడికన్ను పింగళవర్ణ మాయెను. కాని కుబేరుడు శివుని మెప్పించి అతని మైత్రి సంపాదించెను. ఒకసారి శివుడు పార్వతితో కైలాసమున విహరించుచుండగా రావణు డచ్చటకు వచ్చి, నందీశ్వరుని హెచ్చరిక వినక పర్వతము నెత్తి విసరివేయబోయి, శివుని పాదాంగుష్ఠముచే నదుమబడిన పర్వతము క్రింద బాహువులు చిక్కుకొనగా, మహారోదనమున శివుని గూర్చి ప్రస్తుతు లొనర్చెను. శివు డది విని మెచ్చి వానికి చంద్రహాస మను ఖడ్గమిచ్చెను. శేషజీవితమును గూర్చి నియమము లుంచుచు వరమిచ్చెను. ఇలమహారాజునకు స్త్రీత్వ మబ్బగా కర్దము డశ్వమేధ మొనర్చి శివుని ప్రసన్నుని చేసికొనెను. అంతతో ఇలునకు తిరిగి పుంస్త్వము లభించెను.

## 112. లక్ష్మణుడు

దశరథునకు సుమిత్రయందు కల్గిన పుత్రులలో లక్ష్మణుడు జ్యేష్ఠుడు. శత్రుఘ్ను డితని తమ్ముడు. ఇతనికి రామునియందు భక్తిప్రేమాదరము

లపారము. ఇతనికి తన సుఖదుఃఖముల చింత యావంతయు లేదు. జీవితమంతయు శ్రీరాముని సేవలో గడిపెను. స్వేచ్ఛతోనే యితడు రాముని వెంట వనవాస మేగెను. ఊర్మిళ యితని భార్య. శస్త్రాస్త్రములం దితని కుత్తమజ్ఞాన ముండెను. రామరావణయుద్ధములో నితని పరాక్రమము విశద మాయెను. విశ్వామిత్రుని వెంట రామునితో నితడు వెళ్లెను. ఇతడు తాటక, శూర్పణఖ, అయోముఖి అను రాక్షసస్త్రీల ముక్కుచెవులు ఖండించెను. అతికాయ, విరూపాక్షు లితని చేతిలో చచ్చిరి. మేఘనాదుని హోమము పూర్తికానీక, అతనిని నికుంభిలలోనే యెదిరించి, విభీషణుని మాటపై యుద్ధము చేసి విజయమందెను. ఆనందరామాయణము ననుసరించి, అయోధ్య విడిచిన తర్వాత లక్ష్మణుడు పన్నెండేండ్లు ఆహారనిద్రలు విడిచిపెట్టెను. అందుచే బ్రహ్మవరము ననుసరించి మేఘనాదుని చంపుట కితడే సమర్థుడు. ఇత డన్యాయము సహింపడు.

కైకేయిని సంతోషపెట్టుటకు నిరపరాధియైన రాముని వనవాస మంపుచున్న దశరథునిపై కోపించి యిత డతనిని వధించుట కిచ్ఛగించెను. అట్లే రాముని చూడవచ్చిన భరతునిపై కూడ నితనికి సందేహమయ్యెను. కైకేయిని, భరతుని కూడ వధింతునని చెప్పి సిద్ధమాయెను. రాము డితని నోదార్చి ఆ ప్రయత్నము మానిపించెను. సుగ్రీవుడు తానిచ్చిన మాట ప్రకారము రాముని చూడవచ్చుటలో జాగు చేసినందుల కిత డెంతగనో మండిపడెను. సీత నితడు కన్నెత్తి చూచి యెరుగడు. కేవల మామె పాదములు మాత్రమే చూచిన మర్యాదాశీలుడు. అందుకే సీత తన శీలమును శంకించినపు డితని కెంతగానో మనోవ్యథ కలిగెను. కాని సీతాన్వేషణమున నిత డే మాత్రము లోపము చేయలేదు. ఇట్లే రాముని కితడు సమయానుసారముగా చెప్పిన నీతులు, కోపోపసంహారకవాక్యములు, నితని శాంతస్వభావమును, బుద్ధికుశలతను కూడ తెలియజేయును. స్వర్ణమృగము మాయామృగమని యితడు ముందుగనే గ్రహించి రాముని కా విషయము తెలియజేసెను.

రావణుడు లక్ష్మణునిపై శక్తిని ప్రయోగించెను. దాని కితడు మూర్ఛిల్లి పడి హనుమంతుడు తెచ్చిన సంజీవనౌషధిచే తిరిగి సచేతను డయ్యెను. రాముని కతడు తనను పితృతుల్యునిగా నెంచుచుండునని తెలియును. అందుకే మహాదుర్ఘటము, నిష్ఠురము నగు కార్యమైనను అతడు దానిని లక్ష్మణున కప్పగించుచుండెను. తన కిష్టము లేకున్నను రామాజ్ఞపై నితడు వాటి

నాచరించుచు వచ్చెను. పూర్ణగర్భయగు సీతను వనములో దిగవిడిచి వచ్చు భారము లక్ష్మణునిపై బడెను. అట్లే కాలునితో రాముడే కొంత సంభాషణములో నున్నతరి, దుర్వాసుని లోనికి పోనీక నిల్పుటలోను, తిరిగి అతనిని పోనిచ్చి రామాజ్ఞ మీరుటలోను, ఇతడు తన వినాశముకంటె శాపమూలమున జరుగబోవు కులనాశము మిన్న యని నిశ్చయించెను. ఇట్లితడు రామాజ్ఞను మీరి ఆత్మత్యాగ మొనర్చెను. ఇతడు మితభాషి, సౌమ్యుడు. కాని ఒక్కొక్కప్పుడు మిక్కిలి కోపిష్ఠి. త్యాగధనుడు, శుద్ధాచారశీలి.

## 113. లవణాసురుడు

ఇతడు మధుదైత్యుని పుత్రుడు. చిన్నప్పటినుండి దుర్మార్గుడు. శంకరుడు మధుదానవునికి వరముగా నిచ్చిన శూల మితనికి లభించెను. ఆ వర మితని వరకే అని శివుడు మధువున కెరిగించెను. కాని ఆ శూలము చేతిలో నున్నంతవరకు అతని నెవరును జయింపలేరు. ఆ శూలము శత్రువులను భస్మముచేసి తిరిగి యితని చేతికి వచ్చును. ఈ వరబలమున లవణుడు మదించెను. శ్రీరాము డితనిని చంపుటకు శత్రుఘ్నుని పంపెను. శత్రుఘ్నుడు దారి కాచి శూలము చేతిలో లేని తరి లవణు నెదిరించి చంపెను.

## 114. వరుణుడు

ఇత డొక మంత్రద్రష్ట. అదితికి పుత్రుడు. పశ్చిమదిశ కధిపతి. నాగలోకమునకు, జలములకు కూడ నిత డధిపతి. ఇతని పుత్రుడు గోవు. మంత్రి సునాభుడు. గౌరి యితని పత్ని. శుక్రాచార్యుని పుత్రియైన జ్యేష్ఠ యితని రెండవభార్య. ఆమెయం దితనికి బల, సుర, అధర్మ, పుష్కర, బందిను లను పుత్రు లుదయించిరి. సోమపుత్రియైన భద్ర నితడు వివాహమాడదలచెను. కాని యామె వేరొకనిని పెండ్లాడెను. అందుచే నిత డామె నెత్తికొని పోయెను. దేవత లితని కభిషేకము చేసిరి. సీత విశుద్ధతను గూర్చి ఇతడు శ్రీరామునికి నివేదించెను. రుద్రుని యజ్ఞమున నుద్భవించిన అంగీరసుని ఇతడు పుత్రరూపమున స్వీకరించెను. మానసోత్తరపర్వతము వెనుక నిమ్లోచని యను నగర మీతని నగరు. ఇత డాదిత్యులలో నొకడు.

చూ. శాపక్ర. 52. మిత్రుడు > ఊర్వశి

## 115. వసిష్ఠుడు

ప్రాచీనసాహిత్యములో వసిష్ఠు డను పేరు గలవా రందరూ ఒకే వ్యక్తి కాదు. ఈ పేరున నెందరో వ్యక్తు లుండిరి. వసిష్ఠుడు ఋగ్వేదము సప్తమ మండలములో మంత్రద్రష్టయు, సూక్తనిర్మాతయు నని తెలియును. ఊర్వశి నుద్దేశించి మిత్రావరుణులు తమ తేజమును కుంభమునందో, కమలమునందో, విడువగా నత డందుండి జన్మించెను. వసిష్ఠవిశ్వామిత్రుల జగడము ఋగ్వేదములో కూడ వినిపించును. ఇతడు సౌదాసుని పురోహితుడు. స్వాయంభువమన్వంతరమున బ్రహ్మకు కలిగిన పదిమంది మానసపుత్రులలో వసిష్ఠు డొకడు. కర్దమప్రజాపతి పుత్రిక యగు నరుంధతియు, దక్షపుత్రి యగు ఊర్జయు నితని భార్యలు. ఇతడు బ్రహ్మయొక్క ప్రాణవాయువుచే జనించెను. కామధేనువు సహాయమున నితడు తన ఆశ్రమములో విశ్వామిత్రున కాతిథ్య మిచ్చెను. విశ్వామిత్రు డా ధేనువును బలవంతముగా గొనిపోవ నెంచెను. అప్పుడు దాని శరీరమునుండి శకపల్లవాదిమ్లేచ్ఛులు జన్మించి విశ్వామిత్రు నోడించిరి. అప్పటితో విశ్వామిత్రునకు క్షాత్రతేజముకన్న బ్రహ్మతేజము గొప్ప దను భావ మేర్పడెను. బ్రహ్మత్వప్రాప్తికై అతడు ప్రయత్నించెను. తుదకు తాను బ్రహ్మర్షి నని వసిష్ఠునిచే ననుమతింపజేసి కొనెను. వసిష్ఠస్మృతి, వసిష్ఠతంత్రము, వసిష్ఠపురాణము మున్నగు గ్రంథము లితని పేరున వెలసినవి.

వసిష్ఠు డిక్ష్వాకుకులపురోహితుడు. మారీచసుబాహుల యాగడ మడప దలచి వచ్చి శ్రీరాముని తనతో పంపుమని విశ్వామిత్రుడు దశరథు నడిగినప్పుడు వసిష్ఠుడు దశరథునకు ధైర్యము చెప్పెను. సదేహస్వర్గగమన మాశించిన త్రిశంకుని యజ్ఞమున కితడు సమ్మతించలేదు. ఇతడు రామునికి అభిషేకమునకు దీక్ష గావించెను. దశరథుని అంత్యేష్టి భరతుని రప్పించి నిర్వహింపజేసెను. సీతను నారచీరలు ధరింపుమన్న కైకేయి నితడు నిందించి సీతకు వనవాసము నీవు కోరిన వరములలో లేదని స్పష్టపరచెను. రాముని వెనుకకు పిలువ నేగుచున్న భరతునితో నితడును వనమున కేగెను. నిమిసౌదాసులకు వసిష్ఠుడు శాప మిచ్చెను. నిమి యిచ్చిన ప్రతిశాప మితని కనుభవింపనయ్యెను. దుర్వాసు డొక వత్సరకాలము వసిష్ఠాశ్రమమున నుండెను. దశరథుని యింట సర్వధార్మిక కృత్యములును వసిష్ఠుడే నిర్వర్తించుచు వచ్చెను. శ్రీరాముని మహాప్రస్థాన సమయమున కూడ నిత డొక ధార్మికవిధి నిర్వహించెను.

మహోదయాదులు నూరుమంది వసిష్ఠుని పుత్రులు. యజ్ఞాహ్వానమును తిరస్కరించినందున విశ్వామిత్రుడు వారందరిని శపించెను.

## 116. వసిష్ఠపుత్రుడైన మహోదయుడు

వసిష్ఠునికి నూర్గురు పుత్రు లుండిరి. వారందరు మహాతపస్వులు. విశ్వామిత్రుడు వారందరిని శపించెను. వారిలో నొకడు మహోదయుడు.

చూ. శాపక్ర. 15. విశ్వామిత్రుడు > మహోదయుడు

## 117. వాయుదేవుడు

వాయుదేవుడు అంజనయందు హనుమంతు నుత్పాదించెను. కుశనాభుని పుత్రికలు నూరుమందిని చూచి, వాయుదేవుడు వారిని తనకు భార్యలు కాగోరెను. వారందుల కంగీకరింపలేదు. వాయువు కుపితుడై వారి యంగములు వంచి వారిని కుబ్జలుగా చేసెను. ఇంద్రుని వజ్రముచే హనుమంతుని హనువు భగ్నమైనప్పుడు వాయు వత్యధికక్రోధమున, ముల్లోకములలోను తన సంచారము నిలిపివేసెను. అందుచే ప్రాణు లందరికిని ఊపిరి సలుపలేదు. దేవత లీ విషయము బ్రహ్మ కెరింగింపగా నతడు వాయువును బుజ్జగించి, దెబ్బతినిన బాలహనుమంతుని శరీరమును తన చేతితో స్పృశించి గాయములు మాన్పెను. ఆమీద నతడు స్వయముగా హనుమంతునకు వరమిచ్చుటయేగాక, తక్కిన దేవతలచేత కూడ అతనికి వరము లిప్పించెను. ఇటు లతడు బలవంతుడయ్యెను. వాయు వప్పుడు సంతసించి మునుపటివలె తిరిగి సంచరింపదొడగెను.

## 118. వాలి

ఋక్షపత్ని విరజకు ఇంద్రునివలన కలిగిన పుత్రుడు వాలి. ఇతని జన్మకథ విచిత్రమైనది. ఋక్షరజస్సు అను వానరరాజు దప్పిగొని ఒక జలాశయమువద్దకు పోయెను. నీటిలో తన ప్రతిబింబము చూచి శత్రువనుకొని నీటిలోనికి దూకెను. కాని నీటినుండి బయటకు వచ్చుసరికి అతడు స్త్రీగా మారియుండెను. ఆ సమయమున నాకాశమున విహరించుచున్న ఇంద్రసూర్యు లామెను చూచి మోహించిరి. ఇంద్రుని వీర్య మామె శరీరమున (తలవెంద్రుకలపై) పడెను. సూర్యతేజ మామె కంఠమున పడెను. తోడనే శరీరమునుండి

(వెంద్రుకలనుండి) వాలియు, కంఠమునుండి సుగ్రీవుడును జన్మించిరి. ఆ మరునాటి యుదయమునకు స్త్రీరూపము పోయి ఋక్షరజస్సు తిరిగి పురుషుడయ్యెను. ఆనందరామాయణములో శ్రీరాముని చేత వాలి వధింపబడిన సందర్భమున వాలికిని ఒక సర్పమునకు జరిగిన జగడములో వారు పరస్పరము శపించుకొన్నట్లు చెప్పబడినది. పంచమేధ్రు డను రాక్షసుడు సర్పాకారమున వాలిని మ్రింగజొచ్చెను. ఇంతలో వీరభద్రు డా సర్పమును తలనుండి తోకవరకు చీల్చి వాలిని రక్షించెను. వాలి తనబలముచే రావణు నాశ్చర్యచకితుని చేసెను. అంతతో అతడు వాలితో మైత్రి చేసికొనెను. వాలివద్ద తారుడు మంత్రిగా నుండెను. అతని పుత్రి తార వాలి భార్య. దుందుభిపుత్రుడైన మాయావికి, వాలికిని ఒక స్త్రీనిమిత్తము జగడమాయెను. వాలి మాయావిని సంహరించెను. వానిని చంపబోయి వాలి ఒక గుహలోనికి పోవుచు గుహాద్వారమున సుగ్రీవుని రక్షకునిగా నుంచెను. గుహలో నుండి చాలకాలమువరకు వాలి బయటకు రాలేదు. పైగా గుహలోనుండి రక్తమాంసమజ్జాదులు బయటకు ప్రవహింపసాగెను. అది చూచి సుగ్రీవుడు వాలిని రాక్షసులు చంపివేసినా రనుకొనెను. వెంటనే యతడు గుహాద్వారము నొక పెద్ద బండరాయితో కప్పి, వాలి కంత్యేష్టి నెరపి కిష్కింధకు వచ్చెను. తన కిష్టము లేకున్నను మంత్రుల మాటపై అతడు రాజ్యాభిషేకమున కంగీకరించెను. మరికొన్ని దినములకు రాక్షసులను నిశ్శేషముగా వధించి వాలి కిష్కింధకు వచ్చెను. సింహాసనముపై నున్న సుగ్రీవుని చూచి రాజ్యబహిష్కృతుని చేసి, అతని భార్య రుమ నపహరించెను. అది మొదలు సుగ్రీవుడు ఋష్యమూకమున వసింపదొడగెను. రామసుగ్రీవుల మైత్రి జరిగినపిదప రాముడు వాలిని వధింతునని ప్రతినబూనెను. తార వాలితో సుగ్రీవునికి రాముని సహాయము లభించినందున అతనితో యుద్ధమునకు పోవలదని చెప్పెను. కాని వాలి వినలేదు. రాముడు వాలివక్షము భేదించి అతనిని మూర్ఛిల్లజేసెను. .వాలి దానిని అధర్మకృత్యమని పల్కి రాముని నిందించెను. కాని రాముడు తాను చేసినది ధర్మయుక్తమే అని వాలికి తెలియజేసెను. అప్పుడు వాలి రాముని క్షమింపుమని వేడి, అంగదుని రక్షింపు మని ప్రార్థించెను. సుగ్రీవు డంగదుని పుత్రసమానునిగా ప్రేమించి పెంచి వాలికోర్కె నెరవేర్చెను.

## 119. వాల్మీకి

ఇతడు సంస్కృతభాషలో ఆదికవి. ఇతని జీవితమునుగూర్చి ప్రామాణికమైన

వృత్తాంతము లభింపలేదు. ప్రాచీనసాహిత్యములో ముగ్గురు వాల్మీకులు కనిపించెదరు. భార్గవవాల్మీకి, దస్యువాల్మీకి, కవివాల్మీకి.వీరికి సంబంధించిన కథలును విభిన్నములే.

ఇతడు సుమతి యను బ్రాహ్మణుని కుమారుడు. తపస్సుచే మహర్షి యయ్యెను. కాని బాల్యమున నితడు తల్లిదండ్రులచే నొక కిరాతకుని కప్పగించబడెను. తల్లిదండ్రులు తపోవన మేగిరి. ఇతడు కిరాతుల సాంగత్యమున పెరిగి తన బ్రాహ్మణత్వమును మరచిపోయి దొంగతనము పంటివి చేయదొడగెను. ఒకసారి కొందరు మహర్షు లితడున్న మార్గమునకు వచ్చిరి. ఇతడు వారిని దోచుకొనెను. ఆ ఋషు లప్పు డితనికి సదుపదేశ మొసగిరి. అంతతో ఇతనికి పశ్చాత్తాపము కల్గినది. వారు చెప్పిన రామమంత్రము నితడు జపింపదొడగెను. జపనిష్ఠలో చిరకాల మొకే చోట కూర్చొని యున్న యితనిపై పుట్టలు పెరిగెను. స్కందపురాణము ననుసరించి వెనుకటి మహర్షులే మరలి వచ్చి యితని నా పుట్టనుండి బయటకు పిలిచి వాల్మీకి అని పేరు పెట్టిరి.

స్కందపురాణములో వాల్మీకిని గూర్చి వేరొక కథ యున్నది. పూర్వ మొకప్పుడు కణు వను బ్రాహ్మణు డొక డుండెను. అతడు చిరకాలము తపస్సు చేసెను. తపము ముగించిన పిదప అతనికి తన భార్య జ్ఞప్తికి వచ్చెను. అప్పు డతనికి వీర్యపతన మయ్యెను. ఆ వీర్యము నొక వనచారిణి గ్రహించెను. ఆమెకు పుత్రుడు కల్గెను. ఆ పుత్రునిపై మహర్షులు కృప వహించి అతనికి బ్రాహ్మణత్వ మనుగ్రహించిరి. అతడే వాల్మీకి యని ప్రసిద్ధు డాయెను.

వాల్మీకి తమసానదీతటమున ఆశ్రమ మేర్పరచుకొని అధ్యాపన మొనర్చుచుండెడివాడు. ఇతని శిష్యపరివారము మెండుగా నుండెను. భరద్వాజు డితని ముఖ్యశిష్యుడు. రాముడు సీతను విడిచిపెట్టిన పిదప వాల్మీకి సీతను తన యాశ్రమములో నుంచి పోషించెను. అప్పు డామె గర్భవతి. ఆమె కా యాశ్రమములోనే లవుడు, కుశుడు అను నిద్దరు కవలపుత్రు లుదయించిరి. వాల్మీకియే వారికి విద్యాబుద్ధులు గరపెను. తాను వ్రాసిన రామాయణకావ్యమును వారిచే పఠింపజేసెను. ఒక ఋషితో ఒకసారి పాషండవాదము నెరపినందున నితనికి బ్రహ్మహత్యాదోష మంటెను. కాని శివారాధనతో ఆ దోషము తొలగిపోయెను.

"వాల్మీకిముని శూద్రుడు. కాని యా పిదప బ్రాహ్మణత్వ మతనికి ఋషీశ్వరుల కృపవలన సిద్ధించెను" అను నీ ప్రవాదమున కాధారము కానరా కున్నది. వాల్మీకిరామాయణములో నతని ప్రశంస వచ్చిన చోటెల్లను అతడు విద్వాంసుడైన బ్రాహ్మణుడుగనే వర్ణింపబడెను. *'ప్రాచేతసోఽహం దశమః పుత్రో రాఘవనందన'* అను (ఉత్తర 96-99) శ్లోకమున వాల్మీకి తన విషయము తానే చెప్పుచుండెను. బ్రహ్మవరమువలన వాల్మీకి రాముడు జన్మించుటకు పూర్వమే రామకథ వ్రాసె నన్న జనశ్రుతికూడ నిరాధారమైనదే. వాల్మీకి శ్రీరాముని సమకాలికుడు. రాముని తర్వాత కూడ అత డుండియుండును. వాల్మీకి నారదుని ప్రశ్నించినపుడు 'మహర్షివర్యా, వర్తమానమున భూలోకములో వీరుడు, ధర్మరతుడు, కృతజ్ఞుడు, సత్యవాది, ఆపదలోనైనను ధర్మము విడువనివాడు, సదాచారసంపన్నుడు, సమస్తప్రాణికోటికి హితము కోరువాడు, సమర్థుడు, దర్శనమాత్రముననే అందరికి ఆనందము కలుగజేయు వాడు, మనోనిగ్రహము కలవాడు, క్రోధాదులను అరికట్టి నిలచువాడు, తేజస్వి, పరోన్నతిని ద్వేషింపనివాడు, యుద్ధమున కోపించినచో దేవతలకైనను భయావహుడు నెవడని యడిగెను. దానికి బదులుగా నారదుడు సంక్షిప్తముగా రామకథ నెరింగించెను. వాల్మీకి రామాయణమున నారదుడు చెప్పిన రామకథ నాధారముగా చేసికొని నీవు రామాయణము రచింపుమని బ్రహ్మ వాల్మీకి కెరిగించినట్లు స్పష్టముగా నున్నది.

క్రీస్తుపూర్వము ప్రథమశతాబ్దమున వాల్మీకికి దశరథపుత్రుడైన రాముని వృత్తాంతము సమకాలీనవృత్తముగనే జరిగెను. ఉత్తరకాండము రచించునాటికి ఇతనికి అయోధ్యాపరివారముతో నికటసంబంధ మేర్పడియుండెను. అశ్వమేధా వసరమున నితడు సీతావిశుద్ధతను గూర్చి విశ్వాసము కలిగించెను. విష్ణుపురాణాదులలో వాల్మీకి శ్రీవిష్ణుని అవతారమనియు, ఇరువదియారవ వేదవ్యాసు డనియు కూడ కనిపించును.

## 120. విద్యుత్కేశుడు

రాక్షసుడైన హేతికిని, కాలునిపుత్రి భయకును కల్గిన పుత్రుడు విద్యుత్కేశుడు. సాలకటంకట యితని భార్య. సుకేశు డితని పుత్రుడు. ఇతనివలన కలిగిన గర్భమును సాలకటంకట మందరపర్వతమున విడిచెను. శంకరుడు దానిని రక్షించెను.

## 121. విరాధుడు

ఇతడు జపుడు, శతహ్రదల పుత్రుడు. క్రౌంచపట మను పనమున నుండు రాక్షసుడు. బ్రహ్మ యిచ్చిన పరముచే నితనికి పరిమితాపధ్యత్వము, అచ్ఛేద్యత్వము ప్రాప్తించినవి. అందుచే రామలక్ష్మణు లితని కాలుచేతులు ఖండించి పెద్ద గోతిలో పూడ్చివేసిరి. ఇతడు తన పూర్వవృత్తాంత మెరిగించుచూ పూర్వజన్మలో తనకు కలిగిన శాపమునుగూర్చి చెప్పెను. పూర్వజన్మలో ఇతడు తుంబురుడు.

## 122. విరోచనుడు

ఇతడు ప్రహ్లాదుని పుత్రుడు. బలికి తండ్రి. కేశిని యను రాజపుత్రి అంగిరసపుత్రుడైన సుధన్వునిగాని, విరోచనునిగాని, వీరిరువురిలో ఎవడు శ్రేష్ఠుడో వానిని పెండ్లాడుదు నని నిశ్చయించెను. శ్రేష్ఠత్వనిర్ణయమునకై వారు ప్రహ్లాదకశ్యపులవద్ద కేగిరి. కశ్యపుడు సుధన్వుని శ్రేష్ఠుడని నిర్ణయించెను. అంతతో నత డా అధికారము పదులుకొనెను. అత డాత్మజ్ఞానముకొరకు సత్యలోక మరిగెను. అదే సమయమున ఇంద్రుడుకూడ ఆత్మజ్ఞానార్థియై అక్కడకు పచ్చెను. ఇంద్రునికి ఆత్మసాక్షాత్కార మైనది. కాని విరోచనుని కది లభింపలేదు. అతడు తన సిద్ధాంతము తానే నిర్మించి శిష్యులకు బోధించెను.

సూర్యారాధన చేసి విరోచనుడొక కిరీటము సంపాదించెను. దాని నిచ్చుచున్నప్పుడు సూర్యు డతనితో 'నీ విది యితరుల చేతి కందనీయరాదు. అట్లయినచో నీవు నశింతువు' అని చెప్పెను. దేవతలను బాధించుచున్న విరోచనుని శ్రీవిష్ణువు నారీరూపమున పచ్చి మోహింపజేసి ఆ కిరీటమును హస్తగత మొనర్చుకొనెను. అంతలో అతడు నశించెను. ఈ కథ గణేశపురాణములో నున్నది. ఇంద్రు నితడు పధింపబోగా అతడే తారకామయ యుద్ధములో నితనిని పధించెను. కుంభనికుంభు లితని తమ్ములు.

## 123. విశ్రవసుడు

బ్రహ్మమానసపుత్రుడును చతుర్థప్రజాపతియు నైన పులస్త్యు డితని తండ్రి (సుందర 23/6-7). ఇతడు తృణబిందుని కుమార్తెకు పులస్త్యునివలన జన్మించెను. పులస్త్యుడు వేదాధ్యయనము చేయుచుండగా, ఇతని తల్లి దానిని

వినెను. అప్పుడు జనించినందున నితనికి విశ్రవుడని పేరు వచ్చెను. (ఉత్తరకాండ 2/31-32). ఇతడు శ్రుతిమంతుడు, సమదర్శి, వ్రతనిష్ఠగల ముని. భరద్వాజుని పుత్రి దేవవర్ణిని యితని పత్ని. ఆమెకు కలిగిన సర్వగుణసంపన్నుడు, ధర్మజ్ఞుడు నైన పుత్రుడు వైశ్రవణుడు.

సుమాలిరాక్షసుని పుత్రి కైకసి విశ్రవసుని మనసార వరించినది. కాని ఆమె వచ్చినప్పు డతడు సంధ్యాహోమము చేయుచుండెను. అది క్రూరసమయము. ఫలితముగా నీమెకు రావణ కుంభకర్ణ శూర్పణఖలు క్రూరులై జన్మించిరి. ఆమె ప్రార్థనపై చివరి పుత్రుడు విభీషణుడు ధర్మాత్ము డాయెను. రావణుడు కుబేరుని వద్దనుండి లంకను గ్రహింప నెంచినప్పుడు విశ్రవసు డతనిని లంక విడిచి కైలాసమున కేగి వసింపుమని సలహాయిచ్చెను.

## 124. విశ్వకర్మ

ఇతడు ప్రభాసవసువునకు వరస్త్రీ (భువన)కిని తనయుడు. ఇతడు దేవవిమానములను, నగరములను నిర్మించువాడు. ఇతనికి అప్సరస ఘృతాచితో నేర్పడిన సంబంధమునకు ఫలితముగా నలవానరుడు జన్మించెను. ఇతడు వేదసూక్తద్రష్ట. విశ్వజిత్ యజ్ఞ మొనర్చినవాడు. ఇతని కుమార్తె సంజ్ఞ వివస్వతుని భార్య. కాని ఆమె వితస్వతుని తేజము భరింపజాలక, తనకు మారుగా ఛాయ నచట నిల్పి తాను పుట్టినింటికి వెళ్లిపోయెను. కాని వివస్వతు డామెవద్ద ఆమె భరింపగల తేజమునే యుంచి మిగిలిన తేజము నుపసంహరించెను. ఆమె సంజ్ఞ తపస్సు కేగినదని చెప్పెను. ఆ తేజముతో నిత డాయుధములు నిర్మించెను. విష్ణుని సుదర్శనము, శివుని త్రిశూలము, ఇంద్రుని వజ్రము నిత డా తేజముతో నిర్మించెను. ఇంద్రప్రస్థము, ద్వారక, లంక, బృందావనముల నితడే నిర్మించెను. ఇతడు వాస్తుశాస్త్రిముపై నొక గ్రంథము వ్రాసెను. బ్రహ్మవైవర్తపురాణములో తోటమాలి, గాజులవాడు, శంఖువని చేయుశిల్పి, దర్జీ, వడ్రంగి, కంసాలి, రాతిపనివాడు మున్నగువారు ఘృతాచీ విశ్వకర్మల సంతానముగా చెప్పబడెరి. చక్రవాళపర్వతము పై గల సహస్రారచక్రము విశ్వకర్మనిర్మితమని ప్రసిద్ధి. ఈ విషయములు సీతాన్వేషణమున కేగుచున్న వానరులతో సుగ్రీవుడు చెప్పెను.

## 125. విశ్వామిత్రుడు

ఇంద్రుని వంటి పుత్రుడు కలుగవలెనని కుశికుడు తపస్సు చేసెను. ఇంద్రుడు మెచ్చి తన వంటి పుత్రు డింకొకడు కాడని, తానే అతనికి పుత్రుడుగా జన్మింతునని చెప్పెను. ఫలితముగా గాధి యను పుత్రుడు పుట్టెను. గాధిపుత్రుడే విశ్వామిత్రుడు. ఇతడు క్రోధస్వభావుడు. కాని కఠోర తపోనిష్ఠ వహించి తన యభీష్టము నెరవేర్చుకొను పట్టుదల గలవాడు. ఇతడు సృష్టికి ప్రతిసృష్టి చేయగలవాడు. వసిష్ఠునితో నితనికి జగడమైనది. ఒకసారి యితడు వసిష్ఠుని ఆశ్రమములోనికి పోయెను. అప్పు డతడు కామధేనువు సహాయమున నితని కుత్తమాతిథ్యము నెరపెను. అప్పుడు గోవును తన కిమ్మని అడిగి, అత డీయ ననగా బలవంతముగా దానిని గొనిపోబోయెను. అప్పు డా గోవునుండి శకబర్బరాదుల సేన బయల్వెడలి యితని నోడించెను. అప్పు డితనికి క్షత్రతేజము కంటె బ్రహ్మతేజము మిన్న యని తెలియవచ్చెను. బ్రహ్మతేజఃప్రాప్తికై యితడు తపస్సు చేసి బ్రహ్మర్షియై, ఆ విషయము వసిష్ఠునిచేత ఒప్పించి, మాన్యత గడించెను. ఇతడు వసిష్ఠపుత్రులను తన పుత్రులను కూడ శపించెను. సదేహస్వర్గమున కాంక్షగల త్రిశంకునికై యితడు యజ్ఞ మొనర్చి అతనిని స్వర్గమునకు పంపెను. కాని అతడు తలక్రిందుగా త్రోసివేయబడెను. విశ్వామిత్రుని ప్రయత్నములు సఫలము కాలేదు. అంబరీషుని యజ్ఞపశువుగా శునఃశేపు డమ్మబడెను. అతడు తన మామ విశ్వామిత్రునితో తనను విడిపించి రక్షింపుమని కోరెను. అప్పు డితడు తన పుత్రులలో నొకనిని శునఃశేపునకు బదులుగా బలి కమ్మనెను. పుత్రులు వినలేదు. ఇతడు శునఃశేపునకు రెండు గాథ లుపదేశించి అతనిని రక్షించెను. ఇంద్రు డితని తపోభంగమునకు రంభను పంపగా నిత డామెను శపించెను.

మారీచసుబాహులు ఇతని యజ్ఞమునకు విఘ్నము కల్పించుచుండిరి. తపః క్షయ మగునని యెంచి యితడు వారిని శపించలేదు. కాని వారిని నిర్మూలించుటకు రాముని తనతో పంపుమని దశరథుని కోరెను. దశరథుడు మొదట వల్లె యని, తర్వాత మాటతప్ప జూచెను. వసిష్ఠుడు బోధింపగా నతడు రాముని పంపెను. ఇతడు రామున కెన్నో కథలు చెప్పెను. తాటకను వధించిన పిదప సంతసించి బల, అతిబల యను విద్యలు, అనేకదివ్యాస్త్రములను రామున కిచ్చెను. శ్రీరాముని మిథిలకు తోడ్కొనిపోయెను. జనకుని పురో

హితుడు శతానందుడు రామునికి విశ్వామిత్రుని మహత్త్వమెరిగించెను. రామలక్ష్మణాదుల వివాహములకు విశ్వామిత్రుని ప్రయత్నము గొప్పది.

విశ్వామిత్రుని యాశ్రమము తాటకావనసమీపమున నుండెను. దానికి సిద్ధాశ్రమ మని పేరు. ఇతనికి నూర్గురు పుత్రులు. మధుచ్ఛందుడు మధ్యముడు. ఋగ్వేదములో మూడవ మండలమున మధుచ్ఛందాదులు రచించిన సూక్తము లున్నవి. ఈయనకు కుశికుడని మారుపేరు.

## 126. విశ్వామిత్రపుత్రులు

వేర్వేరు గ్రంథములలో విశ్వామిత్రుని పుత్రుల సంఖ్య వేర్వేరుగా నున్నది. అతనికి నూర్గురు పుత్రులు. వారిలో మధుచ్ఛందుడు మధ్యముడు. ఇతడు హరిశ్చంద్రుని యజ్ఞమున శునఃశేఫుని విడిపించి, అతనికి దేవరాతు డని పేరుపెట్టెను. శునఃశేఫునకు జ్యేష్ఠత్వమిచ్చుటకు విశ్వామిత్రుని పుత్రు లేబదిమంది అంగీకరింపలేదు. అందుపై విశ్వామిత్రుడు వారిని మ్లేచ్ఛులుగా శపించెను. మిగిలిన యేబదిమందియు తన మాట కంగీకరించినందున వారి నత డాశీర్వదించెను. జ్యేష్ఠపుత్రుల గోత్రము విశ్వామిత్రగోత్రము. కనిష్ఠులది కుశికగోత్రము. ఇది భాగవతకథనము. ఐతరేయబ్రాహ్మణములో విశ్వామిత్రుని మాట కాదనిన వారికి అతని శాపముచే అశ్వ, పుండ్ర, శబర, పుళింద, మూతిబ జాతులవారుగా మారవలసివచ్చెను. వాల్మీకి రామాయణములో దృఢనేత్ర, మధుచ్ఛంద, మహారథ హవిస్పందుల పేర్లు మాత్రమే లభించుచున్నవి. (బాల. 57/4)

## 127. శ్రీవిష్ణువు

విష్ణు వనునది అనాద్యనంతుడైన పరమేశ్వరుని పేరు. ఇత డందరిని పోషించి రక్షించుచుండును. దుష్టశిక్షణము, శిష్టరక్షణము లితని ముఖ్యకార్యములు. శంఖ చక్ర గదా పద్మము లితని ఆయుధములు. పీతాంబర వనమాలా కిరీట కుండలాదులును శ్రీవత్సమును నితని భూషాలంకారములు. ఇత డింద్రభ్రాత. మాటిమాటికి అవతారములు ధరించి *'పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్'* అను వచనమును పాలించుచుండును. ఇతని పది యవతారములు ప్రసిద్ధములు. రామావతారము వీనిలో ఏడవది.

రావణుని అంతులేని, అవారిత దురాచారములచే భయవ్యథాకులులైన లోకులను కష్టనివారణ మొనర్చి రక్షించుటకు మహావిష్ణువు మానవావతార మెత్తెను. బ్రహ్మ యిచ్చిన వరము ననుసరించి రావణుడు మానవేతరులచే వధింపబడడు. దశరథుడు పితృత్వమున కర్హుడని నిశ్చయించి విష్ణు వాతని పుత్రుడై జన్మించెను. అగస్త్యుడు శ్రీరామున కిచ్చిన ధనువు వైష్ణవధనువు. రావణు డింద్రునిపై దండెత్తినపుడు విష్ణు వతని కభయమిచ్చి, సమయము వచ్చినపుడు తాను రావణుని వధింతునని చెప్పెను. దేవదానవ యుద్ధసమయమున భృగుపత్ని దానవుల కాశ్రయమిచ్చినందున విష్ణు వామె శిరసు ఖండించెను. తత్ఫలితముగా నతనికి భృగు విచ్చిన శాప మనుభవింపనయ్యెను. కాని అతనికి వచ్చిన శాపము లోకులకు వరముగా మారెను. వృత్రాసురవధకై తన యంశ మొకటియు, వజ్రాంశ మొకటియు, భూతలాంశ మొకటియు నిచ్చి యింద్రునిచే వృత్రుని వధింపజేసెను. ఇంద్రుని బ్రహ్మహత్య వెన్నాడగా అతనిచే విష్ణుయాగ మొనర్పజేసెను. శ్రీరాముడు సశరీరుడుగనే వైష్ణవతేజమున లీనమాయెను. లక్ష్మి యీయన భార్య.

## 128. వేదవతి

కుశధ్వజుడైన జనకునికి మాలావతియందు కల్గిన కన్య వేదవతి. ఈమె పుట్టినతోడనే వేద ముచ్చరించెను. అందువలన వేదవతి యనబడెను. కుశధ్వజు డీమెను విష్ణున కిచ్చి వివాహము చేయనెంచెను. ఈమె అన్యులను నిరాకరించెను. కాని శంభుడను రాక్షసుడు దీనికి కోపించి కుశధ్వజుని సంహరించెను. ఈమె తల్లి సహగమనము చేసెను. అప్పు డీమె పుష్కరతీర్థ మేగి తపము చేయదొడగెను. ఆకాశవాణివలన నీమెకు మరుజన్మలో విష్ణువు భర్త కాగలడని తెలియవచ్చెను. రావణు డీమెను తనకు భార్య కాగోరెను. అందుకు అంగీకరింపని కారణమున బలవంతముగా ఆమె కేశపాశమును పట్టి లాగెను. ఆమె తన కేశములు త్రెంచుకొని, అగ్నిప్రవేశము చేసెను. తపోవ్యయమునకు వెరచి, అగ్నిప్రవేశమునకు పూర్వ మీమె రావణునకు శాప మీయలేదు. కాని అప్పు డామె పలికిన వచనములు శాపతుల్యములైనవి.

## 129. శతానందుడు

ఇత డహల్యా గౌతముల జ్యేష్ఠపుత్రుడు. విశ్వామిత్రు నితడు 'మా తల్లి

దండ్రుల గురించి రామునికి పూర్తిగా తెలియజేసిరా?, యనియు, 'వారు తిరిగి కలిసినారా?' యనియు నడిగెను. ఇట్టి వింకను ప్రశ్నించి యితడు రామునికి విశ్వామిత్రుని తపోబలాదులను గూర్చి విస్తారముగా వర్ణించి చెప్పెను. ఇతడు జనకుని పురోహితుడు. సీతాశపథగ్రహణసమయమున నిత డా సభలో నుండెను. రాముని వివాహకాలమున నితడే పౌరోహిత్యము నిర్వర్తించెను.

## 130. శత్రుఘ్నుడు

ఇతడు సుమిత్రాదశరథుల పుత్రుడు. భరతు డితనికి ప్రాణముల కన్న మిన్న. ఇత డెప్పుడును భరతునితోనే కలిసి యుండెడివాడు. భరతుడు తాతగారి యింటినుండి అయోధ్యకు వచ్చిన పిదప, ఇచ్చటి విషయములన్నియు తెలిసినవి. దీని కంతటికి మూలకారణము మంథరయే యని తెలియగనే శత్రుఘ్నుడు కోపము పట్టజాలక ఆమెను చంపబోయెను. కాని భరతు డడ్డుపడెను. భార్యమాటలపై కొడుకు నడవికి పంపిన రాజుపైనను, అన్నియు చూచుచు చేతులు ముడుచుకొని కూర్చొనిన లక్ష్మణునిపైనను కూడ శత్రుఘ్నుడు దోష మారోపించెను. లవణాసురుని వధించిన పిదప ఇతడు మధురను తన రాజధానిగా జేసికొని పాలించెను. పన్నెండేం డ్లచ్చట రాజ్యముచేసి రాముని వద్దకు తిరిగి వచ్చెను. ఇతడు రామునివద్దనే యుండదలచెను. కాని రాము డితనిని శూరసేనక్షేత్రముననే యుండదగు నని నచ్చచెప్పి తిరిగి పంపివేసెను. రాముని అశ్వమేధావసరమున నిత డశ్వరక్షకుడుగా పోయెను. తన జీవనావధి ముగియనున్నదని తెలిసినంతనే యితడు తన రాజ్యమును పుత్రులకు పంచియిచ్చెను. ఇతడు రామునితోపాటుగా సరయూతటమున గోప్రతారతీర్థమున దేహత్యాగ మొనర్చెను.

## 131. శబరి

పంపాసరోవరము పశ్చిమతటమందున్న మతంగవనమున శబరి వసించుచుండెను. ఈమె రామభక్తురాలు. అరణ్యములోని పండ్లేరి రాముని కిచ్చినది. అతని కా వనప్రదేశములు పరిచయము చేసినది. అగ్నిప్రవేశ మొనర్చి స్వర్గము చేరుకొన్నది.

## 132. శంబరుడు

దండకారణ్యమున గల వైజయంతనగరపాలకుడైన తిమిధ్వజునకు శంబరుడని మారుపేరు. దేవాసురయుద్ధములో నితడు అసురుల పక్షము వహించి యింద్రునితో పోరాడజొచ్చెను. ఇంద్రుడు దశరథుని తన సహాయార్థము పిలిచెను. దశరథు డా యుద్ధములో తీవ్రముగా గాయపడెను. అప్పు డతని భార్య కైక నేర్పుగా సారథ్యము నెరపి పతిప్రాణములు కాపాడెను.

## 133. శరభంగుడు

ఇతడు దండకారణ్యమున తపస్సుచేయుచుండిన గౌతమకులీయుడైన బ్రహ్మర్షి. విరాధవధానంతరము, విరాధుని సలహాపై రాము డితని యాశ్రమమునకు వచ్చెను. ఆ సమయమున నింద్రు డచ్చటికి వచ్చెను. రథాశ్వములవలన నత డింద్రు డని గుర్తింపగలిగినట్లు రాముడు సీతాలక్ష్మణుల కెరిగించెను. ఇంద్రుడు మరలిపోయిన పిదప రాముడు శరభంగుని దర్శించి అతనిని ఇంద్రాగమనమును గురించి యడిగెను. 'నాకు తపఃప్రాప్తములైన బ్రహ్మలోకాది ఉత్తమలోకములకు తీసికొనిపోవుటకు దేవేంద్రు డచ్చటికి వచ్చెనని చెప్పి, నీ కాతిథ్య మియ్యనిదే నే నతనివెంట పోదలచలేదు.' అని చెప్పెను. తాను సంపాదించిన బ్రహ్మ లోకమును రాముని కీయదలచెను. కాని రాముడు స్వయముగనే వాటిని సంపాదింప యత్నింతునని సవినయముగా తెలియజేసెను. శరభంగుడు రాముని యెదుటనే అగ్నిముఖమున బ్రహ్మలోక మరిగెను.

## 134. శర్మిష్ఠ

ఈమె దైత్యరాజైన వృషపర్వుని కుమార్తె. దైత్యగురుడైన శుక్రాచార్యుని కుమార్తె దేవయాని యీమెకు సపతి. దేవయానితో జగడమాడి ఈమె ఆమెను నూతిలో త్రోయించెను. శుక్రు డిందుపై కోపించెను. జాతి ననుసరించి యీమె దేవయానికి దాసిగా యయాతిపద్ద కరిగెను. శుక్రుడు యయాతిని శర్మిష్ఠతో సహశయనము వలదని శాసించెను. కాని ఆమెకు యయాతివలన ముగ్గురు పుత్రులు జన్మించిరి. రామాయణములో పురుడొక్కడే పుత్రుడుగా చెప్పబడెను. యయాతి యీమెను చాల వలచుచుండెను.

## 135. శిబి

ఇతడు మాధవీ ఉశీనరుల పుత్రుడు. మత్స్య బ్రహ్మాండ వాయు పురాణములలో నితని తల్లిపేరు దృషద్వతి యని యున్నది. ఇతడు మంత్రద్రష్ట. ఇతనిని పరీక్షించుటకు అగ్ని పావురముగను, ఇంద్రుడు డేగగను మారిరి. డేగనుండి కాపాడుమని పావురము శిబిని శరణువేడెను. శరణమిచ్చి శిబి పావురమును కాపాడెను. డేగ నా కాహారమైన పావురమును విడిచి, లేదా దాని బరువున్న నీ శరీరమాంసము నాకిచ్చి ఆకలి తీర్పుమనెను. శిబి తన శరీరమాంసమును పూర్తిగా కోసి యిచ్చుటతో ఇంద్రాగ్నులు నిజరూపమున ప్రత్యక్షమై అతనిని ప్రశంసించిరి. శిబిమహత్త్వమును గూర్చి ఎన్నో కథలున్నవి. ఇంద్రు డొకప్పుడు తన పదవి నితని కప్పగించెను. ఇతడు సంపన్నుడు, ఉదారుడు, వీరుడు, శ్రేష్ఠుడునైన రాజు. యయాతికి స్వర్గప్రాప్తికై యిత డంతరిక్షప్రదేశము నతని కిచ్చెను. పద్మపురాణములో బ్రహ్మయజ్ఞమున నితడు ప్రతిష్ఠాతగా పేర్కొనబడెను.

## 136. శుకుడు

ఈ రాక్షసుడు రావణునివద్ద మంత్రిగా నుండెను. సారణునితో కలిసి యితడు గుప్తచరుడుగా వ్యవహరించుచుండెను. ఇతడు మొదట బ్రాహ్మణుడు. అగస్త్యు డితనిని మాంసాశన మర్థించెను. వజ్రదంష్ట్రు డది విని యితని స్త్రీరూపమున వచ్చి నరమాంస మతనికి వడ్డించెను. అది గమనించి అగస్త్యు డితనిని రాక్షసుడుగా శపించెను. కాని శ్రీరాముని దర్శనము చేసి రావణున కుపదేశము గావించినచో శాపముక్తి కలుగునని చెప్పగా అట్లు ముక్తుడయ్యెను. రావణుడు రాముని సేనలోని కితనిని గుప్తచరుడుగా నంపెను. రామసుగ్రీవుల సేనాబలము గ్రహించి యితడు రావణునికి స్పష్టముగా నివేదించెను. విభీషణు డితనిని పోల్చుకొనెను. కాని రాము డితనిని సేన నవలోకింప ననుమతించెను. అట్లే 'చావునకు సిద్ధము కమ్ము'ని రావణున కితనిచే సందేశమంపెను. శ్రీరామునికి జయవాదము చేసి, రావణునితో నితడు రాముని జయించుట అసాధ్యమని చెప్పెను. అది విని రావణుడు శుకునిపై కోపించెను. తన కొలువు విడిచి పొమ్మనెను.

## 137. శుక్రాచార్యుడు

మత్స్య పద్మ పురాణముల ననుసరించి యితడు వారుణీభృగు పులోమల పుత్రుడు. బ్రహ్మాండపురాణము ననుసరించి భృగునకు దివ్యయందు కల్గిన ఏకైకపుత్రుడు శుక్రుడు. విభిన్నగ్రంథములలో విభిన్నముగా తల్లిదండ్రుల పేర్లున్నను శుక్రుడు, ఉశనసుడు, కావ్యుడు, భార్గవుడు అను పేర్లన్నియు శుక్రాచార్యునికే అన్వయించును. భార్గవు డనునది కుల (వంశ) నామము. రామాయణములో దండుని కథలోను, దండకారణ్యావృత్తాంతములోను వినవచ్చు భార్గవుడు శుక్రాచార్యుడే. ఇతడు దానవుల పురోహితుడు. ఇతనికి భృగునివలన సంజీవనీ విద్య లభించెను. దేవదానవయుద్ధములలో దానవుల కీ విద్యవలన లాభము కలిగినది. దేవగురువైన బృహస్పతి కుమారుడు కచుడు సంజీవనీవిద్య నేర్చుటకై శుక్రు నాశ్రయించెను. అతని కా విద్య లభించినది, కాని దేవయాని శాపముచే అది అతనికి ఫలించలేదు. వామనునికి భూదానము చేయబోవుచున్న బలిని నివారింపబోయి యితడు కమండలురంధ్రము నడ్డగించెను. ఇతని కుమార్తె దేవయాని యయాతి భార్య. ఆమెను సరిగా చూడలేదని శుక్రాచార్యుడు యయాతిని వృద్ధు డగునట్లు శపించెను.

శుక్రుడు దండుని వద్ద పురోహితుడుగా నున్నప్పు డొకసారి, యితని కుమార్తెయైన అరజను దండుడు బలాత్కరించెను. అందులకు కుపితుడై దండుని, అతని నివాసస్థానమైన దండకావనమును గూడ శపించెను. ఆశ్రమవాసు లందరినీ బయటకు పంపించి ఏడు దినములవరకు అచ్చట ఇంద్రునిచే ధూళివృష్టి కురిపించెను. దండుడు చనిపోయెను. అతని రాజ్యము దండకారణ్యా మయ్యెను.

శుక్రుడు కొన్ని వేదసూక్తములకు కర్త. వేలాది సంవత్సరములు తపస్సుచేసి శివుని మెప్పించెను. అతనివలన ప్రజేశత్వ, ధనేశత్వ, అవధ్యత్వములు వరములుగా బడసెను. ఇతడు ధర్మశాస్త్రకర్త. ఉశనసధర్మశాస్త్రము, ఔశనసస్మృతి అను గ్రంథము లితని పేరున లభించుచున్నవి. శుక్రనీతి యితడు వ్రాసిన రాజనీతి విషయకమైన గ్రంథము. శతపర్వ, ఆంగి, ఊర్జస్వతి, జయంతి, గోవు మున్నగు వా రితని భార్యలు. దేవయాని జయంతివలన కలిగెను. శుక్రుని సంతానము బహుళము.

## 138. శునఃశేపుడు

ఇతడు భార్గవఋచీకుని మధ్యమపుత్రుడు. హరిశ్చంద్రునకు పుత్రప్రాప్తి కలుగనందున అతడు వరుణునితో నాకు పుత్రుడు కల్గినచో నీకు బలియిచ్చెద నని వాగ్దానము చేసెను. పుత్రుడు కలిగెను. కాని బలియిచ్చుట కతడు వెనుదీయుచు ఏవేవో సాకులు చెప్పదొడగెను. అతని పుత్రునిపేరు రోహితుడు. బలి యిచ్చెదరన్న విషయము తెలిసి అతడు పారిపోయెను. హరిశ్చంద్రునికి ఉదరరోగ మంకురించెను. ఆ స్థితిలో బలియిచ్చుటకు ఋచీకుని వద్ద శునఃశేపుని కొని తెచ్చుచుండగా విశ్వామిత్రు డతనిని బలివేదికనుండి తప్పించి రక్షించెను. విశ్వామిత్రు డితనిని పుత్రసమానుడుగా స్వీకరించి, దేవరాతుడని పేరుపెట్టెను. ఈ కథ ఐతరేయబ్రాహ్మణములో వర్ణింపబడినది.

మరికొన్ని గ్రంథములు కూడ ఈ కథను వర్ణించెను. కాని కొన్ని మార్పులున్నవి. శునఃశేపుడు తన మేనమామ యగు విశ్వామిత్రుని చూచి తన ప్రాణములు కాపాడుమని వేడుకొనెను. అప్పు డత డితనికి రెండు గాథ లుపదేశించి యాగయూపమువద్ద చేర్చినపుడు వాటిని జపింపుమని చెప్పెను. అట్లే అగ్నిని స్తుతింపుమని చెప్పెను. శునఃశేపునికి రక్తవస్త్రములు కట్టి అతనిని యాగయూపమున బంధించిరి. శునఃశేపుడా గాథలు జపించి యింద్రుని, విష్ణువును స్తుతించెను. వారు ప్రసన్నులైరి. ఇంద్రు డతనికి దీర్ఘాయువిచ్చెను.

## 139. శ్రవణకుమారుడు

శ్రవణుడను బ్రాహ్మణుడు కురుజాంగలదేశమున వసించుచుండెను. అతని భార్యపేరు కుండ. కొడుకు శ్రవణకుమారుడు. అతని తమ్ముడు కురంటకుడు ఆచారహీనుడు. పద్మపురాణములో చెప్పిన దానిని బట్టి, ఒకసారి యొక గోవును బురదలో కూరుకుపోయినదాని నుద్ధరించుటచే వీరందరును ముక్తులైరి. వాల్మీకి రామాయణములో శ్రవణకుమారుని పేరు చెప్పబడలేదు. కాని బ్రహ్మపురాణములో నతనిపేరు శ్రవణుడని వ్రాయబడెను. పుత్రశోకమున విలపించుచూ నతడు తన పుత్రుని బ్రాహ్మణు డనక బ్రాహ్మణసమానుడని పల్కెను. దీనివలన నతడు బ్రాహ్మణుడు కాడేమో అనిపించుచున్నది. శ్రవణకుమారునికి మర్మస్థానమున బాణము తగిలినందున దశరథుడు తనకు బ్రహ్మహత్య చుట్టుకొనునని భయపడెను. ఆ సమయమున శ్రవణకుమారు డతనితో నిట్లనెను.

న ద్విజాతిరహం రాజన్ మా భూత్తే మనసో వ్యథా
(అయోధ్య 62/50)

శూద్రాయామస్మి వైశ్యేన జాతో నరవరాధిప. (అయోధ్య 63/51)

రాజా! నేను బ్రాహ్మణుడను కాను. నీవు బ్రహ్మహత్య జరిగెనని చింతింపకుము. మహారాజా, నా తండ్రి వైశ్యుడు. తల్లి శూద్రస్త్రీ.

## 140. సంపాతి

బ్రహ్మాండపురాణములో నిత డరుణునికి గృధ్రికి పుట్టినవాడని చెప్పబడెను. వాయుపురాణము ననుసరించి యితని తల్లి నాగశ్యేని. ఇతడు తన తమ్ముడు జటాయువుతో కలిసి నిశాకరమునిని సేవించుచుండెడివాడు. వృత్రాసురుని సంహరించి స్వర్గము వీడి పోవుచున్న యింద్రునితో నితడు యుద్ధము చేసెను. ఒకసారి యితడును, తమ్ముడును ఎవరెక్కువ ఎత్తున కెగురగలరో యని పందెమాడిరి. కాని కొంతసేపటికి జటాయు వలసిపోయి క్రింద పడజొచ్చెను. అప్పుడితడు తన రెక్కలతో కప్పి జటాయువును కాపాడెను. కాని ఆ ప్రయత్నములో సూర్యరశ్మివలన నితని రెక్కలు కాలిపోయెను. ఇతడు వింధ్యమునకు దక్షిణమున సముద్రతీరమున పడిపోయెను. జటాయువు జనస్థానమున పడెను. తర్వాత తన స్థితికి వగచి యిత డాత్మహత్య చేసికొనబోవుచుండగా నిశాకరముని యితనిని వారించి, కొంతకాలమునకు నీవలన రామకార్యము జరుగునని చెప్పెను. వానరులవలన జటాయువు మరణించినట్లు విని, యితడు అంగదుని సహాయమున సముద్రజలములతో జటాయువునకు తర్పణము లిచ్చెను. నిశాకరముని వరమువలన నితనికి తిరిగి రెక్కలు వచ్చెను.

## 141. సంవర్తుడు

ఇత డంగిరసుని పుత్రులలో నొకడు. నారదుని సలహాపై మరుత్తు యితనిని తన పురోహితునిగా స్వీకరించెను. ఇంద్రు డాతని యజ్ఞమున విఘ్నము కలిగించు భారము నగ్ని కప్పగించెను. కాని సంవర్తుడు శపించునని భయపడి అగ్ని వెనుదిరిగెను. సంవర్తుని సహాయమున మరుత్తుని యజ్ఞము నిర్విఘ్నముగా కొనసాగెను.

## 142. సగరుడు

భృగువంశ్యుడైన చ్యవనముని ఆశీర్వాదమున అసితునకు కాళిందియందు సగరుడు జన్మించెను. కాళింది గర్భము ధరించియుండగా సవతి యామెకు విషము పెట్టెను. కాని విషమువలన నెట్టి ప్రాతికూల్యమును జరుగలేదు. విషసహితముగనే (స+గర) పుట్టుటచే నితనికి సగరుడని పేరు వచ్చెను. పరాక్రమశాలీ, సత్యశీలి, ధర్మాత్ముడు, దాత, ఆలోచనాపరుడు నయిన యీ రాజునకు కేశిని, సుమతి యను నిర్వురు భార్య లుండిరి. కేశినికి అసమంజుడు పుట్టెను. అతడు దుర్మార్గు డగుటచే సగరు డతనిని దేశమునుండి వెడలనడపెను. సగరుడు అశ్వమేధము చేయుచుండగా ఇంద్రు డతని యజ్ఞాశ్వము నపహరించెను. అశ్వమును వెదకుచు సుమతి పుత్రులు అరువదివేల మంది పోయి కపిలాశ్రమమున దానిని కనుగొనిరి. కాని కపిలుని కోపముచే భస్మీభూతులైరి. సగరుని మనుమడైన అంశుమంతుడు అశ్వమును తెచ్చిన సగరుని యజ్ఞమును నిర్విఘ్నమొనర్చెను.

## 143. సారణుడు

ఇతడు లంకలో నొక రాక్షసుడు. రాముని సేనలో శుకునితో కలిసి గుప్తచరుడుగా పోయి, వానరరూపు ధరించి యుండగా పట్టుపడెను. ఇతడు రావణునివద్ద మంత్రిగా నుండెను. కాని రాముని జయించుట దుష్కరమని చెప్పినందున రావణు డితనిని పదభ్రష్టుని జేసెను.

## 144. సాలకటంకట

ఈమె విద్యుత్కేశుని భార్య. ఈమె తల్లి సంధ్య. విద్యుత్కేశునివలన గర్భమంది యీమె ఆ గర్భమును జారవిడిచెను.

## 145. సీత

సీరధ్వజుడగు జనకుని పుత్రి యగుటచే నీమెకు జానకి యనియు, భూమి దున్నుచుండగా నాగేటికొనకు తగిలి బయల్పడినందున భూజాత యనియు, సీత యనియు నామము లేర్పడెను. పూర్వజన్మమున నీమె వేదవతి. మండోదరికి పుత్రిక. అయోనిజ అనియు చెప్పుదురు. వివాహాయోగ్యయగు నీమెను జనకుడు శివధనుస్సుకు నారి సారించిన వీరున కీమె నిత్తునని

స్వయంవరము చాటించెను. రావణు డా స్వయంవరమున కేగెను. కాని ధనుస్సు నెత్తజాలకపోయెను. తర్వాత రాము డా ధనుస్సును భంజించెను. దశరథు ననుమతి నంది జనకుడు రామునితో సీతకు వివాహ మొనర్చెను. సీత సుందరి, బుద్ధిమంతురాలు, నిష్ఠగలది, శ్రీరాము నత్యధికముగా ప్రేమించి అతని సుఖదుఃఖములలో పాల్గొనుచుండెడిది. రాముని రాజ్యాభిషేకవార్త విని యీమె చాల సంతసించెను. కాని అట్టి సంతసముతోనే యీమె రామునితోపాటు వనవాస మేగెను. ఈమె పతిని దైవముగా భావించెడిది. ఈమె పతినిష్ఠను కౌసల్యయు, అనసూయయు చాల మెచ్చుకొనిరి. వనములో సంన్యాసవృత్తిలో నున్నప్పుడు మునులను రక్షింపనెంచినను, రాక్షసవైరము తగదని యీమె రామునికి విన్నవించెను. హనుమంతునితో కలిసి లంకనుండి వచ్చుట కీమె యిష్టపడలేదు. తాను స్వయముగా పరపురుషస్పర్శ నంగీకరింపననియు రావణుడు బలపూర్వకముగా తనను స్పృశించి తెచ్చెననియు హనుమంతుని కీమె స్పష్టము చేసినది. విరాధుడు నట్లే బలవంతముగా నీమె నెత్తుకొని పోయెను. కాని తానై పరపురుషు నంటలేదని చెప్పెను. లక్ష్మణుడు సేవావ్రతి, శుద్ధాచరణశీలి, నిష్ఠావంతుడు, నిష్పాపుడు నని యెరిగియు నీమె రాముని వెదకుటకై పోవుటకు సిద్ధముకాని లక్ష్మణుని నిందించినది. ఇది సీతకు శోభాదాయకముకాదు. స్వర్ణమృగలోభము స్త్రీసహజము, కాని యామె కది ప్రాణసంకట మాయెను. శ్రీరామునియందలి పతిభక్తిచే నీమె లంకలో కాలము గడపుచుండినది. రావణు డెప్పుడు బలాత్కరించునో, లేక ప్రాణములే హరించునో అని సదా భయపడుచుండెడిది. రావణుని చేతిలో మరణించుటకు బదులు ఆత్మహత్య చేసికొనుట మేలని యెంచి ప్రయత్నించినది. కాని బ్రహ్మ యింద్రునిద్వారా యీమెకు హవిష్యాన్న మంపి, ఆ ప్రయత్నము నాపి దేవకార్యమునకు సహాయపడుమని ప్రోత్సహించెను. రావణవధానంతర మీమె రాముని వెంటనే చూడగోరినది. కాని శ్రీరాముడు కఠినముగా మాటాడి ఈమె కుత్సాహభంగము గావించెను. అయినను రాముని తప్ప వేరొక పురుషుని మనసులోనైనను తలపలేదని, తన శుద్ధతను అగ్నిపరీక్ష యిచ్చి ప్రమాణీకరించెను. దోహదపూర్తికై అడిగి వరమిచ్చియు రాము డీమెను లోకాపవాదకారణమున పరిత్యజించెను. దుఃఖితాత్మ యగు సీతను వాల్మీకి ఆదరించెను. అతని ఆశ్రమములో నీమె కుశలవులను ప్రసవించెను. ఆ దినమున శత్రుఘ్నుడు వాల్మీకిముని యాశ్రమమున నుండెను. రాజసభలో వాల్మీకి సీతాశుద్ధతను గూర్చి ప్రమాణము చేసెను.

సీత భూదేవికి చేతులు జోడించి, 'నేను రాముని తప్ప అన్యుని చింతింపకున్నది సత్యమైనచో భూదేవి నాకు తన యొడిలో తావిచ్చుగాక. నేను త్రికరణ శుద్ధిగా రాము నారాధించుచుంటినేని భూమాత నాకు తనయొడిలో స్థానమిచ్చుగాక. రాముని తప్ప అన్యుడైన పురుషుని నే నెరుగ నన్నమాట సత్యమైనచో భూదేవి నాకు తావిచ్చుగాక.' అని పలికినది. ఇట్లు ప్రమాణము చేసి ఆమె తన చరిత్రమును మహోజ్జ్వల మొనర్చెను. కర్తవ్యనిష్ఠలో ఈమె రాముని కే మాత్రమును తీసిపోలేదు.

## 146. సుకేతువు

ఇత డొక గొప్ప యక్షుడు. తాటక యితని పుత్రిక.

వేరొక సుకేతుని గూర్చిన యుల్లేఖము కలదు. ఇతడు సుబాహుని సోదరుడు. అశ్వమేధసందర్భమున శత్రుఘ్నసుబాహులకు యుద్ధము జరిగెను. అపుడు సుకేతు వచ్చట నుండెను. అతడు గదాయుద్ధప్రవీణుడు.

## 147. సుకేశుడు

ఇతడు విద్యుత్కేశసాలకటంకటల పుత్రుడు. ఇతడు పుట్టగనే తల్లిచే విడువబడెను. శివపార్వతులు వీనిని పెంచిరి. వా రితని కొక విమానమిచ్చిరి. దానిపై నితడు సర్వత్ర నిరాబాధముగా సంచరించుచుండెను. గంధర్వుడగు గ్రామణి పుత్రిక యగు దేవవతి నితడు పెండ్లాడెను. ఆమెయం దితనికి మాల్యవంతుడు, మాలి, సుమాలి యను పుత్రులు కలిగిరి.

## 148. సుగ్రీవుడు

ఋక్షరజస్సు అను వానరుని కంఠమునుండి ఉద్భవించినందున నితనికి సుగ్రీవు డను పేరు వచ్చినది. వాలి యితని అన్న. చాలకాలము వీరు మైత్రితో మెలగిరి. కాని దుందుభి కుమారుడైన మాయావితో యుద్ధమునకు పోయిన సందర్భమున భ్రాంతిచే పరస్పరవిశ్వాసము సడలిపోయి వీరికి వైరమయ్యెను. వాలి సుగ్రీవుని భార్య రుమ నపహరించి, సుగ్రీవుని రాజ్యము నుండి వెడలి గొట్టెను. అది మొదలు సుగ్రీవుడు ఋశ్యమూకముపై నివసింపదొడగెను. అక్కడే యితనికి రామలక్ష్మణుల పరిచయము కలిగెను. హనుమంతుని

ప్రయత్నముచే వీరి కగ్నిసాక్షిగా మైత్రి యేర్పడెను. సుగ్రీవుడు వాలి పరాక్రమమును గూర్చి సోదాహరణముగా నివేదించెను. రాము డొకే బాణముతో సప్తతాళములను తెగవేసి తన బలము నిరూపించెను. వాలిని చంపుటకు రాముడు సుగ్రీవున కవకాశము కల్పించెను. సుగ్రీవుడు వాలితో పోరలేక పారిపోయెను. రాముడు బాణప్రయోగము చేసి వాలిని మూర్ఛిల్లజేసెను. వాలివధానంతరము అతని భార్య తార మిగుల విలపించెను. సుగ్రీవునికి పశ్చాత్తాపము కల్గెను. రాముడు సుగ్రీవు నోదార్చి, అతనిచే వాలికి అంత్యేష్టి నిర్వర్తింపజేసెను. వాలి యంతిమేచ్ఛ ననుసరించి సుగ్రీవు డంగదుని పుత్రప్రేమతో జూడ దొడగెను. కాని అంగదునికి సుగ్రీవునిపై పూర్తినమ్మకము కలుగలేదు. వాలిభార్య తార సుగ్రీవుని పత్నియైనది. రాజ్యము గ్రహించిన పిదప కొద్ది కాల మతడు కామోపభోగములలో గడపెను. కర్తవ్యము మరచినందున హనుమంతు డతనికి రాముని విషయము జ్ఞప్తికి తెచ్చెను. ఆ పిదప సుగ్రీవుడు సీతాన్వేషణమునకై నాలుగు దిక్కులకు వానరులను పంపెను. ఇతనికి భూఖండ మంతయు తెలియును. మొదట ఆలసించినందుకు లక్ష్మణు డుగ్రుడై వచ్చి సుగ్రీవుని త్రోవకు దెచ్చెను. సీతను వెదికి హనుమంతుడు తిరిగి వచ్చిన పిదప సుగ్రీవుడు ససైన్యముగా రామునితో నరిగి యుద్ధములో రామునికి సర్వవిధముల తోడ్పడెను. విభీషణుడు రాముని శరణు వేడ వచ్చినపు డితడు అతనికి స్వీకరింపవలదని చెప్పెను. రావణుని చూడగనే ఉగ్రుడై వాని మీదికి దూకి, కిరీటము నెగురగొట్టి మల్లయుద్ధ మొనర్చెను. రామలక్ష్మణులు మూర్ఛనొందగా భయపడి పారిపోవుచున్న వానరుల కితడు ధైర్యము చెప్పి, వారిని మరలించెను. రావణకుంభకర్ణులతో యుద్ధముచేసి యితడు మూర్ఛలో మునిగెను. కుంభకర్ణు డితనిని పట్టుకొని లంకకు పోబోయెను. కాని యితడు పట్టు విడిపించుకొనెను. కుంభకర్ణవధానంతరము రావణుడు లంకాద్వారము లన్నియు మూయించెను. అప్పు డితడు వానరులచే లంక కాల్పించెను. కుంభకర్ణుని పుత్రుడైన కుంభు డితనిచేత వధింపబడెను. విరూపాక్షమహోదరు లితని చేతిలో మరణించిరి. రావణవధానంతర మితడు రామునితో అయోధ్యకు వచ్చి, పట్టాభిషేకసమయమున సత్కరింపబడెను. చిరకాలము రాజ్యమేలి రాముని మహాప్రస్థానసమయమున తానును రాజ్య మంగదుని కిచ్చి రామునితో పాటుగా నాత్మత్యాగమొనర్చి సుగ్రీవుడు సూర్యమండలములో ప్రవేశించెను.

## 149. సుతీక్ష్ణముని

ఇత డగస్త్యుని శిష్యుడు. రామకుండమున తపస్సుచేసి యితడు ముల్లోకముల విహరింపగల సామర్థ్యము గడించెను. రాము డితని యాశ్రమమునకు రెండుమారులు వచ్చెను. శరభంగుడు చెప్పగా రాము డితనిని దర్శించెను. ముని అతనిని స్వాగతసత్కారములతో పూజించెను. అగస్త్యాశ్రమమును గూర్చి రాముని కితడు మార్గాదు లెరింగించెను.

## 150. సుందోపసుందులు

వాల్మీకి రామాయణములో సుందోపసుందులు జంభుని పుత్రులని చెప్పబడెను. అగస్త్యుని శాపముచే జంభుడు రాక్షసు డాయెను. మహాభారతములో వీరు హిరణ్యకశిపుని వంశమునకు చెందిన నికుంభుని పుత్రులుగా పేర్కొనబడిరి. వీరు వింధ్యపర్వతముపై ఘోరముగా తపస్సుచేసి బ్రహ్మను ప్రసన్నుని చేసికొనిరి. వీరు మాయ, అస్త్రములు, అసమానపరాక్రమము, కామరూప కామగమనములు, పరస్పరయుద్ధములో మరణించువరకు అమరత్వము వరములుగా బడసిరి. ఇతరులకు వీ రవధ్యులు. వరగర్వమున వీరు ఋషీశ్వరులను బాధింపదొడగిరి. వీరినిగురించి బ్రహ్మతో చెప్పగా నతడు వీరిలో వీరికి వైరభావ ముదయింప జేయుటకు విశ్వకర్మతో చెప్పి, మహారూపవతి యగు స్త్రీని నిర్మింపజేసెను. విశ్వకర్మ ప్రతిపదార్థమునుండియు తిలప్రమాణముగా సౌందర్యము గ్రహించి ఆ సుందరిని సృజించెను. ఆమెయే అప్సరస తిలోత్తమ. ఆమెను కాంక్షించి సుందోపసుందులు తమలో తాము కొట్లాడి చివర కిరువురును మరణించిరి. తాటక సుందుని భార్య.

## 151. సుమతి

ఈమె విదర్భరాజపుత్రి సగరుని ద్వితీయపత్ని. పద్మపురాణము ననుసరించి ఔర్వుని కృపవలన నీమెకు అరువదివేలమంది పుత్రులు కలిగిరి. మహాభారతములో శివు డీమె కొక దోసపం డిచ్చినట్లును అందలి బీజములన్నియు అరువదివేల పుత్రులుగా పుట్టినట్లును చెప్పబడెను. బ్రహ్మవైవర్తపురాణము ననుసరించి శంకరుని వరముచే నూరేండ్ల పిదప ఈమె కొక మాంసపిండము కలుగగా నందుండి అరువదివేల పుత్రు లుదయించిరి.

## 152. సుమంత్రుడు

ఇతడు దశరథుని అష్టప్రధానులలో నొకడు. పైగా, ఇతడు దశరథుని సారథియు వందియు కూడ. వనవాస మేగుచున్న రాముని కితడు రథము నడపెను. ఋత్విక్కులచే తాను పూర్వము వినిన భవిష్యవాణి ననుసరించి యితడు దశరథున కేకాంతముగా నా విషయము చెప్పి అతనికి పుత్రులు కల్గుదురని ధైర్యము చెప్పెను. రాముడు వనములో నిల్చి యితనిని వెనుకకు పంపుచు తల్లిదండ్రుల కితనిద్వారా సందేశ మంపెను. ఆ సందర్భమున నితడు 'నే నీ శూన్యరథమును గొని ఏ మొగముతో అయోధ్య కేగగలను? ప్రజల కది చూసి ఎంతయో దుఃఖము కలుగును. అదిగాక, ఈ గుర్రములు నీవు లేని రథము నెట్లు లాగును? కనుక నేను నిన్ను విడిచి అయోధ్య కేగుట కిచ్ఛగింపను' అని చెప్పెను. ఈ మాటలలో సుమంత్రునికి శ్రీరాముని పట్లగల శ్రద్ధాభక్తులు స్పష్టమగుచున్నవి. కాని రాము డెట్లో నచ్చజెప్పి యితని నయోధ్యకు పంపెను. అయోధ్య చేరునప్పు డితడు తన ముఖము కప్పుకొనెను. దశరథునకు జరిగిన దంతయు చెప్పి యితడు కౌసల్య నూరడించెను. రామాశ్వమేధావసరమున నితడు శత్రుఘ్నుని వెంట నుండెను. శ్రీరాముని అడవికి పంపవలెనని పంతగించిన కైక నితడు కఠోరముగా నిందించెను. ఆమె పట్టుదల వలన జరుగబోవు దుష్పరిణామముల నితడు స్పష్టముగా పేర్కొనెను.

## 153. సుమాలి

ఇతడు లంకానివాసియైన రాక్షసుడు. రావణుని తాత. ఇతని భార్య కేతుమతి. ఇతని కుమార్తె కైకసి లేదా కేసిని. ఈమె కాక రాక, పుష్పోత్కట, బలాక యను పుత్రికలు నుండిరి. వీరు విశ్రవసుని వరించిరి.

సుమాలి సుకేతుని ద్వితీయపుత్రుడు. ఇతడు తపస్సుచేసి బ్రహ్మను మెప్పించెను. ప్రహస్తుడు, అకంపనుడు మున్నగు పదకొండుమంది యితని పుత్రులు. కుబేరుని చూచి, అతని వలె వైభవశాలి కావలెనని కోరి, యితడు తన కూతురు కైకసితో విశ్రవసుని వరింపుమని చెప్పెను. అట్లయినచో వైశ్రవణునివంటి పుత్రు లుదయింతురని అతని ఆశయము. రావణాదులకు వరప్రాప్తి కల్గెనని విని యితడు రసాతలము విడచి లంకకు వచ్చి రావణునితో నిట్లనెను - 'నాయనా, ఇప్పు డిక రాక్షసులకు విష్ణునివలన భయములేదు. ఇప్పుడు లంక రాక్షసుల నగరైనది. ప్రస్తుతమది కుబేరుని అధీనమున నున్నది.

దానిని వెంటనే నీవు గ్రహింపుము.' హనుమంతు డితని యిట్లు కాల్చెను. దేవ దానవయుద్ధములో సావిత్రవసు వతనిని వధించెను. ఇతని చేతి గదతోనే అత డితనిని చంపెను.

## 154. సురస

ఈమె కశ్యపునకు, క్రోధవశకు పుత్రిక. హనుమంతుని బలము పరీక్షించుటకు దేవత లీమెను పంపిరి. ఈమె రాక్షసీరూపమున నేగి తన నోరు ఆకస మంటునంతగా తెరచి నిల్చి హనుమంతు నడ్డగించెను. దేవతలు చెప్పినట్లుగా చేసి యామె హనుమంతుని తన కాహారము కమ్మని కోరెను. హనుమంతుడు శరీరము పెంచగా ఈమెయు నోరు విశాలముగా తెరచి నిల్వసాగెను. హనుమంతు డప్పు డంగుష్ఠమాత్రుడై ఈమె నోటిలోనికి దూరి వెంటనే తిరిగి వచ్చెను. అప్పు డామె అతని బలవివేకములు గ్రహించి, కార్యసాఫల్యమున కాశీర్వదించి వెడలిపోయెను.

## 155. సోమద

ఈమె ఊర్మిళాగంధర్వి కుమార్తె. చూళిముని తపఃసామర్థ్యమున నీమెకు బ్రహ్మదత్తు డుదయించెను. ఈమె చేసిన సేవలకు సంతసించి చూళి యామెను వరము కోరుకొమ్ము మనెను. ఈమె తా నెవరికిని పత్ని కాలేదనియు, మున్ముందుకూడ నెవరినీ వరింపదలపననియు చెప్పి, పుత్రసంతానము మాత్రము కోరుచుంటినని చెప్పెను. చూళి ఆమె కోర్కె ననుసరించి పుత్రోదయము వరముగా నిచ్చెను.

## 156. సౌదాసుడు (కల్మాషపాదుడు)

ఇతడు సుదాసుని పుత్రుడు. మత్స్యపురాణములో నితడు ఋతుపర్ణుని పుత్రుడుగా చెప్పబడెను. వసిష్ఠునికి ప్రతిశాప మీయదలచి యితడు జలగ్రహణము చేసియు, ఆ జలములు తన పాదములపైననే చల్లుకొనెను. అందువలన పాదములు కాలిపోయి కల్మాషపాదు డనబడెను. వసిష్ఠు డితనిని శపించుటకు కారణము (చూ.శాప- వసిష్ఠుడు > కల్మాషపాదుడు) గ్రంథాంతరములలో భిన్నముగా నుండెను. నారదపురాణము ననుసరించి యిత డొకసారి రేవా

(నర్మదీ) తటమున వేటాడబోయెను. అప్పు డచట మిథునక్రియలో నున్న ఆడుపులిని చంపెను. అది చనిపోపుచూ పెరిగి రాక్షసుడుగా మారి నేనొకప్పుడు దీనికి బదులు తీర్చుకొందునని పల్కెను. మహాభారతమున రాక్షసుడుగా మారుటకు కారణము వేరుగా చెప్పబడినది. వేటనుండి మరలి వచ్చుచుండగా సౌదాసునికి వసిష్ఠుని పుత్రుడు శక్తి ఎదురాయెను. ఆ త్రోవలో నిద్దరు నడుచుటకు తగిన అవకాశము లేదు. రాజు శక్తిని ప్రక్కకు తప్పుకొనుమనెను. అతడు తప్పుకొనలేదు సరికదా త్రోవ బ్రాహ్మణులదనియు, బ్రాహ్మణులకు త్రోవయిచ్చుట రాజధర్మమనియు వలికెను. కాని రాజు రాక్షసత్వము వహించి శక్తిని కొట్టెను. అందుపై నతడు 'నీవు నరమాంసభక్షకుడైన రాక్షసుడ వగుదు' వని రాజును శపించెను. విశ్వామిత్రు డితని యజ్ఞమున కధ్వర్యుడయ్యెను. అందువలన వసిష్ఠవిశ్వామిత్రులకు వైమనస్యము పెరిగెను. తనకు శాపమిచ్చిన బ్రాహ్మణుడు వసిష్ఠపుత్రుడని తెలిసిన పిదప సౌదాసుడు శాపశాంతి వేడుకొనెను. తర్వాత శాపమిచ్చిన శక్తి చేతనే అధికారపూర్వకముగా నరమాంసభక్షణ మారంభింపబడెను. ఇతడు వసిష్ఠుని నూర్గురు పుత్రులను భక్షించెను. ఒకసారి క్రీడామగ్నులైన బ్రాహ్మణదంపతులను చూచి, వారిలో పురుషుని మ్రింగివేసెను. అప్పుడా బ్రాహ్మణవనిత 'నీవు నీ భార్యను ముట్టినంతనే చనిపోపుదు' వని శపించి తాను సతి యయ్యెను. వసిష్ఠు డితనితో గంగాబిందుసరస్సున మునిగి శాపవిముక్తి గాంచెదవనెను. కాని బ్రాహ్మణవనిత నీ వెల్లకాలము రాక్షసుడుగనే యుందువని శపించెను. అప్పు డిత డామెను నీవు పుత్రసహితముగా పిశాచి వగుదువని శపించెను. గంగాజలములు తెచ్చుచున్న గర్గముని ఆ నీటిని చల్లగా వీ రిరువురికిని శాపమోచనము కల్గెను. సౌదాసుని పత్ని మదయంతి. ఆమెయే యితనితో వసిష్ఠుని శపింపవద్దని నివారించినది.

రాక్షసత్వము ముగిసిన పిదప వసిష్ఠు డితనికి రాజ్యాభిషేకము గావించెను. పతివ్రత యిచ్చిన శాపముచే నితనికి సంతతి కలుగలేదు. అప్పు డితడు వసిష్ఠుని ద్వారా తన పత్నియందు గర్భస్థాపనము చేయించెను. అప్పుడు పుట్టిన పుత్రుడు అశ్మకుడు. మహాభారతములో నితని కథ మరియొక తీరుగా నున్నది. అహల్య ప్రోత్సాహముపై గౌతమశిష్యు డొకడు మదయంతి కుండలము లపహరింపవచ్చెను. కానీ రాక్షసుడైన యిత డా శిష్యుని మ్రింగబోయెను. కాని ఆ శిష్యుడు నేను వచ్చిన కార్యము ముగించి నీ ఆకలి తీర్చెద ననెను. ఆ కార్యము చెప్పి అతడు మదయంతివద్ద కేగెను. ఆమె తన పతివద్ద నుండి

ఒక గుర్తు తెచ్చి చూపినచో కుండలము లిచ్చెద ననెను. అతడట్లుచేయగా ఆమె కుండలము లిచ్చెను. కాని వాటిని భద్రముగా చూచుకొమ్మనెను. రాక్షసుడు శిష్యుని (ఉత్తంకుని) సత్యవచనమునకు మెచ్చి విడిచిపెట్టెను.

## 157. స్థూలశిరుడు

ఇతడొక ఋషి. అస్త్రశిరుని పుత్రుడు. ఇతడు విశ్వావసు గంధర్వుని కబంధరాక్షసుడుగా శపించెను.

## 158. స్వయంప్రభ

ఈమె మేరుసావర్ణి పుత్రిక. అప్సరస హేమకు సఖి. స్వర్గమునకు పోవుచూ హేమ మయనిర్మితమైన తన గుహాలయమును రక్షించుట కీమె కప్పగించి అందుకు తగిన సామర్థ్యముకూడ కల్పించెను. ఈమె అంగదాదులను సముద్రమునకు చేర్చెను. శ్రీరాముని దర్శించి యీమె స్వర్గమేగెను. ఈమెకు ప్రభావతి యని మారుపేరు. ఆకలితో నున్న వానరులకు ఫలమూలము లిచ్చి యీమె వారి కాతిథ్యము నెరపెను. హనుమంతు డీమెను దీనికి మారుగా ప్రత్యుపకార మేమి చేయుమనెద నని యడిగినప్పు డీమె ధర్మానుసారము చేసిన దానికి మారేమియు వలదని చెప్పి సవినయముగా తన సంతుష్టి వెల్లడించెను.

## 159. హనుమంతుడు

సప్తచిరంజీవులలో నొకడైన హనుమంతుడు సుమేరుపర్వతమున గల వానరయూథపుడు కేసరికి అంజనవలన కలిగిన పుత్రుడు. ఇతని జన్మకథ వేర్వేరు విధములుగా చెప్పబడెను. సూర్యు నొక పండుగా తలచి యిత డతనిని పట్టబోయెను. రాహు విది చూచి చెప్పగా ఇంద్రు డితనిపై వజ్రాయుధము ప్రయోగించెను. ఆ దెబ్బ కితని హనువు విరిగెను. అందుచే నితనికి హనుమంతు డని పేరు వచ్చెను. వజ్రప్రహారముచే నితడు మూర్ఛిల్లగా వాయువు తన సంచార మాపివేసెను. ముల్లోకములవారికిని ప్రాణసంకటమై బ్రహ్మతో మొరబెట్టుకొనగా, అత డితనిని రక్షించి వాయువును తిరిగి సంచరింపజేసెను. బ్రహ్మదండమున కిత డవధ్యుడని బ్రహ్మ వరమిచ్చి,

తక్కిన దేవతలచేత కూడ వరము లిప్పించెను. ఇంద్రుడు వజ్రముచేతను, వరుణుడు పాశ-జలములచేతను అవధ్యతను వర మీయగా, యముడు తన దండముచే అవధ్యతను, నిత్య స్వాస్థ్యమును, యుద్ధమునరి దలసటలేమిని, శంకరుడు దీర్ఘాయువును, పాశుపతముచే నవధ్యతను, కుబేరుడు తన గదచేతను, విశ్వకర్మ తాను నిర్మించిన అస్త్రములచేతను అవధ్యతను, ఇట్లీతనికి చిరంజీవిత్వము మున్నగు వరము లిచ్చిరి. పైగా, బ్రహ్మ యితనికి వేరుగా కామరూప, కామగమనములను, భయోత్పాదకత్వ భయనాశనములను, బ్రహ్మాస్త్రబంధనము నుండి విముక్తిని వరము లిచ్చెను. ఇట్లు వరము లంది హనుమంతుడు మహాబలశాలియై లంక ననాయాసముగా నరిగి నిర్భయుడై కార్యము సాధించెను. భృగ్వంగిరసగోత్రులైన ఋషులను వేధించుటచే నితనికి తన శక్తి విస్మృతమగునట్లు శాపము కలిగెను.

హనుమంతుడు మహాధీశాలి. వ్యాకరణము, సూత్రము, సూత్రవృత్తి, భాష్యము మున్నగువాటిలో నితని కపారమైన జ్ఞానముండెను. వాక్పటుత్వము కలవాడై యితడు దూతకార్యమును నిపుణతతో సాధించెను. సీతాన్వేషణము, లంకావిశేషపరిజ్ఞానము కేవల మతనికే సాధ్యమైన కార్యములు. శ్రీరాముని కితడత్యంతభక్తుడు. రామసుగ్రీవుల మైత్రి కితడే ముఖ్యకారకుడు. మిత్రత్వము నిల్పుకొనుమని యితడు సుగ్రీవుని కుపదేశించెను. యుద్ధములో నితడెందరో రక్కసులను వధించెను. లంక కాల్చివచ్చెను. ఇంద్రజిత్తుచే బ్రహ్మాస్త్రబద్ధుడై తెలివితప్పి పడియున్నపు డితనిని రాక్షసులు త్రాళ్లతో కట్టిరి. అన్యబంధనము లొల్లని బ్రహ్మాస్త్రబంధము తనంతట తానే తొలగిపోయెను. వానరవీరులను, మూర్ఛిల్లిన లక్ష్మణుని, పునర్జీవితులుగా చేయుటకై యితడు ద్రోణగిరి కేగి సంజీవనీ ఓషధులు తెచ్చెను. అయోధ్యకు చేరుకొనుటకు ముందు రాము డితనిని ముందుగా నయోధ్యకు పంపెను. నా కథ జగత్తులో నుండునంతకాలము, నా ఆజ్ఞ మన్నించుచు, ప్రసన్నుడవై నీ వీ భూతలమునందుండెద వని రాముడితని నాశీర్వదించెను. ఈ ఆశీ స్సతని కెక్కుడు సంతసముచే కూర్చినది.

## 160. హేతి-ప్రహేతి

వీ రన్నదమ్ములు. ప్రహేతి ధార్మికుడు. అతడు తపస్సు చేయ నరిగెను. హేతి భార్యపేరు భయ. కొడుకు విద్యుత్కేశుడు. ఇతడు వృత్రాసురుని అనుచరుడు. విష్ణు వితని నోడించెను.

## 161. హేమ

భరతునికి స్వాగతార్థము ఆహ్వానింపబడిన అప్సరసలలో హేమ యొకతె. ఈమె మయరాక్షసుని పత్ని. దేవతలే అతని కీమె నిచ్చినట్లుకూడ చెప్పబడెను. కాని వాల్మీకిరామాయణములో ఈమె మయునితో చేరినందున క్రుద్ధుడై యింద్రుడు మయుని సంహరించినట్లు చెప్పబడెను. మయు డొక కాంచనభవనము నిర్మించి ఈమెతో కలిసి నివసించుచుండెడివాడు. మయుడు గతించిన పిదప, ఆ స్వర్ణవనము, అక్షయసుఖభోగదాయకములైన వస్తుసముదాయమును, కాంచన భవనమును హేమ తన సఖి స్వయంప్రభకు రక్షార్థ మప్పగించి తాను దేవలోక మరిగెను. హేమ నృత్యగానములలో ప్రవీణురాలు. ఈమెయందు మయునికి కలిగిన పుత్రి మండోదరి రావణుని భార్య యయ్యెను.

# స్థలపరిచయములు

## 1. ఋక్షబిలము

ప్రయాగనుండి సుమారు 150 మైళ్ల దూరమున, మధ్యప్రదేశములో రామ్‌గఢ్ పర్వతమునకు సమీపమున వింధ్యపర్వతపంక్తిలో నిది యొక గుహ దీనిని సీతాబెంగ్రా గుహ, హాథీఫోడ్ మున్నగు పేర్లతో పిలుతురు. ఈ గుహలో రామలక్ష్మణసీతానామములతో వేర్వేరు సహజసిద్ధములైన గుహలున్నవి. మయరాక్షసు డీ గుహలలో సువర్ణవన, కాంచనభవనములు నిర్మించెను. ఆ ప్రదేశపు శోభావిభవములు చూచి హనుమదాదు లాశ్చర్యపోయిరి. ఆ ప్రదేశమును రక్షించుచున్న తపస్విని స్వయంప్రభ హనుమంతున కా గుహావృత్తాంత మెరిగించెను. ఆమె వారి నా గుహనుండి సురక్షితముగా బయటకు చేర్చెను. ఆ గుహలో చేరినవారు సజీవులై బయటపడలేరు. గుహబయట వారికి వింధ్యగిరిసమీప జలాశయములు కనిపించెను. ఆ మీది మార్గమును స్వయంప్రభయే వానరుల కెరిగించెను.

## 2. ఋక్షవంతము

ఇది బహుశా వింధ్యకు తూర్పున గల కొండల మధ్యనున్న పర్వత ప్రదేశము. దీనియందే సాత్‌పురా పర్వతభాగ మున్నది. గోండ్వన్ పర్వతపంక్తినే ఋక్షవంత మందురు. మార్కండేయపురాణము ననుసరించి భారతమున గల ఆరు కులపర్వతములలో నిది యొకటి. ఇది నర్మదానది ఉద్గమించిన చోటు నుండి బంగాళాఖాతముపరకు వ్యాపించియున్నది. వేర్వేరు ప్రాచీనగ్రంథములలో నిది వేర్వేరు పేర్లతో వర్ణింపబడెను. ఋక్ష మనగా ఎలుగుబంటి. ఆ కారణముననే దీనికి ఋక్షవంతమని పేరు గల్గెను. వానరనాయకులలో నొకడైన ధూమ్రు డీ పర్వతముపై వసించెడివాడు. గ్రీకుభాషలో 'అర్క్‌తోస్'

అని ఎలుగులకు పేరు. టాలమీ గ్రంథములో ఇది 'ఆక్సెంతీన్' అని చెప్పబడెను. ఈ రెండు పేర్లును దీనికే అన్వయించును. నర్మద, తపతి, ధసన, దముద, శోణ, మందాకిని, మహానది, తమస వంటి గంగాయమునల ఉపనదు లెన్నో యీ పర్వతమునుండి వెడలినవి.

## 3. ఋష్యమూకము

కర్ణాటక రాజ్యమున గల బళ్లారిజిల్లాలో హంపీపద్ద నీ పర్వత మున్నది. ఇది తుంగభద్రాతీరమున నున్నది. ఇది సహ్యాపర్వతమునకు దక్షిణక్షేత్రమున నొక ఉపపర్వతము. సుగ్రీవు డిక్కడ నుండెడివాడు. అతడు రామలక్ష్మణులతో నిచ్చటనే మైత్రి నెరపెను. మతంగముని శపించినందున వాలి కీ ప్రదేశము వర్జ్య మయ్యెను. మహాభారతములో నీ పర్వత మొక తీర్థస్థానముగా పేర్కొనబడెను.

## 4. కనఖల్ తీర్థము

ఈ తీర్థము హరిద్వార్‌నుండి నాల్గు కిలోమీటర్ల దూరమున నున్నది. ప్రజాపతి యగు దక్షు డిచ్చటనే యజ్ఞము చేసెననియు, సతీదేహత్యాగము వలన కోపించి శివు డీ యజ్ఞభూమి విధ్వంసము చేసెననియు జనశ్రుతి. ఈ తీర్థములో స్నానము చేసినవారికి తిరిగి జన్మలేదని నమ్మకము. ఇక్కడ దక్షప్రజాపతి మందిరమున్నది. ఈ స్థానము శ్రాద్ధవిధుల కుత్తమమని ఎన్నో పురాణములలో పేర్కొనబడెను. స్కందపురాణము ననుసరించి యిది అరుణాచలముపై నున్న శివస్థానము. నృగుడు దానమిచ్చిన గోవులలో కలిసిపోయిన విప్రధేను విచ్చటనే కనిపించెను. సనత్కుమారు డిచ్చట వసించుచుండెను.

## 5. కిష్కింధ

ఇది వాలిసుగ్రీవుల రాజధాని. ఇది దక్షిణభారతమున పంపాసరోవర ప్రాంతమున నుండిన నగరము. దీని సమీపమున పంపా, తుంగభద్రా నదులు, ప్రస్రవణగిరి, మాతంగాశ్రమము మున్నగునవి యున్నవి. ఈ నగరము పర్వతములు, కందకములతో నిండియుండెను. ఇది రత్నసమృద్ధము, ఉపవన శోభితముగా నుండెను. శ్రీ చిత్రావశాస్త్రి గారి మతమున కర్ణాటకములోని హంపీ (ఆనెగొంది) నగరమే కిష్కింధానగరము. ఇక్కడకు సమీపమున

తుంగభద్రాతీరమున వాలి ప్రాసాదము, సప్తతాళవేధము అను ప్రదేశము లున్నవి. భావార్థరామాయణములో బ్రహ్మగారి ఆనందాశ్రువులచే జన్మించిన ఋక్షరాజవానరాధిపతికి, బ్రహ్మనియోగమున విశ్వకర్మ ఈ నగరమును నిర్మించెను. 'పర్వతము వెనుక మృత్యువు' అను అర్థము గల 'కిష్కింధ' అను శబ్దము శంబరభాషలోనిది. జైనగ్రంథములలో నీ నగరము 'ఖఖాంద్' అని పిల్వబడెను.

## 6. కేకయరాజ్యము

ఇది ఉదీచ్యదేశమున పంచనదీక్షేత్రము. నేటి వితస్తానది (జీలమ్‌నది)కి పూర్వభాగమునం దుండిన జనపదము. దీనికి కైకయ, కైకేయ వంటి వెన్నో నామాంతరము లున్నవి. కేకయుడు స్థాపించిన దేశమని యందురు. ఉశీనర, శిబిదేశజనులతో కలిపి యిది చెప్పబడుచుండును. విపాశానదీతటమున నున్న ఈ దేశము రామాయణకాలమున బాహ్లీక-ఇక్షుమతులకు పశ్చిమమున నుండి యుండును. నిరంతర విదేశీదండయాత్రలవలన నిచ్చటి జనులు యుద్ధకుశలులైరి. వీరు ధనుర్విద్యాప్రవీణులు. పూర్వగాంధారపురాజు ఆంభిని లొంగదీసికొనుటకు అలెగ్జాండరు దీని పశ్చిమసరిహద్దున గల వితస్తానది వద్ద విడిసెను. దశరథుని మామగారగు అశ్వపతి కేకయుడు ఈ దేశపు రాజుగా నుండెను.

## 7. గంగ

'గమయతి భగవత్‌పాద మితి గంగా' అని దీనిలో స్నానము చేసినవారు భగవత్‌పాదసన్నిధికి చేరుదురనియు, 'గమ్యతే ప్రాప్యతే మోక్షార్థిభిరితి గంగా' మోక్షార్థు లిచ్చటికి చేరుదు రనియు, అందుచే దీనికి గంగ యని పేరనియు నిర్వచించెదరు.

ఇది భారతదేశపు ముఖ్యనదు లేడింటిలోను శ్రేష్ఠమైనది. దీనిని విష్ణుపది, త్రిపథగ, భాగీరథి, జాహ్నవి, మున్నగు పేర్లతో పిలిచెదరు. ఇది ఉత్తర ప్రదేశములో టేహరీ గఢ్వాల్ క్షేత్రములోని గంగోత్రి వద్ద, సముద్రమట్టమునకు 4200 మీటర్ల ఎత్తున పుట్టినది. హృషీకేశమువద్ద ఇది మైదానములోనికి దిగును. గంగాయమునాసంగమము వరకు గల మధ్యభాగమునకు అంతర్వేది యని యందురు. ఇది సారవంతమైన భూమి. వైదికసంస్కృతికి కేంద్రమై

యుండెను. యమున, బ్రహ్మపుత్ర, మేఘన, మరికొన్ని చిన్న పెద్ద నదులెన్నో గంగలో కలియుచున్నవి. ఈ నది సహస్రముఖములుగా గంగాసాగరమున కలియుచున్నది. దీని ముఖమున సాగర మను ద్వీప మున్నది.

కపిలమహాముని ఇచ్చట నుండినట్లు చెప్పుదురు. గంగపవిత్రతను సాధు సత్పురుషు లందరును అంగీకరించిరి. స్వాస్థ్యదృష్టితో గంగాజలము మిక్కిలి శుద్ధము, రోగనివారకము, శక్తిదాయకము నని ప్రసిద్ధి. అట్లే ధార్మికదృష్టితో నిది శ్రాద్ధక్రియాకలాపముల కనుపగునట్టి 31/2 కోట్ల తీర్థములతో నొప్పుచున్నది.

గంగ అగ్నిదేవునినుండి ఈశ్వరతేజము గ్రహించి స్కందుని ప్రసవించినది. గంగను సముద్రపత్నియని, వేదములకు దక్షిణబాహువని చెప్పుదురు. పురాణములలో దీని మహత్త్వమెంతగనో వర్ణింపబడెను. ఋగ్వేదమున ఈ నది పేర్కొనబడెను. గంగను దేవతగా భావించెదరు. ఒకసారి దేవతలందరు బ్రహ్మవద్ద కేగిరి. వారితో గంగయు, ఇక్ష్వాకుకులజుడైన మహాభిషుడును కూడ నుండిరి. వాయువుచే గంగ చీర కొంత తొలగెను. దేవతలు కనులు క్రిందికి త్రిప్పిరి. కాని మహాభిషు డట్లు చేయక చూచుచుండెను. అది గమనించి బ్రహ్మ 'నీవు మర్త్యలోకమున జన్మింపుము. గంగ నీకు పత్నియగును' అని శపించెను. "ఆమె నీ కప్రియకరమగు కార్య మొనర్పగా నీ వామెను విడిచిపెట్టెదవు. అప్పుడు నీకు శాపవిముక్తి కలుగును" అని కూడ బ్రహ్మ వచించెను. మహాభిషుడు ప్రతీపుని కుమారుడుగా జన్మింప దలచెను. త్రోవలో వసిష్ఠునిచే శపింపబడిన అష్టవసువులు గంగను కలిసి, ఆమె గర్భమున తాము జన్మించుటకు నిశ్చయించిరి. పుత్రుడు పుట్టగనే వానిని గంగలో ముంచివేయుమని కోరిరి. కాని గంగ ఒక్కని తప్ప తక్కిన ఏడుగురిని నీటముంచుట కంగీకరించెను. అష్టవసువులును, తమ తమ అంశము లా అష్టమపుత్రున కిచ్చుట కంగీకరించిరి. మహాభిషుడు ప్రతీపుని పుత్రుడు శంతనుడుగా నవతరించెను. గంగాశంతనుల వివాహమైనది. కాని ఈ వివాహమున కొక నియమముగా గంగ ప్రతీపునితో నిట్లు చెప్పినది - 'వివాహానంతరము నేనేమి చేసినను, దానికి నా భర్త అడ్డు చెప్పరాదు. ఈ నియమము చెల్లునంత కాలము నే నతనితో నుందును' శంతనుని వలన నీమెకు ఎనమండుగురు పుత్రులు కల్గిరి. వారిలో ఏడుగురి నీమె నీట ముంచెను. ఎనిమిదవ శిశువు నట్లు చేయబోగా శంతను డడ్డు చెప్పెను. వెంటనే ఈమె దేవలోకమునకు వెళ్లిపోయెను. ఆ ఎనిమిదవ పుత్రుడు భీష్ముడు. ఈమె తనతో నతనిని స్వర్గమునకు గొనిపోయి సర్వవిధములగు

విద్యలు నేర్పించెను. ఒకసారి వేటకై గంగాతటమునకు వచ్చిన శంతనున కీమె ఆ కుమారు నప్పగించెను.

## 8. గోదావరి

ఇది దక్షిణభారతమున నత్యంతపవిత్రమైనది. దీనిని దక్షిణగంగ యందురు. మహారాష్ట్రమున నాసిక్ వద్ద త్ర్యంబకేశ్వరమున నిది బయలు వెడలెను. ఆ ప్రదేశమును బ్రహ్మగిరియని పిల్చెదరు. గౌతమమహర్షిచే నొక గోవు మరణించెను. ఆ పాపపరిహారమునకై యతడు శంకరుని శిరసు నుండి గంగను తెప్పించెను. అందువలన నీ నదికి గౌతమి అను పేరు వచ్చెను. దీని తటమున నూరు తీర్థము లున్నవి. చనిపోయిన గోవు మీదుగా గంగ పారుటచే ఆ గోవు జీవించెననియు, నందుచే నీ నదికి గోదావరి యను పేరు వచ్చెననియు చెప్పుదురు. రేవాతటమున తపస్సు, గంగాతటమున మృత్యువు, కురుక్షేత్రమున దానము మహాపుణ్యప్రదములని హిందువుల విశ్వాసము. ఈ మూడు పుణ్యకార్యములును గోదావరీతటమున సుసంపన్నము లగునని కూడ నమ్ముదురు. గోదావరీతటమున గల పైఠన్ నగరమును దక్షిణకాశి యందురు. సింహగురుపర్వములో నిది పవిత్రతీర్థక్షేత్రముగా పరిగణింపబడుచున్నది. ఈ నది మహారాష్ట్ర, ఆంధ్ర, కర్ణాటక రాజ్యములలో ప్రవహించుచున్నది. దీని ప్రవాహక్షేత్రము 900 మైళ్లు. ప్రవర, వర్ధ, వైనగంగ, ధారణ, ఇంద్రావతి మున్నగు ఉపనదు లెన్నో దీనిలో కలియుచున్నవి. గోదావరివలన నెంతయో క్షేత్రము సస్యశ్యామల మగుచున్నది. ఇది సముద్రములో కలియును. రాజమహేంద్రవరమున గోదావరీపుష్కరమహోత్సవము వైభవముగా జరుగుచుండును.

## 9. చైత్రరథము

ఇది వనము. దీని స్థానము విభిన్నగ్రంథములలో విభిన్న రీతుల వినబడును. ఈ వనము ఉత్తరప్రదేశములో నున్నది. చిత్రరథుడను గంధర్వుడు దీనిని నిర్మించెను. అందుచే నిది చైత్రరథ మనబడెను. బ్రహ్మపురాణము ననుసరించి యిది చంద్రప్రభపర్వతమున నున్నది. ఊర్వశీపురూరవు లీ వనములో కలిసిరి. మత్స్యపురాణము దీనిని మందారపర్వతమున నున్నట్లు చెప్పును. వాయుపురాణము దీనిని ఇలావృతమునకు తూర్పున గల అచ్ఛోదానదీ తటమున

నుండినట్లు వర్ణించును. ఇంద్రాదిదేవత లిక్కడ విహరింతురని చెప్పబడెను. భాగవతములో నిది మేరుమందరమున నున్నట్లు చెప్పబడెను.

## 10. తాటకావనము

అగస్త్యముని శాపముచే తాటక రక్కసియై మలదకరూశక్షేత్రములను నాశ మొనర్చెను. ఆ ప్రదేశమునకే తాటకావన మని పేరు వచ్చెను. విశ్వామిత్రుని యాశ్రమ మీ వనసమీపమున నుండెను. అలహాబాదునుండి శాహబాద్‌జిల్లా వరకు గల గంగాదక్షిణప్రదేశమున గల అరణ్యా మీ తాటకావనము కావచ్చును.

## 11. దండకారణ్యము

ప్రాచీనసాహిత్యములో వింధ్యకు దక్షిణమున గల భూభాగము దక్షిణాపథ మనబడెను. అదే దండకారణ్యా మని కొంద రందురు. వాల్మీకి ననుసరించి, భార్గవునిచే శపింపబడిన వింధ్యశైవలమధ్యభాగము దండకావనము. ఈ వనములో తాపసు లుండిరి. అందుచే దీనికి జనస్థానమని పేరు వచ్చెను. ఒకప్పు డిది దండుని రాజ్యము. దండుడు శుక్రుని కుమార్తె అరజను బలాత్కరించెను. శుక్రుడు కోపించి శపించెను. దండుని రాజ్యము నశించి దండకారణ్యా మాయెను. ఇంద్రుడు ధూళివృష్టి కురిపింపగా నచ్చటి చరాచరప్రకృతి యంతయు ధ్వంసమయ్యెను. రామాయణకాలమున నీ ప్రదేశము రాక్షసులకు, వానరులకు నివాసమై యుండెను. కొందరు పరిశోధకులు ఆర్యద్రావిడ ప్రథమసమాగమ మిచ్చటనే జరిగెనని చెప్పుదురు. మహాభారతకాలపు విదర్భ, అశ్మక, ములక, కుంతల, గోప, మల్ల రాష్ట్రములన్నియూ నీ ప్రదేశమున నుండెను. విభిన్న యాదవవంశీయు లిచ్చట రాజ్యము చేసిరి. ఈ అరణ్యము నర్మదానదినుండి గోదావరీనది వరకు వ్యాపించి యుండెను. చిత్రకూటపర్వతమునుండి గోదావరీ ముఖద్వారమువరకు నిది విస్తరించి యున్నట్లు చెప్పుదురు. రాము డీ వనములో పది యేండ్లు వసించెను.

## 12. నికుంభిల

కొలంబోనుండి 40 మైళ్ల దూరమున నికుంభిలాదేవీక్షేత్ర మున్నది. ఇంద్రజిత్తు ఈ దేవిని పూజించెడివాడు. అత డిచ్చట యజ్ఞము చేసెను.

నికుంభిలాదేవి పేరిటి వన మిప్పుడు లేదు. సముద్రము లంఘించునప్పుడు హనుమంతుని మార్గమున చెప్పిన స్థానములలో నికుంభిల కూడ పేర్కొనబడెను.

## 13. (ద్యావా) పృథివి

ద్యావాపృథ్వీ వర్ణన ఋగ్వేదములో మాతాపితృరూపమున నున్నది. ఇంద్రాదిదేవతలకు, సర్వజనులకు నివి మాతాపితృరూపములు. శివపార్వతుల సమాగమమునకు విఘ్నము కల్పించి దేవతలు భూదేవిని శివుని తేజము భరింపు మనిరి. పార్వతి భూమిని శపించెను. ఆ శాపముచే బహుభర్తృక య్యును భూమికి పుత్రులు లేరు. ఆమె అస్థిర యైనది.

## 14. ప్రస్రవణగిరి

తుంగభద్రాతటమున కిష్కింధవద్ద ప్రస్రవణగిరి యున్నది. ఇది మాల్యవంతమున నొక భాగము. దీనినుండి ఎన్నో నదులు పుట్టి పారుచున్నవి. ఈ గిరి శిఖరమున నొక గుహలో రామలక్ష్మణులు వర్షాకాలము నాల్గు నెలలు నివసించిరి. ఆ గుహ గాలి వెలుగులు గలది. ఋక్షబిలమునుండి సముద్రపుటొడ్డునకు చేర్చి వానరులతో స్వయంప్రభ యీ పర్వతమును పేర్కొనెను.

## 15. భృగుతుంగము

భృగతుంగ పర్వతమున ఋచీకముని ఆశ్రమ ముండెడిది. అంబరీషు డీ పర్వతముననే ఋచీకుని దర్శించెను.

## 16. మధుపురి (మధుర)

ఇది మధుదైత్యుని కుమారుడైన లవణుని నగరము. యమునాతటమున నున్న ఈ నగరము మధుర, మధుపురము, మధూషిక, మధూప్నా మున్నగు పేర్లతో వినబడును. నేటి మధుర సప్తపుణ్యనగరములలో నొకటిగా పేర్కొన బడుచున్న సాంస్కృతికకేంద్రము. ఇది శూరసేనదేశమునకు రాజధాని. చంద్రవంశీయులైన యాదవు లిచ్చట చాలాకాల మధికారము వహించిరి. తర్వాత నిచ్చట హూణులు, హర్షవర్ధనుడు, వర్మ, గుర్జరప్రతీహారులు, పిదప

ముసల్మానులు, చివర ఆంగ్లేయులు కూడ పాలించిరి. శకక్షత్రపుల రాజ్యకాలమున మధుర జైన, బౌద్ధ, భాగవతమతములకు కేంద్రముగా నుండెను. నేటికిని ఇక్కడ హిందూదేవాలయములు, బౌద్ధస్తూపములు నిల్చియున్నవి.

## 17. మరుకాంతారము

దీనికి ద్రుమకుల్య మని మారుపేరు. దక్షిణసముద్రము శరణు వేడి రామునిచే ఈ ప్రదేశమున బాణప్రయోగము చేయించెను. ఇచ్చట ఆభీరులను దస్యుజాతులవా రుండిరి. వారు భయంకరులు, క్రూరకర్ములు. ఈ దేశపు నిశ్చితస్థాన మేదో చెప్పుట కష్టము. పంజాబులోని హిస్సారు జిల్లా, ప్రాచీన సరస్వతీ తటప్రదేశము, పశ్చిమోత్తర భారతమున గల హేరాత్-కందాహార్ క్షేత్రములు, సింధుఘాటీ ప్రదేశము, కచ్ఛత్రిభుజ క్షేత్రము మున్నగున వన్నియు ఆభీరుల నివాసస్థలములుగా వేర్వేరు గ్రంథములలో చెప్పబడినవి. ఇట్లే నేటి పాకిస్థానములోని హైదరాబాదు, గుజరాతులోని సూరత్, దాని సమీప క్షేత్రములలో ఆభీరనగరము లుండెను.

## 18. మలదకరూశములు

ఇవి రెండునూ కలిసి వ్యవహరింపబడుచుండెను. వృత్రాసురవధానంతరము ఇంద్రునికి క్షుధామలము లంటినవి. వాటి నిచ్చట కడిగివేసిరి. మైల జారినచోటు మలదము, క్షుత్తును (కరూదము) సహించిన చోటు కరూశము. ఇవి మధ్య ప్రదేశమున శోణా, కేన నదుల మధ్య రేవాగ్రామమునకు సమీపభూములు. పశ్చిమమున కేన, తూర్పున బీహారు, దక్షిణమున కైమూరు, ఉత్తరమున వింధ్య - ఇవి కరూషదేశపు సరిహద్దులు. ఇచ్చటి ప్రజలు కరూషు లనబడిరి. వైవస్వతమనువు పుత్రుడు కరూషుడు దీనిని స్థాపించెను. ఈ దేశమున కెన్నో పేర్లేర్పడెను. దంతవక్త్రుని తండ్రి వృద్ధశర్మనుడు కరూషదేశమును పాలించెను. ఈ దేశమునకు 'అంగమాలజ' మని వేరొకపే రుండెను. ఇది అగస్త్యుని తపోభూమి.

## 19. మిథిల

మిథ అనగా యుగ్మము. 'విదిశ-వైశాలి' కలిసి మిథిల య్యోనని చెప్పుదురు. నిమిచక్రవర్తి శరీరమును మథింపగా నుదయించిన మిథి యా

నగరమును నిర్మించె నందురు. ఇది జనకుని రాజధాని. గౌతముని యాశ్రమ మీ సమీపమున నుండెను. నేపాలులోని జనకపురమను నొక తీర్థమునకు విదేహనగర మని మారుపే రున్నది. ఇది విద్యాకేంద్రము. బౌద్ధులకు జైనులకు కూడ ఇది ప్రముఖస్థానము.

## 20. మేరువు

జంబూద్వీపమందలి సప్తకులపర్వతములలో మేరు వొకటి. దీనిని సుదర్శనమనియు పిలుతురు. మహామేరు, సుమేరు అనునవి కూడ దీని నామములే. ఇది సువర్ణమయము. ఇది పవిత్రోద్యానమయమై పుణ్యాత్ముల విహారస్థలముగా నుండెను. ఈ పర్వతమునకు తూర్పున మందరము, దక్షిణమున గంధమాదనము నున్నవి. ఈ విశాలపర్వతము జంబూద్వీపమునకు మధ్యభాగమున నున్నది. దీని ఆకృతి ఘంటాపుష్పము వలె నుండును. దీని పాదప్రదేశమున గల పదహారువేల యోజనములు, శిరఃప్రదేశపు ముప్పది రెండు యోజనములు. ఊర్ధ్వమున (ఎత్తు) నలుబది యోజనములు, దిగువ (లోతు) పదహారు యోజనములు కలిసి దీని విస్తృతి యేర్పడెను. ఇది ఎత్తైన సరిహద్దుగా ఎత్తైన పర్వతపంక్తితో నున్నది. ఈ సరిహద్దు గోళాకృతి గలది. మధ్య మధ్య మైదానభూములు, వాలుకోణములు నున్నవి. ఈ పర్వతమునకు దక్షిణమున హిమాలయము, హేమకూటము, నిషధపర్వతము నున్నవి. ఉత్తరమున నీలశ్వేత శృంగిపర్వతము లున్నవి. దీని చుట్టును నాల్గు రంగులు గల నాల్గు శిఖరము లున్నవి. అవి దీని ముఖములు. మేరువు మూడు శిఖరములపై బ్రహ్మ విష్ణు మహేశ్వరుల నగరములును, అష్టదిక్కులయందును దిక్పాలకుల నగరములు నున్నవి. మేరువుయొక్క నిశ్చితస్థాన మిది యని చెప్పుటలో విద్వాంసులలో ఐకమత్యము లేదు.

## 21. మైనాకము

మైనాకపర్వత మెక్కడ నున్నదను విషయమున పండితులకును మతైక్యము లేదు. శ్రీ నందకుమార్ దే గారి మతమున అది హిమాలయమున గల శివాలిక్ పర్వతపంక్తి. శ్రీ పార్జిటర్ గారు దానిని ఆల్మోరా జిల్లాలోని పర్వత పంక్తిగా భావించిరి. వాల్మీకిరామాయణము ననుసరించి అది భారతదేశము, లంకాద్వీపముల మధ్య సముద్రములో నున్నది. పూర్వము పర్వతములకు రెక్క

లుండెడివి. అవి స్వేచ్ఛగా ఎగిరి తిరుగుచుండెడివి. ఇంద్రుడు పర్వతముల రెక్కలు ఖండించుచుండగా మైనాకము భయపడి సముద్రములో దాగికొనెను.

## 22. లంకానగరము

ఇది రావణుని రాజధాని. దక్షిణసముద్రతీరమునకు నూరు యోజనముల దూరమున సముద్రములో నీ ద్వీపము విశ్వకర్మచే నిర్మింపబడెను. ఇచ్చటి త్రికూటాచల మను శతయోజనవిస్తార మగు పర్వతశిఖరమున లంక నిర్మింపబడెను. లంకానగరము పది యోజనముల వెడల్పు, ఇరువది యోజనముల పొడవు గల సువర్ణమయ ప్రహరీ బురుజులతో శోభించుచుండెడిది. సుకేశుని పుత్రుల తపస్సునకు సంతసించి విశ్వకర్మ వారి కీ నగరమిచ్చెను. దేవతలచే మాలి వధింపబడిన పిమ్మట మాల్యవంతుడు తమ్ములతో కలిసి యిక్కడ రాజ్యము చేయుచుండెను. దేవతలను బాధించుచుండగా విని విష్ణువు మాలిని సంహరించెను. ఆ పిదప నీ నగరము కుబేరునికి లభించెను. కాని రావణు డతని నోడించి యీ నగరమును గ్రహించెను. రావణవధానంతర మిచ్చట విభీషణుని రాజ్యము కొనసాగెను.

లంక ఎక్కడున్న దను విషయములో కూడ పరిశోధకులు పరిపరి విధములుగా చెప్పుచున్నారు. కొంద రది మాల్దీవులు, జావాద్వీపములనియు, మరికొందరు దానిని మధ్యభారతమున వింధ్యపర్వతప్రాంతమున నుండినట్లును చెప్పుదురు. వేరొక మతము ననుసరించి లంక బొంబాయికి చేరువగా బోరీవలీ వద్ద నుండెడిది. ప్రాచీనకాలపు సింహళమే లంక యని చాలమంది చెప్పుదురు. వాల్మీకిరామాయణమున నీ భావమునకు తగిన ప్రమాణములు లభించుచున్నవి. సామాన్యముగా శ్రీలంక (సిలోను)నే రావణుని లంకయని చెప్పుదురు. కాదు, లంక సముద్రములో మునిగిపోయెనని వేరొక వాదము. గుప్తమౌర్యవంశపు రాజులకు లంకతో సంబంధము లుండెను. విజయనగర రాజైన రెండవ దేవరాయలు దీనిపై నాధిపత్యము కల్గియుండెను. ఆ తర్వాత దీనిపై పోర్చుగీసులు, డచ్చివారు, ఆంగ్లేయులు ఆధిపత్యము వహించిరి. నేడు శ్రీలంక ఒక స్వతంత్రరాజ్యము. నికుంభిలాదేవీస్థానము కొలంబోనుండి నలుబది మైళ్ల దూరమున నున్నది. అక్క డెన్నో సీతాస్థానము లున్నవి. అశోకుని కాలమున నీ దేశమును 'తామ్రపర్ణి' యని పిల్చెడివారు.

## 23. వింధ్యము

ఇది మధ్యభారతమున నున్న పర్వతము. ఈ పర్వతమువలన దక్షిణోత్తర భారతములు వేరుపడినట్లయ్యెను. ఇది గుజరాతు, మధ్యప్రదేశము, బీహారు రాష్ట్రములలో వ్యాపించినది. మేరువుకంటె ఎత్తుగా పెరుగ నెంచిన ఈ పర్వతము అగస్త్యునకు వంగి నమస్కరించి, అతని కొరకట్లే నిల్చిపోయెనని మత్స్య పద్మ వాయు పురాణములు పేర్కొనుచున్నవి. ఇది మిక్కిలి ప్రాచీనమైన పర్వతము. సప్త కులపర్వతములలో నిది యొకటి. దీనిని దక్షిణగిరి యని కూడ చెప్పుదురు. ఈ పర్వతమునుండి తపతి, నర్మద, శోణ, మహానదులు పుట్టి ప్రవహించుచున్నవి. సముద్రతలమున కిది 2500 అడుగుల ఎత్తున నున్నది. దీని పొడవు 700 మైళ్లు. ఋక్షవంతము, పారియాత్రమును వింధ్యపర్వతములోని భాగములే. దీనియందు ఆటవికజాతులవారు నివసించుచున్నారు. పూర్వకాలమున దశార్ణ, భోజ, కోసల మున్నగు జనపదము లిచ్చట నుండెడివి.

## 24. వైజయంతనగరము

ఇది దండకారణ్యమున నొక రాజధాని. దీనిని గౌతమాశ్రమసమీపమున నిమిచక్రవర్తి నిర్మించెను.

## 25. సిద్ధాశ్రమము

మొగల్‌సరాయి-పాట్నా రైలుమార్గమున బక్సర్ అను ప్రదేశమున్నది. త్రేతాయుగములో దీనిని సిద్ధాశ్రమ మని పిల్చెడివారు. పురాణకాలమున నిది తపోవనము. ఇక్కడ తపస్సు చేసి విష్ణువు సిద్ధి పొందెను. కనుక దీనికి సిద్ధాశ్రమమని పేరు వచ్చెను. విశ్వామిత్రు డిచ్చట నుండెను. ఇది ఘోరానదీ తటమున నున్నది. వామనునకును ఇదే నివాసస్థానము.

## 26. హిమవంతము

భారతదేశపు టుత్తరమున గల హిమాలయము పురాణప్రసిద్ధము. వేర్వేరు గ్రంథములలో దీనిని హిమవంతము, హిమాచలము, హిమాద్రి, హైమవతము మున్నగు పేర్లతో పేర్కొనిరి. ఇది పదివేల యోజనముల ఎత్తు గల్గి ఇలావృతమునకు దక్షిణమున తూర్పు పడమరలుగా వ్యాపించియున్నది

మార్కండేయపురాణము దీనిని పూర్వపశ్చిమసముద్రముల నంటి నిల్చినట్లు వర్ణించెను. కూర్మపురాణములో దీని పొడవు నూటఎనుబదివేల యోజనము లని చెప్పబడెను. ఋగథర్వయజుర్వేదములును, ఐతరేయబ్రాహ్మణాది గ్రంథములును దీనిని పేర్కొన్నవి. తైత్తిరీయము, శతపథబ్రాహ్మణము, పాణిని అష్టాధ్యాయి కూడ ఈ పర్వతమును ప్రస్తావించినవి. శ్రీకృష్ణుడు గీతలో 'స్థావరాణాం హిమాలయః' అని దానిని తన విభూతిగా చెప్పెను. కాళిదాసు రఘువంశమున హిమాలయమును పెద్దగా వర్ణించెను. ఎందరో ఋషు లీ పర్వతముపై ఆశ్రమములు నెలకొల్పిరి. గౌరీశంకరము, కాంచనగంగ, ధవళగిరి వంటి గగన చుంబి శిఖరము లిందున్నవి. గంగా, యమునా, కాళీ, ఘాఘరా, గండకీ, కోసీ, బ్రహ్మపుత్ర, జీలమ్ వంటి నదు లెన్నిటికో యిది ఉద్గమస్థానము. ఈ పర్వతమున గల వనములలో ఓషధు లెన్నో కలవు. కేదార్‌నాథ్, పశుపతినాథ్, బదరీనాథ్ వంటి పవిత్ర తీర్థములు దీనిలో నున్నవి. హిందువులవలె బౌద్ధులును దీనియం దెన్నో తీర్థములు సేవింతురు. ధార్మికముగా, సాంస్కృతికముగా, సాహిత్యకముగా, కళాత్మకముగా, దేవభూమిగా ఈ పర్వతమునకు గల మహత్త్వ మనన్యసాధారణము.

❄ ❄ ❄

# పరిశిష్టము

# 1.అస్పష్టశాపవరములు

(వాల్మీకిరామాయణములో కొన్ని ఘటనలందును, ప్రసంగములలోను వర్ణించిన వరశాపములు, స్పష్టముగా వరమో, శాపమో తెలియక సందిగ్ధముగా నున్నవి)

**కాకికిచ్చిన శిక్ష** సుందరకాండ 38

హనుమంతుడు లంక కేగి అచ్చట సీతను చూచెను. అచ్చటినుండి తిరిగి వచ్చునపుడు అతడు సీతను తనకేదైన ఆనవా లిమ్మనెను. అప్పుడు రామునికి సీతాదర్శనవార్తపై నమ్మకము కలుగును. అప్పుడు సీత అతనితో తన వెనుకటి జీవితములోని ఒక ఘటన వినిపించి అది చెప్పినచో రాముడు నమ్మునని చెప్పెను.

రామలక్ష్మణులును, సీతయు చిత్రకూటములో ఈశాన్యభాగమున వసించు చుండిరి. వారక్కడ మందాకినీతీరమున గల తాపసాశ్రమములో నివసించుచుండిరి. ఒకసారి, మాంసాపేక్షగల కాకి యొకటి సీతను ముక్కుతో పొడవసాగెను. రాయి విసిరి తోలివేసినను అది తన ప్రయత్నము మానక మాటిమాటికి సీతను పొడిచి యెగిరిపోవుచుండెను. ఆ కాకి మాంసాశచే సీతను పొడిచి, మాంసము తిననిగాని పోవునట్లు లేదు. ఇట్లది సీత నెంతగానో పొడిచి బాధించెను. సీత అలసి పోయి, విసిగి రాముని యొడిలో వ్రాలెను. అట్లామె కొంతసేపు నిద్రించి లేచిన పిదప రాము డామె యొడిలో తలపెట్టి నిద్రింప బోయెను.

*స తత్ర పునరేవాథ వాయసః సముపాగమత్,* 21
*తతః సుప్తప్రబుద్ధాం మాం రాఘవాంకాత్సముత్థితామ్,*
*వాయసః సహసాగమ్య విదదార స్తనాంతరే.* 22

అప్పు డా కాకి మరల వచ్చి, మేల్కొని కూర్చొని యున్న సీతను పొడువవచ్చి, యీ సారి ఆమె స్తనాంతరమును గాయపరచెను.

*పునః పున రథోత్పత్య విదదార స మాం భృశమ్.* 23

అది మరల మరల వచ్చి సీత నెక్కుడుగా పొడిచి గాయపరచెను.

ఆమె శరీరమునుండి కారిన రక్తము తనపై పడుటచే రామునికి తెలివివచ్చెను. అతడు సీత వక్షముపై నున్న గాయము చూచి మహోగ్రుడై యిట్లనెను-

*కేన తే నాగనాసోరు విక్షతం వై స్తనాన్తరమ్,*
*కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా.* 25

సుందరీ, ఎవడిట్లు నిన్ను గాయపరచెను? ఎవని కిట్లు రోషావిష్టమైన పంచముఖసర్పముతో క్రీడింప దలంపు కల్గెను? ఇట్లని, అతడా కాకిని చూచి, దాని గోళ్లు రక్తసిక్తములై యుండుట గమనించెను.

*పుత్రః కిల స శక్రస్య వాయసః పతతాం వరః.* 27

ఆ పక్షిశ్రేష్ఠము దేవేంద్రుని పుత్రుడు. రాముడు దానిని కఠినముగా శిక్షింపదలచి, తన దర్భాసనము నుండి దర్భలేశము గ్రహించి, దానిని బ్రహ్మాస్త్రముచే మంత్రించి కాకిపై విడిచెను. అది ప్రజ్వరిల్లుచు కాకిని వెంటాడెను. ఆ కాకి వివిధరీతుల నెగురుచు ప్రాణరక్షార్థము ముల్లోకములను తిరిగి చివరకు రామునివద్దకే వచ్చి శరణువేడెను. రాముడు శరణాగతవత్సలుడు కాకిపై దయదలచెను.

*మోఘమస్త్రం న శక్యం తు బ్రాహ్మం కర్తుం తదుచ్యతామ్.*

'ఈ బ్రహ్మాస్త్రము అమోఘము కనుక దీనికి నీ శరీరములోని ఏది యిచ్చెదవో చెప్పుము' అని అతడా కాకితో పలికెను. ఆ కాకి సమ్మతించినందున రాముడు దాని కుడి కన్ను నశింపజేసెను. అటి నుండియు కాకి ఏకాక్షి యాయెను.

ఈ ప్రసంగము శాపమువలె కన్పించుచున్నది, కాని శాపము కాదు. రాముడు శిక్షింపదలచెనే కాని శాప మీయలేదు. శాపమీయుటకు [illegible], రాము డెవ్వరిని శపింపలేదు. అట్లే అతడు తన [illegible], దానిని స్వీకరింపలేదు. స్వీకరించిన [illegible] స్వీకరించెను. రాముడు ప్రసన్నుడగుటచే, [illegible] నిందింపలేదు. ఆ మాటలు [illegible] శాపము ఫలింపదు. శాపమును [illegible] మాట్లాడెను. అందుచే దాని [illegible]

వాల్మీకి దీనిని శాపమని చెప్పలేదు. మరాఠీ అనువాదములో కూడ దీనిని శాపమనక, శిక్షగానే చెప్పబడెను.*

ఉమ రంభ, వరుణకన్యకల శాపములు యుద్ధకాండ 60

రాముని బాణముల కోడి భయపడి వచ్చిన రావణునకు అభిమాన భంగమైనది. రాక్షసులతో మనోవ్యథ తెలియజేయుచూ, 'నేను చేసిన తపస్సంతయు వ్యర్థమైనది, మహేంద్రతుల్యపరాక్రముడ నగు నన్ను నేడొక మానవ మాత్రుడు పరాజితుని జేసెను.' అని చెప్పెను. బ్రహ్మను వరము లడుగునప్పుడు మానవుల నుపేక్షించినందుల కిప్పు డతనికి పశ్చాత్తాపము కలుగుచుండెను. అంతేగాక, 'నీకు మానవులచే ముప్పు కలుగును. ఈ మాట మరువకుము.' అని బ్రహ్మ చెప్పిన విషయముకూడ అతని కిప్పుడు స్మరణకు వచ్చుచుండెను. అనరణ్యుడు, వేదవతి యిచ్చిన శాపములను స్మరించి అత డిట్లనెను-

*ఉమా నందీశ్వరశ్చాపి రంభా వరుణకన్యకా,*
*యథోక్తాస్తన్మయా ప్రాప్తం న మిథ్యా ఋషిభాషితమ్.* 12

'ఉమాదేవి, నందీశ్వరుడు, రంభ, వరుణకన్యయు నేమేమి యనిరో, దాని ఫలితము నేడు నా కనుభవమునకు వచ్చెను. నిజమే, ఋషులమాట లసత్య మెట్లగును?'

నందీశ్వరుడిచ్చిన శాపమునుగూర్చి వెనుక చర్చించితిమి (చూ. శాప. 42 నంది > రావణుడు) ఇక్కడ నందీశ్వరునితో పాటు ఉమారంభావరుణకన్యలు ప్రస్తావింపబడిరి. కాని వాల్మీకిరామాయణములో వీరిని గురించి అధికముగా తెలియకున్నది. వారు రావణునికి శాప మెందు కిచ్చిరి? ఎప్పుడు? ఏమని శపించిరి? అను విషయములు తెలియవు. అందుచే వాటిని గూర్చి చర్చింపలేదు. రంభ విషయములో ఆమెను రావణుడు బలాత్కరించినందున నలకూబరుడు రావణుని శపించినట్లు వెనుక వివరించితిమి. (చూ.శాప. 46. నలకూబరుడు

* *(ఈ కథ అయోధ్యాకాండ 95 వసర్గ తర్వాత ప్రక్షిప్తసర్గలో నున్నది. ఆ సర్గ గోరఖ్‌పుర్ ప్రతిలో లేదు. మరాఠీ అనువాదములో ఆసర్గ వనక్రీడ అను శీర్షికతో నున్నది. అందులో కాకి సీతాదేవి కంఠముల వరకే పొడిచినట్లున్నది. రాముడు దానిని శిక్షించుటకే దర్భను మంత్రించి విడిచినట్లును, అది కాకిని వెంటాడినట్లును చెప్పబడినది. కాకిని గురించి విశేషపరిచయ మీయబడలేదు.)*

> రావణుడు) రంభ ప్రత్యేకించి శాప మేదియు నియ్యలేదు. ఉమావరుణకన్యక లిచ్చిన శాపములను గురించి ఎక్కడను వర్ణింపబడలేదు.

పాయసప్రాప్తి బాలకాండ 16

దశరథుడు పుత్రప్రాప్తికై పుత్రకామేష్టి జరుపుచుండెను. అప్పు డా యజ్ఞకుండమునుండి విశాలకాయుడైన పురుషు డొకడు ప్రకటమై వచ్చెను. అత డగ్నిజ్వాలలతో సమానముగా వెలుగుచుండెను. అతని చేతిలో వెండిమూతతో నున్న సువర్ణకలశ ముండెను. ఆ కలశము దివ్యపాయసముతో నిండియుండెను. అతడు దశరథుని చూచి, నేను ప్రజాపతియాజ్ఞచే వచ్చితినని చెప్పెను. రా జతనికి స్వాగత మిచ్చెను. అతడు రాజుతో మరల నిట్లనెను-

*ఇదం తు నృపశార్దూల పాయసం దేవనిర్మితమ్,*
*ప్రజాకరం గృహాణ త్వం ధన్యమారోగ్యవర్ధనమ్.* 19

*భార్యాణామనురూపాణామశ్నీతేతి ప్రయచ్ఛ వై,*
*తాసు త్వం లప్స్యసే పుత్రాన్ యదర్థం యజసే నృప.* 20

'నృపశ్రేష్ఠా! ఇది దేవనిర్మితమైన పాయసము. సంతానప్రదము. దీనిని నీవు గ్రహింపుము. దీనిచే ఆరోగ్యమును ఐశ్వర్యమును వర్ధిల్లును. రాజా, యీ పాయసమును యోగ్యులైన నీ భార్యల కిచ్చి భక్షింపుమనుము. దీనివలన నీ వే సంతానమాశించి యజ్ఞము చేయుచుంటివో ఆ పుత్రసంతానము నీకు కలుగును.

పాయసము యజ్ఞఫలము. పుత్రప్రాప్తి పాయసపరిణామము. ఇది వరము వలె నున్నది. కాని వరము కాదు. పాయసప్రాప్తి ప్రసాదము, అనుగ్రహము. దీని వలన పుత్రప్రాప్తి కానున్నది. రామాయణములో సంతానప్రాప్తికై యిచ్చిన వరములు పది వరకు వర్ణింపబడినవి. కాని వాటిలో నెచ్చటను పాయసము వంటి మాధ్యమము వాడినట్లు చెప్పలేదు.*

త్రిశంకుని స్వర్గయాత్ర బాలకాండ 60

త్రిశంకుమహారాజున కొకసారి సదేహస్వర్గయాత్ర కనుకూలించు యజ్ఞ

---

* (చూ. వర.క్ర. 6.8.9.10.11.12.13.14.20.45)

మేదేని చేయవలెనను సంకల్పము కలిగెను. అప్పుడతడు తన పురోహితుడైన వసిష్ఠుని పిల్చి తన కోర్కె నతని కెరిగించెను. వసిష్ఠుడు దాని నసంభవమని చెప్పగా నీతడు వసిష్ఠుని పుత్రులవద్ద కేగెను. వారు త్రిశంకుని నిందించుటయే గాక 'చండాలుడవు కమ్ము' అని శపించిరి కూడ. చండాలుడుగా మారిన త్రిశంకుడు విశ్వామిత్రుని శరణువేడెను. 'భయపడకుము, నేను నీకు శరణ మిచ్చెదను' అని విశ్వామిత్రు డతని నాశ్వాసించి, గురుపుత్రుల శాపముచే ప్రాప్తించిన చండాల శరీరముతోనే అతనిని స్వర్గమున కంపుటకు ప్రతిజ్ఞచేసెను. తన మాట ప్రకార మతడు త్రిశంకుని స్వర్గమునకు పంపెను. కాని దేవసహితుడైన యింద్రు డతనితో 'నీకు స్వర్గములో చోటులేదు. గురుశాపమున నీవు పతితుడవైతివి. కనుక నీవు తిరిగి, తలక్రిందుగా భూమి కరుగుము.' అని చెప్పి క్రింది కంపెను. క్రిందపడుచున్న త్రిశంకుని రక్షించి, అతని కోర్కె తీర్చుట తన కర్తవ్యమని విశ్వామిత్రుడు భావించెను. వెంటనే అత డిట్లనెను.

*పశ్య మే తపసో వీర్యం స్వార్జితస్య నరేశ్వర,*
*ఏష త్వాం సశరీరేణ నయామి స్వర్గమోజసా.* 13

*దుష్ప్రాపం స్వశరీరేణ స్వర్గం గచ్ఛ నరేశ్వర,*
*స్వార్జితం కించిదప్యస్తి మయా హి తపసః ఫలమ్.* 14

'రాజా! యిప్పుడు నీవు నేను తపస్సు చేసి యార్జించిన నా బలము చూడుము. నా యీ శక్తిచే నిన్ను స్వర్గమున కంపెదను. నీ వీ శరీరముతోనే దుర్లభమగు స్వర్గమున కేగుము. నేను తపస్సుచేసి గడించిన ఫల మేమాత్ర మున్నను నీవు సశరీరముగా స్వర్గ మధిరోహింపుము.'

విశ్వామిత్రుని ప్రతిజ్ఞ సద్భావసూచకము మాత్రమే. అతని మొదటి ప్రయత్నము ఫలించలేదు. వాల్మీకికూడ ఈ సందర్భమున వరదాన మని చెప్పలేదు. వరమునకు గాని శాపమునకు గాని ఫలితము నిశ్చితముగా నుండును. అవి నిష్ఫలములు కాజాలవు. విశ్వామిత్రుని ప్రయాస ఫలించినచో అది వరదాన మనిపించుకొనును.

**శునఃశేఫునకు దీర్ఘాయువు** బాలకాండ 62

శునఃశేఫుడు ఋచీకముని మధ్యమపుత్రుడు. విశ్వామిత్రునికి మేనల్లుడు.

అంబరీషుడు తన యజ్ఞమునకు బలిపశువుగా నితనిని కొనెను. పుష్కరతీర్థమున శునఃశేఫుడు తపస్వియైన తన మామ విశ్వామిత్రుని చూడ నరిగి, అతనితో దైన్యముగా నిట్లనెను - 'మహాత్మా! నాకు తల్లిగాని, తండ్రిగాని, అన్నదమ్ములుగాని లేరు. కనుక నన్ననాథుని రక్షింపదగిన నాథుడవు. నన్ను పుత్రసమానునిగా గ్రహించి రక్షింపుము. నాయందు కరుణించి యీ రాజును కృతార్థుని చేయుము. నేను దీర్ఘాయువంది తపస్సు చేసి స్వర్గ మరిగెదను. శునఃశేఫుని పలుకు లాలకించి విశ్వామిత్రు డతని కన్నివిధములా ధైర్యము చెప్పి తన పుత్రులను పిలిచి మీ రీ రాజు యజ్ఞమున పశువై అగ్నిదేవుని సంతృప్తి పరచుడని చెప్పెను. వారు వినలేదు. అందుపై నతడు వారిని శపించెను. తిరిగి శునఃశేఫునితో 'కుమారా! యజ్ఞములో నన్ను కుశాదిపవిత్రపాశములలో బంధించి ఎర్రటిపూలు ధరింపజేసి, ఎర్రచందనము పూసి, విష్ణుదేవతాక యూపమువద్దకు తెచ్చినప్పుడు నీవు అగ్నిని (ఇంద్ర-విష్ణువులను) స్తుతించి, నేనిచ్చుచున్న యీ రెండు దివ్యగాథలను జపింపుము. దానివలన నీ మనోభిలాషము పూర్తియగును.' అని చెప్పి అతని కా గాథలిచ్చెను. అతడు చిత్తైకాగ్రతతో నా గాథలను గ్రహించి యజ్ఞమున ఇంద్రోపేంద్రులను స్తుతించెను.

*తతః ప్రీతః సహస్రాక్షో రహస్యస్తుతితోషితః,*
*దీర్ఘమాయుస్తదా ప్రాదాచ్ఛునఃశేఫాయ వాసవః.* 26

ఆ రహస్యస్తోత్రమునకు సంతుష్టి జెంది యింద్రుడు శునఃశేఫునకు దీర్ఘాయు విచ్చెను.

శునఃశేఫునకు లభించిన దీర్ఘాయువు గాథాప్రభావమున కలిగినది. అత డింద్రుని దీర్ఘాయువు వేడలేదు. విశ్వామిత్రు నట్లు వేడెను. అందువలన అతని కింద్రుని వలన లభించిన దీర్ఘాయువు వరదానము కాదు. ఆశీర్వాద మనవచ్చును. ఈ ఆశీర్వాదము నిశ్చయముగా వరదానతుల్యముగనే యున్నది. కాని వాల్మీకి యీ పట్టున వరశబ్దము ప్రయోగింపలేదు.

### రావణునికి మంత్రప్రాప్తి — ఉత్తరకాండ ప్రక్షిప్త 4,5

రావణుడు విశ్వవిజయయాత్ర చేయుచూ చంద్రలోక మరిగెను. కాని అతనికి చంద్రకిరణముల శైత్య మసహ్య మనిపించెను. అప్పుడు ధనువెత్తి చంద్రుని బాధించుట బ్రహ్మకు నచ్చక, అతడు రావణునితో నిట్లనెను- 'నీవు చంద్రుని వేధింపకుము. అతడు జగత్తునకు హితము కూర్చువాడు. నేను నీ

కొక మంత్ర మిచ్చెదను. ప్రాణములపై వచ్చినపు డెవడు దీనిని జపించునో వాడు మృత్యువు నందదు. రావణు డా మంత్రము గ్రహింప నెంచి బ్రహ్మతో నిట్లనెను. - 'నాయందు ప్రసన్నులై మంత్ర మీయ దలచినచో నట్లే యిండు. దానివలన నేను దేవాసురదానవపక్షులకు వెరవకుండ విహరించెదను. మీ యీ కృపాప్రసాదముచే నేను వీరందరికి నజేయుడ నగుదును. సంశయము లేదు.' బ్రహ్మవద్ద ఆ మంత్రముల జపవిధానవివరము లన్నియు తెలిసికొని రావణు డా మంత్రములు గ్రహించెను.

*దత్త్వా తు రావణస్యైవం వరం స కమలోద్భవః,*
*పునరేవాగమాత్ క్షిప్రం బ్రహ్మలోకం పితామహః.*

ఈ సందర్భమున వాల్మీకి వరశబ్దము ప్రయోగించెను. అనువాదకులును 'ఈ విధముగా రావణునకు వరమిచ్చిన పిదప పితామహుడు బ్రహ్మలోక మరిగెను.' అని స్పష్టముగా వ్రాసిరి. అయినను దీనిని వరదానములలో చేర్చలేదు. మంత్రసిద్ధి దాని యథోచితజపనియమాదిపాలనముపై నాధారపడి యుండును. ప్రతిబంధము లేకయే వరప్రాప్తి ఫలించును. దానిలో నియమపాలనప్రసక్తి కలుగదు. వరఫలము గ్రహీత కవశ్యము లభించును. జపము మంత్రసిద్ధికి సాధనము, సాధ్యము కాదు. దీనిని నియమాంచిత వరమని కూడ చెప్పలేము

## హనుమంతుని ఇచ్ఛాపూర్తి ఉత్తరకాండ 40

రాజ్యాభిషేకావసరమున శ్రీరాముడు అతిథు లందరిని యథోచితముగా సత్కరించి పంపెను. వానరులను సమ్మానించిన పిదప హనుమంతుడు రామునితో నిట్లనెను- 'మహారాజా, నీపట్ల నా స్నేహము నిత్యమై యుండుగాక. నీయందు నాకు నిశ్చలభక్తి కలుగుగాక. నీయందు గాక వేరొకరిపట్ల నా కాంతరికమగు ననురాగము కలుగకుండుగాక. ఈ పృథ్విపై రామకథ యున్నంతవరకు నే నిదే శరీరముతో జీవించియుందును గాక. నీ యీ దివ్యచరిత్రమును నా కప్సరసలు పాడి వినిపించెదరు గాక. ఆ చరిత్రను విని నేను నీ దర్శనాభిలాషను తీర్చుకొనుచుందును గాక.' హనుమంతుని మాటలు విని రాముడు సింహాసనము నుండి లేచి వచ్చి అతనిని కౌగలించుకొని యిట్లనెను-

*ఏవమేతత్ కపిశ్రేష్ఠ భవితా నాత్ర సంశయః,*
*చరిష్యతి కథా యావదేషా లోకే చ మామికా.* 21

*తావత్ తే భవితా కీర్తిః శరీరేఽప్యసవస్తథా,*
*లోకా హి యావత్ స్థాస్యంతి తావత్ స్థాస్యంతి మే కథాః.* 22

'కపిశ్రేష్ఠా! అట్లే యగును; సంశయము లేదు. ప్రపంచమున నా కథ ప్రచారములో నున్నంతవరకు నీ కీర్తి నిల్చియుండును. నీ శరీరమున నంతవరకు ప్రాణము లుండును. ఈ లోక మున్నంతవరకు నాకథ కూడ స్థిరముగా నిల్చియుండును.'

ఇట్లు చెప్పి రాముడు చంద్రోజ్జ్వలమైన తన వైదూర్యమణి మధ్యమందుగల కంఠహార మొకటి తీసి హనుమంతుని కంఠమున నుంచెను.

హనుమంతుని కోర్కె రాము డంగీకరించెను. కాని అది ఆశీర్వాదాత్మకము; వరమని చెప్పబడదు. వాల్మీకియు దీనిని వరమని చెప్పలేదు. హార మనుగ్రహము కాని వరము కాదు.

## శ్రీరాముడు విభీషణుని కిచ్చిన యాజ్ఞ — ఉత్తరకాండ 108

మహాప్రస్థానమునకు నిశ్చయించి రాముడు అంతిమవ్యవస్థ నెరవుచూ తన హితైషు లందరిని పిలిచెను. ఆ సమయమున రాముడు విభీషణునితో నిట్లనెను--

*యావత్ ప్రజా ధరిష్యంతి తావత్ త్వం వై విభీషణ,*
*రాక్షసేంద్ర మహావీర్య లంకాస్థః స్వం ధరిష్యసి.* 27

*యావచ్చంద్రశ్చ సూర్యశ్చ యావత్తిష్ఠతి మేదినీ,*
*యావచ్చ మత్కథా లోకే తావద్ రాజ్యం తవాస్త్విహ* 28

'మహావీరుడవగు ఓ రాక్షసేంద్రా, విభీషణా! లోకములో ప్రజలున్నంత వరకు నీవు లంకలో జీవించియుందువు. ఎంతవరకు సూర్యచంద్రులుందురో, ఈ భూమి ఎంతకాలము నిల్చునో ప్రపంచమున నా కథ ఎంతకాలము నిల్చునో అంతవరకు భూతలమున నీ రాజ్యము నిల్చియుండును.

వాల్మీకి రాముని యీ వచనములను వరమని చెప్పక ఆజ్ఞ యని వర్ణించెను. రాము డింకనూ ఇట్లు చెప్పెను-

*శాసితశ్చ నఖిత్వేన కార్యం తే మమ శాసనమ్.*

'నేను మిత్రభావమున నీ కీ మాటలు చెప్పుచుంటిని. నీవు నా యాజ్ఞ పాటింపవలెను. హనుమంతుని ఇచ్ఛాపూర్తి (చూ. ఉత్తర.40) లో వలెనే, యిచ్చటనూ రాముడు తన ప్రేమాతిశయసద్భావములు ప్రకటించెను. ఇది అతని సదాశయము. ఆశీర్వాద మనదగును. కాని వరము కాదనుట నిశ్చయము.

❋ ❋ ❋

# 2. శాపములకు విభిన్నకారణములు

| క్ర.సం. | శాప కారణములు | శాపక్రమసంఖ్య | మొత్తం |
|---|---|---|---|
| 1. | వధ | 1,6,44,48 | 4 |
| 2.. | యజ్ఞము, తపస్సు మున్నగు వానికి విఘ్నము, తిరస్కారము | 2,3,15,18,25,38,47 | 7 |
| 3. | రతిక్రీడకు విఘ్నము, సంభోగము, బలాత్కారము, పరస్త్రీ / పరపురుషునిపై ఆసక్తి | 9,10,12,13,24,35, 41,43,45,46,52,59 | 12 |
| 4. | మాత,పిత, గురువుల ఇచ్ఛకు విరుద్ధముగా ఆచరించుట, ఆశాభంగము, అనాదరము, అవమానము | 14,16,17,19,54 | 5 |
| 5. | ఆక్రమణము, ఉద్దండత, భయపెట్టుట, బాధించుట, అపహరించుట, అవధి మీరి ప్రవర్తించుట మొ. | 4,8,28,29,31,36, 37,42,55 | 9 |
| 6. | పట్టుదల, కోపము, అవాస్తవమైన కోరిక | 20,23,40,53, | 4 |
| 7. | ప్రియజనుల మృత్యువు, మృత్యువార్త | 21,22,32 | 3 |
| 8. | ప్రశ్నలకు ఉత్తర మీయకుండుట, నివాసమువలన కలుగు దోషములు, అభీష్టకార్యమున విలంబము. | 7,26,27,34,60,61 | 6 |
| 9. | వాంఛితభోజనము, అనిష్టసమయము | 39,56,57 | 3 |
| 10. | రాజ్యవ్యవహారము, ధర్మము, నీతి మున్నగు వాని ఉపేక్ష | 49,50 | 2 |
| 11. | శాపము | 51,58 | 2 |
| 12. | అజ్ఞాతకారణము | 5,11,30,33 | 4 |
| | మొత్తము | | 61 |

# 3. శాపపరిణామములు

| క్ర.సం. | శాపపరిణామము | శాపక్రమసంఖ్య | మొత్తము |
|---|---|---|---|
| 1. | మృత్యువు, వధ, మూర్ఛ, వియోగము, త్యాగము, దీర్ఘనిద్ర | 1,5,15,18,20,22,31 35,37,45,46,50, 51,59 | 14 |
| 2. | మనుష్యజన్మ | 48,52 | 2 |
| 3. | తిర్యక్, రాక్షసాది అధమ జన్మము, అధమలోకప్రాప్తి | 4,14,19,30,33,49,55, 56,57 | 9 |
| 4. | సౌందర్యహాని, రూపపరివర్తనము, వైరూప్యము, వైకల్యము భయంకరరూపము, వికృతి మొ. | 6,12,24,28, 29,41,53 | 7 |
| 5. | సంతానసుఖము కలుగకుండపోవుట, సంతానము క్రూరకర్ము లగుట. | 9,39 | 2 |
| 6. | నిరాహారము, నికృష్టాహారము, అదృశ్యత | 13,17 | 2 |
| 7. | వంశవినాశము, విధ్వంసము, పునర్జన్మ, ఇష్టములేని గర్భము కలుగుట | 38,40,42,43,44, 54,60,61 | 8 |
| 8. | బహుపత్నీత్వము, బహుపతిత్వము, జారత్వము. | 10 | 1 |
| 9. | నిర్జనత, వృక్షహీనత, ఫలహీనత, దగ్ధస్థితి, నిర్జలత | 27,32 | 2 |
| 10. | యుద్ధమున ఓటమి, స్వబలమును విస్మరించుట, అస్థిరత, దుఃఖము, పీడ, క్రౌర్యము. | 23,47 | 2 |
| 11. | పాతకములు సంక్రమించుట | 36 | 1 |
| 12. | పరిణామ మెట్టిదో స్పష్టము కాకుండుట. | 2,3,7,8,11,16,21,25,26, 34,58, | 11 |
| | మొత్తము | | 61 |

# 4. శాపముల వర్గీకరణము

| | | |
|---|---|---|
| నియమాంచిత శాపములు | : | శాప్రక. 16,19,20,21,27,31,35,36,46,61 |
| ఈయబడని శాపములు | : | శాప్రక. 2,3,8,16,21,25,26,27,43,58 |
| శాపశాంతి | : | I. యాచితము-13(ఉత్తర/30) 28,29,33,37,<br>39,56 |
| | | II.అయాచితము - 13 (బాల 48,49) 18,47,49 |
| ప్రతిశాపములు | : | 51 (ఈయబడినవి) 58 (ఈయబడనివి) |

# 5. వరములకు విభిన్నకారణములు

| క్ర.సం. | కారణము | వరక్రమసంఖ్య | మొత్తము |
|---|---|---|---|
| 1. | తపస్సు, ప్రసన్నత | 4,9,12,22,28,30 51,54,55,56,57,63 | |
| | సంతానలాభము | 8,11,13,20 | |
| | ఇచ్ఛా పూర్తి | 15,16,23 | 19 |
| 2. | ప్రసన్నత, సేవ | 10 | |
| | సువార్తాశ్రవణము | 17 | |
| | సత్పురుషదర్శనము. | 24,27 | |
| | అనుగ్రహము, ఆశ్రయము | 29,39,49,80 | |
| | సహాయత | 1,7,46,58,59,60,61 | |
| | ప్రార్థన | 14,52,82 | |
| | సదాచరణము | 21,50 | |
| | పరాక్రమము, దుష్టశిక్షణ | 34,35,65,77,79 | 25 |
| 3. | యజ్ఞ, యాగము | 42,64,76 | 3 |
| 4. | విఘ్ననివారణ, రక్షించుట | 5,26,32,43 | 4 |
| 5. | శాపవిమోచనము, శాప మిచ్చినందుకు పశ్చాత్తాపము. | 2,78 | 2 |
| 6. | దోహదము, లింగపరివర్తన, గుణగానము | 3,75,81 | 3 |
| 7. | రాబోవు కాలమున కార్యసిద్ధి | 33,36,67,68,69,70, 71,72,73,74 | 10 |
| 8. | అనిశ్చితకారణములు లేక అస్పష్టకారణములు. | 6,18,19,25,31,37,38,40, 41,44,45,47, 48,53,62,66 | 16 |
| | మొత్తము | | 82 |

# 6. వరములకు పరిణామములు

| క్ర.సం. | పరిణామము | వరక్రమసంఖ్య | మొత్తం |
|---|---|---|---|
| 1. | పరిమితామరత్వము, అవధ్యత అభయత, దుర్జేయత్వము జీవనప్రాప్తి | 4,22,25,34,35,52,65, 67,69,70,71,72,74,36, 40,54,58,59,57,73 | 20 |
| 2. | సంతానప్రాప్తి | 6,8,9,10,11,12, 13,14,20,45 | 10 |
| 3. | బ్రాహ్మణత్వము, ఊర్ధ్వలోకము, ఉచ్చజన్మ, లోకపాలపదవి మొదలగునవి లభించుట | 16,23,24,27,51 | 5 |
| 4. | కీర్తి, సమృద్ధి, అవయవలాభము, సౌంద్రయలాభము | 2,7,18,29,33,60,61 | 7 |
| 5. | ధర్మకార్యము, రాజ్యాభిషేకము, పృథివీపాలనము, నగరప్రాప్తి | 1,5,55,75,79 | 5 |
| 6. | శాపముక్తి, బంధవిముక్తి, దీర్ఘనిద్ర. | 39,56,783 | |
| 7. | ప్రతిజ్ఞాపూర్తి, ఇచ్ఛాపూర్తి, హవిష్యాన్న స్వీకారము | 17,26,76,81,82 | 5 |
| 8. | ఋణ విముక్తి హెచ్చరిక | 32,38 | 2 |
| 9. | బలము, విశిష్ట వస్తులాభము. | 15,19,21,30,31,37,42,43,44, 49,50,53,64,68,77,83 | 16 |
| 10. | అనిశ్చితము లేక అస్పష్టమైన పరిణామము | 3,28,41,46,47,48, 62,63,66 | 9 |
| | మొత్తము | | 82 |

# 7. వరముల వర్గీకరణము

| | |
|---|---|
| యాచితములు | 4,5,8,9,11,12,13,14,15,16,20,22<br>30,48,54,55,57,63,64,65,78,<br>80,81,82. |
| అయాచితములు | 1,2,3,7,8,10,17,18,21,24,26,27,<br>32,33,34,35,36,43,44,45,49,50<br>51,52,53,55,56,58,59,60,61,67<br>69,70,71,72,73,74,75,76,77,79. |
| అనిశ్చితములు | 6,19,23,25,29,37,38,39,<br>40,41,42,46,47,48,62,66 |
| నియమాంచితములు<br>సోనాగ్రములు | 12,13,65,77 |
| సానుగ్రహములు | 18,21,26,27,33,42,48,<br>49,51,52,57,64,73,77 |
| అస్వీకృతములు | 17,21,24,32,81 |

# 8. శాపసూచిక

| శాపప్రదాత | గ్రహీత | క్రమాంకము | పేజి | శాపప్రదాత | గ్రహీత | క్రమాంకము | పేజి |
|---|---|---|---|---|---|---|---|
| అగస్త్యుడు | తాటక | 6 | 87 | మిత్రుడు | ఊర్వశి | 52 | 145 |
| | మారీచుడు | 4 | 86 | మునికుమారుడు | దశరథుడు | 21 | 107 |
| | సుందుడు | 5 | 87 | యయాతి | యదువు | 54 | 149 |
| అనరణ్యుడు | రావణుడు | 44 | 136 | రాముడు | ప్రస్రవణగిరి, గోదావరి | 27 | 114 |
| అపహృతకన్యలు | రావణుడు | 45 | 138 | రావణుడు | సీత | 26 | 113 |
| ఇంద్రుడు | కబంధుడు (విశ్వావసు) | 21 | 107 | వసిష్ఠపుత్రులు | త్రిశంకుడు | 14 | 98 |
| ఉమ | దేవతలు | 9 | 90 | వసిష్ఠుడు | నిమి | 50 | 145 |
| | పృథ్వి | 10 | 91 | | సౌదాసుడు | 57 | 154 |
| ఋషి | పుంజికస్థల | 33 | 121 | వాల్మీకి | నిషాదుడు | 1 | 84 |
| | రాక్షసుడు | 25 | 112 | విశ్వవసుడు | కైకసి | 39 | 128 |
| కందుముని | వనము | 32 | 120 | | రావణుడు | 40 | 130 |
| కుశకన్యలు | వాయువు | 8 | 89 | విశ్వామిత్రుడు | ఋషులు | 16 | 101 |
| కౌసల్య | రాముడు | 19 | 104 | | మహోదయుడు | 15 | 99 |
| గౌతముడు | అహల్య | 13 | 96 | | మారీచుడు | 2 | 85 |
| | ఇంద్రుడు | 12 | 92 | | రంభ | 18 | 103 |
| | బ్రహ్మదత్తుడు | 56 | 152 | | వసిష్ఠపుత్రులు | 15 | 99 |
| దశరథుడు | కైకేయి | 20 | 105 | | స్వపుత్రులు | 17 | 101 |
| | భరతుడు | 20 | 105 | | సుబాహుడు | 3 | 85 |
| దుర్వాసుడు | లక్ష్మణుడు | 61 | 158 | వేదవతి | రావణుడు | 43 | 43 |
| నందీశ్వరుడు | రావణుడు | 42 | 132 | వైశ్రవణుడు (కుబేరుడు) | తుంబురుడు (విరాధుడు) | 24 | 110 |
| నలకూబరుడు | రావణుడు | 46 | 139 | శుకుడు | రావణుడు | 36 | 125 |
| నిమి | వసిష్ఠుడు | 51 | 146 | శ్రవణకుమారుని | దశరథుడు | 22 | 107 |
| పార్వతి | కుబేరుడు | 41 | 131 | శుక్రుడు | దండుడు | 59 | 156 |
| పులస్త్యుడు | తృణబిందుకన్య | 38 | 127 | | దండకారణ్యము | 60 | 157 |
| బ్రహ్మ | కుంభకర్ణుడు | 37 | 126 | | యయాతి | 53 | 148 |
| | రావణుడు | 35 | 124 | [illegible] | [illegible] | 55 | 150 |
| ఇద్దరు బ్రాహ్మణులు | నృగుడు | 49 | 143 | సౌదాసుడు | వసిష్ఠుడు | 58 | 155 |
| భరతుడు | కైక | 23 | 109 | [illegible] | [illegible] | 28 | 115 |
| భృగువు | విష్ణువు | 48 | 142 | | : | 11 | 92 |
| మాతంగుడు | వాలి, వానరులు | 31 | 118 | : | [illegible] | 7 | 88 |
| మహర్షులు | హనుమంతుడు | 47 | 141 | : | [illegible] | 30 | 117 |
| | | | | : | [illegible] | 34 | 122 |

# 9. వరసూచిక

| వరప్రదాత | గ్రహీత | క్రమాంకము | పేజి |
|---|---|---|---|
| అనసూయ | సీత | 21 | 224 |
| అలర్కుడు | అంధబ్రాహ్మణుడు | 18 | 220 |
| ఇంద్రుడు | కరూషము | 7 | 206 |
| | జాంబవంతుడు | 46 | 249 |
| | దితి | 14 | 214 |
| | మయూరము | 58 | 268 |
| | మలదము | 7 | 206 |
| | మైనాకుడు | 36 | 238 |
| | రాముడు | 49 | 253 |
| | శరభంగుడు | 23 | 226 |
| | సీత | 26 | 229 |
| | హనుమంతుడు | 35 | 237 |
| మునులు | కుశలవులు | 3 | 187 |
| కశ్యపుడు | దితి | 13 | 213 |
| కైక | మంథర | 17 | 219 |
| గురువులు | శబరి | 27 | 230 |
| చూళి | సోమద | 10 | 208 |
| చ్యవనుడు | కాళింది | 20 | 222 |
| దశరథుడు | కైక | 1 | 168 |
| దేవతలు | నిమి | 76 | 287 |
| | బ్రహ్మహత్య | 80 | 292 |
| | శత్రుఘ్నుడు | 79 | 291 |
| నిశాకరముని | సంపాతి | 33 | 235 |
| పార్వతి | రాక్షసి | 53 | 261 |
| బ్రహ్మ | అతికాయుడు | 48 | 250 |
| | కుంభకర్ణుడు | 56 | 265 |
| | తాటక | 84 | 206 |
| | ద్వివిదుడు | 40 | 244 |
| | నివాతకవచులు | 62 | 271 |
| | విభీషణుడు | 55 | 264 |
| | భగీరథుడు | 12 | 211 |
| | మయుడు | 30 | 232 |
| బ్రహ్మ | మారీచుడు | 25 | 228 |
| | వాలి | 54 | 261 |
| | మాల్యవంతుడు | 54 | 261 |
| | మేఘనాదుడు | 65 | 274 |
| | మైందుడు | 40 | 244 |
| | రావణుడు | 4 | 187 |
| | లంకిణి | 38 | 241 |
| | వాల్మీకి | 2 | 186 |
| | విరాధుడు | 22 | 225 |
| | విశ్వామిత్రుడు | 16 | 217 |
| | వైశ్రవణుడు | 51 | 258 |
| | సుకేతువు | 8 | 206 |
| | సుమాలి | 54 | 261 |
| | సురస | 37 | 239 |
| | హనుమంతుడు | 34 | 236 |
| | " | 39 | 242 |
| | " | 74 | 285 |
| భరద్వాజుడు | రాముడు | 50 | 257 |
| భృగువు | కేశిని | 11 | 210 |
| | సగరుడు | 11 | 210 |
| | సుమతి | 11 | 210 |
| యముడు | కాకి | 59 | 269 |
| | హనుమ | 70 | 284 |
| రాముడు | ప్రజలు | 82 | 296 |
| | మరుప్రదేశము | 43 | 246 |
| | సీత | 75 | 286 |
| రుద్రుడు | మధుదైత్యుడు | 77 | 288 |
| | మాంధాత | 63 | 272 |
| వరుణుడు | హనుమ | 69 | 283 |
| | హంస | 60 | 270 |
| వసిష్ఠుడు | కల్మాషపాదుడు | 78 | 290 |

| వరప్రదాత | గ్రహీత | క్రమాంకము | పేజి | వరప్రదాత | గ్రహీత | క్రమాంకము | పేజి |
|---|---|---|---|---|---|---|---|
| విష్ణువు | కశ్యపుడు | 9 | 207 | శంకరుడు | సుషేణుడు | 52 | 259 |
| | దేవతలు | 5 | 203 | సాధువు | కేకయరాజు | 27 | 22 |
| విశ్వకర్మ | నలుడు | 44 | 247 | సూర్యుడు | మేరువు | 29 | 232 |
| | నలుని తల్లి | 45 | 248 | | సుమేరువు | 66 | 280 |
| | హనుమ | 73 | 285 | | హనుమ | 68 | 283 |
| వైశ్రవణుడు | తొండ | 61 | 271 | హనుమంతుడు | స్వయంప్రభ | 32 | 234 |
| | హనుమ | 71 | 284 | హేమ | స్వయంప్రభ | 31 | 233 |
| శరభంగుడు | రాముడు | 24 | 227 | ? | ఇంద్రజిత్తు | 42 | 245 |
| శివపార్వతులు | ఇలుడు | 81 | 294 | ? | కాలకేయులు | 41 | 244 |
| శంకరుడు | హనుమ | 72 | 284 | ? | కుంభకర్ణుడు | 47 | 250 |
| శంకరుడు | మేఘనాదుడు | 64 | 273 | ? | జయ | 6 | 204 |
| శంకరుడు | రావణుడు | 57 | 266 | ? | దుందుభి | 28 | 231 |
| | విశ్వామిత్రుడు | 15 | 216 | ? | సుప్రభ | 6 | 204 |

# ఉపయుక్తగ్రంథ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | వాల్మీకి రామాయణము | (సంస్కృతము హిందీఅనువాదము) | గీతాప్రెస్, గోరఖ్‌పూర్ |
| 2. | ,, | (సంస్కృతము) | నిర్ణయసాగర్ ప్రెస్, బొంబాయి |
| 3. | ,, | (సంస్కృతము) | బరోడా ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్,బరోడా |
| 4. | ,, | (సంస్కృతము) | శ్రీరామకోశ్ మండల్, పూనా |
| 5. | ,, | (మరాఠీ అనువాదము) | స్వ.కాశీనాద్‌శాస్త్రి లేలే |
| 6. | ,, | (మరాఠీ అనువాదము) | పం. శ్రీ.దా. సాత్వళేకర్ |
| 7. | ,, | (మరాఠీ అనువాదము) | డా.ప్ర.న. జోశీ |
| 8. | ,, | (సమగ్ర మరాఠీ అనువాదము) | శ్రీరామకోశ్ మండల్, పూనా |
| 9. | ,, | (కన్నడ అనువాదము) | డా. శ్రీనివాసయ్యంగార్ |
| 10. | ప్రాచీన చరిత్రకోశ్ | (మరాఠీ) | స్వ.సిద్ధేశ్వరశాస్త్రి, చిత్రావ్ |
| 11. | భారతీయ సంస్కృతి కోశ్ | (మరాఠీ) | సం.పం. మహాదేవశాస్త్రి జోషీ |
| 12. | శ్రీరామకోశ్ | (మరాఠీ) | సం. శ్రీ అమరేంద్ర గాడ్‌గీల్ |
| 13 | పురాణనామచూడామణి | (కన్నడ) | శ్రీ బెనెగల్ రామరావు, పాణ్యం సుందరశాస్త్రి |
| 14. | మహాభారతనామానుక్రమణిక | (హింది) | గీతాప్రెస్, గోరఖ్‌పూర్. |
| 15. | అభిజ్ఞాన శాకుంతలము | (నాటకము) | కాళిదాసు |
| 16. | ఉత్తరరామచరితమ్ | (నాటకము) | భవభూతి |
| 17. | సంపూర్ణమహాభారతము | (మరాఠీ అనువాదము) | చిపళూణ్‌కర్, ఆణి మండళి. పూనా |
| 18. | సంత్ సాహిత్య ఆణి లోకసాహిత్య | (మరాఠీ) | డా.రా.చి. ఢేరే |
| 19. | వైదికయజ్ఞ, మధ్యయుగీన తంత్ర సాధనా, ఆణి జ్ఞానేశ్వర ప్రణీత భక్తియోగ | (మరాఠీ) | డా.స.రా. గాడ్‌గీల్ |
| 20. | హస్తినాపూర్ | (మరాఠీ) | శ్రీమ.రం. శిరవాడ్‌కర్. |
| 21. | Lectures on the Ramayana | | Rt. Honourable V.S. Srinivasa Sastry |